# Mudigaṇṭi sujātāreḍḍi vimarśa dhōraṇulu-pariśīlana

A Thesis submitted to the University of Hyderabad in partial

Fulfilment of the requirement for the award of

Doctor of Philosophy

In

Telugu

Researcher

**SRIPATHI MARUTHI**

**(Reg No: 17HTPH02)**

Department of Telugu
School of Humanities
University of Hyderabad
Hyderabad- 500046
Telangana, India

March–2023

# ముదిగంటి సుజాతారెడ్డి విమర్శ ధోరణులు–పరిశీలన

**పిహెచ్.డి. పట్టా కోసం హైదరాబాదు విశ్వవిద్యాలయానికి సమర్పించిన**

**పరిశోధన గ్రంథం**


పరిశోధకుడు

**శ్రీపతి మారుతి**

**(Reg No: 17HTPH02)**

పర్యవేక్షకులు

**ఆచార్య దార్ల వెంకటేశ్వర రావు**

**తెలుగు శాఖ**

**మానవీయ శాస్త్రాల విభాగం**

**హైదరాబాదు విశ్వవిద్యాలయం**

**హైదరాబాదు–500046**


**మార్చి–2023**

# DECLARATION

I,**SRIPATHI MARUTHI** hereby declare that this dissertation entitled "**Mudigaṇṭi sujātāreḍḍi vimarśa dhōraṇulu-pariśīlana"** submitted by me under the guidance and supervision of Prof. Darla Venkateswara Rao is my bonafide research work. I also declare that it has not been submitted previously in part or in full to this University or any other University or Institution for the award of any degree or diploma. I hereby agree that this dissertation can be deposited in Shodhganga/INFLIBNET.

Signature of the Student

Date: 22 /03/2023

Name:**Sripathi Maruthi**

Registration No.**17HTPH02**

# CERTIFICATE

This is to certify the Thesis entitled **“Mudigaṇṭi sujātāreḍḍi vimarśa dhōraṇulu-pariśīlana”** submitted by **Mr. Sripathi Maruthi** bearing **Regd.No.17HTPH02** in partial fulfilment of the requirements for the award of Doctor of Philosophy in the School of Humanities, Department of Telugu is a bonafide work carried out by him under my supervision and guidance.

The thesis is free from plagiarism and has not been submitted previously in part or in full to this University or any other University or Institution for the award of any degree or diploma.

**A. Published in the following publications:** Parts of this thesis have been: (NOT EXACT PARTS) Issues discussed in the following papers have been presented elaborately in the chapter 3 and 4 of the thesis.)

1. ***"Vimarśakurāligā Mudigaṇṭi sujātāreḍḍi*” (ISSN 2456-4702),** Vol: 15 Bhāvavīṇa Pg. No. 27-29, October- 2018. Chief Editor “Pitta Shanthi’’, Postal colony - 522002, Guntur Dist., A.P.

2. **"*Saṅkeḷlu tegāyi: Vr̥tti jīvana caitan'yaṁ- viślēṣaṇa*", "(ISBN 978-93-5396-948-6), ‘Telugu** Navala: bharateeya vrutti jivitha prathiphalanam' Pg. No.105-107, Chief Editor “Dr.,D. GIRI”, West godavari, A.P.

**B. Presented in the following National and International seminars:** (Issues presented in the following papers have been discussed elaborately)

1. "***Mudigaṇṭi Sujātāreḍḍi Alaṅkāra Vimarśa Dhōraṇulu-Viślēṣaṇa”*** in “**Telugu Sahityam Vibhinna Prakriyalu Dhoranulu”**A International seminar conducted by TRR&KRK Governement degree colleges AP, on August 24&25, 2022.

2. "***Jānapada Sāhitya Vimarśa Viślēṣaṇa***"In ***‘Janapada Sahitya Adhyayanam-Nadu Nedu***” A National seminar conducted by Dept. Of Telugu, University of Hyderabad, Hyderabad February 24&25, 2022.

Further, the Student has passed the following courses towards fulfilment of coursework requirement for Ph.D.

| SL.No | Course Code | Name | Credits | Pass/Fail |
|---|---|---|---|---|
| 1 | HT-801 | Research Methodology | 4 | PASS |
| 2 | HT-802 | History of Telugu | 4 | PASS |
| 3 | HT-803 | Studies in Literature and Language | 4 | PASS |
| 4 | HT-804 | Specialized Area and Broad Field | 4 | PASS |

(Prof. Darla Venkateswara Rao)

**Research Supervisor**

(Prof. Darla Venkateswara Rao)

**Head, Dept. of Telugu**

(Prof.V.Krishna)

**Dean, School of Humanities**

# కృతజ్ఞతలు

అనుకోకుండా సాహిత్యంలోకి వచ్చిన నాకు సాహిత్య ప్రపంచాన్ని పరిచయం చేసిన పరిస్థితులకు..

ఆ పరిస్థితులకు అనుకూలించిన  వ్యక్తులకు ముందుగా కృతజ్ఞతలు...

నాకు ప్రపంచాన్ని అర్థం చేసుకోవడానికి ఒక వాహకంగా ఉపయోగపడుతున్న సాహిత్యానికి నా కృతజ్ఞతలు...

తల్లిదండ్రులనే పదబంధానికి కొత్త నిర్వచనం ఇస్తూ...నా జీవన గమనంలోని నిరంతర మార్పులను అందుకుని నా సంతోషాన్నే వారి జీవిత గమ్యంగా మార్చుకుని ప్రయాణిస్తున్న అమ్మనాన్నలు లక్ష్మీనారాయణ-భాగ్య గార్లకు....

నా జీవితపు తొలి స్నేహితుడి స్థానాన్ని పొందిన తమ్ముడు పవన్ కు....

చిన్నప్పటి నుండి మాటలతో కాకుండా తమ వ్యక్తిత్వంతో ఒక మంచి మనిషిగా ఎలా వుండాలో చెప్పే చిన్నాన, చిన్నమ్మ రాఘవులు-లక్ష్మీగార్లకు...

నన్ను నిరంతరం ఎప్పటికప్పుడు ప్రోత్సహిస్తూ, సాహిత్యంలోని లోటుపాట్లను అర్థం చేపిస్తూ, మమ్మల్ని మంచి మిత్రునిలాగా చూసుకునే మా పర్యవేక్షకులు, తెలుగుశాఖ అధ్యక్షులు ఆచార్య దార్ల వెంకటేశ్వరరావుగారికి, నిష్కల్మషమైన మనసుతో అమృతాశీస్సులు అందించే వారి సతీమణీ మాతృ శ్రీ సమానురాలైన డా॥ మంజుశ్రీగారికీ నా ప్రత్యేక నమస్కారాలు...

డాక్టోరల్ కమిటీ మెంబర్ గా ఉంటూ నాలో పరిశోధన పట్ల ఆసక్తిని కలిగించడమేగాక నా అభివృద్ధిని కాంక్షించే ఆచార్య పిల్లలమర్రి రాములుగారు, ఆచార్య గోనాయక్ గార్లకు ప్రత్యేక కృతజ్ఞతలు.

ఇంటిగ్రేటెడ్ సమయం నుండి పరిశోధన పూర్తయ్యే వరకు తమ నిరంతంర బోధనతో ప్రత్యక్షంగా, పరోక్షంగా సాహిత్య విలువలు నేర్పించిన తెలుగుశాఖ గురువులు ఆచార్య తుమ్మల రామకృష్ణగారికి, ఆచార్య జి. అరుణ కుమారిగారికీ, ఆచార్య ఎస్. శరత్ జ్యోత్స్నా రాణిగారు, ఆచార్య రేమిళ్ళ వెంకట రామకృష్ణ శాస్త్రిగారు, ఆచార్య పమ్మిపవన్ కుమార్ గారు, ఆచార్య విజయలక్ష్మిగారు, డా॥ భుజంగ రెడ్డిగారు, డా॥ విజయకుమారి గారు, క్రీ.శే ఆచార్య ఎండ్లూరి సుధాకర్ గారు, డా॥ బి.తిరుపతి గారు మొదలైన వారందరికీ ప్రత్యేక ధన్యవాదాలు.

తమ రచనలపై పరిశోధన చేయడానికి అంగీకరించి, పరిశోధన సమయంలో విలువైన సలహాలు, సూచనలు అందించిన డా॥ ముదిగంటి సుజాతారెడ్డిగారికి...

నాకు విషయ సేకరణలో తోడ్పడిన ఇందిరా గాంధీ మెమోరియల్ (హైదరాబాదు విశ్వవిద్యాలయం) గ్రంథాలయ సిబ్బందికి, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో ఉన్న ప్రసిద్ధ గ్రంథాలయాల సిబ్బందికి, పరిశోధన చేయడానికి ఆర్థిక ప్రోత్సాహంగా జేఆర్ఎఫ్ అందించిన యు. జి. సి.(న్యూఢిల్లీ) వారికి, అంతేకాకుండా నా పరిశోధనలో అనేక రకాలుగా తోడ్పడిన ఎందరో మహానుభావులు అందరికీ వందనాలు.

నా జీవిత మార్గాన్ని యూనివర్సిటీ వైపు మళ్ళించి నేటి వరకు నిరంతరం ప్రోత్సహిస్తూ వస్తున్న దార సుమన్ అన్నకి...

మలినమన్నది ఎరుగక నా వెనుక వుండి నన్ను నడిపించే జాగర్ల మహేందర్ అన్నకు...

ఈ సమాజంలో ఒక మంచి వ్యక్తిగా ఎలా ఎదగాలో చెబుతూ నన్ను ఒక స్నేహితుడిలా చూసుకున్న సిరిమన్ నవీన్ అన్నకు...

నా పరిశోధనలో ప్రత్యక్షంగా తోడ్పడిన చెల్లెలు మనీషాకి, మహేష్, రంగస్వామికి..

పది సంవత్సరాల యూనివర్సిటీ జీవితంలో నాకు ఎన్నో అద్భుతమైన జ్ఞాపకాలను అందించిన నా ఇంటిగ్రేటెడ్ మిత్రులకు..

ఆత్మీయ సలహాలు ఇచ్చే సీనియర్స్ చంద్రయ్య అన్న, తిరుపతి అన్నలకు...

చివరిగా నా పరిశోధనలో ప్రత్యక్షంగా, పరోక్షంగా తోడ్పడిన అందరికి నా కృతజ్ఞతలు....

**-మారుతి**

# సంకేత పద సూచిక

భీ. ఖం–భీమ ఖండం

శృ. నై– శృంగార నైషధం

కా. ఖం–కాశీ ఖండం

హ. వి–హర విలాసం

హ–హర్షచరితం

నా– నాట్యశాస్త్రం

కావ్య. సం–కావ్యాలంకార సంగ్రహం

పం. చ–పండితారాధ్య చరిత్ర

ముదిగంటి–ముదిగంటి సుజాతారెడ్డి

ముసురె–ముదిగంటి సుజాతారెడ్డి

APA-American Psychological Association
IC- Internal citation

# విషయసూచిక


పుటలు

కృతజ్ఞతలు vi

సంకేత పద సూచిక viii

ప్రస్తావన XVI

1. ఉపోద్ఘాతం (Introduction)

2. పరిశోధనాంశం వివరణ (Explanation of the topic)

3. పరిశోధన సమస్య (Problem of the Research)

4. పరిశోధన ఆవశ్యకత–లక్ష్యాలు (Significance &Aims of the Research)

5. పూర్వ పరిశోధనల విమర్శనాత్మక పరిగణన (Review of literature)

6. పరిశోధన పరిధి (Scope of the Research)

7. పరిశోధన–ఊహాపరికల్పన (Hypothesis)

8. పరిశోధన పద్ధతులు (Research Methodology)

9. అధ్యాయ విభజన (Classification of chapters)

10. పరిశోధన ఆధార గ్రంథాలు (Research sources)

## అధ్యాయం–1

## ముదిగంటి సుజాతారెడ్డి జీవితం–పరిచయం (1-35)

1.0 పరిచయం 1

1.1. జననం 1

1.2. బాల్యం–విద్యాభ్యాసం 2

1.3. వివాహ జీవితం 2
1.4. వృత్తి–అలంకరించిన పదవులు 2
1.5. సాహిత్యంలో అక్షరాభ్యాసం 3
1.6. విదేశీ యాత్రలు 3
1.7. పరిశోధనలు 4
1.8. పురస్కారాలు 4
1.9. అనువాదాలుగా సుజాతారెడ్డి రచనలు 5
1.10. ముదిగంటి సుజాతారెడ్డి–రచనలు 6
1.10.1. నవలలు 6
1.10.2. కథాసంపుటాలు 9
1.10.3. సంపాదకత్వం 14
1.10.4. యాత్రాచరిత్రలు 19
1.10.5. ఆత్మకథ 24
1.10.6. వ్యవహార పదకోశం 26
1.10.7. స్మృతి కావ్యం 28
1.10.8. భారతీయ సాహిత్య నిర్మాతలు 29
1.11 ముదిగంటి సుజాతారెడ్డి వివిధ పత్రికల్లో రాసిన వ్యాసాలు 30
1.12 సాహిత్య విమర్శ గ్రంథాలు 33
1.13 సాహిత్య చరిత్రలు 34

## అధ్యాయం–2

## ముదిగంటి సాహిత్య విమర్శ–పరిచయం (36-64)

2.0 పరిచయం 36
2.1 సాహిత్య విమర్శ నిర్వచనాలు 37

2.2 సాహిత్య విమర్శ ప్రయోజనం 38

2.3 సాహిత్య విమర్శకులు—లక్షణాలు 40

2.4 తెలుగు సాహిత్య విమర్శ నేపథ్యం 40

2.5 ధోరణి–వాదం—పద్ధతి 43

2.6 సాహిత్య విమర్శ పద్ధతులు 44

2.7 సాహిత్య విమర్శలో ముదిగంటి సుజాతారెడ్డి 46

2.7.1 ప్రాంతీయ నేపథ్యం 47

2.7.2 తెలంగాణ సాహిత్య నేపథ్యం 48

2.7.3 తెలంగాణ సాహిత్య విమర్శ నేపథ్యం 49

2.8 విమర్శగ్రంథాలు–ఒక పరిచయం 51

2.8.1 ఆలంకారిక సంబంధిత విమర్శ ధోరణులు 51

2.8.1.1 మను–వసు చరిత్రల తులనాత్మక పరిశీలన 52

2.8.1.2 శ్రీనాథుని కవితాసౌందర్యం 53

2.8.1.3 వేమన–నాథ సంప్రదాయం 53

2.8.1.4 బాణుని కాదంబరి పరిశీలన 54

2.8.2 ఆధునిక సాహిత్య విమర్శ గ్రంథాలు 55

2.8.2.1 తెలుగు నవలానుశీలనం 55

2.8.2.2 రసచర్చ—ఆధునికత 56

2.8.2.3 అద్యతన దృష్టి 57

2.8.2.4 ముద్దెర (సాహిత్య విమర్శ వ్యాసాలు) 58

2.8.3 సాహిత్య చరిత్ర గ్రంథాలు 59

2.8.3.1 ఆంధ్రుల సంస్కృతి–సాహిత్య చరిత్ర 59

2.8.3.2 చారిత్రక సామాజిక నేపథ్యంలో తెలుగు సాహిత్య చరిత్ర 59

2.8.3.3 సంస్కృత సాహిత్య చరిత్ర 60

2.8.3.4 తెలంగాణ తెలుగు సాహిత్య చరిత్ర 61

2.8.3.5 మన తెలుగు సాహిత్య చరిత్ర 61

## అధ్యాయం–3

## ముదిగంటివారి ఆలంకారిక విమర్శ పరిశీలన (65-116)

3.0 తెలుగులో ఆలంకారిక సాహిత్య విమర్శ 65

3.1 ముదిగంటి సుజాతారెడ్డి–విమర్శ ధోరణి 68

3.1.1 తులనాత్మక సాహిత్య విమర్శ 69

3.1.2 మను–వసుచరిత్రల పూర్వ పరిశోధనలు 71

3.1.2.1 మను వసు చరిత్ర రచనా విమర్శనము 71

3.1.2.2 మను వసు ప్రకాశిక 72

3.1.2.3 వసు–మను ప్రకాశిక 73

3.1.3 శైలి సౌందర్యం 74

3.1.3.1 మాధుర్యము 75

3.1.3.2 శ్రీనాథుని స్వకల్పన 76

3.1.4 అలంకారాలు 79

3.1.4.1 రామరాజభూషణుడు–శ్లేష నైపుణ్యం 83

3.1.4.2 నిరలంకార సౌందర్యం 84

3.1.4.3 బాణుడు–ఉపమ ప్రవాహం 86

3.1.5 వర్ణన నైపుణ్యరీతి 87

3.1.6 రసపోషణ వైవిధ్యం 90

3.1.6.1 ప్రబంధం–అంగిరస ప్రధానమా? 91

3.1.6.2 భక్తి–శృంగార రససమ్మిళితం 92

3.1.7 కవి జీవిత కావ్య సమన్వయ విమర్శ 95

3.1.8 మనుచరిత్ర Vs వసుచరిత్ర 100

3.1.9 వేమన—ఇతర పరిశోధనలు 103

3.1.10 వేమన–'నాథ'తత్త్వం 108

3.1.10.1 నాథ శబ్దం–ప్రయోగం 109

3.1.10.2 వేమన; నాథ– సంప్రదాయం 110

3.1.11 విశ్వదాభిరామ వినుర–'వేమ' 112

## అధ్యాయం–4

# ముదిగంటి సుజాతారెడ్డి ఆధునిక సాహిత్య విమర్శ (117-171)

4.0 ఆధునిక సాహిత్య విమర్శ పరిచయం 117

4.1 నవలా విమర్శ–భిన్న కోణాలు 119

4.1.1 నవల–రసచర్చ 121

4.1.2 నవల–వస్తుధ్వని 125

4.1.3 విమర్శ—ప్రతి విమర్శ 127

4.1.4 నవల–ఉపోద్ఘాతం 130

4.1.5 నవల శబ్దం–పాశ్చాత్య నవల 131

4.1.6 తెలుగు నవల ప్రారంభం 133

4.1.7 నవల యుగ విభజన 135

4.1.8 నవల లక్షణాలు 137

4.1.9 నవలల్లో ఇతివృత్త వైవిధ్యం–గుణాలు 138

4.1.10 నవలల్లో కాల్పనికత (ఫాంటసీ) 139

4.1.11 చలం విశృంఖలత్వం+విశ్వనాథ సంప్రదాయతత్త్వం=తెన్నేటి హేమలత 141

4.2 వ్యాస విమర్శలో ముదిగంటి సుజాతారెడ్డి 143

4.2.1 విశిష్టతత్త్వం–స్పర్శ సిద్ధాంతం 145

4.2.2 కన్యాశుల్కం–ఉర్దూ ప్రభావం 147
4.2.2.1 కన్యాశుల్కంలో వివిధ ఉర్దూ పదాలు 148
4.2.3 సినిమా 'సామ్రాజ్యవాదం' 151
4.2.4 రాచపాళెం'చర్చ' పై ఒక చర్చ 152
4.2.5 కథా–కాగితం 154
4.2.6 స్త్రీవాదంపై ఒక అవలోకనం 156
4.2.7 ముస్లింవాద ప్రతినిధి 'వతన్' కథలు 158
4.2.8 చరిత్ర మలుపుతిప్పే సాహిత్యం 161
4.3 ప్రాంతీయ చైతన్యం ఒక అస్తిత్వ ఉద్యమం 163
4.3.1 ప్రాంతీయ అస్తిత్వవాదం బహిర్గతం చేసిన విషయాలు 164
4.3.2 తెలంగాణ ప్రాంతీయ అస్తిత్వ అభివ్యక్తి 165

## అధ్యాయం–5

## సుజాతారెడ్డి సాహిత్య చరిత్రల్లో విమర్శానాంశాలు (172-216)

5.0 సాహిత్య చరిత్ర ఒక పరిచయం 173
5.1 కవుల చరిత్ర–సాహిత్య చరిత్ర– వికాస చరిత్ర 175
5.2 తెలుగులో సాహిత్య చరిత్రలు 177
5.3 ఇతర భాషల సాహిత్య చరిత్రలు 181
5.4 సమగ్ర సాహిత్య చరిత్ర నిర్మాణ ప్రయత్నదశ 181
5.5 సాహిత్య చరిత్ర యుగ విభజనలు 183
5.5.1 వివిధ యుగ విభజన విధానాలు 183
5.5.2 ముదిగంటి సుజాతారెడ్డిగారి యుగ విభజన పద్ధతి 186
5.6 ప్రాంతీయ సాహిత్య చరిత్రలు 187
5.7 సంస్కృత సాహిత్య చరిత్ర–విమర్శనాంశాలు 188

5.8 చారిత్రక సామాజిక నేపథ్యంలో తెలుగు సాహిత్య చరిత్ర 195

5.9 మన తెలుగు సాహిత్య చరిత్ర 200

5.10 తెలంగాణ–తెలుగు సాహిత్య చరిత్ర 201

5.10.1 శాసన చరిత్ర 202

5.10.2 తెలంగాణ శతక సాహిత్యం 204

5.10.3 జానుతెలుగు–ప్రజాచైతన్యం 206

5.10.4 రాచకొండ పద్మనాయకుల యుగం 209

5.10.5 గోల్కొండ రాజ్యంలో తెలుగు సాహిత్యం 210

5.11 ఆంధ్రుల సంస్కృతి–సాహిత్య చరిత్ర 212

**సింహావలోకనం** 217

**పరిశోధన ఫలితాలు** 224

**ఉపయుక్త గ్రంథ సూచిక** 226

**అనుబంధం–1** 232-241

ముదిగంటి సుజాతారెడ్డి గారితో జరిపిన ఇంటర్వ్యూ

**అనుబంధం–2** 242-243

విమర్శకులతో ఛాయా చిత్రాలు

**అనుబంధం–3** 244-247

ముదిగంటి సుజాతారెడ్డి రచనల జాబితా (2022)

**అనుబంధం–4** 248-250

మను వసు చరిత్రల పరిశోధనల పట్టిక

**అనుబంధం–5** 251-263

పరిశోధన వ్యాసాలు మరియు సదస్సుల వివరాలు

# ప్రస్తావన

## 1. ఉపోద్ఘాతం (Introduction)

సాహిత్యానికీ సమాజానికీ అవినాభావ సంబంధం ఉంటుంది. సమాజంలోంచి సాహిత్యం పుడుతుంది. సాహిత్య సృష్టి చేసేవారు కూడా సమాజంలోని వ్యక్తే. ఒక జాతి సంస్కృతిని, నాగరికతను ముందు తరాలకి అందించడంలో సాహిత్యం పోషించే పాత్ర అత్యంత కీలకమైనది. అలాగే, సాహిత్యపు మనుగడ కూడా ఆ సమాజంపైన ఆధారపడి ఉంటుంది. సమాజం నిర్లక్ష్యం చేస్తే ఎటువంటి ఉత్తమ సాహిత్యమైన మూలన పడిపోతుంది. సాహిత్యం ఎల్లప్పుడూ సమాజ ప్రతిబింబమే. అందుకే ఆ సాహిత్యాన్ని సృష్టించే రచయితపై ఆ ప్రాంత ప్రభావం మనకు ఆయా రచనల్లో కనిపిస్తుంది. అలాగే, ఆ రచనల ప్రభావం కూడా అక్కడి సమాజంపై ఉంటుంది. ఇది ఒక అనివార్యమైన నిరంతర ప్రక్రియ. ఈ ప్రక్రియను నిరంతరం చేపడుతున్న విమర్శకుల్లో ప్రముఖులు ముదిగంటి సుజాతారెడ్డిగారు. విమర్శ అంటేనే ఒక రచనని సమగ్రంగా శాస్త్రీయ దృష్టితో పరిశీలించి గుణగణాలను వివేచించి, దానిలోని సాహిత్యతత్వాన్ని నిరూపించడం ఇటువంటి సాహిత్యాన్ని ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ, సాహిత్యంలో వస్తున్న మార్పులను గమనిస్తూ, వాటిని సాహిత్య విమర్శ ద్వారా ఒక నిబద్ధతతో విమర్శ రంగంలో కృషి చేస్తున్న వారిలో ముదిగంటి సుజాతారెడ్డి ఒకరు. వీరు నల్లగొండ జిల్లా, నకిరేకల్ మండలం, ఆకారం గ్రామంలో 1940 ప్రాంతంలో జన్మించారు. **"మను-వసుచరిత్ర తులనాత్మక పరిశీలన**"(1976) అనే తన సిద్ధాంత గ్రంథం ద్వారా తన సాహిత్య ప్రస్థానాన్ని ప్రారంభించారు. విమర్శ రంగంలో ప్రవేశించిన కొద్ది మంది స్త్రీలలో మంచి విమర్శకురాలిగా కృషిచేసి తగిన స్థానాన్ని సంపాదించుకున్నారు. వీరు కేవలం విమర్శ రంగంలోనే కాకుండా కథ, నవల, యాత్రాకథలు, సాహిత్య చరిత్ర, సంకలన కర్తగా, సంపాదకత్వం వహించి సృజనాత్మక ప్రక్రియలు తెలిసిన బహుముఖ ప్రజ్ఞాశాలి.

## 2. పరిశోధనాంశం వివరణ (Explanation of the topic)

ముదిగంటి సుజాతారెడ్డిగారి విమర్శలో ఎక్కువగా దేశీయ దృక్పథం కనిపిస్తుంది. వివిధ ప్రక్రియలను బట్టి భారతీయ సాహిత్య సిద్ధాంతాలను పునరావిష్కరించుకొని విమర్శలో  కొన్ని కొత్త మార్గాలను సృష్టించుకోవాలనే ధోరణి వీరిలో గమనించవచ్చు. వీరి విమర్శలో మనకు కొన్ని కొత్త కోణాలు కనిపిస్తాయి. మొదట మనువసుచరిత్రలను తులనాత్మకంగా పరిశీలించి ఈమె ప్రాచీన సాహిత్య సిద్ధాంతాల మీద అవగాహన ఏర్పరుచుకొన్నారు. ముదిగంటివారి విమర్శలో మనకు భిన్నమైన విమర్శ ధోరణులు దర్శనమిస్తాయి. అవి

### చారిత్రక విమర్శ

సుజాతరెడ్డిగారు వేమన గురించి చారిత్రక దృక్పథంతో పరిశోధనాత్మకంగా “వేమననాథ సంప్రదాయం”(1993) అనే గ్రంథంలో కొన్ని కొత్త అంశాలు చర్చించారు. దీనిలో ‘వేమన’ పేరు ‘భీమన’ నుంచి వచ్చిందని ఒక వివరణ ఇచ్చారు. వేమన పేరు గురించి వివరిస్తూ వేమన అనే పేరు చాలా ప్రాచీనమైనదని కుషాణ రాజుల కాలం నుంచి వ్యాప్తి ఉన్నదని ఒక ప్రాచీన బంగారు నాణెం సహాయంతో వివరించే ప్రయత్నం చేశారు. (వేమననాథ సంప్రదాయం 1993) వేమనకు సంబంధించిన ఈ గ్రంథంలో సుజాతారెడ్డిగారు ప్రస్తావించిన ఇంకొక కొత్త విషయం శ్రీనాథుని పేరు శివపరము గాని వైష్ణవ పరము కాదని చెప్పారు. (త్రివేణి:142)

### కవి జీవిత విమర్శ

ఒక కవి–అతని రచనలు ఒకదానిలో మరొకదాని ప్రభావం ప్రతిబింబిస్తూనే ఉంటుంది. అందుకే ముదిగంటి సుజాతారెడ్డి శ్రీనాథుడు, అల్లసాని పెద్దన, రామరాజభూషణుడు, వేమన, బాణుడు మొదలైన కవుల రచనలను పరిశీలిస్తున్నప్పుడు వారి వ్యక్తిగత జీవితాన్ని, ప్రత్యేకంగా విశ్లేషిస్తూ ఉంటారు. శ్రీనాథుని వంటి కవుల గురించి తెలియజేయడానికి రచయిత్రి చరిత్రపై తనకున్న సాధికారతను చాటుకున్నారు. చలం నవలలను అందులోని ప్రతీకలను, వివరిస్తూ విమర్శ వ్యాసాలలో సుజాతారెడ్డిగారు కొంత

కవి జీవిత విమర్శ చేసినట్లుగా చెప్పవచ్చు.(చలం గారిని సరిగ్గా చదువుకున్నామా? 1994) ఈ వ్యాసంలో చలం గురించి వ్యక్తిగత జీవితం ఆధారంగా కొత్త విశ్లేషణ చేశారు. దీనిలో మైదానం నవలలో రాజేశ్వరి చలం ఆత్మకు ప్రతీక అని, అమీరు ప్రేమ విశ్వప్రేమకు ప్రతీక అని చెప్పి చలం స్వచ్ఛమైన ప్రేమకు ప్రతీకగా మహమ్మదీయుడైన అమీరు పాత్ర అని, చలంగారిని సరిగ్గా చదువుకున్నామా? అనే వ్యాసంలో సుజాతారెడ్డిగారు విమర్శ చేశారు.(లక్ష్మణ చక్రవర్తి:371)

వేమన నాథ సంప్రదాయం అనే విమర్శ గ్రంథంలో కూడా కొంత వేమన పేరు భీమ శబ్దము నుండి వచ్చిందని చెబుతూ సందర్భంలో దీనికి ఆధారాలుగా "నేలటూరు వెంకటరమణయ్యగారి" "The Eastern chalukyas of vengi" అనే పుస్తకంలో శాసనాలను ఆధారంగా చేసుకొని కవి జీవిత విమర్శ చేశారు.

## నవల విమర్శ

పాశ్చాత్య నవలకు మూలాలను చర్చిస్తూ మధ్య యుగాల్లో యూరప్ లో, ఇటాలియన్ భాషలో వచ్చిన "నావెల్లా" ప్రక్రియ, స్పానిష్ భాషల్లో వచ్చిన "పికారస్క్స్", ప్రక్రియ ఫ్రెంచ్ భాషలో వచ్చిన "ఫెబ్లియా" ప్రక్రియల్లోని కథలకు భారతదేశం నుంచి ప్రయాణమై పోయిన కథలే మూలాధారాలను తెలుస్తోంది.(తెలుగు నవలానుశీలనం,1992) అని ప్రయాణికులు వర్తకులు సత్రంలో కలుసుకొని కథలు చెప్పుకుని సంప్రదాయం నుంచి ఇటాలియన్ స్పానిష్ భాషల్లో నవల ప్రక్రియ పుట్టి ఉంటుందని దీని ద్వారానే కథ ఆధునిక సాహిత్యంలో కథానిక, నవల రూపాలు సంతరించుకుందని నవల పుట్టుకకు భారతీయ సాహిత్యానికి గల సంబంధాలను తెలియజేసే ప్రయత్నం చేస్తూ, తెలుగు నవలానుశీలనం అనే గ్రంథం ద్వారా విమర్శించే ప్రయత్నం చేశారు. (త్రివేణి:102)

## తులనాత్మక విమర్శ పద్ధతి

ముదిగంటి సుజాతారెడ్డి ఆలంకారిక దృక్పథంతో చేసిన విమర్శ గ్రంథాలలో ప్రధానంగా **'మను వసుచరిత్రల తులనాత్మక పరిశీలన'** అనే తమ పరిశోధన గ్రంథాన్ని తులనాత్మక విమర్శ పద్ధతిని ప్రధానంగా ఉపయోగించారు. ఈ గ్రంథంలో వీరు

మనుచరిత్ర–వసుచరిత్ర మధ్యగల తారతమ్యాలను బేరీజు వేస్తూ, పెద్దన-రామరాజ భూషణుల రచన వైవిధ్యాన్ని పోలుస్తూ తులనాత్మక విమర్శ పద్ధతిలో ఈ గ్రంథాన్ని పూర్తి చేశారు.

## ముదిగంటి సుజాతారెడ్డిగారు చేసిన కొన్ని ప్రతిపాదనలు

- ఆధునిక వచన ప్రక్రియ అయిన నవలలో కూడా రసం ఉండవచ్చు అనే ప్రతిపాదన చేశారు.(రసచర్చ-ఆధునికత 2009)
- తెలుగు సాహిత్య చరిత్రను చారిత్రక, సామాజిక నేపథ్యంలో పరిశీలించి దీనిలో కొత్తగా వీరేశలింగ యుగం, కృష్ణశాస్త్రి యుగం లాంటి యుగ విభజన ద్వారా కొత్త విషయాన్ని చర్చకు పెట్టారు. (చారిత్రక సామాజిక నేపథ్యంలో తెలుగు సాహిత్య చరిత్ర 1996)
- 'వేమన నాథ సంప్రదాయం' అనే పేరుతో విమర్శ రంగంలో ఒక కొత్త దృక్పథంతో కొత్త సమాచారంతో విశ్లేషణ పూరితంగా వేమన నాథ సాంప్రదాయకుడు అని మరొక కొత్త ప్రతిపాదన చేశారు. (వేమన నాథ సంప్రదాయం 1993).

## ముదిగంటి సుజాతరెడ్డి రాసిన వివిధ విమర్శ గ్రంథాలు

సాహిత్య ప్రక్రియల్లో విమర్శ ఒక ప్రత్యేకమైన ప్రక్రియ. మిగతా ప్రక్రియలు కవుల, రచయితల సృజనాత్మకతపైన ఆధారపడేవి. కానీ, విమర్శ ఆయా రచనలను తరచి చూపే, తెరచి చూపే వచన ప్రక్రియ. విమర్శ ముఖ్యంగా ఏదైనా ఒక రచనను ఆశ్రయించుకొని సాగుతుంది. మూల రచనలోని ముఖ్య విషయాన్ని వెలికితీయడమైన, కవి అభిప్రాయాల్ని, కావ్య లేదా రచనల ప్రయోజనాన్ని విడమరిచి చెప్పేదే విమర్శ. ఇటువంటి అనేక విమర్శ గ్రంథాలను ముదిగంటి సుజాతారెడ్డిగారు రాశారు.

1. శ్రీనాథుని కవితా సౌందర్యం (1980)
2. బాణుని కాదంబరి పరిశీలనం (1980)
3. మనువసు చరిత్రల తులనాత్మక పరిశీలన (1981)
4. తెలుగు నవలానుశీలనం (1991)

5. వేమన-నాథ సంప్రదాయం (1993)

6. ముద్దెర (సాహిత్య విమర్శ వ్యాసాలు) (2005)

7. రసచర్చ–ఆధునికత (2010)

8. అద్యతన దృష్టి (2014)

**సాహిత్య చరిత్ర గ్రంథాలు**

తెలుగు సాహిత్య విమర్శలో సాహిత్య చరిత్రలు అధిక ప్రాధాన్యతను కలిగి ఉన్నాయి. కావ్య విమర్శలో సమకాలీన సాంఘీక పరిస్థితులకు, కవిజీవిత విశేషాలకు ప్రాముఖ్యత ఉండగా ముఖ్యంగా సాహిత్య చరిత్రలు కవి జీవితాన్ని, యుగ ప్రభావాన్ని, సాహిత్య క్రమ పరిణామాన్ని అనుశీలిస్తాయి. కావ్య విమర్శకు కవి చరిత్రలే ఆధారం. ఇటువంటి సాహిత్య చరిత్ర రచనలను ఒక భిన్న దృక్పథంతో చేసిన ముదిగంటి సుజాతారెడ్డిగారు విమర్శలో తనకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని పదిలపరుచుకున్నారు.

9. సంస్కృత సాహిత్య చరిత్ర (1986)

10. చారిత్రక సామాజిక నేపథ్యంలో తెలుగు సాహిత్య చరిత్ర (1996)

11. ఆంధ్రుల సంస్కృతి-సాహిత్య చరిత్ర (2007)

12. తెలంగాణ తెలుగు సాహిత్య చరిత్ర (2015)

13. మన తెలుగు సాహిత్య చరిత్ర (2018)

## 3. పరిశోధన సమస్య (Problem of the Research)

ముదిగంటి సుజాతారెడ్డిగారు తనదైన దృక్పథంతో వేమన గురించి చేసిన చారిత్రక విమర్శ విషయంలో, చలంగారి గురించి చేసిన కవి జీవిత సమన్వయవిమర్శలోగాని, నవలలో కొన్ని కొత్త ప్రతిపాదనలు చేశారు. వీటిలో వేమన వంటి వారి మీద ఎన్. గోపి నుండి ఆధునిక కవుల వరకు ఎంతోమంది చర్చలు చేశారు. వీటి మీద ఎన్నో గ్రంథాలు వచ్చాయి. నవలలో చెప్పిన ఫాంటసీ గురించి కూడా ఎంతోమంది చర్చించారు. వీటన్నింటికి భిన్నంగా సుజాతారెడ్డిగారు అంతవరకు పరామర్శింపబడిన విషయాలను ఏ విధంగా కొత్త కోణాలతో భిన్నంగా చేసిన విమర్శను, పరిశోధించాల్సిన అవసరం ఉంది.

## 4. పరిశోధన ఆవశ్యకత–లక్ష్యాలు (Significance &Objectives of the Research)

సాహిత్యంలో ఒకే రంగంలో కాకుండా, భిన్నమైన ధోరణులు మీద అవగాహన ఉన్నవారు చేసే విమర్శను పరిశీలించాల్సిన ఆవశ్యకత నేడు ఉంది అలాగే, సృజనాత్మకత ప్రక్రియ ప్రభావం వారు చేసే మేధో గతమైన విమర్శపై ఏ విధంగా ఉందో తెలుసుకోవాల్సిన అవసరం ఉంది. వ్యక్తిగతంగా ఒకరు చేసిన విమర్శ రచనలపై పరిశోధనలు చేయడం ద్వారా "సమగ్ర తెలుగు సాహిత్య విమర్శ" నిర్మించుకోవడానికి ఇలాంటి పరిశోధనలు దోహదపడే అవకాశం ఉంది. ఇలా భిన్నమైన విమర్శకుల గురించి పరిశోధనలు చేయడం వీరి విమర్శను ఇతర ప్రాంతీయ విమర్శకులతో తులనాత్మకంగా పరిశీలించడం ద్వారా ఆయా ప్రాంతాల స్వభావం అందులో ఉండే ప్రత్యేకత అక్కడి సామాజిక అంశాలు, విమర్శను ఎంత వరకు ప్రభావితం చేస్తాయి అని తెలుసుకోవాల్సిన అవసరం ఉంది.

### లక్ష్యాలు

- ఒక స్త్రీ విమర్శకురాలిగా ముదిగంటి సుజాతారెడ్డి గారి ప్రత్యేకతను తెలుసుకోవడం.
- సుజాతారెడ్డిగారు ఉపయోగించిన చారిత్రక విమర్శ, కవిజీవిత విమర్శ, పునర్మూల్యాంకన విమర్శ, తులనాత్మక విమర్శ వంటి భిన్నమైన విమర్శ ధోరణులను పరిశీలించడం.
- తెలంగాణ అస్తిత్వ పోరాట ప్రభావం సుజాతారెడ్డిగారి "ముద్దెర" వంటి విమర్శ రచనల్లో ఎంతవరకు ఉంది అనే విషయాన్ని తెలుసుకోవడం.
- కథ, నవల, సాహిత్య చరిత్ర, పరిశోధన, విమర్శ, ఆత్మకథ, జీవిత చరిత్ర, యాత్రా రచన, పదకోశ నిర్మాణం, మోనోగ్రఫ్, సంపాదకత్వం అనేక సాహిత్య ప్రక్రియల్లో ప్రవేశం ఉన్న ముదిగంటి సుజాతారెడ్డి సృజనాత్మక రచనల ప్రభావం విమర్శ రచనపై ఏ విధంగా వుందో తెలుసుకోవడం.

## 5. పూర్వ పరిశోధనల విమర్శనాత్మక పరిగణన (Review of literature)

ముదిగంటి సుజాతారెడ్డిగారి రచనలపై ఇప్పటివరకు **"ముదిగంటి సుజాతారెడ్డి రచనలు–సమగ్ర పరిశీలన** (2008)" డాక్టర్ వి. త్రివేణిగారు ఉస్మానియా యూనివర్సిటీలో ఒక సిద్ధాంత వ్యాసాన్ని గ్రంథాన్ని రాశారు. ఇంకా ముదిగంటి సుజాతారెడ్డిగారి సృజనాత్మక ప్రక్రియ అయిన నవలలు, కథలు మీద రెండు సిద్ధాంత వ్యాసాలు వచ్చాయి. కానీ, విమర్శ గ్రంథాలపై ఇప్పటివరకు ఎటువంటి పరిశోధనలు జరగలేదని ప్రత్యక్షంగా రచయితలు సంప్రదించిన తర్వాతనే నిర్ధారణ చేసుకున్నాను. ఇదే పరంపరలో ఇంతకుముందు కొన్ని విమర్శ రంగంలో పరిశోధనలు జరిగాయి. అవి **"పరిశోధకుడిగా ఆరుద్ర"** అనే పేరుతో దార్ల వెంకటేశ్వరరావుగారు(2003) పరిశోధన చేశారు. 2004లో **"విమర్శకుడిగా కె.వి.రమణారెడ్డి"** డాక్టర్ కొల్లు వెంకటేశ్వరరావుగారు రంగనాథాచార్యులు పర్యవేక్షణలో హైదరాబాద్ విశ్వవిద్యాలయంలో సిద్ధాంత గ్రంథం సమర్పించారు. పి. సుధాకుమార్ **"విమర్శకుడుగా వల్లంపాటి"** (2007) వంటి హైదరాబాద్ విశ్వవిద్యాలయంలో ఈ రకమైన పరిశోధనలు ఇంకా కొన్ని జరిగాయి.

## 6. పరిశోధన పరిధి (Scope of the Research)

ఈ పరిశోధనలో ముఖ్యంగా ముదిగంటి సుజాతారెడ్డి రాసిన విమర్శ గ్రంథాలను పరిశోధన కోసం తీసుకుంటాను. అలాగే, ముదిగంటి సుజాతారెడ్డి రాసిన ఇతర గ్రంథాలను వ్యాసాలను, ఇతర సృజనాత్మక రచనలను ఈ పరిశోధనలో భాగంగా ఉపయోగించుకుంటాను. ప్రధానంగా ఈ పరిశోధన ముదిగంటి సుజాతారెడ్డి విమర్శను పరిచయం చేయడం, వాటిలోని విమర్శ పద్ధతులను గుర్తించడం, విమర్శలో ప్రధానంశాలను కనుగొనడం అనే రీతిలో ఈ పరిశోధన కొనసాగుతుంది. ముదిగంటి సుజాతారెడ్డి రాసిన విమర్శ గ్రంథాల్లోని వివిధ విమర్శ ధోరణులను పరిశీలించడం ఈ పరిశోధన పరిధి.

### 7. పరిశోధన–ఊహాపరికల్పన (Hypothesis)

- ఇతర విమర్శకులతో పోల్చి చూసినప్పుడు ఒక స్త్రీగా ముదిగంటి సుజాతరెడ్డిగారు చేసిన విమర్శ కొంత భిన్నంగా వుంటుందా అని ఈ పరిశోధనలో పరిశీలించాల్సి ఉంది.
- తెలుగు సాహిత్యంలో వివిధ ప్రాంతాల సాహిత్యం అక్కడి సామాజిక, ఆర్థిక, రాజకీయ పరిస్థితులకు అనుగుణంగా విభిన్నంగా ఉన్నట్లయితే, వాటి ప్రభావం విమర్శ మీద కూడా ఉండి ఉంటుందా?
- సాహిత్య చరిత్రలను రచించిన ముదిగంటి సుజాతారెడ్డిగారి విమర్శ చారిత్రక దృక్పథంతో వెలువడే అవకాశం ఉంటుందా?
- సామాజిక, ఆర్థిక కోణాలతో సాంస్కృతిక విమర్శకు ప్రాధాన్యాన్ని ఇచ్చే అవకాశం ఉందా? ఇవన్నీ వీరి విమర్శలో పరిశీలనాంశాలు.

## 8. పరిశోధన పద్ధతులు (Research Methodology)

'ముదిగంటి సుజాతారెడ్డి విమర్శ ధోరణులు–పరిశీలన' అనే ఈ పరిశోధనలో వివిధ విమర్శ గ్రంథాలను విశ్లేషించడానికి అనుసరించవలసిన వివిధ విమర్శ పద్ధతులను పాటించాలి. అలాగే, వాటిని విశ్లేషించే సమయంలో (Analytical method/ descriptive method) ఇతర రచనలతో పోల్చే సమయంలో తులనాత్మక పద్ధతి (Comparative method) అవసరం అవుతాయి. అలాగే, రచయిత అభిప్రాయాలు తెలుసుకోవడానికి ముఖాముఖీ పద్ధతి (Interview method)ని ఈ పరిశోధనలో ఉపయోగిస్తాను.

## 9. అధ్యాయ విభజన (Classification of chapters)

శీర్షిక: "ముదిగంటి సుజాతారెడ్డి విమర్శ ధోరణులు–పరిశీలన"

మొదటి అధ్యాయం: ముదిగంటి సుజాతారెడ్డి జీవితం–పరిచయం

రెండవ అధ్యాయం: ముదిగంటి సాహిత్య విమర్శ–పరిచయం

మూడవ అధ్యాయం: ముదిగంటివారి ఆలంకారిక విమర్శ పరిశీలన

నాల్గవ అధ్యాయం: ముదిగంటి సుజాతారెడ్డి ఆధునిక సాహిత్య విమర్శ

ఐదవ అధ్యాయం: సుజాతారెడ్డి సాహిత్య చరిత్రల్లో విమర్శ్యానాంశాలు

## ముగింపు

ముదిగంటి సుజాతారెడ్డిగారు తన రచనల్లో తనదైన ఒక కొత్త ధృక్పథంతో విమర్శ చేశారు. ప్రాచీన భారతీయ సాహిత్యంలోనే మన నిజమైన సాహితీ విలువలున్నాయని, వాటిని నేటి ఆధునిక సాహిత్యానికి అన్వయిస్తూ, వాటి మూలాలను వెతికే ప్రయత్నం కొంత చేశారు. ఈ ప్రయత్నంలో భాగంగానే ఇప్పటివరకు కొన్ని విమర్శ గ్రంథాలను వెలువరించారు. వీటిని ఎటువంటి విమర్శ పద్ధతుల ఆధారంగా విమర్శ చేశారో ఈ పరిశోధన ద్వారా తెలుసుకునే ప్రయత్నం జరిగింది. ఒక వ్యక్తి రచనలను ఆధారంగా చేసుకుని పరిశోధన చేయడం అంటే వారి రచనల ద్వారా ఆ వ్యక్తి జీవితాన్ని అర్థం చేసుకోనే ప్రయత్నం చేయడం. అప్పటి సామాజిక, ఆర్థిక, రాజకీయ కోణాల నుండి ఆ రచనలను సృశించి వారి రచన వైవిధ్యాన్ని తెలుసుకోవడం. దేశకాలమాన పరిస్థితులను క్రోడీకరించడానికి ఆలంబనగా రచయిత జీవితంలోని సంఘర్షణల నుంచో లేదా వ్యక్తికీ విధికీ మధ్య జరిగే పోరాటాల అనుభవం నుండి వారి రచన ధోరణులను రాబట్టటం జరుగుతుంది. అలాగే, వీటిని ముదిగంటి సుజాతారెడ్డిగారి విమర్శ రచనల నుండి వారి విమర్శ ధోరణులను అర్థం చేసుకోవడమే ఈ పరిశోధన ప్రధాన ఉద్దేశ్యం. ముఖ్యంగా ఈ పరిశోధన సాహిత్య విమర్శపై విమర్శ (Meta criticism)కు సంబంధించింది. ఈ పరిశోధన విమర్శను పరిచయం చేయడం, వాటిలోని విమర్శ పద్ధతులను గుర్తించడం, విమర్శలో ప్రధానంశాలను కనుగొనడం అనే రీతిలో ఈ పరిశోధన కొనసాగించాను. ఇక్కడ కేవలం ముఖ్యంశాలే తప్ప సిద్ధాంత వాదోపవాదాలు లేవు. ఈ పరిశోధనలో నాకున్న అవగాహన మేరకు ముదిగంటి సుజాతారెడ్డి విమర్శను అధ్యయనం చేశానని తెలియజేస్తున్నాను.

## 12. పరిశోధన ఆధార గ్రంథాలు (Research sources)


1. సుజాతారెడ్డి, ముదిగంటి &ముదిగంటి గోపాలరెడ్డి. (1980). ***బాణుని కాదంబరి పరిశీలనం***. హైదారాబాద్: రోహణం ప్రచురణలు.

2. సుజాతారెడ్డి, ముదిగంటి. (2010). ***రసచర్చ–ఆధునికత.*** హైదరాబాద్: రోహణం ప్రచురణలు.

3. సుజాతారెడ్డి, ముదిగంటి. (2014).***అద్యతన దృష్టి.*** హైదరాబాద్: రోహణం ప్రచురణలు.

4. సుజాతారెడ్డి, ముదిగంటి. (1991). ***తెలుగు నవలానుశీలనం.*** హైదరాబాద్: రోహణం ప్రచురణలు.

5. సుజాతారెడ్డి, ముదిగంటి. (1981). ***మను–వసుచరిత్రల తులనాత్మక పరిశీలనం.***హైదరాబాద్: శ్రీ విజయ ప్రింటర్స్.

6. సుజాతారెడ్డి, ముదిగంటి. (1993).***వేమన నాథ సంప్రదాయం.***హైదరాబాద్: శ్రీశాంతా ఆర్ట్ ప్రింటర్స్.

7. సుజాతారెడ్డి, ముదిగంటి. (1980). ***శ్రీనాథుని కవితా సౌందర్యం.*** హైదరాబాద్: శ్రీ విజయ ప్రింటర్స్.

8. సుజాతారెడ్డి, ముదిగంటి. (2005)***ముద్దెర.*** హైదరాబాద్: రోహణమ్ పబ్లికేషన్స్.

9. సుజాతారెడ్డి, ముదిగంటి &గోపాల్ రెడ్డి. (1986). ***సంస్కృత సాహిత్య చరిత్ర.*** హైదరాబాద్: పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం.

10. సుజాతారెడ్డి, ముదిగంటి. (2007).***ఆంధ్రుల సంస్కృతి సాహిత్య చరిత్ర***. హైదరాబాదు: తెలుగు అకాడమి.

11. సుజాతారెడ్డి, ముదిగంటి.(1996). ***చారిత్రక సామాజిక నేపథ్యంలో తెలుగు సాహిత్య చరిత్ర.*** హైదరాబాద్: రోహణమ్ పబ్లికేషన్స్.

12. సుజాతారెడ్డి, ముదిగంటి.(2015). ***తెలంగాణ తెలుగు సాహిత్య చరిత్ర.*** హైదరాబాద్: తెలంగాణ సారస్వత పరిషత్తు,

13. సుజాతారెడ్డి, ముదిగంటి. (2018). ***మన తెలుగు సాహిత్య చరిత్ర.*** హైదరాబాదు: తెలుగు అకాడమి,

14. త్రివేణి, వి.(2008).***ముదిగంటి సుజాతారెడ్డి రచనలు-సమగ్ర పరిశీలన.*** ఉస్మానియా విశ్వవిద్యాలయానికి సమర్పించిన సిద్ధాంత గ్రంథం (ముద్రితం).

15. నారాయణరెడ్డి, సుంకిరెడ్డి.(1977). ***ఆధునికాంధ్ర కవిత్వం-సంప్రదాయము-ప్రయోగములు.***హైదరాబాద్:తెలుగు అకాడమీ.

16. లక్ష్మణ చక్రవర్తి, సి హెచ్. (2004). ***ఆధునిక సాహిత్య విమర్శ రీతులు.***హైదరాబాద్: ఆంధ్ర విద్యాలయ ప్రచురణలు.

17. లక్ష్మణ చక్రవర్తి, సి హెచ్, పి వారిజారాణి, జి విజయ్ కుమార్ (సంపా). (2008) ***ఆధునిక సాహిత్య విమర్శకులు–ప్రస్థానాలు*** (తొలి మలి తరాలు): ఆంధ్ర విద్యాలయ స్నాతకోత్తర తెలుగుశాఖ.

18. లక్ష్మణ చక్రవర్తి, సి హెచ్, పి వారిజారాణి, జి విజయ్ కుమార్ (సంపా). (2008). ***ఆధునిక సాహిత్య విమర్శకులు–ప్రస్థానాలు*** (సమకాలీకులు): ఆంధ్ర విద్యాలయ స్నాతకోత్తర తెలుగుశాఖ.

19. వెంకటేశ్వరరావు, కొల్లు. (2004). ***విమర్శకుడిగా కె.వి.రమణారెడ్డి.*** హైదరాబాద్ విశ్వవిద్యాలయానికి సమర్పించిన సిద్ధాంత గ్రంథం. (అముద్రితం)

# అధ్యాయం-1

# ముదిగంటి సుజాతారెడ్డి జీవితం–పరిచయం

## 1.0 పరిచయం

సాహిత్యానికీ సమాజానికీ అవినాభావ సంబంధం ఉంటుంది. సమాజంలోంచి సాహిత్యం పుడుతుంది. సాహిత్య సృష్టి చేసేవారు కూడా సమాజంలోని వ్యక్తే. ఒక జాతి సంస్కృతిని, నాగరికతను ముందు తరాలకి అందించడంలో సాహిత్యం పోషించే పాత్ర అత్యంత కీలకమైనది. అలాగే, సాహిత్యపు మనుగడ కూడా ఆ సమాజంపైన ఆధారపడి ఉంటుంది. సమాజం నిర్లక్ష్యం చేస్తే ఎటువంటి ఉత్తమ సాహిత్యమైన మూలన పడిపోతుంది. సాహిత్యం ఎల్లప్పుడూ సమాజ ప్రతిబింబమే. అందుకే ఆ సాహిత్యాన్ని సృష్టించే రచయితపై ఆ ప్రాంత ప్రభావం మనకు ఆయా రచనల్లో కనిపిస్తుంది. అలాగే, ఆ రచనల ప్రభావం కూడా అక్కడి సమాజంపై ఉంటుంది. ఇది ఒక అనివార్యమైన నిరంతర ప్రక్రియ. అందుకే నా పరిశోధనాంశంలో భాగంగా ముందుగా రచయిత ప్రాంతీయ నేపథ్యాన్ని తెలుసుకోవాలనే ఉద్దేశ్యంతో నా పరిశోధనను ఇక్కడి నుండి ప్రారంభిస్తున్నాను.

## 1.1. జననం

ముదిగంటి సుజాతారెడ్డిగారు 1942 మే 25న నల్గొండ జిల్లా, నక్రేకల్ మండలం, ఆకారం గ్రామంలో వెంకటమ్మ, రామిరెడ్డి దంపతులకు జన్మించారు. వీరికి పది మంది సంతానం కాగా, ఆ రోజుల్లో ఉండే వివిధ కారణాల వల్ల అందరూ చనిపోగా ఆఖరుగా ఇద్దరు మగ పిల్లలు, ముగ్గురు ఆడపిల్లలు ఉన్నట్లుగా సుజాతారెడ్డి తమ ఆత్మకథలో చెప్పుకున్నారు. వీరికి ముందు ఒక అక్క ఉండగా ఆమె ఎనిమిదేళ్ల వయసులో టీబీ వ్యాధితో మరణించారు. ముదిగంటి సుజాతారెడ్డిగారు తన కుటుంబంలో రెండవ సంతానం. వీరికి ఒక అన్న కూడా ఉన్నారు. వీరింట్లో చిన్నప్పుడు ఎటువంటి సాహిత్య వాతావరణం ఉన్నట్లు కనిపించదు.

## 1.2 బాల్యం–విద్యాభ్యాసం

ముదిగంటి సుజాతారెడ్డిగారు బాల్యంలో తెలంగాణ ప్రాంతంలో కమ్యూనిస్టు, రజాకార్లతో ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడటంతో 1947లో ఆమె తన తల్లి, తమ్ముల్లతో కలసి గుంటూరులోని అద్దంకి వెళ్ళి, తన ప్రాథమిక విద్యను అక్కడి వీధిబడిలోనే ప్రారంభించారు. తర్వాత 1950లో నల్గొండకు తిరిగి వచ్చి అక్కడి ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో 4వ తరగతిలో చేరారు. 1956లో ఎస్. ఎస్. సి పూర్తి చేశారు. అదే సంవత్సరంలో "రాజాబహద్దూర్ వెంకటరామిరెడ్డి మహిళా కళాశాల"లో పియూసి చేరి 1958లో దీన్ని పూర్తి చేశారు.1959లో నల్గొండలోని నాగార్జున కాలేజీలో డిగ్రీలో చేరారు. ఆ తర్వాత వివాహం కాగా డిగ్రీ రెండవ సంవత్సరం ఉస్మానియా యూనివర్సిటీ కోటి ఉమెన్స్ కాలేజీలో చేరి 1961లో డిగ్రీ పట్టా పొందారు. సుజాతారెడ్డి 1961-63 సంవత్సరాల మధ్య ఉస్మానియా యూనివర్సిటీలో ఏం.ఎ తెలుగు పూర్తిచేసి, అదే యూనివర్సిటీ నుంచి 1976లో "**మను వసుచరిత్ర తులనాత్మక పరిశీలన**" అనే పేరుతో సిద్ధాంత గ్రంథం సమర్పించి పిహెచ్. డి పట్టా పొందారు.

## 1.3 వివాహ జీవితం

ముదిగంటి సుజాతారెడ్డి డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతున్న రోజుల్లో తేది 20-5-1959 రోజున ఆర్య సమాజానికి చెందిన ముదిగంటి గోపాల్ రెడ్డితో వివాహం జరిగింది. ముదిగంటి గోపాల్ రెడ్డి కుటుంబం ఆర్య సమాజానికి చెందినవారు. ఆయన హరిద్వార్ లో ఉన్న కాంగ్డి ఆర్య సమాజం గురుకులంలో చదువుకున్నారు. ఆ ప్రభావం ఆయన మీద చాలా ఉండేది. అందుకే వివాహం అయిన తర్వాత కూడా సుజాతారెడ్డి తన చదువును ఎలాంటి ఆటంకం లేకుండా కొనసాగించగలిగారు. వీరు వాసవిక, ఉదయన అనే ఇద్దరు పిల్లలకు జన్మనిచ్చారు.

## 1.4 వృత్తి–అలంకరించిన పదవులు

ముదిగంటి సుజాతారెడ్డి తన వృత్తిపరమైన జీవితాన్ని విదేశాల్లో మొదలుపెట్టారు. 1966లో తన భర్త గోపాల్ రెడ్డి జర్మన్ భాషలో పోస్ట్ గ్రాడ్యుయేషన్ చేయడానికి జర్మనీ వెళ్ళగా, తర్వాత కొన్ని రోజులకు సుజాతారెడ్డి అక్కడికి వెళ్లి 1966-69 మధ్యకాలంలో

మూడేళ్లపాటు జర్మనీలోని టుబింగన్ విశ్వవిద్యాలయం గ్రంథాలయంలోని ఓరియంటల్ విభాగంలో, భారత గ్రంథాలను 'సబ్జెక్ట్ క్యాటలాగ్' చేసే విభాగంలో పని చేశారు. తర్వాత అక్కడినుంచి తిరిగివచ్చిన వీరు హైదరాబాదులోని మాక్స్ ముల్లర్ భవనంలో 1969-70లో లైబ్రేరియన్ గా పనిచేశారు. 1970లో రాజాబహద్దూర్ వెంకట రామిరెడ్డి మహిళా కళాశాలలో తెలుగు లెక్చరర్ గా బాధ్యతలు స్వీకరించి 2000 సంవత్సరంలో అసోసియేట్ ప్రొఫెసర్ గా పదవి విరమణ చేశారు.

## 1.5 సాహిత్యంలో అక్షరాభ్యాసం

ముదిగంటి బాల్యం నుండి వారి ఇంట్లో సాహిత్య వాతావరణం ఎక్కువగా లేకపోయినా ఆమెకు బాల్యం నుండి కథలపై ఉన్న ఆసక్తి, చిన్నప్పుడు చందమామ కథలు చదివిన అనుభవం ఉండేది. ఒకసారి చిన్నాన్న వీరి ఇంట్లో వదిలి వెళ్లిన 'ఖండవల్లి లక్ష్మీరంజనం' "**ఆంధ్ర సాహిత్య చరిత్ర సంగ్రహం**" చదవడంతో ఆమెకు దాని ద్వారా సాహిత్య పరిచయం ఏర్పడింది. తాను బి.ఏ లో ఉండగా నాగార్జునసాగర్ విహారయాత్రకు వెళ్లినప్పుడు అక్కడి యాత్ర విశేషాలు కలిపి ఒక చిన్న వ్యాసం రాస్తే ఆ వ్యాసాన్ని ఆంధ్రప్రభ వారపత్రిక "**ప్రమదావనం**"లో అచ్చయింది. ఇదే తన మొదటి అచ్చయిన రచనగా చెప్పవచ్చు. ముదిగంటివారు పియూసిలో ఉన్నప్పుడు కొన్ని కథలు రాస్తే గోలకొండ పత్రికలో అచ్చయ్యాయి. అందులో "**జీవన్మృతుడు**" అనేది తన మొదటి కథగా చెప్పుకోవచ్చు. అలాగే, బి.ఏ మూడవ సంవత్సరంలో ఉండగా కోటి ఉమెన్స్ మ్యాగజైన్ కోసం శ్రీశ్రీ గురించి రాసిన కవితకు ఉత్తమ రచనగాను **'మనుచరిత్ర'** కావ్యాన్ని బహుమానంగా అందుకున్నారు. ఇదే నేపథ్యంతో తర్వాత కాలంలో ముదిగంటి సుజాతారెడ్డిగారు తెలుగు సాహిత్యంలో అనేక ప్రక్రియల్లో రచనలు చేసి తనదైన స్థానం సంపాదించుకోగలిగారు.

## 1.6 విదేశీ యాత్రలు

ఒక వ్యక్తి తన జీవిత కాలంలో తాను వెళ్లిన ప్రదేశాలు చేసిన అనుభూతుల ప్రభావం తర్వాతి జీవితంలో ప్రతిఫలించకమానదు, అలాగే, ముదిగంటివారు జర్మనీలో తన కుటుంబంతోపాటు 1966-69లో మూడేళ్లపాటు ఉండటం అక్కడ ఉన్న ఆచార

సంప్రదాయాలు, ప్రజల వ్యక్తిత్వం, వారి సాహిత్యంపై ఉండే శ్రద్ధ చాలా దగ్గర నుండి గమనించారు. తర్వాతి కాలంలో ఆమె అమెరికా, చైనా, ఈజిప్ట్, జపాన్, గ్రీసు, టర్కీ వంటి అనేక దేశాల యాత్రలు చేశారు.

## 1.7 పరిశోధనలు

డాక్టర్. వి.త్రివేణి "**ముదిగంటి సుజాతారెడ్డి రచనలు–సమగ్ర పరిశీలన**" అనే పేరుతో ఉస్మానియా యూనివర్సిటీలో 2008లో పిహెచ్.డి చేశారు. ప్రస్తుతం ఈమె నిజమాబాద్ లోని తెలంగాణ యూనివర్సిటీలో ప్రొఫెసర్ గా పనిచేస్తున్నారు. **"ముదిగంటి సుజాతారెడ్డి కథలు–సమాలోచన"** పేరుతో జి. ఉషారాణి శ్రీకృష్ణదేవరాయ యూనివర్సిటీ అనంతపూర్ లో 2008లో ఎం. ఫిల్ చేశారు.

## 1.8 పురస్కారాలు

ముదిగంటి సుజాతారెడ్డిగారు తాను వివిధ ప్రక్రియల్లో చేసిన రచనలకుగాను ఎన్నో పురస్కారాలు అందుకున్నారు. వాటిలో కొన్ని

1. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నుంచి 'ఉత్తమ అధ్యాపకులు'-1992.
2. 'తెలుగు నవలానుశీలనం'కు పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం నుంచి ఉత్తమ రచయిత్రి గ్రంథం అవార్డు-1992.
3. నెల్లూరు వర్ధమాన సమాజంవారి "కవిత్రయ అవార్డు"–1993.
4. దాశరథి దంపతుల సాహిత్య పురస్కారం-1994.
5. జ్యేష్ఠ లిటరరీ అవార్డు విశాఖపట్నం "విసుర్రాయి" కథల సంపుటి–1908.
6. విశాల సాహితీ పురస్కారం జగిత్యాల "విసుర్రాయి" కథల సంపుటి–1999.
7. చాసో స్ఫూర్తి సాహితీ పురస్కారం విజయనగరం, (కథా రచన)–2001.
8. జీవియస్ సాహితీ పురస్కారం (చారిత్రక సామాజిక నేపథ్యంలో తెలుగు సాహిత్య చరిత్ర)-2003.
9. రంగవల్లి సాహితీ పురస్కారం (జహంగీరు బీ) కథ.-2004.
10. పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం 'ఉత్తమ రచయిత్రి' పురస్కారం–2005.
11. రంగినేని సాహిత్య పురస్కారం–సిరిసిల్ల(వ్యాపార మృగం కథల సంపుటికి)-2007.

12. సుశీలా నారాయణరెడ్డి సాహితీ పురస్కారం–2008.

13. సురవరం ప్రతాపరెడ్డి సాహితీ పురస్కారం–2011.

14. విశిష్ట రచయిత్రి పురస్కారం–నిజమాబాద్–2011.

15. ఆచార్య పల్లా దుర్గయ్య సాహిత్య పురస్కారం–2013.

16. వంశీ తెన్నేటి అహల్యాదేవి సాహితీ పురస్కారం–2014.

17. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఉగాది పురస్కారం–2015.

18. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ ద్వితీయ వార్షికోత్సవాలలో ప్రభుత్వ విశిష్ట ప్రతిభా పురస్కారం–2016.

19. పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం నుండి విశిష్ట పురస్కారం-2020.

## 1.9 అనువాదాలుగా సుజాతారెడ్డి రచనలు

అనువాదం అనేది ఒక సంక్లిష్టమైన ప్రక్రియ, దీనికి మూల భాష మరియు లక్ష్య భాష రెండింటిపై లోతైన అవగాహన అవసరం, అలాగే, సాంస్కృతిక మరియు సందర్భోచిత జ్ఞానం అవసరం. వివిధ భాషలు మాట్లాడే వ్యక్తుల మధ్య కమ్యూనికేషన్ మరియు అవగాహనను సులభతరం చేయడానికి ఇది తరచుగా ఉపయోగించబడుతుంది మరియు దౌత్యం, అంతర్జాతీయ వ్యాపారం మరియు భాషాశాస్త్రం వంటి రంగాలలో ఇది కీలక పాత్ర పోషిస్తుంది. సాహిత్యం విషయానికొస్తే అనువాదాలు లేకపోతే ఆ రచయిత పరిధి, ఆ భాష సారస్వత పరిధి చిన్నదైపోతుంది. అందుకే అనువాదాలు అత్యంత అవసరం. ఒక భాషలోని రచనలు మరో భాషలోకి అనువదించడం వల్ల సాహిత్య పరిధి విస్తృతమై ఒక రచయిత సాహిత్య విలువలు మరో భాష వర్గానికి అందుతాయి. ఒక రచన మరో వర్గానికి అందినప్పుడు ఆ రచనతో అంతర్గతంగా మిళితమై ఉండే భాష, సంస్కృతి, ప్రజల జీవన విధానం, ఆ ప్రాంతపు ఆర్థిక, సామాజిక విషయాలు కూడా చేరతాయి. ఆలా అనువాదం వల్ల ప్రతి భాష సాహిత్యం దాని పరిధిని పెంచుకుంటూ సుసంపన్నం అవుతుంది. అలాగే, ముదిగంటి సుజాతారెడ్డిగారు చేసిన రచనల్లో కొన్నింటిని కొంతమంది ఇతర భాషల్లోకి అనువాదం చేశారు.

1. మలుపు తిరిగిన రథచక్రాలు (తెలంగాణ విమోచన పోరాటాన్ని చిత్రించే నవల) '**ముడ్ గయే రథ్ చక్రే**' అనే పేరుతో హిందీలోకి డాక్టర్ సుమన్ లత అనువదించారు.
2. విసుర్రాయి (స్త్రీల వేదనను శోషణను చిత్రించే కథలు) **"చక్కీ"** పేరుతో ఆచార్య సత్యనారాయణ హిందీలోకి అనువదించారు.
3. 'నిశ్శబ్దం నిశ్శబ్దం' అనే కథను అల్లాడి ఉమ, శ్రీధర్ లు ఇంగ్లీషులోకి అనువదించారు.
4. 'వ్యాపార మృగం' అనే కథను స్వాతి శ్రీపాద ఇంగ్లీషులోకి అనువదించారు.
5. 'గుడిసెలు గుడిసెలు' అనే కథను "**డిస్ ప్లేస్ మేంట్**" (Displacement) పేరుతో రాజశేఖర్ ఆంగ్లంలోకి అనువదించారు.
6. "పాలు పొంగే పుణ్యభూమి" అనే కథను నిడదవోలు మాలతి ఆంగ్లంలోకి అనువదించారు.
7. "తెలంగాణ తొలితరం కథలు" ఆచార్య దామోదరరావు(కాకతీయ విశ్వవిద్యాలయం) ఇంగ్లీషులోకి అనువాదం చేశారు.

## 1.10 ముదిగంటి సుజాతారెడ్డి–రచనలు

ముదిగంటి సుజాతారెడ్డి దాదాపు కవిత్వం తప్ప మిగతా ప్రధానమైన సాహిత్య ప్రక్రియల్లో తనదైన ప్రతిభను చూపుతూ రచనలు చేస్తున్నారు. సుజాతారెడ్డి ఇప్పటివరకు అన్ని రకాల గ్రంథాలు కలిపి 30 పైగానే ఉన్నాయి. వాటి వివరాలను ఈ కింద క్లుప్తంగా వివరించే ప్రయత్నం చేస్తాను.

### 1.10.1 నవలలు

ఆధునిక యుగంలో ప్రత్యేకమైన సాహిత్య ప్రక్రియలో నవల ఒకటి. నవల మానవ జీవితాన్ని సమగ్రంగా చెపుతుంది. అలాగే, ఒక వ్యక్తి జీవితాన్ని గాని, లేదా జీవితంలోని కొన్ని ముఖ్య ఘట్టాలను చిత్రించడంలో నవల ప్రధాన పాత్ర పోషిస్తుంది. నవల ఏదైనా ఒక విషయాన్ని విస్తారంగా వివరిస్తుంది. అలాంటి నవల సాహిత్యంలో ముదిగంటి సుజాతారెడ్డి తమ వంతు కృషి చేశారు. సుజాతారెడ్డి ఇప్పటివరకు మూడు నవలలను తీసుకువచ్చారు.

### 1.10.1.1 మలుపు తిరిగిన రథచక్రాలు

మలుపు తిరిగిన రథచక్రాలు(1994) నవలలో ముదిగంటి సుజాతారెడ్డి నేపథ్యం ఆమె చిన్ననాటి పరిస్థితులు సామాజిక పరిస్థితులు గ్రహించవచ్చు. ఈ నవల ద్వారా ఆనాటి సామాజిక, ఆర్థిక పరిస్థితులు మరియు సుజాతారెడ్డి రచనా వ్యాసంగం ముఖ్యంగా ఇలాంటి రచనలు చేసేందుకు అప్పటి సామాజిక స్థితిగతులు ఏ విధంగా తోడ్పడ్డాయనే విషయాలు తెలుసుకునేందుకు అవకాశం ఉంది. ముదిగంటివారు తెలంగాణ ప్రజల గతిని మలుపు తిప్పిన ఆనాటి ప్రజల సాయుధ పోరాటాన్ని ఇతివృత్తంగా తీసుకుని ఈ నవలను చిత్రించారు. దీనిలో తెలంగాణలో సాయుధ పోరాటానికి చాలా ప్రముఖమైన స్థానం ఉంది. నిజాంలాంటి నియంతృత్వపాలన నుండి ప్రజలు ఎలా స్వేచ్ఛను సంపాదించుకున్నారు. ఆ తిరుగుబాటు జరిగిన తీరును దీనిలో ప్రతిబింబించేలా చేశారు. ముదిగంటి సుజాతారెడ్డి తెలంగాణ సాయుధ పోరాటాన్ని ఆ సామాజిక పరిస్థితులను చాలా దగ్గరనుండి గమనించిన వ్యక్తిగా ఈ నవల ద్వారా మనం గ్రహించవచ్చు. ముదిగంటి సుజాతారెడ్డి రాసిన *''మలుపుతిరిగిన రథచక్రాలు'' తెలంగాణ సాయుధ పోరాటానికి సంబంధించిన ఇతివృత్తంతోనే సాగిందని"* '1991–2005 తెలుగు నవల–విస్తరించిన వివిధ కోణాలు' అనే వ్యాసంలో జీ. ఎస్ చలం వ్యాఖ్యానించారు. (ఈ–మాట అంతర్జాల పత్రిక:2006)

### 1.10.1.2 సంకెళ్ళు తెగాయి

ముదిగంటి సుజాతారెడ్డి ఈ నవలలో చదువుకోవాలని కోరిక ఉన్న ఒక నిమ్న కులానికి చెందిన యువకుని జీవితం ఆధారంగా తీర్చిదిద్దిన ఒక కథ. ఈ నవల 1994లో రచించారు. దీనికి "నారాయణ విజయం" అనే పేరు కూడా ఉంది. ఈ నవలలో నారాయణ అనే వ్యక్తి జీవిత వృత్తాంతం చిత్రింపబడింది. నారాయణ నిమ్న కులానికి చెందిన యువకుడు. అతనికి చదువుకోవాలనే కోరిక బలంగా ఉండటం వల్ల కులవృత్తిపైన అంత అభిరుచిని కనబరచలేకపోయాడు. నిర్మాణాత్మకం కాని, పరిష్కార మార్గాలు చూపని ఉద్యమాలను, హింసను నారాయణ తీవ్రంగా ఖండిస్తాడు. పట్నంలో తనకు పరిచయమైన వేదప్రకాశ్ మాస్టారు, సహవిద్యార్థిని అనల సహకారాలతో, తాను స్వయంగా సముపార్జించిన విజ్ఞానం, అనుభవాలతో తరతరాల దాస్యాన్ని, కులాల సంకెళ్ళను

తెంచుకొని బయటపడుతాడు. క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, శ్రమసాధనలతో బానిస సంకెళ్ళను తెంచి, ఉన్నత విలువలుగల వ్యక్తులుగా ఎదగవచ్చుననే గొప్ప సందేశం ఈ నవలలో దాగి ఉంది. ఇది సంఘసంస్కరణను బోధించే విధంగా ప్రబోధాత్మకంగా సాగుతుంది. ఒక గ్రామీణ ప్రాంతంలో జన్మించిన వ్యక్తి క్రమశిక్షణ, పట్టుదల, ఆత్మవిశ్వాసం, కష్టపడేతత్వం ఉంటే వీటి ద్వారా బానిస సంకెళ్ల నుంచి విముక్తి పొంది జీవితంలో ఉన్నతమైన విలువలు గల వ్యక్తిగా ఎంతో ఉన్నతస్థాయికి చేరుకోవచ్చనే ఒక మంచి సందేశాన్ని ఇచ్చే నవలగా ఇది పేరు పొందింది.

## 1.10.1.3 ఆకాశంలో విభజన రేఖల్లేవు

ముదిగంటి సుజాతారెడ్డి రచించిన 'ఆకాశంలో విభజన రేఖల్లేవు'(1995) నవల ద్వారా స్త్రీవాద సాహిత్యంలో ఒక కొత్త కోణాన్ని పరిచయం చేశారు. రచయిత స్త్రీవాదులు నమ్మే కొన్ని సిద్ధాంతాలను వాటిలోని లోపాలను ఎత్తిచూపుతూ ఈ నవలను రాశారు. స్త్రీవాదులు ఆర్థికంగా, లైంగికంగా తమ మీద తమకు అధికారం ఏర్పడలంటారు. కానీ, సుజాతారెడ్డిగారు స్త్రీలకు కావాల్సింది అధికారం కాదు తమను తాము ఒక సంపూర్ణమైన వ్యక్తిగా నిలదొక్కుకునే 'వ్యక్తిత్వధైర్యం' పెరగాలి అనే ఒక కొత్త విమర్శనాత్మక దృష్టితో ఈ నవలను చిత్రించారు. ఈ నవల ద్వారా ముదిగంటివారు స్త్రీవాద సాహిత్యాన్ని మరోసారి మొత్తంగా ఒక చర్చకు పెట్టారనుకోవచ్చు.

నవలా శిల్పాన్ని అనుసరించి నవలలో ప్రధానాంగాలు "కథ, కథావస్తువు, పాత్రలు, నేపథ్యం" తులనాత్మక ప్రాధాన్యతను బట్టి ఈ నాలుగు అంగాలు అదే క్రమంలో పరస్పరాశ్రయాలుగా పేర్కొనవచ్చును. ఒకవిధంగా ఈ నవలలో పింగళి లక్ష్మీకాంతంగారు నవలకు ఇచ్చిన ఈ క్రింది నిర్వచనం గ్రహించవచ్చు. "*ఛందస్సునే గాక ఆలంకారిక శైలిని సైతం విసర్జించి, వర్ణనా చమత్కారమునకు, కథానైపుణికి, పాత్ర చిత్రణకు మాత్రమే ప్రాధాన్యము నొసగిన ఆఖ్యానము నవలయైనది. ఇది వచన వాఙ్మయ సరస్వతికి శిరోభూషణము*" (లక్ష్మీకాంతం, పింగళి. సాహిత్య శిల్ప సమీక్ష. 313:1966)

స్త్రీ పురుషుల మధ్య ప్రజాస్వామ్య విలువలతో కలిగిన ప్రేమ, సఖ్య సంబంధాలు ఉండాలని కోరుతూ "ఆకాశంలో విభజన రేఖల్లేవు" అనే నవలను ముదిగంటి

సుజాతారెడ్డి రచించారు. నేటి సమాజంలో స్త్రీవాదులమంటూ వారు నిర్వహిస్తున్న సంస్థల ద్వారా వారు ఏ విధంగా ద్వంద్వ వైఖరులకు లోనవుతున్నారో ఈ నవల ద్వారా విమర్శించారు. రచయిత్రి ఈ నవలలో తాను చూసిన జీవితాలు, అనుభవాలను ఆధారంగా చేసుకుని పాత్రలను సృష్టించారు.

"ఆకాశంలో విభజన రేఖల్లేవు" నవలను కొందరు స్త్రీవాద వ్యతిరేకమని విమర్శించారు. కానీ, డాక్టర్ మృణాళిని వంటి విమర్శకులు ముదిగంటి సుజాతారెడ్డి రచించిన 'ఆకాశంలో విభజన రేఖల్లేవు' నవల మూసపోత ధోరణిని ఛేదించిందని చెబుతూ, స్త్రీ చైతన్యానికి నేపథ్యంగా 'ఆకాశంలో విభజన రేఖల్లేవు' అనే నవలను ముదిగంటి సుజాతారెడ్డి రచించారని, స్టీరియో టైప్ నుండి బయటపడిన స్త్రీల నవలగా డాక్టర్ మృణాళిని తన వ్యాసంలో వ్యాఖ్యానించారు.(భూమిక(రచయిత్రుల ప్రత్యేక సంచిక) ఫిబ్రవరి, 04, 2004).

## 1.10.2 కథాసంపుటాలు

"చందమామ పత్రిక"లో కథలు చదవడం మొదలు నుండి తెలుగు సాహిత్యంలో ప్రసిద్ధి చెందిన కథకుల్లో ఒకరుగా మారడం వరకు ముదిగంటి సుజాతారెడ్డి కథసాహిత్యం చాలా విశేషమైనదిగా చెప్పవచ్చు. తాను రాసిన "గుడిసెలు గుడిసెలు" అనే కథ తనకి ఇష్టమైనదిగా చెబుతూ, కథ అనేది అనుభవంలోంచి పుట్టాలి అని అంటూ, *"రచయిత, కథకుడు తన అనుభవంలోంచి, జీవితంలోంచి కథా వస్తువును తీసుకోవాలి అదే కథకు ఉండాల్సిన ముఖ్య లక్షణం. అప్పుడే అది గొప్ప కథ అవుతుంది. అదే గొప్ప నవల అవుతుంది. కథకుడు తన అనుభవాల నుంచి వస్తువులు తీసుకున్నప్పుడే కథకు వాస్తవికత వస్తుంది. కథ రక్తికడుతుంది. సమకాలీన సమాజానికి వ్యాఖ్యానం అవుతుంది.సమకాలీన జీవితానికి అద్దం పడుతుంది"*(మురళీధారగౌడు,తాళ్ళపల్లి. సాహిత్య మథనం,2016:329) అని ఒక ఇంటర్వ్యూలో కథకు ఉండాల్సిన లక్షణాలను గురించి పై విధంగా చెప్పారు. సుజాతారెడ్డి ఇప్పటివరకు ఐదు కథాసంపుటాలు తీసుకువచ్చారు. అవి

## 1.10.2.1 విసుర్రాయి

ఈ కథ సంపుటిలో స్త్రీల జీవితాల్లో ఉండే సంవేదనను అర్థం చేసుకొని, వారిని అణచివేయడం, వరకట్న సమస్యలు, పురుషాధిక్యత, అవమానం, అసమానతలు చూపించడం వీటన్నింటిని చిత్రిస్తూ కథలుగా రాశారు. ఇది 1998లో ముద్రింపబడింది. స్త్రీల జీవనగాథలను వివరించే "విసుర్రాయి"లో మొత్తం 20 కథలు చోటుచేసుకొన్నాయి. ఈ సంకలనంలో గ్రామీణ స్త్రీల మీద జరిగే దోపిడీ, అన్యాయం, అణచివేతలు, ఆస్తిహక్కు లేకపోవటం, పెండ్లిచూపుల పేరుతో జరిగే అవమానాలు, వరకట్న సమస్యలు, ఇంటా బయటా నిర్ణయాధికారం లేకపోవటం, స్త్రీపురుషుల మధ్య వివక్షతలు మొదలగు సమస్యలనెన్నింటినో కథావస్తువులుగా గ్రహించి స్త్రీ చైతన్యాన్ని కాంక్షిస్తూ ఈ కథా సంపుటిని రచించారు. ముదిగంటివారు ప్రతిక్షణం విరామం లేకుండా ఇంటి పనిని చేసే స్త్రీ జీవన వ్యక్తీకరణకు విసుర్రాయిని ఎన్నుకొని స్త్రీల జీవితానికి ప్రతీకగా రాసిన కథ సంకలనం ఇది. సరళ శిల్పంతో సాగిపోయే సుజాతారెడ్డి ఈ కథలు మౌనంగానే ఎన్నో మౌలిక ప్రశ్నలు పురుష సమాజాన్ని సంధిస్తాయి. ఈ కథలన్నింటిలో లిబరల్ భావజాలం కలిగి ఉండి, ప్రతి స్త్రీ తమపై జరుగుతున్న అన్యాయాలను, అక్రమాలను ఎదుర్కొనే నైతిక బలం సమకూర్చుకోవాలని, సమాజ ఆవశ్యకతకు అనుగుణంగా జీవనం సాగించాలనే సందేశం తెలియజేయబడుతుంది.

"విసుర్రాయి" సంపుటి కథలు గమనించినట్లయితే చాలా కథల్లో స్త్రీ ప్రధాన కేంద్రబిందువు. స్త్రీల జీవితాల చుట్టూ పరచుకున్న కష్టాలు, కడగండ్లు, హింస, అణచివేత, వేధింపు, వివక్ష, దౌర్జన్యం ఎట్లా స్త్రీ జీవితాన్ని దుర్భరం చేస్తున్నాయో, స్త్రీ ఎంత దారుణంగా అన్యాయమై పోతూ ఉందో తెలియజెప్పే కథలే. 'విసుర్రాయి' స్త్రీ శ్రమకు సంకేతం. ముదిగొండ సుజాతారెడ్డి ప్రత్యేకత ఆమె తెలంగాణ భాషను వాడే తీరులో ఉంది. ఎవరి జీవితాలకు సంబంధించిన ఘర్షణను వాళ్ళ భాషలోనే చెబితేనే రచనలు శక్తివంతంగా ఉంటాయి అనడానికి, సుజాతారెడ్డిగారి ఈ కథలే నిదర్శనం. ఈ కథలు వాస్తవంగా నిజాయితీగా ఉన్నాయి. కథల్లో శిల్ప సంబంధమైన సంక్లిష్టత వెతికినా దొరకదు. కథలన్నీ సూటిగా, స్పష్టంగా ఉంటూనే అవసరమైనంత ఘర్షణ కలిగి ఉంటాయి.

### 1.10.2.2 మింగుతున్న పట్నం

రోజురోజుకి పెరిగిపోతున్న పట్టణీకరణ మనుషులను ఎట్లా మింగేసిందో చెప్పేది **'మింగుతున్న పట్నం'** కథాసంపుటి. ఈ కథ సంకలనం 2001 ఆగస్ట్‌లో ప్రచురింపబడింది. నేటి పోటీ ప్రపంచంలో మారుతున్న నైతిక విలువలు మానవ జీవితంలో వస్తున్న మార్పులకు ఈ కథలు మనకు అద్దం పడతాయి. ముఖ్యంగా 'పట్నం–పల్లెటూరు' మధ్య వైరుధ్యం సుజాతారెడ్డి ఈ కథల్లో ఎక్కువగా ప్రతిబింబిస్తుంది. సామాజిక, రాజకీయ, జీవన పరిణామాలకనుగుణంగా మానవ జీవితాల్లో వచ్చే ప్రకంపనాలు, నశించిపోతున్న మానవ విలువలు ఈ కథలల్లో కనిపిస్తాయి. ప్రాచీనకాలంనుంచి భారతదేశంలో అనుసరిస్తున్న విజ్ఞాన కళానైపుణ్యాలు చాలా గొప్పవి. వ్యవసాయశాఖలోగానీ, వివిధ కులవృత్తుల్లోగానీ ఎంతో పనితనాన్ని, నేర్పును నాడు ప్రదర్శించి దేశీయ సామర్థ్యాన్ని పెంపొందించేవారు. కానీ, నేటి బహుళజాతి సంస్థల మార్కెట్ రంగప్రవేశం ద్వారా దేశీయ విజ్ఞాన కళానైపుణ్యాలు నశించిపోతున్నాయి. ఈ మార్పులన్నింటిని చాలా దగ్గర నుంచి గమనించిన అనుభవంతో రాసిన కథలే మింగుతున్న పట్నం కథా సంపుటి. ఈ కథా శిల్ప ప్రయోగాలు మాజిక్ రియలిజం నుంచి పోస్ట్ మాడర్నిజం వరకు వేగంగా మారుతున్న తెలుగు సాహిత్యంలో ఈ కథలు తెలంగాణ స్వభావాన్ని అంతా తేటతెల్లంగా చెప్పినట్లున్నాయి. ఈ కథలన్నీ ఏ మాత్రం సంక్లిష్టత, డొంక తిరుగుడు లేకుండా, స్పష్టంగా సూటిగా రచయిత భావాలను పాఠకులకు చేరవేస్తాయి.

ఆధునికత పెరుగుతున్న నేపథ్యంలో చాలామంది రచయితలు నగ్నమైన పల్లెజీవితాన్ని, పల్లె బతుకుల్ని, పల్లెనుంచి పట్నం వలస వచ్చినవారి జీవితాల్ని అక్షరీకరించడం అంతరించిపోతోంది. కానీ, ముదిగంటి సుజాతారెడ్డిగారు ఈ పల్లె జీవితాల్నే ప్రధాన కేంద్రంగా చేసుకుని ఈ కథ సంపుటిని రాశారు.

### 1.10.2.3 వ్యాపారం మృగం

గడిచిన 35 యేళ్ల కాలంలో తెలంగాణలో వచ్చిన మార్పులు సామాజిక సంబంధాల్లో విస్తృతమైన మార్పులు తెచ్చాయి. రాజకీయ, సాంస్కృతిక, సామాజిక, సంస్కరణోద్యమాలు అన్నీ కలగలిసి ఆర్థిక సంబంధాలను ప్రభావితం చేస్తే అవి మానవ సంబంధాల్లో

మార్పులకు కారణమయ్యాయి. ఈ నేపథ్యాన్ని అంతటినీ చిత్రిక కట్టడం చాలా కష్టమైన పని. వాటిని విభిన్న కోణాల నుంచి అర్థం చేసుకోవడమే కష్టం. అర్థమైన తర్వాత వాటిని సరళమైన రీతిలో వ్యక్తీకరించడం చాలా మరింత కష్టం. సంక్లిష్టమైన అనేక విషయాలను అర్థం చేసుకుంటే తప్ప తెలంగాణ ప్రజల జీవితాల్లో వచ్చిన పెనుమార్పులను సరళంగానూ, సూటిగానూ, నిర్మమకారంగానూ వ్యక్తీకరించగలం. ఈ నేపథ్యంలో చూసినప్పుడు ముదిగంటి సుజాతారెడ్డి 'వ్యాపార మృగం' కథల సంపుటి ఇందుకు ఒక గొప్ప ఉదాహరణ.

ఈ కథాసంపుటిలో 1991లో వచ్చిన ఆర్థిక సరళీకరణ విధానాల వల్ల ఏర్పడిన ప్రపంచీకరణ దాని ప్రభావం, నేటి మనుషులు, వారి మనస్తత్వాలు ఏ విధంగా ఉన్నాయో చెప్పగలిగారు. ఇది 2005లో ప్రచురించబడింది. ప్రపంచీకరణ ముసుగులో ఒక దేశాన్ని మరో దేశం దోచుకోవడం తప్ప మరొకటి లేదు. దీని ఫలితంగా ఏర్పడిన దుష్ఫలితాలను ఈ కథలను బట్టి అర్థం చేసుకోవచ్చు. ప్రపంచీకరణ. వ్యాపార సంస్కృతిలో బలంగా వచ్చిన మార్పుల ప్రభావం సాహిత్యంపై ఎంతగానో ఉంది. దీన్ని ముదిగంటి సుజాతారెడ్డి కథావస్తువుతో, ప్రతీకల అనుబంధంతో ఈ కథలు చిత్రించారు. ఈ కథా సంపుటిలో స్త్రీల, మైనారిటీ వేదనలను, వారి సామాజిక, జీవన సమస్యలను తెలియజేసే కథలు ఎక్కువగా ఉన్నాయి.

## 1.10.2.4 మరో మార్క్స్ పుట్టాలె

ముదిగంటి సుజాతారెడ్డి రాసిన మరో భిన్నమైన కథల సంపుటి ఇది. దీనిని 2010లో పుస్తక రూపంలో తీసుకువచ్చారు. ఈ కథా సంపుటంలో మొత్తం 14 కథలు ఉన్నాయి. దీనిలో ప్రస్తుతం సమాజంలో జరుగుతున్న రియల్ ఎస్టేట్ మోసాలు, సాఫ్ట్ వేర్ ఉద్యోగస్తుల బాధలు అలాగే, మరికొన్ని స్త్రీలకు సంబంధించిన కథలతో ఈ పుస్తకాన్ని విభిన్న శైలిలో చింత్రించారు. వివిధ జీవన సమస్యలు, వాటికీ తగిన ఇతివృత్తాలతో రచించిన ఈ కథల ద్వారా రచయితలోని వస్తువైవిధ్యాన్ని తెలుసుకోవచ్చు. బయటకి అందంగా కనిపించే సాఫ్ట్వేర్ సమాజంలో అంతర్గతంగా జరుగుతున్న దోపిడికి ఈ కథలు అద్దం పడతాయి. *"ఈ కథల్లో అత్యధికభాగం కొత్తజీవిత పార్శ్వాలను చిత్రించిన, విశదీకరించిన, విశ్లేషించిన కథలు. ఈ పద్నాలుగు కథల్లో పది కథల ఇతివృత్తాలు పూర్తిగా*

*కొత్తవి, కనీసం ఇరవై ఏళ్ల కింద ఉండడానికి అవకాశం లేనివి. ఈ ఇతివృత్తాలు తెలుగు సమాజంలోకి కొత్తగా ప్రవేశించిన జీవనరంగాలకు, వృత్తులకు, వాటివల్ల మానవసంబంధాలలో వచ్చిన మార్పులకు సంబంధించినవి. మూడు నాలుగు కథలలో వస్తువు స్త్రీల సమస్యలకు సంబంధించినది గాని అవి కూడ పాతకథలు కావు. ఆ కథలలో చిత్రణ పొందిన స్త్రీల సమస్యలు గతకాలపు స్త్రీల సమస్యల లాంటివి కావు. అవి ఇటీవలి సామాజిక మార్పులతో ప్రభావితమైన స్త్రీలసమస్యల గురించిన కథలు. బహుశా పాతపద్ధతిలో నడిచిన కథ ఒకేఒకటి, రాజకీయ లబ్ధికోసం కన్నకొడుకును కూడ బలిపెట్టే దుర్మార్గం గురించినది. కాని అక్కడ కూడ రాజకీయ వ్యాపారం మానవసంబంధాలను ఎట్లా ధ్వంసం చేస్తున్నదో కొత్త కోణాన్ని ఆవిష్కరించడానికే రచయిత్రి ప్రయత్నించారని" ఈ* కథ సంకలనానికి ముందుమాట రాసిన వేణుగోపాల్ గారు మానవసంబంధాల ఆర్ద్రతను ముదిగంటి సుజాతారెడ్డి గారు ఏ విధంగా ఈ కథ సంపుటిలో చిత్రించారో విశ్లేషించారు.

## 1.10.2.5 నిత్యకల్లోలం

సుజాతారెడ్డిగారు రాసిన 'నిత్యకల్లోలం'(2017) కథాసంపుటిలో సమాజంలో నూతనంగా వస్తున్న వివిధ ఆలోచన ధోరణులు గల కథలు, బడుగురైతుల సమస్యలు, పట్టణాలకు వలసపోతున్న గ్రామీణుల ఆవేదనలు, ఆధునికత మూలంగా మనిషి జీవితంలో ఏర్పడుతున్న సంఘర్షణ, చదువుల వల్ల యువత ఆలోచన ధోరణిలో వచ్చే మార్పులు, నిరాదరణకు గురవుతున్న వృద్ధుల వ్యథలు, నగరీకరణ పెరిగిపోతున్న కారణంగా పుట్టుకొస్తున్న విషఫలాలు, చదువుల బరువులు లేతవయస్కులలో కలిగిస్తున్న సంక్షోభాలు మొదలైన వాటిని ప్రతిబింబించే కథలున్నాయి. మొదటితరం నుండి నేటి ఆధునికానంతరతరం వరకు ఒక వారధిలాగా అన్ని మార్పులను గమనిస్తూ సునిశిత పరిశీలన దృక్పథంతో రాసిన కథలు ఇవి. ముఖ్యంగా ముదిగంటివారు 'నిత్యకల్లోలం' కథా సంపుటిలో స్త్రీల జీవితానికి సంబంధించిన అనేక కోణాల్ని చిత్రించారు. ఈ కథలన్నీ సామాజిక, రాజకీయ, ఆర్థిక మార్పులు పరిణామాల వల్ల సమాజంలో ప్రజల జీవితాల్లో జరుగుతున్న సంఘటనలను, వృత్తాంతాలను చిత్రించాయి. నేటి అభివృద్ధి నమూనా, సాంకేతిక ప్రగతి కళ్ళు జిగేలుమనిపిస్తున్నాయి. అదే సమయంలో కంటనీళ్ళు

పెట్టిస్తున్నాయి. ఆర్థిక అసమానతల వైరుధ్యం ఒకవైపు, చేతికందిన ఫలాలు, ప్రశాంతతను చెదరగొట్టడం మరోవైపు కనిపిస్తుంది. ఈ సంక్షిప్తతకు అద్దం పట్టేవే 'నిత్య కల్లోలం' కథలు. ఈ కథలు ఒకదాని వెనుక మరొకటి చదివేసరికి ఒక రకమైన సామాజిక పరిణామం కనపడుతుంది. భవిష్యత్తుకు ఇదొక చారిత్రక వనరు.

*"సాధారణ ఎత్తుగడతో మొదలయి పాఠకుణ్ణి తన వెంట లాక్కుపోయే శైలి సుజాతారెడ్డిగారి కథా సంవిధానం. బరువైన మాటలుండవు. మామూలుగా ఏదో ముచ్చట చెబుతున్నట్టుగానే కథని మొదలు పెడతారు. ఆ ముచ్చటలోకి అనాయసంగా పాఠకులు ప్రవేశిస్తారు. ఆయా పాత్రల ఉద్వేగాల, సంస్పందనల వెంట ప్రయాణిస్తారు. ఈ కారణంగానే సుజాతారెడ్డిగారి కథలు చదవడం మంచి సృజనానుభవం"* (నిత్యకల్లోలం.2018:5). అని గుడిపాటిగారు నిత్యకల్లోలం కథల్లోని శైలిని గమనిస్తూ అయన అభిప్రాయాన్ని తెలియజేశారు. నిత్యకల్లోలం కథలోని సమస్యలు అన్నీ ఒక్క దగ్గర కుప్పపోసినట్లు కనపడతాయి. ఈ కథల్లో తెలంగాణ చరిత్రలోని ఒక ప్రధాన, గుణాత్మక మార్పును ప్రతీకాత్మకంగా చెప్పిన కథ 'నాటువడ్ల వరిమొక్కలు'. పల్లెల్లోంచి దొరలను పంపించిన వైనం, వారు పట్నంలో కష్టించి ఎదిగిన క్రమం అంతా పూసగుచ్చినపట్లు చెప్పింది. ఆ సందర్భంలోనే ఆనాటి సంఘటల్ని, జీవితాల్ని చిత్రించారు. వీటిలో తెలంగాణ భాష కథలో సజీవంగా తొణికిసలాడింది. కథ ఎత్తుగడనే పాఠకుణ్ణి ఆకర్షించే విధంగా ఉంది. ఈ కథల చిత్రీకరణ జ్ఞాపకాలు, వర్తమానం కలగలిసి కథ సాగటం వల్ల చరిత్ర దృశ్యమానమయింది. ముచ్చట పెడుతున్నట్లుగా సాగిన కథలోని పాత్రల సుఖదుఃఖాలలో పాఠకుడు మమేకం అయ్యేటట్లు ముదిగంటి సుజాతారెడ్డిగారు చేశారు.

### 1.10.3 సంపాదకత్వం

ముదిగంటి సుజాతారెడ్డి తమ రచన కాలంలో ఇప్పటివరకు కొన్ని రకాల పుస్తకాలకు సంపాదకత్వ బాధ్యతలు వహించారు. వాటిలో తెలంగాణ ప్రాంతపు కథ రచయితలను వెలికితీసే ప్రయత్నంలో భాగంగా సంపాదకత్వంలో వచ్చిన కొన్ని కథ సంపుటాలు ముదిగంటి సుజాతారెడ్డికి విశేషమైన గుర్తింపును తెచ్చిపెట్టాయి.

## 1.10.3.1 తెలంగాణ తొలితరం కథలు

తెలంగాణ తొలితరం కథలు(2002) పేరుతో వచ్చిన ఈ కథా సంకలనాల్లో తెలంగాణ కథ 1970 ప్రాంతంలో వచ్చిన వాదన సరైంది కాదని 1910లో వచ్చిందని తెలియజేస్తూ, సుజాతారెడ్డి దీన్ని రెండు భాగాలుగా ప్రచురించారు. ఈ సంకలనంలో మొత్తం 35 మంది కథకుల కథలున్నాయి. తెలంగాణాలో మొదటితరం నుంచే మంచి శిల్పంతో కథలు వచ్చాయనే విషయాన్ని ప్రస్తావిస్తూ, తెలంగాణ ప్రాంతంలోని తొలితరం కథలను వాటి గొప్పతనాన్ని సాహిత్య లోకానికి ఈ గ్రంథం ద్వారా పరిచయం చేశారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర పోరాటకాలంలో ముదిగంటి సుజాతారెడ్డిగారు 'తెలంగాణ తొలితరం కథలు' ప్రచురించి తెలంగాణ కథల ప్రాచీన్యాన్ని తెలిపి తెలంగాణ అస్తిత్వం ఎంత గొప్పదో, ఎంత ప్రాచీనమో తెలిపారు.

తెలంగాణాను చీకటి ఖండం అని నిందించిన కాలంలో తెలంగాణా సాహిత్యం ప్రయత్న పూర్వక విస్మరణకు గురైన కాలంలో వచ్చిన సంకలనం ఇది. తెలంగాణకు ఇదొక ఆత్మగౌరవ ప్రతీక. ఈ అంశాన్ని గురించి పీఠికాకర్తలు చర్చించారు. ఈ పొత్తం ద్వారా నాటి సామాజిక పరిస్థితులను అవలోకనం చేసుకోవడనానికి వచ్చిన ఒక గొప్ప ప్రయత్నంగా చెప్పవచ్చు. 'తెలంగాణా తొలితరం కథలు' అనే కథాసంకలన గ్రంథంలో 35 కథలను మాత్రమే తీసుకోవడం జరిగింది. ఇందులోని కథలు  కొన్ని చారిత్రకం, మరికొన్ని సాంఘీకం, కాల్పనికం, రాజకీయం మొదలైన ఇతివృత్తాలతో కూడుకొని, వస్తువైవిధ్యంతో విభిన్నంగా ఉన్నాయి. "*చెల్లాచెదరుగా ఎక్కడెక్కడో ఉన్న కథలను ఇప్పుడు ఒకచోట పెట్టి, తెలంగాణా తొలితర కథలుగా చూపినప్పుడు మనకు తెలియని మన చరిత్ర మరింత స్పష్టంగా ఆవిష్కృతమవుతున్నది. తెలంగాణా తనను తాను దేవులాడుకుని, తనను తాను తిరిగి కనుగొంటున్న కాలం ఇది. కాలం ఇచ్చిన ఆ బాధ్యతను ఎంతో వినమ్రతతో, బాధ్యతతో చేపట్టారు సుజాతారెడ్డి పుట్టిన నేలమీద  ప్రేమ, అకడమిక్ క్రమశిక్షణ కలిసి ఈ సంకలనాన్ని సాధ్యం చేస్తున్నాయి. తెలంగాణ కథాసాహిత్యచరిత్ర నిర్మాణానికి ఈ సంకలనం సాటిలేని దోహదం చేస్తుంది. ఇటువంటి ప్రయత్న తెలంగాణా సాహిత్యోద్యమంలో ఇదే ప్రథమం*". అని ఈ గ్రంథ ప్రాముఖ్యతను ముందుమాటలో

వివరిస్తూ కె.శ్రీనివాస్ తెలంగాణ తన చరిత్రను తాను పున:నిర్మించుకుటుందని అభిప్రాయాన్ని వెలిబుచ్చారు.

## 1.10.3.2 తొలినాటి కతలు (తెలంగాణ తొలితరం కథలు–రెండవ భాగం)

తొలినాటి కతలు పేరుతో 'తెలంగాణ తొలితరం కథలు'(2005) అనే గ్రంథానికి రెండవ భాగంగా సంగిశెట్టి శ్రీనివాస్ తో కలిసి ముదిగంటి సుజాతారెడ్డి ఈ సంకలనాన్ని తీసుకువచ్చారు. దీనిలో నాటి తెలంగాణ ప్రజల గ్రామీణ, మధ్య తరగతి జీవితాన్ని చిత్రించే 46 కథలు ఉన్నాయి. ఇరవయ్యో శతాబ్దంలోని తొలి రోజుల్లో తెలంగాణ ప్రాంతంలోని సామాజిక స్థితిగతులను అప్పటి చరిత్రను తెలుసుకోవడానికి కావాల్సిన కథలు ఈ కథ సంకలనంలో చిత్రింపబడ్డాయి. ఈ గ్రంథ మొదటి భాగంలో 1912వ సంవత్సరంలో మాడపాటి హనుమంతరావుగారి **'హృదయశల్యం'** అనే కథ నుండి మొదలుకొని 1956వ సంవత్సరం వరకు గల రచయితల కథలను సేకరించి ముద్రించారు. కానీ, ఈ గ్రంథంలో ఇంకొంచెం ముందుకు వెళ్ళి 1910వ సంవత్సరంలోనే కొమర్రాజు వేంకట లక్ష్మరావు గారి **'ఏబదివేల బేరము'** అనే కథ నుండి మొదలుకొని 1956వ సంవత్సరం వరకు గల రచయితల కథలను సేకరించి రెండవ భాగంగా ముద్రించారు.

సంగిశెట్టి శ్రీనివాస్ సేకరించిన కథలను పరిశీలించి రచయిత్రి ఇంకా కొన్ని కథలను కూడా సేకరించి వాటిల్లో నుంచి మంచి కథలను, సాహిత్య స్పృహతో గాని, రాజకీయోద్యమ స్పృహతో గాని వున్నటువంటి రచయితల కథలను ఎంపిక చేసి **'తొలినాటి కతలు'** అన్న పేరుతో ప్రచురించారు. ఈ సంకలనంలో కథల్లో జీవకళ ఉట్టి పడ్తుంటుంది. ప్రజా జీవితాన్ని చిత్రించే సత్య సంఘటనలకు దగ్గరగా ఉండేటట్లుగా కథా రచయితలు తమ కథల్లో సన్నివేశాలను ప్రదర్శించారు. కల్పితేతివృత్తాలకు, ఊహజనిత ఇతివృత్తాలకు దూరంగా ఉన్నారు.

## 1.10.3.3 జైలులోపల కథలు

ముదిగంటి సుజాతారెడ్డి సంపాదకత్వంలో వచ్చిన మరొక గ్రంథం "జైలు లోపల కథలు"(2009). మొదట వీటిని వట్టికోట ఆళ్వారుస్వామి 1951లో జైలు నుంచి విడుదలయిన కొద్దికాలానికే గ్రంథమాలను పునరుద్ధరించి తన కథల సంపుటి

ప్రచురించారు. అప్పటినుండి మరో ముద్రణకు నోచుకోలేని ఆళ్వారుస్వామి కథలను మరోసారి 2015లో సుజాతారెడ్డి తన సంపాదకత్వంలో ప్రచురించారు. వట్టికోట రాసిన కథలు ఆయన స్పృశించిన అనేక సామాజిక పార్శ్వాలను ప్రతిబింబిస్తాయి. జైలులో ఆళ్వారుస్వామికి ఎదురైన అనుభవాలు, ఆయనకు భావసహచరులు, పోరాటవాదులు అనేక మందిని కలిసిన అనుభవాల సమ్మిళితమే జైలులోపల కథలు. అంతేకాకుండా వివిధ అంశాలపై ఆయన ఎట్లా ఆలోచించారో చెబుతూ సమగ్రమైన ఆయన వ్యక్తిత్వాన్ని, ఆయన ఆలోచనాసరళిని అర్థం చేసుకోవడానికి ఈ కథలు ఉపయోగపడతాయి. వట్టికోట ఆళ్వారుస్వామి రచనలన్నీ నిజ జీవితంలో తాను చూసిన, అనుభవించిన, ఎదుర్కొన్న సమస్యలు వంటి వాటిని ఇతివృత్తాలుగా స్వీకరించి రచనలు చేశారు. జైలు జీవిత అనుభవాలతో "జైలులోపల" కథలు రాశాడు. ఖైదీల మనస్తత్వాలను అందులో వర్ణించాడు. జైళ్ల సంస్కరణ అవశ్యకతను అందులో తెలియజేశాడు.

### 1.10.3.4 నూరేండ్ల తెలుగు కథలు

తెలుగు కథను మరింత విస్తృతపరిచే నేపథ్యంతో, కథా శతాబ్దం జరుపుకుంటున్న సందర్భంలో పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ముదిగంటి సుజాతారెడ్డి సంపాదకత్వంలో ***"నూరేళ్ల తెలుగు కథలు"*****(2010)** అనే పేరుతో ఒక సంకలనం తీసుకువచ్చింది. దీనిలో 121 మంది తెలుగు కథకుల కథలు ఉన్నాయి. వంద సంవత్సరాలలో వచ్చిన అనేక కథల్లో కొన్ని కథలను ఎన్నుకొని దీన్ని ఒక గొప్ప ప్రయత్నంలో భాగంగా తీసుకువచ్చారు. ఈ గ్రంథంలో బండారు అచ్చమాంబ, మాడపాటి, గురజాడ అప్పారావు వంటి ఎంతోమంది గొప్పవారు. పాలగుమ్మి, తిలక్ వంటి రెండవతరం కథకులు కొలకలూరి ఇనాక్ వంటి మూడవ తరం రచయితలు స్కైబాబా, కూర్మనాథ్ వంటి ఈ తరం రచయితల కథలు ఉన్నాయి.

### 1.10.3.5 ఇల్లిందల సరస్వతీదేవి ఉత్తమ కథలు

తెలుగు సారస్వతంలో వ్యాసాలు, రేడియో ప్రసంగాలు, కథలు, నవలలు వంటి ఎన్నో ప్రక్రియల్లో రచనలు చేసినవారు ఇల్లిందల సరస్వతీదేవి. అలాగే, సరస్వతీదేవి వందకు పైగా కథలు రచించారు. వీటన్నింటిలో కొన్ని ముఖ్యమైన వాటిని సేకరించి ముదిగంటి

సుజాతారెడ్డి **"ఇల్లిందల సరస్వతీదేవి ఉత్తమ కథలు"** పేరుతో 2016లో ముద్రించారు. సరస్వతీదేవి కథల్లో ముఖ్యంగా మనకు తెలంగాణ ప్రాంతంలోని నిజాం నిరంకుశత్వానికి వ్యతిరేకంగా పోరాటం చేయడానికి సంబంధించిన రచనలు, మరోకవైపు సంఘసంస్కరణ కార్యక్రమాలకు సంబంధించిన పునర్జీవన ఉద్యమం, స్త్రీలకు మరియు మధ్యతరగతి ప్రజలకు సంబంధించిన ఎన్నో విషయాలు ఈ కథల్లో కనిపిస్తాయి. ఇల్లిందల సరస్వతీదేవి వందలాది కథలు రచించారు. ఆమె తన రచనా వ్యాసంగం కథానికలతో ప్రారంభమైందని చెప్పుకున్నారు. సరస్వతీదేవి మొదటి కథ "పితృహృదయం" అది రేడియోలో చదివారు. ఈ కథ తర్వాత "భారతి" ప్రసిద్ధ మాసపత్రికలో 1943లో అచ్చయింది. రేడియోలో చదివిన, వార పత్రికలలో అచ్చయిన నూరు కథలను 1981లో "స్వర్ణ కమలాలు" పేరుతో పుస్తకంగా అచ్చువేశారు. తర్వాత నూట ఎనిమిది కథలతో "తులసిదళాలు" మూడు సంపుటాలుగా 1994లో అచ్చు వేశారు. ఇల్లిందల సరస్వతీదేవి 'స్వర్ణ కమలాలు' కథల సంపుటిని 1982లో ప్రచురించారు. ఆమెకు కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం ఈ సంపుటి వలనే లభించింది. ఆ తర్వాత ఐదు పెద్ద కథలతో "రాజహంసలు" కథల సంపుటి ప్రచురింపబడింది. యువ మాసపత్రికలో అచ్చయిన ఒక పెద్ద కథను "చందన" పేరుతో పుస్తకంగా ప్రచురించారు.

సంస్కరణవాద కుటుంబంలో పుట్టిపెరిగిన మహిళా ఉద్యమ నాయకురాలు, చిరస్మరణీయురాలు ఇల్లిందల సరస్వతీదేవి. సమకాలీన తెలంగాణ ఉద్యమంతో ప్రభావితురాలైన ఆంధ్ర యువతీమండలి వ్యవస్థాపక సభ్యురాలు. వెలకట్టలేని అపార విజ్ఞానాన్ని ముందు తరాలకు ఆమె సమకూర్చివెళ్ళారు. ఆమె ప్రసిద్ధ నవల 'నీ బాంచను కాల్మొక్త' సహా పదమూడు నవలల్లో స్త్రీ సమస్యలు, మధ్యతరగతి జీవితాన్ని, సంకెళ్ళలో ఉన్న స్త్రీ జీవితాలను ఆవిష్కరించిన రచయిత్రి. ఆమె రాసిన వందలాది కథల్లో ఎంపిక చేసిన 25 కథల సంకలనమిది. డా.ముదిగంటి సుజాతారెడ్డి సంపాదకత్వంలో వెలువడిన ఈ సంకలనంలోని కథలన్నీ జీవితాలను కళ్ళముందు ఆవిష్కరించడమే కాదు, ఆదర్శజీవిత మార్గాల్ని కూడా తెలియజేస్తాయి.

### 1.10.3.6 తెలంగాణ రచయిత్రుల కథలు

శతాధిక రచనల సమాహారం 'తెలంగాణ రచయిత్రుల కథలు' పేరుతో వచ్చిన పుస్తకం ముదిగంటి సుజాతారెడ్డి పర్యవేక్షణలో వచ్చిన గ్రంథం. ఇది అనిశెట్టి రజిత సంపాదకత్వంలో 2017లో ముద్రించబడింది. తెలంగాణ సాహిత్య నిర్మాణానికి, ప్రత్యేకించి స్త్రీల సాహిత్య చరిత్ర నిర్మాణానికి బహుముఖాలుగా జరుగుతున్న కృషిలో ఒక భాగంగా వెలువడిన ఈ సంకలనం, తెలంగాణ సాహిత్య చరిత్రలో ఒక చారిత్రక, సాంస్కృతిక ప్రాధాన్యతను పొందింది. 1902 వచ్చిన భండారు అచ్చమాంబ కథతో ప్రారంభించి 2017లో వచ్చిన పద్మకుమారి కథ వరకు నూట పదిహేనేళ్ల కాలంలో వచ్చిన 120 మంది తెలంగాణ రచయిత్రులను గుర్తించిన కథాసంకలనం ఇది. తమని తాము వెతుక్కునే అస్తిత్వ ప్రయత్నంలో ఉన్న తెలంగాణ కథాసాహిత్యానికి ఈ సంకలనం గొప్ప నిదర్శనంగా నిలుస్తుంది.

### 1.10.3.7 వ్యాపార సంస్కృతిలో స్త్రీ చైతన్యం

ప్రస్తుతతరంలో సమాచార సేకరణ మనిషి జీవితంలో ఒక ప్రధాన భాగమైపోయింది. ఆ సమాచార సేకరణ కూడా వస్తు వినిమయం కోసమే జరుగుతూ ఉంది. వ్యాపార సంస్కృతిలో మనిషి ఒక మరమనిషిగా మారిపోతున్నాడు. ఈ క్రమంలోనే పురుషులు, స్త్రీల జీవితాల్లో అనూహ్యామైన మార్పులు సంభవిస్తున్నాయి. మరి ముఖ్యంగా స్త్రీల రోజువారీ జీవితాల్లో అనేక రకాల మార్పులు చోటుచేసుకుంటున్నాయి. వస్తు సంపద ముందు మనుషులు తమ అస్థిత్వాన్నే కోల్పుతున్న సమయంలో స్త్రీలు ఎదుర్కుంటున్న సమస్యలను, వారు అర్థం చేసుకోవాల్సిన కొన్ని విషయాలను ప్రస్తావిస్తూ తెలుగు విశ్వవిద్యాలయంవారు నిర్వహించిన సెమినారులో ముదిగంటి సుజాతారెడ్డి ***'వ్యాపార సంస్కృతిలో స్త్రీ చైతన్యం'(2002)*** అనే అంశంపై సమర్పించిన ప్రసంగానికి పుస్తక రూపం ఈ గ్రంథం.

### 1.10.4 యాత్రాచరిత్రలు

సంచారమన్నది మనిషి సహజ ప్రవృత్తి అయినపుడు తాము చేసిన ప్రయాణాల అనుభవాలను అక్షరరూపంలో నిక్షిప్తం చేయడమన్నది కూడా సహజంగానే జరిగింది. అలా

వచ్చినవే యాత్రాచరిత్రలు. తెలుగులోని అనేకానేక ప్రముఖ రచయితలు తమతమ యాత్రల గురించి పుస్తకాలో వ్యాసాలో రాశారని చెపితే నమ్మటం కష్టమేగానీ అది వాస్తవం. ఒక ప్రత్యేక వ్యాసంగానో, తమ ఇతర అనుభవాల్లో భాగంగానో, కొన్నిసార్లు యాత్రాగ్రంథంగానో సుప్రసిద్ధ రచయితలందరూ తమ యాత్రల గురించి రాశారు. ఏనుగుల వీరాస్వామికన్నా ఎనిమిదేళ్ళు ముందుగా, 1822లో వెన్నెలకంటి సుబ్బారావు తాను చేసిన కాశీయాత్ర గురించి తన ఆత్మకథలో రాశారు. అది 1873లో ఇంగ్లీషులోనూ 1976లో తెలుగులోనూ వెలుగు చూసింది. అలాగే, చెల్లపిళ్ల వేంకటశాస్త్రి తన 1889 నాటి కాశీయాత్రను 1934లో గ్రంథస్థం చేశారు. కందుకూరి వీరేశలింగం, కాళోజీ నారాయణరావులు తమ జ్ఞాపకాలలో తమ తమ బొంబాయి ప్రయాణాల గురించి రాశారు. శ్రీశ్రీ, రావూరి భరద్వాజ, ఆరుద్ర, సోమసుందర్, అక్కినేని నాగేశ్వరరావు, సినారె, ఎన్. గోపి, వాసా ప్రభావతి, ఎండ్లూరి సుధాకర్, అంపశయ్య నవీన్, కవనశర్మ, మధురాంతకం నరేంద్ర, వాడ్రేవు చినవీరభద్రుడు, పరవస్తు లోకేశ్వర్, ఎమ్. ఆదినారాయణ, మల్లాది వేంకటకృష్ణమూర్తి లాంటివాళ్ళు తమ విదేశీ యాత్రల గురించి పుస్తకాలు రాశారు. గురజాడ, చలం, బుచ్చిబాబు, అడవి బాపిరాజు, ఆచంట జానకిరామ్, శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి, దాశరథి, ఉప్పల లక్ష్మణరావు, చిలకమర్తి లక్ష్మీనరసింహం, దర్శి చెంచయ్య, ఆదిభట్ల, పర్వతనేని ఉపేంద్ర, ఆలూరి భుజంగరావు, తిరుమల రామచంద్ర, అందెశ్రీ, సంజీవదేవ్ లాంటి ప్రముఖులు తమ స్వీయ చరిత్రలలోనూ డైరీలలోనూ యాత్రల గురించి హృద్యంగా రాశారు. త్రిపురనేని, భానుమతి, మాలతీచందూర్, టంగుటూరి సూర్యకుమారి, షేక్ నాజర్ లాంటివాళ్ళూ తమ యాత్రానుభవాలను అక్షరబద్ధం చేశారు.

*"కథాసాహిత్యానికి గురజాడ 'దిద్దుబాటు' ఎలాంటిదో యాత్రాసాహిత్యంలో ఏనుగుల వీరాస్వామి కాశీయాత్ర చరిత్ర అలాంటిదని"* 'తెలుగులో యాత్రాసాహిత్యం' వ్యాసంలో దాసరి అమరేంద్ర వ్యాఖ్యానించారు. (ఈ–మాట అంతర్జాల పత్రిక:జూన్, 2017) ఏనుగుల వీరాస్వామి 'కాశీయాత్ర చరిత్ర'(1838)తో ప్రారంభమయిన తెలుగు యాత్రచరిత్ర సాహిత్యం, నేడు అక్షరరూపంలోనే కాకుండా దృశ్యరూపంలో ఆ విశేషాలను యూట్యూబ్ వంటి సామాజిక మాధ్యమాలలో ఉంచే విధంగా మార్పులు చెందింది. అటువంటి

యాత్రలను అక్షరబద్ధం చేసిన కొద్దిమంది సాహిత్యకారుల్లో ముదిగంటివారు గుర్తించదగినవారు. ముదిగంటి సుజాతారెడ్డి తన జీవితకాలంలో అనేక ప్రాంతాలను, వివిధ దేశాలను సందర్శించి, అక్కడ యాత్ర విశేషాలు ఆ ప్రాంత ప్రత్యేకతలను, సామాజిక అంశాలను విశ్లేషిస్తూ ఈ రచనలు చేశారు.

### 1.10.4.1 నైలు నదీ నాగరికత(ఈజిప్టు యాత్రా కథనం)

*బలవంతులు దుర్బల జాతిని బానిసలను గావించిరి*
*నరహంతలు ధరాధిపతులై చరిత్రమున ప్రసిద్ధికెక్కిరి*
*నైలునదీ నాగరికతలో సామాన్యుని జీవనమెట్టిది?*
*తాజమహల్ నిర్మాణానికి రాళ్ళెత్తిన కూలీలెవ్వరు?*

అనే గీతంలో చరిత్రకి ఒక కొత్త నిర్వచనం చెప్పిన శ్రీ శ్రీ (మహా ప్రస్థానం, దేశ చరిత్రలు) ప్రపంచంలోనే ప్రాచీనమైన నాగరికతలో ఒకటిగా నిలిచే నైలునదీ నాగరికతలోని అంతర్గతంగా ఉండే చరిత్రను గుర్తించాడు. అలాంటి చారిత్రక ప్రదేశాన్ని ముదిగంటి సుజాతారెడ్డి దర్శించారు. ఇప్పటివరకు వెలసిన అతి ప్రాచీనమైన నాగరికతల్లో ఈజిప్టులోని నైలునదీ నాగరికత ఒకటి. ఇది దాదాపు 3000 సంవత్సరాల క్రితం ఏర్పడినట్లు చరిత్రకారులు భావిస్తారు. ముదిగంటి సుజాతారెడ్డి 2006లో జనవరి 11 నుండి 21 వరకు ఈజిప్టు యాత్ర చేసి అక్కడి విశేషాలను చారిత్రిక నేపథ్యాన్ని జోడించి ఈ యాత్ర కథన రూపంలో అందించారు. పిరమిడులు, దేవాలయాలు, ప్రాచీన నిర్మాణాలు, అక్కడి ప్రజల జీవన విధానం, అప్పటి రాజరిక వ్యవస్థ, ఈజిప్టులోని వ్యవసాయ పద్ధతులు ఇలా అనేక విషయాలను ఈ గ్రంథంలో సుజాతారెడ్డి చర్చించారు.

ఈజిప్టు గురించి అక్కడి ప్రజల వ్యవహార విషయాల గురించి చేసిన చాలా సూక్ష్మ పరిశీలన ఈ గ్రంథంలో మనకు ఈ యాత్రా చరిత్రలో తెలుస్తుంది. ముఖ్యంగా ఈజిప్టు ఎక్కువగా అరబిక్ భాషను వాడుతున్నారని చెబుతూ తాను అక్కడ పర్యటించిన రోజుల్లో తాను నేర్చుకున్న 'ఎలాబీనా'(పోదాం) 'ఐవా'(అవును) 'షుక్రన్'(ధన్యవాదాలు) కొన్ని అరబిక్ పదాలను చర్చిస్తూ వీటిలో గల అన్యదేశ్యాల పదాల గురించి కూడా చర్చించారు.

చివరగా ఈజిప్టు గొప్ప చరిత్రానంత వివరిస్తూ గొప్ప చరిత్ర కలిగిన ఈజిప్టు అరబ్స్, టర్కీల దండయాత్రలతో వారి ప్రాచీన అస్తిత్వాన్ని కోల్పోయిన విషయాన్ని తెలియజేశారు.

**"యూనాన్ ఓ మిస్ ఓ రూమా**

**సబ్ మిట్ గయే జహాఁ సే**

**అబక్ మగర్ హై బాకీ**

**నామో నిషాం హమారా**

**కుచ్ బాత్ హై కె హస్తి**

**మిట్ థీ నహీ హమారీ**

**సదియోఁ రహా హై దుష్మన్**

**దౌరే జమాఁ హమారా!..."**

*"ఈ ప్రపంచంలో యూనాని(గ్రీకు), మిస్ (ఈజిప్టు), రోమన్లు అందరూ తుడుచుకొనిపోయారు. కానీ, మన భారతదేశం పేరు, మన ఉనికి ఇంకా మిగిలి ఉంది! దీని మట్టిలో ఏదో శక్తి ఉంది! యుగాల నుంచి శత్రువులు దీని మీదికి దండెత్తి వస్తున్నారు. కానీ, దీని అస్తిత్వం మాత్రం నశించకుండా ఉంది!"* (నైలునదీ నాగరికత 2006:61) అని ఈజిప్టును చూసిన తర్వాత దాని చరిత్రతో పోలిస్తే మనదేశాన్ని తలచుకొని మనకున్న గొప్ప చారిత్రక వారసత్వం ఇంకా అలాగే, కొనసాగుతుందని గర్విస్తూ ఇక్బాల్ మహాకవి **'తరానా ఏ హింద్'** గేయంలో రాసిన పై పంక్తులు గుర్తుకు తెచ్చుకుని ఈ యాత్రాకథనాన్ని ముగించారు.

## 1.10.4.2 లద్దాఖ్ యాత్రా కథనం

జమ్మూ కాశ్మీర్ లోని లద్దాఖ్ వెళ్ళినప్పుడు పరిశీలించిన అంశాలతో కలిపి 'విశిష్ట సంస్కృతికి నిలయం లద్దాఖ్'(2015) అనే పేరుతో ఒక చిన్న యాత్ర కథనాన్ని ముదిగంటివారు రాశారు. భారతదేశంలోని ఒక భిన్నమైన ప్రాంతం జమ్మూ కాశ్మీర్ లోని లద్దాఖ్ ప్రాంతం. దానికున్న ఒక ప్రత్యేకమైన ఎత్తైన పర్వతాలు, లోయలు, సరస్సులు కలగలిపిన స్వభావంతో అది ఒక ప్రధాన పర్యాటక ప్రాంతంగా వెలసిల్లుతుంది. ముదిగంటి

సుజాతారెడ్డి తనకున్న చారిత్రక అనుభవంతో అక్కడి ప్రజల భాష, రాజకీయ విశేషాలు మొదలైన వాటిని ఈ యాత్ర కథనంలో నిక్షిప్తం చేశారు.

ఈ లద్ధాఖ్ యాత్రా చరిత్రలో లద్ధాఖ్ పేరును వివరిస్తూ వాటిని వెనుక ఉన్న కొంత చారిత్రక నేపథ్యాన్ని వివరించే ప్రయత్నం చేశారు. *"కాశ్మీర్ గురించి చాలామందికి తెలుసు. కాని జమ్మూకాశ్మీర్ రాష్ట్రంలోని 'అద్దా' ప్రాంతం గురించి చాలా తక్కువ మందికి తెలుసు. కాశ్మీర్లో–కాశ్మీర్, జమ్మూ, లద్దా అని మూడు సంస్కృతి వైవిధ్యంగల ప్రాంతాలున్నాయి. భారతదేశానికి అతి ఉత్తరదిశలో వున్న ప్రాంతం 'లద్దాఖ్'. దీన్నే కొందరు ఇంగ్లీషు స్పెల్లింగ్ ననుసరించి 'లడఖ్' అంటుంటారు. కాని సరైన శబ్దం 'లద్దాఖ్' అనే! మనం సామాన్యంగా కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు అని భారతదేశం ఎల్లలను గురించి చెప్తుంటాం. కాని అది 'లద్దాఖ్' నుంచి కన్యాకుమారి వరకనో లేదా కార్గిల్ నుంచి కన్యాకుమారి వరకనో వుండాలి. కార్గిల్ అని ఎందుకన్నారంటే లద్దాల్లో ఆ జిల్లా ప్రాంతం ఉత్తరదిశలో వుంది"*(63) ఈ విధంగా ఈ యాత్రాచరిత్రలో లద్ధాఖ్ గురించి అక్కడి వాతావరణ పరిస్థితులతో సహా చారిత్రక మార్పులను కూడా ఈ కథనంలో అందించారు.

## 1.10.4.3 అద్భుత చైనాయాత్ర

అద్భుత చైనాయాత్ర (2011) అనే గ్రంథం ద్వారా చైనా, జపాన్ చారిత్రక, సామాజిక విషయాలు చెప్పిన ఒక కథనం. దీనిలో ఈజిప్ట్ యాత్రలో అక్కడి చారిత్రక, సామాజిక విషయాలను వివరిస్తూ, వాటిని మన దేశచరిత్ర, పురాణాలతో పోలుస్తూ చెప్పారు. ఇంకా లద్ధాక్ యాత్ర, బ్యాంకాక్, అమెరికా గ్రీస్, టర్కీ, రష్యా విశేషాలను తెలుపుతూ తెలుగులో యాత్రా సాహిత్యంలో తనదైన ఒక గుర్తింపు తెచ్చుకున్నారు. *"స్వదేశీ యాత్రలో ఎక్కువగా పుణ్యక్షేత్రాల సందర్శనం ఉంటుంది ట్రావెల్ ఏజెంట్స్ అవే ఎక్కువగా ఏర్పాటు చేస్తారు. చారిత్రక స్థలాలకు యాత్రలను ఏర్పాటు చేయరు. మనం సొంతంగా ప్లాన్ చేసుకుని వెళ్లాల్సి ఉంటుంది. విదేశీ యాత్రలో అన్ని చారిత్రక స్థలాలు చూపిస్తారు. చారిత్రక స్థలాలు చూడటమే నాకు ఇష్టం"* (మురళీధారగౌడు,తాళ్ళపల్లి.సాహిత్య మథనం,2016:329) అని మన దేశంలో ఉండే యాత్రలకంటే విదేశాల్లో ఉండే జ్ఞానాన్ని పెంచే విధంగా ఉండే చారిత్రక యాత్రలే తనకు అభిమానమని చెబుతుంటారు.

### 1.10.5 ఆత్మకథ 'ముసురు' (అనుభవాలు–జ్ఞాపకాలు–ఆలోచనలు)

ముదిగంటి సుజాతారెడ్డి రాసిన 'ఆత్మకథ' ముసురు. ఇది 2010లో ముద్రించారు. ఇందులో ప్రతి మనిషికి తన జీవితం చివరిలో చూసుకుంటే మిగిలేది తన జీవితంలో జరిగిన అనుభవాలు మరికొన్ని ఆలోచనలు. ఇలాంటి కొన్ని ఆలోచనలను జ్ఞాపకాలను అక్షరబద్ధం చేసి "ముసురు" పేరుతో ముదిగంటి సుజాతారెడ్డి తన ఆత్మకథను రాశారు. ముసురు గ్రంథంలో ఆమె తన వ్యక్తిగత జీవితానికి ప్రాధాన్యత ఇవ్వకుండా ఇందులో తన జీవితాన్ని ఆధారంగా చేసుకుని ఒక సామాజిక పరిణామ క్రమాన్ని ఆత్మకథగా చేయగలిగారు. ఇది ఎన్నో విషయాలు కలగలిసిన ఒక మిశ్రమం. ఇందులో ఆమె జీవితం, సామాజిక పరిస్థితులు ఆమె వెళ్లిన ప్రదేశాల చరిత్ర, జనజీవనం వారి సంస్కృతి ప్రజల నడవడిక దానికి తోడు ఆమె కొన్నిచోట్ల చేసిన పోలికలు ఎన్నో విషయాల సమాహారంగా దీన్ని తీర్చిదిద్దారు. ఒక సాహిత్యకారిణిగా దీనిలో తాను పుట్టి పెరిగిన కుటుంబ జీవనం, తెలంగాణలో జరిగిన భూస్వామ్య వ్యవస్థ, వాడిన భాష, వాటిలోని అర్థాలు అనేక విషయాలు మనకు ఈమె ఆత్మకథలో కనిపిస్తాయి. ఇద్దరు సాహిత్యకారుల సహజీవనం ఎంతగొప్పగా ఉంటుందో వీరి భార్యాభర్తల జీవితం ద్వారా తెలుసుకోవచ్చు.

తన ఆత్మకథ చివరిలో డాక్టర్ సుజాతారెడ్డి చెప్పిన కొన్ని మాటల్లో ఒక తత్త్వవేత్త కనిపిస్తారు. అవి *"ఒక వ్యక్తి వెళ్లిపోతే అతని అస్తిత్వం పోతుంది కానీ, జీవితం కొనసాగుతూనే ఉంటుంది. వేల లక్షల కోట్ల సంవత్సరాలుగా ఈ సృష్టి ఇట్లా నశిస్తూ పుడుతూనే ఉంది. వ్యక్తులు పోతున్నారు. జీవితాలు కొనసాగుతున్నాయి! వ్యక్తులు పోయినా లోకం ఉంటుంది! మనిషి పోయినా మానవుడు వుంటాడు. అంతే! అస్తిత్వం ఉన్నవాళ్లు ఉంటాం తర్వాత పోతాం! కానీ, జీవిత ప్రయాణం సాగుతుంది. అది ఆగదు దాన్ని ఆపటం ఎవరి తరం కాదు. సృష్టి, లయలకు కొనసాగుతూనే ఉంటాయి!..."*(ముసురు,2010:231) అని తన భర్త అయిన గోపాల్ రెడ్డి గురించి రాసిన మాటల ద్వారా ఆమెలో ఉన్న ఒక తత్త్వవేత్త మనకు దర్శనమిస్తారు. ముదిగంటి గారు వీరి ఆత్మకథలో ముఖ్యంగా చిన్ననాటి ఆటపాటలు, ప్రయాణ సౌకర్యాలు, వ్యవసాయ పనిముట్లు, వ్యవసాయ విధానాలు మాత్రమే కాకుండా వైద్యం వివిధ రంగాల తీరుతెన్నులను వివరించారు. అవన్నీ ఇప్పుడు మన

సమాజం నుంచి దాదాపుగా కనుమరగయ్యాయి. తన అనుభవాల నుంచి వాటిని ఆమె వ్యక్తీకరించారు. దానివల్ల ఒక కాలంనాటి సామాజిక జీవనం ఆమె రచనలో పరుచుకుంది. మొత్తం తెలంగాణ సామాజిక జీవన విధానం, సంస్కృతి, ఆచార వ్యవహారాలు, కళలు–సర్వం ఆమె రచనలో కనిపిస్తాయి. వైద్యం వంటి వాటిలో దేశీయ జీవన విధానాలు మనకు కనిపిస్తాయి. వాటిలోని శాస్త్రీయతను, ఆశాస్త్రీయతలను ఆమె బేరీజు వేశారు.

అయితే ఆత్మకథలు చరిత్ర పునర్నిర్మాణానికి పనికి వస్తాయనే అభిప్రాయం బలంగానే ఉంది. నల్లా నర్సింహులు, రావి నారాయణ రెడ్డి, బిఎన్ రెడ్డి వంటి వీరుల ఆత్మకథలు తెలంగాణ సాయుధ పోరాట చరిత్రకు అదనపు సరుకులను సమకూరుస్తాయి. సుజాతారెడ్డి ఆత్మకథ మరో రకంగా ఉపయోగపడుతుంది. సాయుధ పోరాట చరిత్రను, దాని వెలుపలి జీవన విధానాన్ని కలిపి తెలంగాణకు సంబంధించిన సంపూర్ణ సామాజిక చరిత్రను నిర్మించడానికి ఉపయోగపడుతుంది. అదే రకంగా కొత్త ఆలోచనలకు తావు కల్పిస్తుంది. ఇది “తెలంగాణ సామాజిక పరిణామ క్రమాన్ని కొత్తగా అర్థం చేసుకోవడానికి వీలు కల్పిస్తుంది. తెలంగాణ సాయుధ పోరాటం ఉవ్వెత్తున ఎగిసి పడిన నల్లగొండ తదితర దక్షిణ తెలంగాణలో నిజాం వ్యతిరేక సాయుధ పోరాటం కారణంగా ఫ్యూడల్ వ్యవస్థ కాళ్లు విరిగాయి. కానీ, ఉత్తర తెలంగాణలో ఆడబాపల వ్యవస్థ ఆ తర్వాత కూడా కొనసాగింది. ఫ్యూడల్ వ్యవస్థ దుర్మార్గాలన్నీ కొనసాగుతూ వచ్చాయి. ఈ స్థితిలో ఉత్తర తెలంగాణలో నక్సలైట్ ఉద్యమం ఉధృతంగా సాగింది. ఈ రకంగా సామాజిక పరిణామ క్రమాన్ని పునర్విశ్లేషించాల్సిన అసవరాన్ని”(ముసురు.2010:V) సుజాతారెడ్డిగారి ‘ముసురు’ తెలియజేస్తుందని దీనిలో సుజాతారెడ్డి వ్యక్తిత్వం మాత్రమే కాకుండా ఒక సామాజిక గమనం మనకు వీరి ఆత్మకథ ద్వారా స్పష్టమవుతుందనే విషయాన్ని విమర్శకులు కాసుల ప్రతాపరెడ్డిగారు వెల్లడించారు. ఈ ఆత్మకథలో ఉన్న విశాలమైన దృక్పథం ద్వారా తెలంగాణ సామాజిక పరిణామక్రమాన్ని కొత్తగా అర్థం చేసుకోవడానికి నిజంగానే ఈ గ్రంథం వీలు కల్పిస్తుంది.

## 1.10.6 తెలంగాణ వ్యవహార పదకోశం

మొదటి నుండి తెలంగాణ ప్రాంత భాష ఇతర ప్రాంతాల భాష కన్నా భిన్నమైన వాగ్వ్యవహారాన్ని కలిగి ఉన్నది. ఇదే తెలంగాణ భాషలో ఉన్న ప్రాచీనతను ప్రత్యేకతను తెలియజేయడానికి అనేకమంది పదకోశకర్తలు ప్రయత్నించారు. ఈ ప్రయత్నంలో భాగంగా ముదిగంటి సుజాతారెడ్డి చేసిన కృషిఫలితమే తెలంగాణ వ్యవహార పదకోశం. ముదిగంటి సుజాతారెడ్డి సేకరించి కూర్చిన '**తెలంగాణ వ్యవహార పదకోశం**'(2018) తెలంగాణ భాషను పరిరక్షించలనే వ్యక్తిగతమైన బాధ్యతతో తయారు చేసిన గ్రంథం. సుజాతారెడ్డిగారి ఈ గ్రంథం ముఖ్యంగా తెలంగాణ భాషా పదాల విశిష్టతను తెలియజేస్తుంది. ప్రజల రోజువారీ జీవితంలో ఉపయోగించే అనేక పదాలు, వాటి మూల వ్యుత్పత్తులను వివరిస్తూ ముదిగంటివారు  ఈ పదకోశాన్ని తయారు చేశారు.

భాషాసాహిత్యాల అధ్యయనం, అధ్యాపనం, అనువాదం, సామాజికావసరాలలోంచి తెలంగాణ పదకోశాలు రూపొందుతున్నాయి. తద్వారా తెలంగాణ భాష వాడకాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేయటానికి కావాల్సిన శక్తియుక్తులను పొందడానికి ఈ పదకోశాలు ఎంతో ఉపయోగపడతాయి. తెలంగాణ భాష ప్రాచీనతను, వైభవాన్ని లోకానికి చాటిచెప్పటానికి అనేకమంది పదకోశకర్తలు కృషి చేస్తున్నారు. తెలంగాణ ప్రాంత గ్రామాల్లో, పట్టణాల్లో, నగరాల్లో మాట్లాడుకునే వ్యవహారికంలోని పదజాలాన్ని ఒకచోట చేరిస్తే తెలంగాణ వ్యవహారభాష ఎలా ఉంటుందో తెలుసుకోడం సాధ్యం. తెలంగాణ జనవ్యవహారంలో ఉన్న పదజాలాన్ని సేకరించి ఒకచోట చేర్చారు రచయిత్రి ముదిగంటి సుజాతారెడ్డి. ఆ పదాలన్నిటిని కలిపి 'తెలంగాణ వ్యవహార పదకోశం' పేరుతో ఈ గ్రంథాన్ని తెలుగు విశ్వవిద్యాలయం, నవచేతన పబ్లిషింగ్‌హౌస్ కలిసి ముద్రించింది. ఈ పదకోశంలో ఎన్నో విలువైన, అరుదైన పదాలు కనిపిస్తాయి. దీని ద్వారా మనం అనునిత్యం వాడుతున్న తెలంగాణ పదాల వైశిష్ట్యం బోధపడుతుంది.

తెలంగాణ భాషలో నేరుగా సంస్కృతం నుంచి, ప్రాకృత భాష నుంచి వచ్చి చేరిన పదాలున్నాయి. ప్రజల భాషలో సంస్కృత భాష వికృత పదాలు ప్రాకృతం పదాలే కాక ప్రాకృతం భాష వికృతి పదాలు తెలంగాణ భాషా పదసంపదలో ప్రజల వ్యవహారంలో

ఉన్నాయి. ఉదా: సంచకారి, అస్తరు, వత్ వంటి సంస్కృత పదాలు, సాహిత్యంలో కన్పించే సంస్కృత పదాలు కాక మామూలు జనుల వ్యవహారంలో ఉన్నాయి. తెలంగాణ భాషలోని వాక్య రచనలో పద ప్రయోగాలు, అభివ్యక్తి భిన్నంగా ఉన్నట్లు గుర్తిస్తూ, వాటికీ ఉదాహరణగా కొన్ని వాక్యాలను ఈ క్రింది విధంగా సూచించారు.

- నేను చెప్పేది నీకు మెదడుకు పడలేద!
- నేను గీ పోర్ని తొలిచ్చివస్త.
- నా జోలికొస్తే ఊకుండెటోన్ని కాను.
- మా తమ్ముడు గిటు పొంగ నువ్వుగిన చూసినవ?
- అమ్మకు మస్తు జ్వరం వచ్చింది. డాక్టరు దగ్గరికి తీసుపోతే పట్టలేదు. పెద్ద దవాఖానకు తీస్కపోయినంగప్పుడు. (తెలంగాణ వ్యవహార పదకోశం.2018:iv)

ఈ వ్యవహార పదకోశాన్ని తయారు చేయడానికి గల కారణాన్ని తెలియజేస్తూ ఈ పదకోశం తెలుగు పదాలను ఇవ్వడం ఉద్దేశంకాదు. కేవలం తెలంగాణ ప్రాంతంలో సామాన్యుల నుంచి చదువుకున్న వాళ్ళ వరకు జనుల నోళ్ళల్లో నలిగే తెలుగు పదాలను సేకరించి పెట్టినట్లు ముదిగంటిగారు ఈ గ్రంథాన్ని తయారు చేయడం వెనుక ఉన్న ప్రధాన ఉద్దేశ్యాన్ని వివరించారు. *"తెలంగాణ భాష ఓ ప్రత్యేకమైన గుణాలు ఉన్నటువంటి భాషగా పరిగణించాలి. సంస్కృతి, సభ్యత, ఆచార వ్యవహారాల ప్రభావం తెలంగాణ భాషపై బాగా ఉంది. ప్రాంతీయతా, వివిధ పాలకుల వైవిధ్యం, మతాల ప్రభావం దీని మీద కనపడుతుంది. వీటన్నిటినీ నిఘంటుకర్తలు పదాలకిస్తున్న అర్థ వివరణలో పొందుపరచడంలో జాగ్రత్త వహించాలి. తెలంగాణకు సంబంధించి ప్రస్తుతం మనకు అందుబాటులో ఉన్న కొన్నికొన్ని పదకోశాలకన్నా ముదిగంటి సుజాతారెడ్డిగారి పదకోశం విభిన్నమైందిగా కనపడుతుంది. పదాలకిస్తున్న అర్థాల సందర్భంలో పదాల మూల వ్యుత్పత్తులపై కూడా దృష్టిపెట్టారు. పరభాషా పదాలను అంగీకరిస్తూ అవి తెలంగాణ భాషను ఎలా పరిపుష్టం చేశాయో వివరించారని"* డా.ఎస్వీ సత్యనారాయణగారు ముదిగంటి సుజాతారెడ్డిగారు రాసిన ఈ పదకోశానికి ఉన్న ప్రత్యేకతను తెలియజేస్తూనే పదకోశాల ఆవశ్యకతను గ్రంథ ముందుమాటలో వాఖ్యానించారు.

## 1.10.7 స్మృతి కావ్యం

## ముదిగంటి గోపాల్ రెడ్డి (జీవితం–వ్యక్తిత్వం–పాండిత్యం)

ఆచార్య ముదిగంటి గోపాల్ రెడ్డి స్మృతికావ్యం. ఛాత్రప్రియ పేరుతో ఇది 2005లో ప్రచురించబడింది. ఈ స్మృతి గ్రంథంలో గోపాల్ రెడ్డి జీవిత విశేషాలు, అనుభవాలు, వారి విద్యార్థుల వ్యక్తిత్వం, పాండిత్యం మొదలైన అంశాలన్నింటిని క్రోడీకరించారు. గోపాల్ రెడ్డి ఆర్య సమాజం నుండి వచ్చిన వైదిక సనాతన ధర్మపరాయణుడు. తెలంగాణ ప్రాంతానికి తొలి సంస్కృత ఆచార్యుడుగా ప్రసిద్ధి చెందాడు. (ప్రతాపరెడ్డి కాసుల, ముదిగంటి గోపాల్ రెడ్డి.2017:01) ఈయన చాలాకాలం పాటు ఉస్మానియా విశ్వవిద్యాలయంలలోని సంస్కృతశాఖలో ఆచార్యులుగా కూడా పనిచేశారు. వేదాల్లోనూ, అటు సంస్కృత సాహిత్యంలో గొప్ప పాండిత్యం సంపాదించిన అయన వైదికధర్మాన్ని బోధిస్తూ తను కూడా ఆచరిస్తూ ఉండేవారు. 'కిరాతార్జునీయం–శిశుపాలవధ కావ్యాల తులనాత్మక పరిశీలనం' అనే అంశం మీద పరిశోధన చేసి 1975లో ఉస్మానియా విశ్వవిద్యాలయం నుండి పి.హెచ్.డి పట్టా పొందారు. ముఖ్యంగా ఈ గ్రంథంలో సుజాతారెడ్డి–గోపాల్ రెడ్డిగార్ల విద్యార్థులు, సహోద్యోగులు, పరిచయస్తులు వారి జీవితాన్ని వ్యక్తిత్వాన్ని పాండిత్యాన్ని పరిచయం చేస్తున్న ఎన్నో విలువైన వ్యాసాలున్నాయి.

గోపాల్ రెడ్డి బహుభాషావేత్త. ఆయనకు14 భాషలు వచ్చేవి. అయన గురుకులంలో చదవడం వల్ల అద్భుతమైన స్మరణశక్తి అలవడింది. ఏ భాష రాయటం ఒక రకంగా అయినా ఆయనకు సులభంగా పట్టుబడేది. ఇతరులు మాట్లాడే భాషను నేర్చుకుని శక్తి వారితో ఆ భాషలోనే మాట్లాడడం గోపాల్ రెడ్డికి ఇష్టం. సంస్కృతం, హిందీ, ఇంగ్లీషు భాషలు ఆయనకు గురుకులంలోనే పట్టుబడ్డాయి. తెలుగు మాతృ భాష కాబట్టి వచ్చు. చిన్నప్పుడు కొంత కాలం వీధిబడిలో ఉర్దూ మాధ్యమంగా చదివారు. దాంతో ఉర్దూ వచ్చింది. ఆ తర్వాత ఉర్దూను ఆయన ప్రత్యేకంగా అభ్యాసం కూడా చేశారు. నిరంతరం ఆయన ఇంట్లో చదువుతూ ఉండడం వల్లనే 'సంస్కృత సాహిత్య చరిత్ర' రాసే సమయంలో మంత్రాలు, శ్లోకాలు ఉటంకించడం సులభమైందని ప్రముఖ రచయిత్రి, గోపాల్ రెడ్డి సతీమణి డాక్టర్ ముదిగంటి సుజాతారెడ్డి అన్నారు. ఈ గ్రంథాన్ని గోపాల్ రెడ్డితో కలిసి

ఆమె రాశారు. సంస్కృత సాహిత్య రచనకు ఆయనకు సంస్కృత సాహిత్యంతో ఉన్న పరిచయం, అందులో పాండిత్యమే కారణమని అన్నారు. ఆయన సాహిత్య పరిచయం, పాండిత్య ప్రతిభలు శాశ్వతంగా నిలబడాలనే తపన వల్లనే ఆ రచనకు పూనుకున్నట్లు కూడా తెలిపారు. ఆ పుస్తకం విద్యార్థులకు ఉపయోగకరంగా ఉండడమే కాకుండా సామాన్యులకు సంస్కృత సాహిత్యాన్ని పరిచయం చేయడానికి పనికి వచ్చింది. దానికితోడు, పండితుల మన్ననలు కూడా పొందింది. అది 'మాగ్నమ్ ఓపస్' గా పేరు పొందింది. తెలుగు సాహిత్య విమర్శలో కట్టమంచి రామలింగారెడ్డి 'కవిత్వ తత్త్వ విచారము', సురవరం ప్రతాపరెడ్డి 'ఆంధ్రుల సాంఘిక చరిత్ర' మాదిరిగా "సంస్కృత సాహిత్య చరిత్ర" చిరస్థాయిగా నిలిచిపోయే విధంగా ప్రఖ్యాతి వహించింది.

గోపాల్ రెడ్డి ఉస్మానియా విశ్వవిద్యాలయంలో లెక్చరర్ గా, రీడరుగా, ప్రొఫెసర్ గా వివిధ స్థాయిల్లో పనిచేశారు. జర్మన్ భాషా విభాగంలో ప్రొఫెసర్ గా కొన్నాళ్లు పనిచేశారు. సంస్కృతంలో వేదం పేపరు బోధించడం ఆయనకు చాలా ఇష్టం. అందుకే ఆయన కుటుంబ సభ్యులు గోపాల్ రెడ్డి పేర ఎం.ఎ వేదిక్ స్టడీస్ పేపరులో ఎక్కువ మార్కులు వచ్చిన విద్యార్థికి స్వర్ణపతకం పెట్టారు.(ముదిగంటి గోపాల్ రెడ్డి.2017:50) *"విద్యార్థులను ఆత్మీయంగా, ఆప్యాయంగా చూసుకునే గోపాలరెడ్డిని ఛాత్రప్రియః అని విద్యార్థులు పిలిచేవారు. విద్యార్థులే కాకుండా తెలుగు, సంస్కృత సాహితీవేత్తలు ఎందరో గోపాలరెడ్డి దగ్గర సంస్కృత వ్యాకరణం నేర్చుకున్నారు, పాండిత్యాన్ని సంపాదించుకున్నారు"* (ప్రతాపరెడ్డి కాసుల, ముదిగంటి గోపాల్ రెడ్డి.2017:48) అని గోపాల్ రెడ్డిగారితో ఉన్న అనుబంధాన్ని విమర్శకురాలు డాక్టర్ రావి ప్రేమలత గుర్తు చేసుకున్నారు.

## 1.10.8 భారతీయ సాహిత్య నిర్మాతలు–వాసిరెడ్డి సీతాదేవి.

కేంద్ర సాహిత్య అకాడమీ వాళ్ళు భారతీయ సాహిత్య నిర్మాతలు శీర్షిక క్రింద అచ్చు వేసిన పుస్తకాల పరంపరలో తనదైన వ్యక్తిత్వంగల భావాలుగల రచయిత్రి వాసిరెడ్డి సీతాదేవి గారి జీవిత విశేషాలను (మోనోగ్రాఫ్) కలిపి ముదిగంటి సుజాతారెడ్డి పుస్తకరూపంలో రాశారు. ఇది కేంద్ర సాహిత్య అకాడమీ వారిచే 2016లో ప్రచురించబడింది.

వాసిరెడ్డి సీతాదేవి (డిసెంబర్ 15, 1933–ఏప్రిల్ 13, 2007) ప్రసిద్ధ తెలుగు నవలా కథా రచయిత్రి. వీరు గుంటూరు జిల్లా చేబ్రోలులో జన్మించారు. ఈమె తల్లిదండ్రులు వాసిరెడ్డి రాఘవయ్య రంగనాయకమ్మ. సీతాదేవిగారు చిన్నతనంలోనే చెన్నై చేరుకున్నారు. ఈమె చదివింది ఐదవ తరగతి వరకే అయినా ప్రైవేట్ గా హిందీ ప్రచారక్, ప్రవీణ, సాహిత్య రత్నలో ఉత్తీర్ణులయ్యారు. సీతాదేవి రచించిన మొదటి నవల 'జీవితం అంటే?' (1950), తొలి కథ 'సాంబయ్య పెళ్ళి' (1952). అప్పటినుండి ఈమె  సుమారు 39 పైగా నవలలు, 100 పైగా కథలు రచించారు.

వాసిరెడ్డిగారు నక్సలిజం గురించి 1982 సంవత్సరంలో రచించిన '*మరీచిక*' నవలను రాష్ట్ర ప్రభుత్వం నిషేధించింది. తర్వాత ఆరుద్ర వంటి సాహిత్యకారుల అభిప్రాయాలపై హైకోర్టు కేసు కొట్టివేసి నిషేధాన్ని తొలగించింది. ఈమె రచించిన 'మట్టి మనిషి' (2000) నవల 14 భాషలలోకి అనువదించబడింది. ఈమె నవలల్లో కొన్ని తెలుగు సినిమాలుగా మరికొన్ని దూరదర్శన్ సిరియల్ గాను నిర్మించబడ్డాయి. ఈమె జవహర్ బాలభవన్ డైరెక్టర్ గా కూడా పనిచేశారు. ఈమె 1985-1991 మధ్యకాలంలో ఫిల్మ్ సెన్సార్ బోర్డు సభ్యురాలిగా సేవలందించారు. సమాజంలోని దురాచారాల్ని విమర్శిస్తూ రాజకీయాల్లోని కాలుష్యాన్ని చిత్రిస్తూ రచనలు చేశారు వాసిరెడ్డి సీతాదేవి. స్వాతంత్ర్యానంతరం తెలుగు కథకుల్లో, నవలా రచయిత్రుల్లో వాసిరెడ్డి సీతాదేవి ప్రముఖమైన పాత్ర పోషించారు. వాసిరెడ్డి సీతాదేవి సామాజిక వాస్తవికతకు కళాత్మకను జోడించి, అందమైన శిల్పంగా మార్చగల ప్రతిభ వ్యక్తి అటువంటి సీతాదేవి చేసిన రచనలను సమన్వయిస్తూ అనేక విషయాలను ముదిగంటి సుజాతారెడ్డి ఈ గ్రంథంలో తెలియజేశారు.

## 1.11. ముదిగంటి సుజాతారెడ్డి వివిధ పత్రికల్లో రాసిన వ్యాసాలు

తెలుగు సాహిత్య వ్యాసానికి ఒక ప్రత్యేకత ఉందన్న విషయం విదితమే. సాహిత్యంలో ఏదైన ఒక రంగాన్ని ఎన్నుకొని అందులో ఏదో ఒక అంశాన్నీ, లేదా అనేక అంశాల్ని చర్చించడం పరిపాటి. ఈ క్రమంలో సాహిత్య వ్యాసం వివిధ కోణాల్లో రూపొందుతుంది. ఇలాంటి వైవిధ్య భరితమైన లక్షణాలతో సాహిత్య వ్యాసం కొనసాగుతుంది. మన తెలుగు

సాహిత్యంలో విశిష్టమైన వ్యాసాలు రాసినవారిలో ప్రధానంగా మానవల్లి రామకృష్ణ కవి, చెళ్లపిళ్ల వేంకటశాస్త్రి, కట్టమంచి రామలింగారెడ్డి, కొమర్రాజు లక్ష్మణరావు, రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ, పింగళి లక్ష్మీకాంతం మొదలైన వారు పేర్కొనదగినవారు. ఆనాడు వీరు రాసిన వ్యాసాలు సాహిత్యానికి ఎంతో మేలు చేకూర్చడమే కాకుండా ఇవి సాహిత్యానికి ఒక దారి దీపాలుగా నిలిచాయి. ఆధునిక కాలంలో ప్రముఖ విమర్శకులు కొలకలూరి ఇనాక్ గారు తమ సిద్ధాంత గ్రంథమైన 'తెలుగు వ్యాస పరిణామం' ద్వారా విశేషమైన కృషి చేశారు. విషయ ప్రాధాన్యాన్ని బట్టి వ్యాసాన్ని కొన్ని విధాలుగా వర్గీకరించవచ్చును. సాహిత్య వ్యాసాలు, కళా సాంస్కృతిక వ్యాసాలు, భాషా వ్యాకరణ వ్యాసాలు, సాంఘిక వ్యాసాలు, చారిత్రక వ్యాసాలు, రాజకీయ వ్యాసాలు, వైజ్ఞానిక వ్యాసాలు మొదలైనవి.

''వ్యాసము'' అంటే ''ఏదేని విషయంపై విరివిగా వ్రాయుట'' అని శబ్దరత్నాకరము చెప్తున్నది. 'వ్యాసం' అనేది ఆంగ్లం నుంచి తెలుగులోకి దిగుమతి అయిన ప్రక్రియ. ఉత్తమ సాహిత్యం ఏం చేస్తుంది అంటే అది వాటి వల్ల ఉండే సాహిత్య ప్రయోజనాలను బట్టి తెలుస్తుంది. వీటిని గురించి పదకొండో శతాబ్దం వాడైన మమ్మటుడు కొంత చెప్పగా

***''కావ్యం యశసే అర్థకృతే***
***వ్యవహార విదే శివేత రక్షతయే***
***సద్యః పర నిర్వృతయే***
***కాంతసమ్మిత తయోపదేశయుజే*** (కావ్యప్రకాశం, 1-2)

కీర్తి, ధనం, వ్యవహార జ్ఞానం, అమంగళ నాశం, ఉత్కృష్టమైన ఆహ్లాదము కాంతా సమ్మితమైన ఉపదేశము అనే ఆరు కావ్య ప్రయోజనాలను ధ్వని వాద ప్రవర్తకుడు గుర్తించగా, చాలా మంది వీటిని సాహిత్య ప్రయోజనాలుగా అంగీకరించారు. వ్యాసం ప్రపంచ సమాజాల్లో, తెలుగులో కూడా, సాహిత్య గౌరవం పొందాకా ఇవన్నీ కూడా సాధించింది అనేది నిర్వివాదాంశం. ఆధునిక తెలుగు సాహిత్య తొలి ప్రక్రియ వ్యాసం అని చాలా మంది విమర్శకులు భావిస్తుంటారు. ముదిగంటి సుజాతారెడ్డిగారు వ్యాస రచనపై కూడా కొంత కృషి చేశారు. ముఖ్యంగా తెలంగాణ ప్రత్యేక అస్తిత్వ నేపథ్యంలో రాసిన సుజాతారెడ్డి గారి విమర్శ వ్యాసాలకి ఒక ప్రత్యేక స్థానం ఉంది. ముదిగంటి గారు

'అద్యతన ద్రుష్టి' పేరుతో రాసిన వ్యాస సంపుటిలో 30పైగా విభిన్న అంశాలపై వ్యాసాలు రాశారు. అలాగే, తెలంగాణ ప్రాంతీయ వాద నేపథ్యంలో రాసిన 'ముద్దెర' వ్యాస సంపుటిలో రాసిన వ్యాసాలు తెలంగాణ ప్రాంతీయ సాహిత్య విమర్శకి ఒక బలమైన భూమికను అందించాయి. అవే కాకుండా వివిధ సందర్భాల్లో కొన్ని వ్యాసాలు రాశారు. వాటిలో కొన్ని

1 ."క్షేత్ర సాహిత్యం—సమగ్ర పరిశీలనము" తెలుగు జనవరి, 1998.
2. "మా యాత్ర-విశేషాలు".బతుకు పుస్తకం. దేవులపల్లి కృష్ణమూర్తి అభినందన సంచిక, 2022.
3. ఆత్మకథలో ఒక భాగం-'కచ్రం బండ్లె నాటి ప్రయణ సాధనాలు'. పాలపిట్ట సెప్టెంబర్, 2010.
4. కాల్పనిక చక్రవర్తి బహుముఖ ప్రజ్ఞాశాలి అడవి బాపిరాజు—ఆంధ్ర సారస్వత పరిషత్ వజ్రోత్సవాలు సంచిక డిసెంబర్, 2003.
5. చైతన్యం రసం కదా! వాఙ్మయి 2005/ రసచర్చ ఆధునికత సెప్టెంబర్, 2009.
6. 'జాతీయోద్యమంలో తెలుగు నవలా సాహిత్యం'—జాగృతి దీపావళి ప్రత్యేక సంచిక 27-10-1997.
7. తెలంగాణ అస్తిత్వ వాద కవిత్వం (తెలుగులో దేశీయ కవితా ప్రస్థానం ఆగస్టు-2002)
8. తెలంగాణ పోరాట నవలలు-ఆంధ్ర సారస్వత పరిషత్ వజ్రోత్సవాలు సంచిక డిసెంబర్, 2003.
9. నాథ సంప్రదాయమే వేమన—వీరబ్రహ్మంల మత సంప్రదాయం. భారతి ఫిబ్రవరి,1983.
10. భారతీయ సాహిత్య నిర్మాతలు—వాసిరెడ్డి సీతాదేవి" సాహిత్య అకాడమీ 2016.
11. మనదైన గుర్తింపు అనుకరణతో రాదు. పాలపిట్ట జూలై, 2011.
12. మానవతా నేపథ్యంలో ఆధునిక తెలుగు సాహిత్యం—తెలుగు సాహిత్యం చారిత్రక నేపథ్యం ఫిబ్రవరి, 1994.
13. రసోత్పత్తి ఒక మనో వైజ్ఞానిక పరిశీలన (2వ ఆంధ్రప్రదేశ్ ప్రాచ్య మహాసభలో చదివిన పత్రము, 1980)

14. వేములవాడ చాళుక్యులు—భీమన కవి: పాలపిట్ట జూన్, 2020.

15. శైలి పాశ్చాత్య పండితాభిప్రాయ పరామర్శ–భారతి జూలై, 1980.

## 1.12 సాహిత్య విమర్శ గ్రంథాలు

సాహిత్య ప్రక్రియల్లో విమర్శ ఒక ప్రత్యేకమైన ప్రక్రియ. మిగతా ప్రక్రియలు కవుల, రచయితల సృజనాత్మకతపైన ఆధారపడేవి. కానీ, విమర్శ ఆయా రచనలను తరచి చూపే, తెరచి చూపే వచన ప్రక్రియ. విమర్శ ముఖ్యంగా ఏదైనా ఒక రచనను ఆశ్రయించుకొని సాగుతుంది. మూల రచనలోని ముఖ్య విషయాన్ని వెలికితీయడమైన, కవి అభిప్రాయాల్ని, కావ్య లేదా రచనల ప్రయోజనాన్ని విడమరిచి చెప్పేదే విమర్శ. ఇటువంటి కొన్ని విమర్శ గ్రంథాలను ముదిగంటి సుజాతారెడ్డిగారు రాశారు. వాటిలో

ఆలంకారిక సాహిత్య విమర్శ దృష్టి కొనసాగించి ఆలంకారిక శాస్త్రంపై సాధికారమైన పట్టుతో రాసిన **'మను–వసు చరిత్రల తులనాత్మక పరిశీలన'**(1977), **'శ్రీనాథుని కవితా సౌందర్యం'**(1980), **'బాణుని కాదంబరి పరిశీలన'**(1980), **'వేమన నాథసంప్రదాయం'**(1993) నాలుగు గ్రంథాలను వాటిని శైలి, రూపం, రసం, అలంకారాలు మొదలైన దృష్టితో రాసి ఆలంకారిక విమర్శలో తనదైన గుర్తింపును పొందారు. 'ఆధునికత' అనేది సాహిత్య ప్రక్రియలను విస్తృత పరిచిన దృక్పథం. వీటిలో ఆధునిక సాహిత్య ప్రక్రియ అయిన నవల గురించి పరిశీలిస్తూ **'తెలుగు నవలానుశీలనం'**(1991) అనే నవల విమర్శ గ్రంథం ద్వారా తెలుగు నవల పుట్టు పూర్వోత్తరాలను అన్నిటిని చర్చించారు. నవలావిమర్శలో కొంత లోతుగా శోధిస్తూ నవలలో రసం ఉండవచ్చుననీ ఒక కొత్తరకమైన ప్రతిపాదనను తీసుకువచ్చి తెలుగు సాహిత్యంలో **'రసచర్చ–ఆధునికత'**(2010) ద్వారా ఒక చర్చకు పెట్టారు. నవల–వాస్తవికత అనే అంశాన్ని కూడా కొంత క్షుణ్ణంగానే పరిశీలించారు. నవల, కథ, ప్రాచీన సాహిత్య విమర్శ, యాత్ర చరిత్రలు వంటి అనేక సాహిత్య ప్రక్రియల్లో ఉన్న అనుభవంతో సుజాతారెడ్డి **'అద్యతన దృష్టి'** (2014) పేరుతో సాహిత్య విమర్శ సంపుటి ద్వారా విమర్శ వ్యాసాలు రాసి వ్యాసవిమర్శలో అడుగుపెట్టారు. తెలంగాణ ప్రాంతం ముందు నుంచి ఒక ప్రత్యేకమైన చారిత్రక, సామాజిక, ఆర్థిక, భౌగోళిక నేపథ్యాన్ని కలిగి ఉంది. ఇది తర్వాతి దశలో వివక్ష, అణచివేతలు. తమని తాము కోల్పోతున్నామన్న

ఒక అస్తిత్వ భావన మొదలై అప్పటికి విస్తృతమైన అస్తిత్వ ఉద్యమాల ప్రభావంతో తెలంగాణ ప్రాంతీయ సాహిత్య విమర్శ ప్రారంభమైంది. ఈ నేపథ్యంలో తెలుగు సాహిత్యంలో వచ్చిన తెలంగాణ ప్రాంతీయ అస్తిత్వవాదాన్ని ముదిగంటి సుజాతారెడ్డి తన వ్యాసాలతో కలిపి వచ్చిన వ్యాస సంకలనం **'ముద్దెర'**(2005) పేరుతో వచ్చిన గ్రంథంలో అస్తిత్వవాద విమర్శకు ఒక బలమైన భూమికను అందించారు. ఇలా ముదిగంటి సుజాతారెడ్డి ఆధునిక సాహిత్య విమర్శ రంగంలో తనవంతుగా కృషిచేశారు.

## 1.13 సాహిత్య చరిత్రలు

తెలుగు సాహిత్య విమర్శలో సాహిత్య చరిత్రలు అధిక ప్రాధాన్యతను కలిగి ఉన్నాయి. కావ్యవిమర్శలో సమకాలీన సాంఘీక పరిస్థితులకు, కవిజీవిత విశేషాలకు ప్రాముఖ్యత ఉందని ముఖ్యంగా సాహిత్య చరిత్రలు కవి జీవితాన్ని, యుగ ప్రభావాన్ని, సాహిత్య క్రమ పరిణామాన్ని అనుశీలిస్తాయి. కావ్యవిమర్శకు కవి చరిత్రలే ఆధారం. ఇటువంటి సాహిత్య చరిత్ర రచనలను ఒక భిన్న దృక్పథంతో చేసిన ముదిగంటి సుజాతారెడ్డిగారు విమర్శలో తనకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని పదిలపరుచుకున్నారు.

సుజాతరెడ్డిగారు తమ భర్తగారైన ముదిగంటి గోపాల్ రెడ్డిగారితో కలిసి **'సంస్కృత సాహిత్య చరిత్ర'**(1986) ను తెలుగులో రాశారు. ఇది తెలుగు సాహిత్యంలో సంస్కృత సాహిత్యానికి సంబంధించిన మొదటి గ్రంథంగా ఎంతో ప్రాధాన్యతను సంతరించుకుంది. దీనితో పాటు తర్వాతి కాలంలో **'ఆంధ్రుల సంస్కృతి సాహిత్య చరిత్ర'**(1989) పేరుతో ఒక సాహిత్య చరిత్ర గ్రంథాన్ని వెలువరించారు. దీనిలో కొన్ని మౌలికమైన మార్పులు చేస్తూ **'మన తెలుగు సాహిత్య చరిత్ర'**(2018) పేరుతో తీర్చిదిద్దారు. సుజాతరెడ్డిగారు రాసిన వివిధ సాహిత్య చరిత్రలను '**చారిత్రక సామాజిక నేపథ్యంలో తెలుగు సాహిత్య చరిత్ర**'(1996) గ్రంథం తెలుగు సాహిత్యంలో ఒక స్త్రీ రచించిన మొట్టమొదటి సాహిత్య చరిత్ర. ఈ సాహిత్య చరిత్ర రచనలో వీరు భిన్నంగా తెలుగు సాహిత్య పరిణామ వికాసాలను చారిత్రక సామాజిక కోణంలో చర్చిస్తూ ఒక భిన్నమైన దృక్పథంతో సాహిత్య చరిత్ర సృష్టి చేశారు. ఇది తెలుగు సాహిత్య చరిత్ర రచనలో ఒక ప్రయత్నంగా గుర్తించవచ్చు. తెలంగాణ ప్రత్యేక అస్తిత్వంకోసం ప్రయత్నిస్తున్న క్రమంలో తెలంగాణ రచయితల్లోనూ ఆత్మ సంఘర్షణ

మొదలైంది. దీనిలో భాగంగా అన్ని వైపుల నుండి తెలంగాణ అనే కోణంలో రచనలు వచ్చాయి. ఇదే క్రమంలో ముదిగంటి సుజాతారెడ్డి తెలంగాణ ప్రాంతీయ అస్తిత్వవాదం బలపడుతున్న రోజుల్లో సాహిత్య చరిత్రను పునర్మూల్యాంకనం చేస్తూ **'తెలంగాణ తెలుగు సాహిత్య చరిత్ర'**(2015) గ్రంథాన్ని రాసి తెలంగాణ ప్రాంతీయ వాదానికి ఒక బలమైన భూమికను అందించారు. వీటిని తర్వాతి నా ప్రధాన అధ్యాయంలో కూలంకషంగా విశ్లేషించే ప్రయత్నం చేస్తాను.

## ముగింపు

ఒక వ్యక్తి రచనలను ఆధారంగా చేసుకుని పరిశోధన చేయడం అంటే వారి రచనల ద్వారా ఆ వ్యక్తి జీవితాన్ని అర్థం చేసుకోనే ప్రయత్నం చేయడం. అప్పటి సామాజిక, ఆర్థిక, రాజకీయ కోణాల నుండి ఆ రచనలను స్పృశించి వారి రచన వైవిధ్యాన్ని తెలుసుకోవడం. దేశకాలమాన పరిస్థితులను క్రోడీకరించడానికి ఆలంబనగా రచయిత జీవితంలోని సంఘర్షణల నుంచో లేదా వ్యక్తికీ విధికీ మధ్య జరిగే పోరాటాల అనుభవం నుండి వారి రచన ధోరణులను రాబట్టటం జరుగుతుంది. అలాగే, వీటిని ముదిగంటి సుజాతారెడ్డి విమర్శ రచనల నుండి వారి విమర్శ ధోరణులను అర్థం చేసుకోవడమే ఈ పరిశోధన ప్రధాన ఉద్దేశ్యం. ఇది ముదిగంటి సుజాతారెడ్డి రాసిన సాహిత్య నేపథ్యాన్ని తెలుసుకోవడం వారి విమర్శ రచనలను పరిచయం చేయడంతో ఇది ప్రారంభమవుతుంది. ఈ విమర్శ గ్రంథాలను రాబోయే అధ్యాయంలో విశ్లేషణ చేస్తాను.

# అధ్యాయం-2

# ముదిగంటి సాహిత్య విమర్శ–పరిచయం

## 2.0 పరిచయం

*"The ultimate end of criticism is much more to establish the principles of writing than to furnish rules" (Samuel Taylor Coleridge. Biographia Literaria: 1817)* అన్న కాలరిడ్జ్ తన మాటలలో, విమర్శ అనేది ఏదైనా ఒక రచన చేయడానికి ఒక దారిలాంటి లక్షణాలను చూపించవచ్చు. కానీ, దానికి ప్రతిబంధకమయ్యే నియమాలను ఏర్పర్చకూడదని అంటాడు. అంటే విమర్శ ఎప్పుడు ఎవరికి ఒక గోడ కట్టినట్లు కాకూడదని చెప్తూ విమర్శ అంటే ఏమిటో, అలాగే విమర్శకు ఉండే ప్రయోజనాన్ని వివరించారు.

అలాగే విమర్శ గురించే ఇంకొంచెం విస్తృతంగా పరిశీలిస్తే "విమర్శ అంటే సృజనాత్మక సాహిత్య రచనలను మూల్యాంకనం చేసేది విమర్శ. వస్తు స్వరూప స్వభావాల పరిశీలన ద్వారా గుణదోష విచారణ చేసి దాని తత్త్వాన్ని నిరూపించడమే విమర్శ" (వీరభద్రయ్య, ముదిగొండ. విమర్శ మౌలిక లక్షణాలు:7) అని అర్థం అవగా, సృజనాత్మక సాహిత్యంలోని విలువలను నిర్ణయించడానికీ, సాహిత్యంశాలను దర్శించడానికీ, అంచనా వేయడానికి ఉపయోగించే ప్రక్రియనే విమర్శ అని తెలుస్తుంది. సాహిత్యంలో విమర్శ, విమర్శలో సాహిత్యం పరస్పర సంబంధాన్ని కలిగి ఉంటాయి. పాశ్చాత్య సాహిత్య సంపర్కం వల్ల విమర్శ ప్రస్తుతం తెలుగులో ఒక సాహిత్య ప్రక్రియగా కొనసాగుతుందనేది మనకు తెలిసిన విషయమే.

విమర్శకు సమానార్థకమైన క్రిటిసిజం **"CRITICISM"** అనే ఆంగ్ల పదం గుణదోష విచారణ మొనర్చుట అనే అర్థం గల **"KRITEIN"** అనే గ్రీకు పదం నుండి ఏర్పడింది.

విమర్శ అనే పదానికి తెలుగు అకాడమీ వారి 'తెలుగు తెలుగు నిఘంటువు'లో "పరిశీలన, పర్యాలోచన, సమీక్ష, విచారణ, హేతువాదం, పరస్పర విరుద్ధమైన తీర్పు, సందేహం, ఎటు తోచని స్థితి" రకరకాల అర్థాలున్నాయి. విమర్శించు అనే క్రియాపదానికి

“తప్పొప్పులు చర్చించు, తప్పుపట్టు ఆక్షేపించు, పరామర్శచేయు, పరిశీలించు, ఆలోచించు, పరిశోధించు, పరికించు” అని భిన్నమైన అర్థాలున్నాయి.

తెలుగు సాహిత్యంలో విమర్శకు సంబంధించి ఇప్పటివరకు తగినంత చర్చ జరిగిందని భావిస్తూ వాటిలోని కొన్ని ముఖ్యమైన మౌలికమైన అంశాలను మాత్రమే ప్రస్తావించదలుచుకున్నాను.

## 2.1 సాహిత్య విమర్శ నిర్వచనాలు

ఇప్పటివరకు విమర్శ గురించి చాలా మంది సమగ్రంగా వివరించారు. ప్రస్తుతం ఇక్కడ ప్రామాణికమైనవి, ముఖ్యమైన వాటిని మాత్రమే ఉదాహరించదలుచుకున్నాను.

“ఒకరు చేసిన పని అందలి బాగోగులను ఇంకొకరు వివేచించి తెలుపుట విమర్శ”(సాహిత్య శిల్పసమీక్ష, 1966: 314) అని పింగళి లక్ష్మీకాంతం తెలుపగా, ఇక్కడ ‘పని’ అనే దానిని ఒక చేసిన ‘రచన’ అనే అర్థంలో తీసుకోవాల్సిందిగా తెలుస్తుంది.

“ప్రకటితము కాకుండా నుండు ప్రతి ఒక్క దానిని కనిపెట్టి అధవాప్రతులను సంగ్రహించి ఆకృతిని శాస్త్రీయంగా సంపాదించి ప్రకటించునది పరిశోధనమైతే, అట్లు ప్రకటితమైన కృతి యొక్క గుణావ గుణాములను గురించి వివరించునది విమర్శ”(జీవిఎస్ వ్యాసాలు:16) అని పరిశోధన దానితోపాటు విమర్శ గురించి ఒక భిన్నమైన తన అభిప్రాయాన్ని జి.వి సుబ్రహ్మణ్యం తెలియజేశారు.

“ఒక వస్తువు యొక్క స్వరూప స్వభావములను బాగుగా పరిశీలించి దాని మంచి చెడులను వివరించుట విమర్శనము కావున విమర్శయనగా వస్తుతత్త్వ నిరూపణమని స్పష్టమగుచున్నది”(తెలుగులో సాహిత్య విమర్శ,2017:01) ఇక్కడ ఎస్వీ. రామారావు తెలిపిన నిర్వచనం సార్వజనీనంగా వుండి ‘వస్తువు’ అనే అర్థంలో, ఇది మిగతా విషయాలకు కూడా అనువర్తింపజేసుకునేలా ఉంది.

“విమర్శమనగా నేదైనా గ్రంథమును గాని, కళ రూపామునుగాని లెస్సగా బరిశీలించి, దానిని గూర్చి మననము చేసి చర్చాపరస్పరముగా నందలి బాగోగులను బ్రదర్శించుటయని గ్రహింపవచ్చును”(సాహిత్య సోపానములు,2013:01) కళలకు సాహిత్యానికి దగ్గరి సంబంధం ఉన్నట్లే, ఇక్కడ బాగోగుల పరిశీలన అనేది గ్రంథాలకు, కళలకు రెండింటికి అని విమర్శకుడు దివాకర్ల వేంకటావధాని పేర్కొన్నారు.

సాహిత్య విమర్శను పాశ్చ్యాత్యులు వివిధ రకాలుగా వివరించారు. వాటిని ఒక్కసారి పరిశీలిద్దాం.

"కళారూపాల్ని అక్షర రూపంలో వాఖ్యానించేది, వివేచించేది విమర్శ" అని టి. ఎస్. ఇలియట్ భావించగా "సాహిత్యం యొక్క ప్రామాణికమైన చక్కని పరిష్కారం విమర్శ" అని డ్రైడెన్ పేర్కొన్నాడు.

మరో విమర్శకున్ని పరిశీలిస్తే *"Criticism as I understood is the endeavour to discriminate between experiences and to evaluate them"* (Principles of literary criticism, 2003:1) రిచర్డ్స్ ఐ ఎ. "అనుభూతుల తారతమ్యం వివేచించి వాటి విలువల్ని అంచనా వేసేది విమర్శ" అనే విభిన్న కోణం నుండి విమర్శ అనే దానిని గురించి తెలియజేశాడు.

"విమర్శకుడు ఇష్టారాజ్యంగా మంచి కాని చెడు కాని చేసే పని విమర్శ"యని విక్టర్ హ్యూగో వివరించే ప్రయత్నం చేశారు.

*"Criticism or more specifically literary criticism is the overall term for studies concerned with defining, classification, analysing interpreting and evaluation of works of literature"* (A glossary of literary terms, 1999:50) అని అబ్రహం, ఎం హెచ్. తన అభిప్రాయాన్ని వ్యక్తపరిచారు.

ఈ విధంగా పాశ్చ్యాత్యులు చెప్పిన నిర్వచనాలు విమర్శ అనే దానిని వివిధ కోణాల్లో వారి అనుభవాల ఆధారంగా తమ అభిప్రాయాన్ని వెలిబుచ్చారు. వీటన్నిటిని బట్టి చూస్తే విమర్శకు వీరందరూ తెలియబరిచిన అభిప్రాయాలు మొత్తానికి ఒక రచనలోని మంచి చెడులను వివరించి, విశ్లేషించి చెప్పడం అనే మౌలిక విషయాన్ని తెలియజేస్తున్నాయి.

## 2.2 సాహిత్య విమర్శ ప్రయోజనం

విమర్శ ఎవరికోసం? రచయిత కోసమా? లేదా విమర్శకుని కోసమేనా? అసలు విమర్శ అవసరమా? ఈ ప్రశ్నలకు సమాధానంలో విమర్శ ప్రయోజనం దానికున్న ప్రత్యేకతలు తెలుస్తాయి.

"ఒక రచన చదివి చాలా బాగుంది అని అన్నా, ఆ రచనలోని కొన్ని భాగాలను చదివి చాలా బాగుంది అని అన్నా, ఆ రచన మనకు తెలిసినట్లు కాదు. రచన మనకు బాగుంది అని అనిపించినప్పుడు అందులోని 'బాగు' ఏమిటి? అది అందులో ఎక్కడ ఉంది? దాన్ని విడదీసి చూపడానికి వీలుగా ఉందా? లేదా పాలలో వెన్నెలగా అది ఆ రచన

మొత్తంగా వ్యాపించి దాని జీవంగా వుందా? దాని మాటల్లో  చెప్పడానికి వీలుందా?  అ చెప్పడం మామూలు మాటల్లోనా?  విశిష్ట మాటల్లో చెప్పడం వల్ల కలిగే అధిక ప్రయోజనం ఏమిటి? మొదలైనవి మనకు తెలియాలి. స్థూలంగా చెప్పాలంటే విమర్శ అంటే ఈ ప్రశ్నలకు సమాధానమే"(వీరభద్రయ్య,ముదిగొండ. విమర్శ మౌలిక లక్షణాలు:1) అనే నిర్వచనం విమర్శకు సంబంధించిన అన్ని విషయాలను ఎంతో సమగ్రంగా పేర్కొంటుంది.

"జీవితం గురించి తగు మాత్రం తెలిసిన వాళ్లకి ఏ రకం కవిత్వం ఏ సమయంలో సంఘానికి హానికరంగా పరిణమిస్తుందో తెలుసుకోవడానికి, కళల తాలూకు సమర్థా సమర్థతలు నిర్ణయించి సామాన్య ప్రజలకు కావలసిన కళలేవో తెలియజేస్తుంది. సంఘం కళల ద్వారా నిర్వీర్యం కాకుండా కాపాడుతుంది విమర్శ"(సాహిత్య ప్రయోజనం:2) అని కొడవగంటి కుటుంబరావు విమర్శ వల్ల కలిగే ప్రయోజనం గురించి తెలుపగా,

"*The object of criticism is to describe the work and to persuade the reader that perception is valid*" (Eessentials of literary criticism, 1983:12) అని Philip hobs అన్నారు.

"విమర్శ పండిన వృక్షమునకు రాతి దెబ్బలు అన్నట్లు పుస్తకములు రాయువారికి విమర్శలను రాళ్లు తాకును అయినను.  అవి మొదల కొంత నొప్పికలిగించినను గ్రంథకర్తను కాలక్రమమున గట్టివానింగావించుటయేకాక యాతనికి మహోన్నతులనుజేసి విమర్శనముల గురికందరనివానిగా జేయును"(స్వీయచరిత్రము:168) వీరేశలింగం పంతులు  తన 'స్వీయ చరిత్రము' గ్రంథంలో వివరించారు.

ఈ నిర్వచనాలన్నీ కూడా కవి లేదా రచయితకు, పాఠకునికి ప్రయోజనం అని చెబుతూనే సాహిత్య విమర్శ తప్పనిసరిగా అవసరం అనే విషయాన్ని అంగీకరించాయి. పై అభిప్రాయాలను పరిశీలించినట్లయితే విమర్శ వల్ల ముఖ్యంగా ముగ్గురికి ప్రయోజనాలు ఉన్నాయని తెలుస్తుంది. విమర్శవల్ల ఇటు రచయితకు, అటు పాఠకుడికి దాంతోపాటు విమర్శ చేసే విమర్శకుడికి కూడా ప్రయోజనం జరిగి, చివరగా సాహిత్య అభివృద్ధి జరుగుతుంది.

## 2.3 సాహిత్య విమర్శకులు–లక్షణాలు

విమర్శకుడికంటూ కొన్ని ప్రత్యేక లక్షణాలతో పరిమితం చేయకపోయినప్పటికినీ వివిధ సాహిత్యకారులు భిన్న సందర్భాల్లో ఒక విమర్శకుడికి ఉండాల్సిన లక్షణాల గురించి వర్ణించారు. వారిలో ఒకరైన జి.వి.ఎస్ వర్ణనం లేదా వివరణ(Description), విశ్లేషణం(Analysis), వివేచనం(Discrimination), సమన్వయం(Interpretation), అనుశీలనం(Evolution), సిద్ధాంత దర్శనం(Theory of literature) సహజ ధర్మాలు. వీటిలో ఉత్తరోత్తరాలు ఉత్తములు. ఈ ఆరు ఒక విమర్శకునిలో ఉండడం అసంభవం కాదు అపూర్వం అని విమర్శకునికి ఉండవలసిన లక్షణాలను 'తెలుగులో సాహిత్య విమర్శ రీతులు' అనే గ్రంథంలో పేర్కొన్నారు.

ఎస్.వి.రామారావు తన '**తెలుగు సాహిత్య విమర్శ అవతరణ వికాసములు**' అనే గ్రంథంలో విమర్శకునికి ఉండవలసిన లక్షణాలను ఈ విధంగా వివరించారు. సాహిత్య విమర్శ చేసేటప్పుడు విమర్శకుడు ఎటువంటి అనుచితాలకు తావివ్వకుండా కావ్యంలో ఉన్న గుణాలను, దోషాలను నిష్పాక్షపాత దృష్టితో విమర్శ చేయాలి, కాలానుగుణంగా వచ్చిన సాహిత్యాన్ని ఆ కాలానికి మాత్రమే వర్తింపచేసి విమర్శ కావించాలి. అలా కానిచో ఆ విమర్శ పెడదోవన పడుతుంది. విమర్శకునికి ప్రధాన లక్షణం సానుభూతి. కవిహృదయంతో కావ్యాన్ని అర్థం చేసుకుని విమర్శించాలి. కావ్యంలోని మంచిచెడులను అర్థం చేసుకొని కావ్యతత్త్వాన్ని నిరూపించాలి. అలాంటి వ్యక్తి కవి హృదయాన్ని అర్థం చేసుకున్న విమర్శకుడని, ఒక సహృదయ విమర్శకునిలో ఉండాల్సిన ప్రధాన విషయాలను పేర్కొన్నారు. ఏది ఏమైనప్పటికి విమర్శకునిలో ఒక స్పష్టత, ఒక సూత్రబద్ధత, సరైన ప్రామాణికత అనేది ప్రధానంగా ఉండాల్సిన లక్షణాలుగా భావించవచ్చు.

## 2.4 తెలుగు సాహిత్య విమర్శ నేపథ్యం

తెలుగు సాహిత్యంలో ఒక ఆధునిక ప్రక్రియ 'విమర్శ'. ఇది 1970లో ఒక ప్రత్యేక ప్రక్రియగా అవతరించినప్పటికీ దీనికి ఇప్పటివరకు దాదాపు 135 సంవత్సరాల చరిత్ర ఉంది. కానీ, ప్రారంభదశలో కేవలం లక్షణ గ్రంథాలు, అవతారికలు, టీకా తాత్పర్యాల రూపంలో మాత్రమే ఉండి తర్వాత ఎన్నో మార్పులకులోనై ఒక స్పష్టమైన రూపాన్ని

సంతరించుకొని నేడు ఒక ప్రత్యేక సాహిత్య ప్రక్రియగా రూపుదిద్దుకుంది. మొదట మనదేశం మహమ్మదీయుల పాలనలో ఉన్న, తర్వాత వచ్చిన ఆంగ్లేయుల ప్రభావానికి ఎక్కువగా లోనైయింది. ఆ కాలంలో వచ్చిన సామాజిక, మత పరిస్థితుల్లో మార్పులు సాహిత్యంలో కూడా కనిపించసాగాయి. ఆంగ్లేయులు ప్రవేశపెట్టిన ఆంగ్ల విద్య సాహిత్యంలో ఎన్నో నూతన మార్పులు రావడానికి తోడ్పడింది. దీనితోపాటు ముద్రణ, యంత్రసౌకర్యం, పత్రికలు వంటివి కూడా విమర్శ ఒక ప్రక్రియగా ఏర్పడటానికి కారణం అయ్యాయి.

కావలి రామస్వామి **"బయోగ్రఫీకల్ స్కెచెస్ ఆఫ్ డెక్కన్ పోయెట్స్"**(దక్కన్ కవుల చరిత్రము) పేరుతో 1829లో వివిధ కవుల చరిత్రను అక్షరబద్ధం చేసి, తెలుగు సాహిత్య విమర్శ ప్రథమార్థంలో నిలిచిన వారిలో ఒకరుగా పేరుగాంచారు. ఇదే కాలంలో సి.పి. బ్రౌన్ తన పరిశోధన దృక్పథంతో దీనికి మరింత తోడ్పాటునందించారు. విలియం కేరి, క్యాంబెల్, బ్రౌన్ మొదలైన ప్రాశ్చాత్యులు చేసిన సేవలు విమర్శకు చేదోడునందిచాయి. తర్వాత కందుకూరి వీరేశలింగం రచించిన **"విగ్రహతంత్రవిమర్శనం**(1875)"తో తొలితెలుగు విమర్శ గ్రంథకర్తగా నిలిచాడు. ఈయన కాలం నుంచే విమర్శ అనే పేరు తెలుగులో ప్రాచుర్యంలో ఉన్నట్లు దీన్నిబట్టి మనం గమనించవచ్చు. కవి, విమర్శకుడు అయిన దక్షిణామూర్తి తన "పింగళి సూరన(1892)" అను గ్రంథాన్ని రచించాడు. ఇది తెలుగు కవిపై వెలువడిన మొదటి విమర్శ గ్రంథం, తర్వాత గురజాడ శ్రీరామమూర్తి "కవి జీవితములు (1993)" ఒక సంపుటంగా వెలువరించాడు.

కందుకూరికి సమకాలిక విమర్శకులుగా పేరు ఉన్నవారు కాశీభట్ల బ్రహ్మయ్యశాస్త్రి. ఈయన తొలి విమర్శగ్రంథాన్ని రాజశేఖర చరిత్రకు నిరసనగా "వివేకచంద్రిక విమర్శనము (1896)" వెలువరించారు. ఆ తర్వాత పెన్నేటి రామచంద్రరావు తన "మనవసుచరిత్రవిమర్శనము (1899)" రాసి తెలుగులో తులనాత్మక విమర్శకు దారులు వేశారు.

తమ సాహిత్య వాగ్వాదాలతో ఆలోచనలు రేకెత్తించి సాహిత్య వివేచన చేసినవారు తిరుపతి వెంకటకవులు. వీరు జరిపిన ఎన్నో చర్చల ద్వారా సాహిత్య విమర్శకు ఎంతో తోడ్పాటునందించారు. అలాగే 19వ శతాబ్దంలో ప్రారంభమైన తెలుగు పత్రికలు

సాహిత్యవిమర్శకు ఎంతగానో ఉపయోగపడ్డాయి. వివిధ భాషా సాహిత్య సంఘాలు, గ్రంథ మండలాలు ఇవి కూడా తమవంతు సహాయం అందించాయి. తర్వాత తెలుగు సాహిత్య విమర్శను ఒక గొప్ప మలుపు తిప్పిన కట్టమంచి "కవిత్వతత్త్వవిచారం" అనే గ్రంథాన్ని రచించి ఆధునిక సాహిత్యవిమర్శకు ఒక పునాది వేశారు. తొలినాటి నాటక విమర్శకుడు పురాణం సూరిశాస్త్రి "విమర్శకపారిజాతం" అనే రచనతో పాశ్చాత్య సాహిత్య విమర్శను విపులంగా పరిచయం చేశారు. సమకాలీన సాహిత్య విమర్శలో తార్కిక పద్ధతిని ప్రవేశపెట్టినవారు అక్కిరాజు ఉమాకాంతం.

ఆ తర్వాత రమ్యాలోకం, మాధురీదర్శనం, రూపనవనీతం వంటి లక్షణగ్రంథాల ద్వారా ఆధునిక సాహిత్య విమర్శలో లాక్షణితకు పెద్దపీట వేసినవారు రాయప్రోలు. కురుగంటి, పింగళి లక్ష్మీకాంతం వంటివారు తమ సాహిత్య చరిత్రల ద్వారా సాహిత్య వికాసాన్ని అంచనావేసి ఈ విమర్శను మరింత ముందుకు తీసుకువచ్చారు. తెలుగు సాహిత్య విమర్శను స్వతంత్ర విమర్శ(Inductive criticism)కు మరింత దగ్గర చేసినవారు విమర్శకుడు రాళ్లపల్లి. అదే కాలంలో  కె.వి.ఆర్, రారా, శ్రీ శ్రీ, కోకు,  జి.వి కృష్ణారావు వంటివారు మార్క్సిస్టు సాహిత్య విమర్శ ద్వారా విమర్శలో మరింత కృషి చేశారు.

మార్క్సిస్టు దృక్పథం వచ్చిన తర్వాత వాదాల నేపథ్యంతో సాహిత్య విమర్శ విస్తృతి పెరిగింది. త్రిపురనేని మధుసూదనరావు, ఇనాక్ వంటి విమర్శకులు విప్లవ, దళిత విమర్శలకు సైద్ధాంతిక కోణాన్ని అందించారు. సాంప్రదాయ భూమిక సాహిత్య విమర్శ చేసిన సుప్రసన్న, తుమ్మపూడి కోటేశ్వరరావు వంటివారిలో వేదాంత శాస్త్ర భూమిక ఎక్కువ. చేకూరి రామారావు  భాషశాస్త్ర సాహిత్య విమర్శకు భూమికను ఏర్పరచగా, సంపత్కుమార రస సిద్ధాంత వికాసాన్ని, విస్తృతిని దేశీయాత భూమికతో, వడలి మందేశ్వరరావు పాశ్చాత్య దృక్కోణంతో, సాహిత్య అనుభవగవేషణను విస్తృతం చేశారు. ముదిగొండ వీరభద్రయ్య కళాతత్వశాస్త్రంనకు సైద్ధాంతిక కోణాన్ని, భావచిత్ర విమర్శలకు లాక్షణిక కోణాన్ని ఇచ్చారు. సాహిత్యవికాస నిర్మాణంలో ఉన్న అంతర్గత విధానాన్ని వేల్చేరు నారాయణరావు ప్రారంభించగా, కేకేఆర్ చారిత్రకదృష్టిని, జీవిఎస్ ప్రక్రియ దృష్టిని తీసుకువచ్చారు. ఎస్వీ. రామారావు సాహిత్య విమర్శ క్రమ పరిణామాలను రికార్డు చేయడంతో విమర్శ పరిణామ దశల వాఖ్యానం తర్వాతి కాలంలో సులభమైంది. ఆర్.ఎస్.సుదర్శనం మనోవైజ్ఞానిక

విమర్శకు, కాల్పనిక సాహిత్యవిమర్శకు మరియు ఆనందరామం ప్రాగ్రూప విమర్శకు తమవంతు సహాయం అందించారు.

ఈ కాలంలో ప్రాచీన సాహిత్య విశ్లేషణ కంటే ఆధునిక సాహిత్య విశ్లేషణ ఊపందుకుంది. ప్రక్రియా పరమైన అవగాహన పెరిగి, ఆయా ప్రక్రియల విమర్శలు, ఆ ప్రక్రియ లక్షణాలు ఆధారంగా విమర్శించడం, విమర్శకుల్లో అవగాహన పెరగడం మనం గమనించవచ్చు. ముదివేడు ప్రభాకర్ రావు, విశ్వనాథ సాహిత్యంపై ప్రాచీన సాహిత్యంపై రాసిన రచనలు, బ్రహ్మానందం తెలుగు సాహిత్యంపై పాశ్చాత్య ప్రభావం, తిరుపతి రావు పోస్ట్ మాడర్నిజం, గుడిపాటి గ్లోబలైజేషన్ సాహిత్యం దృక్పథం, పెన్నా శివరామకృష్ణ, శివారెడ్డి, సి.నారాయణ రెడ్డి గజల్స్ పై రాసిన రచనలు, బేతవోలు రామబ్రహ్మం వ్యాసగౌతమి, బన్న ఐలయ్య అభినవ దృక్పథం, భీమన్న, కాలువ మల్లయ్య రాసిన రచనలు, లక్ష్మణ చక్రవర్తి రాసిన లక్ష్మణరేఖ, ప్రతిబింబం ఇలాంటి సాహిత్య రచనలన్నీ తెలుగు సాహిత్య విమర్శలో తమదైన ఒక స్థానాన్ని కలిగి ఉన్నాయి.

## 2.5 ధోరణి-వాదం–పద్ధతి

సాహిత్యంలో వాదం, ధోరణి, ఉద్యమం మొదలైన పారిభాషిక పదాలను వాడటంలో చాలా జాగ్రత్త అవసరం. 'వాదం'లో తాత్త్విక దృక్పథం కంటే, తమ ఆశలను, ఆశయాలను వినిపించడమే ప్రధానమవుతుంది. అందులో తాత్త్విక నేపథ్యం ఉన్నా లేకపోయినా పెద్దగా నష్టం లేదు. అది కొన్నిసార్లు కొన్ని తాత్కాలిక ప్రయోజనాలను మాత్రమే ఆశిస్తుంది. తార్కిక నిరూపణలతో ముడిపడి ఉంటుంది. కానీ, ఉద్యమంలో స్పష్టమైన ప్రణాళిక, లక్ష్యం, తాత్త్విక నేపథ్యం, దృక్పథం మొదలైవి ఉంటాయి. తెలుగు సాహిత్యంలో చాలా సందర్భాల్లో వాదానికి, ధోరణికి మధ్య అభేదం పాటించడం ఉంది. అయితే వాదానికి, ధోరణికి తేడా వుంది. ఒక ప్రత్యేకమైన దృక్పథం ఉన్నదాన్ని వాదంగా చెప్పుకోవచ్చు. అయితే ధోరణి అంటే పోకడ, పద్ధతి, విధానం, అనుసరణ మార్గం లేదా ఒక విషయం పట్ల చూపే మొగ్గుదల అని స్థూలంగా చెప్పుకోవచ్చు. పద్ధతి అనేది కొన్ని సూత్రాలకు లోబడి ఉంటుంది. దీనిలో నిష్పాక్షికత, వస్తుతత్త్వం ఉంటుంది.(యాకుబ్.ఆధునిక తెలుగు సాహిత్య విమర్శ.47:2018)

Trend అనే ఆంగ్లపదానికి సమానార్థకంగా మనం ధోరణి అనే పదాన్ని వాడుతున్నాం. ధోరణి పదానికి ఆక్స్ ఫర్డ్ నిఘంటువులో అర్థాలు ఈ విధంగా వున్నాయి. "To turn or directs one's course అంటూ  to turn off in a specified direction; to trend to take a direction or course అని, to turn in same direction, to have a general tendency"[1] అని వ్యాఖ్యానిస్తుంది.

అయితే ఉద్యమానికి గానీ, వాదానికి గానీ సైద్ధాంతిక దృక్పథం ఆధారమవుతుంది. వాదానికి, ధోరణికి మధ్య గల తేడాను వివరిస్తూ "అభ్యుదయవాదంలో దిగంబర కవిత్వం ఒక ధోరణి అని చెప్పవచ్చును. స్త్రీవాదం సంప్రదాయ పద్ధతిని, మార్క్సిస్టు భావజాలాన్ని, పెట్టుబడిదారీలోని వ్యక్తివాదాన్ని అనుసరిస్తూ ఎన్నో దిశలుగా విస్తరిస్తూ అనేక పాయలుగా కన్పిస్తున్నది. వాటిని 'స్త్రీవాద ధోరణులు' అని అనవచ్చును. "దళితవాదంలో మేమే కవులదొక మార్గం. దాన్ని దళితవాదంలోని ధోరణిగా చెప్పుకోవచ్చును" అనంటారు ముదిగంటి సుజాతారెడ్డి. 'ధోరణి' అనేది ఒక ఆలోచన విధానం. ఒక నిర్దిష్ట కాలంలో అత్యధికులు ఆచరిస్తున్న ఆలోచన విధానమే ధోరణి. ఇది ఆత్మాశ్రయ తత్త్వంలోబడి ఉంటుంది. ధోరణిని సాహిత్య ప్రక్రియలకు అన్వయించి చెప్పిన నిర్వచనాలను, లక్షణాలను సాహిత్య విమర్శకు కూడా అన్వయించవచ్చు.

## 2.6 సాహిత్య విమర్శ పద్ధతులు

తెలుగు సాహిత్యంలో ప్రస్తుతం విమర్శ అనేది ఒక ప్రత్యేకమైన సాహిత్య ప్రక్రియగా రూపాంతరం చెందింది. అలాగే దీన్ని అధ్యయనం చేయడంలో ఎన్నో రకాల విమర్శ పద్ధతులు అందుబాటులోకి వచ్చాయి. అందులో కొన్ని ప్రాచీన మరియు మరికొన్ని ఆధునికంగా ఏర్పడిన విమర్శనా పద్ధతులు. ఇందులో ఎన్ని రకాల విమర్శ పద్ధతులు ఉన్నాయో ఒకసారి పరిశీలించడం అవసరం.

విమర్శ పదాల డిక్షనరీ (ఎస్.ఎస్.నళిని) అనుసరించి విమర్శ పద్ధతులు ఈ క్రింది రకంగా ఉన్నాయి.

---

[1] https://www.oed.com/view/Entry/205545?rskey=9fh2TW&result=2&isAdvanced=false#eid

1. Academic  Criticism(అకాడమిక్ విమర్శ)
2. Analytical Criticism (విశ్లేషణాత్మక విమర్శ)
3. Applied Criticism (అన్వయ విమర్శ)
4. Archetypical Criticism  (ప్రాగ్రూప విమర్శ)
5. Authoritarian Criticism (నిరంకుశ విమర్శ)
6. Background Criticism (నేపథ్య విమర్శ)
7. Biographical Criticism  (కవి జీవిత కావ్య సమన్వయ విమర్శ)
8. Contextual Criticism (పాఠ్యాధార విమర్శ)
9. Descriptive Criticism (కావ్యనుశీలనం)
10. Eco criticism (పర్యావరణ విమర్శ )
11. Expressionistic Criticism (అభివ్యక్తి విమర్శ)
12. False Criticism (అసత్య విమర్శ)
13. Feminist Criticism (స్త్రీ వాద సాహిత్య విమర్శ)
14. Formalist Criticism (లాక్షణిక విమర్శ)
15. Historical & biographical approach(జీవిత చరిత్ర ఆధార పరిశీలనాపద్ధతి)
16. Impressionistic Criticism (అభిరుచి విమర్శ)
17. Judicial Criticism  (లాక్షణిక విమర్శ)
18. Legislative Criticism (కావ్య లక్షణ విమర్శ)
19. Marxist Criticism (మార్క్సిస్ట్ విమర్శ)
20. Meta Criticism (మెటా క్రిటిసిజం)
21. Moral Criticism (నైతిక విమర్శ)
22. Myth Criticism (పురాణ విమర్శ)
23. Natural Criticism (ప్రకృతి వాద విమర్శ)
24. New Criticism (నవ్య విమర్శ)
25. Objective Criticism (వస్త్వాశ్రయ  విమర్శ)
26. Phenomenological Criticism (దృగ్గోచర అంశాధార విమర్శ)
27. Pluralistic Criticism (బహుళ వాద విమర్శ)

28.Polemical Criticism (వాద ప్రతివాద విమర్శ)

29.Practical Criticism (ప్రాయోగిక విమర్శ)

30.Prescriptive Criticism (నిర్దేశాత్మక విమర్శ)

31.Progressive Criticism (అభ్యుదయవాద విమర్శ)

32.Psycho analytical Criticism (మనో విశ్లేషణాత్మక విమర్శ)

33.Reader response Criticism (పాఠక ప్రతిస్పందనాధార విమర్శ)

34.Revolutionary literary Criticism (విప్లవ సాహిత్య విమర్శ)

35.Romantic Criticism (కాల్పనిక విమర్శ)

36.Superficial Criticism (అసమగ్ర విమర్శ)

37.Technical Criticism( సాంకేతిక విమర్శ )

38.Textual Criticism (గ్రంథ పరిష్కార విమర్శ)

ఈ విధంగా తెలుగు సాహిత్యంలో విమర్శకులు తమ తమ వ్యక్తిగత భావాలనుగుణంగా వివిధ విమర్శ పద్ధతులను తెలుగు సాహిత్యంలో ప్రవేశపెట్టారు. వీటిని తిరిగి ప్రాచీన విమర్శ పద్ధతులని, ఆధునిక విమర్శ పద్ధతులని రెండు రకాలుగా విభజించుకోవచ్చు. మళ్ళీ తిరిగి ఆధునిక విమర్శ పద్ధతులను సాహిత్య సంబంధమైనవిగా, సాహిత్యేతర విమర్శనా పద్ధతులుగా వింగడించవచ్చు. ఇలా సాహిత్యంలో అనేక రకాల ఉన్నప్పటికీని ఆలంకారిక విమర్శ, గ్రంథ విమర్శ, కవిజీవిత విమర్శ, మార్క్సిస్ట్ విమర్శ, మనోవైజ్ఞానిక విమర్శ వంటి విమర్శపద్ధతులను తెలుగు సాహిత్యంలో ప్రధానంగా వాడుతున్నారు.

## 2.7 సాహిత్య విమర్శలో ముదిగంటి సుజాతారెడ్డి

సాహిత్యం ఎల్లప్పుడూ సమాజ ప్రతిబింబం. ఆ సాహిత్యాన్ని సృష్టించే రచయిత పై ఆ ప్రాంత ప్రభావం మనకు ఆయా రచనల్లో కనిపిస్తుంది. అలాగే ఆ రచనల ప్రభావం కూడా అక్కడి సమాజంపై ఉంటుంది. ఇది ఒక అనివార్యమైన నిరంతర ప్రక్రియ. అందుకే నా విమర్శ పరిశోధనాంశంలో భాగంగా ముందుగా రచయిత ప్రాంతీయ నేపథ్యంపై ఒక

ప్రాథమిక అవగాహన ఉండాలనే ఉద్దేశ్యంతో రచయిత ప్రాంతీయ నేపథ్యాన్ని కొంత పరిచయం చేస్తున్నాను.

### 2.7.1 ప్రాంతీయ నేపథ్యం

తెలంగాణ అంటేనే చరిత్రలో మొదటి నుండి ఒక ప్రత్యేకమైన స్థానాన్ని కలిగి ఉన్న ప్రాంతం. శాతవాహనుల నుండి అసఫ్ జాహీల వరకు వివిధ పాలకుల పాలనలో ఉండి తద్వారా వైవిధ్యాన్ని సంతరించుకొన్న ఒక గొప్ప ప్రాంతం. కృష్ణా గోదావరివంటి జీవనదుల మిశ్రమంతో కలిసి బలమైన పునాదితో తనకంటూ ఒక ప్రత్యేకమైన చరిత్ర, సంస్కృతిని ఏర్పరుచుకున్న నేల తెలంగాణ.

తెలంగాణలోని కొన్ని చారిత్రక ఆధారాలను గమనిస్తే "కర్నూలు జిల్లాలోని శ్రీశైలం, తూర్పుగోదావరి జిల్లాలోని ద్రాక్షారామం, కరీంనగర్ జిల్లాలోని కాళేశ్వరం ఈ మూడును గొప్ప శైవ క్షేత్రములు. ఈ మూడు లింగముల మధ్యనున్న దేశమునకు త్రిలింగ దేశము అనే పేరు వచ్చినది. 'అణెము' అనగా దేశమని అర్థము. కావున త్రిలింగదేశము, త్రిలింగాణెము తర్వాత త్రిలింగాణము అయినది. త్రిలింగణా శబ్దమే మారి 'తెలంగాణెము' "తెలంగాణము" అను పేరు వ్యవహారంలోకి వచ్చినది. శాసనములలో దీనిని తిలింగమనిరి" అని ఆదిరాజు వీరభద్రరావు తమ 'తెలంగాణము' అనే గ్రంథంలో తెలంగాణకు ఉన్న చారిత్రక భౌగోళిక నేపథ్యాన్ని వివరించారు.

తెలంగాణ ప్రాంతం ఆంధ్ర రాష్ట్రంలో కలవకముందు నిజాం రాష్ట్రంలో ఒక భాగంగా ఉండి క్రీ.శ1948 సెప్టెంబర్ లో పోలీసుచర్య ద్వారా ఏర్పడిన హైదరాబాద్ రాష్ట్రంలో ఉన్న తెలుగు ప్రాంతమే తెలంగాణ. క్రీస్తుపూర్వం నుండి క్రీ.శ.1956లో ఏర్పడిన ఆంధ్రపదేశ్ ఆవిర్భావం వరకు తెలంగాణ ప్రాంతం రాజకీయంగా, భౌగోళికంగా, చారిత్రకంగా, సాంస్కృతిక పరంగా ఒక ప్రత్యేక ఉనికిని చాటుకుంటూనే ఉంది. ప్రపంచ చరిత్రలో జరిగిన మహోద్యమాల్లో రైతాంగ సాయుధ పోరాటం విశిష్టమైంది. ఇంత గొప్ప ఉద్యమాన్ని నడిపిన తెలంగాణ రాష్ట్రము దేశంలోని భిన్న ఉద్యమాలకు ఆదర్శంగా నిలిచింది. సాహిత్యపరంగా పాల్కురికి సోమన, పోతన, గోనబుద్ధారెడ్డి లాంటి ప్రాచీన కవులను దాశరథి, సినారె, అలిశెట్టి లాంటి ఆధునిక గొప్ప గొప్ప కవులను అందించింది.

పౌరాణిక వాఙ్మయంలో దక్షిణపథంగా పేర్కొనబడి తర్వాత దక్కన్ పీఠభూమిలో ఒక భాగంగా పిలవబడుతుంది.

"భారత ద్వీపకల్పంలో తెలంగాణ 15° 55' నుంచి 19° 55' ఉత్తర అక్షాంశాల మధ్య 77° 22.35' నుంచి 81° 2.23' తూర్పు రేఖాంశాల మధ్య విస్తరించి ఉంది"(మల్లారెడ్డి, తూర్పు.(సంపా) తెలంగాణ సాహిత్యం–జీవిత చిత్రణం, 2007:01)

"తెలంగాణ ప్రాంతం ఉత్తరంలో గోదావరి, ప్రాణహిత దక్షిణాన కృష్ణా, తుంగభద్ర నదులు తూర్పున తీరాంధ్ర ప్రాంతాన్ని వేరుచేస్తూ నల్లగొండ, ఖమ్మం జిల్లాలోని పర్వతాలు. కర్ణాటక, మహారాష్ట్రలను వేరుచేస్తూ ఉత్తర పశ్చిమదిశలలో ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్, రంగారెడ్డి జిల్లాల్లో ఉన్న పర్వతపంక్తులు దాదాపు తెలంగాణ ప్రాంత సహజ సరిహద్దులు అని చెప్పుకోవచ్చు. ఈ సరిహద్దులు తెలంగాణ రాజకీయ చరిత్రను, తద్వారా పరిపాలన విభాగం ఏర్పాటు తద్వారా తెలంగాణ ప్రత్యేక ఉనికిని నిర్దేశించినవి".

"కాకతీయుల కాలానికి చెందిన విద్యానాథుడు ప్రతాపరుద్రీయంలో 'త్రిలింగదేశం' ప్రయోగించాడు. క్రీస్తుశకం 1358 శ్రీరంగం తామ్రశాసనంలో 'తెలింగదేశ' ప్రస్తావన ఉంది. మెదక్ జిల్లా తెల్లాపూర్ లో బయటపడిన క్రీ.శ 1417 నాటి శాసనంలో 'తెలుంగాణా' పదం పేర్కొనబడింది. తెలంగాణ పదాన్ని సూచించే లభ్యమవుతున్న మొదటి శాసనం ఇదే, తర్వాత ఒక శతాబ్దానికి క్రీస్తుశకం 1510 సంవత్సరంలో ప్రతాపరుద్ర గజపతి వెలిచర్ల శాసనంలో 'తెలంగాణా' పదం ప్రయోగించబడింది. తర్వాతి కాలంలో కాకతీయలు, ముస్లిం పాలకుల వ్యవహారాల్లో తెలంగాణ పదం విస్తృతమైన ప్రాచుర్యంలోకి"(మల్లారెడ్డి, తూర్పు.(సంపా)తెలంగాణ సాహిత్యం–జీవిత చిత్రణం, 2007:19) వచ్చినట్లుగా చెప్పవచ్చు.

## 2.7.2 తెలంగాణ సాహిత్య నేపథ్యం

సాహిత్యానికి అక్కడి సామాజిక, చారిత్రక, రాజకీయ ఉద్యమాలకు ఒక అవినాభావ సంబంధముంటుంది. అలాగే తెలంగాణ ప్రాంత సాహిత్యం క్రీ.పూ శాతవాహన కాలం నుంచి ప్రారంభమై తనకంటూ ఒక ప్రత్యేక భూమికను కలిగి ఉంది. శాతవాహన కాలంలో

కుంతల శాతకర్ణి(క్రీ.పూ 38-30) ఆస్థానకవి అయిన 'గుణాఢ్యుడు' రాసిన 'బృహత్కథ'తో ప్రారంభమైన తెలంగాణ సాహిత్యం, ఆ తర్వాత పాల్కురి సోమనాథుడు ద్విపద ప్రక్రియలో రాసిన బసవపురాణం, పండితారాధ్య చరిత్రబట్టి తెలుస్తుంది. తెలుగులో తొలి ప్రాచీన కందపద్యాలు 'బొమ్మలమ్మగుట్ట' శాసనంలో లభించాయి. దీనిద్వారా తెలంగాణలో క్రీ.శ.9 శతాబ్ది నాటికే ఛందోబద్ధ సాహిత్యమున్నదని తెలుస్తుంది. అలాగే ఆంధ్రభాగవతాన్ని రచించిన బమ్మెర పోతన వరంగల్ జిల్లాకు చెందిన వాడుకాగా, కొఱవి గోపరాజు 'సింహాసన ద్వాత్రింశిక' తెలుగు కావ్య నిర్మాణంలో ఒక వినూత్న మార్గం వేశాడు. తొలిసంకలన గ్రంథాన్ని 'సకలనీతిసమ్మతం' సంకలనం చేసిన సాహితీ హృదయుడు మడికిసింగన. ఇతను స్వతంత్ర కావ్యకర్త అయినా ఇతర కవులను సంకలనం చేసి కొత్త దారి వేశాడు. అచ్చతెనుగు కవితకు శ్రీకారం చుట్టిన 'యయాతిచరిత్ర' రాసిన పొన్నగంటి తెలగన తెలంగాణ ప్రాంతానికి చెందినవాడిగా భావించవచ్చు. కాకతీయుల కాలంలో వెలువడిన మల్లిఖార్జుని 'పండితారాధ్యచరిత్ర', 'శివతత్వసారం', గోన బుద్ధారెడ్డి 'రంగనాథ రామాయణము', మారన 'మార్కండేయ పురాణము' తెలంగాణ సాహిత్యానికి వన్నె తెచ్చేవే.

తర్వాతి ఆధునిక కాలంలో వట్టికోట ఆళ్వారుస్వామి రాసిన 'ప్రజలమనిషి'తో మొదలై సురవరం ప్రతాపరెడ్డి, దాశరథి రంగాచార్యులు, దాశరథి కృష్ణమాచార్యులు, సి. నారాయణరెడ్డి, కాళోజీ నారాయణరావు, సుద్దాల హనుమంతు, యాదగిరి వీరందరు తెలంగాణ సాహిత్యంలో తమవంతు పాత్రను పోషించారు. మాడపాటి హనుమంతరావు, పొట్లపల్లి రామారావు, ముదిగంటి సుజాతారెడ్డి, సుంకిరెడ్డి నారాయణరెడ్డి, యశోదరెడ్డి, కాలువ మల్లయ్య, కాసుల ప్రతాపరెడ్డి, కాసుల లింగారెడ్డి, సంగిశెట్టి శ్రీనివాస్ ఇంకా ఎంతో మంది సాహిత్యకారులు తెలంగాణలో ఉన్న భిన్న నేపథ్యం పరంగా రచనలు చేస్తూ ఈ ప్రాంత సాహిత్యాన్ని ఫలవంతం చేస్తున్నారు.

### 2.7.3 తెలంగాణ సాహిత్య విమర్శ నేపథ్యం

తెలుగు సాహిత్యంలో తెలంగాణ ప్రాంత సాహిత్య విమర్శ కొంత భిన్నంగానే ఉందని చెప్పవచ్చు. దీనికి అనుగుణంగా తెలంగాణ సాహిత్య విమర్శకులను నేడు గుర్తించాల్సిన అవసరం ఏర్పడింది.

తెలంగాణలో సాహిత్య విమర్శ మిగతా ప్రాంతాలతో పోలిస్తే దీనికి చారిత్రక, భౌగోళిక, సామాజిక నేపథ్యాలకు అనుగుణంగా దీని పరిణామక్రమం ఏర్పడింది. ప్రస్తుతం తెలంగాణ విమర్శ, నిర్మాణదశలో ఉన్నట్లు అనిపిస్తుంది. ఇది తమను తాము తెలుసుకునే క్రమంలో ఉంది. విద్యానాథుడి ప్రతాపరుద్ర యశోభూషణం, విశ్వేశ్వర కవి చమత్కార చంద్రిక, మల్లియ రేచన కవిజనాశ్రయము, అప్పకవి అప్పకవీయం ఇలా సాగుతూ, ఆధునికకాలంలో పరిశోధన, విమర్శ సంఘటితమైనట్లు కనిపిస్తుంది. దీనిలో సురవరం ప్రతాపరెడ్డి, కొమర్రాజు లక్ష్మణరావు, మానవల్లి, శేషాద్రి రమణ కవులు, ఆదిరాజు వీరభద్రరావు వీరందరూ ప్రాంతీయ భేదం లేకుండా విమర్శను సాగించారు. సురవరం ప్రతాపరెడ్డిగారి "గోల్కొండ పత్రిక", "ఆంధ్రుల సాంఘిక చరిత్ర" వంటి గొప్ప గ్రంథాలు సాహిత్యాన్ని విమర్శనా దృష్టితో అధ్యయనం చేశాయి. ఇవి తెలంగాణ ప్రాంత విమర్శకు కేంద్ర బిందువుగా ఉన్నాయి. అందుకే వీరిని తొలి తెలంగాణ ఆధునిక విమర్శకుడిగా భావించాల్సిన అవసరం ఉంది. తదనంతరకాలంలో బిరుదురాజు రామరాజు, పల్లా దుర్గయ్య, కె.గోపాలకృష్ణారావు, ఏం.కులశేఖరరావు, కృష్ణమూర్తి, ముకురాల, సి.నారాయణరెడ్డి విమర్శను మరోమెట్టు ఎక్కించగా ముదిగంటి సుజాతారెడ్డి, ఎస్వీ.రామారావు, కె.కె. రంగనాథాచార్యులు, కోవెల సంపత్కుమారాచార్యులు, చేకూరి రామారావు, యశోదరెడ్డి, ఎల్లూరి శివారెడ్డి ఈ వారసత్వాన్ని అందుకున్నారు.

ప్రస్తుత కాలంలో తెలంగాణలో వచ్చిన అస్తిత్వ ఉద్యమం, దాని ద్వారా వచ్చిన చైతన్య ప్రభావం, విమర్శలో ఆవిష్కరించడం మొదలుపెట్టింది. ఈ క్రమంలో కాసుల ప్రతాపరెడ్డి సంపాదకీయంలో వచ్చిన 'తెలంగాణ తోవలు' మరో కొత్త దారిని చూపించగా, సుంకిరెడ్డి నారాయణరెడ్డి. కె. శ్రీనివాస్, కాసుల లింగారెడ్డి, నందిని సిద్ధారెడ్డి, శ్రీధర్ రావు పాండే, వేణుగోపాల్, కాలువ మల్లయ్య, బన్న అయిలయ్య, గుడిపాటి, వరవరరావు, సీతారాం, కాశీం, లక్ష్మణ చక్రవర్తి, అంబటి సురేంద్రరాజు, జిలకర శ్రీనివాస్, పసునూరి రవీందర్, వంటి అనేకమంది నేటితరం విమర్శకులు తెలంగాణలో ఏర్పడ్డ బాటను మరింత విస్తృత పరుస్తున్నారు.

ఈ విమర్శకులు అందరిలో తనదైన శైలిలో ఒక వినూత్న దృక్పథంతో, మిగతా వారి కంటే భిన్నంగా విమర్శ చేయడంలో ముదిగంటి సుజాతారెడ్డి నిష్ణాతులు. ఈమె చేసే

విమర్శ ఒకవైపు తెలంగాణ సాహిత్య విమర్శ ప్రత్యేకతను గుర్తిస్తూనే, మరోవైపు దానిలో ఉన్న విశిష్ట లక్షణాలను స్పృశిస్తున్నారు. సాహిత్య, అలంకార, విమర్శ, సిద్ధాంత గ్రంథాలను గురించి తెలుపుతూ తెలంగాణ అస్తిత్వ ఉద్యమకాలంలో వచ్చిన సాహిత్య విమర్శను కూడా వివరిస్తున్నారు. **'మను వసుచరిత్ర తులనాత్మక పరిశీలన'**(1976) తో విమర్శ రంగంలోకి ప్రవేశించి **'తెలుగు నవలానుశీలనం', 'వేమన నాథ సాంప్రదాయం'** వంటి ప్రాచీన సాహిత్యంలో తన ముద్ర వేసుకొని, **'రసచర్చ–ఆధునికత'**తో కొత్త ప్రతిపాదనలు చేశారు సుజాతారెడ్డి. **ముద్దెర, చారిత్రక సామాజిక నేపథ్యంలో తెలుగు సాహిత్య చరిత్ర, తెలంగాణ తెలుగు సాహిత్య చరిత్ర**, వంటి గ్రంథాలు రచించి విమర్శ రంగంలో ప్రవేశించిన కొద్ది మంది స్త్రీలలో మంచి విమర్శ చేసినవారు ముదిగంటి సుజాతారెడ్డి. అందుకే వీరు చేసిన విమర్శలపై ప్రత్యేకంగా అధ్యయనం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని భావించి ముదిగంటి సుజాతారెడ్డి వివిధ సందర్భాల్లో రచించిన విమర్శ గ్రంథాలను ఈ అధ్యాయంలో భాగంగా మొదట కొంత ప్రాథమిక అవగాహన కోసం వాటిని కొంత సంక్షిప్తంగా పరిచయం చేయాలనుకుంటున్నాను.

## 2.8 విమర్శగ్రంథాలు-ఒక పరిచయం

సాహిత్య ప్రక్రియల్లో విమర్శ ఒక ప్రత్యేకమైన ప్రక్రియ. మిగతా ప్రక్రియలు కవుల, రచయితల సృజనాత్మకతపైన ఆధారపడేవి. కానీ, విమర్శ ఆయా రచనలను తరచి చూపే, తెరచి చూపే వచన ప్రక్రియ. విమర్శ ముఖ్యంగా ఏదైనా ఒక రచనను ఆశ్రయించుకొని సాగుతుంది. మూల రచనలోని ముఖ్య విషయాన్ని వెలికితీయడమైన, కవి అభిప్రాయాల్ని, కావ్య లేదా రచనల ప్రయోజనాన్ని విడమరిచి చెప్పేదే విమర్శ. ఇటువంటి అనేక విమర్శ గ్రంథాలను ముదిగంటి సుజాతారెడ్డి రాశారు. ఈ విమర్శ గ్రంథాలను ఈ పరిశోధన రచనలో మూడు భాగాలుగా విభజించి విశ్లేషించాను. వాటిని ఈ అధ్యాయంలో భాగంగా ఒకసారి స్థూలంగా వివరించడం అవసరమని నా భావన.

### 2.8.1 ఆలంకారిక సంబంధిత విమర్శ ధోరణులు

భరతుడి దగ్గర్నుంచి జగన్నాథుడి వరకూ సంస్కృతాలంకారికులు అలంకారాలు రీతి వృత్తి గుణ, దోష విచారాలు వక్రోక్తి వైచిత్ర్యాలు గురించి చేసిన చర్చ రూపానికీ, శైలీ

శాస్త్రానికి సంబంధించినవిగా భావించవచ్చు. కొంతమంది భారతీయ ఆలంకారిక విమర్శకులు రసదృక్పథం, ఆలంకారిక దృక్పథం, వక్రోక్తి దృక్పథం, ఔచిత్య దృక్పథంతో విమర్శలు చేశారు. ఇదే ధోరణిలో ఆలంకారిక శాస్త్రంపై సాధికారమైన పట్టుతో మను వసుచరిత్రల తులనాత్మక పరిశీలన, శ్రీనాథుని కవితా సౌందర్యం, బాణుని కాదంబరి పరిశీలన, వేమన నాథసంప్రదాయం పేరుతో రాసిన గ్రంథాల్లోని ఆలంకారిక విమర్శ దృక్పథంలో ముదిగంటి సుజాతారెడ్డి కొన్ని విమర్శ రచనలు చేశారు.

## 2.8.1.1 మను–వసు చరిత్రల తులనాత్మక పరిశీలన

ముదిగంటి సుజాతారెడ్డి తన సిద్ధాంత వ్యాసం అయినా “మనువసు చరిత్రల తులనాత్మక పరిశీలన(1976)” అనే ఈ గ్రంథంతో విమర్శ రంగంలోకి అడుగుపెట్టారు. ఈ సిద్ధాంత గ్రంథంలో మనవసు చరిత్రకారులను ఇద్దరిని ఒకచోట చేర్చి వారి పద్య నిర్మాణ శిల్పం, కథ గమన పద్ధతి, అలంకారాలు, వర్ణనలు, రసం మొదలైన ఇతర అంశాలను దీనిలో సమగ్రంగా చర్చించారు.

ముదిగంటివారు ఈ గ్రంథంలో మను వసుచరిత్రల్లోని కథా సంవిధానంలోను, వర్ణనల్లోను, సన్నివేశ కల్పనలోను, రసపోషణలోను, పాత్ర చిత్రణ, నాటకీయత, పాండిత్యం వారి ఇరువురి రచన శైలిలో ఎన్నో పోలికలు ఉన్నాయని వాటన్నింటిని ఎంతో విశ్లేషణాత్మక నైపుణ్యంతో ఈ గ్రంథంలో వివరించారు. అలాగే ఈ గ్రంథంలో శ్లేషచక్రవర్తిగా పేరు పొందిన భట్టుమూర్తి చరిత్రలో శ్లేషయా? ధ్వనియా? అనే విషయాన్ని విమర్శనాత్మక దృష్టితో ఈ గ్రంథంలో పరిశీలించారు.

*“సంస్కృత సాహిత్యమున మాఘునకు, భారవి యెడల కవితావిజిగీష కలదో అట్టి కవితావిజిగీష తోడనే రామరాజభూషణుడు రచన స్పర్ధవహించి పెద్దలను మించవలయును అనే ప్రయత్నముతో వసుచరిత్రను రచించాడు. అట్టి రామరాజభూషణుని కవితావిజిగీష ఎంతవరకు సఫలమయినదో ఈ సిద్ధాంతం వ్యాసంలో పరిశీలించబడినది”* అని రచయిత్రి తమ అభిప్రాయాన్ని ఈ గ్రంథ ముందుమాటలో వ్యక్తపరిచారు.

రచయిత్రి ఈ సిద్ధాంత గ్రంథాన్ని పరిశోధనాత్మక దృష్టితో రచించారు. ఈ సిద్ధాంత గ్రంథాన్ని మొత్తం 12 ప్రకరణాలుగా విభజించారు. మనుచరిత్ర వసు చరిత్ర రెండు

గ్రంథాలలోని విషయాలను నిష్పక్షపాత దృష్టితో పరిశీలించినట్లు ఈ గ్రంథం ద్వారా తెలుస్తోంది. ఈ గ్రంథం ద్వారానే ముదిగంటి సుజాతారెడ్డిగారిలో విమర్శ రంగానికి కావలసిన బీజాలు పడినట్లుగా అర్థమవుతుంది.

### 2.8.1.2 శ్రీనాథుని కవితాసౌందర్యం

ముదిగంటి సుజాతారెడ్డి మొదటగా 'శ్రీనాథుని కవితాసౌందర్యం' అనే విమర్శ గ్రంథాన్ని 1980లో రచించారు. దీనిలో 'శ్రీనాథుని జీవితం, రచనలు, వ్యక్తిత్వం కవితారీతుల్ని విమర్శనాదృష్టితో అనుశీలన చేశారు. శ్రీనాథుని కవిత్వాన్ని సరళంగా చాలా సులభమైన శైలిలో దీనిలో విశ్లేషించారు.

శ్రీనాథుని కవితా సౌందర్యం అనే ఈ విమర్శ గ్రంథంలో సుజాతారెడ్డి శ్రీనాథుని రచనలో  ఉన్న విభిన్న అంశాలను దాని ప్రత్యేకత విశ్లేషించారు. వాటిలో శ్రీనాథుని జీవన సౌందర్యం, జననం, కాల వివాదాలు, రచనలు వాటిలోని  భిన్నాభిప్రాయాలు, అలాగే శ్రీనాథుని రచనలు ఉండే రీతి, ప్రస్తావన గురించి కూడా తెలియజేశారు. ఈ గ్రంథంలో ఆమె శ్రీనాథుని కళా సౌందర్యం గురించి, చిత్రణాకళ గురించి శైలి సౌందర్యం, శ్రీనాథుని వాడకంలో ఉండే శబ్ద సౌందర్యం, అలంకార ఉపయోగం మొదలైన వాటిని విశ్లేషణాత్మక దృష్టితో వర్ణించారు.

ఈ విమర్శనాత్మక గ్రంథంలో రచయిత శ్రీనాథున్ని ఒక గొప్ప పండితుడుగా గుర్తించారు. కావ్యశైలి ద్వారా ఇతర కవులకు ఎలా మార్గదర్శకుడుగా నిలిచాడని  శ్రీనాథుని కీర్తించారు. శ్రీనాథుని కవితా సౌందర్యం అనే ఈ గ్రంథంలో శ్రీనాథుని రచనలు భిన్నాభిప్రాయాలు ఒక పరిశీలన చేసి వీటిలోని ఆధారాల ఆధారంగా వాటిని ఒక మూల్యంకనం చేసే ప్రయత్నం ఈ గ్రంథంలో గమనించవచ్చు.

### 2.8.1.3 వేమన-నాథ సంప్రదాయం

ముదిగంటి సుజాతారెడ్డి "వేమననాథ సంప్రదాయం" అనే  విమర్శ గ్రంథం ద్వారా వేమన 'నాథ' సాంప్రదాయానికి చెందిన వాడుగా ఒక భిన్నమైన కోణంలో తనదైన రూపంలో చెప్పి దీన్ని 1993 సంవత్సరంలో ప్రచురించారు. వేమనపై ఎంతోమంది

ఇప్పటివరకు పరిశోధనలు చేసి భిన్నమైన అభిప్రాయాలు తెలుపగా ముదిగంటివారు కొన్ని నూతన విషయాలతో వేమన నాథ సాంప్రదాయాన్ని నవనాథులను, నాథసాంప్రదాయ సిద్ధాంతాలను, ఇతర విషయాలను, విశ్లేషించి మరోసారి తన ప్రత్యేకతను సాహిత్య లోకానికి తెలియజేశారు.

7-15 శతాబ్దాల మధ్యకాలంలో వ్యాప్తిలోనికి వచ్చిన నాథసంప్రదాయానికి చెందినవారు. మూఢాచారాలను, అంధవిశ్వాసాలను ఖండించినట్లు, క్రతువులను, కర్మకాండను నిరసించారని ఈ లక్షణాలు వేమన రచనల్లో కూడా కనిపిస్తాయని ఈ గ్రంథం ద్వారా నిరూపించే ప్రయత్నం చేశారు ముదిగంటివారు .

*"డాక్టర్ ముదిగంటి సుజాతారెడ్డి 'వేమన-నాథసంప్రదాయం' అనే గ్రంథం చాలా విలక్షణమైనది. ఒక కొత్త దృక్పథంతో కొత్తగా సేకరించిన సమాచారంతో, కొత్త విశ్లేషణతో, వేమన సంప్రదాయ ప్రవర్తకుడిగా, ప్రవక్తగా ఈ గ్రంథం ప్రతిపాదిస్తున్నది. ఈ ఆలోచన ఇదివరలో ఎవరూ చేయలేదు. అని దీన్నిబట్టి ఒక కొత్త విషయాన్ని ఈ గ్రంథం ద్వారా ప్రతిపాదించినట్టు తెలుస్తోంది"*(రమాపతిరావు, అక్కిరాజు,1994:ఆంధ్రప్రభ సమీక్షా వ్యాసం) అలాగే ఈ గ్రంథంలో వేమన అనే పేరు ఎలా వచ్చిందో ఒక భిన్నమైన దృక్పథంతో విశ్లేషించారు. ఇందులో 'వేమ' శబ్దానికి మూల 'భీమ' అని ఒక సిద్ధాంతం చేస్తూ, "భీమ-వీమ-వేమ" అయిందని స్థాపించారు. దీనిలో వీరు వాసుదేవ వేయించిన బంగారు నాణెం ఆధారంగా కుషాణులు, భీమరూపుడైన శివుణ్ణి ఆరాధించాలని చెప్పటం, 'రెండో కాడ్ ఫీసిస్' భీమ"కు ప్రాకృత రూపమైన 'వీమ'ను నామంగా ధరించారని చెప్పి ఆధారాలు చూపించారు.

## 2.8.1.4 బాణుని కాదంబరి పరిశీలన

బాణుని కాదంబరి పరిశీలన అనే ఈ గ్రంథాన్ని, సుజాతారెడ్డి తమ భర్త అయిన గోపాల్ రెడ్డితో కలిసి రాశారు. ఇందులో వీరిద్దరు అధ్యయనం చేసిన విషయాలు, బాణుని జీవితం, కాలం, రచనలు కాదంబరి ఇతివృత్తం, శైలి, అలంకారాలు, రసపోషణ, వర్ణనలు అలాగే కాదంబరి నాటకంలోని సామాజిక విషయాలు అన్నింటినీ దీనిలో విశ్లేషించారు.

ఈ గ్రంథంలో వీరిద్దరూ ఒక ప్రత్యేకమైన చర్చను చేశారు గద్యమా? పద్యమా? వీటిలో ఏది ముందు? అనే దాన్ని తీసుకుని మానవుడు మాటలు నేర్చినప్పుడే గద్యం ప్రారంభమవుతుందని కావున గద్యమే ముందు అవిర్భావించినట్లు ఈ గ్రంథంలో వీరు తేల్చి

చెప్పారు. మృచ్ఛకటికం, దశకుమార చరిత్ర వంటి గొప్ప కావ్యాల తర్వాత సమకాలీన జీవితాన్ని ప్రతిబింబించే కావ్యంగా కాదంబరి నిలుస్తుందని చెప్పి దీనిలోని రచనా నైపుణ్యం, రాజకీయ, ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక, విషయాలన్నింటిని ఈ గ్రంథంలో తెలియజేశారు.

## 2.8.2 ఆధునిక సాహిత్య విమర్శ గ్రంథాలు

తెలుగు సాహిత్యంలో చాలా మంది కవులు, రచయితలు ఉన్నారు. వీరిలో కొందరు ప్రాచీన సాహిత్య మార్గాన్ని అనుసరించారు. మరికొందరు ఆధునిక సాహిత్యాన్ని అనుసరించారు. కొందరు రెండింటినీ అనుసరించారు. వీరు రెండింటిని అనుసరించినప్పటికీ ఒక్కొక్క దానిని ఒక్కో ప్రత్యేక దృష్టితో చూస్తూ రెండింటికి భేదాన్ని పాటించారు. ఇలా సాహిత్య చరిత్రలో ప్రాచీన సాహిత్యాన్ని ఆధునిక కోణంలో పరిశీలించిన వారిలో సుజాతారెడ్డి ఒకరు. ఒకవైపు ప్రాచీన సాహిత్యాన్ని ఆధునిక కోణంలో చూస్తూనే మరోవైపు మారుతున్న ఆధునిక మార్పులకుగుణంగా తమ రచన నైపుణ్యాన్ని ఆధునిక సాహిత్యం వైపు మలుపు తిప్పుకున్నారు. ముఖ్యంగా ఆధునిక సాహిత్య ప్రక్రియలైన నవల, కథ, వ్యాస ప్రక్రియ ద్వారా తమ విమర్శ రచనకు పదును పెట్టారు.

### 2.8.2.1 తెలుగు నవలానుశీలనం

1991లో 'తెలుగు నవలానుశీలనం' అనే గ్రంథాన్ని ముదిగంటి సుజాతారెడ్డి రచించగా దీనిలో నవల పుట్టుపూర్వోత్తరాలను హేతుబద్ధంగా వివరించారు. ఇందులో కథ, నవల సాహిత్యానికంతటికీ ప్రాచీన భారతీయ సాహిత్యం మూలభూతమైనయినదని పేర్కొన్నారు. భారతీయ సాహిత్యం ప్రాశ్చాత్య నవల అనే ప్రక్రియకు కారణం అయినట్లు ఈ గ్రంథంలో ఈమె విశ్లేషణ సాగించారు.

పంచతంత్ర కథలు, విక్రమార్కుని కథలు, మర్యాద రామన్న కథలు, భేతాలుని కథలు, వంటి జానపద కథలు ఆధారంగా ఒక చోటి నుంచి మరోచోటికి బాటసారుల సహాయంతో చేరి చివరికి ఇవి ప్రాశ్చాత్య నవలా ప్రక్రియ ఉద్భవించడానికి ఒక కారణమైనట్లు సుజాతారెడ్డి దీనిలో వివరించారు.

ఈ గ్రంథంలో సుజాతారెడ్డి తెలుగు నవల దాని పుట్టుపూర్వోత్తరాలు 'నవల' అనే పదందాని ప్రస్తావన, తెలుగులో స్వతంత్ర నవల ఆవిర్భావం దాని కారణాలు, క్రమపరిణామన్ని పరిశీలించారు. అలాగే పాశ్చాత్య నవలకు మూల బీజాలు భారతీయ సాహిత్యంలో ఏ విధంగా ఉన్నాయో తెలియజేసే ప్రయత్నం ఈ గ్రంథం ద్వారా చేశారు. వీటితోపాటు తెలుగు నవలానుశీలనం అనే గ్రంథంలో సుజాతారెడ్డి తెలుగు నవల సాహిత్య వికాసాన్ని యుగాలుగా విభజించారు. తెలుగు నవలలు ప్రారంభంలో ఇతివృత్తం, పాత్రచిత్రణ, భాషా, శైలి ఏ విధంగా ఉన్నాయో తెలుపుతూ, తెలుగు నవల ప్రత్యేకతను దీనిలో పొందుపరిచారు.

## 2.8.2.2 రసచర్చ–ఆధునికత

'రసచర్చ-ఆధునికత'(2009) ద్వారా తెలుగు సాహిత్యంలో తనదైన దృక్పథంతో ఒక నూతన ప్రతిపాదనచేసి సాహిత్యకారుల దృష్టిని ఒక మలుపు తిప్పారు. దీనిలో "రససిద్ధాంతం-నవల" అనే అంశం ద్వారా నవల కూడా ఒక కావ్యమే. పాఠకుల మనస్సులను ఆకట్టుకోనగలిగే నవల అయితే దానిలో అలంకార శాస్త్రంలో చెప్పిన కొన్ని విశిష్టమైన అంశాలు ఉంటాయని అటువంటి భావోత్తేజన శక్తిగల నవలలో ఏదోక ఒక రసం ఉంటుందని తమ రస సిద్ధాంతాన్ని ముదిగంటి సుజాతారెడ్డి ఆధునిక రచనా ప్రక్రియ అయిన నవలకు అనువర్తింపజేసి దీన్ని ఒక 'ఆధునిక-ప్రాచీన సాహిత్య విమర్శ' గ్రంథంగా తీర్చిదిద్దారు.

అనుభూతి ప్రధానమైనది కవిత్వం, ఆలోచన ప్రధానమైనది కథానిక, జీవిత ప్రధానమైనది నవల. ఇలాంటి జీవిత అనుభవాన్ని అందించే నవలలో రసానుభూతి కలిగించే అంశాలున్నట్లు సుజాతారెడ్డి గుర్తించారు. రసాన్ని నవలకు అన్వయించే సందర్భంలో 'తాదాత్మ్యం' పొందడం ముఖ్యమని ముదిగంటివారు భావించారు. రస సిద్ధాంతాలను ప్రాచీన ప్రమాణాలతో కాకుండా, కొత్తగా వ్యాఖ్యానం చేయడం, కొత్తదృష్టితో చూడటం వల్ల నవలకు దీన్ని అనువర్తింప చేయవచ్చునంటారు సుజాతారెడ్డి. 'నవలల్లో వస్తుధ్వని' దాని స్వరూప స్వభావాలను తెలియజేస్తూ, ధ్వని సిద్ధాంతాన్ని తెలుగు నవలకు అన్వయించినట్లు తెలుస్తుంది. ముదిగంటివారు చేసిన ఈ ప్రతిపాదనపైన తెలుగు సాహిత్యంలో చాలా వాదోపవాదాలు జరిగాయి.

*"సాహిత్య విమర్శ రీతుల్లో మనకు రీతి, వక్రోక్తి, ధ్వని రస మొదలైన సిద్ధాంతలెన్నో ఉన్నాయి. అవి భారతీయ మేధస్సు ప్రపంచ సాహిత్య విమర్శకు ఇచ్చిన గొప్ప సిద్ధాంతాలు. మనకు ఎంతో జ్ఞాన సంపద ఉంది. వాటిని ఆధునికరించి కొత్త నిర్మాణాలను సృష్టించుకొని మన ఆధునిక సాహిత్యానికి అనువర్తింపజేసే అవసరమేంతో వుంది. దానిలో భాగంగా రేణువంత ప్రయత్నం, కృషి నేను ఈ పుస్తకంలో చేశాను.*(రసచర్చ–ఆధునిక, 2010:ముందుమాట) అని రచయిత్రి ఈ గ్రంథం రాయడానికి గల అవసరాన్ని తెలియజేశారు. దీని ద్వారా ముదిగంటి సుజాతారెడ్డి సాహిత్య చర్చల ద్వారా ఒక ఏదైనా విషయం చెప్పడమే కాకుండా కొత్త దృక్పథంతో చెప్పడం అవసరమని, ఇది సాహిత్యాభివృద్ధికి ఉపయోగపడుతుందని నిరూపించారు.

## 2.8.2.3 అద్యతన దృష్టి

వీరు "ఆద్యతన దృష్టి"(2014)తో తెలుగు పాఠకుల దృష్టిని మరోసారి ఆకర్షించారు. ముదిగంటి సుజాతారెడ్డి ఈ గ్రంథం ద్వారా ముత్యాలవంటి 30 వ్యాసాలతో ఒక మాలను అల్లి విమర్శ లోకానికి తనదైన బహుమతి అందించారు. విమర్శనా ప్రక్రియ చేపట్టాలంటే నిశితమైన ప్రాపంచిక దృక్పథం, అలుపెరుగని నిరంతర అధ్యయనం, సాహిత్యంలో కళాతాత్త్వికత తెలిసి ఉండడం, వంటి లక్షణాలు అన్నీ సంపాదించుకొని, వీటన్నింటినీ మేళవిస్తే వచ్చిందే ఈ వ్యాసాల సంపుటి. దీనిలో కొన్ని వ్యాసాలు తప్ప మిగతావన్నీ సమకాలీన సాహిత్యానికి సంబంధించినవే. మరికొన్ని వ్యాసాలు తెలంగాణ ప్రాంతాన్ని విశ్లేషించేవి. దీనిలో "300 సినిమా సామ్రాజ్యవాదం వికృతరూపం" అనే ఒక సినిమా విమర్శ వ్యాసం ఉండడం విశేషం.

ఈ గ్రంథంలో రచయిత్రి చేసే విమర్శ చాలా సరళంగా, సులభశైలిలో ఉంటూ, అనేక లోతుపాతులను సానుకూల దృక్పథంతో పరిశీలన చేసిన ప్రయత్నం మనకు ఈ గ్రంథంలో కనిపిస్తుంది. వీటితో పాటు ఈ గ్రంథంలో ప్రస్తుతం సమాజంలో ముంచుకొస్తున్న ప్రపంచీకరణ అనే పెను ముప్పు గురించి కూడా, దీన్ని మన తెలుగు సాహిత్యంలో అనువర్తింప చేసుకునే విధానం గురించి ఈ వ్యాసాల నుండి గమనించవచ్చు.

ఈ పుస్తకంలో కాళిదాసు శకుంతల, రామాయణ–బాలనాగమ్మ కథలకు మూలం ఒక్కటేనా?, విశ్వనాథ భవభూతి స్పర్శ సిద్ధాంతం, కన్యాశుల్కంలో ఉన్న ఉర్దూ పదాలు,

కాళోజి జీవిత చరిత్ర, తెలంగాణ చరిత్ర, పాకుదురాళ్ళు–సినిమా జీవితం, స్త్రీవాదానికి విస్తృత నేపథ్యం, తెలంగాణ పోరాట నవలలు, ఆళ్వారుస్వామి నవలల్లో ప్రజాజీవితం, తిమిరంతో సమరం–దాశరథి వంటి విభిన్న నేపథ్యం గల వ్యాసాలు ఇందులో మనకు కనిపిస్తాయి.

## 2.8.2.4 ముద్దెర (సాహిత్య విమర్శ వ్యాసాలు)

తెలంగాణలో అస్తిత్వవాదం బలపడటానికి కారణమైంది "ముద్దెర(2005)". ముదిగంటి సుజాతారెడ్డిగారి సంపాదకత్వంలో వెలువడిన ఈ విమర్శనా గ్రంథంలో సుజాతారెడ్డి, కాసుల ప్రతాపరెడ్డి, జూలూరు గౌరీశంకర్, గుడిపాటి, నందిని సిధారెడ్డి వంటి రచయితల వ్యాసాలున్నాయి. ఇందులో కవులు తెలంగాణ సాహిత్యాన్ని సామాజిక, చారిత్రక, సైద్ధాంతిక కోణాల నుండి విమర్శించినట్లు తెలుస్తుంది. ముద్దెర వ్యాస సంపుటి తెలంగాణలో అస్తిత్వవాదం అనేది బలపడటానికి కావలసిన నేపథ్యాన్ని అందించినట్లు అనిపిస్తుంది. ముద్దెరలో అస్తిత్వవాదంలోని భిన్నమైన పార్శ్వాలను పరిచయం చేసింది. ఇది తెలంగాణ సాహిత్య విమర్శ అవగాహనకు తోడ్పడే గ్రంథం.

ఈ వ్యాసాల సంపుటిలో మొత్తం 14 వ్యాసాలు ఉండగా, ముదిగంటి సుజాతారెడ్డి ఇందులో ఐదు విమర్శ వ్యాసాలు రాశారు. ఈ వ్యాసాలన్నీ ఒక నిర్దిష్టమైన ప్రశ్నకు సమాధానం వెతికే ప్రయత్నంలాగా మనకు కనిపిస్తాయి. ఈ సాహిత్య విమర్శ వ్యాసాల్లో తెలంగాణ అస్తిత్వవాదంతో కూడిన సాహిత్యాన్ని పరిశీలన చేశారు ముదిగంటి. వీరు రాసిన ఐదు వ్యాసాలు ముఖ్యంగా తెలంగాణ అస్తిత్వాన్ని బలపరిచే విధంగా ఉన్నాయి. కవిత్వం, పాట, కథ, దీర్ఘకవిత వంటి వాటి స్వరూప స్వభావాలు, వాటిలో అస్తిత్వవాద వ్యక్తీకరణ భాష, వాటి వినియోగం ఒక ప్రాంతీయ కోణం నుండి విశ్లేషించబడ్డాయి. ఈ వ్యాసాలన్నీ తర్వాత కాలంలో అస్తిత్వ వాదానికి ఒక బలమైన నేపథ్యాన్ని అందించి, తెలంగాణ ప్రాంత సాహిత్య విమర్శరంగంలో తర్వాతి భవిష్యత్ రచనలకు ఒక పునాదిగా నిలిచాయి.

### 2.8.3 సాహిత్య చరిత్ర గ్రంథాలు

గత కాలపు వాస్తవాలను సాక్ష్యాధారాలతో స్పష్టంగా ధృవీకరించి తెలుసుకోవాలనే పట్టుదలే చరిత్ర అనే అధ్యయనం ఏర్పడడానికి పునాది. ఇలాంటి అధ్యయనం అనేది గతకాలం పట్ల కొత్త వాస్తవిక దృష్టిని మిగతా ప్రపంచానికి అందిస్తుంది. ఇదే విధానం సాహిత్య చరిత్ర రచనలో కూడా కనిపిస్తుంది. సాహిత్య చరిత్రల మార్గదర్శనం లేకుండా ఆయా భాషా సాహిత్యాల సంగతుల్ని అర్థం చేసుకోవడం దాదాపు అసాధ్యం. అంతేకాకుండా ఒక భాష సాహిత్యపు గత వైభవాన్ని గుర్తించేందుకు వర్తమాన క్రమాన్ని అంచనా వేసేందుకు కూడా సాహిత్య చరిత్రల తోడ్పాటు అవసరం. ఈ అవసరాన్ని గుర్తించిన సుజాతారెడ్డి ఇప్పటివరకు ఐదు సాహిత్య చరిత్ర గ్రంథాలను రచించారు.

### 2.8.3.1 ఆంధ్రుల సంస్కృతి–సాహిత్య చరిత్ర

ఈ గ్రంథం బి.ఎ విద్యార్థుల కోసం తయారుచేశారు. ముదిగంటి సుజాతారెడ్డిగారి "ఆంధ్రుల సంస్కృతి–సాహిత్య చరిత్ర" 1989లో గ్రంథరూపంలో వచ్చింది. దీనిని తెలుగు అకాడమి వారు ముద్రించారు. ఈ గ్రంథంలో ప్రాఙ్నన్నయ యుగం నుండి ఆధునిక యుగం వరకు ఆంధ్ర సంస్కృతి, సాహిత్య చరిత్రను రాశారు.

### 2.8.3.2 చారిత్రక సామాజిక నేపథ్యంలో తెలుగు సాహిత్య చరిత్ర

ముదిగంటి సుజాతారెడ్డి రాసిన చారిత్రక సామాజిక నేపథ్యంలో తెలుగు సాహిత్య చరిత్ర(1996)ను తెలుగు సాహిత్యంలో స్త్రీ రచించిన మొట్టమొదటి సాహిత్య చరిత్రగా చెప్పవచ్చు. (స్త్రీవాద పత్రిక భూమిక: మార్చి, 2018) ఈ రచనకు వీరు జీవియస్ సాహితీ పురస్కారాన్ని కూడా అందుకున్నారు.

సాహిత్య చరిత్రను రాయడంలో కూడా తనదైన ఒక కొత్త దృక్పథాన్ని సృష్టించి, వీరేశలింగం యుగం, కృష్ణశాస్త్రి యుగం వంటి మహాకవుల పేర్లతో యుగ విభజన చేయడం ద్వారా కొన్ని నూతన ప్రతిపాదనలు చేశారు. ఈ తెలుగు సాహిత్య చరిత్రను 12 యుగాలుగా విభజించారు. తెలుగులో మొదటి నుండి ఇప్పటివరకు చాలా సాహిత్య చరిత్రలు వచ్చాయి. కానీ, వీరిలో స్త్రీలు ఎవరు సాహిత్య చరిత్రను రచించడానికి

ప్రయత్నించలేదు. వీరిలో ఎంతో ధైర్యంతో మొట్టమొదటిగా ముదిగంటి సుజాతారెడ్డి ఒక స్త్రీ సాహిత్య చరిత్ర రచయితగా సాహిత్యంలో తనకంటూ ఒక ప్రత్యేకతను తెచ్చుకున్నారు. ఈ గ్రంథంలో రచయిత్రి వివరణాత్మకమైన నూతన అంశాలను ప్రతిపాదించారు. ముఖ్యంగా ఈ సాహిత్య చరిత్ర గ్రంథంలో తెలంగాణ ప్రాంతపు ప్రాముఖ్యతను తెలియజేశారు. ఆరంభంలో ప్రాఙ్నన్నయ యుగాలలోని వేములవాడ భీమకవి నుండి నేటి అత్యాధునిక ధోరణులు అయిన ప్రపంచీకరణ, వ్యాపారయుగం వరకు అనేక కొత్త కొత్త అంశాలను దీనిలో తెలియజేశారు రచయిత్రి.

ఇప్పటివరకు వచ్చిన తెలుగు సాహిత్య చరిత్రల్లో సాహిత్య అంశాలకు అధిక ప్రాధాన్యం ఇచ్చేవారు కానీ, ఈ సాహిత్య చరిత్రలో రాజకీయ, చారిత్రక, సామాజిక, అంశాలకు సాహిత్యంతో సమన్వయం చేసిన తీరు మనకు కనిపిస్తుంది.

## 2.8.3.3 సంస్కృత సాహిత్య చరిత్ర

సంస్కృతం చాలా క్లిష్టమైన ప్రక్రియ అనే భావనతో చాలామంది దానిలో ఉన్న సాహిత్యాన్ని చదవకుండా దూరం పెడుతున్న ఈ సమయంలో సాహిత్యం అనేది అందరి దగ్గరికి చేరాలి అనే ఒక మంచి ఉద్దేశ్యంతో తన భర్త, గొప్ప పండితుడు అయిన ముదిగంటి గోపాల్ రెడ్డిగారి సాహచర్యంలో "సంస్కృత సాహిత్యచరిత్ర"(1986) తెలుగులో ఒక రచన చేసి తనకు సంస్కృతంలో కూడా పాండిత్యాన్ని ఉందని మరోసారి నిరూపించుకున్నారు. జర్మనీలోని ఓరియంటల్ విభాగంలో పనిచేసిన అనుభవం దీనికి ఉపయోగపడినట్లు ఆమె చెబుతారు.

వేదాలు,ఉపనిషత్తులు, పురాణాలు, వేదాంగాలూ, వీటన్నింటి ద్వారా మానవుని జీవితానికి కలిగిన ప్రయోజనం గురించి ఈ గ్రంథంలో ఈమె చెప్పడం జరిగింది. దీనిలో ఆరణ్యకోపనిషత్తులు, మహాకావ్యాలు, రూపకాలు, లఘుకావ్యాలు, శ్లోకసంగ్రహకావ్యాలు, వైదికసాహిత్యం, బ్రాహ్మణాలు, గద్యకావ్యాలు, చారిత్రకకావ్యాలు, అలంకారశాస్త్ర గ్రంథాలు అని పలురకాలుగా దీనిలో విభజించారు. ఇందులో లౌకిక సాహిత్యం పరిచయం చేసే ముందు సంస్కృత భాష స్వభావం, దాని విశిష్టత, సాహితీ సంస్కృతుల ప్రత్యేకత, సంస్కృత భాష అధ్యయనంను క్లుప్తంగా వివరించి మహాభారత, రామాయణాల సంపూర్ణ వివరణ ఇచ్చారు.

### 2.8.3.4 తెలంగాణ తెలుగు సాహిత్య చరిత్ర

"తెలంగాణ తెలుగు సాహిత్య చరిత్ర"(2015) పేరుతో మరోక సాహిత్య చరిత్ర గ్రంథాన్ని రాయగా, దీని గురించి సి. నారాయణరెడ్డిగారు తన ముందుమాటలో ప్రస్తావిస్తూ *"డాక్టర్ సుజాతారెడ్డి ఈ గ్రంథాన్ని పరిశోధనాత్మకంగా, శాస్త్రీయ దృక్పథంతో, ప్రామాణిక రచనగా తీర్చిదిద్దినారు యుగ విభజన ఆధారంగా ఈ గ్రంథానికి ఆమె సమగ్రతను చేసినారు. వేములవాడ చాళుక్య యుగం నుండి ఈనాటి వరకు తెలంగాణలో తెలుగు సాహిత్యాన్ని సుసంపన్నం చేసిన సాహితీవేత్తల రచనాగరిమ దీనిలో ప్రతిభావంతంగా చిత్రించారు. ఈ గ్రంథం తెలంగాణ సాహితీ వైలక్ష్యానికి మనిదర్పణంగా భాసిస్తున్నది."* అని ఈ సాహిత్య చరిత్ర గురించిన విశిష్టతను తెలియజేశారు.

ఈ సాహిత్య చరిత్ర రచన ముఖ్యంగా తెలంగాణ ప్రాంతాన్ని నేపథ్యాన్ని ఆధారంగా చేసుకొని సాగింది. దీనిలో వీరు తెలంగాణ ప్రాంతంలో మొట్టమొదట పాలించిన శాతవాహనుల నుండి అసఫ్ జాహీల వరకు తర్వాత తెలంగాణ విమోచనోద్యమం, తెలంగాణ ప్రాంతంలో జరిగిన సాయుధ పోరాటం, ఆ కాలంలో ఉన్న కవులు, రచయితల గురించి ఎంతో ఆధారసహితంగా దీనిలో ప్రస్తావించారు. తెలంగాణ ప్రాంత క్రమంలో ఉన్న, భిన్న సాదృశ్యాలను గురించి దీనిలో వీరు వివరించారు. ఈ విధంగా తెలంగాణ సాహిత్యచరిత్ర విశిష్టతను ఈ సాహిత్య చరిత్రలో ముదిగంటి సుజాతారెడ్డి వివరించారు.

### 2.8.3.5 మన తెలుగు సాహిత్య చరిత్ర

ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ముదిగంటి సుజాతారెడ్డి రాసిన చారిత్రక సామాజిక నేపథ్యంలో సాహిత్య చరిత్ర గ్రంథంలో కొన్ని మార్పులు చేసి 'మన తెలుగు సాహిత్య చరిత్ర'(2018) పేరుతో తెలుగు అకాడమి వారి అధ్వర్యంలో కొత్త సాహిత్య చరిత్ర గ్రంథంగా తీసుకువచ్చారు. దీనిలో కొత్తగా 'తెలంగాణ సాహిత్య వైశిష్ట్యం' పేరుతో ఒక నూతన అధ్యాయాన్ని జతపరిచారు. తర్వాత ప్రాఙ్నన్నయ యుగాన్ని, పూర్వయుగంగా మార్చి శాతవాహనుల కాలంలో పాకృతభాష ప్రభావం తెలుగుపై పడిన విధానాన్ని ఈ యుగంలో విశ్లేషించారు. బౌద్ధమత ప్రభావాన్ని జైనకవుల యుగం పేరుతో

రాసిన అధ్యాయంలో పొందుపరిచారు. చివరి మార్పుగా నన్నయ తిక్కనల మధ్యయుగ కాలాన్ని తిరిగి శివకవుల యుగంగానే నిర్ధారించారు.

## ముగింపు

ముదిగంటి సుజాతారెడ్డి మనువసుచరిత్రలను తులనాత్మకంగా పరిశీలించి, ప్రాచీన సిద్ధాంతాల మీద అధికారం సంపాదించిన విదుషీమణి. వేమన మీద 'నాథ' సంప్రదాయ అని నిరూపిస్తూ 1993లో రాసిన గ్రంథం వేమన నాథసంప్రదాయం వీరి పరిశోధనను నిరూపిస్తుంది. 1992లో ప్రచురించిన 'తెలుగు నవలానుశీలనం' గ్రంథానికి తెలుగు విశ్వవిద్యాలయం ఉత్తమ విమర్శ పురస్కారం లభించింది. ముదిగంటి సుజాతారెడ్డి ప్రాచీన, ఆధునిక సాహిత్యం మీద సమానమైన అవగాహనతో సాహిత్య విమర్శ కొనసాగించారు. సుజాతారెడ్డి ఇటీవల ప్రాంతీయ అస్తిత్వవాద సాహిత్య విమర్శ చేస్తూ, కవిత్వం, నవల, కథ వంటి వివిధ ప్రక్రియల్లో తమదైన ముద్ర వేస్తున్నారు. అనుభూతి ప్రధానమైనది కవిత్వం, ఆలోచన ప్రధానమైనది కథానిక, జీవిత ప్రధానమైనది నవల. ఇలాంటి జీవిత అనుభవాన్ని అందించే నవలలో రసానుభూతి కలిగించే అంశాలున్నట్లు ముదిగంటివారు గుర్తించారు. రసాన్ని నవలకు అన్వయించే సందర్భంలో 'తాదాత్మ్యం' పొందడం ముఖ్యమని సుజాతారెడ్డి భావించారు. నవలల్లో వస్తు ధ్వని వ్యాసం కూడా ధ్వని సిద్ధాంతాన్ని తెలుగు నవలకు అన్వయించినట్లు తెలుస్తుంది.

ముదిగంటి సుజాతారెడ్డి ఒక ప్రత్యేక దృష్టి కోణం కల రచయితగా మనకు కనిపిస్తారు. వీరి రచనలు తెలుగు సాహిత్యంలోని అన్ని ప్రక్రియల్లో ఉండి అవి తన నైపుణ్యాన్ని తెలియజేస్తున్నాయి. కథ, నవల, విమర్శ, యాత్రాచరిత్రలు, సాహిత్యచరిత్రలు, పరిశోధన, సంస్కృతంలో పాండిత్యం, వ్యాసాలు రాయడం అలాగే ప్రాచీన సాహిత్యంలో, ఆధునిక సాహిత్యంలో రచనలు చేయడం ఇలా బహుముఖ విషయాల్లో గొప్పపట్టు ఉన్నవారు సుజాతారెడ్డి. వీరు సాహిత్యంలో విమర్శతో తన ప్రస్థానాన్ని మొదలుపెట్టి తర్వాత సృజనాత్మక సాహిత్యం వైపు మరలిన రచయిత. ముదిగంటి సుజాతారెడ్డి తన సమకాలీన విమర్శకులందరికి భిన్నంగా అంతవరకు ఎందరో పండితుల చేత పరామర్శింపబడిన విషయాలను కొత్త కోణంతో పరిశీలిస్తూ, చాలా సులభమైన శైలిలో ఎటువంటి రాగద్వేషాలు లేకుండా చర్చించడం అనేది వీరిలో ఉన్న ఒక విలక్షణ లక్షణం. సుజాతారెడ్డి

తాను సేకరించిన సమాచారంతో కొత్త విశ్లేషణచేసి ఇంతకముందు ఎవ్వరూ చేయని ఒక కొత్త రకమైన వాఖ్యానాన్ని అందిస్తుంటారు. దీనిలో వేమన గురించి, చలం ప్రతీకల గురించి, నవల రససిద్ధాంతం మొదలైనవి కొన్ని ముఖ్యంగా చెప్పుకోవచ్చు. విమర్శకులుగా రచనలు చేస్తున్న వారెందరో ఉన్నారు. కానీ, వారితోపాటు ఒక మూసధోరణిలో పోకుండా, తనకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని సృష్టించుకొని, దానికి కావలసిన సామాజిక దృష్టికోణాన్ని ఏర్పర్చుకొని, వీటి ద్వారా తెలుగు సాహిత్యాన్ని పరిశీలించి, తెలుగు సాహిత్యంలో ఒక ప్రత్యేకమైన వ్యక్తిగా నిలవడం ముదిగంటి సుజాతారెడ్డి ప్రయత్నిస్తున్నారు.

అటువంటి వ్యక్తి గురించి తనలో ఉన్న బహుముఖ కోణాల్లో ఒకటైన విమర్శ గురించి లోతుగా అధ్యయనం చేయడం తద్వారా తెలుగు సాహిత్య విమర్శను మరింత బలోపేతం చేయడానికి నేను వీటన్నింటితోపాటు నా పరిశోధన ద్వారా ఒక సమన్వయ పూర్వక విశ్లేషణ గ్రంథాన్ని తీసుకురావాలనే ఉద్దేశ్యం ఈ పరిశోధనలో ఒక భాగం.

**రెండవ అధ్యాయంలోని ముఖ్యాంశాలు:**

1. తెలుగు సాహిత్యంలో ఒక ఆధునిక ప్రక్రియ 'విమర్శ'. ఇది 1970లో ఒక ప్రత్యేక ప్రక్రియగా అవతరించినప్పటికీ దీనికి ఇప్పటి వరకు దాదాపు 135 సంవత్సరాల చరిత్ర ఉంది. కానీ, ప్రారంభ దశలో కేవలం లక్షణ గ్రంథాలు, అవతారికలు, టీకా తాత్పర్యాల రూపంలో మాత్రమే ఉండి తర్వాత ఎన్నో మార్పులకులోనై ఒక స్పష్టమైన రూపాన్ని సంతరించుకొని నేడు ఒక ప్రత్యేక సాహిత్య ప్రక్రియగా రూపుదిద్దుకుంది.
2. ప్రస్తుతకాలంలో ప్రాచీన సాహిత్య విశ్లేషణ కంటే ఆధునిక సాహిత్య విశ్లేషణ ఊపందుకుంది. ప్రక్రియా పరమైన అవగాహన పెరిగి, ఆయా ప్రక్రియల విమర్శలు, ఆ ప్రక్రియ లక్షణాలు ఆధారంగా విమర్శించడం, విమర్శకుల్లో అవగాహన పెరగడం మనం గమనించవచ్చు.
3. తెలంగాణలో సాహిత్య విమర్శ మిగతా ప్రాంతాలతో పోలిస్తే దీనికి చారిత్రక, భౌగోళిక, సామాజిక నేపథ్యాలకు అనుగుణంగా దీని పరిణామక్రమం ఏర్పడింది. ప్రస్తుతం తెలంగాణ విమర్శ, నిర్మాణదశలో ఉన్నట్లు భావించవచ్చు.
4. తెలంగాణ ప్రాంత విమర్శకులు అందరిలో తనదైన శైలిలో ఒక వినూత్న దృక్పథంతో, మిగతా వారి కంటే భిన్నంగా విమర్శ చేయడంలో ముదిగంటి సుజాతారెడ్డి నిష్ణాతులు.

సుజాతారెడ్డి చేసే విమర్శ ఒకవైపు తెలంగాణ సాహిత్య విమర్శ ప్రత్యేకతను గుర్తిస్తూనే, మరోవైపు దానిలో ఉన్న విశిష్ట లక్షణాలను స్పృశించేలా ఉంటుంది. సాహిత్య, ఆలంకార, విమర్శ, సిద్ధాంత గ్రంథాలను గురించి తెలుపుతూ తెలంగాణ అస్తిత్వ ఉద్యమకాలంలో వచ్చిన సాహిత్య విమర్శలో కూడా వీరు కృషి చేశారు.

వీటితోపాటు ముదిగంటి సుజాతారెడ్డి తెలుగు సాహిత్య విమర్శ రంగంలో కనబర్చిన దృక్పథాన్ని అందుకోసం వారు ఎంచుకున్న విమర్శ ధోరణులను తర్వాతి అధ్యాయాలుగా విభజించుకుని వాటిని కొంత లోతుగా విశ్లేషించాల్సిన అవసరం ఉంది. దీనిలో భాగంగా ముదిగంటి సుజాతారెడ్డి తమ తొలిదశలో చేసిన ఆలంకారిక దృక్పథంతో చేసిన విమర్శ ధోరణులను పరిశీలించాల్సి వుంది.

# అధ్యాయం – 3

# ముదిగంటివారి ఆలంకారిక విమర్శ పరిశీలన

## 3.0 తెలుగులో ఆలంకారిక సాహిత్య విమర్శ

తెలుగులో ఆలంకారిక సాహిత్య విమర్శ గురించి తెలుసుకోవడానికి ముందు దానికి ఆధారమయిన అలంకార విధానాన్ని గురించి తెలుసుకోవడం కొంత ఉపయోగకరంగా ఉంటుంది. భరతుడి నుండి జగన్నాథ పండితరాయల వరకు సాహిత్యానికి సంబంధించిన ఎన్నో రకాల వివిధ చర్చలు, సిద్ధాంతాలు వాటి మీద జరిగిన వాదోపవాదాలు, ఆలోచనలు చేశారు. ఈ చర్చలు, అభిప్రాయాలన్నింటిని గ్రంథరూపంలో వెలువరించిన వారిని అలంకారికులని దీన్ని మొత్తంగా కలిపి సాధారణంగా ఆలంకారిక ప్రవృత్తి అని వ్యవహరించడం జరుగుతుంటుంది. అలంకార పదం రెండు స్థాయిల్లో ఉపయోగపడింది. మొదటిది అందరికి పరిచితమైన అనంతమైన 'వాక్రక్పారా' లను గుర్తించిన స్థాయి. అంటే, ఉపమా ఉత్ప్రేక్షాది రూపంగా వేరు వేరు పేర్లతో ప్రసిద్ధమైన భావాదుల అభివ్యక్తి తీరులు. రెండవది విస్తృతమైన పరిధిగల సౌందర్యం అనే అర్థ, తాత్పర్యాలతో అలంకార పదం ఉపయోగపడటం.

ప్రపంచానికి ఒక గొప్ప ధ్వని సిద్ధాంతాన్ని అందించిన ఆనందవర్ధనుడు తన సిద్ధాంత ప్రారంభంలో...

***"కావ్యస్వాత్మా ధ్వనిరీతి బుధైర్యస్సమామ్నాత పూర్వః తస్యభావం జగదురపరే భక్తా నుహూస్తదన్యే,***

***కేచి ద్వాచాం స్తితమవిషయే తత్త్వ మూచుస్త దీయం తేన బ్రూమః సహృదయ మనఃప్రీతయే తత్స్వరూపమ్"****(1-1)* అని చెప్పిన దాన్ని బట్టి, ధ్వనికి సంబంధించిన చర్చలు అంతకముందే సాగుతున్నాయని అర్థం చేసుకోవచ్చు. దాదాపుగా అలంకారికులు పూర్వ

అభిప్రాయాలను ప్రాతిపదికగా చేసుకొని ముందుకు సాగినట్లు అంటే కావ్యవిమర్శ అనేది ఒక రకమైన అనుసరణ మార్గాన్ని పాటించినట్లు దీనిని బట్టి అవగతమవుతుంది.

భారతీయ సాహిత్య వివేచనా సంప్రదాయంలో రీతి అనేది ఒక విప్లవాత్మకమైన అంశం. దీనిలో అంతకముందు లేని 'కావ్యాత్మ' అనే ఒక నూతన భావనను వామనుడు బయటకి తీసుకువచ్చాడు. **'కావ్య శోభాకరా నర్థన్ అలంకారాన్ ప్రచక్షతే'** అని దండి చెప్పగా, '**సౌందర్యమలంకరః**' అని శబ్ధం యొక్క విస్తృత పరిధిని వామనుడు ప్రకటించాడు. కుంతకుడు 'వక్రోక్తి' జీవితంలో ప్రకరణ ప్రబంధ వక్రతలుగా కథ నిర్వహణ విషయాన్ని ఉదాహరణ యోక్తంగా వివరించాడు. భవభూతి మహాకవి తన ఉత్తర రామచరితలో తృతీయాం కాంతాన తమసా వాక్యంగా 'అహో సంవిధానకమ్' అని కథా సంవిధానాన్ని గురించి తెలియజేశాడు. ఈ విధంగా సాగిన ఆలంకారిక వివేచన, కావ్యం సాధించవలసిన అంశాలను అంటే కావ్య ప్రయోజనం నిర్ధారించుకుంటూనే ముందుకు సాగింది. భరతుని కాలం నుండే మనం ఈ రకమైన అలంకార ప్రవృత్తిని గమనించవచ్చు కానీ, సామాజిక వ్యక్తుల్లో ఎంత వైవిధ్యముందో, సామాజిక కావ్యాల్లో కూడా అంతే వైవిధ్యం ఉంది. ఈ అంశాన్ని ఆలంకారిక వివేచన గుర్తించింది.

పై విషయాల్లోనేగాకుండా ఆలంకారిక విమర్శ తన పరిధిలోకి తీసుకున్న అంశాలను బట్టి దాని పరిధి ఎంత విస్తృతమైనదో తెలుసుకోవచ్చు. కానీ, భరతుని నుంచి జగన్నాథుని దాకా ఉన్న అలంకారికులు ఒకే రకమైన తరహాకు చెందినవారు కాకున్నా, న్యాయ, మీమాంస, జైన, బౌద్ధాది వంటి వివిధ రకాల భూమికల నుంచి ఆలంకారిక విమర్శలోకి వచ్చినవారు. అయినా వీరందరూ సాహిత్య కావ్య సంబంధమైన మౌలిక అంశాల విషయంలో ఒకే రకమైన దృష్టితో ప్రవర్తించినట్లు తెలుస్తుంది.

తెలుగులో అలంకారశాస్త్రం రెండు పాయలుగా విడిపోయి ప్రవహించినట్లుగా గ్రహించవచ్చు. మొదటిది ప్రాచీన పద్ధతిలో కొన్ని ఆలంకారిక గ్రంథాలను పఠన, పాఠ్యక్రమంలో అనుసంధానం చేయడం. రెండవది పాశ్చాత్య విద్యావిధానం నుంచి ఆంగ్ల

సాహిత్యం, ఆంగ్ల విమర్శ రీతులతో పరిచయంతో ముందుకు సాగడం. అయితే ఇవి ఆలంకారిక విమర్శ అంటే తేలిక భావమో, భయమో కలిగించేందుకు సహకరించాయని తెలుస్తుంది.(తెలుగు సాహిత్య విమర్శదర్శనం,2016:71) దువ్వూరి రామిరెడ్డి, రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ ఆలంకారిక విమర్శలోని ప్రాధాన్యతను, విశిష్టతను గుర్తించి వ్యాప్తి చేయడానికి కొంత ప్రయత్నించారు. కాశీభట్ట బ్రహ్మయ్యశాస్త్రి "**వివేకచంద్రిక విమర్శనం**"లో తన విమర్శను ఏడు ప్రకరణాలుగా విభజించుకున్నారు. అక్కిరాజు ఉమాకాంతం అలంకారికుల ఆలోచనలకు కాలదోషం పట్టకుండా జాగ్రత్తపడ్డారు. అదే సమయంలో విశ్వనాథ సత్యనారాయణ ప్రాచీన సాహిత్య సంప్రదాయాన్ని పరిరక్షించడం తన ధ్యేయంగా పెట్టుకున్నారు. నండూరి బంగారయ్యలాంటి విమర్శకులు శాకుంతల విమర్శనలో రససిద్ధికి ఆకృతి సౌష్టవం, ఘటన శిల్పం ప్రధాన కారణాలన్నారు. జి.వి. సుబ్రహ్మణ్యంగారు సాహిత్య విమర్శలో వీరరస స్థాపన చేశారు. కవి దృక్పథానికి–కావ్యానికి మధ్య గల సంబంధమే ప్రధానంగా భావించినవారు ఆర్. ఎస్. సుదర్శనం. తుమ్మపూడి కోటేశ్వరరావు ప్రబంధ ప్రక్రియ గురించి చేసిన ఆలోచన భారతీయ సంస్కృతీ మూలమైన అంశాన్ని ప్రతిపాదించినట్లు తెలుస్తుంది. ముదిగొండ వీరభద్రయ్య కళాతత్త్వ విశ్లేషణలో అలంకార శాస్త్ర నేపథ్యం మనకు కొంత కనిపిస్తుంది.

సంప్రదాయ విమర్శ ప్రభావం మిగతా విమర్శకుల మీద ఎదో ఒక స్థాయిలో ఉన్నట్లు చెబుతూ, కట్టమంచి సమకాలంలోను ఆ తర్వాతి విమర్శకులలో పాత్ర చిత్రణ, సంభాషణ కౌశలం, కథనాత్మకత మొదలైన లక్షణాలు కనిపించిన వారిలో కూడా, సంప్రదాయ విమర్శ పద్ధతులపై ప్రేమ, అనురక్తి, ఆధునిక ధోరణుల తిరస్కరణ, కాల్పనిక, భావవాద ధోరణులు ప్రధానంగా కనిపిస్తాయి. విశ్వనాథ సత్యనారాయణ, రాళ్ళపల్లి వంటి వారు దీనికి నిదర్శనంగా కనిపిస్తారననే(అభ్యుదయ విమర్శ విశేష సంచిక:90) అభిప్రాయన్ని రంగనాథచార్యులు వ్యక్తం చేశారు.

సీతారాం 'అదేపుట', రెంటాల 'అవగాహన' వ్యాస సంపుటిలోని కొన్ని వ్యాసాలలో ఆలంకారిక రీతికి చెందిన విమర్శ కొంత ఉన్నట్లు తెలుస్తుంది. పుల్లెల శ్రీరామచంద్రుడు ఆధునిక సాహిత్యం–అలంకార శాస్త్రం వంటి రచనలను చేయడం. రామమోహనరావు 'ధ్వని'కి ప్రధానం గుణం అని గుర్తించడం. ముదివేడు ప్రభాకరరావు, శివరామకృష్ణ పెన్నా, సౌభాగ్య, సుంకిరెడ్డి నారాయణరెడ్డి, ఇంద్రగంటి శ్రీకాంత్ శర్మ వంటి ఇప్పటివారిలో కొంత కొత్త పద్ధతులు పాటిస్తున్నట్లు అర్థమవుతుంది. వీటితోపాటు వివిధ విశ్వవిద్యాలయాల్లో ఆలంకారిక సంబంధిత అంశాలపై భిన్నమైన కోణాల్లో పరిశోధనలు జరగడం వంటి వాటిని బట్టి తెలుగు సాహిత్యంలో ఆలంకారిక సాహిత్యం సంబంధించిన విషయాల్లో ఒక రకమైన ప్రభావం ఉందని స్పష్టంగా గమనించవచ్చు.

ఇదే ధోరణిలో ఆలంకారిక మార్గంలో కాల్పనిక సాహిత్యానికి అన్వయిస్తూ ప్రయోగాలూ చేసినవారు ముదిగంటివారు సుజాతారెడ్డి. ఆలంకారిక శాస్త్రంపై సాధికారమైన పట్టుతో మను వసుచరిత్రల తులనాత్మక పరిశీలన, శ్రీనాథుని కవితా సౌందర్యం, బాణుని కాదంబరి పరిశీలన, వేమన నాథ సంప్రదాయం పేరుతో రాసిన గ్రంథాల్లోని ఆలంకారిక విమర్శ కోణాన్ని ఈ అధ్యాయంలో భాగంగా పరిశీలించబోతున్నాను. వీటితో పాటు ముదిగంటివారు నవల–రసచర్చ, నవలల్లో వస్తుధ్వని పేరుతో రాసిన వ్యాసాల్లో కూడా రసచర్చను ఆధునిక ప్రాచీన సాహిత్య విమర్శగా సాహిత్యంలోకి ప్రవేశపెట్టారు. ఈ విధంగా తెలుగులో వచ్చిన ఆలంకారిక విమర్శ కేవలం అలంకారశాస్త్ర నేపథ్యంతో మాత్రమే గాక అదే సమయంలో పాశ్చాత్య విమర్శలోని అలంకారశాస్త్ర అంశాలను కూడా విశ్లేషిస్తూ ముందుకు సాగినట్లు మనకు ఈ చర్చ వల్ల అర్థమవుతుంది.

## 3.1 ముదిగంటి సుజాతారెడ్డి–విమర్శ ధోరణి

తెలుగు సాహిత్య ప్రక్రియల్లో బహుముఖ ప్రజ్ఞ కలిగిన విమర్శకులుగా ముదిగంటి సుజాతారెడ్డి సుప్రసిద్ధులు. ప్రాచీన సాహిత్యం మీద మంచి పట్టు ఉన్న విదూషీమణి. సుజాతారెడ్డి ఒకవైపు సృజనాత్మక సాహిత్య సృజన చేస్తూనే, మరోవైపు అంతే నైపుణ్యంతో

సాహిత్య చరిత్రలు, నవలా విమర్శ, రసచర్చ వంటి వాటితో మంచి విమర్శకులుగా పేరు పొందారు. వీరు మొదట తమ విమర్శ ప్రస్థానాన్ని భారతీయ భూమిక కలిగిన అలంకార శాస్త్ర నేపథ్యంలో తెలుగు ప్రాచీన సాహిత్యంతో ప్రారంభించారు.

ఈ ఆలంకారిక సాహిత్య విమర్శ అధ్యాయంలో భాగంగా ఆలంకారిక శాస్త్రంపై సాధికారమైన పట్టుతో రాసిన '**మను వసుచరిత్రల తులనాత్మక పరిశీలన**'-1977, '**శ్రీనాథుని కవితా సౌందర్యం**'–1980, '**బాణుని కాదంబరి పరిశీలన**'-1980, '**వేమన నాథసంప్రదాయం**'–1993 నాలుగు గ్రంథాలలోని ఆలంకారిక విషయాలను విశ్లేషించినట్లయితే ముదిగంటి సుజాతారెడ్డి విమర్శ ధోరణి ఏంటో అవగతమవుతుందని ఈ అధ్యయన ముఖ్య ఉద్దేశ్యం.

ముదిగంటి సుజాతారెడ్డి ఆలంకారిక దృక్పథంతో చేసిన ఈ విమర్శ గ్రంథాలలో ప్రధానంగా '**మను వసుచరిత్రల తులనాత్మక పరిశీలన**' అనే తమ పరిశోధన గ్రంథాన్ని తులనాత్మక విమర్శ పద్ధతిని ప్రధానంగా ఉపయోగించారు. ఈ గ్రంథంలో వీరు మనుచరిత్ర–వసుచరిత్ర మధ్యగల తారతమ్యాలను బేరీజు వేస్తూ ఈ గ్రంథాన్ని పూర్తి చేశారు. వీటితో పాటు '**శ్రీనాథుని కవితా సౌందర్యం**'–1980, '**బాణుని కాదంబరి పరిశీలన**'-1980, '**వేమన నాథసంప్రదాయం**' వంటి విమర్శ గ్రంథాల్లో శ్రీనాథుడు, బాణుడు, పెద్దన. రామరాజ భూషణుడు, వేమన వంటి కవుల గురించి వివరించేందుకు 'కవి జీవిత కావ్య సమన్వయ విమర్శ పద్ధతి'ని అలాగే కావ్య సౌందర్యాన్ని విశ్లేషించే సమయంలో అలంకార విమర్శ పద్ధతులను సమయానుగుణంగా ఉపయోగించినట్లు అర్థమవుతుంది.

## 3.1.1 తులనాత్మక సాహిత్య విమర్శ

తెలుగులో వున్న సాహిత్య విమర్శ పద్ధతుల్లో తులనాత్మక విమర్శ పద్ధతి ఒకటి. దీన్ని ఆంగ్లంలో 'Comparative Criticism' అని విమర్శకులు పిలుస్తారు. "*రచయితపై పూర్వకవి ప్రభావము ప్రసరించుట స్వాభావికము. అది అనుకరణము కాదు. ప్రతిభావంతుడైన కవి తర్వాతి వారికి మార్గదర్శకుడగును. కావున తులనాత్మక పరిశీలనము కవి స్థానమును నిర్ణయించుటకు, కావ్యతత్త్వమును నిరూపించుటకు ఉపకరించును. ఒక యుగములోని*

*కవులను గాని, ఒక ప్రక్రియను అవలంబించిన కవులనుగాని, ఒకే వస్తువును స్వీకరించిన కవులను గాని తారతమ్య నిరూపకముగా సమాలోచన చేయుట ఉచితము, వివిధ భాషా కవులలోని సామ్య వైషమ్యముల పరిశీలన కూడ కావ్య ప్రమాణ నిర్ణయమునకు తోడ్పడును"* అని ఆచార్య ఎస్వీ రామారావు (తెలుగులో సాహిత్య విమర్శ అవతరణము.2014:10) అన్నారు. ఆధునిక విమర్శా పద్ధతులలో తులనాత్మక విమర్శా పద్ధతి ప్రముఖమైనది. ఈ పద్ధతి కూడా ఆంగ్ల సాహిత్య ప్రభావం వల్లనే తెలుగులో సంభవించింది. మాథ్యూ ఆర్నాల్డ్ అను ఫ్రెంచి రచయిత పుస్తకము "History of Comparative"ను అనువాదం చేస్తూ 1848లో Comparative Study అను పదమును ప్రథమంగా ఉపయోగించినట్లు విమర్శకులు భావిస్తున్నారు. ఫ్రెంచ్ సాహిత్యమునందు 1800, 1820 సంవత్సరం నాటికి ఈ విమర్శ ప్రచారంలో ఉంది. ఈ తులనాత్మక విమర్శను రెనె వేలెక్ ఈ విధంగా నిర్వచించారు. "Comparison is a method used by all criticism and sciences, and does not in any way adequately describe the specific procedures of literary study. The comparison between literature or even moment's figures and works is really a central theme in literary history". (Rene wellek.theory of literature.1931:38) ఈ తులనాత్మక పద్దతి విజ్ఞాన శాస్త్రంలోనూ, సాహిత్య విమర్శలో అనుసరిస్తూన్నప్పటికీ సాహిత్యంలో దీనికి సమగ్ర స్వరూప నిరూపణ జరగలేదు. సాహిత్యంలో పరస్పర సంబంధం కానీ, సన్నివేశముల మధ్య కానీ అలంకారిక రచనల మధ్య కానీ తులనాత్మక పరిశీలన చేయుట ఈ విమర్శ ముఖ్య ఉద్దేశం. తులనాత్మక పరిశీలన విభిన్న సాహిత్య అంశాల మధ్య కూడా చేయవచ్చు. ప్రపంచంలోని భిన్న సాహిత్యాల మధ్య సంబంధ బాంధవ్యాలు సదావగాహన సమకూర్చుటకు ఇది ఒక వాహకంగా ఉపయోగపడుతుంది.

## 3.1.2 మను-వసుచరిత్రల పూర్వ పరిశోధనలు

తెలుగు సాహిత్యంలోని ప్రబంధ ప్రక్రియలో అత్యంత ఆదరణ పొందినవి మనుచరిత్ర, వసుచరిత్రలే. ఈ రెండు ప్రబంధాలలోని కొన్ని విశిష్ఠమైన అంశాలు విమర్శ ప్రారంభకాలం నుండి కావ్యానుశీలన చేసే విమర్శకుల దృష్టిలో ప్రథమ స్థానంలో నిలిచాయి. మొదటినుండి పాత్ర పోషణకు మనుచరిత్ర, శ్లేష పాండిత్యానికి వసుచరిత్ర విమర్శకులకు గొప్ప ఆకారాలుగా ఉన్నట్లు తారసపడుతున్నాయి.

రామరాజభూషణుడు మనుచరిత్రను చూసి స్పర్ధతో వసుచరిత్ర రాసాడనే అభిప్రాయం అప్పటికే వ్యాప్తిలో ఉంది. అలాగే 16వ శతాబ్దంలో వెలువడిన ప్రబంధాల్లో వీటికి కొంత ప్రఖ్యాతి ఉండటం వంటి కారణాల వల్ల, మను–వసు చరిత్రల మధ్య తులనాత్మక పరిశీలన జరిగింది. అందుకే ఈ గ్రంథాల మీద తొలి పరిశీలన తులనాత్మక విమర్శతోనే ప్రారంభమయింది.

### 3.1.2.1 మను వసు చరిత్ర రచనా విమర్శనము

చెన్నై ప్రెసిడెన్సీ కళాశాలలో ఆంధ్రభాషాభివర్ధనీ సమాజం వారు ఏర్పరచిన పోటీల్లో భాగంగా వెన్నేటి రామచంద్రరావు 'మను వసు చరిత్ర రచనా విమర్శనము' పేరుతో 1899లో ఈ గ్రంథాన్ని రాసారు. ఈ పోటీల్లో ఇది ప్రథమ బహుమానం పొంది 'చింతామణి' పత్రికలో ప్రచురించబడింది. ఈ గ్రంథంలో ఆయన ఉదహరించిన గ్రంథాలను బట్టి ఆయనపై పాశ్చాత్య సాహిత్య ప్రభావం ఏ విధంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. మను వసు చరిత్ర రచనా విమర్శనము ప్రారంభంలో విమర్శ స్వరూపాన్ని, కవిత్వ లక్షణాలను కొంత విపులంగా చెప్పారు. వీటి ఆధారంగానే మను-వసు చరిత్రల మధ్య తులనాత్మక పరిశీలన చేసి దీనిలో మనుచరిత్ర ఆధిక్యతను వెన్నేటి నిరూపించారు. శైలి, అలంకారల విషయాల్లో పెద్దననే గొప్ప అని, అందుకే నీతిదాయకమైన కథాకల్పన, పాత్రచిత్రణ విషయాల్లో మనుచరిత్ర ఒక విశిష్టతను కలిగివున్నట్లు రామచంద్రరావు వెల్లడించారు. కానీ, వర్ణనలు, శ్లేష, భాషా

ప్రయోగాల విషయాల్లో రామరాజభూషణుని ప్రతిభను కొనియాడాడు. పూర్వకవులు భాషా పటిమచేత భావప్రౌఢిమ, అర్థ గాంభీర్యం చూపగా, అనంతర కవులు భాషా వస్తుపరులై శబ్ధపాండిత్యాన్ని ప్రదర్శించినట్లు ఆయన ఈ గ్రంథంలో తెలియజేశారు.

## 3.1.2.2 మను వసు ప్రకాశిక

కాశీభట్ట బ్రహ్మయ్యశాస్త్రిగారు "మను వసు ప్రకాశిక" పేరుతో వెన్నేటివారి రాసిన 'మను వసు చరిత్ర రచనా విమర్శనము'ను ఖండిస్తూ ప్రతివిమర్శగా 1902లో ఈ గ్రంథాన్ని రాసారు. ఇది మంజువాణి పత్రికలో ప్రచురితమయింది. రామచంద్రరావు తన 'మను వసు చరిత్ర రచనా విమర్శనము' గ్రంథాన్ని వసుచరిత్ర మీద పక్షపాత దృష్టితో రాసినట్లు ఆయన ఈ గ్రంథంలో పేర్కొన్నారు.

వెన్నేటి రామచంద్రరావు పాశ్చాత్య సాహిత్య అభిమానం, అలంకారాలపై ఒక నిరాదరణతో, శబ్దాలంకారాల మీద ప్రేమతో భూషణుడు వ్యర్థ పదాలను ప్రయోగించాడని చెప్పడం సరికాదని బ్రహ్మయ్యశాస్త్రి అభిప్రాయపడ్డారు. అలాగే అతిశయోక్తులు, అశ్లీలములు మొదలైనవి వసుచరిత్రలో లేవని ఆయన ఈ గ్రంథంలో తెలియజేశాడు. సందర్భవిరోధమైన కుతపకాల (మధ్యాహ్నము 11గం12ని॥ల నుండి 12గంటల వరకు గల సమయం) ప్రసక్తి, అతిశయోక్తులతో నిండిన గంధర్వ పాత్రచిత్రణను ఆయన ఇందుకు ఉదాహరణగా చూపించారు. బ్రహ్మయ్యశాస్త్రిగారి 'వివేకచంద్రికా విమర్శనము'లాగానే ఈ 'మను వసు ప్రకాశిక' కూడా ఆయన శాస్త్రపాండిత్యానికి ఆంగ్లభాష నైపుణ్యానికి అద్దం పడుతుంది.

ఇదే పరంపరలో బ్రహ్మయ్యశాస్త్రి రాసిన 'మను వసు ప్రకాశిక'ను ఆక్షేపిస్తూ **'మను వసు విమర్శనానుబంధము'**(1905) పేరుతో వెన్నేటి రామచంద్రరావు వెలువరించారు. దీనికి ప్రతివిమర్శగా కాశీభట్ట **"మను వసు ప్రకాశికానుబంధము"** రచించారు. వీటిలో ఆత్మస్తుతి, పరనిందలున్నవని వెన్నేటి గారనగా, వ్యక్తిదూషణ, కులమత ప్రసక్తి తెచ్చారని బ్రహ్మయ్య శాస్త్రి తన అభిప్రాయాన్ని వెలిబుచ్చారు.

### 3.1.2.3 వసు–మను ప్రకాశిక

కాశీభట్ట అంతటితో ఆగకుండా మను వసు ప్రకాశికలో చెప్పినట్లుగా ఈ రెండు కావ్యాలపై కలిపి **'వసు మను ప్రకాశిక'** పేరుతో ప్రత్యేకమైన విమర్శ గ్రంథాన్ని రచించారు. ఇది "సరస్వతి" పత్రికలో ప్రచురించబడింది.

వెన్నేటి రామచంద్రరావు, కాశీభట్ట బ్రహ్మయ్యశాస్త్రి అనే విమర్శకులు తెలుగు సాహిత్య విమర్శ ప్రారంభకాలంలో ఈ విధంగా పరస్పర రచనా ఖండన మండనాల పద్ధతిలో విరివిగా సాగించారు. వీరందరూ ఆయా గ్రంథాల్లో ఆత్మస్తుతి, పరనింద, కుల మతాల ప్రస్తావన చేసినట్లు కనిపిస్తుంది. కానీ, *"వెన్నేటి రామచంద్ర రావు గారి 'మను- వసు చరిత్ర రచనా విమర్శనము' ఆధునిక సాహిత్య విమర్శకు నాందీ వచనమగుచునే భిన్న కవుల కావ్యముల తులనాత్మక పరిశీలన రీతికి శ్రీకారము చుట్టినది"*(ఆధునిక తెలుగు సాహిత్య విమర్శ: సాంప్రదాయికరీతి:19) అని కోవెల సంపత్కుమారాచార్యుల అభిప్రాయం ఇక్కడ గమనించదగింది.

ముదిగంటి సుజాతారెడ్డి **"మను–వసు చరిత్రల తులనాత్మక పరిశీలన"**-1977 అనే గ్రంథమే కాకుండా మను వసుచరిత్రలపై కలిపి వివిధ విశ్వవిద్యాలయాల ఆధ్వర్యంలో అనేక పరిశోధనలు జరిగాయి. ఇదే పేరుతో **'మను వసు చరిత్రల తులనాత్మక పరిశీలన'**–1984 డి. వీరస్వామి శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయానికి సిద్ధాంత గ్రంథం సమర్పించారు. మను వసు చరిత్రల ప్రబంధాలు వెలువడినప్పడి నుండి ఈ రెండు ప్రబంధాలపై ఎన్నో విమర్శ గ్రంథాలు, వ్యాసాలు వెలువడ్డాయి. ఇప్పటివరకు మను చరిత్రపై పది పూర్వ పరిశోధనలు, వసు చరిత్రపై ఆరు పూర్వ పరిశోధనలు, రెండు తులనాత్మక పరిశోధనలు, నాలుగు విభిన్న దృక్పథ పరిశోధనలు మొత్తంగా ఇరవైకి పైగా పరిశోధనలు వచ్చినట్లు తెలుస్తుంది.(చూడుము–అనుబంధం 4)

### 3.1.3 శైలి సౌందర్యం

ఇంగ్లీష్ లోని 'style' అనే పదానికి సమానార్థకంగా 'శైలి' అనే పదం తెలుగులో వాడబడుతుంది. ఇది ఒక భాషకు దాని భావవ్యక్తీకరణకు సంబంధించింది. సహజంగా రచనలు చేసే వారికి తమకంటూ ఒక శైలి ఏర్పడుతూ ఉంటుంది. ఇది వారు చేసే రచన విధానం మీద ఆధారపడి ఉంటుంది. కాని సంస్కృతాలంకారికులు ఎవరు 'శైలి' అనే శబ్దాన్ని పేర్కొనలేదని తెలియజేస్తూ, శైలికి బదులుగా శైలికంటే విస్తృతార్థాన్ని ఇచ్చే 'రీతి' అనే శబ్దాన్ని అలంకారికులు ప్రయోగించిన విషయంలో వి. రాఘవన్ గారి అభిప్రాయాన్ని సుజాతారెడ్డి ఇక్కడ గుర్తుచేశారు. అలాగే 'మను వసుచరిత్రల తులనాత్మక పరిశీలన'లో భాగంగా పెద్దన, రామరాజభూషణుని శైలి సౌందర్యాన్ని విశ్లేషించే సందర్భంలో భారతీయ లాక్షణికులు రీతిలో భాగంగా గుణములు, వృత్తులు, వివిధ పాకముల రూపంలో నిర్మించిన రూపాన్ని ముదిగంటివారు వారు ఈ గ్రంథంలో ఉదాహరణయోక్తంగా వివరించి చూపారు.

*"మను చరిత్ర ఆంధ్ర ప్రబంధములలో అగ్రగణ్యమని కొనియాడుటకు కారణము ఇందలి శైలి సౌభాగ్యము. శైలియందు దీనిని మించిన ప్రబంధ మింతవరకు పుట్టలేదు. ఆడంబరము లేని గాంభీర్యము, సౌమ్యమయిన పాధవము, ఉద్వేగములేని శీఘ్రగమనము, పేలవత్వములేని స్వాభావికత, వెలితి లేక నిండారి మెరుగులు దీరిన పదగుంఫనము, ఈ కావ్య శైలికి ముఖ్య లక్షణములు"* (విజ్ఞాన సరస్వము,1961:928) అని పింగళి మనుచరిత్ర గురించి అభిప్రాయన్ని తెలియజేశారు. మనుచరిత్ర భావ విషయంలో కన్నా భాష విషయంలోనే ఎక్కువ ప్రసిద్ధి పొందినట్లు దీని అనుకరణలను బట్టే తెలుసుకోవచ్చు. ముఖ్యంగా రామరాజభూషణుని విషయంలో అధికంగా ఉన్నట్లు అనిపిస్తుంది. అందుకే మను వసుచరిత్రలు ప్రబంధప్రక్రియ శైలికే ఒక మార్గనిర్దేశనం చేసాయనుకోవచ్చు.

### 3.1.3.1 మాధుర్యము

చక్కని విడి విడి పదాలతో విలసిల్లు వాక్యమే మాధుర్యమని ప్రతాపరుద్రుడు అనగా అవి పెద్దన, రామరాజభూషణుల రచనల్లో ప్రదర్శించిన తీరును,

**ఉ. "అక్కట వాడు నాతగుల మారడిచేసి దయావిహీనుడై**
**చిక్కక త్రోచి పోయే దరి జేరంగ రాని వియోగసాగరం**
**బెక్కడ నీదుదాన నిక నీకోరనోములు నోచినట్టినే**
**నెక్కడ వానికౌగి లది యెక్కడ హావిధి యేమి సేయుదున్" (మ.చ 3-4)**

ఈ పద్యంలో ప్రవరుడు తిరస్కరించిన వరూధిని అడవంత తిరిగి తన చెలికత్తెల దరి చేరి, తన మనస్సులో అయ్యో, అతడు నాకు నేనే అతన్ని వలచిన నన్ను తిరస్కరించెను కదా! ఈ విరహ సముద్రాన్ని నేను ఎలా ఇదగలను? తక్కువ నోములు నోచిన నేను ఎక్కడ? అతని కౌగిలి ఎక్కడ? ఓ దైవమా నేనేమి చేయగలను? అని అంటూ వరూధిని విరహావస్థను పెద్దన చెప్పిన తీరులో మాధుర్యగుణము ప్రస్ఫుటమవుతుందని శాంత, శృంగార ప్రధానమైన మనుచరిత్రలో ఇలాంటి గుణములు కోకొల్లలుగా ఉన్నట్లు ముదిగంటి సుజాతారెడ్డి తన పరిశోధనలో భాగంగా వివరించారు.

**ఉ. శైలకులేంద్రు డిట్లు మదశాలి శుకాలి పికాలి శారికా**
**జులాక నీలకంఠ రవసంగతి దాలిమి నిల్ప జాల కు**
**ద్వేలక రాళకంతుశ వేదన దీర నదీరసోర్మికం**
**దేలక యేల కల్లు మహానీయసుఖం బని నిశ్చితాత్ముడై (వ.చ. 2-117)**

శుక్తిమతి కోసం కోలహలుడు మన్మథావస్థలో కోకిల, గోరువంక, నెమలి వంటి పక్షుల ధ్వనులచేత ఎలాంటి ఉపశమనం లేకుండా ఉన్నాడు. శుక్తిమతిని కలవడమే పరిష్కారమని

నిర్ణయించుకున్న కోలహాలుని స్థితిని రామరాజభూషణుడు వివిధ రకాల పదాల కూర్పుతో పద్యంలో మాధుర్య గుణమును ప్రదర్శించినట్లు ముదిగంటివారు వారు  పేర్కొన్నారు.

మను వసుచరిత్రల ఈ తులనాత్మక పరిశీలన గ్రంథంలో ఔదార్యం, అర్థవ్యక్తి, సుకుమారము, కాంతి, ఓజస్సు, మొదలైన గుణాలను గురించి కూడా ప్రతిదానికి ఉదాహరణయుక్తంగా ఆమె అందించారు. పెద్దన కవిత్వం కైశికి వృత్తితో కూడి, ప్రసాద మాధుర్య గుణములతో వైదర్భీ రీతిలో, ద్రాక్షపాకములో నడచినదని, రామరాజభూషణుని కవిత్వం ఆరభటీ వృత్తితో కూడి ఓజఃకాంతి గుణాలతో గౌడిరీతిలో, నారికేళపాకములో నడిచినదనే కావ్యాలంకార సంగ్రహ వ్యాఖ్యలోని సన్నిధానం సూర్యనారాయణశాస్త్రిగారి అభిప్రాయాన్ని ఈ సందర్భంగా సుజాతారెడ్డి ఉటంకించారు.

## 3.1.3.2 శ్రీనాథుని స్వకల్పన

శ్రీనాథుడు తెలుగు పద్యానికి తనదైన శైలిలో సరసతను చేకూర్చి పెట్టినవాడు. అందుకే తెలుగులో మొదటిసారిగా శైలీ సౌందర్య అవశ్యకతను గుర్తించింది శ్రీనాథుడే అంటారు రచయిత్రి.(శ్రీనాథుని కవితా సౌందర్యం,1980:80) శ్రీనాథుని కన్న ముందు ఎంతోమంది కవులు వారెవరికి శైలి సౌందర్యం సాధించాలనే స్పృహలేనట్లు కనిపిస్తున్న విషయాన్ని రెడ్డి ఈ సందర్భంగా తెలియజేశారు.

శ్రీనాథుడు తన కావ్యపీఠికలో విశేషమైన భావ సౌందర్య, శైలిగల పద్యాలను అందించినట్లు శ్రీనాథుని కవితా సౌందర్యం గ్రంథంలో ముదిగంటి  సుజాతారెడ్డి ఆ భావ సౌందర్యాన్ని కొన్ని పద్యాల్లో విశ్లేషించి చూపారు. నలుడు దమయంతి గురించిన విరహాన్ని హంసతో చెబుతున్న సందర్భంలోని పద్యం శ్రీనాథుని పద్యరచన శైలిని తెలియజేస్తుంది.

**విషమో మలయహిమస్థలీ**
**విషవూత్కర మాయోమయోహితః**
**బతకాలకలత్రదిగ్భవః**

**పవనస్త ద్విరహానలై ధసా (నై. చ.2-57)**

సంస్కృత నైషధంలో హర్షుడు రాసిన పై పద్యాన్ని శ్రీనాథుడు తెలుగు చేసే క్రమంలో చూపించిన నైపుణ్యం ఆయన శైలి గొప్పతనానికి ఒక తార్కాణంగా నిలిచింది.

**శా. కాలాంతః పురకామినీ కుచతటీ కస్తూరికాసౌరభ**
**శ్రీలుంటాకము చందనాచల తట శ్రీఖండ సంవేష్టిత**
**వ్యాలస్పారవణా కఠోర విషానిశ్వాసాగ్ని పాణింధమం**
**బేలానాపయి దక్షిణానిలము పక్షీ! సేయు దాక్షిణ్యమున్ (శృ.నై. 2-32)**

నైషధచరిత్రలో గల 'కాల కలత్ర దిగ్భవః పవనః' (కాలుని భార్యయైన దక్షిణ దిక్కున పుట్టిన పవనం) అనే భావానికి శ్రీనాథుడు 'కాలాంతః పురకామినీ కుచతటీ కస్తూరికా సౌరభ శ్రీలుంటాక' (కాలుని అంతఃపుర స్త్రీల వక్ష స్థలం మీద ఉన్న కస్తూరి యొక్క సువాసనలను నిర్ధాక్షిణ్యంగా కొల్లగొట్టిన దక్షిణానిలం) అనే భావం శ్రీనాథుడు తన ప్రతిభచే స్ఫూరింపజేశాడని ముదిగంటివారు వారు వివరించారు.

కావ్యం స్వతహాగా శబ్దప్రధానం కావటం వల్ల సంస్కృత కావ్యాలని తెలుగులోకి అనువదించే సాహసం మరెవరూ చెయ్యలేకపోయారు. కాని మిగిలిన కవులకి ఇబ్బందిగా నిలిచిన ఈ అడ్డంకిని శ్రీనాథుడు సులభంగా దాటేశాడు. దీనికి శ్రీనాథుని శృంగార నైషధంలోని పై పద్యం వంటి వాటిని ఉదాహరణకు చెప్పుకోవచ్చు. శ్రీనాథుని కవితారీతి శబ్దార్థాలకు సమానమైన ప్రాధాన్యత కలిగివుంటుందని చెబుతూ, ఆయన దృష్టి సమాస సౌందర్యాన్ని సాధించడం మీద ఉంటుందని తెలియజేశారు. అందుకే పెద్దన వంటి కవులు శ్రీనాథుని సరసశైలిని, పదాల కూర్పును గ్రహించడమే కాకుండా భావ భంగిమలను అనుకరించి విజయం సాధించారని రచయిత్రి భావించారు.

**నావర్థో జాతిరగ్రామ్యా శ్లేషో క్లిష్ట స్ఫుటోరసః**
**వికటాక్షర బంధశ్చ కృత్స్న మేకత్ర దుష్కరమ్ (హ–శ్లో–8)**

అని బాణుడు తన కవిత్వంలో నవార్థం, స్ఫుటమైనరసం, అగ్రామ్యమైన స్వభావోక్తి, అక్లిష్టమైన శ్లేష, వికటాక్షర బంధం ఉన్నవని చెప్పుకున్న దాన్ని ఆధారంగా చేసుకొని బాణుని కవిత్వ శైలిని

తన 'బాణుని కాదంబరి పరిశీలన'(పుట.78) గ్రంథంలో సుజాతారెడ్డి విశ్లేషించే ప్రయత్నం మనకు ఈ గ్రంథంలో కనిపిస్తుంది.

వర్ణనలు లేని చోట బాణుని భాష మిక్కిలి తేటగా, మనోహరంగా, వేగంగా ప్రవహించే నదిలా ఉంటుంది. కొన్ని చోట్ల రెండు, మూడు లేక నాలుగు పదాలు మాత్రమే గల వాక్యాలు, అనేకం కనబడుతున్నాయి. వర్ణనలో గౌడిరీతి, మనో భావప్రకటనలో వైదర్భిరీతి కాదంబరిలో కనబడుతున్నాయి.(వెంకటరమణ, వేదం. బాణుని కాదంబరి దాని వైశిష్ట్యం:183) అలాగే బాణుని వర్ణనలో కల్పనా చాతుర్యం, ఊహా ఔన్నత్యానికి ప్రాధాన్యతనిచ్చినట్లు ఆమె తెలియజేశారు.

బాణుని సుందర శైలిని గురించి ఇంద్రధనుస్సుతో పోల్చి చెప్పిన ఎస్. కె డే అభిప్రాయం ఈ సందర్భంలో గమనించదగినది. "But it should not be forgotten that it is mainly by its wonderful spell of language and picturesqueness of imagery that Bans's luxuriant romances retain their hold on the imagination and it's precisely in this that their charm lies. It is an atmosphere of gracious lunar rainbows than that of strong sunlight" (A History of Sanskrit literature, 1990:237)

అలాగే బాణుని శైలి వంటి శైలిని ప్రయోగించి పద్య కవిత్వంలో నూతన మార్గాలను తొక్కిన శ్రీహర్షాదివంటి కవులు ఉన్నారు కానీ, గద్య కావ్యకర్తలల్లో బాణుని శైలియే పరాకాష్టను చేరుకున్నది. తర్వాతి గద్య కవులు ఎవరూ కూడా ప్రతిభతో నూతన శైలిని సృష్టించి బాణుని మించలేకపోయారని(బాణుని కాదంబరి పరిశీలన,1980:75) అనే విషయాన్ని ముదిగంటివారు తన పరిశీలనలో భాగంగా నిర్ధారించారు.

భౌగోళిక ప్రాంతాన్ని బట్టి రీతిని పేర్కొనడం ఇష్టం లేని కుంతకుడు రీతిని మార్గంగా చెప్పాడని, కవిశక్తి వ్యుత్పత్తిని బట్టి రీతి ఉంటుందన్న కుంతకుని అభిప్రాయం గమనించదగినదని సుజాతారెడ్డిగారన్నారు. రసానికే పట్టం కట్టిన అలంకారికులు రీతిని కూడా రసానికి చేదోడు వాదోడుగా సఖిగా చేసి పెట్టారన్నారు.(శైలి–పాశ్చాత్య పండితాభిప్రాయ పరామర్శ, భారతి:1980) అలా అయితే రీతిని గురించి ప్రత్యేక కవితా ప్రస్థానంగా ఆదరించిన

అలంకారికులున్నారని, కవులు కూడా వున్నారని ఇకపోతే కవి ఆత్మీయతకు, శీలానికి శైలి ప్రతిబింబమనే మతాన్ని గూర్చి మన ఆలంకారికులు ఎక్కువ చర్చించుకున్నా అది పూర్తిగా వారి దృష్టిని తప్పించుకోలేదనే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు.

## 3.1.4 అలంకారాలు

కావ్య శోభను పెంచేవి అలంకారాలు. ఒక రచనలో అలంకారాల ప్రయోగం ద్వారా వాటి శోభను మరింత పెంచడం సాధ్యమవుతుంది. అలంకారాల ప్రయోగంలో అత్యున్నత స్థాయి 'వక్రోక్తి. కవిత్వం స్వభావోక్తి, వక్రోక్తి రెండు రకాలుగా ఉంటుందని భామహుని అభిప్రాయం. అటువంటి అలంకారాలకు ప్రబంధాలు ఒక గని లాంటివి. అలంకారములు కవి భావాన్ని, కావ్య వస్తువును స్పష్టంగా దర్శింపజేసి, సహృదయులకు ఆనందం కలిగిస్తాయి.

ఇటువంటి అలంకారాల ప్రభావాన్ని ముదిగంటి సుజాతారెడ్డి ఆమె 'మను వసుచరిత్రల తులనాత్మక పరిశీలన' గ్రంథం ఆధారంగా విశ్లేషించే ప్రయత్నం చేశారు.

ఆంధ్రసాహిత్యంలో అలంకారాలను అధికంగా ఉపయోగించినవి మను వసుచరిత్ర ప్రబంధాలే. పెద్దన, రామరాజభూషణులు వీటిని అర్థాలంకారలు, శబ్దాలంకారాలు రూపంలోనే ప్రయోగించారు. మను చరిత్రలో సహజ అలంకార శోభనే అధికంగా కనిపిస్తుంది. పెద్దన భావస్పష్టత, వస్తుసందర్శన, సజీవదృశ్యచిత్రణ మాత్రమే అలంకారాలను ఉపయోగించాడని తెలియజేస్తూ, పెద్దన రామరాజభూషణులు వివిధ సందర్భాల్లో ఉపయోగించిన అలంకారాలను పద్యాలను ఆధారంగా చేసుకొని విశ్లేషించారు. ముదిగంటి సుజాతారెడ్డి మనువసు చరిత్ర తులనాత్మక పరిశీలనలో విశ్లేషించిన అలంకారాలను ఒక అవగాహన కొరకు క్రింద పట్టిక ద్వారా తెలియజేశాను.

## ఆలంకారల ప్రయోగ పట్టిక

ముదిగంటివారు సుజాతారెడ్డిగారు మను చరిత్ర, వసుచరిత్రల్లో గుర్తించిన అలంకారాలను పట్టికగా పొందుపరిస్తే ఈ విధంగా వుంటుంది.

| అలంకారములు | మనుచరిత్ర | వసు చరిత్ర |
|---|---|---|
| 1. స్వభావోక్తి | 2-7<br>3 - 16,58,62,78, 4-38 | |
| 2. ఉత్ప్రేక్షాలంకారము | 3-17,20,22,25,26,54,61,75,81,91.<br>4-43, 5- 45,64,68 | 2-47.<br>3-156,157,158,162.<br>4-16<br>5-85,86,87,88,89, 90,91,92,93,94,95. |
| 3. ఉపమాలంకారము | 1-52, 3-60, 6-109 | |
| 4. రూపకాలంకరములు | 1-9, 18, 25.<br>3- 21,27,76,74,120, 4-63,<br>5- 35,36,40,92. 6-20 | 1-116,127,132,155<br>2-36, 40. 3-106,142.<br>6-99. |
| 5. భ్రాంతిమదాలంకారము | 3-11 | |
| 6. అతిశయోక్తి | 4- 8,96 | 1-103,108 |
| 7. ఉదాత్తాలంకారము | 2-43,45,55, 3- 111, 4-78,<br>5- 102, 6- 102 | |
| 8. వృత్యానుప్రాసాలంకారము | 2-6, 3-131,135, 4-6,11,117, 6-87, 88. | |
| 9. యమకాలంకారము | 3-63,74,85,89,4-98, 5-25,46, 6-104, | |
| 10. అంత్యానుప్రాసలంకారము | 3-84 | |

| | | |
|---|---|---|
| 11.శ్లేషాలంకారము | 1-37 5-32 | 1- 6,8,94, 5-37, 6-72 |
| 12. సమాసోక్తి | | 2-44, 65,66,123,<br>3-139,140. |
| 13.విరోధాభాసము | | 1-129 |
| 14.శ్లేషమూలక<br>కావ్యలింగాలంకారము | | 2-72,4-30,115 |
| 15.శ్లేషమూలక<br>అర్థాంతరన్యాసము | | 2-50. 4-34 |
| 16. ముక్తపదగ్రస్త | | 2-7,14, 95, 3-126, 181<br>4- 171 |
| 17. యమకములు | | 5-12,98 6- 46,50,<br>53,62,63,96. |
| 18.శ్లేష+<br>కావ్యలింగం+సమాస్యోక్తి | | 2-46 |
| 19.అతిశయోక్తి+ఉత్ప్రేక్ష+వృ<br>త్యానుప్రాస+అపహ్నవ | | 1-101 |
| 20.కావ్య+అతిశయోక్తి+రూప<br>కము+పరికరము | | 1-100 |
| 21.హేతూత్ప్రేక్ష+<br>రుపాకానుప్రాణిత్ప్రేక్ష<br>+ ప్రోడోక్తల్యం | 2-36 | |
| 22.రూపకం+ఉపమ+స్వభా<br>వోక్తి+అర్థాపతి | 4-17 | |
| 23.స్వభావోక్తి + అతిశయోక్తి | 2-19, 4-2,17, 6-21 | |
| 24.రూపకము + ఉత్ప్రేక్ష | | 4-130 |

పెద్దన స్వభావోక్తి, ఉపమ, ఉత్ప్రేక్ష, రూపక అర్థాంతరన్యాస, అతిశయోక్తి అలంకారాలను ఎక్కువగా, స్వభావోక్తి ఉత్ప్రేక్షలను మరింత అధికంగా వాడినట్లు చెప్పవచ్చు. కావ్యంలోని పాత్రల స్వరూపాలను, వాటి చేష్టలను వర్ణించే సమయాల్లో స్వభావోక్తి అలంకారాన్ని ఉపయోగించారు. అలాగే, మనుచరిత్రలో వృత్త్యానుప్రాస, ఛేకానుప్రాస, యమకం, అంత్యానుప్రాస, వంటి అలంకారాలను కూడా విరివిగానే వాడారు. మను వసుచరిత్రల్లో అలంకారాల గురించి చెబుతూ, వసుచరిత్రలోని ప్రతి పద్యం ఒక అర్థాలంకార వైచిత్రిని గాని, శబ్దలంకార వైచిత్రినిగాని ప్రతిబింబిస్తుందని డా.సుజాతారెడ్డి కొనియాడారు. రామరాజభూషణుడు, పెద్దన ఇరువురు పద్యాల్లో అనేక అలంకారల కూర్పుతో కూడిన కొన్ని సంసృష్టి అలంకారాల పద్యాలు కూడా కనిపిస్తున్నట్లు పేర్కొన్నారు. *"పెద్దనార్యుడు అలంకారవర్ణన లతిమాత్రముగజూపక తన కవిత్వమున స్వభావ మాధుర్య రసమే కురిపించినాడు. ఇట్లుగాక యలంకార వర్ణన లేక్కువచూపుటయే 'సాహిత్య రస పోషణాధికార' మెక్కువ కలిగియుండుటకు గురుతను నెడల భట్టుమూర్తియే పెద్దనార్యున కంటె నెక్కువవాడనవచ్చును. ఇట్లయినచో "పొందుపరచు నలంకృతుల్ భూషణార్థి!" యని యప్పకవి సప్తవిధకవుల బెర్కునుటలో జెప్పినట్లు భట్టుమూర్తిని మనము 'భూషణార్థి' యనియు జెప్పవచ్చునని"*(మను వసు చరిత్ర రచనా విమర్శనము:57) అలంకార వర్ణన నైపుణ్యాన్ని పొంది మూర్తికవి 'భూషణుడు' అనే తన పేరును సార్థకం చేసుకున్నట్లు వెన్నేటి రామచంద్రరావు వాఖ్యానించారు. కానీ, అల్లసాని పెద్దన మనుచరిత్రలో స్వభావోక్తి అలంకారాన్ని 67 సార్లు ఉపమ, రూపమాలంకారాలను 50 సార్లు, అతిశయోక్తిని 30సార్లు వాడిన మూర్తికవి భట్టుమూర్తి మాత్రం ఉత్ప్రేక్షను అధికంగా వాడినట్లు సుజాతారెడ్డి కనుగొన్నారు.

## 3.1.4.1 రామరాజభూషణుడు-శ్లేష నైపుణ్యం

వసుచరిత్ర శ్లేష ప్రధానమైన కావ్యంగా విమర్శకులు అభివర్ణించగా దీనిపై సాహిత్యంలో భిన్నాభిప్రాయాలు ఉన్నాయి. వజ్ఝల చినసీతారామశాస్త్రి తన వసుచరిత్ర విమర్శనములో వసు చరిత్ర శ్లేషకావ్యమా? ధ్వని కావ్యమా? అని చర్చించి వసు చరిత్రను ధ్వని కావ్యంగానే పేర్కొన్నారు.(వసు చరిత్ర విమర్శనము:84) అస్సలు రెండు అర్థాలను ఇచ్చే పదాలని శ్లేష అంటారు. ఇందులోని కొన్ని భేదాల చేత, ఇవి ప్రకృతశ్లేష, అప్రకృతశ్లేష, ప్రకృతాప్రకృత శ్లేష అనే విధంగా విభజించవచ్చు. పింగళి సూరన తన రాఘవ పాండవీయంలో శ్లేషలో అనేక రకాలను తెలియజేశాడు. రామరాజభూషణుడు రాసిన 'హరిశ్చంద్రనలోపాఖ్యనం' ద్వారానే శ్లేషకు సరితూగు అర్ధద్వయ ఘటనా ప్రీతిని అర్థం చేసుకోవచ్చునని రెడ్డిగారన్నారు. చిత్రకవిత్వంనందు భూషణుడు అప్పటికే ప్రసిద్ధిచెందిన పెద్దన ప్రభావంతో ప్రబంధ రచన మొదలుపెట్టినట్లు ముదిగంటివారు వారు  చెప్పారు. కాని పూర్తిగా పెద్దనవలె చిత్ర, బంధ కవిత్వాలపై ఆధారపడకుండా తన స్వప్రతిభచే అలంకారాల్లో గొప్పదైన శ్లేషను ఆయన పద్యాల్లో ఉపయోగించాడని రచయిత్రి అన్నారు. శ్లేష విషయంలో రామరాజభూషణుడు సంస్కృత కవులైన బాణుడు, సుబంధు, శ్రీహర్షుడు వంటి వారితో సరితూగుతాడని సుజాతారెడ్డి భూషణుడిని కొనియాడారు.

రామరాజభూషణుడు శ్లేషను అలంకార వైచిత్రి, ఉక్తి వైచిత్రుల కోసం వాడారు. వసుచరిత్రలో 'శుక్తిమతీ కోలాహలం వృత్తాంతం విధూషకుని మాటలు' వంటి కొన్నిచోట్ల అర్ధద్వయం శబ్దశక్తి మూలకధ్వని లేదా సమసోక్త్య అలంకార ప్రకటన కొరకు ప్రయోగించబడినది అని చెబుతూ, కొన్ని సందర్భాల్లో  శ్లేష ఆయా శాస్త్ర పరిజ్ఞానం ఉన్నవారికే అర్థమవుతుందని ***"అతా సప్రుత్తి జెన్నలరి నూతన రాగ/ మహిమ గుల్కెడు కల్కి....."*** (వ.చ 6-72) వంటి పద్యాన్ని ఉదహరిస్తూ విశ్లేషించారు. శ్లేష ప్రయోజనం కథకు లేదు. అనేక పద్యములలో రామరాజభూషణుడికి శ్లేష ప్రతిభ ఆధారంగా మూర్తికవికి శ్లేషప్రీతి అధికమేనని రెడ్డిగారంటారు.

### 3.1.4.2 నిరలంకార సౌందర్యం

పద్యం అంటేనే అలంకారాలతో నిండిందన్న భ్రమ చాలామందికి ఉంటుంది. ప్రాచీన అలంకారికుడైన విశ్వనాథుడు "వాక్యం రసాత్మకమ్ కావ్యమ్" అన్నాడు. అలంకారమే కావ్య శోభ. అందుకే ***"కావ్య శోభాకరాన్ ధర్మాన్ అలంకారాన్ ప్రచక్షతే"***(కా.2-1) అని అన్నాడు దండి. ఇలా అలంకారికులు ఎవ్వరూ అలంకార రహిత శబ్దార్థాలను రమ్యమైన కావ్యంగా పరిగణించినట్లు కనిపించదు. అందుకేనేమో కావ్య శాస్త్రానికి అలంకారశాస్త్రమని పేరు పెట్టినట్లు అనిపిస్తుంది. కానీ, అలంకారం లేకుండా కూడా కవితా శోభను సాధించవచ్చని నిరూపించినవాడు శ్రీనాథుడు. తెలుగు సాహిత్యంలో అలంకారాలను చాలా తక్కువ సంఖ్యలో ఉపయోగించిన కవులలో శ్రీనాథుడుదుంటాడు. వార్త మాత్రమైన విషయాలను కూడా శ్రీనాథుడు తన శబ్దార్థాల శక్తిచేత రమణీయం చేయగలడని శ్రీనాథుని నిరలంకారశైలి గురించి ముదిగంటి సుజాతారెడ్డి 'శ్రీనాథుని కవితా సౌందర్యం' గ్రంథంలో కొన్ని పద్యాల సహాయంతో చేసిన విశ్లేషణ ద్వారా ఈ విషయం అర్ధమవుతుంది.

**సీ. సిద్ధవాహిని నీట జిరుబంతి పనుపాడి**
**శ్రీ విశాలాక్షి కైసేయ దేడగే**
**మొరసె నంతర్గేహమున విస్వనాయక**
**తాండవారంభ మర్ధలరివంబు**
**మందారతరుపుష్ప మధుపాన గోష్టికి**
**బ్రారంభ మొనరించె భైరవుండు**
**కొక్కొర కో యని కోమరుసామి రథంబు**
**కంఠంబు సాచి క్రేంకార మిచ్చె**

**మొగుడు బారిస యరవిందములకు బాసి**
**గములు గములుగ మత్తభృంగములు గూడి**

**దుంతీ విఘ్నేశు చెక్కు లుత్కంఠ జేరే**

**నభినవంబైన యపర సంధ్యాగమమున** (భీ.ఖం 2-28)

పై సీసపద్యంలో సంధ్యాగమంతో విశాలాక్షి స్నానంచేసి అలంకరించుకోవడం ప్రారంభించింది. శివుని తాండవానికి మద్దెలు మోగినవి. పానగోష్టికి భైరవుడు సిద్ధం చేయసాగాడు. కుమారస్వామి వాహనం కొక్కరకో అని కూయసాగింది. ముడుచుకునే పద్మాలను విడిచి తుమ్మెదలు విఘ్నేశ్వరుని చెక్కిళ్ళని చేరాయి వంటి వార్త విషయాలను సైతం శ్రీనాథుడు స్నానానికి బదులు 'చిరుబంతి పసుపాడి' గంగానదిని 'సిద్ధవాహిని' అని వాడుతూ ఎలాంటి అలంకారాలను ఉపయోగించకుండ పాఠకులను ఆకట్టుకున్నాడని సుజాతారెడ్డి పద్య సహయంతో శ్రీనాథుని నిరలంకారంలో రమణీయార్థాకాన్ని కొంత వివరించే ప్రయత్నం చేశారు.

శ్రీనాథుడు తన కావ్యాల్లో ఉపమ, ఉత్ప్రేక్ష, భ్రాంతి, ఉల్లేఖాది, అపహ్నుతి వంటి కొన్ని అలంకారాలను కూడా వాడినప్పటికి వీటిలో ఉపమ, ఉత్ప్రేక్షలు శ్రీనాథునికి ఇష్టమైనవిగా కనిపిస్తున్నాయని చెబుతూ శ్రీనాథుడు కూడా అలంకారాలను ఉపయోగించిన సందర్భాలున్నాయని సుజాతారెడ్డి గుర్తుచేశారు.

**చరబడి తీవ్రఘర్షణ వశంబున నొక్కట తీగసుట్టు నె**

**త్త రులయియున్న పాప తరిత్రాటి మంలకల నిర్ఘా రాంబువుల్**

**గిరికొని మీద నుండిదిగా గిన్నర కంతీ పయోధి ద్రచ్చున**

**త్తరి ఫణిరాజు చుట్టిన విధంబున నున్నదిచూడు మిగ్గిరిన్ (కా. ఖం** 5-284)

శ్రీనాథుని వర్ణనను తర్వాతి కాలంలో పెద్దన, రామరాజభూషణుడు అనుకరించారని, పెద్దన, శ్రీనాథునిలాగా మంథన వృత్తాంతాన్ని తీసుకుని ఉత్ప్రేక్ష అలంకారంలో చేక్కాడు. (మనుచరిత్ర.5-48) భూషణుడు కోలాహల పర్వతాన్ని వసురాజు ఉదాగ్రచరణాహతికి యిప్పటికి మూల్గుతు నెత్తురు కక్కుతుందనే కల్పనలో ఇది కనిపిస్తుందనంటారు ముదిగంటివారు (వసుచరిత్ర.2-8) వీటితోపాటు కావ్యపీఠికల్లో, కృతిపత్యాదుల వర్ణనలో శ్రీనాథుని అలంకార సౌందర్యంగల పద్యాలు కొన్ని దర్శనమిస్తాయి.

### 3.1.4.3 బాణుడు-ఉపమ ప్రవాహం

అలంకారమనగా సౌందర్యం.(సౌందర్యమలంకారః.వామనుడు. కావ్యాలంకార సూత్రవృత్తి(1-2)) అలంకరించేది అలంకారం అని వ్యుత్పత్తి. ఒక వ్యక్తి చెప్పాలనుకున్న భావాన్ని అలంకారాలు మరింత స్పష్టంగా చెప్పడానికి ఉపయోగపడతాయి. కానీ, అది చెప్పడానికి ఒకరకమైన భావోద్వేగం అవసరం. వాల్మీకి, కాళిదాసు వంటి కవులు ఒకే ఉపమానంతోగాని, ఊహతో గాని ముగిస్తారు. కానీ, బాణుని వాణి ఇలా కాకుండా ఒక ప్రవహంవలె ఉపమాలాంకరాలను ప్రయోగిస్తూ పోతుంటాడని, అటువంటి భావోద్వేగం బాణుని రచనలో ఒక ప్రవాహంలాగా కనిపిస్తుందని సుజాతారెడ్డి బాణుని రచన శైలిని ఒక విమర్శన దృక్పథంతో తెలియజేశారు. బాణుడు ఉపమ ప్రవాహాన్ని గర్భవతి అయినా విలాసవతితో పోల్చి చూడడంలోనే తెలుస్తుందని "**ఉపారుడా గర్భాతయా అంతర్గత కులశై లామివ క్షితిమ్/ సలిల నిమగ్నై రావతమివ మందాకినీమ్/ గుహగత సింహామివ గిరిరాజ మేఖలమ్.....**"(బాణుని కాదంబరి పరిశీలన, 1980:86) అంటూ బాణుని ప్రతిభా వైచిత్రిని ఆవిష్కరించారు.

బాణుని వర్ణనల్లో ఒక రకమైన కృత్రిమత్వం అనేది లేకుండా, శబ్ధాలంకార ఆడంబరం లేకుండా ఒక నిరాడంబర శైలిలో సాగుతుందనంటారు ముదిగంటివారు వారు . వేదం వెంకటరామన్ గారి*"బాణుడు శబ్దాలంకారప్రియుడని, శబ్దాలంకారమునకు అర్థమును త్యజించువాడనియు ఒకదురభిప్రాయము. 'కాదంబరి'ని కాని 'హర్షచరిత'మును కానీ, సరిగా చూడనివారియందు కనబడును. బాణుడు దీర్ఘసమాసములు ప్రయోగించుట చేత చదువునపుడు గొప్ప శబ్దోత్సాహము తోచును. కొన్ని యెడల శబ్దాలంకారములు వున్నవి. బాణుడు శబ్దాలంకారముల కోరకు ప్రాకులడినట్లు మాత్రం ఎచ్చటను తోచదు"* (బాణుని కాదంబరి దాని వైశిష్ట్యం:196) అనే అభిప్రాయం, పైన చెప్పిన సుజాతారెడ్డిగారి మాటలకు బలం చేకూర్చే విధంగా ఉన్నాయి. సుజాతారెడ్డి తమ భర్త సహకారంతో రాసిన '**బాణుని కాదంబరి పరిశీలన**'

గ్రంథంలో బాణుని అలంకార విధానం గురించి అనేక విషయాలు వివరించారు. కాదంబరిలో ఉపమ, ఉత్ప్రేక్షలే కాకుండా శ్లేష, విరోధాభాస, పరిసంఖ్యాలంకరాలు, రూపక సమాసోక్తి, భ్రాంతి, సందేహ, కావ్యలింగ, తద్గుణ, అతిశయోక్తి, సహోక్తి, విశేషోక్తి, దీపకవ్యాలంకారాలు మొదలైన అలంకారాలు అక్కడక్కడ ఉన్నాయన్నారు. కానీ, బాణుని గురించి కావ్యవిమర్శ చేసిన వారిలో కొందరు బాణుడు, రామరాజులు శ్లేషాలంకార ప్రీతి గలవారని, రూపకాలు, ఉత్ప్రేక్షలు ఇష్టమైనవిగా పలు భిన్నాభిప్రాయాలున్నాయి.

## 3.1.5 వర్ణన నైపుణ్యరీతి

వర్ణనలకు ప్రబంధాలు పెట్టింది పేరు. పదహారో శతాబ్దంలో ప్రబంధ ప్రక్రియలో భాగంగా ఇది ప్రసిద్ధి చెందినా, వర్ణన ప్రాధాన్యాన్ని అలంకారికుల కాలం నుండే తెలియజేశారు. దండి, విశ్వనాథుడు, రుద్రటుడు మొదలైనవారు వర్ణనల గురించి ప్రస్తావించగా తెలుగులో పాల్కురికి సోమనాథుడు, భట్టుమూర్తి వంటి వారు పద్దెనిమిది వర్ణనలు ఉండాలనగా, అప్పకవి ప్రబంధంలో ఇరవై రెండు వర్ణనలు ఉండాలన్నాడు. ఎవరేన్ని ఉండాలన్న, వర్ణనకు అటు సంస్కృత, ప్రాచీన సాహిత్యం నుండి ఇటు ఆధునిక సాహిత్యం వరకు ప్రాధాన్యత ఉంది. అందుకే ఆధునిక సాహిత్య విమర్శకులు రాచపాళెం చంద్రశేఖరరెడ్డి వర్ణన గురించి వివరిస్తూ *"వర్ణనయనగా విస్తరించి చెప్పుఅని అర్థం. ఒక కవి ఒక వస్తువును చూచి, దాని స్వరూప స్వభావములను సమగ్రంగా భావించి హృదయాహ్లాదజనకముగా వివరించును. ఆ వివరణయే వర్ణనని'*(ప్రభావతి ప్రద్యుమ్న కావ్యశిల్పము,1980:256) వర్ణన మనస్సుకు ఆనందాన్ని కలిగించేలా ఉంటుందన్న అభిప్రాయాన్ని వ్యక్తపరిచారు.

అష్టాదశ వర్ణనలకు నిలయమైన మనుచరిత్ర, వసుచరిత్రల్లో వర్ణనల గురించి ముదిగంటి సుజాతారెడ్డి భావ, శైలి సంబంధ విషయాలను ఉదాహరణయుక్తంగా పరిశీలించారు. ముఖ్యంగా వర్ణనలు ఉపయోగించడానికి అనేక రకాల కారణాలు ఉన్నాయి. కథలోని ఒక విషయాన్ని సులభంగా అర్థం చేసుకోవడానికి అలాగే కథలో జరుగబోయే సన్నివేశాన్ని తెలియజేయడానికి వర్ణనలు రచయితకి ఎంతగానో సహకరిస్తాయి.

ప్రస్తుతకాలంలో అనేక సినిమాల్లో కూడా వర్ణనను రూపాంతరం చెందించి సంఘటన బట్టి వర్ణనకు బదులుగా అక్కడి వాతావరణాన్ని తయారు చేయడం మనం గమనించవచ్చు. ప్రబంధాల్లో ఉన్న అష్టాదశ వర్ణనలన్నింటిని సుజాతారెడ్డి విశ్లేషించే ప్రయత్నం చేశారు. ఆ విశ్లేషించిన తీరును కుమారోదయ వర్ణనలో పరిశీలించవచ్చు.

కుమారోదయాన్ని  అలంకారికులు మహాకావ్య వర్ణనలో ఒకదానిగా పేర్కొన్నారు. మనుచరిత్రలో  స్వరోచిస జనన వృత్తాంతాన్ని పెద్దన ఐదు పద్యాల్లో (మ.చ.4:5-9) జననం, నామకరణం, బాల్యక్రీడలు, విద్యాభ్యాసం వంటి వాటిని కుమారోదయంలో చిత్రించే సందర్భాల్లో వర్ణించాడని వివరించారు.

**"స్వరుచి స్ఫురణను శశి భా**
**స్కర పావక తారకా ప్రకాశములెల్లన్**
**విరళములు సేయ నతనికి**
**స్వరోచియను నామమిడి రచటి మునులెల్లన్" (మ.చ. 4-7)**

స్వరోచికి స్వరుచి స్ఫూరణను ఆధారంగా మునులు అతనికి ఆ పేరు పెట్టారని పెద్దన చెప్పగా, రామరాజభూషణుడు గిరికా వసుపదుల జననం గురించి పదమూడు పద్యాల్లో (వ. చ. 3: 22-34) చెప్పగా,  నామకరణం గురించి కింది విధంగా

**"గిరిరాజతనయ కైవడి**
**సిరి రాజిల వెలయు నీ సుశీలయనుచు నా**
**గిరికన్య కచటి మౌను లు**
**గిరికా శుభనామ మిడిరల్భిష ఫణితిన్" (వ.చ.3-26)**

అని  వసుచరిత్ర కర్త వర్ణణ నైపుణ్యాన్ని సుజాతారెడ్డిగారు  వెల్లడించారు. ఈ విధంగా ముదిగంటి  సుజాతారెడ్డి మను-వసు చరిత్రలలోని అష్టాదశ వర్ణనలన్నింటిని తారతమ్య దృష్టితో పరిశీలించిన ప్రయత్నం 'మను-వసు చరిత్రల తులనాత్మక పరిశీలన' గ్రంథంలో కనిపిస్తుంది. ఇందులో మహాకవులు ఇద్దరు ఔచిత్యాన్ని బట్టి వర్ణపోషణ చేశారన్నారు.

ముదిగంటివారు వారు పరిశీలించిన తదితర సన్నివేశాలు, వర్ణనల సామ్యాన్ని అనుసరించి రామరాజభూషణుడు మనుచరిత్రను అనుసరించి తన వసుచరిత్రలో స్థానం కల్పించి విమర్శించారు. కానీ, మనుచరిత్రలోని వర్ణనలు కథానుగుణంగా ఉండంగా, వసుచరిత్రలో వర్ణనలు కొంత విస్తృతిని పొందినట్లు అనిపిస్తుంది.

**ఉ. కోమల తామ్ర చూళికల క్రొవ్వెరసంజకు బ్రోదివెట్ట ని**
**స్సీమ కఠోరతారరుతి జెట్టుపలార్చుచు నర్రురెత్తి వి**
**శ్రామపోలేగూసె విలసచ్చ రమాచలకూట పక్కర**
**గ్రామశిఖాకుటీర శిఖరంబుల గుక్కట చక్రవాలముళ్ (శృ.నై)**

శృంగార నైషధంలో సాయంకాల వర్ణన(శ్రీనాథుడు,1952:105) శ్రీనాథుడు చేసినట్లు 'కాపాలి' రాసిన 'శ్రీనాథుడు' అనే గ్రంథంలో తెలియజేసినా, సుజాతారెడ్డిగారి 'శ్రీనాథుని కవిత సౌందర్యం' గ్రంథంలో వర్ణనల గురించి ప్రత్యేకంగా ప్రస్తావించినట్లు కనిపించదు.

వర్ణనలు కవిత్వంలో సహజంగానే ఉంటాయి. ప్రకృతిని ఆరాధించే మానవ స్వభావం నుండి వర్ణన అనేది వచ్చినట్లు ఒక తార్కాణం. వివిధ అలంకారికులు వివిధ రకాల అలంకారల సంఖ్యను తెలియజేయగా దండి చెప్పిన పద్దెనిమిది సంఖ్యనే ఎక్కువ మంది అంగీకరించినట్లు తెలుస్తుంది. అందుకే అష్టాదశ వర్ణనలు కలవి ప్రబంధాలు అనే మాటకు "ప్రబంధ కవితకు వర్ణనలు ఒక ముఖ్యంగాము"(ఆంధ్ర ప్రబంధం అవతరణ వికాసాలు,1965:92) అనంటారు కెవిఆర్.

బాణుడు సుధీర్ఘమైన వర్ణనలు చేయడంలో మంచి నేర్పరి. అందుకే కాదంబరీ కావ్యం కూడా శూద్రకుని వర్ణనతో ప్రారంభించాడు. బాణుడు గొప్ప వర్ణన ప్రియుడు. అందుకే మహాకావ్యంలో వర్ణన అంశాలైన పుర, వన, రాజ, సూర్యోదయం, సంధ్య, రాత్రి, చంద్రోదయంలాంటి వర్ణనలన్నింటిని తన కాదంబరీకావ్యంలో చేర్చుకుని కాదంబరీ కావ్యాన్ని మహాకావ్యంగా తీర్చిదిద్దినట్లు ముదిగంటి సుజాతారెడ్డి 'బాణుని కాదంబరీ పరిశీలన' గ్రంథంలో ప్రశంసించారు.

పాత్రల రూపవేశాదులను, ప్రకృతి పరమైన అంశాలను, పాత్రల భావపరంపరలను గురించి చెప్పడంలో బాణుడు తన వర్ణన నైపుణ్యాన్ని ప్రదర్శించాడు. ఒకే రకమైన వర్ణనలు చేయవలసిన వివిధ సందర్భాలలో భిన్నమైన వర్ణనతో బాణుడు తన ప్రతిభను చూపించాడు. బాణుని సుదీర్ఘ వర్ణనలలో కాదంబరీ, మహాశ్వేతవంటి పాత్రలు తమ స్వభావాన్ని కోల్పోకుండా తమతమ వ్యక్తిత్వాలను నిలుపుకునేలా ఉంటాయని ***"అగణిత సర్వ శంకయా తరళ హృదయతాం దర్శయంత్యా అద్యమయాకిం క్రుతమిదం మేహంధయా తధాహి'***(బాణుని కాదంబరీ పరిశీలన,1980:95) అంటూ కాదంబరీ హృదయంలోని మాటలను బాణుడు పాఠకుల ముందు ఉంచినట్లు సుజాతారెడ్డి ప్రస్తుతించారు. వర్ణన నైపుణ్యం అనుభవంతోనే పెరుగుతుంది. ఇదే విషయాన్ని బాణుడు హర్షవర్ధుని ఆస్థానంలో పనిచేసిన అనుభవంతో అ సమయంలో వివిధ దేశాలకు వెళ్ళడం, రాజులు. సామంతరాజులు, మంత్రులు, దినచర్యలు, వారి విధి విధానాలు, ఆచార వ్యవహారాలు దగ్గరి నుండి చేసిన పరిశీలన బాణుని వర్ణనల్లో తేటతెల్లం అవుతుందంటారు ముదిగంటివారు . అలాగే బాణుని వర్ణనలు సాంప్రదాయిక భావాలతో, ఊహకల్పనతో ఉపమానలతో కాకుండా, సూక్ష్మ పరిశీలన అనుభవంతో చేసినట్లుగా ఉంటాయని రచయిత్రి తెలియజేశారు. కానీ, ఆధునిక సాహిత్యంలో 'వర్ణన' దాని స్వరూపాన్ని కొంత మార్చుకుంటున్నట్టు అర్థం అవుతుంది. రచనలో కృతిపతి చరిత్ర కథకన్నా, పాత్రలే ముఖ్యం. అందుకే ఆధునిక రచయితలు మాత్రం తమ గొంతు పాత్రల గొంతు కన్నా ఎక్కువగా వినపడడం ఇష్టపడరు.

### 3.1.6 రసపోషణ వైవిధ్యం

ముదిగంటి సుజాతారెడ్డి మొదటినుండి, ఆధునిక ప్రక్రియ అయినా నవలల్లో చేసిన రసచర్చ అనే విషయం వరకు రసంపోషణ విషయంలో తమ విలక్షణమైన గొంతును వినిపిస్తూనే ఉన్నారు. *విభావ-అనుభావముల చేతను, సాత్త్విక-వ్యభిచారి భావముల చేతను స్వాదుత్వమును పొందింపబడు స్థాయిభావమని రసమని*" (తెలుగులో సాహిత్యవిమర్శ, 2017:21) ఎస్వీ రామారావు తెలియజేశారు. అలాంటి రసం గురించి మొదటిసారిగా తన పరిశోధన గ్రంథమైన 'మను వసుచరిత్రల తులనాత్మక పరిశీలన' గ్రంథంలో ప్రస్తావించారు.

ఇందులో మను వసుచరిత్రల ప్రబంధాల్లో పెద్దన, రామరాజభూషణుడు చేసిన రసపోసణను కొంత విపులంగా విశ్లేషించే ప్రయత్నం మనకు ఈ గ్రంథంలో కనిపిస్తుంది. ***'రస్యతే ఆస్వాద్య ఇతిరసః'*** అంటూ రస ధాతువుకు ఆస్వాదించేది రసం అనే అర్థం ఉంది. దీనినే *"సహృదయ సంవాదియగు నర్థభావనమే రసోద్భవహేతువు. ఆస్వాదయోగ్యమగు తదర్థమే శుష్కమైన కాష్టమందగ్నివలి శరీరమంతటా వ్యాపించునని"*(వీరరసము.1960:15) డా.జి.వి.యస్ తెలియజేశారు. భరతుడు మొదట ఎనిమిది రసాలు చెప్పగా, వాటికి శాంతరసాన్ని జతచేర్చి మొత్తం నవరసాలుగా తీర్చిదిద్దారు. అయితే ప్రబంధాల్లో శృంగారరసం ప్రధానంగా ఉండటం, మిగిలిన రసాలు అంగరసాలుగా ఉండటం అనేది ప్రబంధ లక్షణాల్లో ఒకటిగా అలంకారికులు గుర్తించారు.

## 3.1.6.1 ప్రబంధం–అంగిరస ప్రధానమా?

ప్రబంధాల్లో అంగిరసమేది? అనే అంశంపై ఇప్పటివరకు చాలా రకాల చర్చలు జరిగాయి. మనుచరిత్రలో రసం గురించి దివాకర్ల వేంకటావధాని తమ వ్యాసంలో అంగిరసమైన శృంగారానికి ఆలంబనాలైన వాటిని గుర్తించారు. పాత్రల స్థితి, మనోవృత్తి భేదాలను బట్టి శృంగారరసపోషణలో గల వైవిధ్యాన్ని వివరించే ప్రయత్నం చేశారు. ఇదే సందర్భంలో శాంతి–శృంగార రసాల మధ్య జరిగిన సంఘర్షణ గురించి వివరిస్తూ *"వరూధిని శృంగార రసకల్లోలిని. ప్రవరుడు శాంత మహాసముద్రం. ఆ కల్లోలిని సముద్రము నాక్రమించుటకై సంరంభించింది. కానీ, సముద్రం విజాతీయైన యభావ ప్రవాహమునకు సందీయక యతిరస్కృత మూర్తియై నిల్చినదని"*(మనుచరిత్ర–రసం(వ్యాసం)వికారి.48 1959:3) పెద్దన తన మనుచరిత్రలో కాల ప్రభావాన్ని బట్టి శృంగారాన్ని ప్రధాన రసంగా గ్రహించినా, శాంత రసానికి అఖండ విజయం కలిగించి తన కాల మర్యాదను అతిక్రమించినట్లు దివాకర్లగారి భావనగా చెప్పవచ్చు.

మనుచరిత్రలో ప్రవరుడు శాంతానికి, వరూధిని శృంగారానికి ప్రతీకగా కనిపిస్తారు. కానీ, పెద్దన తన రచనా చాతుర్యంతో కథా ప్రయోజనానికి అనుగుణంగా శృంగారానికి అధిక

ప్రాధాన్యతను ఇచ్చి, వరూధిని అనన్యకాంతగా చిత్రించాడు. పాఠకులకు ఆమె పాత్రమీద సానుభూతి కలిగేటట్లు చేసి, తృతీయశ్వాసంలో కరుణ, విప్రలంభ, సంభోగ, శృంగార మొదలైన రసాలను ఆస్వాదనయోగ్యం అయ్యేలా చేశాడని రెడ్డిగారి వాదన. మనుచరిత్ర రస సమంచిత కథలతో కూడి, శృంగార వీర, కరుణ రసాలతో బహునాయక వృత్తాంతంతో ఉంది. కానీ, మనుచరిత్రలో అంగిరసమేది అనడంలో భిన్నాభిప్రాయాలున్నగాని, వసుచరిత్రలో మాత్రం ప్రధానరసం శృంగారరసమేనని సుజాతారెడ్డి స్పష్టం చేశారు. రస విశ్లేషణలో భాగంగా రసాలకే గని వంటి మను వసుచరిత్రల ప్రబంధాల్లో కూడా, వరూథిని-ప్రవరుల విషయంలో, శుక్తిమతి–కోలహలుల విషయంలో కొంత శృంగార రసాబాస జరిగినట్లు ముదిగంటివారు విమర్శ ద్వారా అర్థమవుతుంది. దీనిలో రసపోషణ గూర్చి చర్చిస్తూ, ఆయా రసాలను నిర్వహించిన ఘట్టాలను రసాలను కూడా సమన్వయించి విశ్లేషించారు. వసుచరిత్ర ప్రధానంగా శృంగార కావ్యమే అయినా, మనుచరిత్రలో మాత్రం శృంగారం అంగిరసమై, మిగతాచోట్ల అవకాశాన్ని బట్టి అంగరసాలుగా పెద్దన రసపోషణ చేసినట్లు తెలుస్తుంది.

## 3.1.6.2 భక్తి–శృంగార రససమ్మిళితం

రసం ఒక భావోద్వేగ స్థాయి (Emotional State). ప్రాచీన అలంకారికుడు భరతుడు తన నాట్యశాస్త్రంలో ఎనిమిది రసాలను నిర్వచించారు. తరువాత అవసరాన్ని బట్టి వాడుకోటానికి అనుగుణంగా ఈ ఎనిమిదింటికి శాంత రసాన్ని ఉపగుప్తుడు జోడించాడు. రూపగోస్వామి తర్వాత భక్తిని కూడా ఒక రసంగా (తెలుగు సాహిత్య విమర్శ దర్శనం,2016:652) ప్రతిపాదించిన చాలా మంది దీనిని ఒక రసంగా అంగీకరించడానికి నిరాకరించారు. మరికొందరు భక్తి రసం కాదు ఒక శృంగారభేదమని చెప్పారు.(బాణుని కాదంబరి దాని వైశిష్ట్యం:201) ఇది శాంతరసంలో ఒక అంతర్భాగం అన్నారు. ఇలాంటి భక్తి రసాన్ని ఒక విరుద్ధమైన స్వభావం కలిగిన శృంగార రసంతో పరస్పర భావమిశ్రణం చేసే ఒక విచిత్రమైన కూర్పు శ్రీనాథుని రచనల్లో ఉందని ముదిగంటి సుజాతారెడ్డి 'శ్రీనాథుని కవితా సౌందర్యం' గ్రంథంలో వెల్లడించారు. భక్తి శృంగార రసాలు రెండు విరుద్ధమైన రసాలుగా

అనిపించవచ్చు. కానీ, శృంగారం దైవ సంబంధమైనప్పుడు అది భక్తికి అంగ రసంగా మారుతుంది. శ్రీనాథుడు భక్తి భావాలను చెబుతూ, శృంగార భావంలోకి జారుకుంటాడని అగస్త్యుని "పంచాక్షరీమంత్ర పారాయణమునకు, నెవ్వాని మానసంబేడుడ...." అని భావ్యంగా దివ్యంగా వర్ణిస్తూ శ్రీనాథుడు "మెరసి లోపముద్ర మెరుగు బాలిండ్లపై బవళించు నెర్వాని భవ్యమూర్తి"(కా.ఖం 2-40) అని అదే పద్యంలో శృంగార భావాన్ని చొప్పించగలడని చెబుతూ కాశీఖండంలోని చంద్రలోక వృత్తాంతాన్ని

**ఏటికి దానకంబయిన యిక్షుషరాసనవైరి జూటికా**
**కోటికి మల్లికా కుసుమ గుచ్ఛము దేవ వహించి కైకొనున్**
**బాటలిమంబు మానపరిపాక వినోదనవేళ బార్వతీ**
**పాటలగంధి చారుపదపద్మనఖంబుల క్రొత్తలత్తుకన్** (కా. ఖం.4-176)

చంద్రుడు గంగా సాహచర్యం వల్ల పవిత్రుడైనాడని చెబుతూ, పార్వతిదేవి ప్రణయ కోపంలో ఉండగా శివుడు ఆమె కోపాన్ని పోగొట్టడానికి "మానపరిపాక వినోద వేళలో ఆమె కాళ్ళకు నమస్కరించినప్పుడు పార్వతీదేవి పదపద్మనఖాలకు కొత్తలత్తుకరంగు తగిలి చంద్రుడు ఎర్రబడ్డాడని" పై పద్యం మొదటి రెండు పాదాల్లో శ్రీనాథుడు ఒకవైపు చంద్రుని గొప్పతనాన్ని, పవిత్రతను చెప్పి మరోరెండు పాదాల్లో అతని పాటలత్వానికి గల కారణాన్ని శృంగారరసంతో కలిపి చెప్పాడని, ఇలా ఒకే పద్యంలో అటు భక్తి రసాన్ని, ఇటూ శృంగారరసంతో సమ్మేళనం చేయగల గొప్ప నేర్పరి శ్రీనాథుడని అభివర్ణించారు.

**"సహి రాసాద్రుతే కశ్చిదర్థః ప్రవర్తతే"**(నా.6:3-32) అని రస ప్రాధాన్యతను భరతుని నుండి ఎంతో మంది లాక్షణికులు అంగీకరించారు. కానీ, కావ్యానికి సరైన వ్యంజకములు ఏవి? అనే విషయంలో కొందరు వ్యంగ్యమని, ధ్వని, మరికొందరు అలంకారాలనీ, రీతియని అనేక అభిప్రాయాలు వెల్లడించారు. కానీ, కాదంబరిలో అంగిరసం శృంగారం, ముఖ్యంగా ఇది విప్రలంబ శృంగారం. వీర, అద్భుత, కరుణ, వాత్సల్య, శాంత మొదలైన రసాలు అంగ

రసాలుగా చేర్చబడ్డాయని కాదంబరిలో విప్రలంబ శృంగారమే ప్రధాన పాత్ర పోషించినదని సాహిత్య దర్పణంలోని

**"యూనోరేక తరస్మిన్ గతపతి లోకాంతరం పునర్లభ్యే**

**విమనాయతే యదైకస్తదా భవేత్కరణ విప్రలంభాఖ్యః" (సా.ద.3-209)**

మహాశ్వేత పుండరీకుల రెండవ ఘట్టంలో వైశంపాయనునిగా జన్మించి మహాశ్వేతను చూసి, ఆమె కోపానికిగురై శాపాన్ని పొంది చిలుకరూపంలో జన్మించడం. వైశంపాయనుడు పూర్వజన్మలో పుండరీకుడే అని మహాశ్వేత తెలుసుకోవడం. కానీ, అప్పుడామె దుఃఖంతో వైశంపాయనుడు బతికే ఉన్న దేశాంతరంలో ఉండటం వల్ల ఇక్కడ విప్రలంభం ప్రవాసారూపాన్ని పొందిందనే విశ్వనాథుని మాటలతో సుజాతారెడ్డి పై విషయాన్ని బలపరిచారు.

కాదంబరిలో విప్రలంభ శృంగారం ప్రధానంగ ఉన్నా, చంద్రాపీడుడు విజయయాత్ర, సేనా వర్ణనలో వీరరసం మరియు చిలుక రూపంలో ఉన్న వైశంపాయనుడు మాట్లాడం, ఆకాశవాణి మాటలు, కొన్ని పునర్జన్మల ఘట్టాలలో అద్భుతరసం, మహాశ్వేత పుండరీకుని కొరకు దు:ఖించడంలో కరుణరసం, తరాపీడునిలో పుత్రజననానికి కలిగిన వాత్సల్యరసం. మహాశ్వేత చంద్రాపీడున్ని మొదటిసారి చూసిన సందర్భంలో శాంతరసం ఇలా బాణుడు కాదంబరిలో తన రసపోషణ ప్రతిభను నిరూపించుకున్నట్లు రచయిత్రి ఉద్ఘాటించారు.

మిగతా సంస్కృత కవులకు భిన్నంగా బాణుడు కాదంబరి రచనలో ఎక్కువగా మానసిక ప్రేమ భావం మీదనే దృష్టిపెట్టినట్లు అనిపిస్తుంది. ఇటువంటి పద్ధతి 'మానసికప్రేమ' (Romantic love) అనే పేరుతో పాశ్చాత్య సాహిత్యంలో కనిపిస్తుంది. అందుకే బాణుని శృంగార రసపోషణ పాశ్చాత్య కవులకు ఏ మాత్రం తీసిపోనిదిగా ఉంటుంది. ప్రాచీన కావ్యాలలో రసపోషణలో రసాభాసం అయ్యే ఘట్టాలను ముఖ్యంగా మనుచరిత్రలోని మాయ ప్రవరుని వరూధిని, వసుచరిత్రలో శుక్తిమతి–కోలాహలుల మధ్య జరిగిన సంఘటనలు గాని, బాణుడి కాదంబరిలోని విప్రలంభ శృంగారం వంటి వాటి రసపోషణలో కవులు రసాబాసం

జరిగే ఘట్టాలను తమ రచన నైపుణ్యంతో తిరిగి రసాబాసను నివారించి అంగిరసాన్ని పొందేలా చేయగల నిపుణులు మన పూర్వ కవులు.

## 3.1.7 కవి జీవిత కావ్య సమన్వయ విమర్శ

ప్రతి కవి లేదా రచయిత తనకంటూ ఒక ఆలోచన విధానాన్ని కలిగి ఉంటాడు. తన వ్యక్తిత్వంలో భాగంగా ఏర్పడిన ఈ ఆలోచన విధానం వారు చేసే రచనల్లో ప్రతిఫలిస్తూ ఉంటుంది. కాబట్టి కవికి సంబంధించిన వ్యక్తిగత జీవితాన్ని పరిశీలించినట్లయితే అతని రచనల్లోని కావ్యతత్త్వం మనకు బోధపడుతుంది. *"కవి వ్యక్తిత్వం, అతని జీవితములోని భౌతిక, మానసిక, తాత్త్విక విశేషములు అతని కావ్యములో ఎట్లు ప్రతిఫలించుచున్ననో"* కవిజీవిత విమర్శనందు విశదీకరింపబడునని ఎస్వీ రామారావుగారంటారు.(తెలుగులో సాహిత్య విమర్శ, 2017:9) అటువంటి కవుల వ్యక్తిగత విషయాల గురించి సాహిత్యలోకంలో ఇదివరకే కొన్ని చర్చలు ఉన్నాయి. కొన్నిసార్లు ప్రత్యేకంగా ఒక కవినో, ఒక పద్యాన్నో తీసుకుని చర్చించడంలో భాగంగా ఉండే ఈ రకమైన విమర్శనా పద్ధతిలో భిన్నాభిప్రాయాలు ఉన్న వాటిమీద ముదిగంటి సుజాతారెడ్డి వారి రచనల్లో కొంత పరిశీలన చేసి తమదైన ఒక దృష్టికోణంతో వాటిని స్పష్టపరిచారు.

ఒక కవి–అతని రచనలు ఒకదానిలో మరొకదాని ప్రభావం ప్రతిబింబిస్తూనే ఉంటుంది. అందుకే ముదిగంటి  సుజాతారెడ్డి శ్రీనాథుడు, అల్లసాని పెద్దన, రామరాజభూషణుడు, వేమన, బాణుడు మొదలైన కవుల రచనలను పరిశీలిస్తున్నప్పుడు వారి వ్యక్తిగత జీవితాన్ని, ప్రత్యేకంగా విశ్లేషిస్తూ ఉంటారు. శ్రీనాథుని వంటి కవుల గురించి తెలియజేయడానికి రచయిత్రి చరిత్రపై తనకున్న సాధికారతను చాటుకున్నారు. చారిత్రక అంశాలలోని రాజకీయ, ఆర్థిక అంశాలను దృష్టిలో పెట్టుకొని ఆ కవుల రచనలు వెలువడటానికి గల నేపథ్యాన్ని ఊహించే ప్రయత్నం మనకు 'శ్రీనాథుని కవితా సౌందర్యం' గ్రంథంలో కనిపిస్తుంది. శ్రీనాథుడు రెడ్డిరాజుల ఆశ్రయంలో ఉండి తన ఇష్టదైవం శివుడైన అద్వైతిగానే శృంగార నైషధం, హరవిలాసం వంటి కావ్యాలను రాసాడన్నారు. శ్రీనాథుని పుట్టినకాలం విషయంలో ఇప్పటివరకే చర్చలో ఉన్న

వివిధ విమర్శకుల అభిప్రాయాలన్నింటిని తెలియజేసి, శ్రీనాథుడు క్రీ.శ 1404 నాటికే విధ్యాధికారి అయినట్లు శాసనపరమైన ఆధారాలను బట్టి శ్రీనాథుని జనన కాలాన్ని క్రీ. శ1360-65 మధ్య ఉండవచ్చుననే భావించారు. శ్రీనాథుడు తన కావ్యాలను వివిధ రాజులకు అంకితమివ్వడం, అందులో వారి గురించి కీర్తించిన పద్యాలను ఆధారంగా చేసుకొని అతని స్థల నిర్ణయం చేయడానికి ప్రయత్నించారు. శ్రీనాథుని ప్రఖ్యాత పద్యం ***"ప్రౌఢి బరికింప సంస్కృత భాషయందు....నా కవిత్వంబు నిజము కర్ణాట భాష"*** (భీ.ఖం1-15) లోని 'కర్ణాట' అనే శబ్దం ఉపయోగించడంలోని ఉద్దేశ్యంపై ప్రత్యేక చర్చ చేసి, కర్ణాట దేశమంటే, ఆంధ్రదేశంలో ఒక భాగమేనని కన్నడ ప్రాంతం కాదని విమర్శించారు. (శ్రీనాథుని కవితా సౌందర్యం,1980:10) .శ్రీనాథుని వ్యక్తిత్వాన్ని ఆయన పద్యాల ద్వారా అంచనా వేస్తూ ఆయనలోని శివభక్తి గురించి

**శ్రీకంధరుని బ్రతిష్టించు నెవ్వడు వాడు**
**పాపియైనను శంభుపధము గాంచు**
**శివలింగ పదయాత్ర శివలింగ సంవీక్ష**
**శివలింగ సంస్పృష్టి శివసమర్చ**
**నాక లోకాధి రాజ్యైక కారణములౌ....**( భీ.ఖం 3-99)

వంటి శ్రీనాథుని మాటల ద్వారా శ్రీనాథుని భక్తి ఏ విధంగా ఉండేదో తెలియజేశారు. అలాగే శ్రీనాథుని కాలం నాటికి శైవం–హైందవం మధ్య జరుగుతున్న మతపరమైన ఘర్షణలు కూడా రచయిత్రి ఈ సందర్భంగా ప్రస్తావించారు. సాధారణంగా కవుల రచనలకే ప్రాధాన్యతనిచ్చే విమర్శకులల కాకుండా వారి రచనల్లోని సామాజిక, రాజకీయ, ఆర్థిక విషయాల ఆధారంగా అప్పటి పరిస్థితులను అర్థం చేసుకొని తద్వారా కవి మనస్తత్వాన్ని తెలుసుకునే ప్రయత్నం మనకు సుజాతారెడ్డిగారి విమర్శలో కనిపిస్తుంది. శ్రీనాథుడు తన కావ్యాలలో కొన్నిచోట్ల తన పూర్వకవులను స్మరిస్తూ, *"వచియింతు వేములవాడ భీమన భంగినుద్దండ లీల నొక్కొక్క మాటు/భాసింతు నన్నయ భట్టు మార్గంబున నుభయ వాక్ ప్రౌఢి నొక్క మాటు"*(కా.ఖం–1)

అంటూ వారి రీతిని అందుకుంటూ తన కవిత ప్రతిభను, వైవిధ్యాన్ని ఆకాంక్షించి రచనలు చేసినట్లు శ్రీనాథుని మాటల ద్వారా స్పష్టమవుతుంది.

తెలుగు పంచ మహాకావ్యాలలోని కవుల్లో ఒకరైన అల్లసాని పెద్దన గొప్పతనం గురించి తెలుసుకోవాలంటే మనుచరిత్ర ఒక నిదర్శనం. అల్లసాని పెద్దనను అనుశీలన చేస్తే అంతవరకు ఉన్న తెలుగు కవులందరి కావ్యరీతులు అవగతమవక మానవు. అందుకే *"నన్నయలోని ప్రసన్న కథాకలితార్థయుక్తి, తిక్కన పాత్రచిత్రణలోని సంభాషణశైలి, ఎఱ్ఱనలోని ఔచిత్యవంతమైన తెలుగు వాతావరణం, నాచన సోమనలోని చమత్కారాలు, శ్రీనాథునిలోని శయ్యా సౌభాగ్య ప్రీతి అల్లసాని పెద్దనలో ఏకారుపంగా సాక్షత్కరిస్తాయని"*(సమగ్ర ఆంధ్ర సాహిత్యం, 2002:91) అరుద్రగారంటారు. అటువంటి పెద్దన జననం గురించి విమర్శకులు ఇప్పటికే వివిధ రకాల అభిప్రాయాలను తెలియజేశారు. అదే పరంపరలో పెద్దన "చిగురు కొమ్మైన చేవ" అని ఒకచోట ప్రస్తావించగా, అది రాయలసీమలోని కడప మండలంలో చిగురుచెట్టు కనిపిస్తుందని చెప్పారు. అందుకే పెద్దన చంద్రగిరి సమీపంలోని కడప మండలానికి చెందినవాడుగా సుజాతారెడ్డి భావించవచ్చంటారు.

పెద్దన గ్రంథావతారికల్లో తన తల్లిదండ్రుల గురించిగాని, వంశ పుట్టు పూర్వోత్తరాల గురించి గాని ఎలాంటి విషయాలు తెలియజేయలేదు. కానీ, ఆశ్వాసాంత గద్యంలో తండ్రిపేరు చొక్కయామాత్యుడని మాత్రం చెప్పుకున్నాడన్నారు. మనుచరిత్రలోని స్వరోచి వేట వర్ణనను బట్టి పెద్దనకు రాయల వేటలో ప్రత్యక్షానుభవం ఉండి ఉంటుందని ఒక అంచనా వేశారు. విజయనగర సామ్రాజ్యం అంటేనే సాహిత్యంలో సుసంపన్నమైన భోగభాగ్యాలకు నిలయంగా చిత్రించారు. ఆనాటి సామాజిక సమస్యల ప్రస్తావన ఎక్కువగా లేదు. కానీ, పెద్దన సమకాలీన సమస్యలకు భోగ వైరాగ్యములకు మధ్య జరిగిన సంఘర్షణనే మనుచరిత్ర కావ్యానికి ప్రేరణయై ఉంటుందని ముదిగంటి సుజాతారెడ్డి అభివర్ణించారు. పెద్దన రాయల సాహచర్యం వల్ల వేట, మృగ వర్ణన, మల్ల యుద్ధం మొదలైన వాటిలో ఏర్పడిన అభిరుచి అవి తర్వాత మనుచరిత్రలోని స్వరోచి రాక్షసుల యుద్ధవర్ణనలో కనిపిస్తుంది. అలాగే అల్లసాని వారికి గజ, ఆశ్వశాస్త్రాలు, ఆయుర్వేదం, సంగీతశాస్త్ర పరిచయం, ప్రకృతిపై గల సునిశిత పరిశీలన మనకు మనుచరిత్ర కావ్యంలో ప్రతిఫలిస్తుందని మనుచరిత్ర కావ్య నేపథ్యాన్ని ముదిగంటివారు అందించారు.

వీటితోపాటు అల్లసాని పెద్దన వేయించిన కొన్ని శాసనాల ద్వారా రాయల అగ్రహారంలోని కొకటగ్రామాన్ని సకలేశ్వర దేవునికి, చెన్నకేశవస్వామి దేవాలయానికి దానమిచ్చినట్లు తెలుస్తుంది. ఇలా శివ-వైష్ణవుల మీద సమాన దృక్పథంతో మత సహనం కలిగిన వ్యక్తిగా కూడా పెద్దనను అర్థం చేసుకోవచ్చు. రామరాజభూషణుని విషయంలో అతని పేరు భట్టుమూర్తి అవునా? కదా? అనే విషయంతో చర్చ మొదలవుతుంది. కానీ, భట్టుమూర్తియే భూషణుడు. అతని కావ్యాలంకార సంగ్రహంలో తన పేరు భట్టుమూర్తి తండ్రి పేరు వెంకటభూషణునిగా చెప్పుకున్నాడని వసుచరిత్ర, హరిశ్చంద్రనలోపాఖ్యానంలో మాత్రం రామరాజభూషణుడిగా చెప్పుకునట్లు అందుకే రామరాజభూషణుడు, భట్టుమూర్తి ఒక్కరరేనని చెప్పే వజ్ఝలవారి అభిప్రాయాన్ని ఆధారంగా చేసుకుని ముదిగంటి  సుజాతారెడ్డి నిర్ధారించారు.(వసుచరిత్ర విమర్శనము:75) రామరాజభూషణుని గురించి వసు చరిత్రలో కన్నా, అతని కావ్యాలంకార సంగ్రహంలో ఎక్కువగా చెప్పుకున్నాడు. "శతలేఖిని పద్యసంధాన ధౌరేయుడు, ఘటికాశత గ్రంథకరణధుర్యుడు, ఆశుప్రబంధ బంధాభిజ్ఞుడు, ఓష్ఠ్య నిరోష్ఠ్యజ్ఞుడు, అచలజిహ్వోక్తినిపుణుడు, తత్సమభాషా వితానజ్ఞుడు, బహుపద్యసాధిత వ్యస్తాక్షరీ ధురీణుడు, ఏకసంథదితశోకభాషాకృత్య చతురుడు, ఓష్ఠ్య నిరోష్ఠ్య సంకరజ్ఞుడు, అమిత యమకాశునిధి" (కావ్యాలంకార సంగ్రహం.1-13) ఇటువంటి చిత్ర కవిత్వంలోని తన ప్రజ్ఞాపాటవాల గురించి తన కావ్యాలంకార సంగ్రహంలో పేర్కొన్నాడు.

ఇన్ని నైపుణ్యాలున్న రామరాజభూషణుడు తాను బహుమానం పొందిన అగ్రహారాలను ఇతరులకు దానం చేసిన నిరాడంబరత భట్టుమూర్తి కవితల్లో ప్రతిఫలిస్తుందన్నారు రచయిత్రి. ఇలా ఉభయకవుల ఆత్మీయ విషయాలను గ్రంథాలు, చాటువులు, శాసనాలు ద్వారా పరిశీలన చేసినప్పుడు అల్లసాని పెద్దనకు రాయల వారితో ఉన్నంత సాన్నిహిత్యం, పొందిన గౌరవం రామరాజభూషణుడు పొందలేదనే అభిప్రాయం కలగకమానదు.

ఒక వ్యక్తిని సమాజంలో ఉండే భిన్నమైన మనస్తత్వాలు గల వ్యక్తులు భిన్న రకాలుగానే అర్థం చేసుకుంటారు. అలా వేమనను ఒక భిన్న దృక్కోణం నుండి అర్థం చేసుకున్నవారు ముదిగంటివారు  సుజాతారెడ్డి. వేమన గురించి రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ, ఆరుద్ర, ఎన్. గోపి, రాచపాలెం చంద్రశేఖరరెడ్డి, మరుపూరి కోదండరామిరెడ్డి మొదలైన వారెందరో

పరిశోధనలు చేశారు. ఒక కొత్త విశ్లేషణతో వేమన 'నాథ' సంప్రదాయానికి చెందినవాడిగా చెబుతూ, వేమన పేరుకు  సంబంధించి 'వేమ' శబ్దానికి మూలం 'భీమ' అని ఒక సిద్ధాంతం చేస్తూ 'భీమ-వీమ-వేమ' వచ్చిందని సుజాతారెడ్డి విమర్శించారు. ఉత్తర భారతదేశంలో మాత్రమే కాకుండా ఆంధ్ర, కర్ణాటక ప్రాంతాలలో 'నాథ' సంప్రదాయం వెలసిల్లిన 15వ  శాతబ్ధ కాలంలోనే వేమన జీవించి ఉండవచ్చుననే మరో ఆలోచన కూడా చేశారు.

ముదిగంటివారు  సుజాతారెడ్డిలో  తెలుగు కవులతోపాటు అటు సంస్కృత  సాహిత్య చరిత్ర రాసిన అనుభవం బాణుని జీవితాన్ని పరిశీలించిన తీరులో కనిపిస్తుంది. చైనా దేశపు బౌద్ధ యాత్రికుడైన హ్యాయన్ త్సాంగ్, హర్షవర్ధన శీలాదిత్యుని గురించి చెప్పిన విషయాలతో బాణుని హర్షచరిత్రలోని అంశాలు సరిపోలుతూ ఉండటం వల్ల హర్షచరిత్రకు ఒక ప్రామాణికత ఏర్పడింది.

హర్షవర్ధనుడు కనోజ్ రాజధానిగా క్రీ.శ.610-650 మధ్యకాలంలో పరిపాలించాడు.*"బాణుని పూర్వ కవిస్తుతి హర్షచరిత ప్రారంభంలో కలదు. కాదంబరి ప్రారంభంలో లేదు. కాదంబరి హర్షచరిత తర్వాత రాసింది అవడం వల్ల చర్వితచర్వణమై ఉండవచ్చు"*(బాణుని కాదంబరి దాని వైశిష్ట్యం,1980:28) అందువల్ల హర్షచరిత్ర చారిత్రక గద్యకావ్యంగా పరిగణించబడింది. సాహిత్యచరిత్ర దృష్టితో పరిశీలిస్తే బాణుడు తన కావ్యాల్లోని పూర్వ కవిస్తుతిలో వ్యాసుడు, కాళిదాసు, గుణాద్యుడు, సుబంధుడు, దండి మొదలైన వారిని ప్రశంసించినట్లు రచయిత్రి వాఖ్యానించారు. అందుకే సుబంధుడు, దండి, బాణుని కన్నా ముందుకాలం వారేనని నిర్ధారించారు. హర్షవర్ధనుని పాలన కాలాన్ని బట్టి అతని ఆస్థాన కవియైన బాణుని సాహిత్య జీవితం క్రీ.శ 640-700 మధ్య అయి ఉండవచ్చునంటారు సుజాతారెడ్డి. ప్రాచీన కావ్యాలు చాలా వరకు అలభ్యాలు. లభ్యమైన వాటిమీద కూడా భిన్నమైన వాదనలున్నాయి. ఇదే ప్రభావం బాణుని రచనలపై కూడా కొంత ఉంది. బాణుడు పేర్కొన్న రచనలు హర్షచరిత్ర, చండీశతకం, కాదంబరి మాత్రమేనని ఇతర రచనలు బాణతనయుడు గాని, ఎవరు తెలియజేయలేదని ముసురే చెప్పారు. యాత్రలు చేయడం వల్ల వచ్చే విభిన్న అనుభవాల ద్వారా  భిన్న మనస్తత్వాలను అర్థం చేసుకునే తత్త్వం, సూక్ష్మపరిశీలన నైపుణ్యం బాణుని రచనల్లో ప్రతిఫలించినట్లు గమనించవచ్చు.

## 3.1.8 మనుచరిత్ర Vs వసుచరిత్ర

ఒక రచనలో గాని, ఒక వ్యక్తిలో గాని విశేషమైన అంశాలను చెప్పాలంటే అప్పటికే నిర్మితమైన కొన్ని పరికరాల ద్వారా కొలవడం సహజమైన పనే. ఇదే పని తులనాత్మక విమర్శలో జరుగుతుంది. తులనాత్మక విమర్శలో ఏదైనా రెండు రచనలను గాని, ఇద్దరు వ్యక్తులనుగాని ఒక చోట చేర్చి వారి పద్య నిర్మాణశిల్పం, రసం, అలంకారాలు, వర్ణనలు వంటి ఆలంకారిక కొలమానాల ద్వారా కొన్నిసార్లు పరిశీలించడం జరుగుతుంది. ఇలాగే పంచమహాకావ్యాలుగా పేరుగాంచిన వసుచరిత్ర, మనుచరిత్రల గురించి, వీటిని రచించిన పెద్దన, రామరాజభుషణుల కవిత్వంలో ఎవరి కవిత్వం గొప్పది? వంటి వాటిపై సాహిత్యంలో ఇప్పటికే చాలా పెద్ద చర్చ జరిగింది.

తెలుగులో మొదటి తులనాత్మక విమర్శకునిగా చెప్పుకుంటున్న వెన్నేటి రామచంద్రరావు మను-వసుచరిత్రలను తీసుకునే **'మను వసుచరిత్ర రచనా విమర్శనము'** పేరుతో తెలుగులో మొదటి తులనాత్మక విమర్శ గ్రంథాన్ని 1899లో వెలువవరించారు. పాశ్చాత్య సాహిత్య విమర్శలో అనుభవం ఉన్న వెన్నేటి ఆయన గ్రంథంలో మను-వసు చరిత్రలలో మను చరిత్రనే గొప్ప కావ్యంగా చెప్పుకున్నారు. కానీ, వెన్నేటి రామచంద్రరావు పాశ్చాత్య సాహిత్య అభిమానం, అలంకారాలపై ఒక నిరాదరణతో, శబ్దాలంకారాల మీద ప్రేమతో భూషణుడు వ్యర్థ పదాలను ప్రయోగించాడని చెప్పడం సరికాదని దీనిని ఖండిస్తూ కాశీభట్ట బ్రహ్మయ్యశాస్త్రి **'మను-వసు ప్రకాశిక'** పేరుతో ప్రతివాద విమర్శను వెలువరించారు. ఇదే పరంపరలో బ్రహ్మయ్యశాస్త్రి రాసిన 'మను వసు ప్రకాశిక'ను ఆక్షేపిస్తూ **'మను వసు విమర్శనానుబంధము'**-1905 పేరుతో వెన్నేటి రామచంద్రరావు వెలువరించారు. దీనికి ప్రతివిమర్శగా కాశీభట్ట **'మను వసు ప్రకాశికానుబంధము'** రచించారు. ఇలా వీరు చెరో రెండు అనుబంధ గ్రంథాలను వెలువరించారు. కానీ, పై రెండు గ్రంథాలు ఒక కావ్యం కంటే మరో కావ్యం ఏ విధంగా గొప్పకావ్యమో చెప్పడానికి ప్రయత్నించినట్టు తెలుస్తున్న, రెండు కావ్యాల్లో ఉన్న సామ్యాలను మాత్రం పరిశీలనలో తీసుకున్నట్లు కనిపించడం లేదు.

*"వసుచరిత్ర కల్పనలన్నీ చమత్కారవంతాలుగా, రససాదృశ్యాలుగా, దోషరహితంగా ఉన్నా స్థూలంగా పరిశీలిస్తే వాటిలో చాలావరకు దోషాలు ఉన్నట్లు కనిపిస్తుందని"*(మను వసు చరిత్రల పర్యావలోకనం:355) తన వ్యాసంలో చెప్పినా కొడవంటి శంకరనరసింహ బ్రహ్మం మనుచరిత్రనే ఉత్తమ గ్రంథమన్నారు. వసుచరిత్ర ఆంధ్ర పంచమహాకావ్యాలలో అగ్రగణ్యమై, భాషాప్రౌఢిగల ప్రబంధంగా ప్రశస్తి గాంచిందని, రామరాజభూషణుడు శబ్దశ్లేషయందు బహువిధాలుగా చమత్కారాలను ప్రదర్శించాడని, కథా సంవిధానం వైచిత్రితో తన ప్రబంధానికి కొత్తరకమైన దీప్తి అపాదించాడని, రామరాజు శ్లేష నైపుణ్యవంతుడని, ధ్వని ఈ కావ్యానికి ఆత్మ అని, కాబట్టి తెలుగు సాహిత్యలోకంలో వసుచరిత్ర సర్వగుణాలంకార సంపూర్ణమైన ప్రబంధంగా పరిగణించవచ్చని జ్యోతిర్మయి ఆమె సిద్ధాంత గ్రంథంలో పేర్కొన్నారు.(వసు రంజని(వసు చరిత్రల–ధ్వని శ్లేషల పరిశీలనము:1980)

కావ్యంలోని రచననే కాకుండా దానికి ఆధారమైన అప్పటి సామాజిక, రాజకీయ, ఆర్థిక పరిస్థితులతో పోలుస్తూ చెప్పడం కొన్ని రకాల భిన్నమైన అంశాలను మనముందు ఉంచుతుంది. ఇదే ధోరణిలో మను వసుచరిత్రలను విశ్లేషిస్తూ, అసలు పురాణ కవిత్వం నుండి ప్రబంధ కవిత్వానికి మార్పు, కథన మార్గం నుండి వర్ణన మార్గానికి మార్పు చెందిందని వెల్చేరు నారయణరావుగారన్నారు.(తెలుగులో కవితా విప్లవాల స్వరూపం,1979:51) పెద్దన మనుచరిత్ర కథన భిన్నమైన, వర్ణన ప్రధానమైన కావ్యం కావడంతో దాన్ని మించిన వర్ణనలతో భూషణుడి వసుచరిత్ర వచ్చిందన్నారు. దీనిలో

I. ఆ కాలంలో పెద్దన తనకు మించినవాడు లేడనిపించుకున్న మహాకవి.
II. పెద్దనగారి మను చరిత్రలో మొదటి మూడాశ్వాసాలే మనుచరిత్రగా భావించబడ్డాయి.

అని పై రెండు అంశాలు వసుచరిత్రలో అనుకరణ వల్ల రుజువు అవుతున్న, రామరాజభూషణుని కాలంలో కథ పూర్తిగా ఒక రకమైన నిరాదరణకు గురవడం వల్లే భట్టుమూర్తి వర్ణనల మీద ఆధారపడాల్సి వచ్చిందని భావించారు. వసుచరిత్ర ప్రబంధ సాహిత్యంలో ఒక గొప్ప కావ్యమని అందుకే దీని ప్రభావం 20వ శతాబ్దం వరకు కొనసాగి అందుకే పిల్ల వసుచరిత్రలు వచ్చాయన్నారు.

మార్కండేయ పురాణం నుండి గ్రహించిన కావ్యంలో పెద్దన అంతగా మార్పులు చేయలేదని, చాలా తక్కువ మార్పులతో మను చరిత్ర ప్రబంధాన్ని రాసాడని సుజాతారెడ్డి విమర్శించారు. కానీ, వసు చరిత్రలో మాత్రం కథనంతటిని రామరాజభూషణుడే స్వంతంగా నిర్మించాడన్నారు. మహాభారతంలో పోలిస్తే తీసుకున్న కథ చాలా చిన్నదని మిగిలిన కథంతా భుషణుడి నైపుణ్యం మీదనే నడిచిదంటారు. *"కథలోని ప్రతి సంఘటనయు నాటకంలోని సంఘటన వలె నొప్పుచున్నది. సంధిసంధ్యంగములతో కూడినదై కథ నాయకుని ఫలప్రాప్త్యున్ముఖియై శృంగారరసపోషకమై సాగినది. అందుకే రామరాజభూషణుడు కథాకల్పనా ప్రతిభను విశేషముగా ప్రదర్శించి, మూలకథను విశేషముగా అనుసరించించుచు మనుచరిత్రను మించిన కావ్యమును రచించినాడని చెప్పవలయునని"*(మను వసు చరిత్రల తులనాత్మక పరిశీలనము,1980:25) తన సిద్ధాంత గ్రంథ పరిశీలనలో ముదిగంటి సుజాతారెడ్డి వెల్లడించారు. "రామరాజభూషణుడు పెక్కువిషయముల పెద్దన ననుకరించుచునే అతని మించుటకు యత్నించెను. కథాకల్పనలో, సన్నివేశ సంవిధానములో, వర్ణనలలో, రసపోషణలో భావములలో నాతడు కావించిన ఆ ప్రయత్నము పెక్కు సందర్భములందు కన్పించునని" గ్రంథ ముందుమాటలో దివాకర్ల వేంకటావధాని చెప్పిన మాటలు రచయిత్రి భావానికి బలం చేకుర్చేవిగా కనిపిస్తున్నాయి

అల్లసాని పెద్దన-రామరాజభూషణుల మధ్య రచన విధానంలో భిన్నమైన తేడాలు ఉన్నాయి. అవి వారి వారి సాహిత్య అభిరుచుల నేపథ్యం నుండి అలవడి ఉండవచ్చు. అలాగే రాయలతో పెద్దనకు దొరికిన సాన్నిహిత్యం రామరాజభూషణుడికి అంతగా లభించక పోవడం కూడా ఒక కారణమై తోస్తుంది. పెద్దన-భూషణుడు దాదాపు సమకాలీకులు అయినా వారి కాలంలో ప్రబంధ ప్రక్రియలో మార్పుల ప్రభావం కూడా వారి ఇరువురి రచనలో కొంత కనిపిస్తుంది. పెద్దన కవిత్వం కొంత మనోరంజకంగా ఉండగా, భట్టుమూర్తి శాస్త్ర పరమైన శ్లేష నైపుణ్యంతో తన వసుచరిత్రను రచించాడు.

### 3.1.9 వేమన–ఇతర పరిశోధనలు

**"కులము హెచ్చుతగ్గు గొడవలు పనిలేదు**
**సాను జాతమయ్యె సకల కులము**
**హెచ్చు తగ్గుమాట లెట్లేరుంగగనవచ్చు**
**విశ్వదాభిరామ వినురవేమ!"**

*"ఆదికాలంలో తిక్కన, మధ్యకాలంలో వేమన, ఆధునిక కాలంలో గురజాడ మన తెలుగు కవులలో మహానుభావులు, రచనా బాహుళ్యం వల్ల వీరిలో ఏ ఒక్కరికో మహాకవి స్థానం సిద్ధించలేదు. తెలుగుతనానికి ప్రాతినిధ్యం వహించి, తెలుగు భాషకు గల ప్రత్యేకతను ప్రదర్శించడం వల్లనే వీరు జగద్వంద్యులయ్యారు"* అని శ్రీశ్రీ, గురజాడ ముత్యాలసరాల పరిచయంలో చెప్పిన మాటలకున్న ఆంతర్యంలో తెలుగు సాహిత్యంలో వేమనకున్న గొప్పతనం అవగతమవుతుంది. తన చుట్టూ ఉన్న సమకాలీన సమాజాన్ని స్వప్రతిభతో పద్యాల రూపంలో చిత్రించిన గొప్పకవి వేమన. వేమన మన తెలుగు సారస్వతంలో మధ్యయుగాల నాటి కవి. క్రీ.శ 17వ శతాబ్దంలో జీవించి తెలుగు ప్రాంతంలోని ప్రజల జీవితాన్ని తన పద్యాల రూపంలో మూటగట్టిన ప్రజా రచయిత వేమన.

వేమన జీవిత విషయాలు అయన చెప్పిన తాత్వికత, భావజాలం మొదలైన విషయాలలో సాహిత్యలోకంలో భిన్నాభిప్రాయాలు గమనించవచ్చు. వేమన మీద అనేక భావజాలాలు కలిగిన అనేకమంది విమర్శకులు, పరిశోధకులు, రచయితలు వారి వారి దృక్పథాలననుసరించి వ్యాసాలు రాశారు. పరిశోధనలు చేశారు. ఈ పరంపరలో వేమన 'నాథ' సంప్రదాయానికి చెందినవాడిగా ముదిగంటి సుజాతారెడ్డి ఒక భిన్నమైన కోణంలో వేమనను పరిశీలించారు. తెలుగు సాహిత్యంలో ఒకే కవి మీద ఇన్ని భిన్న రకాల రచనలు రావడం అనే ఖ్యాతి ఒక్క వేమనకే చెందినట్లుంది.సంప్రదాయవాదులు, ఆధునికులు, పరిశోధకులు వేమనను విడిగాను, కొన్నిసార్లు ఇతర సాహిత్యాలలోని కవులతో పోలుస్తూ తులనాత్మకంగాను

అధ్యయనం చేశారు. వాటిలో కొన్నింటిని రేఖామాత్రంగా ఇక్కడ పరిచయం చేయాలనుకుంటున్నాను.

1. వేమన అనగానే మొదట అందరికి గుర్తుకు వచ్చేవారు సి. పి. బ్రౌన్. బ్రిటిష్ ఇండియా ఉద్యోగిగా పరిపాలనరీత్యా తెలుగు నేర్చుకున్నా, తెలుగులో సాహిత్యం మీద కలిగిన ఇష్టంతో తెలుగు సాహిత్యానికి మరిచిపోలేని సేవ చేసిన గొప్ప వ్యక్తి చార్లెస్. ఫిలిప్ బ్రౌన్. బ్రౌన్ కడప జిల్లాకు కలెక్టర్ గా నియమింపబడిన రోజుల్లో వేమన, అయన రాసిన పద్యాల గురించి తెలుసుకొని ఆకర్షితుడై వేమన తాళపత్ర గ్రంథాలను సేకరించాడు. వాటితో 1829లో **“The versus of vemana”** పేరుతో ఒక గ్రంథాన్ని అచ్చువేయించాడు. “Vemana, whose writings are peculiarly useful to those who study the language, the being simple, and the variety of topics very extensive. These adages exemplify thousands of words inadmissible into more dignified poetry. The thought and connection are often abstruse while the terms used are quite familiar” (Preface.The verses of Vemana: 1824) అని వేమన గురించి బ్రౌన్ చెప్పిన మాటలు వేమన సాహిత్యంలోని గొప్పతనాన్ని తెలియజేస్తున్నాయి. బ్రౌన్ ఈ గ్రంథంలో వేమన కాలం, స్థలం వంటి ఇతర విషయాలను కూడా చర్చించినట్లు తెలుస్తుంది.

2. 1792 నుండి 1823 వరకు భారతదేశంలోని మద్రాస్ ప్రాంతంలో క్రైస్తవ మిషనరీలో ఫ్రెంచ్ మతగురువుగా పనిచేసిన జె.అబేదుబాయ్ అనే వ్యక్తి “Hindu manners, customs and ceremonies” అనే గ్రంథంలో మొదటిసారిగా వేమన గురించి పేర్కొన్నట్లు ఆధారాలున్నాయి. “అబేదుబాయ్ తన గ్రంథ రచనా కాలానికే తెలుగు కవితారంగంలో వేమన విశిష్టమైన గొంతును విని ఉన్నాడు”(గోపి.ఎన్. ప్రజాకవి వేమన,1992:94) దుబాయ్ కాలానికే తెలుగు ప్రాంతంలో వేమన పలుకుబడి ఉన్నట్లు ఆయన తన గ్రంథంలో ఉదహరించిన పద్యాలను బట్టి తెలుస్తుంది. దుబాయ్ వేమన తన కాలానికి ఇంచుమించు 150 సంవత్సరాల పూర్వంవాడని అయన రచనలో పేర్కొన్నారు.

3. వేమన కవిత్వతత్వాన్ని అందులోని సామాజిక కోణాన్ని, అయన లోతైన విశ్లేషణ దృక్పథాన్ని అందించిన వారు రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ. అయన తన **'వేమన'**(1928) గ్రంథాన్ని ఒక హేతుబద్ధమైన వివేచనకు నిదర్శనంగా తీర్చిదిద్దాడు. రాళ్ళపల్లి వారు తన వేమన గ్రంథంలో వేమన వ్యక్తిత్వం, మత ప్రచారం, సమకాలీన సామాజిక స్థితిగతులు, దేశకాలాలు మొదలైన విషయాలను చర్చించారు. వేమన పద్యాల్లో ఉండే మౌలికత, సంగ్రహ శక్తి, సంఘ సంస్కరణ దృష్టి మిగతా తెలుగు సాహిత్యంలో కొంత తక్కువగానే ఉన్నట్లు అయన ఈ గ్రంథంలో పేర్కొన్నారు. *"వేమన కవిత్వము గాలి వంటిది. అది దూరని చోటు లేదు. దొరకని తావు లేదు"* (147) అని రాళ్ళపల్లి వేమన కవితా విశిష్టతను తెలియజేశారు.

4. **'నాథ యోగి మన వేమన'** (1987) అని వేమన నాథ సంప్రదాయానికి చెందిన వాడిగా చెబుతూ ఒక వేమనలోని మరో కోణానికి విశ్లేషిస్తూ ఒక పరిశోధన గ్రంథాన్ని కొర్లపాటి శ్రీరామమూర్తి రచించారు. తొమ్మిది అధ్యాయాలుగా ఉన్న ఈ గ్రంథంలో అరవ అధ్యాయంలో "వేమన నాథ సంప్రదాయం" నవనాథులు, నాథ సంప్రదాయం గురించి చర్చించారు. కానీ, వీరికన్నా ముందే 26-2-1984 ఆదివారం ఆంధ్రప్రభ అనుబంధ పత్రికలో 'సిద్ధనాథ సంప్రదాయాలకు నిలయాలు ఒకనాటి రాయలసీమ తెలంగాణాలు' అనే వ్యాసంలో మౌలికంగా మొదటిసారిగా వేమన నాథ సంప్రదాయానికి చెందినవాడిగా ముదిగంటి సుజాతారెడ్డి పేర్కొని తర్వాత అంటే 1993లో **'వేమన నాథ సంప్రదాయం'** పేరుతో ఆమె పూర్తి గ్రంథాన్ని వెలువరించారు.

5. ఒక సునిశిత వివేచన దృష్టికి, సహేతుకమైన విమర్శకు నిదర్శనంగా చెప్పదగిన వేమన గురించి చేసిన మరో రచన ఆరుద్రగారి **"మన వేమన"** గ్రంథం. దీనిని శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం వారు 1985లో ప్రచురించారు.

6. తన **'కవిత్వతత్త్వ విచారం'**(1914) తో తెలుగు విమర్శ ప్రక్రియను ఒక మలుపు తిప్పిన కట్టమంచి రామలింగారెడ్డి వేమన గురించి పరిచయం చేస్తూ ఆయన గ్రంథంలో *"వేమన యన్ననో కారణ విమర్శనాశక్తికి బట్టాభిషేకముజేసిన మహాత్ముడు. ఇతని పద్యములన్నియు లోకోక్తులు. అనగా బలికినవాడు అతడయ్యు బలుకబడిన మాటలు లోకమువారి హృదయములలో బూర్వమే యుండినట్టివిమో, లేక అతనిచే నచలముగ నాటబడినట్టివిమో యైనవనుట"* (వేమన (వేమనపై విమర్శ వ్యాసాలు)2013:7) అని వేమనలోని కవితా తత్త్వాన్ని అప్పటి సామాజిక పరిస్థితుల అనుగుణంగా వివేచించారు.

7. *"18వ శతాబ్దంలోని ఉత్తరార్ధంలోని ఎనిమిది మంది కవులపై వేమన ప్రభావం ఉంది కాబట్టి వేమన క్రీ.శ 1650  నుండి 1700 దాకా దేశంలో సంచరించారని"* (2003, సంపు–8:43) ఆరుద్ర తన సమగ్రాంధ్ర సాహిత్యంలో తేల్చారు. ఈయన **"వేమన వేదం"** అనే మరో గ్రంథం కూడా వెలువరించారు.

8. నెల్లూరుకి చెందిన మరుపూరి కోదండరామిరెడ్డి **"ప్రజాకవి వేమన యోగి"** అనే గ్రంథాన్ని రచించారు.ఈయన వేమనను లోకకవిగా గుర్తించారు. వేమనలో భిన్నపద సామ్యము ఏకమై ఒక కొత్త అనుభూతిని కలిగి ఉంటున్నట్లు మరుపూరి అభివర్ణించారు. వేమన పద్యాలు ల్యాటిన్ ఇంగ్లీష్, రష్యన్, భాషలోనికి చేరినవి. ఇక మన దేశంలో, సంస్కృతం లోనేగాక, అనేక ప్రాంతీయ భాషలలోనికి అనువదింపబడినవి. ఉర్దూ, అరబిక్ భాషలకెక్కి కొందరు ముస్లిం పండితులకు ప్రీతికర సూక్తులైనవని అన్నారు.

9. ఆధునిక కాలంలో వేమనపై పరిశోధన అనగానే గుర్తుకువచ్చే ఒక ప్రామాణిక పరిశోధన ఎన్. గోపిగారి **"ప్రజాకవి వేమన"** అనే  పిహెచ్.డి పరిశోధన గ్రంథం. దీన్ని 1979లో ఉస్మానియా విశ్వవిద్యాలయనికి సమర్పించారు. అనేక తాళపత్ర ప్రతులను

సేకరించి చేసిన ఈ పరిశోధనను ఆరు అధ్యాయాలుగా విభజించారు. దీనిలో వేమన పద్య నిర్ణయం, వేమన కాలం, ప్రాంతం, వేమన్న వేదాంతం, కవిత్వం, ఇతర కవులతో పోలుస్తూ గోపి దీన్ని ఒక సమగ్ర గ్రంథంగా రూపొందించారు.

10. మహాకవి శ్రీశ్రీ జన్మదినాన్ని పురస్కరించుకొని అనంతపురంలో 'వేమన సాహితీసమాలోచన' 2017 అనే సదస్సు సందర్భంగా, వేమన జీవిత విషయాలు, ఆయన తాత్త్వికత, భావజాలం వంటి విషయాలలో వచ్చిన వ్యాసాలను సేకరించి రాచపాళెం చంద్రశేఖరరెడ్డిగారి సంపాదకత్వంలో కొన్ని గ్రంథాలు ప్రచురించారు. వాటి వివరాలు:
    - వేమన కవిత్వం–ఇతర తత్త్వవేత్తలు
    - వేమన కవిత్వం–మానవత, విశ్వమానవత
    - వేమన కవిత్వం–సామాజికత
    - వేమన కవిత్వం– స్త్రీ
    - వేమన కవిత్వం–తాత్త్వికత
    - వేమన కవిత్వం–ఇతర భారతీయ కవులు
    - వేమన కవిత్వం–ప్రాదేశికత
    - వైతాళికుడు వేమన (వ్యాస సంకలనం)

బండారు తమ్మయ్య 1970లో **'వేమన చరిత్ర'** పేరుతో రాసిన గ్రంథంలో కొన్ని చారిత్రక అంశాలతో పాటు, వేమన కవితా విశిష్టతను, దాని ప్రయోజనాన్ని విశ్లేషించారు. దీనిలోని మొదటి ఏడు ప్రకరణాలు 'రెడ్డిరాణి'(1932-34) పత్రికలో ప్రకటించారు. త్రిపురనేని వెంకటేశ్వరరావు **"విశ్వదాభిరామ వినురవేమ"** పేరుతో 1981లో వేమన ప్రసంగ వ్యాసాల్ని ఒక సంకలనంగా తీసుకువచ్చారు. వేమన వికాస కేంద్రం విజయవాడవారు వేమన

సాంస్కృతిక ఉత్సవాల సందర్భంగా వచ్చిన 22 వ్యాసాలతో **"వేమన వివిధ దృక్కోణాలు'** పేరుతో 1982లో మరో గ్రంథాన్ని ప్రచురించారు. పోచన రామిరెడ్డి, గుర్రం వెంకటరెడ్డి కలిసి రచించిన **'విప్లవయోగి–విశ్వకవి వేమన వేదశాస్త్రం'**-1988 వేమనలోని సాహిత్య, సాంఘిక తాత్త్విక దృక్పథాన్ని తెలియజేసే గ్రంథం. **'వేమన జీవితం, సాహిత్యము: సమగ్ర పరిశీలనము'–** 1988 పేరుతో డా.ఎస్.ఎం సుబాని వేమన జీవిత విశేషాలు, పద్యాల నిర్ణయం, కవిత్వ అంశాలను తన రచనలో పరిశీలించారు. డా.గంధం అప్పారావు **'వేమన–సర్వజ్ఞులు'**(1979) పేరుతో అయన ఆంగ్లంలో రాసిన సిద్ధాంత వ్యాసాన్ని తెలుగులో అనువాదం చేశారు. **"వేమన—శంకర"**-1987 డి.కృష్ణారెడ్డిగారు వెంకటేశ్వర విశ్వవిద్యాలయం నుండి సిద్ధాంత గ్రంథం రాయగా, **వేమన–సర్వజ్ఞ తిరువళ్ళూరు**(1980) మధ్య ఎస్. రామారాణిగారు తులనాత్మక పరిశోధన చేశారు. **"వేమన—తత్త్వజ్ఞత"**(1976) అనే అంశంపై చెన్నస్వామిగారు ఒక ఎం.ఫిల్ వ్యాసాన్ని సమర్పించారు. సి.పి బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం అధ్వర్యంలో **"వేమన(వేమనపై విమర్శ వ్యాసాలు)"** పేరుతో ఒక ప్రత్యేక వ్యాస సంకలనాన్ని 2013లో యోగి వేమన విశ్వవిద్యాలయం వారు వెలువరించారు. ఇలా వేమన జీవితం గురించి, కాలం గురించి, స్థలం గురించి, వేమన పద్యాలలోని తాత్త్విక నేపథ్యం గురించి, వేమన కాలం నాటి సామాజిక స్థితిగతులను తెలుపుతూ అనేక ఆలోచనలతో అనేక రకాల పరిశోధనలు జరిగాయి. జరుగుతూనే ఉన్నాయి.

## 3.1.10 వేమన–'నాథ'తత్త్వం

కవిగా, తాత్త్వికుడిగా, యోగిగా, సంఘసంస్కర్తగా, మానవతవాదిగా, హేతువాదిగా బహుముఖ కోణాల్లో ఇప్పటివరకు వేమనను అర్థం చేసుకున్నారు. కాని 8 నుండి 14 శతాబ్దాల మధ్య తెలుగు ప్రాంతాలతోపాటు భారతదేశంలో వ్యాపించి మత సంప్రదాయాన్ని, మత ఉద్యమాలపై ప్రభావం చూపిన 'నాథ' సంప్రదాయాన్ని అనుసరించిన కవిగా వేమనను అభివర్ణిస్తూ వేమన నాథసంప్రదాయానికి చెందిన వ్యక్తిగా వేమనలో ఒక కొత్త కోణాన్ని ఆవిష్కరించినవారు ముదిగంటివారు  సుజాతారెడ్డి.

### 3.1.10.1 నాథ శబ్దం-ప్రయోగం

'నాథ' ధాతువు నుండి 'నాథ' శబ్ధం పుట్టింది. నాథ సంప్రదాయానికి ప్రథమాచార్యుడు మత్స్యేంద్రనాథుడు. దీనికి సంబంధించిన ఒక కథ కూడా ప్రచారంలో ఉంది. ఆది నాథుడైన శివుడు, పార్వతికి యోగ విద్యను ఉపదేశించే తరుణంలో ఒక చేప వినికిడి జ్ఞానాన్ని పొందడం వల్ల అదే మత్స్యేంద్రనాథుడిగా రూపుదిద్దుకొన్నాడని ఈ సంప్రదాయానికి చెందినవారి నమ్మకం. "The meaning of word Natha is 'protector' 'savior' or 'patron' as found in the ATHARVAVEDA and the Taittirreya Brahmana. In Mahabaratha the meaning of it is 'OWNER' or 'MASTER' in general usage and the word named 'NATHA' associated with yoga and yogic life of PASHUPATHA following the Shaiva doctrines was widely known and the accepted as 'NATHA TRADITION' over the centuries. The word "NATHA" was publicly stamped as Shaiva meaning Natha" (Natha Sampradaya a Cultural Study (Doctoral thesis); Nirmalanandanatha swamiji. Gulbarga University, 2019:68) అని నాథ అనే శబ్దం ఇప్పటివరకు ఎక్కువగా యోగ ప్రక్రియకు చెందినదిగా వాడినట్లు, అదే తర్వాత కాలంలో నాథ అనే ఒక ప్రత్యేకమైన సంప్రదాయంగా స్థిరపడినట్లు తెలుస్తుంది. కానీ, " 'నాథ' లోని 'నా' అంటే అనాది రూపం, 'థ' అంటే (భువనత్రయం) స్థాపింపబడడం. అప్పుడు నాథ అంటే' అనాది ధర్మమని అర్థం. 'నా' అంటే నాథ బ్రహ్మం, మోక్షప్రదానం చేయడంలో దక్షమైంది.'థ' అంటే అజ్ఞానాన్ని స్థగితం చేసేదనే మరో అర్థం నాథ మార్గాశ్రయం చేత నాథ బ్రహ్మ సాక్షాత్కారమౌతుంది. అజ్ఞానమాయ అవరుద్ధమౌతుందని సారాంశమని" (వేమన నాథసంప్రదాయం,1993:18) నాథశబ్ధాన్ని లౌకికార్థంలో కాకుండా యౌగికార్థంలో తీసుకుని సహజయానంలో లాగా స్వచ్ఛమైన యోగసాధన నాథ సంప్రదాయవాదులు చేశారని ముదిగంటి సుజాతారెడ్డి విశ్లేషించారు.

వీరు 'అతి వర్ణాశ్రమే ప్రోక్త స్సర్వాది కారణమ్'(సూత సంహిత.5-14) అనడంలో వైదిక ధర్మాచారలకు అతీతులై, ఆతి వర్ణాశ్రములమని పేర్కొనడం జరిగింది. నాథ సంప్రదాయమనేది స్త్రీ, పురుష వివక్షతలేని, జాతి మతాలకు అతీతమైనదిగా చెప్పబడింది. హఠ యోగ సంప్రదాయాన్ని ప్రచారంలోకి తెచ్చినవారు నాథ సంప్రదాయ అనుచరులేనంటారు.

భగవంతుని నాథ రూపంలో కొలిచేవారు నాథ సంప్రదాయలు. వీరిలో యోగ, హేతువాద దృక్పథం అంతర్భాగంగా ఉంటుంది.

### 3.1.10.2 వేమన; నాథ– సంప్రదాయం

ముఖ్యంగా నాథ సంప్రదాయాన్ని సామాన్య జనంలో వ్యాపించడానికి కృషి చేసినవారు తొమ్మిదిమంది యోగులు నవనాథులుగా ప్రసిద్ధి చెందారు. నాథ సంప్రదాయానికి మూల పురుషుడు మత్స్యేంద్రనాథుడు. దాన్ని వ్యాపింపజేసింది మాత్రం గోరఖనాథునిగా చెప్తారు. తెలుగు సాహిత్యంలో శ్రీనాథుని కాలం నుండే ఈ నాథ సంప్రదాయ ప్రభావం కనిపిస్తుంది. దాదాపు శ్రీనాథుని సమకాలికుడైన గౌరన తన 'నవనాథచరిత్ర' కావ్యాన్ని శ్రీశైల మల్లికార్జునునికి అంకితమిచ్చాడు. గోరఖనాథుని తర్వాత నాథ సంప్రదాయం ఎన్నో ఉపశాఖలుగా విడిపోయిన నాథ సంప్రదాయశాఖ ఒకటి శ్రీశైల, రాయలసీమ, తెలంగాణ ప్రాంతాల్లో 14వ శాతబ్ధంలో వ్యాపించి తన ప్రభావాన్ని చూపిందని చెప్పవచ్చు. ఈ ప్రభావం వేమన పద్యాల్లో కూడా కనిపిస్తుందని, అందుకే వేమనను శైవుడు, వీర శైవుడు, యోగి, జంగముడు, హఠయోగి, విరాగి, నాస్తికుడు అని ఎన్నో రకాలుగా చెప్పగా మన వేమన పద్యాలను పరిశీలిస్తే నాథ సంప్రదాయంలో ప్రముఖమైన నీతి, వైరాగ్య, యోగసాధన, హేతువాద విషయాలు గుర్తించవచ్చని అందుకే వేమన నాథ సంప్రదాయానికి చెందినవాడిగా వేమనలోని ఒక కొత్త కోణాన్ని ముదిగంటివారు ఆవిష్కరించారు.

వేమన కవితలు సరళ భాషలో ఉంటూ, ప్రజల గుండెల్లోకి నేరుగా చొచ్చుకుపోయే గుణాన్ని కలిగి ఉంటాయి. వేమన కవితలు ఇతర కవుల కవిత్వం కంటే భిన్నంగా ఉండి ఒక ప్రత్యేకమైన స్వరూపంతో ఉంటాయి. అలాగే అయన పద్యాల్లో వేమన హఠయోగాన్ని సాధన చేసినట్లుగా చెబుతూ,

*"బయులున సర్వముపుట్టును*
*బయలందే లీనమగును బ్రహ్మంబనగా*

*బయలని మదిలో తెలిసిన*

*బయలందే ముక్తి బట్టబయలగు వేమా!*

*బయలులోన పెనగి బయలులోన మునిగియు*

*బయలు తెలియలేదు బంధితుండు*

*బయలు బ్రహ్మమనుచు భావించి చూడరా...”*

అని వేమన ఇంద్రియాలను నిరోధించి మనస్సును శున్యానుసంధానం చేసే సిద్ధులలాగా ‘బయలు’ అంటే బ్రహ్మమని, బంధితుడు అంటే సంసార బంధాల చేత బంధింపబడినవాడు. సంసార బంధాల చేత చిక్కుబడినవాడు బ్రహ్మ గురించి ఎప్పుడు తెలుసుకోలేడని వేమన చెప్పారని సుజాతారెడ్డిగారన్నారు.

నాథ యోగసంప్రదాయంలోని విశ్వాసాలను, సిద్ధాంతాలను వేమన పాటించి వాటిని తన పద్యాల్లో ప్రతిఫలించేలా చేశారని ముదిగంటివారు అభిప్రాయపడ్డారు. అందుకే కర్మకాండలను, విగ్రహపూజను, తీర్ధ యాత్రలను, అంధ విశ్వాసాలను ఎదురిస్తూ,

*“వేద విద్యలెల్ల వేశ్యలవంటివి*

*భ్రమల పెట్టి తేట పడగనీవు...”*

అని సామాన్య జనులకు వేదాలు వాటిలోని సారం అర్థం కాకుండా ఉంటుందని భ్రమ మాత్రమే కలిగిస్తాయని వేమన విమర్శించినట్లు రచయిత్రి తెలియజేశారు. మన సమాజంలో ఒక పెళ్లి చేయాలంటే పెద్దలు జాతకాలు, ముహూర్తాలు వంటి అనేక పద్ధతులు పాటిస్తారు. ఎన్నో సంబంధాలు వెతుకుతారు. చివరికి అన్ని కలిసి వివాహం చేశాక కొన్నిసార్లు పెళ్లి కొడుకు చనిపోయి పెళ్లి కూతురు విధవగా మిగిలిపోవడంలో హేతువు ఎక్కడుందని,

*“విప్రులెల్ల జేరి వెర్రి కూతలు కూసి*

*సతివతులను గూర్చి సమ్మతమున*

*ముహూర్తముంచ ముండెట్లు మోసెరా...”*

అని వేమన ఎన్నో పద్యాల్లో హేతువు గురించి ప్రశ్నించడన్నారు ముదిగంటివారు సుజాతారెడ్డి. ఇలా నాథ సంప్రదాయంలోని విశ్వాసాలు సిద్ధాంతాలన్నీ మనకు వేమన పద్యాల్లో సాక్షాత్కరిస్తాయని, అందుకే వేమన నాథ యోగ సంప్రదాయానికి చెందినవాడని కేవలం అతని శూన్యవాదం, యోగసాధన వల్లనే చెప్పడం సాధ్యం కాదు. నాథ యోగుల విశ్వాసాలు, బోధనలన్నీ వేమన పద్యాల్లో మనకు కనిపిస్తున్నాయి. అందుకే వీటన్నింటిని బట్టి వేమన 'నాథ యోగ' సంప్రదాయానికి చెందిన వాడనడంలో ఏటువంటి సందేహం లేదని ముదిగంటి సుజాతారెడ్డి పేర్కొన్నారు.(వేమన నాథసంప్రదాయం,1993:39) కానీ, ఆధునికులు వేమనను అనేకరకాలుగా వారి వారి ఆలోచన దృక్పథాన్ని అనుసరించి మానవతావాది, భౌతికవాది, ప్రజాకవి, విప్లవకవి అని అనేక కోణాల్లో విశ్లేషించారు. దీనినే 'ప్రజాకవి వేమన' పేరుతో వేమన గురించి కూలంకషంగా పరిశోధన చేసిన ఎన్. గోపి *"లభిస్తున్న ఆకరాలను బట్టి వేమన్న భావాలను ఏ ఒక్క మతం గుంజకు కట్టివేయలేమని తెలుస్తున్నది. ఏదో ఒక మతం సులోచనలా గుండా కనిపించేది వేమన్న పాక్షిక రూపమే కానీ, సంపూర్ణమూర్తి కాదని"*(168) తెలియజేస్తూ వేమనను ఎవరు ఏ కోణం నుంచి చూసిన ఆయనలోని నిజాయితీ మాత్రం ఒక నిప్పురవ్వల వెదజల్లుతూనే ఉంటుందన్నది ఏ మాత్రం సత్యదూరం కాదు. కానీ, నాథ సంప్రదాయం వైదిక ధర్మచారాలకు అతీతమైనదిగా చెప్పిన నాథ సంప్రదాయ మూలాలు మాత్రం, శివుడ్నే నాథ యోగ సంప్రదాయనికి కేంద్రంగా చేసుకుని వచ్చినట్లు కనిపిస్తుంది. ఇది నాథ సంప్రదాయంలో ప్రధానంగా చెప్పదబడుతున్న హేతువాద ఆలోచనలతో కొంత ఘర్షణకు లోనయ్యే అవకాశం ఉంది.

### 3.1.11 విశ్వదాభిరామ వినుర–'వేమ'

*సతులు మాయ సంసారములు మాయ*

*ధనము ఘనము మాయ తనువు మాయ*

*మాయ గెల్చువాడు మర్మజ్ఞుడగు యోగి*

*"విశ్వదాభిరామ వినుర వేమ!"*

వేమన పద్యాలన్నింటిలో **"విశ్వదాభిరామ వినుర వేమ"** అనే మకుటం ఒక ప్రత్యేకరకమైన అందాన్ని తెచ్చిపెట్టింది. వేమన తను చెప్పదలచుకున్న భావాన్ని పై మూడు

పదాల్లో పూర్తి చేసి నాల్గవ పాదాన్ని ఒక సరళమైన, మధురమైన మకుటంతో పూర్తి చేస్తూ ఉండటం అయన పద్యాల్లో మనకు కనిపిస్తుంది.

ఇంతకముందు సాహిత్యంలో పూర్వకవులు వారి శతకాలకు వారికి దృక్పథాలను అనుసరించి భిన్నమైన వివిధ రకాల మకుటాలను రాసుకున్నారు. సుమతీ శతకంలో 'సుమతీ', అన్నమయ్య వేంకటేశ్వరా, గోపన్న దాశరథీ శతకాలు, ఆధునికులు అయిన విశ్వనాథ సత్యనారాయణ వంటి వారు శ్రీకాళహస్తీస్వర శతకంలో 'శ్రీ కాళహస్తీస్వరా! మహా దేవ!' అనే మకుటంతో వివిధ శతకాలు రాశారు. మకుటం అనేది శతకప్రక్రియలో ఒక సంప్రదాయంగా వస్తూ ఉంది. వేమన కూడా తన పద్యాల చివర్లో 1) వేమా 2) విశ్వదాభిరామ వినురవేమ 3) విమలగుణ రాజయోగీంద్రవేమనార్య 4) రాజయోగి వేమా 5) వివిధ విద్యాకళాత్రాణ వివరివేమ అనే వివిధ రకాల వేమన మకుటాలు లభిస్తున్నాయి. కానీ, వీటిలో 'విశ్వదాభిరామ వినురవేమ' అనే మకుటమే వేమన చెప్పిన ఆటవెలది పద్యాల్లో ఎక్కువగా కనిపిస్తుంది.

'విశ్వదాభిరామ వినుర వేమ' అనే మకుటాన్ని వేమన ఏ భావంతో రాశాడో, దాని అర్థవివరణపై ఇప్పటివరకు అనేక రకాల చర్చలు జరిగాయి. సి.పి బ్రౌన్ నుంచి గోపిగారి వరకు వేమన పరిశోధకులు మకుటంపై వారి భిన్నాభిప్రాయాలు వినిపించారు.

1) సి.పి.బ్రౌన్–సకల జనుల దైవానికి ప్రియమైన ఓ వేమా వినుము.(వేమనయోగి అచల పరిపూర్ణరాజయోగ సిద్ధాంతం:26)
2) శ్రీ ఆచంట సాముఖ్యాయనశర్మ–సమస్తమును ఇచ్చుట చేత మనోజ్ఞుడు వేమన్న వినుము!(పై పుట)
3) ఎన్. గోపి–విస్వదుడంటే సృష్టికర్త అని సృష్టికర్తకు ఇష్టుడైన వేముడు (ప్రజాకవి వేమన:235)
4) త్రిపురనేని వేంకటేశ్వరరావు– వేమన విశ్వమును మనస్సులో వెదకి వీక్షింపుమని చెప్పడం. (వేమన నాథ సంప్రదాయం:65)
5) కొర్లపాటి శ్రీరామమూర్తి–లౌకిక అలౌకిక విశ్వమును ఇచ్చువాడైన శివుడు. (వేమన నాథ సంప్రదాయం:66)

విశ్వదాభిరామ అనే పదబంధాన్ని వేమనకు విశేషణంగా చెప్పడానికే విమర్శకులు పూనుకున్నారు. కానీ, ఈ పదబంధాన్ని సంబోధన రూపంలో అంటే విశ్వతః= అంతటా(వ్యాపించి), అభిరామ=ప్రకాశించునది పరతత్త్వం లేక ప్రకాశించువాడు భగవంతుడు అనే అర్థంలో 'ఆ సర్వ వ్యాప్తి సమస్త వస్తువుల్లో ఉన్న ఆ పరమాత్మని సంబోధించి వేమన తత్ సాక్షిగా తన మాటలు వినండి' అని చెప్పడం సమంజసంగా ఉంటుందని ముదిగంటి సుజాతారెడ్డి వ్యాఖ్యానించారు. 'విశ్వతః+ అభిరామ=విశ్వతోభిరామ' అని కావాల్సి ఉండగా జనం వాడకంలో సరళాదేశంగా మారి 'విశ్వదాభిరామ' అయిందన్నారు. సంస్కృతంలో 'విశ్వతః' అనే శబ్దం అనేకచోట్ల వాడబడిందని అందుకే 'విశ్వదః, విశ్వథః అనే పదాలకన్నా 'విశ్వదాభిరామ' పదబంధంలో విశ్వతః అనేదే సముచితంగా ఉంటుందని ముదిగంటివారు విశ్లేషించారు.

ఈ గ్రంథంలో వేమన పేరు గురించి చెబుతూ, ఆంధ్రదేశంలో శైవ సంప్రదాయం అధికంగా ఉండటం వల్ల ఆ ప్రభావంతో భీమేశ్వరుడు అనే పేరు పెట్టుకోవడం జరిగింది. తర్వాత కాలంలో ఆ "భీమన"(భీమన–బీమన–వీమన–వేమన) పేరే వికృతి రూపం చెంది "వేమన"గా మారిందని సుజాతారెడ్డి అభిప్రాయపడ్డారు. కుషాణవంశ రాజుల్లో రెండో కాడ్ ఫిసిస్ కు వీమ కాడ్ ఫిసిస్ అనే పేరు ఉందని, కుషాణ రాజు వాసుదేవుడు(క్రీ.శ176-177) వేయించిన బంగారు నాణెంపై "భీమ" రూపమైన శివుడి బొమ్మను బట్టి వీరు శివున్ని ఆరాధించినట్లు తెలుస్తుందని, అందుకే రెండో కాడ్ ఫిసిస్ "భీమ" కు ప్రాకృతరూపమైన "వీమ"ను పేరుగా ధరించి ఉంటాడని ఆమెకు జర్మనీలో లభ్యమైన బంగారునాణెం ఆధారం చేసుకుని వేమన పేరు గురించి సుజాతారెడ్డి ఒక నూతన కోణంలో తన పరిశీలనను వ్యక్తంచేశారు.

వేమన గురించి సుజాతారెడ్డి ఈ గ్రంథంలో చేసిన కొన్ని ఆలోచనలు కొంత సంధిగ్ధతను కలగజేస్తున్నట్లు పాఠకులకు అనిపించకమానదు. ముఖ్యంగా వేమన నాథ సంప్రదాయానికి చెందిన వాడుగా కొన్ని హేతువాద దృక్పథంలో రాసిన పద్యాలను ఆధారంగా

చేసుకుని చెప్పారు. కానీ, వేమన రాసిన పద్యాలపై అయన శైలిపై కచ్చితమైన ఒక నిర్ధారణ ఇప్పటి వరకు జరిగిన పరిశోధనల్లో తెలినట్లు కనిపించదు. అలాంటి సందర్భంలో వేమన రాసినట్లు చెబుతున్న పద్యాలపై మరికొంత ఖచ్చితత్వం సాధించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అలాగే వేమన హేతువాదని చెబుతూనే శివున్ని ఆరాధన చేసుకుని అభివృద్ధి చెందిన నాథ సంప్రదాయానికి చెందిన వాడిగా నిర్ధారించడం, దాన్ని ఒక తాత్త్విక నేపథ్యంలో చెప్పకపోవడం ముదిగంటివారి ప్రతిపాదనను కొంతవరకు బీటలుపారేలా చేస్తున్నాయని భావించవచ్చు.

### ముగింపు

ముదిగంటి  సుజాతారెడ్డి ఆలంకారిక విమర్శలో పరిశీలించిన ప్రాచీన గ్రంథాలను పరిశోధనలో ఎన్ని కోణాలలో ఒక కావ్యాన్ని విశ్లేషించగలరన్నదాన్ని ఆధారంగా వారి విమర్శనా తత్త్వం అవగతమవుతుంది. ఒక కవి రచయిత రాసిన రచనలను ఏ విమర్శ పద్ధతుల ఆధారంగా గ్రంథాలను  విశ్లేషించారో అర్థం చేసుకోవచ్చు. ఒక కావ్యం లేదా రచనలో ఉండే వివిధ రకాల కతృత్వం, రచన, కాల వివాదాలు, మొదలైన అంశాలు భిన్న చర్చలకు లోనవుతాయి. వీటికి ఒక చివరి పరిష్కారం అంటూ సాధారణంగా దొరకదు. కానీ, ఇలాంటి భిన్నవాదాలకు నిలయమైన రచనలను పరిశీలించడం, అందులో భాగంగా ఇంతకముందు ఉన్న చర్చలన్నింటిని ఒకచోట చేర్చి తమ వాదాన్ని కూడా ఇవ్వడం జరుగుతుంది. దీనివల్ల ప్రస్తుతం ఒక పరిష్కారమంటూ లేకపోయినా మన సాహిత్య విస్తృతి ఎంత ఉందో, ఎన్ని కోణాలలో విస్తరించి ఉందో పాఠకులకు అర్థమవుతుంది.

## మూడవ అధ్యాయంలోని ముఖ్యాంశాలు

1) శ్రీనాథుడు–పెద్దన–రామరాజభూషణుడు–వేమన–బాణుడు ఇలా ప్రాచీన సాహిత్యంలోని ప్రభావితం చేసిన కవులందరి రచనలను సమీక్షించిన అనుభవం సుజాతారెడ్డి విమర్శలో దర్శనమిస్తుంది.

2) తొలి తులనాత్మక విమర్శకుడు వెన్నేటి రామచంద్ర రావు. ఇయన రాసిన మను–వసు చరిత్ర రచనా విమర్శనము 1899.
3) కవిగా, తాత్త్వికుడిగా, యోగిగా, సంఘసంస్కర్తగా, మానవాతవాదిగా, హేతువాదిగా బహుముఖ కోణాల్లో ఇప్పటివరకు వేమనను అర్థం చేసుకున్నారు.
4) ఆధునిక సాహిత్యంలో 'వర్ణన' దాని స్వరూపాన్ని కొంత మార్చుకుంటున్నట్టు అర్థం అవుతుంది. రచనలో కృతిపతి చరిత్ర కథకన్నా, పాత్రలే ముఖ్యం. అందుకే ఆధునిక రచయితలు మాత్రం తమ గొంతు పాత్రల గొంతు కన్నా ఎక్కువగా వినపడడం ఇష్టపడరు.
5) రామరాజభూషణుడు కథాకల్పనా ప్రతిభను విశేషముగా ప్రదర్శించి, మూలకథను విశేషముగా అనుసరించించుచు మనుచరిత్రను మించిన కావ్యమును రచించినట్లు ముదిగంటి సుజాతారెడ్డి అభిప్రాయం.

తర్వాతి అధ్యాయంలో ముదిగంటి సుజాతారెడ్డి విమర్శ రచనలో మార్పులో భాగంగా వారు ఆధునిక సాహిత్య ప్రక్రియలకు సంబంధించి చేసిన ఆధునిక సాహిత్య విమర్శ గురించి చర్చించుకోవాలి.

అధ్యాయం–4

# ముదిగంటి సుజాతారెడ్డి ఆధునిక సాహిత్య విమర్శ

## 4.0 ఆధునిక సాహిత్య విమర్శ పరిచయం

ముదిగంటి సుజాతారెడ్డి ఆధునిక సాహిత్య విమర్శలో చేసిన విమర్శనా దృక్పథాన్ని తెలుసుకోవాలి అనుకుంటున్నప్పుడు తెలుగులో వచ్చిన ఆధునిక సాహిత్య విమర్శ పరిచయాన్ని కొంత చెప్పుకుంటూ ఆ తర్వాత రచయిత్రి వివిధ సందర్భాల్లో తెలుగు సాహిత్యాన్ని అనుశీలించిన తీరును పరిశీలిస్తే ఉపయోగకరంగా ఉంటుందని భావిస్తున్నాను. సాహిత్య ప్రక్రియలలో ఒకటైన విమర్శ చాలా ప్రత్యేకమైన ప్రక్రియ. మిగతా ప్రక్రియలు కవుల, రచయితల సృజనాత్మకతపైన ఆధారపడేవి. కానీ,, విమర్శ ఆయా రచనలను తరచి చూపే, తెరచి చూపే వచన ప్రక్రియ. విమర్శ ఏదైనా రచనను ఆశ్రయించుకొని సాగుతుంది. మూల రచనలోని ముఖ్య విషయాన్ని వెలికితీయడమైన, కవి అభిప్రాయాల్ని, కావ్య లేదా రచనల ప్రయోజకత్వాన్ని విడమరిచి చెప్పేదే విమర్శ.

తెలుగులో ఆధునిక సాహిత్య సృజన ఎప్పుడు మొదలైందో అప్పుడే ఆధునిక సాహిత్య విమర్శ మొదలైందని చెప్పవచ్చు. ఇరవై శతాబ్దంలో శాస్త్రసాంకేతిక పరిణామాలతో పాటు తెలుగు సాహిత్య రంగంలోకి 'ఆధునికత' అనే భావన ప్రవేశించిందని తెలుస్తుంది. ఈ దశలో ఆధునిక ధోరణులకు సంబంధించిన విభిన్నమైన అంశాలు సాహిత్య విమర్శరంగంలో ప్రతిబింబించడం ప్రారంభమైంది. ఆధునికత కేవలం ఒక భౌతికమైన పరిణామం కాదు. ఇది సామాజిక, వైయక్తిక చైతన్యాన్ని ప్రభావితం చేసిన దృక్పథం అందుకే ఈ భౌతికమైన మార్పును గుర్తించడమే ఆధునిక విమర్శ తొలి లక్షణంగా యాకూబ్ అంటారు.(ఆధునిక తెలుగు సాహిత్య విమర్శ,2018:18) 'ఆధునికత' సాహిత్య ప్రక్రియలను విస్తృత పరిచిన దృక్పథం. ఇది మొదట కవిత్వ రంగంలోనూ తర్వాత నాటకం, నవల, కథ వంటి భిన్న ప్రక్రియల్లోనూ చర్చకు వచ్చింది. ఈ క్రమ పరిణామం అందుకొని మిగతా సాహిత్య ప్రక్రియలు ఒక విశాలమైన

నేపథ్యాన్ని ఏర్పరచుకున్నాయి. ఇది ఆధునిక సాహిత్య విమర్శకు ఒక భూమిక అయింది. అందుకే ఆధునిక సాహిత్య విమర్శలో భిన్న సిద్ధాంతాల ప్రభావం కనిపిస్తుంది. మార్క్సిస్టు సాహిత్య విమర్శ సిద్ధాంతం వల్ల వస్తు రూప విశ్లేషణ సామాజిక గతితార్కిక సంబంధం ప్రధానంగా చర్చకు వచ్చింది. మనోవిశ్లేషణ ఆధారంగా రూపొందిన సాహిత్య సిద్ధాంతాల ప్రభావం కూడా ఇందులో భాగంగా గుర్తించవచ్చు. కానీ, 1980ల తర్వాత తెలుగు సాహిత్యంలో మార్క్సిస్టు సాహిత్య ప్రాముఖ్యత కొంత తగ్గుముఖం పట్టింది. ఇదే క్రమంలో కొంత ముందుకు పోయి అనేక ధోరణులు ఏర్పడి ఆధునికానంతర విమర్శ కూడా ప్రారంభమైంది. స్త్రీవాద విశ్లేషణ కవిత్వంలోనూ, వచనంలోనూ అలాగే దళిత, మైనారిటీ వాదాలు, ప్రాంతీయ అస్తిత్వ వాదాలు సాహితీరంగాన్ని మరింతగా శోధించాయి. దీనితోపాటు విశ్వవిద్యాలయాల్లో జరిగే పరిశోధనల్లో నిర్మాణవాదం, శైలీశాస్త్రం, సేమాంటిక్స్, రూపవాదం వంటి కొన్ని విమర్శ ధోరణులు అభివృద్ధి చెందాయి. కానీ, తెలుగు సాహిత్యంతో పాటు సమాంతరంగా విమర్శ కూడా అదే స్థాయిలో ఎదగలేదనేది ఒక చర్చ. దీనిని పరిశీలించినప్పుడు ఆధునిక సాహిత్య విమర్శలో ఒక స్పష్టమైన ధోరణి అంటూ ఏర్పడకపోవడం. పరస్పర విరుద్ధమైన అనేక ధోరణులు సాహిత్య సిద్ధాంతాలు, భిన్న విమర్శ పద్ధతులు విమర్శకులను ఎక్కువగా ప్రభావితం చేశాయని తెలుస్తుంది.

ఆధునిక సాహిత్య ప్రక్రియ అయిన నవల గురించి పరిశీలిస్తూ **'తెలుగు నవలానుశీలనం'** అనే నవలావిమర్శ గ్రంథం ద్వారా తెలుగు నవల పుట్టు పూర్వోత్తరాలను అన్నిటిని చర్చించారు. నవలావిమర్శలో కొంత లోతుగా శోధిస్తూ నవలలో రసం ఉండవచ్చుననీ ఒక కొత్తరకమైన ప్రతిపాదనను తీసుకువచ్చి తెలుగు సాహిత్యంలో **'నవల–రసచర్చ'** ద్వారా ఒక చర్చకు పెట్టారు. నవల–వాస్తవికత అనే అంశాన్ని కూడా కొంత క్షుణ్ణంగానే పరిశీలించారు. నవల, కథ, ప్రాచీన సాహిత్య విమర్శ, యాత్ర చరిత్రలు వంటి అనేక సాహిత్య ప్రక్రియల్లో ఉన్న అనుభవంతో సుజాతారెడ్డి **'అద్యతన దృష్టి'** పేరుతో సాహిత్య విమర్శ సంపుటి ద్వారా విమర్శ వ్యాసాలు రాసి వ్యాసవిమర్శలో అడుగుపెట్టారు. తెలంగాణ ప్రాంతం ముందు నుంచి ఒక ప్రత్యేకమైన చారిత్రక, సామాజిక, ఆర్థిక, భౌగోళిక నేపథ్యాన్ని కలిగి ఉంది. ఇది తర్వాతి దశలో వివక్ష, అణచివేతలు. తమని తాము కోల్పోతున్నామన్న ఒక

అస్తిత్వ భావన మొదలై అప్పటికి విస్తృతమైన అస్తిత్వ ఉద్యమాల ప్రభావంతో తెలంగాణ ప్రాంతీయ సాహిత్య విమర్శ ప్రారంభమైంది. ఈ నేపథ్యంలో తెలుగు సాహిత్యంలో వచ్చిన తెలంగాణ ప్రాంతీయ అస్తిత్వవాదాన్ని ముదిగంటి సుజాతారెడ్డి తన వ్యాసాలతో కలిపి వచ్చిన వ్యాస సంకలనం **'ముద్దెర'** పేరుతో వచ్చిన గ్రంథంలో అస్తిత్వవాద విమర్శకు ఒక బలమైన భూమికను అందించారు. ఇలా ముదిగంటి సుజాతారెడ్డి ఆధునిక సాహిత్య విమర్శ రంగంలో తనవంతు కృషి చేస్తూనే ఉన్నారు. వాటిని సంబంధించిన నేపథ్యాన్ని కొంత చర్చించి తర్వాత సుజాతారెడ్డిగారి అనుశీలన ధోరణిని పరిశీలించవచ్చునని భావిస్తున్నాను.

## 4.1 నవలా విమర్శ-భిన్న కోణాలు

ఒక నవలలో భిన్న భావాల సంఘర్షణ కనిపించటం, సన్నివేశాలను కల్పించటం జరుగుతుంది. అలాంటి సాహిత్య ప్రక్రియ అయిన నవల అధిక విస్తృతిని కలిగి ఉండి, కొంత కాల్పనికతో పాటు ఒక నిర్దిష్టమైన దృక్పథాన్ని కూడా కొన్నిసార్లు కలిగి ఉంటుంది. అటువంటి నవలలపై వ్యాసాలు, నవలల పరిచయాలు, నవలా చరిత్ర–వికాసంతోపాటు కావ్యలక్షణ, వామపక్ష, మనోవైజ్ఞానిక, చారిత్రక, శిల్ప, సామాజిక, తాత్త్విక వంటి వివిధ కోణాల్లో అనేక రకాల విమర్శలు వెలువడ్డాయి.

తెలుగులో మొదటిదశ నవలావిమర్శకులు కావ్యవిమర్శ పద్ధతినే అనుసరించే ప్రయత్నం చేశారు. 'వివేకచంద్రిక విమర్శనం' పేరుతో బ్రహ్మయ్యశాస్త్రి చేసిన విమర్శలో కావ్యవిమర్శ పద్ధతి కనిపిస్తుంది. కానీ, నవలకు–కావ్యానికి శిల్పపరంగా భేదాలున్నాయనే అభిప్రాయంతో 1984లో మాదిరాజు రంగారావు ఇతివృత్తం, పాత్రలు, వస్తువు మొదలైన మౌలికంశాలను తీసుకుని **'నవల స్వరూప సమాలోచనం'** అనే గ్రంథాన్ని రచించారు. నవలా శిల్పం విషయంలో పాశ్చాత్య విమర్శలోని విషయాలను ఆధారంగా చేసుకుని తెలుగులో వచ్చిన 80 నవలలను విశ్లేషించారు మృణాళిని. తెలుగులో మనమనుకునే సాంఘిక నవలలకు, పాశ్చాత్య సాంఘిక నవలకు మధ్య భేదాలున్నట్లు మృణాళిని తెలియజేశారు. ఫ్రాయిడ్, ఆడ్లర్, యాంగ్ వంటి వారు తెలిపిన మనోవైజ్ఞానిక శాస్త్రంలోని సంక్లిష్ట విషయాల్ని సాధ్యమైనంత

సరళంగా అర్థం చేయించే ప్రయత్నం మనకు కోడూరి శ్రీరామమూర్తిగారి **“తెలుగు నవలా సాహిత్యంలో మనోవిశ్లేషణ”**(1979) గ్రంథంలో కనిపిస్తుంది. తెలుగులోని మనోవైజ్ఞానిక నవలల్లో పేరు పొందిన అంపశయ్య నవల వ్రాసిన నవీన్ మనోవైజ్ఞానిక సూత్రాలు, ఈడిపస్ కాంప్లెక్స్, చైతన్య స్రవంతి మొదలైన విషయాలను విశ్లేషిస్తూ **'మనోవైజ్ఞానిక నవలలు-విశ్లేషణ'** అనే గ్రంథంలో నవలల్లోని పాత్రలను మనోవైజ్ఞానిక భూమిక నుండి విశ్లేషణ చేశారు.

నవల స్వరూప స్వభావాలకు సంబంధించిన విషయాలలో శిల్పానికి సంబంధించిన మౌలిక ఆలోచనలు చేసినవారు ముదిగొండ వీరభద్రయ్య. వీరు **చివరకు మిగిలేది, మూడు కథల బంగారం, నవల-నవలా విమర్శకులు** వంటి గ్రంథాల్లో నవల స్వరూప స్వభావానికి సంబంధించిన వివేచన చేశారు. వీరభద్రయ్య నవల గురించి చెబుతూ మహాకావ్యంలో కవితా విషయాలను, అంశాలను పక్కకు పెడితే వస్తు నిర్వహణ, పాత్రచిత్రణ, నాటకీయత, సన్నివేశ కల్పన వంటి అంశాలను నవలల్లో కూడా గమనించవచ్చునంటారు. ఇక **'తెలంగాణ విమోచనోద్యమం-నవల'** పేరుతో తెలంగాణ పోరాట నేపథ్యంలో వచ్చిన ఆరు నవలలను తీసుకుని మార్క్సిజం కోణంలో వరవరరావు విశ్లేషణ చేశారు. ఈయన విమర్శకు వస్తు విశ్లేషణనే ప్రాధాన్యంగా తీసుకుని ఈ గ్రంథ రచన చేశారు. ఈ నవలావిమర్శలో తెలంగాణలో 1940 ప్రాంతంలోని సామాజిక, ఆర్థిక, రాజకీయ వాతావరణాన్ని అర్థం చేసుకోవడంలో తోడ్పడుతుంది. 2006లో **'నవలాసమయం'** పేరుతో ఎన్. వేణుగోపాలరావు చేసిన నవల సమీక్షలో కూడా ఇదే రకమైన సిద్ధాంత దృక్పథాలు కనిపిస్తాయి.

తెలుగు నవలల్లో సామాజిక చైతన్యం కలిగించే విషయాలు ఉన్నాయని తెలియజేస్తూ వచ్చిన గ్రంథం పి.సంజీవమ్మ రాసిన **'తెలుగు నవలలో సామాజిక చైతన్యం'** నవలలో ఉండే అనేక రకాల సామాజిక విషయాలు విశ్లేషిస్తూ ప్రాచీన, ఆధునిక, అలంకార శాస్త్రం మొదలైన దృక్పథం నుంచి ముఖ్య విషయాలను ఈమె ఈ గ్రంథంలో చర్చించారు. తెలుగు సాహిత్య విమర్శలోని అస్తిత్వవాద, మనోవైజ్ఞానిక సిద్ధాంతాలకు అవసరమైన ఒక తాత్విక నేపథ్యాన్ని తెలుగు సాహిత్య లోకానికి పరిచయం చేసినవారు ఆర్.ఎస్.సుదర్శనం. బుచ్చిబాబు **'చివరకు**

**మిగిలేది'**, గోపీచంద్ **'మెరుపుల మరకలు'**, భాస్కరభట్ల కృష్ణారావు **'వెల్లువలో పూచిక పుల్లలు'** మొదలైన నవలల్లో అస్తిత్వవాద సిద్ధాంతాన్ని అనుసరించే ప్రయత్నం సుదర్శనంగారి రచనల్లో కనిపిస్తుంది. ఈయన చేసిన విమర్శలో ఒక భిన్న కోణంలో నూతన సాహిత్య పరికరాలను తెలుగు సాహిత్యానికి అందించే ప్రయత్నం గమనించవచ్చు.

వీటితో పాటు మొదలి నాగభూషణశర్మ గారి **'తెలుగు నవలా వికాసము'** తెలుగు నవలపై చేసిన గొప్ప అనుశీలన గ్రంథం. వల్లంపాటి వెంకటసుబ్బయ్యగారి **'నవలాశిల్పం'**లో నవల ప్రక్రియ చిత్రితమైన విధానాన్ని తెలియజేశారు. పుల్లాభోట్ల వెంకటేశ్వర్లుగారి **'తెలుగు నవలా సాహిత్య వికాసము'** అనే గ్రంథంలో నవల ప్రక్రియ గురించి చాలా విషయాలు ఉన్నాయి. అలాగే వీరభద్రయ్యగారి **'నవల–నవలా విమర్శకులు'** అనే రచనలో నవల దాని స్వరూప స్వభావాలు, పాత్రలు, లక్షణాలు గురించి వివేచించిన రచనల వంటి నవలపై కొన్ని ప్రత్యేక గ్రంథాలు కూడా వచ్చాయి. ముదిగంటి సుజాతారెడ్డిగారి **'తెలుగు నవలానుశీలనం'** తెలుగు నవలలోని వైవిధ్యం, వాస్తవికత, దాని పరిణామక్రమం మొదలైన విషయాలతో చేసిన చర్చ గుర్తించదగింది.

ఇలా ఇప్పటి వరకూ తెలుగు నవలలో అనేక కోణాల్లో జరిగిన విమర్శ కనిపిస్తుంది. కానీ, మారుతున్న కాలాన్ని పరిస్థితుల బట్టి తెలుగు నవలలో ఎంతో వైవిధ్యత పెరుగుతుంది. ఆ వైవిధ్యాన్ని అందుకొని తెలుగు నవలావిమర్శ ఇంకా రావాల్సి ఉందనిపిస్తుంది.

## 4.1.1 నవల-రసచర్చ

ముదిగంటి సుజాతారెడ్డి ప్రాచీన అలంకారికులు చెప్పిన రససూత్రాన్ని కొంత భిన్నమైన కోణంలో ఆధునికంగా వాఖ్యానించుకొని, తెలుగులోని ఆధునిక ప్రక్రియ అయిన నవలకు అన్వయించే ప్రయత్నం చేశారు. ముదిగంటి సుజాతారెడ్డి అనుభూతి ప్రధానమైనది కవిత్వం. ఆలోచనా ప్రధానమైనది కథానిక. జీవితానుభావ ప్రధానమైనది నవల అని భావించి, భావనాత్మకమైన జీవితానుభావన్ని అందించే నవలలో 'రసానుభూతి' కలిగించే అంశాలున్నట్లు

ముసురే గుర్తించారు. మహాకావ్యంలో రసానుభవస్థితికి కావాల్సిన విస్తృతి క్రమోన్మీలనం అన్ని రసాలు ఏక రాసోన్ముఖంగా నడవడం వంటి అంశాలు నవలకున్న విస్తృతి వల్ల అన్వయమవుతాయని భావించారు.

రసాన్ని నవలకు అన్వయించే సందర్భంలో 'తాదాత్మ్యాన్ని' అనే అంశాన్ని సుజాతారెడ్డి ఒక మౌలికమైన ప్రధాన విషయంగా స్వీకరించారు. వీరు దీనిని 'Indentity' అవడం అంటారు. రసానుభవ స్థితిలో మనం పొందే సాధారణీకరణే తాదాత్మ్యం. నవలలో కూడా రసానుభావస్థితి ఉంటుందని రసానందాన్ని గురించి ఒక విభిన్నకోణంలో విశ్లేషించారు.

వీరు ప్రాచీన రససిద్ధాంతాన్ని ఆధునిక ప్రక్రియైన నవలకు అన్వయించడంలో కొన్ని విషయాలను తెలియజేశారు. సాధారణంగా పాఠకుడు నవలలు చదివి రచయిత వర్ణించిన విభావాను భావాలను సాక్షాత్కరింపచేసుకుని తద్వారా కొన్ని రకాల భావాల ఉత్తేజానికి లోనవుతాడు. దీనివల్ల పాఠకునిలో అంతకుముందు లేని శక్తి, ప్రేరణను అపూర్వ కార్యక్షమతలు కలుగుతాయని, ఇలా కలిగే అపూర్వ చిత్తవృత్తి విశేషం మానసిక ఉత్కర్షనే రసానందమని ముదిగంటి వివరించారు. దీనికి ఉదాహరణగా ఉన్నవవారి 'మాలపల్లి' నవలను వివేచన చేస్తూ దీనిలో కొన్ని ప్రతిపాదనలు ఆధునిక మనస్తత్వశాస్త్ర సూత్రాలకు దగ్గరగా ఉన్నాయని అభిప్రాయపడ్డారు. ప్రాచీన అలంకారికుల్లో భట్టనాయకుడు రసం సామాజిక నిష్టమనగా, అభినవగుప్తుడు రతి శోకాది భావాలు సామాజికునిలో వాసనా రూపంలో ఉంటాయని చెప్పారని, వాసనా రూపంగా ఉన్నా స్థాయిభావాలు సామాజికుని హృదయంలో విభావాదుల సహాయంతో అభివ్యక్తం అవుతాయని అభినవగుప్తుడు వ్యక్తీకరించినట్లు సుజాతారెడ్డి వివరించారు.

ఆధునిక సాహిత్య ప్రక్రియలైన నవల, కవిత్వం వంటి వాటిలో రస స్వభావాన్ని అనుశీలిస్తూ చేసిన ప్రయత్నంలో వీరు కొన్ని అంశాలను పొందుపరిచారు.(రసచర్చ ఆధునికత:2010)

1) “రసానుభూతి అంటే కేవలం నవలను, కవిత్వాన్ని చదువుతున్నంతసేపు కలిగే ఆనందం, దుఃఖం, భయం, ప్రేమ, ఉత్సాహం, ఆశ్చర్యం, మొదలైనవే కాదు. కవిత్వం కానీయండి, నవల కానీయండి, చదివినప్పుడు మన గ్రంథులను పెకిలించి మనలో సంచలనం కలిగించి మనల్ని ఒక దిశగా నడిపే శక్తియే రసం”

2) నవలలు ప్రాచీన కావ్యాలలోలాగా రసానుగుణంగా ఇతివృత్తాన్ని వికసింపజేసే పాత్రలను చిత్రించేవి కావు. కానీ, ప్రారంభ దశలో వచ్చిన నవలల్లో కొంతవరకు ఆదర్శ పాత్ర చిత్రణ జరిగింది.

3) రససిద్ధాంతంలోని సాధారణీకరణం—తాదాత్మ్యత నవలా పఠనం వల్ల జరిగి రసానుభూతిని అంటే స్థాయీభావాన్ని పాఠకుల్లో ఉద్బుధం చేసి వాళ్ళని నడిపే ఒక చోదక శక్తిగా పనిచేస్తుంది. అందుకే రస సిద్ధాంతం ప్రాచీన వివరణలతో కాక కొంత కొత్త వ్యాఖ్యానంతో, పెంపుదలతో నవలకు అనువర్తింపమవుతుందని చెప్పవచ్చు.

4) రసాన్ని మనోవైజ్ఞానిక నేపథ్యంలో ఆలోచిస్తూ, మానసిక శాస్త్రవేత్తలు చెప్పిన మస్తిష్కంలో చేతన(Conscious), అచేతన(Unconscious), సుప్తచేతన(Sub-conscious) అనే మూడు భాగాలుగా ఉండి, రాగం ఉత్సాహం మొదలైన స్థాయిభావం సహృదయుని అచేతనంలో ప్రవేశించి అక్కడి నుండి మాటి మాటికి జరిగే వివిధ రకాల విభావాదుల స్మరణ వల్ల స్థాయిభావం సుప్త చేతనలోకి ప్రవేశించి అక్కడ క్షాళన జరుగుతుంది.

5) ఆధునిక కవిత్వం ప్రాపంచిక విషయావగాహనం విషయ బోధన దగ్గరే ఆగిపోగా రసం కార్యోన్ముఖతను కూడా చేస్తున్నది. అంటే రస సిద్ధాంతం ఇంకా విస్తృత పరిధిలో పాఠకులను ప్రభావితం చేస్తున్నది!

మహీధర రామమోహనరావు రాసిన ‘కొల్లాయిగట్టితేనేమి?’(1965) నవలను రాచమల్లు రామచంద్రరెడ్డి చారిత్రక నవలగా నిరూపించే ప్రయత్నంలో చారిత్రక నవల, చారిత్రక అనుభూతిని ఆ వస్తువు ద్వారా కలిగించాలని భావించారు. రా.రా ఇలా

భావించడంలో ప్రాచీన అలంకారికుల రసమే ఉంది అని చెప్పలేము కానీ, 'తాదాత్మ్యం' అనే ఒక భావన కనిపిస్తుంది. ముదిగంటి సుజాతారెడ్డి కూడా తాదాత్మ్యం అనే అంశాన్ని ఇదే కోణంలో ప్రస్తావించడం జరిగిందని అనుకోవచ్చు.

వల్లంపాటివారు భారతీయ సాహిత్య సిద్ధాంతాల్లో మౌలికంగా కొన్ని విలువైన సిద్ధాంతాలు ఉన్నాయని చెప్తూ, పాఠకుడికి భారతీయేతర సాహిత్య శాస్త్రకారులపైనే ఆసక్తి పుట్టుకొస్తుంది. దీన్ని భారతీయ సాహిత్య సిద్ధాంతాలను, విమర్శను తక్కువ చేసే ఆసక్తిగా కాకుండా, జ్ఞానపరిధిని పెంచుకోవలసిన అవసరాన్ని తెలిపేదిగా గుర్తించాలని చెప్పారు. ఇలాంటి భారతీయ పాశ్చాత్య విమర్శ సూత్రాలను కలిపే ఒక సమన్వయ దృక్పథం కలిగిన వల్లంపాటి వెంకటసుబ్బయ్య రసాన్ని వస్తువుతో పోల్చడం జరిగింది.

ఇలా వస్తువుని వెంకటసుబ్బయ్య రసాన్ని వస్తువుగా అభివర్ణించడం, ఆర్ ఎస్ సుదర్శనం రసాన్ని మూడ్ అనడం వంటి వాటిని అలంకారికులు ప్రతిపాదించిన రసాన్ని కొంత ఆధునిక దృక్పథంలో అర్థం చేసుకోవడానికి అవకాశం ఉంది.(తెలుగు సాహిత్య విమర్శ దర్శనం, 2016:207) ఈ రకంగా కొందరు ఆధునిక విమర్శకులు రసాన్ని సమకాలీన దృష్టితో చూసి వ్యాఖ్యానించిన విషయాలను బట్టి నవలలో రసాన్ని అన్వయించిన విషయాన్నీ అవగాహన చేసుకోవచ్చు.

పైన రచయిత్రి నవల ప్రక్రియలో రసం గురించి చేసిన చర్చలో రసం అన్న శబ్దానికి ఆలంకారికమైన అర్థాన్ని స్వీకరించలేదని బలంగా చెప్పవచ్చు. దీనికి ముదిగంటి సుజాతారెడ్డిగారి ఈ మాటలే నిదర్శనం. *"కవిత్వం కానీయండి, నవల కానీయండి, చదివినప్పుడు మన గ్రంథులను పెకిలించి మనలో సంచలనం కలిగించి మనల్ని ఒక దిశగా నడిపే శక్తియే రసం. నవలను చదివినప్పుడుగాని సినిమాను చూసినప్పుడుగాని వాటిలోని పాత్రలు, సంఘటనలు మన శరీరంలోని గ్రంథులను రేపి మనల్ని సంచలితుల్ని చేసి మనం మనం కాదు నవల చదువుతుంటే మన మనఃఫలకం మీద నిలిచిన పాత్రనే అన్న భావన వరకు పోయి మనల్ని కార్యోన్ముఖుల్ని చేస్తవి"*(రసచర్చ ఆధునికత,2010:39) అనే సుజాతారెడ్డిగారి

అభిప్రాయాన్ని స్థూలంగా విశ్లేషించినప్పుడు 'రస' శబ్దానికి ఉన్న శాస్త్రీయమైన అర్థంలో కాకుండా దీనిలోని ఒక మౌలికార్థాన్ని మాత్రమే వీరు ప్రతిపాదనకు ఆధారంగా తీసుకున్నట్లు గుర్తించవచ్చు. కానీ, ఆధునిక ప్రక్రియ అయినా నవలకు రసం అన్వయింపజేసిన ఈ ఆలోచన సాహిత్యలోకంలో అనేక విమర్శలకు గురై భిన్న ఆలోచనలకు తెరలేపింది. ముదిగంటి సుజాతారెడ్డి రసచర్చలో మొదట ఏ ఆలోచనతో దీనిని అన్వయిస్తున్నారో ఇంకొంత స్పష్టంగా, సంగ్రహంగా తెలియజేసినట్లయితే రచయిత్రి ఆలోచనకు మరింత బలం చేకూరి సాహిత్య లోకంలో ఒక ధృడమైన నూతనంశంగా నిలిచి ఉండేదనిపిస్తుంది.

## 4.1.2 నవల-వస్తుధ్వని

ఏదైనా ఒక రచయిత తన రచనలో స్పష్టంగా వాచ్యంగా చెప్పే విషయాల కంటే అతీతమైన భావాలు, విషయాలు పాఠకునికి గోచరించినప్పుడు లేదా స్ఫురించినప్పుడు అది వస్తుధ్వని అవుతుంది. కొందరు రచయితలు తాము చెప్పదలుచుకున్న భావాలను, నిర్దేశాలను సిద్ధాంత పరమైన భావజాలాన్ని ప్రత్యక్షంగా చేసి కదనంలోగాని, పాత్రల సంభాషణలోగాని వ్యాచ్యంగా చెప్తారని, దీన్నే వస్తుధ్వని అంటారని సుజాతారెడ్డి వ్యక్తీకరించారు. నవలల్లో వస్తుధ్వని అనే అంశాన్ని వీరు 'రసచర్చ–ఆధునికత' గ్రంథంలో పరిశీలించారు. ఆధునిక ప్రక్రియ నవలను తీసుకుంటే అలంకార ధ్వని పనికి రాకపోవచ్చు కాని, రసధ్వని, వస్తుధ్వని మాత్రం నవలకు అన్వయించవచ్చంటారు. వస్తుధ్వని సాధించాలంటే రచయిత తాను ఎక్కడ ప్రవేశించకూడదని తెలియజేసి 'ధ్వని' అభివ్యక్తికి సంబంధించిన సిద్ధాంతమని, వస్తువు కథగా రూపొందే క్రమంలో కథలో ఒక సందర్భంలో చేసిన వర్ణన లేదా చెప్పిన విషయం తర్వాత జరగబోయే మరొక విషయాన్నీ వ్యంజింప చేస్తే అదే 'వస్తుధ్వని' అని పేర్కొన్నారు. దీనికి ఉదాహరణగా క్రింది వాక్యాన్ని గమనించవచ్చు.

ఉదాహరణ : సురేంద్ర రో**జు** వస్తున్నాడు.

సురేంద్ర రో**జూ** వస్తున్నాడు.

అనే రెండు వాక్యాలు ఒక్కలాగే కనిపించవచ్చు. కానీ, రెండో వాక్యంలో 'రోజూ'లో దీర్ఘం ఊనికలు సురేంద్ర ప్రతిరోజు, తప్పకుండా ప్రతిరోజు వస్తున్నాడనే అర్థం స్ఫురిస్తుంది.

1950 దశకంలో తెలుగులో నవలా రచయితలు వస్తువుతోపాటు శిల్పానికి ప్రాధాన్యం ఇచ్చారని చెప్పవచ్చు. చెప్పదలుచుకున్న విషయాన్ని మరీ వాచ్యం చేయకుండా ధ్వనింపజేసే వ్యంగ్య ధోరణి పాటించారు. జి.వి. కృష్ణారావు, బుచ్చిబాబు, శ్రీదేవి, ఉప్పల లక్ష్మణరావు మొదలైన నవలా రచయితలు వస్తు వ్యంగ్యం గల రచనలు చేశారు. స్వాతంత్ర్యానంతరం వెంటనే వ్యక్తుల్లో ప్రవేశించిన స్వార్థచింతనను, అవినీతి, అసత్య ధోరణులను, పడిపోయిన విలువలను వ్యంగ్యం చేస్తూ జి.వి. కృష్ణారావు 'కీలుబొమ్మలు', ఉప్పల లక్ష్మణరావు 'అతడు–ఆమె' నవలను రచించారు. ఇది మెదడుకు పనిపెట్టే నవలలు కాని. కొడవగంటి కుటుంబరావు 'చదువు' నవల చదవడానికి చాలా సాదాసీదాగా ఉంటుంది కాని, ఆ నవల మన స్వాతంత్ర్య ఉద్యమం సాగిన తీరులోని లోపాలను, సరిగ్గా లేని విద్యావిధానం వంటి విషయాలను వ్యంగ్యం చేస్తున్నట్లు వివరించారు. ఇలా స్వాతంత్ర్య ఉద్యమకాలంలో వచ్చిన నవలలు వస్తు ధ్వనితో కూడి దేశ ప్రయోజనానికి కారణమైనట్లు తెలియజేశారు. వస్తుధ్వనిని సాధించాలంటే రచయిత తానుగా ఎక్కడ ప్రవేశించకూడదని, ఒక నాటకంగా నవలని నడపాలని, పదాలు, శైలి, కథనం చదివించేటట్లుగా ఉన్నప్పుడు మాత్రమే వస్తుధ్వని సాధ్యమవుతుందని ముదిగంటి సుజాతారెడ్డి విశ్లేషించారు

ముఖ్యంగా ప్రతీకాత్మకత గల నవలల్లో వస్తుధ్వని కొంత ఎక్కువగా కనిపిస్తుంది. ప్రతీకలను ఆధారంగా చేసుకుని రచయిత తాను చెప్పదలుచుకునే అసలైన ఉద్దేశాన్ని రచయిత నేరవేర్చుకుంటాడు. చాలాసార్లు పైకి ఒకలాగ కనిపించే నవలల్లో అసలు అర్థాలు వేరే ఉంటాయి. ఆ అసలైన అర్థం పట్టుకోవడం పాఠకుని ప్రతిభ మీద ఆధారపడి ఉంటుంది. సరైన ప్రాపంచిక దృక్పథం ఉన్న పాఠకునికి ఇది కొంత సులభంగానే పట్టుపడుతుంది. ముదిగంటి సుజాతారెడ్డిగారి 'మలుపు తిరిగి రథచక్రాలు' నవలలో రమేశ్ అనే విప్లవ వీరుడు నవల చివర ఒక చిన్న పాపను పెంచడానికి పూనుకోవడంతో అతను ప్రజాస్వామ్యంవైపు మలుపు తిరగడం

ధ్వనించింది.చిలుకూరి దేవపుత్ర 'పంచమం'లో దళిత ఐక్యత, విశ్వనాథవారి నవలల్లో హిందూ సంప్రదాయోద్ధరణ అనే అంశాల్లో వస్తుధ్వని మనకు ద్యోతకమవుతుంది.

## 4.1.3 విమర్శ–ప్రతి విమర్శ

ప్రతి మనిషికి తనకంటూ ఒక ప్రత్యేకమైన ఆలోచన ఉన్నట్లు, ముదిగంటి సుజాతారెడ్డి చేసిన రసచర్చపై విమర్శకులు భిన్నమైన కోణాలలో స్పందించారు. దీనిపై కొంతమంది అనుకూలంగా రాయగా మరికొంతమంది నవలల్లో రసచర్చ అనేది ఒక అనవసరమైన చర్చగా భావించి తమ స్పందనను తెలియజేశారు. విమర్శకులు అడిగిన ప్రశ్నలన్నిటికీ ప్రతిస్పందనను ముదిగంటి సుజాతారెడ్డి తెలియజేసి లేఖల రూపంలో ఉన్న వాటన్నింటిని ఈ గ్రంథంలోనే పొందుపరిచారు. వాటిలో కొంత చర్చను ఇక్కడ ప్రస్తావించాల్సిన అవసరం ఉందని భావిస్తున్నాను.

“రససిద్ధాంతమా–రసాభాసయా” అనే పేరుతో రాసిన లేఖలో బలివాడ రఘునాథరావు రసచర్చపై వ్యతిరేకమైన అభిప్రాయాన్ని ఈ విధంగా తెలియజేశారు. “అసలు సుజాతారెడ్డికి రసపోషణ విషయంలో ఒక సమగ్రమైన అభిప్రాయం ఉన్నట్లు తోచదు. ఏవో సిద్ధాంతవాదులు అమరించి పెట్టిన నవరసాల సొరుగుల్లో మూసపోసిన వర్ణనలే ‘రసపోషణ’ అని వారనుకుంటున్నారు”(రసచర్చ–ఆధునికత,2010:29) అని ప్రాచీన కావ్యాలలోని ఒకటి రెండు పదాల కూర్పు, కల్పన ఉదాహరణలను చెప్పి వాటి ఆధారంగా రససిద్ధాంతం గురించి చెప్పగా, దీనికి ముదిగంటివారు ‘కేవలం పదాల కూర్పు, కల్పనా చాతుర్యలే రసపోషణ! అసలు రసవిష్కారం అంటే ఇంతే అయితే ఇక భరతుని రస నిర్వచనం తర్వాత అభినవగుప్తాచార్యుల రసధ్వని సిద్ధాంతాలు అభిప్రాయాలు ఎందుకు?’ అని సమాధానమిచ్చారు సుజాతారెడ్డి.

ఇదే సందర్భంలో “నేటియాంత్రిక యుగంలో విజ్ఞాన పిపాసులైన ప్రేక్షకులు (సహృదయులైన కాకపోయినా) రంగస్థలం మీది పాత్రధారులను సూత్రధారులను చూచి తన్మయుడయ్యే స్థితిలో లేరు. ఆ మనస్తత్వం సన్నగిల్లిపోయింది. రాముని పాత్రను చూసి

తన్మయుడయ్యే బదులు ఆ పాత్ర వెనుకఉన్న రామారావుగారి యాక్షన్ పరిశీలనగా చూస్తాడు" అని మరో ప్రశ్న సంధించగా, దీనికి బదులుగా సుజాతారెడ్డి "రామారావుగారి యాక్షన్ ను పరిశీలించడం వరకే ఆయన సహృదయత్వం పరిమితమైనప్పుడు రామాయణం బదులు కీమాయణం, కామాయాణలే చదువుతాడు మరి!"(రసచర్చ–ఆధునికత,2010:42) అని ఇచ్చిన ఒక రకమైన వ్యంగ్య పూరిత జవాబు కనిపిస్తుంది.

కె.పి.అశోక్ కూమార్ ఈయన రసచర్చపై మరికొంత సుదీర్ఘంగా చర్చించారు. ఈయన రాసిన లేఖలో ఈ సిద్ధాంతంపై అనేక సందేహాలు వెలిబుచ్చారు.

"ప్రాచీనాచార్యులు కూడా మొదట రససిద్ధాంతం, దృశ్య కావ్యలకే కాని శ్రవ్య కావ్యాలకు పట్టదని అనుకున్నారని, ప్రస్తుత కాలంలో ఎంతగానో అభివృద్ధి చెందిన మనోవైజ్ఞానికశాస్త్రం, దానిలోని సిద్ధాంతాలు, సూత్రాల ఆధారంగా రసం దాన్ని చర్చించాలని" ముదిగంటి తన అభిప్రాయాన్ని తెలియజేశారు. రామాయణంలో రాముని ఆచరణను ఇప్పటికీ హాస్యాస్పదం అనిపిస్తే శ్యామ్ బెనెగల్ 'నిశాంత్' అనే మూవీలో స్కూల్ టీచర్ రామాయణ కథ చేత ఆ ఊరి ప్రజలకు ఉత్తేజాన్ని కలిగించే సంఘటనలను ఉదాహరణకు చూపించారు సుజాతారెడ్డి. ఏదైనా ఒక నవలను ఎన్నుకొని దానిలోని వస్తు రూపాలను, కథన రీతులను చర్చించే విమర్శతత్త్వం కలిగిన విమర్శకుడైన కె.పి.అశోక్ కుమార్ సాహిత్యం ప్రభావం గురించి చెబుతూ, చలం వల్ల గాని, నవల సాహిత్యం వల్ల గాని ఎటువంటి ప్రభావం అనేది ఉండదని అది పాఠకుడి వ్యక్తిగత విషయంపై ఆధారపడి ఉంటుందని అనే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు.(రసచర్చ–ఆధునికత,2010:33) కానీ, 'సమాజంపై సాహిత్యం ప్రభావం తప్పకుండా ఉంటుంది' అందుకే ఆ రోజుల్లో, ఏ రోజుల్లోనైనా సాహిత్యాన్ని నిషేధించిన సందర్భాలున్నట్లు రచయిత్రి గుర్తుచేశారు.

ఈ నవలల్లో రససిద్ధాంతం అనే చర్చను సమర్ధించినవారున్నారు, వారిలో గోదావరిశర్మ, భట్టిప్రోలు వెంకటరత్నం ముఖ్యులు. కె.గోదావరిశర్మ తన లేఖలో దీనికి అనుకూలంగా పేర్కొన్న అంశాలు చూస్తే "రససిద్ధాంతం దృశ్యకావ్యలకే పరిమితం కాదు

ఎందుకంటే దృశ్యకావ్యాలలో అయినా, నిజానికి నాటక ప్రదర్శన ఎక్కడ జరుగుతుంది? రంగస్థలం మీద కాదు, ప్రేక్షకుడి మనస్సులో రంగస్థలానికి ప్రేరణ మాత్రమే. ఆ ప్రేరణ శ్రావ్య కావ్యాలు కూడా ఇవ్వగలవు అందువల్ల నవల, కథానిక, కవిత్వం మొదలైన అన్ని ప్రక్రియలకు సిద్ధాంతాన్ని నిస్సంకోచంగా వర్తింపజేయవచ్చు. తన అభిప్రాయాన్ని తెలియజేసి ప్రతి పాఠకుడిలో అనుభూతి ఉంటుందని ఇది అందరిలో సాధారణంగా జరిగే ప్రక్రియే అని తన అభిప్రాయాన్ని వెల్లడించాడు. కావ్యానికి, నవలకు స్వభావరీత్యా వైవిధ్యమే తప్ప వైరుధ్యమేమి లేదనే అంశాన్ని వ్యక్తపరిచే ఇంకొక విషయాన్ని కూడా ఇక్కడ చెప్పుకోవడం సముచితంగా ఉంటుంది. కళాపూర్ణోదయాన్ని పద్యాలలో రాయబడిన నవల అని ప్రచురంగా ఉంది. కావ్యానికి, నవలకు రెండింటికీ సమానమైన ఏదో ఒక లక్షణం ఉంది అన్న అంశాన్ని ఈ విషయం తెలియపరుస్తుందని"(రసచర్చ–ఆధునికత,2010:40) అందుకే రసం అన్న శబ్దానికి ఆలంకారికమైన అర్థంలో తీసుకున్నప్పుడు మాత్రమే ఇది చర్చనీయాంశం అవుతుందన్న అభిప్రాయాన్ని చిట్టిపోగు వెంకటరత్నం వెల్లడించారు.

కె.పి.అశోక్ కుమార్, బలివాడ రాఘునాథరావు మొదలైనవారు 'రసం' నవల ప్రక్రియకు అన్వయ చేయడం సాధ్యమయ్యే విషయంకాదనే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. కాత్యాయని విద్మహే "ఆధునిక సంక్లిష్ట మానవ సమాజ జీవిత చిత్రణగా సాగే నవలలో విభావానుభావాదులు  కావ్యేతిహాసాలలో లాగా ఒక చోట నిర్దిష్టంగా చూడడానికి వీలైన స్థితిలో ఉండవు" (తెలుగు సాహిత్య విమర్శ దర్శనం,2016:202) అని అభిప్రాయపడి రస సిద్ధాంతం నవలకు అనువర్తించే అవకాశమే లేదన్నారు.

మానవ సమాజ జీవన చిత్రణ ఎంత సంక్లిష్టమైన రచయిత ఇతివృత్తాన్ని పాత్రను ఒక స్పష్టమైన లక్ష్యంతో ముందుకు నడుపుతాడు. అప్పుడు ఆ స్పష్టమైన లక్ష్యం, వస్తువు ద్వారా వ్యక్తమవుతుంది. ఆ వ్యక్తమయ్యే అనుభూతి, రసంగా పర్యవసిస్తుంది. నేటి యుగంలో ఎంతగానో అభివృద్ధి చెందిన మనోవైజ్ఞానికశాస్త్రం, దానిలోని సూత్రాలు సిద్ధాంతాలకు అనుగుణంగా రస సిద్ధాంతాన్ని పరిశీలిస్తే సాహిత్యంలో ఇంకా ఎన్నో కొత్త పుంతలు తొక్కే

అవకాశం ఉంది. మొత్తానికి ఈ నవల రసచర్చ ద్వారా సాహిత్యాన్ని మరో కొత్తకోణంలో పరిశీలించే అవకాశం ఉందని ముదిగంటి సుజాతారెడ్డి అందరికీ తెలియజేసినట్లు కనిపిస్తుంది.

## 4.1.4 నవల-ఉపోద్ఘాతం

మానవ జీవితమే ఒక సంక్లిష్టమైన విషయాల సమాహారం. ఇలాంటి సంక్లిష్టమైనటువంటి విషయాలన్నింటిని ఒక చోట చేర్చి, సమాజాన్ని, జీవితాన్ని వివిధ కోణాల్లో చిత్రించడంలో నవలది ప్రత్యేక స్థానం. *"నేను నవలా రచయితను కాబట్టి ఒక యోగికంటే, తత్త్వవేత్త కంటే, శాస్త్రజ్ఞుడికంటే, కవికంటే అధికున్నిగా భావిస్తాను. వీరు మానవ జీవితానికి సంబంధించిన చిన్న చిన్న ముక్కల్ని గూర్చి గొప్పగా తెలుసుకున్నవారే. కాని వీరికి మానవ జీవితం సంపూర్ణంగా ఏనాడూ అవగాహన కాదు. నవల మానవ జీవితానికి సంబంధించిన ఏకైక మహోజ్జ్వల గ్రంథం* (నవలాశిల్పం,1989:14) 'నవలాశిల్పం' గ్రంథంలో వల్లంపాటి నవల గురించి తనదైన ఒక అభిప్రాయాన్ని తెలిపారు. పాశ్చాత్య నవలకారుడు అయిన 'డి.హెచ్ లారెన్స్' నవల గురించి చెబుతూ నవల మానవ జీవితాన్ని పూర్తిగా, సమగ్రంగా అవగాహన చేసుకోవడానికి గల ఒకే ఒక్క సాధనం(D.H.Lawrence.Phoenix (Why the Novel Matters):1936) అని చెప్పిన అభిప్రాయం, విభిన్నమైన మానవ జీవితాల్ని అర్థం చేసుకోవచ్చుననే అర్థంలో సమంజసమే అనిపిస్తుంది. ఇలాంటి నవల ప్రక్రియ దాని పుట్టుపూర్వోత్తరాల గురించి, 'నవల' పద ఆవిర్భావం, తెలుగు సాహిత్యంలో నవల పరిచయం అలాగే నవల లక్షణాలు, నవల ఆధారంగా యుగవిభజన వంటి మౌలికంశాలను ముదిగంటి సుజాతారెడ్డి **'తెలుగు నవలానుశీలనం'** గ్రంథంలో ఒక కొత్త దృక్కోణంలో చర్చించి నవలా సాహిత్య విమర్శలో కొన్ని నూతన అంశాలను ఆవిష్కరించారు.

### 4.1.5 నవల శబ్దం-పాశ్చాత్య నవల

కందుకూరి వీరేశలింగం పంతులు రచించిన "రాజశేఖర చరిత్రము" (1878) ను విమర్శిస్తూ కాశీభట్ట బ్రహ్మయ్య శాస్త్రి తొలిసారిగా "నవల" అనే పదం గురించి *"యింగ్లీషు భాషలో 'నావల్'(Novel) అను పదము 'క్రొత్త' యను నర్థముగల 'నవ్' అను పదము నుండి పుట్టినది. ఈ 'నవ్' అను దానికినీ, 'నవ' యను మన సంస్కృత శబ్దమునకు గల సంబంధము తేటతెల్లమే కదా! కావున నవల యనగా 'నవాన్' విశేషాన్ లాతి గృహ్ణాతీత నవలా—అనగా క్రొత్త విశేషంబుగలదని అర్థము వచ్చుచున్నది. పూణభాషయందు నీమాటకిదే యర్థమగుటచే 'నావల'ను పదమునకు సరియైన వేరొక సంస్కృత పదమునకయి ప్రయత్నము చేయక 'నవల'యని యీ పదమునే నేనిట వాడుచున్నాను"* (శ్రీరామమూర్తి, కోడూరి. తెలుగు నవలా సాహిత్యంలో మనోవిశ్లేషణ,2001:4) అని 1897లో రాజశేఖర చరిత్ర విమర్శ గ్రంథం పీఠికలో నవల అనే పదం వాడటం గురించి చెప్పి అది ఏ విధంగా సమంజసమో తెలిపారు. అప్పటినుంచే తెలుగులో నవల అన్న పదం ఎక్కువగా వ్యాప్తిలోకి వచ్చినట్లు కనిపిస్తుంది. కానీ, నవల అనే ప్రక్రియ మొదటిసారిగా 15వ శతాబ్దంలో ఇటాలియన్ భాషలో ప్రాచుర్యం పొంది, తర్వాత కాలంలో 18వ శతాబ్దంలో ఆంగ్లంలో కాల్పనిక రచనలు పెరగడంతో అది కొంత విస్తృతి చెందింది. ఆ తర్వాత కాలంలో దాని ప్రభావం తెలుగు సాహిత్యం మీద పడి, తెలుగులో కూడా అదే పేరు స్థిరపడానికి తోడ్పడినట్లు తెలుస్తుంది.




నవల అనే పదం తెలుగులోకి రాకముందు అది ఎన్నో మార్పులు చెందుతూ చివరకి నవలగా ఒక రూపం ఏర్పర్చుకున్నట్లు ముదిగంటి సుజాతారెడ్డి తన గ్రంథంలో ప్రస్తావించారు.

నవలకు *"ఇంగ్లీష్ లోని "నావెల్" అన్న పేరు ఇటాలియన్ భాషలోని "నోవెల్లా" అన్న పదం నుండి వచ్చింది. ఇటాలియన్ భాషలోని "నోవెల్లా" పదం లాటిన్ భాషలోని "నోవ" నుంచి పుట్టింది. లాటిన్ లో 'నోవ' సంస్కృతంలోని 'నవ' శబ్దానికి సమానమైనది"*(తెలుగు నవలానుశీలనం,1991:20) అనే ఒక కొత్త ప్రతిపాదన ఈ గ్రంథం ద్వారా తీసుకువచ్చారు. నవల అనే పదం మొదట ఇండోయురోపియన్ భాషా కుటుంబంలో చేరినగాని లాటిన్, సంస్కృత భాషల్లో మాత్రం సమానంగా అలాగే నిలిచివుంది. అందుకే ఆంగ్లంలో "నావెల్" అన్న పదాన్ని సులభంగా "నవల"గా మార్చి సంస్కృత అర్థాన్ని సాధించుకొని దాన్ని ఉపయోగించుకోవడానికి వీలయింది.

పాశ్చాత్య నవలకు గల ఆవిర్భావం గురించి వివరిస్తూ, "మధ్య యుగాల్లో యూరపులో ఇటాలియన్ భాషలో వచ్చిన 'నావెల్లా' ప్రక్రియ, స్పానిష్ భాషలో వచ్చిన 'పికారస్క్యూ' ప్రక్రియ, ఫ్రెంచ్ భాషలో వచ్చిన 'ఫెబ్లియా' ప్రక్రియల్లోని కథలకు భారతదేశం నుంచి ప్రయాణమై పోయిన కథలే మూలాధారాలని తెలుస్తున్నది" అని వర్తకులు, వివిధ రకాల ప్రయాణికులు సత్రంలో కలుసుకొని కథలు చెప్పుకొనే సంప్రదాయం నుంచి ఇటాలియన్, స్పానిష్ భాషల్లో నావెల్లా ప్రక్రియ పుట్టిందని చెబుతూ, అలాగే సాహస, ప్రేమ, నీతి గాథల నుంచి పయనించి 'కథ' ఆధునిక సాహిత్యంలో కథానిక, నవల రూపాలను సంతరించుకున్న విషయాన్ని ఒక నూత్న పద్ధతిలో చెప్పినట్లు దీనిలో మనకు కనిపిస్తుంది.

భారతీయ భాషల్లో ఆరంభదశలోని నవలాకారులకు, పాశ్చాత్య నవలతో పాటు ప్రాచీన సంస్కృతంలోని కథలు, ఆఖ్యానాలు నవలా రచనకు ఒక ప్రేరణగా నిలిచాయని, నవల పుట్టుకకు భారతీయ సాహిత్య మూలాలు ఉన్నట్లు తెలిపే ప్రయత్నం నవలానుశీలనం గ్రంథం ద్వారా అవగతమవుతుంది.

## 4.1.6 తెలుగు నవల ప్రారంభం

తెలుగు సాహిత్య చరిత్రలోని ఎన్నో చర్చనీయాంశాలలో తెలుగు నవల ఏది? అనేది ఒక పెద్ద చర్చనీయాంశం. ఇప్పటివరకు దీని మీద అనేక రకాల భిన్నాభిప్రాయాలు బయటకు వచ్చాయి. ముదిగంటి నవలానుశీలనం గ్రంథంలో దీనికి సంబంధిత కొంత చర్చ చేసి, మొదటి తెలుగు నవల ఏది? అనే ప్రశ్నకు ఒక హేతువాద దృక్పథంతో తన అభిప్రాయాన్ని వ్యక్తం చేసే ప్రయత్నం చేశారు. ఈ చర్చలో భాగంగా

I) మహాశ్వేత–కొక్కొండ వెంకటరత్నం పంతులు (1867)

ii) శ్రీరంగరాజు చరిత్ర–నరహరి గోపాల కృష్ణమశెట్టి (1872)

iii) శ్రీరాజశేఖర చరిత్ర–కందుకూరి వీరేశలింగం (1878)

పై మూడు నవలలు చర్చలో స్థానాన్ని ఆక్రమిస్తాయనుకుంటే, ఈ నవలలను ప్రచురించిన సమయంలో రచయితలుగాని ప్రచురణకర్తలుగాని వాటిని నవలగా పేర్కొనలేదు. మహాశ్వేత వచన రచనగా ఉంది కాని ప్రక్రియ పేరు లేదు. గోపాల కృష్ణమశెట్టి రంగరాయ చరిత్రను రచయిత 'నవీన ప్రబంధం' అనగా, రాజశేఖరచరిత్రమును కందుకూరి 'వచన ప్రబంధం' అని పేర్కొన్నాడు. వీటిని నవలలు అని ఆధునికులు మాత్రమే పేర్కొన్నారు. తెలుగులో 'పింగళి సూరన' రచించిన కళాపూర్ణోదయం తొలి తెలుగు నవలగా చెప్పిన, ఎక్కువ మంది విమర్శకులు దీన్ని ఒక ప్రబంధంగానే గుర్తించారు. నిడదవోలు వెంకటరావు, కొక్కొండ వెంకటరత్నం పంతులు 1867లో రాసిన 'మహాశ్వేత' తెలుగులో మొట్టమొదటి నవలగా భావించారు కానీ, ఇది సంస్కృతంలో భట్టబాణకృతానికి ఒక అనువాదం. ఇందులో కాదంబరి కథాంశమే మహాశ్వేతలో పరిమితంగా ఉందని చెప్పవచ్చు. దీనిలో ఆధునిక సాహిత్య ప్రక్రియ నవల లక్షణాలులేవని 'మహాశ్వేత' పూర్తిగా లభించలేదని పరిశోధకులు వివరించారు. తెలుగు నవలపై పరిశోధనలు చేసిన వాళ్ళలో కూడా తొలి తెలుగు నవల ఏది అనేదానిపై భిన్నాభిప్రాయాలు ఉన్నాయని తెలుస్తుంది. **'తెలుగు నవలా పరిణామము'**లో బొడ్డుపాటి వెంకట కుటుంబరావు, ఆరుద్ర తన 'సమగ్ర ఆంధ్ర సాహిత్యం' అలాగే **'తెలుగు నవలా వికాసం'**

గ్రంథంలో మొదలి నాగభూషణశర్మ ‘తెలుగు నవల’లో ఆచార్య కొలకలూరి ఇనాక్ మొదలగువారు ‘గోపాలకృష్ణమశెట్టి’ రాసిన ‘రంగరాజ చరిత్రము’ మొదటి నవలని నిర్ధారించారు.

పై వాదనకు కొంత భిన్నమైన వాదనలు కూడా తెలుగు సాహిత్యంలో ఉన్నాయి. కందుకూరి వీరేశలింగం పంతులుగారిపై వివిధ పరిశోధనలు చేసిన ఆర్.ఎస్.సుదర్శనం (సమాజము–సాహిత్యం), పుల్లాబొట్ల వెంకటేశ్వర్లు (తెలుగు సాహిత్య వికాసము) మరియు అక్కిరాజు రమాపతిరావు వంటి వారు రాజశేఖరచరిత్రనే మొదటి నవలగా వారి పరిశోధనలో చెప్పగా, దీనికి గల కారణాన్ని ‘తెలుగు నవలానుశీలనం’లో రచయిత సుజాతారెడ్డి *“వీరేశలింగం రాజశేఖర చరిత్ర సాంఘిక నవల అందులోనూ జమీందార్ల ప్రసక్తి ఉన్న ప్రధాన కథ. ఒక బ్రాహ్మణ కుటుంబం చుట్టూ నడుస్తుంది. పాత్రలన్ని ఉన్నత కులాలకు చెందినవారే. ప్రధాన పాత్ర అయిన రాజశేఖరుడు మొదట సంపన్నుడిగా ఉండి తన మూఢవిశ్వాసాలతో, అవివేకంతో, అమాయకత్వంతో కీర్తికోసం డాంబికత మొగమాటలకు పోయి డబ్బు ఖర్చుచేసి, బీదవాడై ఉన్న ఊరు విడిచిపెట్టి ఎట్లా కష్టాలు పాలయ్యాడో ఈ నవలలో చిత్రించబడింది. వీరేశలింగంది సంస్కరణ దృష్టి. అందుకే రచయిత ఎక్కడ సమకాలీన రాజకీయ, ఆర్థిక, పరిస్థితుల ప్రభావం జోలికి పోకుండా సమకాలం నాటి సంపన్న గృహస్తులు ఆర్థికంగా తమ అవివేకంతో ఎట్లా చిక్కులపాలవుతున్నారో చిత్రించాడు. వీరేశలింగం నవలలోని భాష, శైలి, కథ, కథనం, సంభాషణల తీరులు తర్వాతి నవలకారులకు ఒక నమూనాగా నిలిచిన నవల”* (తెలుగు నవలానుశీలనం పుట:48) అని నవలలో అశాస్త్రీయ విషయాలను ఖండించటం, మూఢ విశ్వాసాలను, వాటి వల్ల జరుగుతున్న మోసాలను కూడా వివరించగా అందుకే రాజశేఖర చరిత్రను మొదటి నవలగా నిర్ధారించే ప్రయత్నం రచయిత చేసినట్లు దీనిలో వ్యక్తమవుతుంది. ఈ నవల గోల్డ్‌స్మిత్ రాసిన “వికార్ ఆఫ్ ది వేక్ ఫీల్డ్” నవలకు అనుసరణ అనే వాళ్ళు కూడా ఉన్నారు. ఇలా ఇప్పటివరకు చాలామంది పరిశోధకులు తొలి తెలుగు నవలపై కొంత లోతుగానే చర్చించారు.

## 4.1.7 నవల యుగ విభజన

భారతదేశంలో జరిగిన స్వాతంత్ర ఉద్యమ ప్రభావం తెలుగు సాహిత్యం మీద కనబడుతుంది. దీని ద్వారా ఆంగ్ల సాహిత్య ప్రభావనికి ఉత్తేజితులైన భారతీయ రచయితలు అనేక సిద్ధాంతాలను, అనేక భావాలను ఆంగ్ల సాహిత్యం నుంచి సేకరించి జాతీయ సాహిత్యంలో ప్రతిబింబింపచేయాలనే ఉద్దేశ్యంతో రచనలు చేశారు. దాని ప్రతిఫలంగానే మనకు నూతన సృజనాత్మక రూపాలైన నాటకం, కథ, నవల మొదలైనవి తెలుగు సాహిత్యంలో కనిపిస్తాయి. దీనిలో భాగంగానే తెలుగులో కూడా తొలినవల వచ్చిన సంవత్సరంగా భావిస్తున్నా 1872 నుంచి నవలయుగం ప్రారంభం అవుతుందని చెప్పి, దీనిని ముదిగంటి సుజాతారెడ్డి నవలా సాహిత్యంలోని ఉన్న వైవిధ్యాలను బట్టి ఐదు రకాలుగా యుగవిభజన చేశారు.

1872 నుండి 1893 వరకు తెలుగులో తొలి తెలుగు నవలలకున్న 'రంగరాయ చరిత్ర', రాజశేఖర చరిత్ర అనే రెండు నవలలు మాత్రమే వచ్చిన విషయాన్ని తెలియజేస్తూ, ఇదే నవల యుగానికి **ఆరంభ యుగం (1872-1900)** గా పేర్కొన్నారు. విజ్ఞానచంద్రిక గ్రంథమాల, వేగుచుక్క గ్రంథమాల, సరస్వతి గ్రంథమాల, ఆంధ్రప్రచారిణి గ్రంథమాల, రామవిలాస గ్రంథమాల వంటివి నవలా సాహిత్యానికి ఎలా దోహదపడ్డాయో వివరిస్తూ, దీని తర్వాత కాలంలో సాంఘిక, చారిత్రిక, హాస్య, వ్యంగ్య, అపరాధ పరిశోధక నవలలు ఇంకా అనేక రకాల వైవిధ్యంతో తెలుగు నవలలు వికసించిన విధానాన్ని **వికాస యుగం (1900-1925)** అని రచయిత పేర్కొన్నారు. వికాసయుగంలో ముఖ్యంగా బెంగాలీ నవలలు తెలుగు నవలాకారులు స్ఫూర్తిదాయకంగా నిలిచాయన్నారు.

**కాల్పనిక యుగం(1925-1947)**లో కవులు ప్రాచీనకావ్యాల మీద, సంప్రదాయకవిత్వం మీద తిరుగుబాటును సాధించి హృదయస్పందనకు, ఆత్మానుభూతులకు ప్రాధాన్యమిచ్చి కవితలను, ఖండ కావ్యాలను రచయితలు రాయడం మొదలుపెట్టారు. ఈ కాలంలో విశ్వనాథ బాపిరాజు కవులై ఉండి కూడా నవలా రచనలు చేసినట్లుగా చెప్పారు

సుజాతారెడ్డి. ఇక **అభ్యుదయ యుగం (1947-1960)** గురించి తెలియజేస్తూ ఈ *"యుగంలో తెలుగు నవలా సాహిత్యంలో అభ్యుదయయుగం వచ్చింది. రచయితలు కూడా వివిధ సిద్ధాంతోద్దేశాలకు కట్టుబడి రచనలు చేశారు. కవిత్వంలో అభ్యుదయ కవిత్వం పేరుతో నూతనోత్తేజం వచ్చింది. అదేవిధంగా నవలా సాహిత్యంలో అభ్యుదయభావాలు ప్రవేశించినవి. అందుకని ఈ స్వాతంత్రానంతర కాలాన్ని నవల సాహిత్యంలో అభ్యుదయయుగం అని పిలవడం సమంజసం"* (తెలుగు నవలానుశీలనం,1991:77) అనే ఒక నిర్ధారణకు సుజాతారెడ్డి వచ్చారు. సిగ్మండ్ ఫ్రాయిడ్ మనో వైజ్ఞానిక సిద్ధాంతాలు, హేతువాదం, సమాజంలో వచ్చిన రాజకీయ, ఆర్థిక మార్పుల ప్రభావం ఈ యుగంలో వచ్చిన నవలలపై అధికంగా ఉన్నట్లు విశ్లేషించారు. 1950 తర్వాత ప్రచురణ సంస్థల ప్రోత్సహంతో అనేక మంది కొత్త నవలా రచయితలు ఈ కాలంలో తమ రచనలు ప్రారంభించారు.

**సమకాలీన యుగం (1960 నుండి నేటి వరకు)** లో నవల అనేక రకాల రూపాలు దాల్చిన విషయాన్ని ముదిగంటివారు ప్రస్తావించారు. 1960-70 దశకాల్లో వచ్చిన నవలల్లో ఎక్కువగా ప్రేమ, కులాంతర వివాహాలలో ఒడిదొడుకులు, ఉద్యోగస్తులు చాలిచాలని జీతంతో సంసారం వారి జీవన విధానంలో వచ్చిన మార్పులను, వారి వ్యక్తిత్వం వంటి వాటిని చిత్రించిన నవలలు అధికంగా వచ్చాయని వివరించారు. మొత్తంగా దీనిలో రెడ్డిగారు ఆలోచనాత్మకంగా చేసిన ఒక యుగవిభజన మనకు ఇందులో కనిపిస్తుంది. ముదిగంటి చేసిన ఈ నవల యుగవిభజన, 'నవలా వికాసం' గ్రంథంలో మొదలి నాగభూషణశర్మ చేసిన యుగవిభజనతో పోల్చి చూసినప్పుడు మనకు కొంతవరకు ఇద్దరిలో ఒకే రకమైన ఆలోచన ధోరణి కనిపిస్తుంది. వీరిద్దరూ నవల యుగ విభజనను ప్రారంభయుగం 1872తో మొదలుపెట్టగా, 1900 తరువాత కాలాన్ని సుజాతారెడ్డి వికాసయుగం అని చెప్పారు కానీ, నాగభూషణశర్మ ఇదే కాలాన్ని అనువాద యుగమని చెప్పగా, 1920 తర్వాత కాలాన్ని సుజాతారెడ్డి నవలల్లో వికాస యుగమని తేల్చారు. 1947 ఆ తర్వాత సమయాన్ని ముదిగంటి అభ్యుదయ యుగం అనగా శర్మగారు ఈ కాలాన్ని మనోవైజ్ఞానిక యుగమని మరోరకంగా కొత్త కోణంలో విశ్లేషించారు.

తర్వాత చివరిగా ప్రస్తుత కాలాన్ని 1960 నుంచి ఇద్దరు సమకాలీన యుగంగానే అంగీకరించారని చెప్పవచ్చు.

## 4.1.8 నవల లక్షణాలు

సాహిత్యంలో నవలల గురించి వాటి లక్షణాల గురించి ఇప్పటివరకు చాలా మంది చాలా భిన్నమైన అభిప్రాయాలను వెలిబుచ్చగా, తెలుగు నవలానుశీలనం గ్రంథంలో ముదిగంటి సుజాతారెడ్డి తన సాహిత్యనుభావంతో కొన్ని లక్షణాలను చెప్పారు. ఈ లక్షణాలు సార్వజనీనకంగా ఉండటంతో పాటు ఆధునిక సాహిత్య ప్రామాణాలానుకులమైన ఈ అభిప్రాయాలను క్రింది విధంగా ప్రస్తావించారు.

1) నవల ఇతివృత్తంలో వాస్తవికతతో పాటు కల్పన విమర్శ, వ్యాఖ్యానాలకు రచయిత చోటు ఇవ్వాలి. నవలలోని వాస్తవిక జీవిత చిత్రణకు ఒక సైద్ధాంతిక దృష్టికోణం, మానవ జీవిత రహస్యాల ఉద్ఘాటనం ఉండాలి. (131)

2) రచయిత తన ఉహాశక్తితో కథను, సంఘటలను పాత్రలను, సంభాషణలను కల్పన చేసి అవి నిత్యజీవితంలోనివి లాగా భాసింపజేయాలి.

3) నవలలోని భాష సరళ సులభంగా ఉండాలి. నవల యథార్థ జీవితాన్ని, నిత్య సంఘటలను వాస్తవిక దృష్టితో చిత్రించేది కాబట్టి భాష తదనుగుణంగానే ఉండాలి(160).

4) నవలలో సంభాషణలు ఒక ప్రధానాంగం. నవల ప్రధాన లక్షణం కథ చెప్పడం కావున సంభాషణకు కూడా ప్రాధాన్యత ఇవ్వాలి.

5) నవలా రచయిత తమ రచనలో పరోక్ష పద్ధతి (Direct or Descriptive method), ప్రత్యక్ష పద్ధతులను (Indirect or Dramatic method) సందర్భానుసారంగా అనుసారించాలి.

## 4.1.9 నవలల్లో ఇతివృత్త వైవిధ్యం-గుణాలు

ఆధునికమైన సాహిత్య ప్రక్రియల్లో 'నవల' విశిష్టమైనది. నవల విశాలమైన కాన్వాస్ కలిగి ఉండడం వల్ల ఎంత సంక్లిష్టమైన జీవణచిత్రణ అయినా చేయవచ్చు. నవల వచనంలో ఉండడంవల్ల ఎక్కువమంది చదువుకోగలరు. అర్థం చేసుకోగలరు. ప్రధానంగా నవల సామాజిక చిత్రణకు బాగా ఉపయోగపడుతుంది. అటువంటి నవలలను తెలుగు సాహిత్యకారులు భిన్న ఇతివృత్త నేపథ్యంలో చిత్రించారు. అలాంటి ఇతివృత్త నిర్మాణంలో కావాల్సిన గుణాల గురించి తెలుగు నవలానుశీలనంలో సుజాతారెడ్డి చర్చించారు. నవల ఇతివృత్తంలో మూడు గుణాలు తప్పక ఉండాలన్నారు. వాటిని విశ్వజనీనత(Universality), చిత్తరంజకత, సంభావ్యతగా పేర్కొన్నారు. నవలను ఏ ప్రాంతం వారైనా, ఏ జాతివారైనా చదివి లీనమయ్యేలా రాయటమే విశ్వజనీనత. కథావస్తువు పాయల్లో ఉత్కంఠను నిలుపుతూ చివరివరకు ఏకబిగిన చదివింపజేసేలా, నైతిక విలువలు బోధించేదిగా ఉండాలి. శైలి, సంభాషణలు, వర్ణనలు ఉండాలి. అదే చిత్తరంజకథ. మూడవ గుణం సంభావ్యత. సంఘటనలు, పాత్రలు నిత్యజీవితానికి సన్నిహితంగా, పాఠకులకు విశ్వాసం కలిగేలా ఉండాలి. సత్యదూరం, అభూతకల్పనలు, కృత్రిమత్వం అసంభావ్యాలుగా ఉంటాయి. సంభావ్యత అంటే వాస్తవికత. నవలలో కల్పితం తప్పదు, కానీ, అది పాఠకుల అనుభవానికి అందేదిగా ఉండాలి తప్ప ఊహాపోహలతో కూడుకొని ఉండకూడదు. పాశ్చాత్యులు కథావస్తువును నిబిడబంధం(Organic plot), శిథిల బంధం(loose plot) అని రెండుగా విభజించారు. ముదిగంటి ఇందులో వస్తు ప్రధానమైన నవల నిబిడబంధం అని, పాత్ర ప్రాధాన్యత గల నవల శిథిలబంధం అవుతాయంటారు.

నవల ఇతివృత్తం కథ గురించి చెబుతూ, నవలలో కథా కథనం ఒక ప్రధానమైన అంశం. కాని కథాకథనాన్ని ప్రధానంగా

1. Direct Method (రచయిత కథను చెప్పడం)

2. Autobiographical Method (పాత్ర చేత ఆత్మకథ రూపంలో కథను నడపడం)

3. Documentary Method (కథ డైరీలు, ఉత్తరాలు ద్వారా నడవడం)

అనే మూడు పద్ధతుల్లో జరగవచ్చనే ఒక శాస్త్రీయ వివరణలో చెప్పారు. ఏ రచయిత అయినా తన సిద్ధాంతానికి, నమ్మకానికి అనుగుణమైన ఇతివృత్తాన్ని ముందుగా ఎంచుకొని ఆ తర్వాత నవల రాస్తాడన్నది సాధారణ విషయం. నవలలో ఇతివృత్తం ఒకే కథగానూ ఉండవచ్చు లేదా రెండు మూడు కథల మిశ్రమంగానూ ఉండవచ్చు.

## 4.1.10 నవలల్లో కాల్పనికత (ఫాంటసీ)

ఒక రచయిత లేదా కవి తన రచనలో ఏ రకమైన వాస్తవ సంఘటలను తన రచనలో ప్రతిఫలింపజేసిన, వాటిలో ఎంతోకొంత అనివార్యంగా ఊహకల్పన లేదా కాల్పనికత అనేది వచ్చి చేరుతుంది. అది రచయిత ఆలోచనా విధానం, తనకున్న ప్రాపంచిక దృక్పథం, ఉపయోగించే ప్రతీకలు మొదలైన వాటిపైన ఆధారపడి ఉంటుంది. వీటి ప్రభావంవల్ల ఒక రచనలో ఉన్న వాస్తవికతకు, ఊహాకల్పనకు మధ్య భేదాలు చెరిగిపోతాయి. చివరికి రచన సారాంశంలో ఊహాకల్పన లేదా కాల్పనికత లేని సాహిత్య వాస్తవికత లేకుండా మారుతుంది. సాహిత్యంలో ఊహకల్పన లేదా కాల్పనికత వాస్తవికంగా ఉంటూనే అవాస్తవంగా కనిపిస్తుంది. కొన్నిసార్లు అవాస్తవికంగా వుంటూ వాస్తవికతను చూపిస్తుంది. దీన్నే అసలు వాస్తవికత అంటే *"Reality is just that a state of suspended tension between being and non - being, in which both being and non- being are unreal and only their incessant interaction, their becoming is real"* అంటాడు ఎర్నెస్ట్ ఫిస్చర్. (Ernest Fischer. 'The Necessity of Art') అందుకే కథల్లోనే కాదు నవలలో కూడా ఊహాకల్పన అవసరం అని తెలుపుతూ నవలలో వాస్తవికత పేరుతో కేవలం యథార్తను చిత్రించినట్లయితే నవల రక్తి కట్టదు. యథార్థంగా అనిపించే కల్పన నవలలో ఉండాలి. నవలలో వాస్తవికత, కల్పన రెండూ కావాలి. వాస్తవికతకు ఊహాకల్పన జతకూడితేనే రచన ఒక కళారూపంగా మారుతుందని వివరిస్తూ సుజాతారెడ్డి 'నవలల్లో ఫాంటసీ' అనే ఒక కొత్త అంశాన్ని పరిచయం చేశారు. *"సమకాలీన జీవితాన్ని వ్యక్తులను ఒక ఉద్దేశ్యంతో రచయిత తన ఊహాకల్పనను*

*ఉపయోగించి కళాత్మకంగా, సార్వకాలికంగా, సార్వజనీనంగా ప్రస్తుతీకరించబడేది నవల”* (తెలుగు నవలానుశీలనం,1991:171) అని అటువంటి నవలలో రచయిత రచనను అద్దంలో చూపినట్టుగా, కెమెరాతో తీసిన ఫోటోలాగా చూపిన అది కళాత్మకమైన రచన కాదు. నవలాకారుడు కవిలాగా సృష్టించేవాడు. నవలలో యదార్థ వ్యక్తుల జీవిత చరిత్రలను ఉన్నదున్నట్లు పెడితే అది ఒక చరిత్ర గ్రంథంలాగా అవుతుంది. వ్యక్తులకు సంబంధించిన సంఘటనలను ఉన్నది ఉన్నట్లు రాస్తే అది ఒక జర్నలిస్టు రాసే వార్తలగా తయారవుతుంది కాబట్టి నవలలో ఊహాకల్పనకు తప్పక చోటు ఉండాలి. అప్పుడే నవలా రాణిస్తుందని అంటారామె!

నవల వాస్తవికత విషయంలో రచయిత్రి ఒక రెండు ముఖ్య విషయాలను తెలియజేశారు.(తెలుగు నవలానుశీలనం:1991)

1. “సహజవాదం, హేతువాదం, వాస్తవికత, సామాజిక వాస్తవికతల పేర్లతో నవలల్లో యదార్థతకు పట్టం కట్టబడినా అది ఎక్కువ కాలం నిలువలేదు” (190)
2. “వాస్తవికత నవలకు ముఖ్య లక్షణంగా చెప్పినట్లయితే అవ్యాప్తి దోషానికి గురవుతుంది. ....ఉత్పత్తి ఆర్థిక సంబంధాలను చెప్తేనే నవలలో వాస్తవికతను పాటించినట్లవుతుంది అన్నట్లయితే పాక్షిక సమాజ చిత్రణలో నవల పరిమితమైన సీమలోనే వుండి పోతుంది”(191)

మానవ జీవితంలో అనేక రకాల పార్శ్వాలు ఉంటాయని, అలాగే మనిషి జీవితంలో, జీవన సంబంధాల్లో అనేక సంక్లిష్ట విషయాలున్న సంగతి తెలియజేస్తూ వీటన్నింటిని నవలాకారులు సరిగ్గా పట్టుకున్నప్పుడే అది అసలైన రచనగా మనగలుగుతుందనే పరిశీలన దృష్టి సుజాతారెడ్డిగారిలో కనిపిస్తుంది.

## 4.1.11 చలం విశృంఖలత్వం+విశ్వనాథ సంప్రదాయతత్త్వం=తెన్నేటి హేమలత

చలం, విశ్వనాథ సత్యనారాయణ, రచనల ప్రభావం హేమలతగారి రచనల్లో ఏ విధంగా ఉందో వివరించే ప్రయత్నం ముదిగంటి చేశారు. శరత్ బాబు నుంచి నవలా శిల్పాన్ని, చలం నుంచి భాష శైలిని అందుకున్నట్లు చేసిన ఒక కొత్త పరిశీలన మనకు రెడ్డిగారిలో కనిపిస్తుంది. ముదిగంటి లతలో కొంత కాల్పనిక కవుల భావుకతను గమనించిన విషయం అర్థమవుతుంది. హేమలత భావుకురాలు. ఆమె భావుకత కాల్పనిక కవుల భావుకతను పోలి ఉంది. కాల్పనిక కవుల్లోని స్వచ్ఛమైన ప్రేమ, స్నేహం, మార్మికతలు ఆమె నవలల్లో కనిపిస్తాయి. ముఖ్యంగా ఆమె 'మోహనవంశీ' నవలలో కాల్పనికత బాగా చోటు చేసుకుంది. లతలో అభ్యుదయవాదం కన్నా కాల్పనికత లక్షణాలు ఎక్కువగా కనిపిస్తాయన్నారు. హేమలత రచన స్వభావాన్ని "కాల్పనిక యుగంలోని చలంతో ఆమెకు ఎన్నో పోలికలు ఉన్నాయి. చలం కూడా స్త్రీని కేంద్రబిందువుగా చేసి నవలలు రాశాడు. చలం స్త్రీ స్వేచ్ఛ ప్రణయాన్ని చిత్రించాడు. లత కూడా చలం లాగానే స్త్రీ స్వేచ్ఛ, ప్రణయాన్ని చిత్రించింది. దాంతో హేమలత విమర్శకు గురి అయింది. చలం అంతర్యాన్ని గ్రహించనట్లుగానే లోకం హేమలత అంతర్యాన్ని గ్రహించలేదు. లత స్త్రీ స్వేచ్ఛ ప్రణయాన్ని చాలా నవలల్లో చిత్రించిన ఆమె అంతరాంతరాల్లో భారతీయ మూలాలను ప్రేమించింది. పాశ్చాత్య సంస్కృతిని అరువు తెచ్చుకోవడం నిరసించింది" అని చెప్పారు. తెన్నేటి హేమలత రాసిన నవలల్లో ముగింపు సంప్రదాయతత్త్వంతో రాసే విశ్వనాథగారి నవలలను అనుకరించినట్లు ఉంటాయన్నారు. ఎలాగైతే చలం తెలుగు సాహిత్య రంగంలో ఎలాంటి మాటలు ఎదుర్కొన్నాడో అలాంటి అనుభవాలనే అదే రంగంలో కృషిచేస్తూ లతకూడా పడిన విషయాన్ని ఈ సందర్భంగా మరోసారి తెలియజేశారు ముదిగంటి సుజాతారెడ్డి.

దీనిలో భాగంగా ముదిగంటి సుజాతారెడ్డి హేమలత గురించి కొన్ని విషయాలు ఆవిష్కరించారు. అవి

- లత నవలలు గమనించినట్లయితే విశ్వనాథ సత్యనారాయణను తలపిస్తాయి. అటువంటి చోట్ల లత విశ్వనాథ అభిమానిగా కనిపిస్తుంది. అందుకేనేమో విశ్వనాథ అంశ ఆమెమీద ఉండడంచేతనేమో లత "రామాయణ విషవృక్ష ఖండన" రాసినట్లు తెలుస్తోంది.
- చలం భావుకత, మార్మికత, భక్తి, ప్రేమ, స్వేచ్ఛలూ, విశ్వనాథ సంప్రదాయం, కర్మవాదం ఈ రెండు లతలో చోటు చేసుకుని ఆమె అంతరంగంలోనే కాదు తన వర్ణనల్లో ఒక ఘర్షణను సృష్టించాయి.
- స్త్రీ వాదం వాసనలు ఇంకా ప్రసరించని రోజుల్లో స్త్రీ లైంగిక స్వేచ్ఛను, స్త్రీ స్వేచ్ఛను ప్రతీకగా వర్ణించి చెప్పింది లత.

తెలుగు నవలానుశీలనం అనే ఈ విశ్లేషణాత్మక గ్రంథంలో ముదిగంటి సుజాతారెడ్డి, నవల అనే పదం పుట్టుక, అవిర్భావం నుండి 'ఇంగ్లీష్ నవలా వికాసం', 'పాశ్చాత్య నవల ములాబీజాలు', 'నవల స్వరూప స్వభావాలు' నవల వాస్తవికత వంటి విభిన్న అంశాలతో తెలుగు నవలా సాహిత్యాన్ని మొత్తంగా ఒక్కసారి సింహావలోకనం చేశారు. ఈ గ్రంథంలో ప్రత్యేకంగా ఒక నవల గురించి చర్చించకపోయినా, తెన్నేటి హేమలత విషయంలో చలం, విశ్వనాథ గురించి కొంత ప్రత్యేకంగా విశ్లేషించినట్లుగా తెలుస్తుంది.

ఏదైనా విమర్శలో సాధారణంగా శిల్ప దృష్టియో, వస్తు దృష్టినో ఉంటుంది. కానీ, రచనలో ఏం చెప్పారన్న విషయానికి ప్రాధాన్యం ఇస్తూ సాగే వస్తు దృష్టితో చేసే విమర్శనే తెలుగు నవలా విమర్శలో కొంత ఎక్కువగా కనిపిస్తుంది. శిల్పదృష్టితో చేసిన అనుశీలన నవలా ప్రక్రియతో పోల్చితే మిగతా ప్రక్రియల్లో అధికంగా జరిగింది. ఎన్. వేణుగోపాల్(నవలాసమయం) కాత్యాయనీ విద్మహే, వరవరరావు వంటివారు భౌతికవాద దృక్పథంలో వస్తువును కేంద్రంగా చేసుకుని నవలలను పరిశీలించారు. వల్లంపాటి వెంకటసుబ్బయ్య, ముదిగొండ వీరభద్రయ్య, ముదిగంటి సుజాతారెడ్డి, మాదిరాజు రంగారావు,

నవీన్ లాంటివారు వస్తు విమర్శతోపాటు శిల్ప విమర్శకుకూడా తమ రచనల్లో తగిన ప్రాధాన్యతనిచ్చారు.

## 4.2 వ్యాస విమర్శలో ముదిగంటి సుజాతారెడ్డి

వ్యాసం అంటే ఏదైనా ఒక విషయాన్ని వివరించడం, విస్తరించడం అనే సామాన్య అర్థాలున్నాయి. వ్యాసం అనే దాన్ని ఆంగ్లంలో 'essay' అనే అర్థంలో వాడుతున్నారు. 'వ్యాసం' పాశ్చాత్య సాహిత్యం ప్రభావం వల్ల ఏర్పడిన ఒక సాహిత్య ప్రక్రియ. ''వ్యాసము'' అనగా ''ఏదేని విషయంపై విరివిగా వ్రాయుట'' అని 'శబ్దరత్నాకరము' నిఘంటువులో ఉంది. ఆంగ్ల వాఙ్మయ ప్రభావంతో ఏర్పడిన తెలుగులో వ్యాస ప్రక్రియ అనేక రూపాల్లో విస్తరించింది. ఉపన్యాసం, సంగ్రహం అనే పేర్లతో కూడా వ్యాసాన్ని పిలిచేవారు. సామినేని వారు రాసిన 'హితసూచని' గ్రంథాన్ని వ్యాస ప్రక్రియలో మొదటిదిగా విమర్శకులు భావిస్తారు. కానీ, తెలుగు వ్యాస ప్రక్రియలో పానుగంటి లక్ష్మీనరసింహరావు రాసిన 'సాక్షి వ్యాసాలు' చాలా ప్రసిద్ధి చెందాయి. కందుకూరి వీరేశలింగం పంతులు తన వివేకవర్ధిని పత్రికలో వ్యాస ప్రక్రియను సాంఘిక సంస్కరణ కోసం ఒక ఆయుధంగా వాడుకున్నారనుకోవచ్చు. కట్టమంచి రామలింగారెడ్డి 'వదరుబోతు వ్యాసాలు' రాయగా, సురవరం ప్రతాపరెడ్డి, నార్ల వంటి వారు సంపాదకీయ వ్యాసాలు రాశారు. ఇక ఆధునిక కాలంలో కొలకలూరి ఇనాక్ వ్యాస ప్రక్రియపై "తెలుగులో వ్యాస పరిణామం" పేరుతో వ్యాస ప్రక్రియ గురించి ఒక సమగ్రమైన పరిశోధన చేశారు. వ్యాసం-సాహిత్య విమర్శా వ్యాసం కావడం ఒక సహజ పరిణామం. సాహిత్యావగాహనను పెంచడం విమర్శ ఉద్దేశ్యం. ఆ పనికి తోడ్పడే రచన ఏ రూపంలో ఉన్నా అది విమర్శగా పరిగణించవచ్చు. కొన్నిసార్లు సరైన సమీక్ష, మంచి పీఠిక కూడా విమర్శచ్ఛాయతో కనిపిస్తాయి. తెలుగులో కె.వి. రమణా రెడ్డి, రా.రా. వంటి కొందరు ఉత్తమస్థాయి విమర్శతో కూడిన వ్యాసాలు రాశారు. విమర్శ గురించిన వివేచనకు పూనుకున్న చాలామంది ప్రసిద్ధ విమర్శకులు పీఠికలను, విశ్లేషణ వ్యాసాలను కూడా విమర్శగానే

వ్యవహరించడం గమనించవచ్చు. ఇంత వైవిధ్యభరితంగా ఉన్న వ్యాస ప్రక్రియలో కూడా విమర్శ రాసి ముదిగంటి సుజాతారెడ్డి విమర్శలో తనకున్న ప్రతిభను నిరూపించుకున్నారు.

నవల, కథ, ప్రాచీన సాహిత్య విమర్శ, యాత్ర చరిత్రలు వంటి అనేక సాహిత్య ప్రక్రియల్లో అనుభవమున్న ముదిగంటి సుజాతారెడ్డి 'అద్యతన దృష్టి' పేరుతో రాసిన సాహిత్య విమర్శ సంపుటిలో అనేక విమర్శ వ్యాసాలున్నాయి. సుజాతారెడ్డి వివిధ సందర్భాల్లో రాసిన వ్యాసాలలో ఉత్తమమైన 30 వ్యాసాలను తీసుకుని పుస్తకంగా ప్రచురించి వ్యాస ప్రక్రియలో తనకున్న విమర్శనా నైపుణ్యాన్ని తెలియచేశారు. ఈ పుస్తకంలో '300 సినిమా సామ్రాజ్యవాద వికృతరూపం' అనే వ్యాసం తప్ప మిగతా అన్ని సాహిత్య విమర్శ వ్యాసాలే. అద్యతన దృష్టిలో కొన్ని ముస్లిం, స్త్రీవాద సాహిత్యాన్ని విశ్లేషించేవి ఉండగా, మరికొన్ని వ్యాసాలు తెలంగాణ ప్రాంత సాహిత్యానికి సంబంధించినవి. మిగతావి సమకాలీన అస్తిత్వకోణంతో రాసినవి. సుజాతారెడ్డిగారి గురించి చెబుతూ *"వీరి అద్యతన దృష్టిలోని సహిష్ణుతాపార్శ్వం. ఉద్యమాలూ, పోరాటాలూ వాదాలూ వేదనలూ-వీటి స్పృహతో రచించిన వ్యాసాలలో వాటి జయాపజయాలను మదింపు వెయ్యడంలో నిష్పాక్షికతా గుణం, ప్రాంతీయ చైతన్యం, సామ్రాజ్యవాదం, ప్రపంచీకరణ-వీటి నేపథ్యంలో రూపొందిన వ్యాసాలలో విచక్షణతా లక్షణం-అంతే స్పష్టంగా కనిపిస్తాయని"* అద్యతన దృష్టి' గ్రంథానికి ముందుమాట రాసిన బేతవోలు రామబ్రహ్మం చెప్పిన మాటలు సుజాతారెడ్డిగారి విమర్శనా దృక్పథానికి అద్దం పడతాయి. ఇక ముదిగంటిగారి సంపాదకత్వంలో వచ్చిన 'ముద్దెర' గ్రంథంలో కూడా రాసిన కొన్ని వ్యాసాలలో తెలంగాణ ప్రాంత సాహిత్యాన్ని ఒక అస్తిత్వవాద కోణంలో విశ్లేషించారు. తెలంగాణ సాహిత్యంలో విభిన్న కోణాలను పరిచయం చేసిన ఈ పుస్తకంలో కాసుల ప్రతాపరెడ్డి, జూలూరి గౌరీశంకర్, గుడిపాటి, నందిని సిధారెడ్డి వంటి తెలంగాణ ప్రాంత రచయితలతో కూడిన 14 వ్యాసాలున్నాయి. అస్తిత్వవాద మౌలిక భావనకు కావాల్సిన స్పృహ, చైతన్యంతో కూడిన ఒక ఎరుకను వీరు ఈ వ్యాసాల ద్వారా విశ్లేషించారు. ముదిగంటి

ముద్దెరలో రాసిన ఐదు విమర్శ వ్యాసాలలో తెలంగాణ ప్రాంత సాహిత్య విమర్శకు కావాల్సిన ఒక బలమైన పునాదిని అందించారు.

## 4.2.1 విశిష్టతత్త్వం-స్పర్శ సిద్ధాంతం

స్పర్శ అంటే తాకిడి. ఇది జ్ఞానేంద్రియాలలో ఒకటైన చర్మం ద్వారా జరిగే ఒక అనుభూతి. ఇది నాడీ వ్యవస్థ (Nervous system)లో ఒక భాగం. కళ్ళు లేనివారు సైతం స్పర్శ వల్ల జ్ఞానాన్ని పొందగలుగుతున్నారు. అనగా వారికి చర్మం, ఒకరకంగా కళ్ళువలె పనిచేస్తుందని చెప్పవచ్చు. ఆ తల్లి హృదయ స్పందనకు అలవాటు పడిన ఆ శిశువు తన తల్లిస్పర్శ తనకు తగలగానే తగిన రక్షణ పొందానని భావించి ఊరడిల్లుతాడు. అటువంటి స్పర్శలో మమకారం, సంతోషం, ఆనందం, ప్రేమ, సుఖం, ఆప్యాయత వంటి గుణాలు దాగి ఉన్నవని చెప్పడానికి ఇది ఒక తార్కాణం. ఇది మానవుల నుండి మానవులలో మాత్రమే కాకుండా ప్రకృతిలో ఉండే సకల జీవుల్లో కలిగే ఒక సహజ ప్రక్రియ. ఈ స్పర్శను ఆధారంగా చేసుకొని మన సాహిత్యంలో అనేకమంది కవులు తమ కావ్యాల్లో, కవిత్వం, కథల్లో వంటి అనేక చోట్ల దీన్ని గురించి ప్రస్తావించారు. అయితే విశ్వనాథ తన నవలల్లో ప్రాచీన కవుల ప్రణయ వర్ణనలు, అభిప్రాయాలు, సిద్ధాంతాలు ప్రతిఫలింపజేయటం వారి ప్రత్యేకత. అటువంటి ప్రాచీన కవుల సిద్ధాంతాల్లో 'స్పర్శ సిద్ధాంతం' సత్యనారాయణగారిని బాగా ఆకర్షించిందని అందుకే అయన ఏకవీర, వేయిపడగలు, తెరచిరాజు నవలలో ప్రవేశపెట్టి ఆ స్పర్శతత్త్వాన్ని అనేక సందర్భాల్లో వర్ణించారని ముదిగంటి సుజాతారెడ్డి 'విశ్వనాథ–భవభూతి' అనే వ్యాసంలో సోదరహరణంగా వివరించే ప్రయత్నం చేశారు.

స్పర్శకు సంబంధించిన ప్రస్తావన మనకు మొదట వ్యాసమహర్షి రాసిన మహాభారతంలో కనిపిస్తుంది. శకుంతలోపాఖ్యనంలో శకుంతలకు–దుష్యంతునికి మధ్య యువరాజు పట్టాభిషేకం కోసం జరిగిన సంవాదంలో దుష్యంతుడు తమను గుర్తించకపోవడంతో శంకుతల దుష్యంతుడు తన భర్తని నిరూపించడానికి ఆశ్రమ ధర్మాల్లో గృహస్తాశ్రమధర్మాన్ని, గృహిణి ప్రాధాన్యతను, కుమారుని గొప్పతనాన్ని గురించి ఎన్నో

విధాలుగా తెలియపరుస్తుంది. కానీ, దుష్యంతుడు అందుకు ఒప్పుకోలేదు. అప్పుడు శకుంతల స్పర్శసిద్ధాంతాన్ని నమ్మి, తన కుమారుని స్పర్శ వల్ల కలిగే సుఖం ద్వారా సత్యాన్ని తెలుసుకొంటాడని చెప్పడానికి క్రింది మాటలు మాట్లాడుతుంది.

**మ. విపరీతప్రతిభాష లేమిటికి నుర్వీనాథ! యీ పుత్త్రగా**
**త్రపరిష్వంగసుఖంబు సేకొనుము ముక్తాహార కర్పూర సాం**
**ద్రపరాగ ప్రసరంబుఁ జందనముఁ జంద్రజ్యోత్స్నయుం బుత్త్రగా**
**త్రపరిష్వంగమునట్లు జీవులకు హృద్యంబే కడున్ శీతమే.**

**(ఆ.మ.భా.ఆది.చతుర్థా. 13)**

తర్వాత శకుంతల కథని “అభిజ్ఞానశాకుంతలం” నాటకంగా మలిచాడు కాళిదాసు. ఈ నాటకంలో కాళిదాసు కొంత స్పర్శ విశిష్టతను తెలియజేశాడు. దీన్ని ఆధారంగా చేసుకుని భవభూతి తన ఉత్తర రామచరిత్ర నాటకంలో స్పర్శ సిద్ధాంతాన్ని మరింత విశదీకరించాడని ముదిగంటి వివరించారు. భారతీయ సంస్కృతిలో భాగమైన దాంపత్య ధర్మం, కుటుంబ వ్యవస్థ మీద అధిక గౌరవమున్న విశ్వనాథ సహజంగానే భవభూతి రాసిన ‘ఉత్తర రామచరిత్ర’ చేత ప్రభావితం చెందాడన్నారు. అందుకే విశ్వనాథ ఏకవీర, చెలియలికట్ట, తెరచిరాజు వంటి నవలల్లో భవభూతి వర్ణించిన స్పర్శతత్త్వాన్ని ప్రవేశపెట్టాడని రెడ్డి అభిప్రాయపడ్డారు. స్పర్శ ఒక విశిష్టమైన తత్త్వం. దాన్ని ఒక సిద్ధాంతంగా భవభూతి ఉత్తరరామ చరిత్రలో రూపొందించాడు. అందుకే విశ్వనాథ వేయిపడగలు నవలలో స్పర్శ సిద్ధాంతాన్ని తీసుకుని చేసిన వర్ణనలను వాటి ఉదాహరణలను ముదిగంటి ఈ సందర్భంగా విశ్లేషించారు.

“*విశ్వనాథ భవభూతి స్పర్శతత్త్వంతో పూర్తిగా ప్రభావితుడైనాడు. భారతీయ సంస్కృతి సారమంతటినీ ఆ స్పర్శ సిద్ధాంతంలో దర్శించాడు. భారతీయుల దాంపత్య ధర్మాన్ని ఈ స్పర్శ సిద్ధాంతాన్ని తీసుకుని వ్యాఖ్యానించాడు విశ్వనాథ*”(అద్యతన దృష్టి,2014:30) అని విశ్వనాథ స్పర్శ సిద్ధాంతాన్ని నమ్మడానికి గల మౌలిక కారణాన్ని విశ్లేషించారు. విశ్వనాథ సత్యనారాయణగారి ‘వేయి పడగలు’ వంటి నవలల్లో పాత్రలు చాలా వరకు ప్రతీకలను ఆధారంగా చేసుకుని సృష్టించినవే. ప్రధాన పాత్రలైన అరుధంతీ, ధర్మారావులు విశ్వనాథ నమ్మే

దాంపత్య ధర్మానికి ప్రతీకలు. ఏకవీర నవలలో ఏకవీర–వీరభూపతిల మధ్య జరిగిన సన్నివేశంలో ఏకవీరకు స్పర్శవల్ల కలిగిన తన్మయ స్థితిని

*"సంతాపజాం సపదియం పరిహృత్య మూర్ఛం*

*ఆనందనేన జడతాం పునరాతనోతి"*

విశ్వనాథ భవభూతి మాటలను తీసుకుని వర్ణించినట్లు సుజాతారెడ్డిగారన్నారు. విశ్వనాథ వారు తన 'తెరచిరాజు' నవలలో స్పర్శను అనేక రకాల పరీక్షలకు గురిచేసి అసలు స్పర్శ సిద్ధాంతానికి తనదైన ఒక కొత్త వాఖ్యాన్నాన్ని అందించారని ముదిగంటి విమర్శించారు. కుటుంబ వ్యవస్థ, దాంపత్య ధర్మం వీటిని ఆధారంగా చేసుకుని ఉండే హిందూ సంప్రదాయం, సంప్రదాయ వాదం కేంద్రంగా చేసుకుని రచనలు చేసే విశ్వనాథ వారు భవభూతి రాసిన ఉత్తర రామచరిత్రతో లీనమై స్పర్శ సిద్ధాంతాన్ని ఆధారంగా చేసుకున్నారు. అందుకే వేయిపడగలు. ఏకవీర, తెరచిరాజు, చెలియలికట్ట వంటి అయన నవలల ద్వారా సంస్కృతీ, సంప్రదాయాల పరిరక్షణ కొరకు స్పర్శ సిద్ధాంతాన్ని దాని విశిష్టతను తెలియజేయడానికి పరోక్షంగా ప్రయత్నించారు.

## 4.2.2 కన్యాశుల్కం-ఉర్దూ ప్రభావం

కన్యాశుల్కం నాటకం తెలుగు వ్యావహారికానికి పట్టం కట్టింది. అలాగే, తెలుగులో కలసిపోయిన అనేక అన్యభాషా పదాలూ ఈ నాటకంలో కనపడతాయి. గురజాడ కాలం నాటికి ఉత్తరాంధ్ర ప్రాంతాన్ని ముస్లిం నవాబులు పాలించేవారు. కన్యాశుల్కాన్ని అంకితం పుచ్చుకున్న విజయనగర సంస్థానాధీశుడికి 'మాన్య సుల్తాన్' అనే బిరుదు కూడా ఉండేది. వీటన్నిటి ప్రభావంతో ఉర్దూ పదాలు తెలుగుతో మిళితమైపోయాయి. ఈ ఉర్దూ పదాలు ఎక్కువగా గిరీశం, రామప్పంతులు సంభాషణల్లోనూ, సౌజన్యారావు మాటల్లోనూ కనిపిస్తాయి. కన్యాశుల్కం వ్యావహారిక భాషలో రాసిన మొదటి సాంఘిక నాటకంగా గుర్తిస్తారు. కన్యాశుల్కం నాటకంలో వాడుక భాషకాక, మాండలికాలు, జాతీయాలు, సామెతలు, పాత్రోచిత సందర్భంగా చేసిన ప్రయోగాలు కూడా ఉన్నాయి. ముఖ్యంగా రాజభాష పరిపాలనా భాష కావడంతో పాలనా రంగంలో తద్వారా ప్రజల భాషలో అనేక ఉర్దూ పదాలు

చోటుచేసుకున్నాయని వీటి ప్రభావం గురజాడ అప్పారావుగారి కన్యాశుల్కం నాటకం మీద ఉందని నాటకంలో వివిధ సంభాషణల్లో చోటుచేసుకున్న పదాలను వాటి వివరణను 'కన్యాశుల్కంలో ఉర్దూ ప్రభావం' అనే వ్యాసంలో విశ్లేషించారు ముదిగంటి సుజాతారెడ్డి.

## 4.2.2.1 కన్యాశుల్కంలో వివిధ ఉర్దూ పదాలు

### ఉర్దూ పదాలు–పట్టిక

కన్యాశుల్కం నాటకంలో ఉన్న ఉర్దూ పదాలను ముదిగంటి సుజాతారెడ్డి వారి వ్యాసంలో భాగంగా విశ్లేసించారు. వాటిని ఒక పట్టిక రూపంలో కింద పొందుపరుస్తున్నాను.

| సంభాషణ | ఉర్దూ పదం | అర్థం |
|---|---|---|
| 1. 'ఏటు చూసినా అందరకీ బాకీలే'(ప్ర. ఒకటవ స్థలం) | బాకీ | అప్పు |
| 2. 'ఏం చేయగల్గుదునని నీకు భారువసా చెప్పను?'(ద్వి) | భారువసా | భరోసా |
| 3. 'భూములు తణఖా అన్నమాట శుద్ధ అబద్ధం' (తృ) | తణఖా | తాకట్టు |
| 4. 'అది మట్టుకు నా బనాయింపు కాదు'(తృ) | బనాయింపు(బనేగా) | తయారుచేయడం |
| 5. 'మెత్తగా మాట్లడుతున్నానని కాబోలు ఆనాడీ చేస్తున్నారు'(చ) | ఆనాడీ | మూర్ఖుడు |
| 6. 'ప్రాణం బచాయిస్తుంది'(చ) | బచాయించడం | బతికిపోవడం |

| | | |
|---|---|---|
| | | |
| 7. 'సంసారం పోక్తుగా చేసుకుంటే పిసిరిగొట్టా?' (చ) | పోక్తు (పొఖ్తా) | 'గట్టి'(బాగా,చక్కగా అనే అర్థం) |
| 8. 'యేమటి బేహాద్బీ!'( చ) | బేహాద్బీ(బే ఆదబీ) | అమర్యాద ప్రవర్తన |
| 9. 'నేను లేనిది యీ వ్యవహారం ఎలా ఫైసలు చేశావు?'(చ. నా. స్థలం) | ఫైసలు | డబ్బులు |
| 10. 'మనమిద్దరం స్వర్గంలో మజా వుడయిద్దాం' (చ. ఐదవ స్థలం) | మజా | సంతోషం |
| 11. 'అలాగైతే నాతో రావడం ఖాయమేనా?'( చ) | ఖాయం | నిశ్చయం |
| 12. 'అందులో సాంది ఖాయిదాగా ఉండాలనుకోవడం మరి బుద్ధి తక్కువ'(ప) నీతి | ఖాయిదా | నియమం |
| 13. 'నా మాట కొంచెం ఖాతర్ చెయ్యండి' (ష) | ఖాతార్ | గౌరవం |
| 14.'పరార్ అయిపోయిన' (స) | పరార్ | పారిపోవడం |
| 15.నీ మీద అభిమానం పెట్టుకు దేవులాడుతున్నాను'(స) | దేవులాడటం | వెతుకులాడటం |

కన్యాశుల్కంలో ఇంకా బిచాణా, తడాఖా, చేమ్దా,ఫైసల్, మజా, మగుదూర్, చాడీకోర్, కబుర్లు, హమేషా, ఖబర్దార్, తరిఫీదు, తర్జుమా, ఖతార్, జాంతేనయ్, పూరా, జల్దీ, తరిఫిద్, శభాస్, మహలులు, బగీచాలు, నౌఖర్, ఖాయిదా, దౌడయించి, ఖాయం, కూనీ, జుర్మానా, జరూరు వంటి అనేక పదాలున్నట్లు ముదిగంటి వ్యాసంలో వివరించారు.''తెలుగు భాషలో ప్రథమశ్రేణిలో నిలిచే పది పుస్తకాలలో కన్యాశుల్కానికి ప్రథమస్థానం ఇస్తాను. ప్రపంచపు నూరు గొప్ప పుస్తకాల్లో కన్యాశుల్కం ఒకటి. ఈ నాటకానికి సాటిరాగల రచన భారతీయ సాహిత్యంలో మృచ్ఛకటికం తప్ప మరోటి లేదు'' అన్న శ్రీశ్రీ మాటలు తెలుగు సాహిత్యంలో కన్యాశుల్కానికి ఉన్న విశిష్టతను తెలియజేస్తున్నాయి. కన్యాశుల్కంలో నాటకంలో వస్తువు సంఘసంస్కరణ. సంఘసంస్కరణోద్యమం నడుస్తున్న నడకను వస్తువుగా చేసుకొని, దాని బాహ్యేతర ప్రవృత్తుల వాస్తవాలను విమర్శనాత్మకంగా చెప్పి, దాని ద్వారా సమాజ ఆలోచనల్లో మార్పు కోసం గురజాడ కన్యాశుల్క నాటకాన్ని రాసారు. అటువంటి నాటకంలో ఉర్దూ భాష ప్రభావం ఎంతగా ఉందో, సామాజికపరమైన పరిశీలన కాకుండా భాష పరమైన అనుశీలనతో కన్యాశుల్కాన్ని పరిశీలించడంలో ముదిగంటి సుజాతారెడ్డి ఈ వ్యాసం ద్వారా కృతకృత్యులయ్యారు.

ముదిగంటి సుజాతారెడ్డిగారి రచనల్లో ఎన్నో భాషాపదాలు కనిపిస్తాయి. అంతే కాకుండా ప్రజల నిత్యావసరంలో ఉన్న అనేక తెలంగాణా భాషా పదాలను సుజాతారెడ్డి సేకరించారు. ఆ సేకరణ ఫలితమే 'తెలంగాణా వ్యవహార పదకోశం'(2018) గ్రంథం. తెలంగాణ ప్రాంతం ముస్లిం నవాబుల పాలన వల్ల ఉర్దూ ప్రభావానికి లోనయింది. అందుకే తెలంగాణ పదకోశంలోని అనేక ఉర్దూ పదాల సేకరణ, ఆమెలో నిరంతరాయంగా భాషా మీద ఉన్న సుదీర్ఘ పరిశీలన ఫలితమేనని మనకు ఈ వ్యాసం ద్వారా స్పష్టమవుతుంది.

### 4.2.3 సినిమా 'సామ్రాజ్యవాదం'

నేటికాలంలో సామాన్య ప్రేక్షకుల ఆలోచనా సరళిపై సినిమాల ప్రభావం చాలా ఎక్కువగా ఉంటుంది. సినిమా అనే ఒక మాధ్యమం నేడు సమాజ గమనాన్ని దాదాపు నిర్దేశించే స్థాయిలో ఉందనడం అతిశయోక్తి కాదు. కొన్ని దేశాలు అలాంటి సినిమాల ద్వారా ఆధునికమైన రాజకీయ అంతర్గత కక్ష తీర్చుకోవడానికి ప్రయత్నిస్తున్నారు. ముఖ్యంగా సామ్రాజ్యవాదపు ఆలోచనకు వాటి విధానాలను అమలు చేసే అమెరికా, యూరప్ వంటి సామ్రాజ్యవాదపు దేశాలు నిర్మించే కొన్ని సినిమాల్లో ఇటువంటి పోకడలు ఉన్నట్లు ముదిగంటి సుజాతారెడ్డి '300' అనే సినిమాపై  ప్రజాతంత్ర పత్రికలో రాసిన విశ్లేషణ వ్యాసంలో విమర్శించారు. సామ్రాజ్యవాదం అంటే ఆర్థిక ఆధిపత్యమే లక్ష్యంగా సామ్రాజ్య విస్తరణ చేయడం. దీన్నే ఆంగ్లంలో 'ఇంపిరియలిజం' అంటారు. సామ్రాజ్యవాదం పెట్టుబడిదారీ విధానం యొక్క అత్యున్నత స్థాయిగా 'లెనిన్' తెలియజేశాడు. దీనిని చాలా మంది అంగీకరించారు. ఇలా ఆధిపత్యపు పోకడలు హాలివుడ్ లో  తయారయ్యే సినిమాల్లో ఉన్నట్లు ముదిగంటి అభిప్రాయపడ్డారు. '300' అనే సినిమా రెండు దేశాల మధ్య జరిగే ఒక యుద్ధాన్ని ఆధారంగా చేసుకుని వచ్చిన ఒక చారిత్రక సినిమా. ఈ సినిమాలో 300 మంది వీరులు పర్షియన్ సైన్యాన్ని ఎదుర్కున్న తీరుని చూపించారు.

కానీ, అప్పటి పర్షియా, ఇప్పటి ఇరాన్ దేశం మీద అమెరికా మొదటి నుండి చమురు కోసం ఇరాన్ తో అనేక రకాలుగా యుద్ధం చేస్తూనే ఉంది. వారి అంతర్గత విషయాల్లో జోక్యం చేసుకుంటూ, అమెరికా తన సైన్యాలతో ఎన్నో రోజుల నుండి వారి మీద దాడి చేయిస్తూనే ఉంది. ఇదే రాజకీయ కక్షను 300 సినిమాలో ముఖ్యంగా 'ఓరియంటల్స్' మరియు ఓరియంటల్ సంస్కృతిని కించపరిచారని సుజాతారెడ్డిగారన్నారు. అంతేగాక ఈ సినిమాలో పర్షియన్ సైన్యాన్ని, సైన్యాధిపతులను 'క్జెరెక్జెస్' అనే రాజు పాత్రను కేవలం అనాగరికులుగా "బార్ బేరియన్స్"గా చిత్రించారని ముదిగంటి విశ్లేషించారు. సినిమాలో చూపించిన అనేక

సంభాషణల్లో 'ఓరియంటల్' స్త్రీలకు సమాజంలో ఆస్తిత్వం లేదని చెప్పే ప్రయత్నం చేశారన్నారు.

ఇలాంటి నేపథ్యంలో హాలీవుడ్ లో అనేక సినిమాలు వచ్చాయి. సామ్రాజ్యవాదపు దుర్మార్గపు ధోరణిని చూపించే మరో సినిమా 'పపియోన్' సినిమా (పాపిలాన్ కానీ, ఉచ్చరణ పపియోన్). 20 శతాబ్దపు తొలిరోజుల్లో ఫ్రెంచ్ వంటి యురోఫియన్ వంటి దేశాలు సామ్రాజ్యవాద కాంక్షతో తమ దేశపు ఖైదీలను ఏ విధంగా ఉపయోగించుకున్నారో చూపించారు. వాస్తవిక అనుభవాల ద్వారా రాసిన ఒక నవల ఆధారంగా ఈ సినిమాను రూపొందించడం జరిగింది. ద్రవ్య పెట్టుబడి విశ్వరూపాన్ని నమూనా మాత్రంగా చూడాలంటే 'ద ఇంటర్నేషనల్' అనే ఒక హాలీవుడ్ సినిమా చూడొచ్చు. ''*కళ సరియైన ప్రయోజనం సాధించకపోయినా, ప్రజలకు దూరమైపోయినా, ప్రజలను మాయోపాయాలతో మభ్యపెట్టినా సరియైన విమర్శ ద్వారా ఈ లోపాల్ని చక్కబరచవచ్చు. విమర్శ వల్ల కళలు తమ బాధ్యతను గుర్తించగలుగుతాయి''* అని ప్రసిద్ధ కథా రచయిత కొడవటిగంటి విమర్శ మీద వ్యక్తం చేసిన అభిప్రాయం ముదిగంటి సుజాతారెడ్డి వంటి విమర్శకులలో సమంజసమనిపిస్తుంది. తెలుగు సాహిత్యకారులు ముఖ్యంగా విమర్శకులు సినిమా సాహిత్యంపై అనుశీలన చేయడం తక్కువగానే కనిపిస్తుంది. ఇలాంటి అరుదైన వ్యక్తులలో సుజాతారెడ్డి ఒకరు. సమాజ శ్రేయస్సును దృష్టిలో ఉంచుకొని సినిమాలపై ఇలాంటి విమర్శానాత్మక వ్యాసాలు రావడం వల్ల భవిష్యత్ లో మరిన్ని అర్ధవంతమైన సినిమాలు రావడానికి అవకాశం ఉంది.

## 4.2.4 రాచపాళెం 'చర్చ' పై ఒక చర్చ

గత నలభై సంవత్సరాలుగా కథ, కవిత్వం, నవల ఇలా అన్ని సాహిత్య ప్రక్రియలపై విమర్శా రంగంలో కృషి చేస్తూనే ఉన్నవారు రాచపాళెం చంద్రశేఖర్ రెడ్డి. సంస్కృత అలంకారశాస్త్రంలో రచనలు మొదలుపెట్టి మార్క్సిస్ట్ సాహిత్యం వైపు ప్రయాణం చేసిన సాహిత్యకారుడు. ఆధునిక సాహిత్య విమర్శ ధోరణులను బాగా అర్థం చేసుకుని తెలుగులో మార్క్సిస్ట్ సాహిత్య రంగంలో నిబద్ధత కలిగిన ఒక ప్రధాన విమర్శకుడిగా కొనసాగుతున్నారు

రాచపాళెం. అటువంటి రాచపాళెం చంద్రశేఖర్ రెడ్డి వివిధ సందర్భాల్లో రాసిన వ్యాసాల సంకలనమైన 'చర్చ' పుస్తకంపై 'చర్చ–సాహిత్య విమర్శ శోధనం' పేరుతో ముదిగంటి సుజాతారెడ్డి ఒక విశ్లేషనాత్మక వ్యాసాన్ని రాసారు. దీన్నే విమర్శ వ్యాసాలపై వచ్చిన ఒక విమర్శ వ్యాసంగా చెప్పవచ్చు.

ఈ వ్యాస సంపుటిలో 1988 నుండి 2005 మధ్యకాలంలో ఆంధ్రపత్రిక, ఆంధ్రజ్యోతి, ప్రజాసాహీతి, అరుణతార, కదలిక మొదలైన పత్రికల్లో వచ్చిన దాదాపు 38 విమర్శనా వ్యాసాలు ఉన్నాయి. 2006లో మొదటి ముద్రణ పొందిన గ్రంథం 'చర్చ'. సాహిత్యం సామాజిక చైతన్యం అని నమ్మే రాచపాళెం వారి విమర్శ దృక్పథాన్ని చర్చ గ్రంథంలోని వ్యాసాల ఆధారంగా అనుశీలించే ప్రయత్నం చేశారు ముదిగంటి. సాహిత్య విమర్శ అంటే ఆలంకారాదుల వివేచన, రచనాశైలి విశ్లేషణ కాదని కట్టమంచి కవిత్వతత్త్వ విచారంలో చెప్పిన విషయాన్ని 'ఆధునిక తెలుగు సాహిత్య విమర్శకులు' అనే వ్యాసంలో రాచపాళెం చెప్పారని ముదిగంటి సుజాతారెడ్డి మరొకసారి గుర్తుచేశారు.

కట్టమంచి మార్గంలో పయనించే వాళ్ళే రాళ్ళపల్లి, తాపీ ధర్మారావు, కోరాడ రామకృష్ణయ్యలని, ఇప్పుడు కట్టమంచి మార్గంలో పయనిస్తున్న మార్క్సిస్ట్ విమర్శకుడు వెంకట సుబ్బయ్యని 'కట్టమంచి వారసుడు వల్లంపాటి' అనే వ్యాసంలో ఆయన తీర్మానించాడన్నారు. 'సాహిత్య విమర్శ కూడా సామాజికాచరణే' 'జ్ఞాన సంపన్నుడే సాహిత్య విమర్శకుడు' అనే వ్యాసాల్లో ఒక సాహిత్య విమర్శకునికి ఉండవలసిన లక్షణాలన్నింటిని రెడ్డి వివరణాత్మకంగా వివరించారన్నారు. సాహిత్యం లాగానే సాహిత్య విమర్శ కూడా మనిషి సంస్కారాన్ని పెంచి జీవితాన్ని ప్రేమించగలిగేటట్లు చేస్తుందని రాచపాళెం చెప్పడం చంద్రశేఖరరెడ్డి రాసిన వ్యాసాల్లో ఆయన గుర్తించిన ఒక నూతన అంశంగా ముదిగంటి సుజాతారెడ్డి భావించారు. అలాగే రాచపాళెం రాసిన 'తెలుగులో సాహిత్య విమర్శ ఎదుగలేదా?' అనే వ్యాసంలో ఒక సహృదయ విమర్శకుడిగా సాహిత్య విమర్శ క్రమాన్ని మొదటి నుండి క్షుణ్ణంగా పరిశీలించి దానివెనక ఉన్న కారణాలను నిష్పక్షపాతంగా వెల్లడిచేశారన్నారు.

తెలుగులో సాహిత్య విమర్శకుల విమర్శనా రీతులను సమీక్షించే, పరిశీలించే సాహిత్యం తక్కువగా ఉంది. కాబట్టి సాహిత్య విమర్శల మీద సాహిత్య విమర్శ వ్యాసాలు రావాల్సిన అవసరం ఉందని ముదిగంటి తెలియజేస్తూ ఆ అవసరాన్ని తీర్చడంలో భాగంగా వచ్చిందే రాచపాళెం చంద్రశేఖరరెడ్డి రాసిన 'చర్చ' పుస్తకమని అన్నారు. కాని గతితార్కిక భౌతికవాద సిద్ధాంతాన్ని బలంగా నమ్మి మార్క్సిస్ట్ సాహిత్యాన్ని అధ్యయనం చేస్తున్న రాచపాళెం చెప్పిన 'ఆధునిక సాహిత్యానికి పాత సాహిత్యశాస్త్ర ప్రమాణాలను వాడుకోవడం సాధ్యం కాదనే' అభిప్రాయంతో భారతీయ సాహిత్య మూలలపై అధిక గౌరవమున్న ముదిగంటి సుజాతారెడ్డి ఏకీభవించకపోవడం ఆశ్చర్యపోవాల్సిన విషయం కాదు. ముదిగంటి సుజాతారెడ్డి 'నవలలో రసచర్చ' అనే వ్యాసంలో భారతీయ ఆలంకారికులు చెప్పిన రస సిద్ధాంతాన్ని ఆధునిక వచన ప్రక్రియ అయిన నవలలో అన్వయింపజేసే ప్రయత్నాన్ని వ్యతిరేకించిన వారిలో రాచపాళెం చంద్రశేఖర రెడ్డి ఒకరు.  ఇది నేను నా పరిశోధనలో భాగంగా వారితో చేసిన ముఖాముఖీలో భాగంగా వెల్లడయిన విషయం.(చూ.అనుబంధం 1.రాచపాళెం చంద్రశేఖరరెడ్డిగారితో జరిపిన ముఖాముఖీ) సాహిత్య విమర్శ మీద చాలా కాలం నుండి మంచి పుస్తకం రాలేదనే మనో మాలిన్యాన్ని ఖేదాన్ని 'చర్చ' పుస్తకం కడిగేస్తుందని, రాచపాళెం రాసిన వ్యాసాలు ఒక సాహిత్య పునర్మూల్యాంకనంగా ఉపయోగపడతాయని ముదిగంటి సుజాతారెడ్డి ఆమె తన వ్యాసంలో విమర్శించారు.

### 4.2.5 కథా-కాగితం

రచయితలు లేదా విమర్శకులు సాధారణంగా సాహిత్యానికి సంబంధించిన విషయాల మీద విశ్లేషణ చేయడం లేదా పరిశీలించడం సహజమే కానీ, ముదిగంటి సుజాతారెడ్డి వంటి సాహిత్యకారులు మాత్రం సాహిత్యానికి సమాజానికి మధ్య వుండే కార్యకారణ సంబంధాన్ని తెలియజేసే విషయాల మీద కూడా దృష్టి పెట్టి సాహిత్యాన్ని పరిశీలిస్తూ వుంటారు. ఆ దృష్టికోణం నుండి సాహిత్యాన్ని పరిశీలిస్తూ కాగితానికి–సాహిత్య రచనలకు మధ్య ఉన్న కారణాన్ని విశ్లేషించే ప్రయత్నం "కాగితం కొరతే కారణం!" అని ఆంధ్రజ్యోతి(సెప్టెంబర్29,

2003) దినపత్రికకు రాసిన వ్యాసంలో చేశారు. మనిషి జీవితంలో కాగితం అనేది ఒక భాగం. అది మానవుని జీవితంలో అనేక విప్లవాత్మకమైన మార్పుల్ని తెచ్చింది. బ్రిటిషాంధ్ర కాలంలో తెలుగులో మొదటి కథగా భావిస్తున్న 'దిద్దుబాటు' కథ 1910లో 'అంధ్రభారతి' పత్రికలో ప్రచురించారు. ఆ తర్వాత 1924లో చింతా దీక్షితులు, చలం, అడవి బాపిరాజు మొదలైన వారి కథలు వచ్చాయి. రాయసం వెంకట శివుడు రాసిన కథలు 1927లో 'చిత్రకథామంజరి' గా అచ్చయాయి. అదే తెలంగాణ ప్రాంతంలో మొదటి కథగా మాడపాటి రాసిన 'హృదయశల్యము' 1912 ప్రాంతంలో 'ఆంధ్రభారతి' పత్రికలో ప్రచురించబడింది. రెండవ కథ 1927లో సుజాతారెడ్డి పత్రికలో ఒద్దిరాజు సోదరులు, జయరావు, ఆదిరాజు వీరభద్రరావు వంటి వారు రాసిన కథలు కనిపిస్తున్నాయి.

అయితే, మొత్తంగా తెలుగు కథ చరిత్రలో మొదటగా వెలువడిన కథాకాలానికి రెండవ కథ కాలానికి మధ్య దాదాపు 14 సంవత్సరాల తేడా ఉందని, ఆ అంతరానికి గల కారణం 1914-1918 మధ్య జరిగిన మొదటి ప్రపంచయుద్ధమేనని ముదిగంటి సుజాతారెడ్డి ఒక అంచనా వేశారు. మొదటి ప్రపంచ యుద్ధం ప్రపంచవ్యాప్తంగా తెచ్చిన ఆర్థిక, సామాజిక మార్పులో భాగంగా అధిక ముద్రణ ఖర్చు, తగ్గిన గిరాకీ, కాగితం కొరత వలన ప్రచురణకర్తలు ముద్రణపై ఆసక్తి కోల్పోయారు. మొదటి ప్రపంచ యుద్ధకాలంలో పెట్టిన ఆంక్షలు, ఆహారపు కొరత వీటన్నిటి కారణంగా కాగితపు కొరత ఏర్పడి ఉంటుందని, ఆ ప్రభావం ముద్రణ నిర్వహణపై పడి ఇటువంటి కథలు ఆ కాలంలో రాలేవనే ఒక ఆలోచన చేసారు ముదిగంటి. అందుకే తెలుగులో మొదట ప్రచురించబడిన కథలకి తర్వాతా కాలంలో కథలకు బేధం మొదటి ప్రపంచయుద్ధం సృష్టించిన పరిస్థితులే కారణమని సామాజికపరమైన వ్యాసంలో ముదిగంటి తెలియజేశారు. దీనితోపాటు ఒక సాహిత్య విమర్శకునికి సాహిత్యంపై అవగాహన ఉండటంతోపాటు సాహిత్యంలో ప్రతిబింబమాయే సమాజం వాటి సామాజిక ఆర్థిక, రాజకీయ పరిస్థితులపై అవగాహన ఉండాల్సిన అవసరాన్ని ఈ సందర్భంగా తెలియజేశారనిపిస్తుంది.

### 4.2.6 స్త్రీవాదంపై ఒక అవలోకనం

సమాజం స్త్రీలపై విధించే అన్ని రకాల అణచివేతలు, లైంగిక పరమైన వివక్ష వంటి వాటి మీద స్త్రీలు చైతన్యంతో సాగించే ఒక నిర్మాణాత్మక పోరాట రూపమే స్త్రీవాదమని భావిస్తారు. దీనిలో భాగంగా స్త్రీవాదం ముఖ్యంగా చర్చించే అంశం సెక్స్, జెండర్ విభజన.*“‘ఫెమినిజం’ అనే మాటకు సమానార్థకంగా తెలుగులో వాడుకలోకి వచ్చిన మాట స్త్రీవాదం. మానవ సమాజంలోని సగభాగమైన స్త్రీలు లైంగిక వివక్ష కారణంగా అణచివేతకు గురి అవుతూ, పురుషుల కంటే తక్కువ సాంఘిక స్థితిలో ఉండటాన్ని ప్రశ్నిస్తూ స్త్రీ విముక్తిని కాంక్షిస్తూ అభివృద్ధి చెందిన సిద్ధాంతం స్త్రీవాద”* (సాహిత్య విమర్శ దర్శనం,2016:99) మని తెలుగులో స్త్రీవాద విమర్శకులుగా పేరు పొందిన కాత్యాయనీ విద్మహే అన్నారు. స్త్రీవాదం అనే భావనకు సంబంధించిన మౌలిక భావనలు పాశ్చాత్య దేశాల్లో 1850 నుండి ప్రారంభమయినట్లు కనిపించిన, ఇవి 1950ల తర్వాత ఒక రూపాన్ని సంతరించుకున్నట్లు తెలుస్తుంది. స్త్రీవాదానికి “ఫెమినిజం” అనే పేరు మాత్రం 1960లో స్థిరపడింది. ఎలన్ షో వాల్టన్, సైమన్ ది బావుర్, క్లాడేల్, బ్రెటన్ వంటి రచయితలు తమ రచనల ద్వారా స్త్రీవాదనికి కావలసిన ఒక బలమైన నేపథ్యాన్ని అందించారు. వీటన్నిటి ప్రభావం చేత తెలుగు సాహిత్య విమర్శలో 1980లో స్త్రీ వాద దృక్పథం ప్రవేశించినట్లు తెలుస్తుందని ముదిగంటి సుజాతారెడ్డి ‘స్త్రీవాదం జయాపజయాలు’ అనే పేరుతో రాసిన వ్యాసంలో వివరించారు. స్త్రీ వాదం గురించి రాసిన వ్యాసాల్లో స్త్రీవాద భావన ఎలా మొదలైంది? తెలుగు సాహిత్యంలో ఫెమినిజం ప్రభావం? విప్లవ సాహిత్యం, స్వాతంత్రోద్యమ సాహిత్య కాలంలో స్త్రీవాదం రచనల వల్ల కలిగిన మార్పులు, స్త్రీవాదం విఫలమైన అంశాలు మొదలైన విషయాలన్నింటిని ఒక అవలోకనం చేసే ప్రయత్నం చేశారు.

ముఖ్యంగా 1970 తర్వాత స్త్రీవాద భావనని ఆధారంగా చేసుకుని రచయితలు ఎందరో రచనలు చేసారు.మరి ముఖ్యంగా స్త్రీ రచయితలు తమ నవలలు, కథల్లో స్త్రీలకు సంబంధించిన సాధికారత, స్వేచ్ఛ, నిర్ణయాధికారం వంటి అంశాలను తమ రచనల్లో ప్రతిబింబింపజేస్తూ

రచనలు చేసారన్నారు. వీరిలో వాసిరెడ్డి సీతాదేవి, ఆచంట శారదాదేవి, రంగనాయకమ్మ, లత, అబ్బూరి ఛాయాదేవి వంటి రచయితలు తమ నవలల్లో, కథల్లో స్త్రీవాద ఆలోచనలకు ఆవిర్భావం చేసారన్నారు. 1980 దశకంలో స్త్రీవాద భావజాలం తెలుగు సాహిత్యాన్ని ఎక్కువగా ప్రభావితం చేసింది. రంగనాయకమ్మ రాసిన 'జానకి విముక్తి(1981), ఓల్గా రాసిన 'సహజ'(1986) 'స్వేచ్ఛ'(1987) వంటి నవలలు స్త్రీవాదానికి ఒక సిద్ధాంత రూపాన్ని అందించాయి. అందుకే తెలుగు సాహిత్య చరిత్రను వ్యక్తుల పేరుతో యుగాలుగా విభజిస్తే స్త్రీవాదాన్ని బలంగా విశ్వసించి రచనలు చేసి ప్రచారం చేసిన నాయకత్వం వహించిన ఓల్గాగారి పేరు మీదనే స్త్రీవాదయుగం పిలవబడుతుందని చెప్పి స్త్రీవాద సాహిత్యంలో ఓల్గా చేసిన కృషిని గుర్తించే ప్రయత్నం ముదిగంటి చేశారు.

కానీ, *"ఆఖరికి స్త్రీల చరిత్రను స్త్రీలు, స్త్రీల రచనలు స్త్రీలు అంచనా వేసుకుని స్త్రీల సభలు స్త్రీలు జరుపుకునే పరిస్థితి ఏర్పడిందని"* (అద్యతన చర్చ,2014:136) ఘాటుగా విమర్శించారు సుజాతారెడ్డి. కొంతమంది రాడికల్ స్త్రీవాదులు 'లెస్బియనిజం'తో స్త్రీలకు ఏటువంటి సమస్యలు ఉండవని చాటారు. ఇటువంటి వీపరీత ధోరణులను ఇతివృత్తంగా తీసుకుని "ఆకాశంలో విభజనరేఖల్లేవు" అనే నవలలో ముదిగంటి సుజాతారెడ్డి స్త్రీ, పురుష సమానత్వంతో కూడిన సమాజమే అర్థవంతంగ, ఆచరణీయపరంగా మనుగడ సాధించగలుగుతుందని చెప్పగలిగారు. అదే విధంగా అనేక ఇతర సమస్యలను, ఆలోచనలను ముఖ్యంగా వరకట్నం వంటి వాటి విషయంలో స్త్రీవాదం విఫలమైందని సుజాతారెడ్డిగారు వ్యాసంలో విమర్శించారు. కానీ, అదే సమయంలో స్త్రీవాదం, స్త్రీవాద సాహిత్యం అనేక మార్పులను తీసుకువచ్చి స్త్రీల జీవితాలను అనేక కోణాల్లో ప్రభావితం చేసిందని చెప్పడంలో ఏటువంటి అతిశయోక్తి లేదని విశ్లేషించారు. పురుషులదైన సామాజిక ప్రపంచంలో సాహిత్య ప్రపంచం కూడా పురుషులదే అవుతుంది. స్త్రీలు దానికి కూడా పరాయి వాళ్ళే. స్త్రీల రచనలలో సాహిత్యపు విలువలు లేవని పక్కన పెట్టడం, సాహిత్య చరిత్రలో చోటు లేకుండా చేయడం జరుగుతుంది. జెండర్ రాజకీయాల మాయలో భాగంగా ఇది అర్థమైనప్పుడు సాహిత్య సమాజపు అంచులకు నెట్టవేయబడిన మహిళ

రచయితలను గుర్తించి వారి సృజన శక్తుల గురించి, జీవిత సంఘర్షణ గురించి, వాళ్ళు చిత్రించిన వాళ్ళదైన ప్రపంచం గురించి, ఆశల గురించి, ఆకాంక్షలగురించి, వ్యూహాల గురించి తెలుసుకోనడం, తెలియజెప్పటం అవసరమవుతుందని (బహుళ(విమర్శ వ్యాసాలసంపుటి) 2018:132) చెప్పిన కాత్యాయనీ విద్మహేగారి మాటలు స్త్రీల జీవితాల్ని మార్చడంలో స్త్రీవాద సాహిత్యానికి ఉన్న ప్రాముఖ్యతను మరోసారి గుర్తుచేస్తున్నాయి.

### 4.2.7 ముస్లింవాద ప్రతినిధి 'వతన్' కథలు

తెలుగు సాహిత్యంలో అస్తిత్వ ఉద్యమాలు ఊపందుకున్న కాలంలో స్త్రీవాదం, దళితవాదం వరుసలో ముస్లింవాద సాహిత్యం తనకంటూ ఒక ప్రత్యేకమైన స్థానాన్ని తయారుచేసుకుంది. దీని పేరులో "మైనారిటీ వాద సాహిత్యం", "ముస్లిం సాహిత్యవాదం", "మైనారిటీవాదం" వంటి భిన్న రకాలుగా ఉన్నాయి. దళిత బహుజన వాదంలో భాగంగా ప్రారంభమయిన మైనారిటీవాదం తర్వాత వివక్షతలను అభివ్యక్తీకరించే ఒక కొత్త వేదికయింది. మైనారిటీ అనే పదానికి 'చిన్న సమూహం' ఒక 'విభాగం' అనే అర్థాలున్నాయి. అసలు మైనారిటీవాద సాహిత్యం అంటే ఏమిటి? కేవలం ముస్లింల సాహిత్యమే మైనారిటీ సాహిత్యంగా ఎందుకు పిలవబడుతుంది? తెలుగులో మైనారిటీ వాద సాహిత్య పరిణామ వికాసాలు దశలు మొదలైనవాటిని చర్చిస్తూ 'అద్యతన చర్చ' గ్రంథంలో ముదిగంటి రెండు వ్యాసాల్లో విశ్లేషించారు. దీనిలో స్కైబాబాగారి సంపాదకత్వంలో వచ్చిన మొదటి ముస్లిం కథల సంపుటి 'వతన్' ఆధారంగా చేసుకుని మైనారిటీ వాద సాహిత్యాన్ని వీరు అనుశీలన చేసారు. 'వతన్' 52 కథలతో 2004 జూన్ లో వెలువడింది. 'వతన్' లోని కథలు ముస్లిం సాహిత్య నేపథ్యాన్ని వివరించడంతోపాటు సాహిత్య నిర్మాణం గురించి, భాష గురించిన విషయాలపై దృష్టిసారించినట్లు తెలుస్తుంది. తెలుగు సాహిత్యంలో 'వతన్' సంకలనం రూపంలో ఒక కొత్తదనం ప్రవేశించింది. మైనారిటీ రచయితలు వస్తువులో, శిల్పంలో నూతనత్వాన్ని సాధించారు. "తెలుగు సాహిత్యానికి అదనపు గౌరవం" కలిగిస్తూ "పండిత పీఠాల్ని బ్రేక్ చేస్తూ.."కొత్తతరం ముందుకొచ్చింది" అన్న ఖాజా ముందు మాటలు అబద్ధాలు గాని

అతిశయోక్తులు గాని కావని "వతన్" కథలు చదివితే తెలుస్తుంది. ఇవి కహానీలు కావు-జిందగీలని అర్థమవుతుందని ముస్లింవాద సాహిత్య ప్రారంభ దశను సుజాతారెడ్డి 'ముస్లిం చైతన్య కథలు' వతన్" పేరుతో రాసిన వ్యాసంలో విశ్లేషించారు.

బాబ్రీ మసీదు కుల్చివేసిన ఘటన ముస్లింలలో ఒక రకమైన అభద్రతా భావాన్ని సృష్టించిందని అది వాళ్ళ రక్షిత భావాన్ని, భద్రతా భావాన్ని కోల్పోయేలా చేసింది. ముస్లింల మత సంస్కృతుల మీద చారిత్రక అస్తిత్వం మీద దాడి చేసి వారి జీవితాల్ని చిన్నాభిన్నం చేసినట్లుగా అభద్రతా భావాన్ని కలిగించిందని ముదిగంటి సుజాతారెడ్డి ముస్లిం సాహిత్యం తనకంటూ ఒక అస్తిత్వం ఏర్పరచుకోవడానికి గల కారణాన్ని అంచనా వేసే ప్రయత్నం ఈ వ్యాసంలో చేసారు. ప్రముఖ విమర్శకులు ఆచార్య దార్ల వెంకటేశ్వరరావుగారు "మైనారిటీ సాహిత్యం-మరో చూపు" అనే వ్యాసంలో ముస్లింలు దేశవ్యాప్తంగా ద్వితీయ స్థానంలో ఉన్నప్పటికీ అభద్రతకు గురవుతున్నారనేది వాస్తవమని, భారతదేశంలో అభద్రతకు గురవడానికి కారణాల్ని ఈ క్రింది విధంగా పేర్కొన్నారు.(వేంకటేశ్వరరావు, దార్ల. "మైనారిటీ సాహిత్యం-మరో చూపు" (16-3-2009) ఆంధ్రప్రభ దినపత్రిక వ్యాసం)

1. ఈ దేశంలో పుట్టి పెరిగినప్పటికీ ముస్లింలను చాలా మంది పరదేశీయులుగా భావించటం.
2. ముస్లింల పాలనలో హిందువులపై జరిగిన దాడులకు ముస్లింలను అందరినీ భాద్యులుగా భావించటం. అవే అనుమానాలతో, అవే వాదనలతో అక్కడక్కడ మాట్లాడటం.
3. సినిమాలలో ముస్లింలను దేశ ద్రోహులుగా చిత్రించటం.
4. అన్ని వర్గాలతో జీవించాలని ప్రయత్నిస్తున్నప్పటికీ, ముస్లింలను రెండవ తరగతి పౌరులుగా చూస్తున్నారనే భావన.

5. మరొకవైపు ముస్లింలలో కూడా వర్గ, కుల భేదాలు ఏర్పడటం వల్ల ముస్లింలలోనే అంతర్గతంగా వివక్షతకు గురికావటం జరుగుతుందనే అనుభవ సత్యాలతో సాహిత్యాన్నీ సృష్టించటం.
6. అనేక సంవత్సరాలుగా భారతదేశంలోనే పుట్టి, పెరిగి అన్ని మతస్థులతో కలిసి మెలిసి జీవించటం వలన ముస్లిం సంస్కృతిలో వైవిధ్యం కనిపిస్తుంది. ముఖ్యంగా పీర్ల పండుగ, మొహర్రం, దర్గ పండుగలు అన్నీ ముస్లిం, హిందూ సమైఖ్యతకు నిదర్శనంగా నిలుస్తున్నా, ఆచార సంప్రదాయాల వలన కొంతమంది ముస్లింలను ముస్లింలే తక్కువగా చూస్తున్నారనే భావన వ్యక్తమవుతుంది.
7. అరబ్బీ, ఉర్దూ, పారశిక మొదలైన భాషలను అన్ని ముస్లిం వర్గాలు మాట్లాడలేకపోవడం వల్ల భాషాపరమైన మైనారిటీని కూడా కొంత మంది ముస్లింలు అనుభవిస్తున్నారు.
8. వివిధ పాలన కారణాల వల్ల జరిగిన మత మార్పిడిలలో దళిత వర్గాలు ముస్లింలుగా మారటంతో ముస్లింలలో కూడా స్థాయి భేదాలు పెరిగిపోయాయి. దీని వల్ల కూడా ముస్లింలలోనే మరో అల్పసంఖ్యాక వర్గం ఏర్పడింది.

ముస్లిం మైనారిటీ వాదం అంటే ముస్లిం మైనారిటీ తత్త్వం. ముస్లిం మైనారిటీల తాత్త్విక దృక్పథం. ముస్లింలు తమ గతాన్ని ఎలా చూడాలి? తమ భవిష్యత్ ను ఎలా నిర్మించుకోవాలి? ఈ రెండిటికి సంబంధించిన వివిధ అంశాల పట్ల ఎటువంటి వైఖరిని ప్రదర్శించాలనే వివిధ అంశాలను వివరించేదే ముస్లిం మైనారిటీ తాత్విక దృక్పథం. ఈ దృక్పథాన్ని సాహిత్య కళారంగాల్లో ఎలా ప్రతిఫలింపజేయాలో వివరించేదే ముస్లిం మైనారిటీ సాహిత్య దృక్పథం. ఇలాంటి సాహిత్య దృక్పథంతో ఒక నిర్దేశిత గమ్యంతో వచ్చిందే వతన్ కథల సంపుటిగా గుర్తిస్తూ *"స్త్రీ వాదాన్ని గాని, దళిత వాదాన్ని గాని ప్రతిబింబింపజేసే అచ్చమైన కథల సంకలనాలు రాలేదు. "వతన్" కథల సంకలనం ముస్లిం మైనారిటీ వాదానికి ప్రతినిధి అయిన మొట్టమొదటి సంకలనమే కాదు, ఒక వాదాన్ని ప్రతిఫలింపజేసే మొట్టమొదటి కథల*

*సంకలనమని కూడా చెప్పాలే. ఇంకోటి ఈ కథల్లో స్త్రీవాదం, దళితవాదం అభివ్యక్తీకరణాల్లో కనిపించే కసీ, తిట్లు నిందారోపణలు లేవు. శక్తిమంతంగా ఆలోచింపజేసే కథనమే "వతన్" కథల విశేషత!"* (అద్యతన ద్రుష్టి,2014:126) అని 'వతన్'కు ముస్లింవాద సాహిత్యంలో ఉన్న ప్రాముఖ్యతను తెలియజేశారు.

దేశ విభజన అనంతరం జరిగిన మార్పుల వల్ల భారతదేశంలోని ముస్లింలు దేశంలో ఒక మైనారిటీ సముదాయంగా గుర్తించబడుతున్నారు. అలాగే భారతదేశంలో ఉన్న అన్ని రకాల వైవిధ్యత మూలంగా ఇక్కడి ముస్లింలు ప్రపంచంలోని ఇతర ముస్లిం జీవితాలతో పోలిస్తే ఒక ప్రత్యేకమైన సంస్కృతిని అలవర్చుకున్నారు. ఎంతటి వైవిధ్యత ఈ దేశ ముస్లిం జీవితాల్లో ఉందో అంతే ప్రత్యేక సమస్యలు వారి జీవితాల్లో కనిపిస్తాయి. నేటి సమకాలీన రాజకీయ పరిస్థితులు వారిని మరింత సంక్షోభంలోకి నెట్టివేస్తున్నాయి. అందుకే వారిని మిగతా పౌరులతో సమానంగా, ఆత్మ గౌరవంతో బతకనివ్వాలనే ఒక ఆకాంక్ష  ముస్లింవాద సాహిత్యంలో నేటికి ప్రతిఫలిస్తూనే ఉంది.

## 4.2.8 చరిత్ర మలుపుతిప్పే సాహిత్యం

సాహిత్య రచనలో అప్పటి సామాజిక స్థితిగతులు ప్రతిఫలిస్తూనే ఉంటాయి. ఇది అనివార్యంగా జరిగే ఒక ప్రక్రియ. అందుకే చరిత్ర నిర్మాణంలో సాహిత్యం నిర్వహించే పాత్ర నిర్వచించలేనిది. సాహిత్యంలో సామాన్య ప్రజల జీవితం, జీవన విధానం. ఆర్థిక పరిస్థితులు, ప్రకృతి  వనరులు, ఆచార సంప్రదాయాలు, మానవుని ఆలోచనలు అన్ని చరిత్ర నిర్మాణంలో భాగమవుతాయి. ప్రముఖ చరిత్రకారుడు ఈ. హెచ్. కార్ *"History is a continual dialogue between the past and the present; an interaction between the historian and his Facts"* (Edward Hallet Carr. What is history?, 1961:7) 'చరిత్ర' అనేది గతానికి మరియు వర్తమానానికి మధ్య నిరంతర సంభాషణ. చరిత్రకారుడు మరియు అతని వాస్తవాల మధ్య జరిగే ఒక పరస్పర చర్య అని చరిత్ర గురించి వివరించాడు.  మరి చరిత్రకారునికి ఆ వాస్తవాలు ఎక్కడి నుండి లభ్యమవుతాయి? ఆ వాస్తవపు ఎరుకను ఎక్కడి నుండి పొందగలుగుతాడు? అని అలోచించినప్పుడు మనకు తటస్థించేదే సాహిత్యం. అందుకే

చరిత్ర రచనకు సాహిత్యం ఎంతో సహాయం చేస్తుందని 'సాహిత్యంలో ప్రతిఫలించిన చరిత్ర' వ్యాసంలో ముదిగంటి పేర్కొన్నారు. ఇండో–యురోపియన్ భాషలకు సంస్కృత భాషకు మధ్యగల సంబంధాన్ని తెలియజేస్తూ, ఈ భాషలన్నీ ఒకే భాష కుటుంబానికి చెందినవిగా గుర్తించినట్లు తెలియజేశారు.సంస్కృత భాష పర్షియన్, గ్రీకు, లాటిన్, కెల్టిక్ భాషల్లో లభించే పదాలను బట్టి ఒక జాతి చరిత్ర ఎలా నిర్మించబడుతుందో క్రింది ఉదాహరణ ద్వారా గుర్తించారు. *"సంస్కృతంలో "దుహితర్" అనే పదం ఉంది. అది 'దుహ్' ధాతువు నుంచి వచ్చింది. 'దుహ్' అంటే పాలుపిండుట మని అర్థం. 'దుహితర్' అంటే పాలుపిండేది అని వ్యుత్పత్తి అర్థం. దుహితర్ అనే పదానికి కూతురు అని అర్థం. అప్పుడు పాలు పిండే పనిని ఇంటి ఆడకూతురు నిర్వహించేది కాబట్టి ఇంటి ఆడకూతురు 'దుహితర్' అని పిలవబడింది. దుహితర్ అనే పదం పర్షియన్ భాషలో 'దుఖ్తర్' అని ఉంది. జర్మన్ భాషలో 'తోఖ్తర్' అని, ఇంగ్లిషులో 'డాటర్' అని, తర్వాత ఇండో యురోపియన్ భాషలన్నింటిలో 'గో' అంటే ఆవు అర్థం గల పదం కనిపిస్తుంది. పర్షియన్ లో 'గో' ఉంది. జర్మన్లో 'కూ' ఇంగ్లీషులో 'కౌ' అంటే ఇండో యురోపియన్ మూలవాసులకు గోసంపద ఉండేదని, గోవు పాలుపిండటం ఇంటి ఆడ కూతురే నిర్వహించే వారని తెలుస్తుందని"* (అద్యతన దృష్టి,2014:36) దీన్ని బట్టి ఒకజాతి జీవిత విధానం నిర్మించడం సాధ్యమైందని రెడ్డి విశ్లేషించారు. విశాఖదత్తుడు(క్రీ.శ45) రాసిన ముద్రారాక్షసమనే నాటకంలో చారిత్రక విషయాలున్నాయని, శాకుంతల నాటకంలో హస్తిననగర స్థితిగతులు, అష్టదిగ్గజ కవుల రచనలను బట్టి విజయనగర రాజ్య పరిస్థితులు తెలుసుకోవచ్చని, ఇలాంటి సాహిత్య అవశేషాల నుండే చరిత్ర నిర్మితమవుతుందన్న వాస్తవాన్ని ఈ వ్యాస విశ్లేషణలో వీరు పరిశీలించారు.

ముదిగంటి సుజాతారెడ్డిగారిలోని పరిశీలనలోని వైవిధ్యతను, విశ్లేషణ నైపుణ్యాన్ని ఇందులోని వ్యాసాలు మనకి తెలియజేస్తున్నాయి. సినిమా ఇండస్ట్రీలో తెరవెనుక జరిగే ఎన్నో తెలియని కోణాలను రావూరిగారి 'పాకుడురాళ్ళు' గురించి రాసిన వ్యాసంలో విశ్లేషించారు. 'తిమిరంతో సమరం' వ్యాసంలో దాశరథి ప్రజాస్వామ్యాన్ని ప్రేమించే నిరంకుశత్వాన్ని, పీడనను, అణచివేతను నిరసించే స్వాతంత్రాన్ని సమానత్వాన్ని కోరుకునే కావన్నారు. కవికి–సమాజానికి మధ్య ఉన్న సంబంధాన్ని గురించి తెలియజేస్తూ ఒక కవి రచనల్లో కలిసిపోయే

ఉండే ఆ కాల చరిత్రను ఏలా గుర్తించాలో చెప్పేది కాళోజిగారి గురించి రాసిన 'కాళోజి జీవిత చరిత్ర తెలంగాణ చరిత్ర' వ్యాసం. ఒక సాహిత్య విమర్శకుడికి ఉండాల్సిన లక్షణాల గురించి చెబుతూనే "*నిరంతర అధ్యయనం, సునిశిత దృష్టి వివిధ అంశాలపై సమ్యక్ అవగాహన, చెప్పాలన్న తాపత్రయం సాహిత్య విమర్శకుడికి ఉండాలి. అవన్నీ ఉండి తర్వాత తరానికి ప్రేరణగా నిలుస్తూ నిరంతర అధ్యయనంతో సాగుతున్న ముదిగంటి సుజాతారెడ్డి సాహిత్య విమర్శ వ్యాసాల సంపుటిని ఆధునిక దృష్టితో సాహిత్యానుశీలన చేయాలనుకునే వారందరూ చదవాల్సిందేనని*" (ప్రజాశక్తి దినపత్రిక.(29 సెప్టెంబర్,2014) ప్రముఖ విమర్శకులు లక్ష్మణ చక్రవర్తి ఈ గ్రంథ సమీక్షలో చెప్పిన మాటలు ఈ సందర్భంగా గుర్తుచేసుకోవడంలో ఎటువంటి అతిశయోక్తి లేదు. తెలుగులో మొదటిసారిగా వచ్చిన నవలలకు గల కారణాన్ని వివరిస్తూ, నవల ప్రక్రియ వికాసాన్ని, పరిణామ క్రమాలను 'తెలుగు నవలా సాహిత్యం' పేరుతో రాసిన వ్యాసంలో అనుశీలించారు. '**అద్యతన దృష్టి**' పేరుతో రాసిన ఈ వ్యాస సంపుటిలో ముదిగంటి సుజాతారెడ్డి సాహిత్యంలో భిన్నమైన అంశాలను ఎంచుకుని వాటి ద్వారా సాహిత్య విమర్శలో ఒక విభిన్న ఆలోచన ధోరణిని ప్రవేశపెట్టారు.

## 4.3 ప్రాంతీయ చైతన్యం ఒక అస్తిత్వ ఉద్యమం

వివిధ రకాల వ్యవస్థలు, భావజాలాల కారణంగా మనిషి లేదా ఒక వ్యక్తి తన ఉనికిని, తన అస్తిత్వాన్ని కోల్పుతున్నాననే భావనకు గురికావడం 'అస్తిత్వవాదం' అనుకోవచ్చు. ఆధునిక కాలంలో తెలుగు సాహిత్యం స్త్రీవాదం, దళితవాదం, మైనార్టీవాదం, ప్రాంతీయవాదం అనే అస్తిత్వ ఉద్యమాల రూపంలోనే కొనసాగింది. ముఖ్యంగా 1980ల తర్వాత అస్తిత్వ ఉద్యమాల ప్రభావం తెలుగు సాహిత్యంపై అధికంగా ఉంది. స్త్రీ, దళిత, మైనార్టీ, ప్రాంతీయ అస్తిత్వ ఉద్యమాలన్నీ ఒకే అంతసూత్రంగా కనిపించిన స్త్రీ, దళిత, మైనార్టీ వాదాలకు గుర్తింపు సమస్య అయితే, ప్రాంతీయ అస్తిత్వవాదం మాత్రం గుర్తింపుతో పాటు, ఇతర ప్రాంతాల ఆధిక్యత, విస్మృతి అనేవి ప్రధాన సమస్యలుగా ఉంటాయి. దీన్నే ప్రముఖ విమర్శకులు బి.ఎస్. రాములు "*ఒక ప్రాంతంలో జీవించే ప్రజల గురించి అక్కడి నైసర్గిక స్వరూపం, మానవ సంబంధాల*

*తీరు, భాష, సంస్కృతి, భావ వ్యక్తీకరణ, సంభాషణ తీరు, ఆలోచనలతీరు, వాటితోపాటు వాటిని నిర్దేశించే, ప్రభావితం చేసే ప్రకృతి, పంటలు, వృత్తులు, ఆధునిక అభివృద్ధి, కులాలు, మతాలు, విద్య, వైద్య, ఆర్థిక, రాజకీయ, సామాజిక అంశాలు. వీటన్నిటి పరిణామాలు కలిసి ఒక ప్రాంతం యొక్క ప్రాంతీయ అస్తిత్వాన్ని, ప్రత్యేకతను, నిర్దిష్టతను, సంస్కృతిని తెలుపుతాయి. వీటన్నిటిని ఒక స్పృహతో, చైతన్యంతో చిత్రించిన కథలను, సాహిత్యాన్ని, ప్రాంతీయ స్పృహను, చైతన్యాన్ని చిత్రించిన సాహిత్యమని వర్గీకరించవచ్చు"*(ప్రాంతీయ అస్తిత్వం–తెలంగాణ కథ నవల,2017:5) *అని ప్రాంతీయ* అస్తిత్వవాదంలో ఉన్న మౌలిక గుణాలను తెలియజేశారు. పాశ్చాత్య తాత్త్వికతలో, సాహిత్యంలో కిర్క్ గార్డ్, హైడేగ్గర్, సార్త్రే తదితరులు ప్రతిపాదించిన 'Existentialism' అనే తాత్త్విక శబ్దానికి సమానార్థకంగా తెలుగులో 'అస్తిత్వవాదం' అనే పదాన్ని వాడుతున్నారు.

### 4.3.1 ప్రాంతీయ అస్తిత్వవాదం బహిర్గతం చేసిన విషయాలు:(సాహిత్యవిమర్శ దర్శనం,2016:125)

- ప్రాంత భౌగోళిక పరిస్థితులు, సాంస్కృతిక నేపథ్యం, వనరులు, అభివ్యక్తి మార్గాలు పరిగణలోకి తీసుకుని సాహిత్య విశ్లేషణ జరగాలి.
- ప్రాంతీయ అస్తిత్వవాదంలో 'పునర్మూల్యాంకనం' అనే భావనతో సాహిత్య విమర్శ చేయడం.
- ఒక ప్రాంత సాహిత్యం విస్మృతికి గురికావడాన్ని ప్రశ్నిస్తూ వివిధ కవితా, కథా సంకలనాలలో ప్రాధాన్యం లేకపోవడాన్ని, ఆయా ప్రాంతాల్లో సృజన ఉందన్న విషయాన్ని అంగీకరించకపోవడాన్ని ఈ వాద విమర్శ చర్చకు పెట్టింది.
- ప్రాంతీయ అస్తిత్వవాదం జాతీయత/దేశీయత/స్థానికత/ప్రాంతీయత అన్న మాటల పరిధిని, విస్తృతిని అవగాహనలోకి తెచ్చుకుని ఆయా సాహిత్యాంశాలను విశ్లేషిస్తున్నది.

అస్తిత్వవాద ఉద్యమాల నుంచి ప్రాంతీయ అస్తిత్వవాదం మరింత బలాన్ని పుంజుకుంది. ముఖ్యంగా ప్రాంతీయ అస్తిత్వవాదం తెలంగాణ, ఉత్తరాంధ్ర, రాయలసీమ సాహిత్య విమర్శలో

తన పరిధిని, విస్తృతిని పెంచుకుంది. 1996 తర్వాత ప్రాంతీయ అస్తిత్వవాదం అనేది తెలుగు సాహిత్య విమర్శలో ఒక ప్రముఖ స్థానాన్ని ఆక్రమించుకుంది. ప్రాంతీయ అస్తిత్వవాదం ప్రభావం రాయలసీమ, ఉత్తరాంధ్రలో ఉన్న తెలంగాణ ప్రాంతంలో ఇది కొంత ఎక్కువగా వ్యాపించి ఒక నిర్ధిష్టమైన రూపాన్ని సంపాదించుకుంది. తెలంగాణలో ఇది మొదట 1934లో సురవరం ప్రతాపరెడ్డి రాసిన గోలకొండ కవుల సంచిక పేరుతో ప్రతిస్పందన రూపంలో వెలువడింది. తెలంగాణ ప్రాంతం ముందు నుంచి ఒక ప్రత్యేకమైన చారిత్రక, సామాజిక, ఆర్థిక, భౌగోళిక నేపథ్యాన్ని కలిగి ఉంది. ఇది తర్వాతి దశలో  వివక్ష, అణచివేతలు. తమని తాము కోల్పోతున్నామన్న ఒక అస్తిత్వ భావన మొదలై అప్పటికి విస్తృతమైన అస్తిత్వ ఉద్యమాల ప్రభావంతో తెలంగాణ ప్రాంతీయ సాహిత్య విమర్శ ప్రారంభమైంది. ఈ నేపథ్యంలో తెలుగు సాహిత్యంలో వచ్చిన తెలంగాణ ప్రాంతీయ అస్తిత్వవాదాన్ని ముదిగంటి సుజాతారెడ్డి తన వ్యాసాలతో కలిపి వచ్చిన వ్యాస సంకలనం **'ముద్దెర'** పేరుతో వచ్చిన గ్రంథంలో అస్తిత్వవాద విమర్శకు ఒక బలమైన భూమికను అందించారు. అంతేకాకుండా తెలంగాణ ప్రాంతంలో 1970కి ముందు కథ అవిర్భావానికి సంబంధించి జరిగిన చర్చలో ముదిగంటి **'తెలంగాణ తొలితరం కథకులు'** పేరుతో తెలంగాణ ప్రాంతంలో గుర్తింపుకు నోచుకోని 81 మంది కథకులను పరిచయం చేస్తూ వీటిని రెండు సంకలనాల రూపంలో ప్రచురించి తెలంగాణ కథ సాహిత్యంలో ఒక గొప్ప మలుపు తిప్పారు.

## 4.3.2 తెలంగాణ ప్రాంతీయ అస్తిత్వ అభివ్యక్తి

తెలంగాణ ప్రాంతీయ సాహిత్య విమర్శకు మొదటగా కాసుల ప్రతాపరెడ్డిగారి సంపాదకత్వంలో వచ్చిన **'తెలంగాణ తోవలు'**(2001)లోని వ్యాసాలు ఒక గుర్తింపునిచ్చాయి. ఇందులో 18 మంది వ్యాసకర్తలు తెలంగాణ ప్రాంతానికున్న భిన్నత్వాన్ని తెలియజేసే ప్రయత్నం చేశారు. అయితే ముదిగంటి సుజాతారెడ్డిగారి సంపాదకత్వంలో వచ్చిన **'ముద్దెర'** వ్యాస సంపుటిలో అస్తిత్వ వాదానికి సంబంధించిన మౌలిక భావనలతో మొదలుకుని తెలంగాణ అస్తిత్వవేదనతో వచ్చిన సాహిత్యం వరకు విశ్లేషించి కొన్ని నిర్దిష్టమైన అభిప్రాయాలను

వెల్లడించారు. మొత్తం 14 వ్యాసాలున్న ఈ వ్యాస సంపుటిలో సుజాతారెడ్డి ముఖ్యమైన ఐదు వ్యాసాలు రాసారు. వాటితోపాటు ఈ విమర్శనా గ్రంథంలో జూలూరు గౌరీశంకర్, సిధారెడ్డి, కాసుల ప్రతాపరెడ్డి, గుడిపాటి మొదలగు వారి రచయితల వ్యాసాలున్నాయి.

సుజాతారెడ్డి తెలంగాణ ప్రాంత సాహిత్యాన్ని చారిత్రక, సామాజిక, సైద్ధాంతిక కోణం నుండి వివరిస్తూ, సామ్రాజ్యవాద వ్యతిరేకతలో భాగంగా ప్రభావంతో ప్రజజీవితాల్లో వచ్చిన మార్పుల ఫలితం అస్తిత్వ వేదనలో ఎలా ప్రతిఫలించిందో విశ్లేషణాత్మకంగా వర్ణించారు. అస్తిత్వవాదం అనే భావన గురించి చెబుతూ ప్రపంచీకరణవల్ల కలిగిన ప్రభావ నేపథ్యంలో ప్రాంతీయ వివక్ష, దోపిడిలు, అన్యాయపూరిత మోసాలు అందరికి అర్థమయి వాటిని కూడా సాహిత్యంలో ప్రతిఫలింపజేయడం ప్రారంభించారని 'అస్తిత్వవాదం–ఒక ఉపోద్ఘాతం' అనే పరిచయ వ్యాసంలో ఆమె పేర్కొన్నారు. మనిషి–వం, మనిషి–ప్రకృతి, మనిషి–యంత్రంతో మనిషి చేస్తున్న సహజీవన పరిణామాన్ని తెలుపుతూ *"మార్పు అంతా ఆర్థికం మీదనే ఆధారపడిందన్న సత్యం ఈ యుగంలో నిజమైంది. మానవ విలువలకు స్థానం లేదు. వ్యక్తి–వ్యక్తి ఆశలు, వ్యక్తి స్వార్థం, ఉద్యోగావకాశాలు, సంపాదనలు ప్రధానమైనవి. అదే ఉత్తరాధునికత లక్షణం. ఈ ఉత్తరాధునికత సామ్రాజ్యవాదుల ఒత్తిడితో ప్రతిదేశం, ప్రతి ప్రాంతం, ప్రతి జాతి, ప్రతిసమాజం, తన ఉనికిని కాపాడుకోవాలని జాగృతమైతున్నది. సామ్రాజ్యవాదుల దోపిడీ నుండి తమ అస్మిత అస్తిత్వాలను నిలుపుకోవాలని చూస్తున్నారు. దాంతో ఒక్కొక్క దేశం, ప్రాంతం, సమాజం, జాతి తమ అస్తిత్వ వేదనను పొందుతున్నారని"* (ముద్దెర,2005:7) అందుకే ఈ రకమైన వేదనల్లోంచి సాహిత్యం వస్తుందనే అదే అస్తిత్వ భావనను బలపరుస్తున్నట్లు ముదిగంటి అభిప్రాయపడ్డారు.

తెలంగాణ ప్రాంతీయవాదం మిగతా ప్రాంతాల కన్న కొంత బలంగా కనిపిస్తుంది.1990 తర్వాత చాలా మంది యువకులు తెలంగాణ చరిత్ర, సాహిత్య పునర్నిర్మాణంలో ఆసక్తి చూపడం మొదలుపెట్టారు. భాష సాహిత్యాల మీద సాహిత్య ప్రక్రియల మీద అభిమానం పెరిగింది. ఇదే కవిత్వంలో, కథల్లో నూతన అభివ్యక్తీకరణకు కారణమైందని సుజాతారెడ్డి అన్నారు. తెలంగాణ అస్తిత్వవాదంలో తెలుగు కథ గురించి గుడిపాటి ఫాయిదా,

అశోక్ కుమార్ కథావలోకనం, కాసుల ప్రతాపరెడ్డి తెలంగాణ కథ–దేవులాట, కాలువ మల్లయ్య తొమ్మది పదుల తెలంగాణ కథ, బి.యస్ రాములు తెలంగాణ కథకులు–కథన రీతులు తెలంగాణ కథ సాహిత్యానికి సంబంధించిన వ్యాసాలు వచ్చాయి. కవిత్వంలో సుంకిరెడ్డి నారాయణరెడ్డి రాసిన ముంగిలి, పొక్కిలి, మత్తడి, మునుం వంటి రచనలు అందులోని పీఠికలు ప్రాంత అస్తిత్వ భావనను మనముందు నిలిపాయి. ఇక తెలంగాణలో ఉన్న పరిశోధక విమర్శకులు విమర్శలో మూడు భిన్నమైన సాహిత్య మార్గాలు అనుసరించారు. మొదట సురవరం ప్రతాపరెడ్డి చారిత్రక, సామాజిక, సంస్కృతుల అధ్యయనానికి గుర్తుగా "ఆంధ్రుల సాంఘిక చరిత్ర" రాశారు. రెండవ తరంలో బిరుదురాజు రామరాజు జానపద సాహిత్యంలో విశేషకృషి చేసి "తెలుగు జానపద గేయ సాహిత్యం" విమర్శ గ్రంథాన్ని రాశారు. ఇక సి.నా.రె "ఆధునికాంధ్ర కవిత్వం–సంప్రదాయం–ప్రయోగం" పేరుతో ఆధునిక కవిత్వ ప్రక్రియ మీద ఒక సాధికారమైన పరిశోధన చేసి సాహిత్య విమర్శకే గొప్ప బలాన్ని అందించారు. ఈ మూడు విమర్శ మార్గాలు తర్వాతి తరంలో ఏర్పడ్డ అస్తిత్వభావాలకు ఒక పునాదిలా ఏర్పడ్డాయని భావించవచ్చు.

అందుకే ఇంతకముందు తెలంగాణ భాష సంస్కృతుల మీద, చరిత్ర సాహిత్యాలా మీద పరిశోధనలు జరగలేదనే లోటును పుడ్చాడానికే పైలాంటి రచలను వచ్చాయని ఎప్పుడైతే *"ఒక ప్రాంతం తన అస్తిత్వం అస్మిత ఆత్మగౌరవాలను ప్రకటించే భావజాలమే ప్రాంతీయ అస్తిత్వవాదంగా లేదా ప్రాంతీయ అస్తిత్వ వేదనా వాదంగా పిలవబడుతున్నది. దీన్నే హిందీలో 'క్షేత్రవాద్' అంటున్నారని"* (ముద్దెర,2005:12) సుజాతారెడ్డి చైతన్యవంతులైన ప్రాంతీయుల అస్తిత్వ ప్రకటితను గురించి సోదాహరణంగా ఈ వ్యాసాల్లో తెలియజేశారు. ముదిగంటి సుజాతారెడ్డి 'ముద్దెర'లోని వ్యాసాలతో పాటు తెలంగాణ కథ సాహిత్యంలోని ప్రాంతీయ అస్తిత్వవాదంలో 'తెలంగాణ తొలితరం కథలు' సంకలనాలు పేరుతో మరో నిర్మాణాత్మక పని కూడా చేశారు. ఈ రెండు కథ సంకలన పుస్తకాల్లో తెలంగాణ ప్రాంతంలోని వివిధ కథకుల పరిచయాలతో పాటు, కథాశిల్పం, వస్తువు, ఇతివృత్తం మొదలైన విషయాల్ని చర్చించారు. అలాగే తెలంగాణ భౌగోళిక, చారిత్రక, సామాజిక సందర్భంలో కథా సాహిత్యం ఏ విధంగా

వికసించిందో విశ్లేషించారు. *"వివక్షను ప్రశ్నించడం నుంచి తెలుగు కథా సాహిత్యంలో తెలంగాణ అస్తిత్వాన్ని చాటేందుకు నిర్మాణాత్మక కృషి చేశారు. మిగతా అస్తిత్వ ఉద్యమాలకు తెలంగాణ ప్రాంతీయ అస్తిత్వానికి గల తేడా ఇదే.*

*తెలంగాణ రచయితలు వివక్షను, అన్యాయాన్ని, ఆధిపత్య ధోరణులను ప్రశ్నించడంతోనే సరిపెట్టలేదు. తాము ఏమిటో చాటుకోవడానికి నిర్మాణాత్మక కృషికి పూనుకుని ఫలితాలు సాధించారు. ఆ రకంగా తెలంగాణ కథ సాహిత్య విస్తృతిని చాటి చెప్పడమే కాకుండా విస్తృత కథలను, కథకులను వెలికి తీసి వెలుగు చూపారు"*(ఆధునిక తెలుగు సాహిత్య విమర్శ,2018:230) అలాంటి కృషి ముఖ్యంగా ముదిగంటి సుజాతారెడ్డి, సంగిశెట్టి శ్రీనివాస్ వీరిద్దరి సంపాదకత్వంలో తెచ్చిన 'తెలంగాణ తొలితరం కథల' ద్వారా జరిగిందని యాకుబ్ ప్రస్తుతించారు. ఈ గ్రంథాల్లో వీరిద్దరూ తెలంగాణ కథ ఎక్కడ ప్రారంభమైంది? అది ఎలా ప్రయాణం చేసింది? అనే ప్రశ్నలకు సమాధానం వెతికే పని చేశారు. 'తెలంగాణ కథలు వాస్తవికత పేరుతో చేంతాడంత కథనంతో కథలు నడపటం ఉండదు. సుదీర్ఘమైన అనవసరమైన వర్ణనలుండవు. పాఠకుల మెదడుకు పనిపెడ్తూ ధ్వన్యాత్మకంగా ఉంటాయి. వస్తుధ్వనిని పాటించారు. కథ అంటే కవిత్వంలోలాగా పాఠకుల ఊహకు పనేదీ ఉండదనే శిల్పానికి అలవాటుపడే వాళ్ళకు వస్తుధ్వనితో కూడిన తెలంగాణ కథలు అసంపూర్ణంగా శిల్పం లోపించినట్లుగా కనబడవచ్చును. కానీ, తెలంగాణ కథల్లో జీవకళ ఉట్టిపడ్తుంది'. అందుకే తెలుగు కథా సాహిత్యంలో కొత్త అధ్యాయాన్ని సృష్టించి తెలుగు కథ గరిమను నిలిపే కథలుగా తెలంగాణ తొలితరం కథలను సాహిత్య చరిత్రకారులు తప్పకుండ గుర్తిస్తారనే ఒక మంచి నమ్మకాన్ని ముదిగంటి సుజాతారెడ్డి ఈ సందర్భంగా వ్యక్తీకరించారు.

సుజాతారెడ్డి 'ముద్దెర' గ్రంథంలో అస్తిత్వవాదం ఎలాంటి చారిత్రక, సామాజిక, ఆర్థిక భూమికలోంచి ఉద్భవించింది. అస్తిత్వవాద లక్షణాలు, ప్రభావ ఫలితాలు వివరించారు. దీనిలో కవిత్వం, నవల, కథ దీర్ఘకవిత, గేయం/పాట వంటి ప్రక్రియల స్వరూప స్వభావాలు తెలియజేశారు. భాష, భాష ప్రయోగ వైవిధ్యం, నిర్మాణ విధానం ఇతర అస్తిత్వవాదలైన దళిత, స్త్రీ, మైనార్టీ వాదాలలో అస్తిత్వవాద ప్రభావం గురించి కూడా ఇందులోని వ్యాసాలు

విశ్లేషించాయి. వీరు దీనిలో తెలంగాణ ప్రాంతీయ అస్తిత్వవాదానికి పునాదులుగా భావించబడే ప్రపంచీకరణ, నయా సామ్రాజ్యవాద విధానాలు, సంస్కృతీ, భాషాల పరిరక్షణ నుండి వచ్చిన ఆకాంక్షలని భావించి ప్రాంతీయ అస్తిత్వ భావనకు కావలసిన ఒక సిద్ధాంత పరమైన చర్చను చేశారు. అందుకే ఈ వ్యాసాలు తెలంగాణ ప్రాంతీయ అస్తిత్వవాద అవగాహనకు ఒక మార్గ నిర్దేశాన్ని అందించాయి.

## ముగింపు

విభిన్న సామాజిక ధోరణులను, పరిణామాలను అవగాహన చేసుకుని వాటి నేపథ్యాన్ని అందించే సామాజిక, చారిత్రక భూమికలను అన్వేషించడం సహృదయ విమర్శకులు చేసే పని. దీనినే ముదిగంటి సుజాతారెడ్డి ఆధునిక సాహిత్య విమర్శలో **'తెలుగు నవలానుశీలనం'** **'రసచర్చ–ఆధునికత'** గ్రంథాల్లో భాగంగా నవలా విమర్శ చేశారు. **'అద్యతన దృష్టి'** పేరుతో రాసిన వ్యాసాల్లో వ్యాస విమర్శ ధోరణిని పాటించారు. ఇక ముదిగంటిగారి సంపాదకత్వంలో భాగంగా వచ్చిన **'ముద్దెర'** వ్యాస సంపుటిలో రాసిన ఐదు వ్యాసాలు ప్రాంతీయ అస్తిత్వవాద విమర్శ పద్ధతికి నిదర్శనం. దీనిలో తెలంగాణ ప్రాంత సాహిత్యంలోని కవిత్వం, కథ, దీర్ఘకవిత, నవల మొదలైన వ్యాస ప్రక్రియల్లో వచ్చిన అస్తిత్వ వాద భావాలను తన విమర్శకోణం నుండి విశ్లేషించారు. అంతే కాకుండా సుజాతారెడ్డి "తెలంగాణ అస్తిత్వ వాద కవిత్వం" (దేశీయ కవితా ప్రస్థానం–2002) అనే పేరుతో రాసిన వ్యాసంలో అస్తిత్వవాద కవిత్వంలోని వస్తువును, అస్తిత్వవాదంలో వ్యక్తమైన నిర్దిష్ట భావజాలాన్ని గురించి చర్చించారు.

## ఈ అధ్యాయంలోని ప్రధానాంశాలు: (Key takeaways from this chapter)

- ముదిగంటి ముద్దెరలో రాసిన ఐదు విమర్శ వ్యాసాలలో తెలంగాణ ప్రాంతీయ అస్తిత్వవాద సాహిత్య విమర్శకు కావాల్సిన ఒక బలమైన పునాదిని అందించారు.
- భారతీయ సంస్కృతిలో భాగమైన దాంపత్య ధర్మం, కుటుంబ వ్యవస్థ మీద అధిక గౌరవమున్న విశ్వనాథ సహజంగానే భవభూతి రాసిన 'ఉత్తర రామచరిత్ర' చేత ప్రభావితం చేందాడన్నారు. అందుకే విశ్వనాథ ఏకవీర, చెలియలికట్ట, తెరచిరాజు

వంటి నవలల్లో భవభూతి వర్ణించిన స్పర్శతత్త్వాన్ని ప్రవేశపెట్టాడని సుజాతారెడ్డి అభిప్రాయపడ్డారు.

- రచయితలు లేదా విమర్శకులు సాధారణంగా సాహిత్యానికి సంబంధించిన విషయాల మీద విశ్లేషణ చేయడం లేదా పరిశీలించడం సహజమే కానీ, ముదిగంటి సుజాతారెడ్డిగారి వంటి సాహిత్యకారులు మాత్రం సాహిత్యానికి సమాజానికి మధ్య వుండే కార్యకారణ సంబంధాన్ని తెలియజేసే విషయాల మీద కూడా దృష్టి పెట్టి సాహిత్యాన్ని పరిశీలిస్తూ ఉంటారు.
- ‘**అద్యతన దృష్టి**’ వంటి విమర్శ వ్యాసాల పుస్తకం ఒక విమర్శకునిలోని విభిన్న ఆలోచనల సాహిత్య సమన్వయానికి తార్కాణం.
- తెలుగు సాహిత్య చరిత్రను వ్యక్తుల పేరుతో యుగాలుగా విభజిస్తే స్త్రీవాదాన్ని బలంగా విశ్వసించి రచనలు చేసి ప్రచారం చేసిన నాయకత్వం వహించిన ఓల్గాగారి పేరు మీదనే స్త్రీవాదయుగం పిలవబడుతుందని చెప్పి స్త్రీవాద సాహిత్యంలో ఓల్గా చేసిన కృషిని గుర్తించే ప్రయత్నం ముదిగంటి చేశారు.
- ముస్లిం మైనారిటీ వాదం అంటే ముస్లిం మైనారిటీ తత్వం. ముస్లిం మైనారిటీల తాత్త్విక దృక్పథం. ముస్లింలు తమ గతాన్ని ఎలా చూడాలి? తమ భవిష్యత్ ను ఎలా నిర్మించుకోవాలి? ఈ రెండిటికి సంబంధించిన వివిధ అంశాల పట్ల ఎటువంటి వైఖరిని ప్రదర్శించాలనే వివిధ అంశాలను వివరించేదే ముస్లిం మైనారిటీ తాత్త్విక దృక్పథం. ఈ దృక్పథాన్ని సాహిత్య కళారంగాల్లో ఎలా ప్రతిఫలింపజేయాలో వివరించేదే ముస్లిం మైనారిటీ సాహిత్య దృక్పథం.
- ఒక ప్రాంతం తన అస్తిత్వం అస్మిత ఆత్మగౌరవాలను ప్రకటించే భావజాలమే ప్రాంతీయ అస్తిత్వవాదంగా లేదా ప్రాంతీయ అస్తిత్వ వేదనా వాదంగా పిలవబడుతున్నది. దీన్నే హిందీలో ‘క్షేత్రవాద్’ అంటున్నారు.

- రసాన్ని నవలకు అన్వయించే సందర్భంలో 'తాదాత్మ్యాన్ని' అనే అంశాన్ని సుజాతారెడ్డి ఒక మౌలికమైన ప్రధాన విషయంగా స్వీకరించారు. వీరు దీనిని 'Iidentify' అవడం అంటారు. రసానుభవ స్థితిలో మనం పొందే సాధారణీకరణం అవడమే తాదాత్మ్యం.

తర్వాతి అధ్యాయంలో ముదిగంటి సుజాతారెడ్డి ఒక స్త్రీగా తనకంటూ ఒక ప్రత్యేకత సాధించుకున్న సాహిత్య చరిత్ర రచనల్లో విమర్శనాంశాల గురించి ప్రత్యేక అధ్యాయంలో చర్చించాల్సిన అవసరం ఉంది.

## అధ్యాయం-5

# సుజాతారెడ్డి సాహిత్య చరిత్రల్లో విమర్శనాంశాలు

రచయితల్లో బహుముఖ ప్రజ్ఞా ఉండటమనేది వారి రచనల్లోనే ప్రతిఫలిస్తూ ఉంటుంది. అలాంటి బహుముఖ విషయాల్లో నైపుణ్యం గలవారిలో ముదిగంటి సుజాతారెడ్డిగారు ఒకరు. ముదిగంటివారు చాలా తక్కువ మంది మాత్రమే రాయగలిగే సాహిత్య చరిత్ర రంగంలో కూడా కృషి చేశారు. సుజాతారెడ్డి రాసిన **'చారిత్రక సామాజిక నేపథ్యంలో తెలుగు సాహిత్య చరిత్ర'** గ్రంథం తెలుగు సాహిత్యంలో ఒక స్త్రీ రచించిన మొట్టమొదటి సాహిత్య చరిత్ర. దీనిలో వీరు తెలుగు సాహిత్య పరిణామ వికాసాలను చారిత్రక సామాజిక కోణంలో చర్చిస్తూ ఒక భిన్నమైన దృక్పథంతో సాహిత్య చరిత్ర సృష్టి చేశారు. అలాగే, సుజాతారెడ్డి తమ భర్తగారైన ముదిగంటివారు గోపాల్ రెడ్డిగారితో కలిసి **'సంస్కృత సాహిత్య చరిత్ర'**ను తెలుగులో రాశారు. ఇది తెలుగు సాహిత్యంలో ఎంతో ప్రాధాన్యతను సంతరించుకుంది. తర్వాతి కాలంలో **'ఆంధ్రుల సంస్కృతి సాహిత్య చరిత్ర'** పేరుతో ఒక సాహిత్య చరిత్ర గ్రంథాన్ని వెలువరించారు. దీనిలో కొన్ని మౌలికమైన మార్పులు చేస్తూ **'మన తెలుగు సాహిత్య చరిత్ర'** పేరుతో తీర్చిదిద్దారు. అంతే కాకుండా తెలంగాణ ప్రాంతీయ అస్తిత్వవాదం బలపడుతున్న రోజుల్లో సాహిత్య చరిత్రను పునర్మూల్యాంకనం చేస్తూ **'తెలంగాణ తెలుగు సాహిత్య చరిత్ర'** గ్రంథాన్ని రాసి తెలంగాణ ప్రాంతీయ వాదానికి ఒక బలమైన భూమికను అందించారు.

తెలుగు సాహిత్య విమర్శలో సాహిత్య చరిత్రలు అధిక ప్రాధాన్యతను కలిగి ఉన్నాయి. కావ్య విమర్శలో సమకాలీన సాంఘీక పరిస్థితులకు, కవిజీవిత విశేషాలకు ప్రాముఖ్యత ఉంది. ముఖ్యంగా సాహిత్య చరిత్రలు కవి జీవితాన్ని, యుగ ప్రభావాన్ని, సాహిత్య క్రమ పరిణామాన్ని అనుశీలిస్తాయి. కావ్య విమర్శకు కవి చరిత్రలే ఆధారం. సాహిత్య చరిత్రలు వివిధ యుగాలను, వివిధ సాహిత్య ప్రకియలను సమీక్షించాయి. కానీ, కొన్ని సాహిత్య చరిత్రలు ప్రత్యేక యుగాల్లోని కవులకు మాత్రమే పరిమితమైతే మరికొన్ని ప్రత్యేక ప్రక్రియలను మాత్రమే విశ్లేషించాయి. కొన్ని

కవి జీవితాల ఆధారంగా కవుల చరిత్రను మాత్రమే చెప్పాయి. తెలుగు సాహిత్య చరిత్రలు అనేక రూపాల్లో వెలువడిన వీటిలో చరిత్రతో పాటు కొంత సాహిత్య విమర్శ కూడా పాలుపంచుకుంది. ఈ విధంగా ముదిగంటి సుజాతారెడ్డిగారు రాసిన సాహిత్య చరిత్ర గ్రంథాల్లో ఉన్న కొన్ని విమర్శనాంశాలను ఈ అధ్యాయంలో భాగంగా పరిశీలించాలనుకుంటున్నాను దానికి ముందు సాహిత్య చరిత్ర రచనకు సంబంధించిన ఒక ప్రాథమిక అవగాహన కొరకు సాహిత్య చరిత్రల గురించి కొంత తెలుసుకోవాల్సిన అవసరం ఉందని భావిస్తున్నాను.

## 5.0 సాహిత్య చరిత్ర ఒక పరిచయం

ఆయా వాస్తవిక ఘటనలని(real events), అవి ఎప్పుడూ ఎక్కడ ఎలా జరిగిందో తెలుసుకొని, వాటిని ఒక కాలక్రమంలో అమర్చి వాటి మధ్యగల పరస్పర సంబంధాన్ని నిరూపించడమే "చరిత్ర"(History)గా చెప్పవచ్చు. దీనినే 'Bloch' అనే చరిత్రకారుడు "History is the science of men in time"గా అభివర్ణించారు. (The Journal of Negro History, Vol. 39, 1954:71-73) మానవుని పుట్టుక నుండి, నిన్నటివరకు గల గడిచిన కాలాన్ని చరిత్రగా చెప్పుకుంటే, దీనిని ఒక శాస్త్రీయ పద్ధతిలో నిర్మించుకునే క్రమం మాత్రం యూరప్ లో వచ్చిన సాంస్కృతిక పునరుజ్జీవనంతో ప్రారంభమయింది. గతకాలపు వాస్తవాలను సాక్ష్యాధారాలతో స్పష్టంగా ధృవీకరించి తెలుసుకోవాలనే పట్టుదలే 'చరిత్ర' అనే అధ్యయనం ఏర్పడటానికి పునాదిగా చెప్పవచ్చు. ఈ అధ్యయనం అనేది గతకాలం పట్ల ఒక కొత్త 'వాస్తవిక దృష్టి'ని మిగతా ప్రపంచానికి అందించింది.

యూరప్ లో ప్రారంభమయిన సాంస్కృతిక పునరుజ్జీవనాన్ని అందిపుచ్చుకుని వివిధ రంగాల్లోని విద్వాంసులు తమ తమ రంగాలకు సంబంధించిన ప్రత్యేక చరిత్రలను నిర్మించుకోవడం ప్రారంభించారు. దీని ప్రభావం భారతదేశంపై కూడా పడటంతో ఇక్కడ కూడా వివిధ సమాజ చరిత్రలు, కళాచరిత్రలు, సాహిత్య చరిత్రలు నిర్మించబడ్డాయి. కాని దీనికి కావల్సిన ఆరంభ కృషిని యూరోపియన్ విద్వాంసులే చేశారు. "గార్సా-ద-తార్సీ" అనే ఫ్రెంచి విద్వాంసుడు హిందీ సాహిత్యానికి మొట్టమొదటి సాహిత్య చరిత్రను రచించాడు.(Dr.

Dhirendra Verma, Hindi Sahitya Kosh, Part 2, Editor Gyan Mandal Ltd. Varanasi, Second Edition 1986:128)

తెలుగులో వచ్చిన వివిధ సాహిత్య చరిత్రల్లో భాగంగా 'కావలి రామస్వామి'(1829) రాసిన (Biographical sketches of Deccan poets)'దక్కను కవుల చరిత్రము'తో ప్రారంభమయి వివిధ రచయితలు "కవి జీవితములు, కవిత్వ చరిత్రము, వాఙ్మయ చరిత్రలు, వాఙ్మయ చరిత్ర సంగ్రహము, సాహిత్య చరిత్ర"లు వంటి పేర్లతో, సమాజంలో వస్తున్న మార్పులకనుగుణంగా వచ్చిన సాహిత్యంలో భాగంగా ఏర్పడిన వివిధ ధోరణులు, అస్తిత్వ, ప్రాంతీయ ఉద్యమాల వరకు ఎన్నో సాహిత్య చరిత్రలను రాస్తూ వచ్చారు. కాని సాహిత్య చరిత్ర అంటే కేవలం ఆయా గ్రంథాలను ఒక కాల క్రమంలో అమర్చి పెట్టడం మాత్రం కాదు కదా! అయితే సాహిత్య చరిత్ర రచనల్లో ఒక పరిణతి కోసం చూస్తూ తొలిదశ నుంచి కూడా సాహిత్య చరిత్ర రచయితలు, తాము రాస్తున్న రచనల్లోని, రచనలను విశ్లేషించడంలో, వారు చేసిన వివిధ చర్చల్లో భాగంగా వాటిలోని సాహిత్యంశాల దృష్ట్యా విమర్శను ఒక అంతర్భాగంగానే చేస్తూ వచ్చారు. అయితే వివిధ కళా చరిత్రలు, సాహిత్య చరిత్రలు రాయడం వంటి ప్రయత్నాలన్ని 'చరిత్ర' అనే ఒక అధ్యయన రంగం ఏర్పడిన తర్వాతనే ఆవిర్భవించినట్లు అర్థమవుతుంది.

సాహిత్య చరిత్ర రచన లేదా రూపకల్పన ఒక మహా నిఘంటువును కూర్చడంతో కూడుకున్న శ్రమతో సమానం. నిఘంటువులలాగే సాహిత్య చరిత్రలు కూడా ఆవశ్య పరామర్శ గ్రంథాలుగా మన వ్యక్తిగత పుస్తక గ్రంథాలయంలో ఉండగలిగే స్థానాన్ని కలిగి ఉంటాయి. సాహిత్య చరిత్రల మార్గదర్శనం లేకుండా ఆయా భాషా సాహిత్యాల సంగతుల్ని అర్థం చేసుకోవడం దాదాపు అసాధ్యం. అంతే కాకుండా ఒక భాష సాహిత్యపు గత వైభవాన్ని గుర్తించేందుకు వర్తమాన క్రమాన్ని అంచనా వేసేందుకు కూడా సాహిత్య చరిత్రల తోడ్పాటు అవసరం. ఆంగ్ల సాహిత్య చరిత్ర రచనలు వందల సంవత్సరాలుగా వస్తున్నాయి. మరిన్ని వందల ఏళ్ళు ఇవి వెలువడుతూనే ఉంటాయి. ఇలా ఆంగ్ల భాషా సాహిత్య విశేషాలు విశ్వమంతటా వ్యాప్తి అయ్యేందుకు భాష సాహిత్య చరిత్ర గ్రంథాలు అనేక రూపాల్లో తోడ్పడ్డాయి. సాహిత్య చరిత్రల గురించి ఒక ప్రామాణికమైన కృషి చేసిన జివిఎస్ గారు "*ఏయే చారిత్రక సాంఘిక, మత, రాజకీయ, సాంస్కృతిక సాహిత్య భూమికల ఆధారంగా చేసుకొని*

*ఆయా కాలాలలో ఆయా కవులు ఏయే రచనలు చేశారో వివేచిస్తూ కాల క్రమపద్ధతిలో యుగ విభజన సూత్రాన్ని ఆలంబనగా చేసుకొని రచించేది సాహిత్య చరిత్ర"* (సాహిత్య చరిత్రలో చర్చనీయాంశాలు,1991:720) అని **'సాహిత్య చరిత్రలో చర్చనీయాంశాలు'** అనే గ్రంథంలో సాహిత్య చరిత్ర గూర్చి తగిన నిర్వచనమిచ్చారు. సాహిత్య చరిత్ర రచన మంచిదే అయినా అందులో ప్రామాణికత, నిష్పాక్షికత, సమగ్రత అనే మూడు సూత్రాలు లోపిస్తే మాత్రం కృషి అంతా వృథా అవుతుంది.

## 5.1 కవుల చరిత్ర-సాహిత్య చరిత్ర-వికాస చరిత్ర

చారిత్రకంగా సాహిత్య చరిత్ర రచనలో ఒక క్రమ పరిణామం కనిపిస్తుంది. ఇది మొదట కవుల చరిత్రలుగా మొదలై తర్వాత సాహిత్య చరిత్రలుగా రూపాంతరం చెందింది. తర్వాతి దశలో వీటిని ఆధారంగా చేసుకుని సాహిత్య చరిత్రలు వికాస చరిత్రలుగా వచ్చాయి. వెయ్యేళ్ళ తెలుగు సాహిత్యంలో ఎంత మంది కవులు, రచయితలు ఏయే కాలాలలో ఏయే రచనలు చేశారు? వాటి విశేషాలేంటి? అని చెప్పే పద్ధతిని 'కవుల చరిత్ర'గా పరిగణిస్తున్నారు. ఈ కవి జీవితవిశేషాలను ఆధారంగా చేసుకుని అవతరణ యుగంలో అనేక సాహిత్య చరిత్రలు వెలువడ్డాయి. మొదటిసారిగా కవి చరిత్రరచనకు ఒక ప్రణాళికను ఏర్పరచింది మాత్రం గురజాడ శ్రీరామమూర్తిగారు రాసిన '**కవిజీవితములు**'(1893) అని పేర్కొనవచ్చు.(రామరావు, ఎస్వీ. తెలుగులో సాహిత్య విమర్శ, 2017:109) తొలిదశలో వచ్చిన ఈ కవుల చరిత్రలలో తమకు తెలిసిన ప్రముఖమైన కొందరి కవుల జీవితాన్ని పరిచయం చేయడానికి ప్రయత్నించేవారు. వీటిలో సాహిత్య రచనల కంటే వారి జన్మ వివరాలు, కుల గోత్రాలు, జన వ్యవహారంలోని కథలు వంటి వాటికి ఎక్కువగా ప్రాధాన్యత ఉండేది. సరైన చారిత్రక ఆధారాలు ఉండేవి కావు. కావలి రామస్వామి 'The Biographical sketches of Deccan poets' పేరుతో రాసిన '**దక్కను కవుల చరిత్ర**' గ్రంథంలో తొలిసారిగా తెలుగు కవుల జీవితాలను కొంత స్పృశించారు. అయితే ఈ కాలంలోనే 'చరిత్ర' 'చారిత్రక దృష్టి' అనే కొత్త మార్గాలు ఏర్పడ్డాయి. దీనితో ఆంధ్రుల రాజకీయ చరిత్ర, సామాజిక లేదా సాంఘిక చరిత్ర లాంటివి

రాయడం మొదలుపెట్టారు. వీటి ప్రభావంతో, సాహితీపరమైన ఇతర ఆధారాలతోటి, కవుల కాల నిర్ణయాలు, గ్రంథకర్తృత్వ పరిశీలనల వల్ల సాహిత్య చరిత్ర రచనలు ఒక ప్రామాణికతను సంపాదించుకున్నాయి. ఇలా కవులు, వారి చరిత్రలు, సాహిత్య విషయాలను తెలిపే కవి జీవితములు, చరిత్రతో ప్రారంభమైన వాఙ్మయ చరిత్ర తర్వాత ఎందరో రచయితలు, పరిశోధకులు, విమర్శకుల ఫలితంగా 'సాహిత్య చరిత్ర'లుగా మార్పు చెందాయి. వీటిలో **'ఆంధ్ర వాఙ్మయ చరిత్ర**'(1920) పేరుతో రాసిన వంగూరు సుబ్బారావుగారి సాహిత్య చరిత్ర, తెలుగు సాహిత్యానికి సంబంధించిన ప్రథమ సాహిత్య చరిత్రమని తెలుస్తుంది.(ఎస్.వి. సూర్యకుమారి. తెలుగులో సాహిత్య చరిత్రలు(అముద్రిత సిద్ధాంత గ్రంథం). హైదరాబాద్ విశ్వవిద్యాలయం.1989:77) కల్లూరి వేంకటనారాయణరావుగారి '**ఆంధ్ర వాఙ్మయ చరిత్ర సంగ్రహము**'(1926), ఖండవల్లి లక్ష్మీరంజనం రాసిన '**అంధ్ర సాహిత్య చరిత్ర సంగ్రహము**'(1949) మరికొన్ని సాహిత్య చరిత్ర గ్రంథాలుగా చెప్పవచ్చు.

కవి జీవితాలతో ప్రారంభమైన సాహిత్య చరిత్ర గ్రంథ రచన, చారిత్రక ఆధారాలు, లభ్యమవుతున్న సాహిత్య గ్రంథాలు, వివిధ కావ్యావతారికలు, కవుల కలాలు వీటన్నిటి సమన్వయంతో 'సాహిత్య చరిత్ర'లు ఏర్పడే అవకాశం కలిగింది. కానీ, చరిత్రలోని అంతర్గత సూత్రాలను, వేరు వేరు సంఘటలను సమన్వయం చేయాలనే ఒక తపన తర్వాతి కాలంలో 'సాహిత్య వికాస చరిత్ర'లుగా రావడానికి ఒక మార్గదర్శకం అయింది. ఇది కవిత్వవేది రాసిన ఆంధ్ర వాఙ్మయ చరిత్ర సంగ్రహం గ్రంథంలో మొగ్గలు తొడిగి వివిధ విశ్వవిద్యాలయాల్లో ప్రారంభమైన పరిశోధన కృషితో మార్గం సులభం చేసుకుంది. 1965లో ఆరుద్ర రాసిన 'సమగ్రాంధ్ర సాహిత్య చరిత్ర'లో పరిణామ పరిశీలన, వికాస దృష్టి కనిపిస్తుంది. వెల్చేరు నారాయణరావు రాసిన '**తెలుగులో కవితా విప్లవాల స్వరూపం**'(1978) గ్రంథంలో సాహిత్య పరిణామాన్ని ముఖ్యంగా కవిత్వ వికాసాన్ని కొంత భిన్న దృక్పథంతో అందించారు. ఇక ఆధునిక కాలంలో తెలుగులో ఒక 'సమగ్ర సాహిత్య వికాస చరిత్ర' ప్రాధాన్యతను తెలియజేస్తూ, వికాస చరిత్ర రచనకు కావల్సిన సైద్ధాంతిక నేపథ్యాన్ని అందించటానికి ప్రయత్నించినవారు జి.వి. సుబ్రహ్మణ్యం. అయన **'సాహిత్య చరిత్రలో చర్చనీయాంశాలు'** పేరుతో రాసిన వ్యాసాలు

సాహిత్య వికాస చరిత్ర, ప్రక్రియాపరమైన వికాస చరిత్రకు గురించి ఎన్నో విషయాలు తెలియజేశాయి. ఈ విధంగా తెలుగు సాహిత్య చరిత్రలో ఒక పరిణామక్రమ దశ కనబడుతుంది. తెలుగులో కవిజీవితాలతో మొదలై తర్వాత సాహిత్య చరిత్రలుగా మారి, క్రమంగా వికాస దృష్టి ఏర్పడి ఒక సమగ్ర సాహిత్య చరిత్ర ఏర్పాటుకు కావల్సిన నేపథ్యాన్ని అందుకుంది. అందుకు కావల్సిన ప్రయత్నాలు కూడా ఇటీవలి కాలంలో కొంత జరుతున్నాయి.

## 5.2 తెలుగులో సాహిత్య చరిత్రలు

తెలుగులో ఇప్పటివరకు అనేక రకాల సాహిత్య చరిత్ర గ్రంథాలు వెలువడ్డాయి. నా పరిశోధనలో భాగంగా లభించిన కొన్ని సాహిత్య చరిత్రల కొన్నింటి వివరాలు కింద పొందుపరుస్తున్నాను. ఇది సమగ్రమైన రచనల జాబితా మాత్రం కాదు. తెలుగులో ఇప్పటివరకు వచ్చిన వివిధ రకాల సాహిత్య చరిత్రలను సేకరించి వాటి స్వరూపాన్ని ఆధారంగా విభజించి సాహిత్య చరిత్రలపై ఒక ప్రత్యేక అధ్యయనం జరగవలసి ఉంది.

1. అచ్యుతరావు, టేకుమళ్ళ. ***ఆంధ్ర వాజ్మయ చరిత్రము*** ,1939.
2. అప్పారావు, బసవరాజు. ***ఆంధ్ర కవిత్వ చరిత్రము*** ,1932.
3. ఆరుద్ర. ***సమగ్రాంధ్ర సాహిత్యం.*** హైదరాబాదు: తెలుగు అకాడమీ, 2007.
4. కాసిం, సి. ***తెలంగాణ సాహిత్యం.*** 2017.
5. **తెలుగు సాహిత్య చరిత్ర**, తెలుగు అకాడమీ;1986.
6. ద్వా.నా.శాస్త్రి. **తెలుగు సాహిత్య చరిత్ర,** హైదరాబాద్: ప్రగతి పబ్లిషర్స్,2016.
7. నాగయ్య, జి. **తెలుగు సాహిత్య సమీక్ష (ప్రథమ, ద్వితీయ సంపుటాలు)**. తిరుపతి:నవ్య పరిశోధక ప్రచురణలు,2009.
8. నాగేశ్వరరావు, కాశీనాథుని. ***ఆంధ్ర వాఙ్మయ చరిత్ర***. విజయవాడ: ప్రాచీపబ్లికేషన్స్, 1927.
9. నారాయణ రావు, వెల్చేరు. **తెలుగులో కవితా విప్లవాల స్వరూపం.** హైదరాబాద్: తానా ప్రచురణ, 2008.
10. నారాయణ రెడ్డి, సుంకిరెడ్డి. ***తెలంగాణ చరిత్ర*** ,2011.
11. నారాయణమూర్తి, భోగరాజు. ***ఆంధ్ర కవిత్వ చరిత్రము*** ,1927.

12. నారాయణరెడ్డి, సుంకిరెడ్డి. **ముంగిలి**. హైదరాబాద్: తెలుగు అకాడమీ,2016.
13. ప్రతాపరెడ్డి, సురవరం. ***ఆంధ్రుల సాంఘిక చరిత్ర***.?:క్లాసిక్పబ్లికేషన్స్, 2015.
14. ప్రతాపరెడ్డి, సురవరం. ***గోలకొండ కవుల సంచిక.*** గోలకొండ ముద్రణాలయం.1934.
15. ప్రసాద్, చలసాని. ఎల్, వేణుగోపాల్. సం. **ఆధునికాంధ్ర సాహిత్య చరిత్ర కె.వి.రమణారెడ్డి.** విజయవాడ: విరసం ప్రచురణలు,1992.
16. మందేశ్వరరావు, వడలి. ***అనుశీలన సాహిత్య విమర్శ***. హైదరాబాదు: తెలుగు అకాడమీ, 1992.
17.మహదేవశాస్త్రి, కోరాడ. ***ఆంధ్ర వాఙ్మయ చరిత్రము*** ,1985.
18. యశోదారెడ్డి, పి. ***ఆంధ్ర సాహిత్య వికాసము*** (ప్రథమ భాగం) 1974.
19. రంగనాథాచార్యులు, కే.కే. సం. **ఆధునిక తెలుగు సాహిత్యంలో విభిన్న ధోరణులు**. హైదరాబాద్: ఆంధ్ర సారస్వత పరిషత్తు,2005.
20. రామకృష్ణ శాస్త్రి, శిష్ట్లా. ***ఆంధ్ర వాఙ్మయ చరిత్ర సర్వస్వం***,1957.
21. రామమోహనరాయ్,కడియాల. **తెలుగు కవితావికాసము(1947-1980).**హైదరాబాద్: ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి,1982.
22. రామారావు, ఎస్వీ. ***తెలంగాణ సాహిత్య వైశిష్ట్యం.*** హైదరాబాద్: తెలంగాణ సాహిత్య పరిశోధన కేంద్రం,2015.
23. లక్ష్మీకాంతం, పింగళి. ***ఆంధ్ర సాహిత్య చరిత్ర***. హైదరాబాద్: విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్,2005.
24. లక్ష్మీకాన్తమ్మ, ఊటుకూరి. ***ఆంధ్ర రచయిత్రులు*** ,1958.
25. లక్ష్మీరంజనం, ఖండవల్లి. ***ఆంధ్రుల చరిత్ర–సంస్కృతి***. హైదరాబాద్: ఠాగూర్ పబ్లికేషన్స్, 1951.
26. వీరేశలింగం, కందుకూరి. ***ఆంధ్ర కవుల చరిత్రము***. హైదరాబాద్: విశాలాంధ్ర పబ్లికేషన్స్, 2008.
27. వేంకటరావు, నిడుదవోలు. ***తెనుగు కవుల చరిత్ర.*** మద్రాసు: మద్రాసు విశ్వవిద్యాలయం, 1956.

28. వేంకటేశ్వరరావు, ఆర్. ***ఆంధ్ర సాహిత్య చరిత్ర సంస్కృతి***. హైదరాబాద్: విశాలాంధ్ర పబ్లికేషన్స్, 2005.
29. వేంకటేశ్వర్లు, ఉన్నం. ***తెలంగాణ సమగ్ర సాహిత్య చరిత్ర***. హైదరాబాద్:ఉన్నం బ్రదర్స్ పబ్లికేషన్స్,2015.
30. వేంకటేశ్వర్లు, వారణాసి. **ఆంధ్ర సాహిత్య సంగ్రహచరిత్ర.** నరసరావుపేట: స్టూడెంట్స్ ఫ్రండ్స్ 1974.
31. వేంకట నారాయణరావు, కల్లూరు. ***ఆంధ్ర వాఙ్మయ చరిత్ర సంగ్రహము***. మద్రాస్: రామస్వామి శాస్త్రులు&సన్స్,1936.
32. వేంకట రమణయ్య, బులుసు. ***ఆంధ్ర కవిసప్తశతి*** ,1956.
33. వేంకటరాయశాస్త్రి, వేదం. **ఆంధ్ర సాహిత్య దర్పణము** (ప్రథమ భాగము). మద్రాసు: వేదము వేంకటరాయశాస్త్రి అండ్ బ్రదర్స్.
34. వేంకటావధాని, దివాకర్ల. ***ఆంధ్ర వాఙ్మయ చరిత్ర***. హైదరాబాదు: ఆంధ్ర సారస్వత పరిషత్, 2009.
35. వేంకటావధాని, దివాకర్ల. ***ప్రాఙ్నన్నయ యుగము*** ,1960.
36. వేణుగోపాల స్వామి, కూర్మా. ***ఆంధ్ర వాఙ్మయ సంగ్రహ చరిత్ర*** ,1958.
37. శేషగిరిరావు, ఆంద్ర. ***ఆంధ్ర కవయిత్రులు*** ,1995.
38. శేషయ్య, చాగంటి. **ఆంధ్రకవి తరంగిణి** (12 సంపుటాలు) తూర్పుగోదావరి జిల్లా: హిందూ ధర్మశాస్త్ర గ్రంథ నిలయం,1948.
39. శేషయ్య, చాగంటి. **ఆంధ్రకవి తరంగిణి** (మొదటి సంపుటం).కాకినాడ, ఆంధ్ర ప్రచారిణీ లిమిటెడ్.
40. శ్రీనివాస్, కె. **తెలంగాణ సాహిత్య వికాసం**. హైదరాబాద్: తెలంగాణ ప్రచురణలు,2015.
41. శ్రీరామమూర్తి, కొర్లపాటి. **తెలుగు సాహిత్య చరిత్ర.** చతుర్థ విశాఖపట్టణం: రమణ శ్రీ ప్రచురణ,1991.

42. శ్రీరామమూర్తి, గురజాడ. ***కవిజీవితములు***. చెన్నపురి: వావిళ్ల రామస్వామి శాస్త్రులు అండ్ సన్స్, 1913.

43. శ్రీహరి, రవ్వా. సం. **తెలంగాణ ఆధునిక సాహిత్య చరిత్ర.** హైదరాబాద్: తెలుగు అకాడమీ,2016.

44. సత్యనారాయణ, మధునాపంతుల. ***ఆంధ్ర రచయితలు*** , రాజమహేంద్రవరం, 1950.

45. సత్యనారాయణ, యండమూరి. ***ఉషః కిరణాలు***,1960.

46. సిమ్మన, వెలమల. ***తెలుగు సాహిత్య చరిత్ర***. విశాఖపట్నం: దళిత సాహిత్య పీఠం, 2011.

47. సీతారామయ్య, కురుగంటి. ***నవ్యాంధ్ర సాహిత్య వీధులు***. హైద్రాబాద్: తెలుగు విశ్వవిద్యాలయం, 1994.

48. సుజాతారెడ్డి, ముదిగంటి&గోపాల్ రెడ్డి. ***సంస్కృత సాహిత్య చరిత్ర.*** హైదరాబాద్: పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం. 1986.

49. సుజాతారెడ్డి, ముదిగంటి. ***ఆంధ్రుల సంస్కృతి సాహిత్య చరిత్ర***. హైదరాబాదు: తెలుగు అకాడమి, 2007.

50. సుజాతారెడ్డి, ముదిగంటి. ***చారిత్రక సామాజిక నేపథ్యంలో తెలుగు సాహిత్య చరిత్ర.*** హైదరాబాద్: రోహణమ్ పబ్లికేషన్స్ 1996.

51. సుజాతారెడ్డి, ముదిగంటి. ***తెలంగాణ తెలుగు సాహిత్య చరిత్ర.*** హైదరాబాద్: తెలంగాణ సారస్వత పరిషత్తు, 2015.

52. సుజాతారెడ్డి, ముదిగంటి. ***మన తెలుగు సాహిత్య చరిత్ర***. హైదరాబాదు: తెలుగు అకాడమి, 2018.

53. సుబ్బరామయ్య, ముప్వల. ***ప్రాచీన సాహిత్య దర్శనం***. గుంటూరు: జయంతి పబ్లికేషన్స్, 2012.

54. సుబ్బారావు, వంగూరి. ***ఆంధ్ర వాఙ్మయ చరిత్ర*** ,1920.

55. హనుమచ్ఛాస్త్రి, ఇంద్రగంటి. ***ఆరు యుగాల ఆంధ్ర కవిత్వం***,1986.

## 5.3 ఇతర భాషల సాహిత్య చరిత్రలు

1. అప్పలస్వామి పురిపండా. **ఒడియా సాహిత్యచరిత్ర.**
2. ఆర్వీఎస్. సుందరం. **కన్నడ సాహిత్య చరిత్ర.**
3. ఎమైల్ లూయిస్. **ఎ హిస్టరీ అఫ్ ఇంగ్లీష్ లిటరేచర్.**
4. చల్లా రాధాకృష్ణ శర్మ. **తమిళ సాహిత్య చరిత్ర**
5. నళిన్ విలోచన్ శర్మా. **సాహిత్య కా ఇతిహాస్ దర్శన్.**
6. నారాయణరావు చిలుకూరి. **గుజరాతీ వాఙ్మయ చరిత్ర.**
7. మల్లాది సూర్యనారాయణ శాస్త్రి. **సంస్కృత వాఙ్మయ చరిత్రము.**
8. ముదిగంటి సుజాతారెడ్డి&గోపాల్ రెడ్డి. **సంస్కృత సాహిత్య చరిత్ర.**
9. రనెవెలెక్. **థియరి అఫ్ లిటరేచర్**.
10. వేంకటేశ్వర శాస్త్రి. **మలయాళ భాషాసాహిత్యముల సంగ్రహ చరిత్ర.**
11. సదాశివ. **ఉర్దూ సాహిత్య చరిత్ర.**
12. సుమన్ రాజె. **సాహిత్యేతిహస్ సంరచనా ఔర్ స్వరూప్**.
13. హనుమచ్ఛాస్త్రి ఆయాచితుల. **హిందీ సాహిత్య చరిత్ర.**

## 5.4 సమగ్ర సాహిత్య చరిత్ర నిర్మాణ ప్రయత్నదశ

సాహిత్యం అనేది ఒక నిరంతర ప్రవాహం లాంటిది. అది ఎల్లప్పుడూ మార్పు చెందుతూనే ఉంటుంది. అందుకే సాహిత్యంలో దేనిని నిర్దిష్టంగా సమగ్రమైందిగా నిర్ధారించలేము. కానీ, మనిషికి ఎప్పుడూ ఉన్నదానిని మరింత ఉన్నతంగా చేయాలనే తపన ఉండటం సహజం. ఇది సాహిత్య చరిత్ర పరిశోధనకు కూడా వర్తిస్తుంది. ముందునుండి ఉన్న సాహిత్య చరిత్రకారులు, వివిధ రకాల సాహిత్యాల మీద పరిశోధన చేసే పరిశోధకులు సాహిత్యాన్ని మరింత సమగ్రంగా తీర్చదిద్దాలన్న ఒక తపనతో ఉన్నట్లనిపిస్తుంది. సాహిత్య చరిత్రకారులు మొదట కవిజీవితాలు, గ్రంథపరిష్కారాలు, వివిధ రకాల ప్రతుల సేకరణతో మొదలుపెట్టి తెలుగు సాహిత్య చరిత్ర నిర్మాణానికి తెలియకుండానే ఒక పునాది వేశారు. కాని కొంతమంది పరిశోధకులు వారి గ్రంథ

శీర్షికల్లో 'సంగ్రహ' అనే పదాన్ని వాడటాన్ని బట్టి వారి పరిశోధనలు సమగ్రమైనవి కావనే ఒక స్పృహను వారు కలిగి ఉన్నట్లు భావించవచ్చు. అయితే సమగ్రమైన సాహిత్య చరిత్ర దిశగా అడుగులు మాత్రం వేశారు. ఇది ఆరుద్రగారి 'సమగ్రాంధ్ర సాహిత్య చరిత్ర' ద్వారా వ్యక్తం అవుతుంది. వీరితోపాటు అనేకమంది పరిశోధకులు, చరిత్రకారులు ఆ దిశగా ప్రయత్నాలు కొనసాగించారు. వీరందరిలో జి.వి.సుబ్రహ్మణ్యం ప్రముఖులు. జివిఎస్ ఆధునిక కాలంలో తెలుగులో ఒక 'సమగ్ర సాహిత్య వికాస చరిత్ర' ప్రాధాన్యతను తెలియజేస్తూ, వికాస చరిత్ర రచనకు కావల్సిన సైద్ధాంతిక నేపథ్యాన్ని అందించటానికి ప్రయత్నించారు. అయన 'సాహిత్య చరిత్రలో చర్చనీయాంశాలు' పేరుతో రాసిన వ్యాసాలు సాహిత్య వికాస చరిత్ర, ప్రక్రియాపరమైన వికాస చరిత్రకు గురించి ఎన్నో విషయాలు తెలియజేశాయి. సాహిత్యానికి భాష వెన్నుముక వంటిది. ఇది సాహిత్య చరిత్ర రచనలో కూడా అతి ముఖ్యమైనది.

తెలుగులో భాషను గురించి ప్రత్యేకంగా పరిశోధించే భాష శాస్త్రాలు, తెలుగు భాషకు సంబంధించి అనేక పరిశోధనలు జరిపి ఒక స్వతంత్ర తెలుగు భాషా చరిత్ర నిర్మాణం ప్రయత్నం జరిగింది. ఇది కూడా తెలుగు సాహిత్య చరిత్రను సమగ్రం చేసే ప్రయత్నంలో ఒక ప్రధాన పాత్ర పోషించింది. ఒకపక్క ఆధునికకాలంలో విశ్వవిద్యాలయాల్లో పరిశోధన మొదలవడం దానిలో భాగంగా అప్పటివరకు సాహిత్యంలో స్పృశించని యక్షగానాలు, మౌఖిక సాహిత్య ప్రక్రియ వంటి జానపద సాహిత్యంలో పరిశోధన పెరిగి సమగ్ర సాహిత్య చరిత్ర నిర్మాణానికి మరింత బలం తోడైంది. ఇలా విస్తృతపరిధి కలిగిన తెలుగు సాహిత్యాన్నంతటిని ఒక శాస్త్రీయ సిద్ధాంతం లేదా దృష్టికోణం నుండి చూడగలిగే మార్గం ఎక్కువైంది. కానీ, తర్వాతి దశలో తెలుగులో అస్తిత్వ ఉద్యమాల ప్రభావం, ప్రాంతీయవాదం, ప్రపంచీకరణ, సామ్రాజ్యవాద ధోరణుల ప్రవేశం జరిగి సాహిత్యం అనేక మార్పులకు లోనైంది. ఈ విధంగా తెలుగు సాహిత్యం ఒక పక్క బహుముఖంగా విస్తరిస్తూ మరోపక్క దానిని సమన్వయం చేసుకుంటూ తెలుగులో 'సమగ్ర సాహిత్య చరిత్ర' దిశగా అడుగులు వేస్తూ ఉంది.

## 5.5 సాహిత్య చరిత్ర యుగ విభజనలు

సాహిత్యకారులు ఇప్పటివరకు సాహిత్య చరిత్ర రాసిన, భాషా చరిత్ర లేదా సామాజిక చరిత్ర రాసిన వాటిలో ఏదో ఒక యుగవిభజనను పాటిస్తూ వచ్చారు. కానీ, ఈ యుగవిభజన విషయంలో చరిత్రకారులు విభిన్న పద్ధతులను అనుసరించారు. అసలు యుగవిభజన గురించి *"యుగమనగా కొన్ని విశిష్ట సమాన ధర్మములు గల కాలపరిమితి. వాఙ్మయ చరిత్రమున కొన్ని విశిష్ట లక్షణములు గల వాఙ్మయము ప్రారంభించిన మరలనట్టివాని ప్రాధాన్యమునశించి, కొత్తదియగు భిన్నవర్గమునకు చెందిన లక్షణములుగల వాఙ్మయము ప్రారంభించు వరకు గల కాలమును యుగమనవచ్చు"* (తెలుగు సాహిత్య సమీక్ష.(రెండవ సంపుటం)2009:19) అని జి.నాగయ్య అయన సాహిత్య సమీక్ష గ్రంథంలో పేర్కొన్నారు. కాని యుగావిభజనల్లో ఒక ప్రామాణికమైన క్రమవికాస ధోరణితో వచ్చిన యుగవిభజన అంటూ ఏదిలేదని జివిఎస్ విమర్శిస్తూ దానికి గల కారణాలను కింది విధంగా పేర్కొన్నారు.

సాహిత్య చరిత్రలలో యుగ విభజన ప్రక్రియ సంపూర్ణంగా లేకపోవడానికి గల కారణాలు (సుబ్రహ్మణ్యం. జి.వి. సాహిత్య చరిత్రలలో చర్చనీయాంశాలు, 1991:168)

1. ముందున్న చరిత్ర విభాగ విధానాన్ని విస్మరించలేకపోవడం.
2. ప్రక్రియా వికాస చరిత్రలు సమగ్రంగా నిర్మింపబడకపోవడం.
3. కొన్ని ప్రక్రియావికాస చరిత్రలపై పరిశోధనలు జరిగినా వాటి ఫలితాంశాలను సాహిత్య చరిత్రలో పొందుపరచుకోవలసిన అవసరం ఉండటం.
4. ప్రక్రియలలో ఆయా కాలాల్లో జరిగిన వివిధ ప్రయోగాలను వివేచించి వాటి లక్షణాలను గుర్తించి, ప్రత్యేకమైన పేర్లుంచి, వాటి వ్యక్తిత్వాలను నిరూపించే యత్నం సాగవలసి ఉండటం.
5. ప్రక్రియా వికాసచరిత్ర నిర్మాణానికి మెథాడాలజీని రూపొందించుకొనవలసి ఉండటం.

### 5.5.1 వివిధ యుగ విభజన విధానాలు

సాహితీ చరిత్రాధ్యయనకారులు వారి రచనా సౌలభ్యం కోసం వాఙ్మయ చరిత్రలను కొన్ని రకాల యుగాలుగా విభజించారు. వాటిలో

- కందుకూరి వీరేశలింగం-"ఆంధ్ర కవుల చరిత్ర"లో "ప్రాచీన కవులు", "మధ్యయుగ కవులు", "ఆధునిక కవులు" అని విభజించాడు.
- దివాకర్ల వేంకటావధాని-"ఆంధ్ర వాఙ్మయ చరిత్రము"లో-కావ్య ప్రక్రియలను బట్టి-ప్రాఙ్నన్నయ యుగము, భాషాంతరీకరణ యుగము, కావ్య యుగము, ప్రబంధ యుగము, దక్షిణాంధ్ర యుగము, ఆధునిక యుగము.
- కాళ్ళకూరు నారాయణరావు-అజ్ఞాత యుగం, ప్రాచీన యుగం, మధ్యయుగం...ఇలా విభజించాడు.
- పింగళి లక్ష్మీకాంతం-"ఆంధ్ర సాహిత్య చరిత్ర"లో మిశ్రమమైన విధానాన్ని అవలంబించాడు.-ప్రాఙ్నన్నయ యుగము, నన్నయ యుగము, తిక్కన యుగము, శ్రీనాథ యుగము, రాయల యుగము.
- 'ఆరుద్ర' తన సమగ్ర ఆంధ్ర సాహిత్యంలో-చాళుక్య యుగము, రెడ్డి రాజలయుగము, విజయనగర యుగము ఇలా అనేక రకాల విధానాలు అవలంబించారు.

ఆయాకాలాలలో సాహితీ విషయాలకు అనుగుణంగా-భారత కవులు, శివకవులు, రామాయణ కవులు, శతక కవులు, ప్రబంధ కవులు, వాగ్గేయకారులు. వివిధ కాలాలలో వెలువడిన సాహిత్య ప్రక్రియలను బట్టి-పురాణ యుగము, కావ్య యుగము, ప్రబంధ యుగము, గద్య గేయ యక్షగాన యుగము, ఖండకావ్య (భావ కవితా) యుగము. భిన్న కాలాలలో ప్రసిద్ధులైన, ఇతరులకు మార్గ దర్శకులైన కవులను బట్టి-నన్నయ యుగము, తిక్కన యుగము, శ్రీనాథ యుగము అని గ్రంథకర్తలు తమ రచనా సౌలభ్యం కొరకు వివిధ రకాల యుగవిభజనలు చేశారు. అయితే ఇప్పటివరకు చేసిన సాహిత్య యుగ విభజనల్లో ఎక్కువగా యుగ విభజన ప్రక్రియలు, రాజవంశాలు, మరికొన్నిసార్లు యుగకర్తల ఆధారంగా ఇలా భిన్న పద్ధతుల్లో చేయబడింది. కానీ, మొదటిసారి ఆరుద్రగారి సమగ్రాంధ్ర సాహిత్యంలో ఒక ఏకసూత్రతను పాటిస్తూనట్లు కనిపిస్తుంది. ఆధునికయుగంలో కవితా పోషకులనుసరించి యుగవిభజన చేశారు. కానీ, ఈ యుగవిభజన గురించి చెబుతూ "*ఈ సాహిత్య చరిత్ర ఆశయము సమగ్రత. కాని సమగ్రతకు ప్రయత్నము మాత్రం జరిగిన ఈ గ్రంథమున అది*

*పూర్తిగా ఫలించినదని చెప్పుటకు వీలులేదు. సాహిత్య చరిత్రకు ప్రాణభూతమైన యుగవిభజన యందే ఆరుద్ర పొరపడినారు. రెడ్డిరాజుల కాలములోని ఎఱ్ఱన, తొలిరాయల యుగములోని నాచన ఇందు పద్మనాయక యుగములో చేరినారు. ఏ యుగములకు చెందిన కవుల నాయుగములో చేర్చక కాలక్రమ పద్ధతిని అనుసరించుటవల్ల ఈ విభజనము దోష భూయిష్టముగా రూపొందినది"* (రామరావు, ఎస్వీ. తెలుగులో సాహిత్య విమర్శ,2017:288) అని ఆరుద్ర చేసిన యుగవిభజన కూడా లోపాలతో కూడుకున్నదేనని రామారావు విమర్శించారు. కొంతమంది సాహిత్య చరిత్రకారులు తమ కాలక్రమాన్ని అనుసరించి ముఖ్యంగా ఆంగ్ల సాహిత్యంలో చేసిన దానిని అనుకరిస్తూ యుగవిభజన చేయడానికి ప్రయత్నించారు. కానీ, క్రీస్తుశకం-క్రీస్తు పూర్వ కాలక్రమాలు తెలుగు నేలకు దూరంగా ఉండటం వల్ల సాహిత్య పరిణామాన్ని సూచించేది ఈ యుగవిభజన లేకపోవడం ఈ రకమైన యుగ విభజన కూడా సమంజసంగా లేనట్లు విమర్శకులు భావించారు.

సాహిత్య చరిత్ర అధ్యయనంలో తెలుగు వారు రెండు మూడు రకాల యుగ విభాగాన్ని చేసుకుని అలవాటుపడ్డారు. కొత్తగా ప్రయోగాలూ చేసిన వారు కూడా బాగా నలిగిన ఆ బాటను కాదని పక్కకు పెద్దగాపోలేదని, ఎవరు ఏ రీతిగా సాహిత్య చరిత్రను రచింపలాని చూసిన ఒక సూత్రానికి కట్టుబడి యుగ విభాగాన్ని, పరిణామాన్ని నిరూపించాలేకపోయారు. అందువల్ల శాస్త్రీయ పద్ధతి కంటే, సౌలభ్యపద్ధతిని, సౌకర్యపద్ధతిని అనుసరించడం రచయితలకు పరిపాటి అయిపోయిందని జివిఎస్ భావించారు. అయితే వీటన్నింటిలో సూక్ష్మంగా కొన్ని లోపాలని పరిశీలించిన జి.వి. సుబ్రహ్మణ్యం ఆంధ్రప్రభ పత్రికలో **'సాహిత్య చరిత్రలో చర్చనీయంశాలు'** పేరుతో రాసిన వ్యాసాల్లో భాగంగా నన్నయ నుండి నేటివరకు ఉన్న తెలుగు సాహిత్యాన్ని ప్రతిబింబించేలా శాస్త్రీయ దృక్పథంతో ఒక యుగ విభజనను ప్రతిపాదించారు. దీనిలో ఆ ప్రక్రియల వైవిధ్యాన్ని గుర్తించి, ఆ ప్రక్రియల ప్రాధాన్యాన్ని పొందిన కాలాలను, ఆ ప్రక్రియల యుగాలుగా చెప్పడం ద్వారా ఆధునిక సాహిత్య యుగ విభాగానికి ప్రాచీన సాహిత్యంతో కలిసిపోగలిగే ఒక నూతన ప్రణాళికను తన యుగవిభజనలో ప్రవేశపెట్టారు. జి.వి. సుబ్రహ్మణ్యం చేసిన ఈ యుగవిభజన ప్రారంభం నుండి ఆధునిక కాలం వరకు ఒకే

ఏకసూత్రాన్ని చూపిస్తూ ఇప్పటివరకు చేసిన సాహిత్య చరిత్రల యుగవిభజనల్లో కొంత అధిక ప్రామాణికతను కలిగివుంది.

### 5.5.2 ముదిగంటి సుజాతారెడ్డిగారి యుగ విభజన పద్ధతి

ముదిగంటి సుజాతారెడ్డి ఇప్పటివరకు రాసిన ఐదు సాహిత్య చరిత్రల యుగ విభజనల్లో చాలా భిన్నమైన పద్ధతులను ఉపయోగించారు.

- **చారిత్రక సామాజిక నేపథ్యంలో తెలుగు సాహిత్య చరిత్ర**–గ్రంథంలో ఈ తెలుగు సాహిత్య చరిత్ర గ్రంథంలో సుజాతారెడ్డి కొన్ని నూతన ప్రతిపాదనలు చేశారు. వీరేశలింగం యుగం, కృష్ణశాస్త్రి యుగం వంటి కవుల పేర్లమీద యుగ విభజన చేశారు.
- **సంస్కృత సాహిత్య చరిత్ర**–ఇతర సాహిత్య చరిత్రల్లో లాగా సంస్కృత సాహిత్య చరిత్రలో యుగవిభజన ప్రకారం చరిత్ర రచన ఉండదు. ఈ గ్రంథంలో సంస్కృత సాహిత్యాన్ని ప్రధానంగా వైదిక సాహిత్యం, లౌకిక సాహిత్యం అని రెండు రకాలుగా విభజించి దానికనుగుణంగా సాహిత్య చరిత్ర రచన చేశారు. వైదిక సాహిత్యంలో సంహిత బ్రాహ్మణాలు, లౌకిక సాహిత్యంలో రూపకాలు, లఘు కావ్యాలు, శ్లోక సంగ్రహ కావ్యాలు, గద్య కావ్యాలు, చారిత్రక కావ్యాలు, చంపూ కావ్యాలు, కథాకావ్యాలు, నీతి కథలు, చిత్ర కావ్యాలు, అలంకార శాస్త్ర గ్రంథాలు, నిఘంటు గ్రంథాలని పలు రకాలుగా విభజించే ప్రయత్నం చేశారు.
- **మన తెలుగు సాహిత్య చరిత్ర**–ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ముదిగంటి సుజాతారెడ్డి రాసిన చారిత్రక సామాజిక నేపథ్యంలో సాహిత్య చరిత్ర గ్రంథంలో కొన్ని మార్పులు చేసి 'మన తెలుగు సాహిత్య చరిత్ర' (2018) పేరుతో తెలుగు అకాడమి వారి అధ్వర్యంలో కొత్త సాహిత్య చరిత్ర గ్రంథంగా తీసుకువచ్చారు. దీనిలో కొత్తగా 'తెలంగాణ సాహిత్య వైశిష్ట్యం' పేరుతో ఒక నూతన అధ్యాయాన్ని జతపరిచారు. తర్వాత ప్రాఙ్నన్నయ యుగాన్ని, పూర్వయుగంగా మార్చి శాతవాహనుల కాలంలో

ప్రాకృత భాషా ప్రభావం తెలుగుపై పడిన విధానాన్ని ఈ యుగంలో విశ్లేషించారు. బౌద్ధమత ప్రభావాన్ని జైనకవుల యుగం పేరుతో రాసిన అధ్యాయంలో తెలియజేశారు. చివరి మార్పుగా నన్నయ తిక్కనల మధ్యయుగ కాలాన్ని తిరిగి శివకవుల యుగంగానే నిర్ధారించారు.

- **తెలంగాణ-తెలుగు సాహిత్య చరిత్ర–** సుజాతారెడ్డి తెలంగాణ ఏర్పడిన తర్వాత ఈ సాహిత్య చరిత్ర రాశారు. దీనిలో తెలంగాణ ప్రాంతంలో వచ్చిన వివిధ రకాల సాహిత్య ప్రక్రియల విశిష్టతను తెలియజేస్తూ వివిధ రాజవంశాల ఆధారంగా వేములవాడ చాళుక్య యుగం, కాకతీయుల యుగం, రాచకొండ పద్మనాయకుల యుగం, కుతుబ్ షాహీల యుగం, అసఫ్ జాహీల యుగం, విశాలాంధ్ర యుగమని యుగ విభజన చేశారు.
- **ఆంధ్రుల సంస్కృతి సాహిత్య చరిత్ర–** దీనిలో ప్రాఙ్నన్నయ యుగం, నన్నయ, శివకవి యుగం, తిక్కన, ఎర్రన, శ్రీనాథయుగమనే కవుల పేర్లతో ప్రబంధ యుగమని ప్రక్రియ పేరుతో, శతక సాహిత్యం, ఆధునికసాహిత్యం, ఆధునిక వచన ప్రక్రియలు, ఆంధ్రతెనుగు-తెలుగు పదాల చరిత్ర ప్రాచీనత అని ఆధునిక సాహిత్యాన్ని యుగ విభజన చేసి ఆ యుగంలో వచ్చిన వివిధ రకాల సాహిత్యాన్ని పరిచయం చేశారు.

## 5.6 ప్రాంతీయ సాహిత్య చరిత్రలు

ఏదైనా ఒక సాహిత్య పరిణామాన్ని అవగాహన చేసుకోవడానికి గాని, ఆ ప్రాంతంలోని లేదా జాతి లేదా భాషలోని వివిధ కవుల కాలక్రమాన్ని అర్థం చేసుకోవడానికి గాని సాహిత్య చరిత్ర రచన ఉపయోగపడుతుంది. అందుకే సాహిత్య చరిత్ర రచనల్లో భాగంగా అదే ఉద్దేశ్యంతో అనేక రకాల ప్రాంతీయ సాహిత్య చరిత్రలు కూడా చరిత్రలో వెలువడ్డాయి. ఇందులో మొదట వివిధ సంస్థాన సాహిత్యంలో భాగంగా వచ్చింది. తూమాటి దోణప్ప **'ఆంధ్ర సంస్థానములు-సాహిత్య పోషణ'** గ్రంథాన్ని 1969లో తీసుకువచ్చారు. **'గద్వాల సంస్థానం-వాఙ్మయ పోషణ'** అంశంతో డా.కె వెంకటేశ్వరశర్మ పరిశోధన చేశారు. జిల్లాల వారిగా వచ్చిన

సాహిత్య చరిత్రలలో మధురాంతకం రాజారాం **'చిత్తూరు జిల్లా సాహిత్య చరిత్ర'**ను రాశారు. అదే జిల్లాకు సంబంధించి **'చిత్తూరు జిల్లా సాహిత్య చరిత్ర విమర్శనము'** అనే గ్రంథాన్ని నరసింహాచార్యులు రచించారు. జానమద్ది హనుమచ్ఛాస్త్రి **'మా సీమకవులు'** పేరుతో 1973లో రాయలసీమ ప్రాంత కవులచరిత్ర పుస్తకం వచ్చింది. సాహిత్య చరిత్ర అనేది ఇతర సామాజిక చరిత్రతో సంబంధం కలిగి ఉంటుంది. ఒక జిల్లాలోని చరిత్ర, సంస్కృతి, సాహిత్య చరిత్ర, ప్రాచీన ఆధునిక భాగలైన కథ కవిత, నవల నాటకం, పద్యం, విమర్శ వంటి అనేక విషయాలతో కూడి ఉంటుంది. ఇలాంటి సాహిత్యంశాలతో కూడిన ఒక్కొక్క జిల్లా సాహిత్య చరిత్రలు తద్వారా ప్రాంతీయ సాహిత్య చరిత్రలు దాన్ని ఆధారంగా చేసుకుని ఒక భాష సమగ్ర సాహిత్య చరిత్రను నిర్మించడం సాధ్యమవుతుందనే ఉద్దేశ్యంతో ఇప్పటివరకు తెలంగాణలో ఎక్కువగా జిల్లా సాహిత్య చరిత్రలు వచ్చాయి. వీటిలో మలయశ్రీ **'కరీంనగర్ జిల్లా సాహిత్య చరిత్ర'**, టి. **శ్రీరంగస్వామి 'వరంగల్ జిల్లా రచయితల వాఙ్మయ జీవితసంచిక'**లు రాశారు. ఎస్వీ. రామారావు **2012లో 'పాలమూరు జిల్లా కవుల చరిత్రలు'** 2017లో **'వనపర్తి జిల్లా సాహిత్యచరిత్ర'**న వెలువరించారు. తెలుగు అకాడమీ వారి ప్రాజెక్ట్ లో భాగంగా తెలంగాణలోని అన్ని జిల్లాల సాహిత్య చరిత్రలు నిర్మించే పని జరుగుతుంది. తెలంగాణ సారస్వత పరిషత్తువారి అధ్వర్యంలో ముదిగంటి సుజాతారెడ్డి **'తెలంగాణ తెలుగు సాహిత్య చరిత్ర'** గ్రంథాన్ని తీసుకురాగ, సుంకిరెడ్డి నారాయణరెడ్డి **'ముంగిలి'** పేరుతో తెలంగాణ సాహిత్య చరిత్రను రచించారు.

## 5.7 సంస్కృత సాహిత్య చరిత్ర–విమర్శనాంశాలు

భారతీయ సాహిత్యంలో సంస్కృత సాహిత్యానికి గొప్పస్థానం ఉంది. ఇది ప్రపంచంలో అతిప్రాచీన భాషల్లో ఒకటిగా గుర్తింపు పొందింది. సంస్కృత వాఙ్మయంలో అనేక రకాల విషయాలు పొందుపరచబడి ఉన్నాయి. అందుకే జర్మనీలాంటి దేశాల్లో సంస్కృత భాష గురించి అధ్యయనం చేయడానికి ప్రత్యేక శాఖలు కూడా ఉన్నాయి. సంస్కృత సాహిత్యానికి ముఖ్యంగా రామాయణ, భారత, భాగవత గ్రంథాలు నిదర్శనంగా ఉన్నాయి. సంస్కృత సాహిత్యంలో

భాగంగా వచ్చిన రామాయణ భారత భాగవత గ్రంథాలను పురాణాల గురించి తెలుగు సాహిత్య విమర్శలో అనేక విమర్శ గ్రంథాలు కనిపిస్తాయి. అనేక వ్యాసాలు ఉన్నాయి కానీ, అవి ఎక్కువ అనువాదాల రూపంలోనే ఉన్నాయి. సంస్కృత సాహిత్యం గురించి సాహిత్య చరిత్ర రూపంలో ఇప్పటివరకు రెండు గ్రంథాలు మాత్రమే వెలువడ్డాయి. మొదటిది మల్లాది సూర్యనారాయణశాస్త్రి వ్రాసిన సంస్కృత సాహిత్య చరిత్ర. ఇది వైదిక సాహిత్యం, లౌకిక వాఙ్మయం అని విభజింపబడి ఆంధ్రసారస్వత పరిషత్ వారి ప్రచురణ రూపంలో బయటకు వచ్చింది. దీనికిముందే సూర్యనారాయణ శాస్త్రి **'సంస్కృత కవి జీవితములు'** అనే మరో రచన కూడా చేశారు. ఇందులో సంస్కృత సాహిత్య పరిణామం వికాసాలను తెలుగువారికి మొట్టమొదట ప్రవేశం కల్పించారు. (తెలుగు సాహిత్య విమర్శ దర్శనం, 2016:324) రెండవది ముదిగంటి సుజాతారెడ్డి రచించిన సంస్కృత సాహిత్య చరిత్రనే.

సంస్కృతానికి సంబంధించిన గ్రంథాలు ఎక్కువగా ఆంగ్లభాషలో అలాగే, హిందీ భాషలో కూడా ఉన్నాయి. ముదిగంటివారు తెలుగులో రాసిన ఈ సంస్కృత సాహిత్య చరిత్రలో ముఖ్యంగా సంస్కృత సాహిత్య పరిణామాన్ని సంస్కృతకవులు, ఆలంకారికులు, శాస్త్రకారులను, నిఘంటుకారుల కృషిని గురించి పేర్కొన్నారు. పుల్లెల శ్రీరామచంద్రుడు "*ఐహికములూ, పారలౌకికములూ అయిన ఫలాలనుద్దేశించిన అనేక కర్మలను బోధించే వేదాల వ్యాఖ్యాన రూపమైన పూర్వ మీమాంసాశాస్త్రం, ఆధ్యాత్మిక విద్యను బోధించే ఉత్తర మీమాంసా శాస్త్రం, సాంఖ్యయోగ న్యాయ వైశేషికాది దర్శన శాస్త్రాలు, వ్యాకరణం, ఖగోళశాస్త్రం, గణితశాస్త్రం, ఆయుర్వేదం, యుద్ధశాస్త్రం, భౌతిక శాస్త్రం, రసాయన శాస్త్రం, పశ్వాయుర్వేదం, వృక్షాయుర్వేదం, సంగీతశాస్త్రం, నాట్యశాస్త్రం, అర్థశాస్త్రం, కామశాస్త్రం, స్థాపత్యశాస్త్రం, వాస్తుశాస్త్రం, తంత్రశాస్త్రం, మంత్రశాస్త్రం, సాహిత్యశాస్త్రం, ఇతిహాసాలు, పురాణాలు, వివిధ కావ్యనాటకాది సాహిత్య గ్రంథాలు వంటి అపారమైనది*" సంస్కృత సాహిత్యమని ఈ వాఙ్మయానికున్న విశిష్టతత్త్వాన్ని సంస్కృత సాహిత్య చరిత్ర గ్రంథ ముందుమాటలో తెలియజేశారు.

సంస్కృత సాహిత్య చరిత్ర గ్రంథాన్ని సుజాతారెడ్డి తమ భర్త ఆచార్య గోపాల్ రెడ్డి గారితో కలిసి రచించారు. వీరు ఇదే కాకుండా **'బాణుని కాదంబరి పరిశీలన'** గ్రంథాన్ని కూడా వీరిద్దరి కలిసే రాశారు. గోపాల్ రెడ్డి ఆర్య సమాజం నుండి వచ్చిన వైదిక సనాతన ధర్మపరాయణుడు. తెలంగాణ ప్రాంతానికి తొలి సంస్కృత ఆచార్యుడుగా ప్రసిద్ధి చెందాడు.(ప్రతాపరెడ్డి,కాసుల.ముదిగంటి గోపాల్ రెడ్డి. ప్రపంచ తెలుగు మహాసభల ప్రచురణ:2017) ఈయన చాలాకాలం పాటు ఉస్మానియా విశ్వవిద్యాలయంలోని సంస్కృతశాఖలో ఆచార్యులుగా కూడా పనిచేశారు. వేదాల్లోనూ, అటు సంస్కృత సాహిత్యంలో గొప్ప పాండిత్యం సంపాదించిన అయన వైదిక ధర్మాన్ని బోధిస్తూ తను కూడా ఆచరిస్తూ ఉండేవారు. ఆర్య సమాజంలో కులాలతో ప్రమేయం లేకుండా వేదాలను అధ్యాయం చేయడానికి వీలు ఉంటుంది.

ఆర్య సమాజం సిద్ధాంతాలు సమాజంలోని ప్రజలలో నాటుకుపోయిన మూఢాచరాలు, అంధవిశ్వాసాలు వంటి వాటికి పూర్తిగా వ్యతిరేకంగా ఉండేవి. గోపాల్ రెడ్డి చిన్నతనం నుండి ఆర్యసమాజ భావాలతో నడిచే కాంగ్డిలోని గురుకులంలో చదవడంతో అయన వక్తిత్వం ఆర్య సమాజ సిద్ధాంత భావాలతో రూపుదిద్దుకుంది. నిరంతరం ఆయన ఇంట్లో ఉంటూ చదువుతూ ఉండటం వల్లనే సంస్కృత సాహిత్య చరిత్ర రాసే సమయంలో మంత్రాలు శ్లోకాలు ఉటంకించడం సులభమైందని రచయిత్రి గోపాల్ రెడ్డి సతీమణి సుజాతారెడ్డిగారన్నారు. అందుకే సంస్కృత సాహిత్య రచనకు ఆయనకు చిన్నప్పటినుండి సంస్కృత సాహిత్యంతో ఉన్న పరిచయం అందులోని పాండిత్యమే కారణమన్నారు. ఆయన సాహిత్య పరిచయం పాండిత్య ప్రతిభలు శాశ్వతంగా నిలబడాలని తపన వల్లనే ఆ రచనకు పూనుకున్నట్లు కూడా తెలిపారు. వీరిద్దరి సమిష్టి కృషి వల్ల వచ్చిన ఈ గ్రంథం తర్వాతి కాలంలో తెలుగు సాహిత్య విద్యార్థులకు మాత్రమే కాకుండా తెలుగు వారందరికి ఉపయోగకరంగా ఉండి, సామాన్యులకు సైతం సంస్కృత సాహిత్య పరిచయం చేయడానికి పనికివచ్చింది.

ఇతర సాహిత్య చరిత్రల్లో లాగా సంస్కృత సాహిత్య చరిత్రలో యుగవిభజన ప్రకారం చరిత్ర రచన ఉండదు. ఈ  గ్రంథంలో సంస్కృత సాహిత్యాన్ని ప్రధానంగా వైదిక సాహిత్యం, లౌకిక సాహిత్యం అని రెండు రకాలుగా విభజించి దానికనుగుణంగా సాహిత్య చరిత్ర రచన చేశారు. వైదిక సాహిత్యంలో సంహిత బ్రాహ్మణాలు, లౌకిక సాహిత్యంలో రూపకాలు, లఘు కావ్యాలు, శ్లోక సంగ్రహ కావ్యాలు,  గద్య కావ్యాలు, చారిత్రక కావ్యాలు, చంపూ కావ్యాలు, కథాకావ్యాలు, నీతి కథలు, చిత్ర కావ్యాలు, అలంకార శాస్త్ర గ్రంథాలు, నిఘంటు గ్రంథాలని పలు రకాలుగా విభజించే ప్రయత్నం చేశారు.

సంస్కృత సాహిత్య చరిత్ర గ్రంథంలో ముదిగంటివారు అనేక రకాల విషయాలను విమర్శనాత్మకంగా విశ్లేషించారు. ఋగ్వేదంలో ఉన్న మంత్రాలను ఋక్కులంటారు. ఈ ఋక్కులు నాలుగు పాదాలు, మూడు పాదాలు, రెండు పాదాలు గల ఛందస్సుల్లో ఉన్నాయి. గాయత్రి, జగతి, బృహతీ, పంక్తి, త్రిష్టువు, అనుష్టువు వంటి రకాలైన ఛందస్సులు ఋగ్వేదంలో ప్రయోగింపబడినవని వైదిక సాహిత్యంలో భాగంగా ఋగ్వేద కాలంలో వాడుకలో ఉన్న ఛందస్సు గురించి వీరు పేర్కొన్నారు. సంస్కృత వాఙ్మయంలో మహాకావ్యాలకు చాలా ప్రాముఖ్యత ఉంది. భారతీయ సంప్రదాయం  ప్రకారం మహాకావ్య రచనా రీతికి నాంది పలికినవాడు వాల్మీకి మహర్షి. వాల్మీకి రచించిన ఆది కావ్యాన్ని అనుకరిస్తూ తర్వాత అనేక మహాకావ్యాలు వచ్చాయి. అయితే ఆ ప్రాచీన మహాకావ్యాలన్నీ కాలగర్భంలో కలిసిపోయాయి. కాళిదాసు అశ్వఘోషుని కంటే ప్రాచీనుడు అనే వాదాన్ని అంగీకరిస్తే మనకి ఈనాడు సంపూర్ణ రూపంలో లభిస్తున్న వాటిలో అతి ప్రాచీనమైనది కాళిదాసుని కావ్యాలే. 'మహాకావ్యాలు' అనే శీర్షిక కింద రాసిన విషయాల్లో మహాకావ్యాలు వాటి పుట్టుపూర్వోత్తరాలను చర్చించి, పాశ్చాత్య పండితులు పేర్కొనని మహాకవులను తీసుకొని మొత్తం 50మంది కవులను, వారి కావ్యాలను సుజాతారెడ్డి విశ్లేషించారు.

వైదిక సాహిత్యానికి పాశ్చాత్యులు చేసిన కృషిని వివరిస్తూ రుడాల్ఫ్ రోథ్ 1846లో జర్మన్ పండితుడు **'వేద సాహిత్య చరిత్ర'** అనే పుస్తకాన్ని రచించాడు. ఈ చిన్న పుస్తకమే చాలామంది యూరోప్ పండితులను వేద సాహిత్యం వైపుకు దృష్టి మరల్చేలా చేసిందని

గుర్తుచేశారు. మాక్స్ ముల్లర్ అనే జర్మన్ విద్వాంసుడు సంస్కృత సాహిత్యం గురించి చేసిన కృషి గుర్తించదగినదని చెబుతూ మాక్స్ ముల్లర్, రోథ్ లు ఇద్దరు ప్యారిస్ లోని యూజిన్ అనే ఫ్రెంచి పండితుని శిష్యులు. మాక్స్ ముల్లర్ **'ప్రాచీన వైదిక సంస్కృత సాహిత్య చరిత్ర'** అన్న పుస్తకంలో వైదిక సాహిత్యాన్ని సద్విమర్శకంగా పరిశీలించాడని పేర్కొన్నారు. అలాగే, 'వేబర్' అనే జర్మన్ సంస్కృత పండితుడు యజుర్వేద తైత్తరీయ సంహితకు సంపాదకత్వం వహించాడని అన్నారు. వైదిక సాహిత్య చరిత్రలో పాశ్చాత్యులు వ్రాసినవి ఎన్నో ఉన్నవి. వీటిలో రోథ్ జర్మన్ భాషలో రాసిన **'వైదిక సాహిత్య చరిత్ర'** మొదటిది. దీనికి తర్వాత ఆంగ్లానువాదం వచ్చింది. మాక్స్ ముల్లర్, మ్యాక్డోనెల్, వింటర్ హిట్స్ ప్రత్యేకంగా వైదిక సాహిత్యాన్ని పరిశీలిస్తూ ఆంగ్ల, జర్మన్ భాషల్లో సాహిత్య చరిత్రలను రాశారన్నారు. సంస్కృత సాహిత్య చరిత్ర గ్రంథంలో వీరు పలు సంప్రదాయ విరుద్ధమైన అభిప్రాయాలను వెల్లడించారు. వేద రచనాకాలం వైదిక–జరోస్ట్రీయన్ మతాల సంబంధం, వేద వ్యాఖ్యానాలలో భిన్నత్వాలు, వైదిక దేవతల స్వరూప పరిణామాలు, మహాభారత రామాయణ కావ్యాలు పూర్వపరాలు, రూపక ఉత్పత్తి మొదలైన విషయాలపై తమదైన కోణంలో అభిప్రాయాలను బహిర్గతం చేశారు. వాల్మీకి, కాళిదాసు, కుమారదాసు వంటి వారికి సంబంధించిన విషయాల్లో ముఖ్యంగా కాల, జాతి విషయాల్లో కొన్ని నూతన అభిప్రాయాలను ప్రతిపాదించారు.

సంస్కృత భాషలో నిక్షిప్తమైన వ్యాకరణం, వ్యాకరణకారుల గురించి అనేక విషయాలు తెలియజేశారు. వైదిక శబ్దాల వ్యుత్పత్తి, అర్థ వివేచనలు చేయబడిన ప్రాతిశాఖ్య గ్రంథాలు వ్యాకరణ శాస్త్రం యొక్క తొలి రూపాలు. ఈ ప్రాతిశాఖ్యకు మూల సూత్రాలు బ్రాహ్మణ, కల్పసూత్ర గ్రంథాలలో ఉన్నవి. కాబట్టి వ్యాకరణ రచనకు వైదిక సాహిత్యం నుండే అతీ ప్రాచీనకాలంలోనే ప్రేరణ లభించిందని, అవసరం కూడా పడిందని చెప్పారు. గోపథ బ్రాహ్మణంలో వ్యాకరణ సంబంధమైన ధాతు, ప్రాతిపదిక, నామ, ఆఖ్యాత, లింగ, వచన, విభక్తి మొదలైన పారిభాషిక పదాలు ఉన్నాయని వీటిని బట్టి గోపథం నాటికే వ్యాకరణ శాస్త్రం వికసించిందని సుజాతారెడ్డి విశ్లేషించారు. కానీ, ఇప్పుడు లభ్యమవుతున్న వ్యాకరణ గ్రంథాల్లో పాణినీయ వ్యాకరణమే అతి ప్రాచీన వ్యాకరణ గ్రంథంగా ముదిగంటివారు వాఖ్యానించారు.

పాణిని సంస్కృత భాషలో మంచి పండితుడుగా ప్రసిద్ధి చెందాడు. సంస్కృత భాషను కొంత శాస్త్రీయ దృక్పథంతో చూసి వ్యాకరణం రాసిన ఘనత పాణినికి దక్కుతుంది. పాణిని రాసిన వ్యాకరణ గ్రంథంలో ఎనిమిది అధ్యాయాలు ఉండటం చేత దీనికి 'అష్టాధ్యాయి' అని పేరు వచ్చింది.

'పాల్ దయస్సన్' అనే జర్మన్ పండితుడు నాలుగు రకాలుగా సూచించిన ఉపనిషత్తుల విభాగాన్ని అంగీకరిస్తూనే విశాల దృష్టితో చూస్తే ఉపనిషత్తులను (పుట51) వేదాంత సిద్ధాంత ప్రతిపాదితాలు,యోగా సిద్ధాంత ప్రతిపాదితాలు, సాంఖ్య సిద్ధాంతం ప్రతిపాదితాలు, వైష్ణవ సిద్ధాంత ప్రతిపాదితాలు, శైవ సిద్ధాంత ప్రతిపాదితాలు, శాక్త సిద్ధాంత ప్రతిపాదితాలుగా ఉపనిషత్తులలో జరిగిన విషయాలను బట్టి ఆరు విభాగాలుగా కూడా చేయవచ్చునని పరిశోధన దృష్టితో కూడిన అభిప్రాయాన్ని సంస్కృత సాహిత్య చరిత్ర గ్రంథంలో రెడ్డిగారు వెల్లడించారు. ఇందులో ముఖ్యంగా బ్రాహ్మణ అరణ్యక ఉపనిషత్తుల వివరాలతోపాటు వేదాంగాల విషయం వాటి రచనా కాలం, వైదిక మతం ఇతర మతాలతో దానికి గల సంబంధం మూడు రకాలైన వైదిక దేవతలు పురాణ స్మృతులు గురించి చర్చించారు. వేదాల్లోని కవితా సౌందర్యాన్ని కూడా కొన్నిచోట్ల విశ్లేషించారు. వేద భాష్యాలు రచించడంలో మన వారు ఇంత కృషి చేశారో పాశ్చాత్యులు కూడా అంతే కృషి చేశారని పేర్కొన్నారు. నిగూఢమైన వేద మంత్ర అర్థం వివరిస్తూ ఉదాహరణలుగా అనేక శ్లోకాలు చూపిస్తూ వాటిలోని శబ్దాలను విపులంగా వివరంగా వ్యాఖ్యానించారు.

ఆశ్వఘోషుడు కాళిదాసుకి పూర్వవర్తియా? అనే అంశంపై చర్చ చేస్తూ ఆశ్వఘోషుడు కాళిదాసుల రచనల్లో ఉన్న సామీప్యతను బట్టి నిర్ణయించే ప్రయత్నం చేశారు. కాళిదాసు, ఆశ్వఘోషుల కవితతత్త్వాన్ని పరిశీలించిన పాశ్చాత్య విమర్శకులందరూ ఆశ్వఘోషుని ప్రభావం కాళిదాసు మీద ఉన్నట్లు నిర్ధారించినట్లు చెప్పారు. ఆశ్వఘోషుడు బుద్ధచరిత్ర, సౌందరనందం వంటి రెండు మహాకావ్యాలు రాశాడు. బుద్ధచరిత్రలో బుద్ధుని జీవిత చరిత్రను రచించాడు. బుద్ధ కవిగా ప్రసిద్ధి చెందిన ఆశ్వఘోషుడు ఆయన చేసిన రచనల ప్రభావం ఇతర కవుల మీద చాలా తక్కువగా ఉందని అందుచేత కాళిదాసు మీద ఆశ్వఘోషుని ప్రభావం లేదని

చెప్పిన జాన్సన్ వంటి పండితుల అభిప్రాయాన్ని ముదిగంటివారు పేర్కొన్నారు.(సంస్కృత సాహిత్య చరిత్ర.1986:244) ఆశ్వఘోషుని రచనలను పరిశీలించి కాళిదాస ప్రభావం ఆశ్వఘోషునిపై ఉన్నదని చెప్పి ఆశ్వఘోషుని కన్న కాళిదాస మహాకవియే పూర్వుడై ఉండవచ్చుననే అభిప్రాయాన్ని వెల్లడించారు.

**‘ఆచార్య ముదిగంటి గోపాల్ రెడ్డి జీవితం-వ్యక్తిత్వం-పాండిత్యం’** అనే పుస్తకంలో 'సంస్కృత సాహిత్య చరిత్ర-మాగ్నం ఓపస్' అనే వ్యాసం రాసిన డాక్టర్ బి. వాణి సంస్కృత సాహిత్య చరిత్ర గ్రంథంలోని కొన్ని విశేషాంశాలను క్రింది విధంగా వివరించారు. (ప్రతాపరెడ్డి, కాసుల. ముదిగంటి గోపాల్ రెడ్డి, 2017:13) లౌకిక సాహిత్యాన్ని పరిచయం చేసే క్రమంలో చాలా ఆసక్తికరంగా కుతూహలం కలిగించే విధంగా రాశారు. దాదాపు అన్ని గ్రంథాల పరిచయం ఉందని అన్నారు. లౌకిక సాహిత్యాన్ని పరిచయం చేస్తూ సంస్కృత భాష స్వభావాలను దాని వైశిష్ట్యాన్ని పాశ్చాత్యుల సంస్కృత భాషా జ్ఞానాన్ని వివరంగా విశ్లేషించారు. కాళిదాసు మొదలు దాదాపు 50మంది కవుల పుట్టుపూర్వోత్తరాలను చర్చించారు. అయితే ఈ విషయాలను సత్యాలను కూడా జోడించి ఒక క్రమమైన చారిత్రక అవగాహనకు వచ్చి నిర్ణయించి చెప్పడం ఈ సంస్కృత సాహిత్య చరిత్రలో ఒక ప్రత్యేక అంశంగా ఆమె పేర్కొన్నారు. ప్రతి కవిని వారి వారి రచనలు అందులోని ప్రత్యేకతలు విశేషాలు వర్ణనలు పాండిత్యం విపులంగా అనేక ఉదాహరణలతో చూపడం పాండితీ ప్రకాశం చాటుతోంది అనడం ఏమాత్రం అతిశయోక్తి కాదని బి.వాణి తన వ్యాసంలో విశ్లేషించారు. లౌకిక వాఙ్మయాన్ని పరిచయం చేస్తూ, ముందు సంస్కృత భాషా స్వభావాదులు, దాని వైశిష్ట్యం, సాహిత్య సంస్కృతుల గొప్పతనం, పాశ్చాత్యులు సంస్కృత భాష విషయంలో చేసిన అధ్యయనం మొదలైన వాటిని సంగ్రహంగా వివరించారు. అంతే భారతీయ సాహిత్యంలో అధిక ప్రభావం కలిగిన మహాభారతం, రామాయణల గురించి కూడా సంపూర్ణమైన వివరణలు అందించారు.

తెలుగు సాహిత్య విమర్శలో కట్టమంచి రామలింగారెడ్డి కవిత్వతత్త్వ విచారం, సురవరం ప్రతాపరెడ్డి ఆంధ్రుల సాంఘిక చరిత్ర మాదిరిగా సంస్కృత సాహిత్య చరిత్ర చిరస్థాయిగా

నిలిచిపోయే విధంగా ప్రఖ్యాతి వహించింది. ఈ గ్రంథాన్ని కేవలం కవుల చరిత్రగానే కాకుండా వారి రచనల పట్ల సద్విమర్శ సమీక్షగా కూడా రూపొందించారు. ఈ గ్రంథం చదివిన తర్వాత సంస్కృత భాషాగాని, సాహిత్యంగాని ఒక వర్గం, ఒక ప్రాంతం, ఒక దేశం దేశానికి సంబంధించింది కాదని తెలుస్తుంది.

## 5.8 చారిత్రక సామాజిక నేపథ్యంలో తెలుగు సాహిత్య చరిత్ర

ముదిగంటి సుజాతారెడ్డి రాసిన చారిత్రక సామాజిక నేపథ్యంలో తెలుగు సాహిత్య చరిత్ర. తెలుగు సాహిత్యంలో స్త్రీ రచించిన మొట్టమొదటి సాహిత్య చరిత్రగా చెప్పవచ్చు. అయితే ఇప్పటివరకు వరకు వచ్చిన అన్ని రకాల సాహిత్య చరిత్రల్లో ప్రత్యేకంగా ఒక పూర్తి సాహిత్య చరిత్రను ఒక స్త్రీ రచయిత రాసినట్లు కనిపించకపోయిన 1958లో **'ఆంధ్ర కవయిత్రులు'** పేరుతో 200 మంది కవయిత్రులను వారి రచనలను పరిచయం చేసిన 'ఊటుకూరి లక్ష్మీకాన్తమ్మ' ఆ దిశలో కొంత ప్రయత్నం చేసినట్లుగా మనం గమనించవచ్చు. *"భారతీయ స్త్రీ చరిత్రను ఇంగ్లీషులో వ్రాస్తూ అందులో ఒక్క ఆంధ్రికి కూడా స్థానం ఇయ్యకపోయినారు. ఆధునికలలో కొందరు శ్రీ మధునాపంతుల వంటి సాహితీ వేత్తలు వ్రాసిన 'ఆంధ్రరచయితలు' లాంటి సాహిత్య విమర్శనలో కూడా మచ్చుకైనా ఒక్క కవయిత్రి పేరు పేర్కొన లేకపోతే ఏ సారస్వతీయులకూ చీమకుట్టలేదు ఇది మిక్కిలి శోచనీయమైన విషయమని"* (లక్ష్మీకాన్తమ్మ,ఊటుకూరి.'ఆంధ్ర కవయిత్రులు) తెలుగు సాహిత్య చరిత్ర రచనల్లో స్త్రీలకు జరుగుతున్న అన్యాయం గురించి ఆవేదన చెందుతూ ఆ ఆవేదనలోంచి తొలిసారిగా 'ఆంధ్ర కవయిత్రులు' గ్రంథ రచనకు పూనుకొని ఉండవచ్చు. కానీ, ఈ గ్రంథంలో లక్ష్మీకాన్తమ్మ క్రీ. శ 13వ శతాబ్దం నుండి ఆధునిక కాలం వరకు ఐదు యుగాలుగా తరాల పేరుతో అధ్యాయాలు విభజించుకొని ప్రత్యేకంగా 200మంది కవయిత్రులను వారి జీవితాలు, రచనలను సమీక్షించారు. కానీ, ఇది ఒక కవుల చరిత్రగానే నిలిచిపోవడంతో ఇది పూర్తి సాహిత్య చరిత్ర గ్రంథంగా నిలవలేకపోయింది. తెలుగు సాహిత్య చరిత్రలో మిగిలిపోయిన ఈ లోపాన్ని ముదిగంటి సుజాతారెడ్డి తన **'చారిత్రక సామాజిక నేపథ్యంలో తెలుగు సాహిత్యచరిత్ర'**(1996)

గ్రంథం ద్వారా నెరవేర్చి తెలుగు సాహిత్య చరిత్ర రాసిన మొదటి రచయిత్రిగా చరిత్రలో తమదైన ఒక స్థానాన్ని పదిలం చేసుకున్నారు. ఇది తెలంగాణ ప్రాంతం నుంచి రావడం మరింత ప్రాముఖ్యతను సంపాదించుకుంది. ఈ గ్రంథంలో తెలుగు సాహిత్య పరిణామ వికాసాలను రచయిత్రి మొట్టమొదటిసారిగా చారిత్రక సామాజిక నేపథ్యం నుండి పరిశీలించారు.

ఈ తెలుగు సాహిత్య చరిత్ర గ్రంథంలో సుజాతారెడ్డి కొన్ని నూతన ప్రతిపాదనలు చేశారు. వీరేశలింగం యుగం, కృష్ణశాస్త్రి యుగం వంటి కవుల పేర్లమీద యుగ విభజన చేశారు. ఎప్పుడైనా ఏదైనా ఒక కొత్త ప్రతిపాదనతో చర్చ మొదలవుతుంది. ఇలా ఎప్పటికప్పుడు నూతనంశాలు అందించడంలో ముదిగంటివారు ముందుంటారు. సుజాతారెడ్డి ఈ సాహిత్య చరిత్రను నన్నయకు పూర్వం తెలంగాణ నుంచి వచ్చిన భీమన కవిజనాశ్రయంతో మొదలుపెట్టి తెలంగాణా అస్తిత్వవాదంతో ముగించి దీనికి ఒక ప్రత్యేకతను తెచ్చిపెట్టారు.

ఇప్పటివరకు వచ్చిన సాహిత్య చరిత్రలన్నీ కవుల చరిత్రలుగానో, సంగ్రహ చరిత్రలుగా, కవి జీవితాలుగానే వచ్చాయి. కానీ, సుజాతారెడ్డి రాసిన ఈ గ్రంథంలో సాహిత్యాన్ని దాన్ని ప్రతిబింబించే సమాజాన్ని రెండింటిని సమన్వయం చేస్తూ సమాజంలో జరిగే రాజకీయ, చారిత్రక, సామాజిక మార్పులకనుగుణంగా వచ్చిన సాహిత్య చరిత్రను నిర్మించారు. డాక్టర్ సుజాతారెడ్డి తెలుగు సాహిత్య చరిత్ర గ్రంథం రాశారు. కానీ, ఇది సాహిత్య వికాస చరిత్ర కాదు. వికాస చరిత్ర రాయకపోవడం దోషం కాదు కానీ, నేడు కావలసింది వికాస చరిత్రనే. అయితే సాహిత్య చరిత్ర రచనలో వారు కొన్ని ప్రత్యేకతలు ప్రవచించారని చెబుతూ ఈ గ్రంథ ముందుమాటలో జి.వి.సుబ్రహ్మణ్యం సుజాతారెడ్డిగారి ఈ సాహిత్య చరిత్రలోని కొన్ని విశేషంశాలను స్థూలంగా ఈ విధంగా తెలియజేశారు.(చారిత్రక సామాజిక నేపథ్యంలో తెలుగు సాహిత్య చరిత్ర. ముందుమాట:1996) వాటిని ఈ సందర్భంలో ఒకసారి గమనించడం అవసరం.

1. యుగ విభాగంలో  ఏక వాక్యత పాటించడం ఒక విశేషం. యుగాలను యుగకర్తలతో పిలవాలనే నియమాన్ని రచయిత్రి పెట్టుకోవడం వల్ల ఈ సౌలభ్యం ఏర్పడింది. మూడవ

కవి యుగాన్ని ఈ సందర్భంలో నన్నయ్య తిక్కనల మధ్య యుగం అని పేర్కొన్నారు. ఆధునిక సాహిత్య చరిత్రకు వీరేశలింగయుగం, కృష్ణశాస్త్రి యుగం, శ్రీశ్రీ యుగం అని విభజించి ఒక విధంగా సాహసమే చేశారు. భారతదేశ స్వాతంత్రోద్యమ చైతన్య మూసుకు వచ్చిన కవిత్వానికి గాని కవిత ప్రక్రియలకు గాని చోటు లేకపోవడం అంత సంతృప్తిని ఈయకపోవచ్చును. ప్రాచీన సాహిత్యంలో లాగా నవ్యసాహిత్య యుగంలో కూడా కవితకే పట్టంకట్టడం గతానుగతంగా చేస్తున్న మార్గం.

2. రచన పాఠకుని చేత చదివించేదిగా ఉండటం మరో విశేషం.
3. సాహిత్య చరిత్రలో కృషి చేసిన అనేక పండితులు మంది ఎన్నో నూతన అంశాలను ఇంతకు పూర్వమే ప్రతిపాదించి ఉన్నారు. వాటిని పేర్కొన్నప్పుడు ఆయా విమర్శకుల పేర్లను పేర్కొనడం పరిశోధనాత్మకమైన సాహిత్య చరిత్ర రచన పద్ధతి. అయితే డాక్టర్ సుజాతారెడ్డి సాహిత్య చరిత్ర సంగ్రహం అనే పద్ధతిలో రాశారు. కాబట్టి మొదటి నుంచి చివరిదాకా ఒకే కథగా సాగుతుంది. అక్కడ అక్కడ కొందరు అలా భావిస్తారు. మరి కొందరు అలా భావిస్తారు అని చెప్పడం సంగ్రహ రచన లక్షణాలే.

అని చెప్పిన సుబ్రహ్మణ్యం సుజాతారెడ్డిగారి సాహిత్య చరిత్ర రచనలో చర్చింపజేసే అంశాలను ప్రస్తావించారు. ఈ గ్రంథంలో రచయిత్రి వివరణాత్మకమైన కొన్ని కొత్త అంశాలను చర్చించారు. ముఖ్యంగా తెలంగాణ ప్రాంత ప్రాముఖ్యతను తెలియజేశారు. ఆరంభ, ప్రాఙ్నన్నయ యుగాలలోని వేములవాడ భీమకవి నుండి నేటి అత్యాధునికమైన ధోరణులుగా ప్రస్తావించబడుతున్న ప్రపంచీకరణం, అస్తిత్వవాదం, వ్యాపారయుగం వంటి అనేకంశాలను మౌలికమైన భావనలతో వివరించారు.

ఇప్పటివరకు తెలుగు సాహిత్యంలో రాయబడిన సాహిత్య చరిత్రలన్నీ రాజుల పరంగా కొన్ని, మరికొన్ని కవిత్వ పక్రియ ఆధారంగా యుగ విభజనను చేస్తూ వచ్చాయి. కానీ, సుజాతారెడ్డి ఈ గ్రంథంలో మహాకవుల పేరుతో యుగవిభజన చేశారు. ఇక్కడ కొంత సంప్రదాయ ధోరణినే వీరు అవలంభించారు. ఇందులో మొత్తం పన్నెండు యుగాలుగా తెలుగు సాహిత్య చరిత్రను విభజించారు. ఆధునిక కాలంలో వీరేశలింగం యుగం, కృష్ణశాస్త్రి యుగం,

శ్రీ శ్రీ యుగం అని నిర్దేశించి ఒక భిన్నమైన కోణంలో ఆలోచించారు. ఒక యుగానికి ఒక యుగకర్తను నిర్ణయించే విషయంలో విమర్శకుల్లో భిన్నాభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. భావవాదం, అభ్యుదయవాదం, అస్తిత్వవాదం, స్త్రీవాదం, దళితవాదం, బిసివాదం, ప్రాంతీయవాదం అంటూ తెలుగు సాహిత్యం తన పరిధిని విస్తరించుకుంటున్న ఆధునిక కాలంలో ఏ ఒక్క కవినో అంత సులభంగా యుగకర్తగా నిర్ణయించలేము. ఈ సమస్య ఆధునికాంతరవాదంలో సుజాతారెడ్డి ఎదుర్కొని ఈ కాలాన్ని ప్రక్రియ పరంగా విభజించే ప్రయత్నం చేశారు.

సుజాతారెడ్డి వేములవాడ భీమకవిని ప్రాఙ్నన్నయ కాలానికి చెందినవాడుగా పేర్కొన్నారు. శ్రీనాథుడు "**వచియింతు వేములవాడ భీమన భంగి నుద్దండలీల**" అని నన్నయ కంటే ముందుగా భీమనను స్తుతించడం వల్ల సుజాతారెడ్డి చెప్పిన ఈ వాదం కొంత బలపడింది. శ్రీనాథుని కవిత్వంలాగే భీమన్న కవిత్వం ఉద్దండరీతిలో ఉండేదని తెలుస్తుంది. భీమన 'కవిజనాశ్రయం' అనే పేరుతో ఛందో గ్రంథం తెలుగులో రచించాడు. ఇది 'భీమన చందము' పేరుతో ప్రసిద్ధి పొందింది. లోకంలో ప్రచారంలో ఉన్న కవులు ఆధారంగా భీమన శాపనుగ్రహసమర్థుడైన వశ్యవాక్కు గల కవని ముదిగంటిగారన్నారు. అతని చాటువులుగా ఎన్నో పద్యాలు వ్యాప్తిలో ఉన్నాయి. రాఘవ పాండవీయం, నరసింహ పురాణం, హరవిలాసం, సుమతి శతకం, శతకంధర రామాయణం మొదలైన రచనలన్నీ ఆయన పేరుమీద అ ప్రచారంలో ఉన్నాయని ఎటువంటి ఆధారాలు లేనిదే ఈ విధమైన ప్రచారం జరగడం సాధ్యమయ్యే విషయం కాదని తెలియజేశారు. కవిజనాశ్రయం గ్రంథంలో జైనమత ప్రసక్తి ఉండటంవల్ల భీమన శైవుడైన జైనాన్ని అభిమానించి ఉంటాడని రచయిత్రి అభిప్రాయపడ్డారు.

తిక్కన తర్వాత పాల్కురికి సోమనాథుడు అనే అంశాన్ని క్రీస్తుశకం 12వ శతాబ్దానికి చెందినట్లుగా భావిస్తున్న పాల్కురికి సోమనాథున్ని తిక్కన తర్వాతి వాడుగా కొంతమంది విమర్శకులు పేర్కొన్నట్లుగా ముదిగంటి సుజాతారెడ్డి ప్రకటించారు. విమర్శకుల్లో సోమనకాలం పట్ల భిన్నాభిప్రాయాలు ఉన్నట్లు గుర్తించారు. కొందరు విమర్శకులు పాల్కురికి సోమనాథుడు నన్నయ తిక్కనల మధ్యకాలం వాడని అంటే ప్రతాపరుద్రుని కాలం వాడని, పాల్కురికి ప్రచారం

చేసిన శివపారమ్యం వల్లనే శైవులకు వైష్ణవులకు మధ్య అసహనం ఏర్పడి మతకల్లోలాలు కొట్లాటలు బయలుదేరాయని, ఆ పరిస్థితిని అణచి శాంతిని నెలకొల్పడానికి తిక్కన 'హరిహరాద్వైతాన్ని' బోధించాడన్నారు. మరికొందరు విమర్శకులు తిక్కన తర్వాతివాడని అంటే రెండవ ప్రతాపరుద్రుని కాలంవాడని తెలిపినట్లుగా ఈ సాహిత్య చరిత్ర గ్రంథంలో సుజాతారెడ్డి విశ్లేషించారు. సుజాతారెడ్డి పోతన గురించి చెబుతూ పోతన తెలంగాణ ప్రాంతంలోని జనగామ సమీపంలో ఉన్న బొమ్మెర ప్రాంతానికి చెందిన వాడుగా నిర్ధారించారు. పోతన స్థలం గురించి అనేక రకాల చర్చలు సాహిత్య లోకంలో ఉన్నాయి. దీనికి రచయిత పోతన రాసిన భాగవత పీఠికను ఆధారంగా చేసుకున్నారు. అలాగే, తన రచనా మార్గం గురించి చెబుతూ పోతన అనుసరించిన అనువాద మార్గం కవిత్రయం వారిదే. కొన్నిచోట్ల కథను వాదంగా మరికొన్ని చోట్ల శ్లోక భావాలను వాదంగా ఇంకొన్ని చోట్ల ఆ మూలక కల్పనలను కూర్చడంగా భాగవత అనువాద పద్ధతి నడిచింది. మూల భాగవతంలో లేని రూపకల్పనలు వర్ణనలు, శబ్దాలంకారాలు, రమణీయ కథలు పోతన భాగవతంలో కనిపిస్తున్నాయని పోతన కవిత ప్రతిభకు నిదర్శనాలని ముదిగంటివారు విశ్లేషించారు.

ఆధునిక యుగంలో అస్తిత్వ ఉద్యమాల్లో భాగంగా వచ్చిన స్త్రీవాదాన్ని, స్త్రీ వాదంలో రచనల్లో ఉపయోగించిన భాషను గురించి కొంత విశ్లేషణాత్మక ధోరణిలో విమర్శించారు. కవితల్లో వాడిన పదజాలాన్ని వస్త్వాశ్రయ దృష్టితో పరిశీలించారు. స్త్రీవాదంలో ముఖ్యంగా లిబరల్ ఫెమినిజం(ఉదార స్త్రీవాదం), రాడికల్ ఫెమినిజం, సోషలిస్ట్ ఫెమినిజమని మూడు రకాలధోరణులు ఉన్నాయన్నారు.(చారిత్రక సామాజిక నేపథ్యంలో సాహిత్యచరిత్ర,1996:275) ఫెమినిజంపై మొదటి నుండి కొంత భిన్న అభిప్రాయాన్ని కలిగి ఉన్న సుజాతారెడ్డి చలం మైదానం, ఓల్గా స్వేచ్ఛ మానవి, ఆకాశంలో సగం, సాధన 'రాగో' వంటి నవలల్లో ఎక్కువగా స్త్రీ స్వేచ్ఛను మాత్రమే కేంద్రంగా చేసుకుని రచనలు చేశారు గాని స్త్రీ వక్తిత్వం, ఆత్మవికాసం వంటి వాటికీ ప్రాధాన్యత ఇవ్వలేదని విమర్శించారు. స్త్రీ పురుష సంబంధాల్లో నిజాయితీ,

స్నేహం, ఆత్మవిశ్వాసాలుండాలని ధ్వనింపజేస్తూ 'ఆకాశంలో విభజనరేఖల్లేవు' అనే ఒక నవలను కూడా రాశారు రెడ్డిగారు.

## 5.9 మన తెలుగు సాహిత్య చరిత్ర

ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ముదిగంటి సుజాతారెడ్డి రాసిన చారిత్రక సామాజిక నేపథ్యంలో సాహిత్య చరిత్ర గ్రంథంలో కొన్ని మార్పులు చేసి **'మన తెలుగు సాహిత్య చరిత్ర'** (2018) పేరుతో తెలుగు అకాడమి వారి అధ్వర్యంలో కొత్త సాహిత్య చరిత్ర గ్రంథంగా తీసుకువచ్చారు. దీనిలో కొత్తగా 'తెలంగాణ సాహిత్య వైశిష్ట్యం' పేరుతో ఒక నూతన అధ్యాయాన్ని జతపరిచారు. తర్వాత ప్రాఙ్నన్నయ యుగాన్ని, పూర్వయుగంగా మార్చి శాతవాహనుల కాలంలో ప్రాకృత భాషా ప్రభావం తెలుగుపై పడిన విధానాన్ని ఈ యుగంలో విశ్లేషించారు. బౌద్ధమత ప్రభావాన్ని జైనకవుల యుగం పేరుతో రాసిన అధ్యాయంలో తెలియజేశారు. చివరి మార్పుగా నన్నయ తిక్కనల మధ్యయుగ కాలాన్ని తిరిగి శివకవుల యుగంగానే నిర్ధారించారు.

సాహిత్య పునర్మూల్యాంకన విమర్శలో భాగంగా సాహిత్య పరిణామంలో వస్తున్న మార్పుల్ని మాత్రమే కాకుండా, గతంలో విమర్శకులుగా చేసిన తమ అభిప్రాయాల్లో వచ్చిన పరిణామాల్ని కూడా సమీక్షించుకునే అవకాశం ఉంది. తెలుగులో ఈ దృక్పథంతో కొన్ని సాహిత్య చరిత్రలు వచ్చాయి. అందులో ఆరుద్ర **'సమగ్ర ఆంధ్ర సాహిత్యం'**, **తెలంగాణ తెలుగు సాహిత్య చరిత్ర**(2015) డా.పిల్లి శాంసన్ **'దళితసాహిత్య చరిత్ర'** (2000), డా.సుంకిరెడ్డి నారాయణరెడ్డి **'ముంగిలి-తెలంగాణా ప్రాచీన సాహిత్యం'**(2009) మొదలైన సాహిత్య చరిత్ర గ్రంథాలు తెలుగు సాహిత్యాన్ని పునర్మూల్యాంకనం చేయడం కనిపిస్తుంది. కానీ, డా.ముదిగంటి సుజాతారెడ్డి రాసిన **'చారిత్రక సామాజిక నేపథ్యంలో తెలుగు సాహిత్య చరిత్ర'**(1996) ద్వారా ఆర్థిక రాజకీయ సామాజిక పరిస్థితుల నేపథ్యంలో కూడా సాహిత్య చరిత్రను విశ్లేషించుకోవలసిన అవసరాన్ని సుజాతారెడ్డి ఈ గ్రంథంలో గుర్తించారు.

## 5.10 తెలంగాణ-తెలుగు సాహిత్య చరిత్ర

తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ఉద్యమంలో అన్ని రంగాల్లో మాదిరిగానే తెలంగాణ సాహిత్య, సాంస్కృతిక రంగాల్లో తన అస్తిత్వాన్ని, ప్రత్యేకతను ప్రదర్శించుకోవలసిన అవసరం తెలంగాణ సమాజానికి ఏర్పడింది. తెలంగాణ సాహిత్య సృజనలో ప్రాంతీయ స్పృహ కాస్త ప్రాంతీయ చైతన్యంగా రూపుదిద్దుకుంది. సాహిత్యంలో తెలంగాణ ప్రాంత అస్తిత్వం బలపడింది. ఇది వివిధ సాహిత్యప్రక్రియల ద్వారా బహిర్గతం అయింది. ఈ ప్రాంతీయ చైతన్యాన్ని కేవలం భాషకు సంబంధించిన వ్యవహారంగా చూడటానికి వీలులేదు కానీ, ప్రాంతీయ చైతన్యం వచ్చాక మాండలికం వాడకం విస్తరించింది. అయినప్పటికీ సాహిత్యంలో మాండలికం వాడటం ఒక్కటే ప్రాంతీయ చైతన్యానికి కొలమానం కాదు. ఈ రకమైన ప్రాంతీయ చైతన్యం రూపుదిద్దుకోడానికి, బలపడటానికి దోహదం చేసిన అంశాలను "తెలుగు సాహిత్యం–తెలంగాణ చైతన్యం" అనే వ్యాసంలో గుడిపాటి వెంకటేశ్వర్లు ఈ క్రింది విధంగా పేర్కొన్నారు.(ఆధునిక తెలుగు సాహిత్యంలో ప్రక్రియలు ధోరణులు, 2005:149)

1. ఆర్థిక, సామాజిక, విద్యా రంగాల్లో తెలంగాణ ప్రాంతం వివక్షకు లోనయిందని భావించడం.
2. సకల రంగాల్లో కోస్తా ప్రాంతంవారి ఆధిపత్యం పెరగడం.
3. తెలంగాణకు వలస వచ్చిన కోస్తా పెత్తందారులు ఆర్థికంగా బలపడటం.
4. సాంస్కృతికంగా కోస్తా ప్రాంతం గొప్పదన్న భావం సాహిత్య, ఇతర కళారూపాల్లో కనబడటం.
5. కోస్తా జిల్లాల భాష వ్యవహారికంగా చెలామణీ కాగా తెలంగాణ భాషను చిన్న చూపు చూసే ధోరణి పెరిగిందని భావించడం.
6. సాహిత్య ప్రమాణాలలో తెలంగాణ సాహిత్యానికి తగినంత ప్రాధాన్యం ఇవ్వడం లేదని భావించడం.

ఈ విధంగా అనేక కారణాలుగా దశాబ్దాలుగా అణచివేతకు గురువుతున్న తెలంగాణ ప్రాంతవాసులు 1990ల కాలంలో మేల్కొన్నారు. మహత్తరమైన తెలంగాణ సాయుధపోరాట చరిత్ర ఉన్న తెలంగాణను మళ్ళీ ముందుకి తెచ్చే ప్రయత్నం మొదలయింది. ఇందులో భాగంగానే ఆత్మగౌరవాన్ని చాటుకోవడమనేది ఒక అనివార్యమైన అంశంగా ముందుకు వచ్చింది. దాని కోసం జరిగిన పరిశోధనల ఫలితంగా తెలంగాణ కాల్పనిక సాహిత్యానికి సంబంధించిన అనేక అంశాలు బయటకు వచ్చాయి. తెలంగాణ రాష్ట్రం ఏర్పడి, తెలంగాణ సమాజం తన అస్తిత్వాన్ని సంపూర్ణం, సమగ్రం చేసుకోవడానికి అవసరమైన తెలంగాణ ఆధునిక సాహిత్య చరిత్ర ఇప్పటివరకూ అందుబాటులోకి రాలేదు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం జరిగిన పోరాటంలో భావజాల రంగంలో అస్తిత్వాన్ని ప్రకటించుకుని, తెలంగాణ ఆత్మను ఆవిష్కరించడానికి అనేకమంది రచయితలు ప్రయత్నించారు. ఈ ప్రయత్నంలో భాగంగా తెలంగాణ సమగ్ర సాహిత్యచరిత్ర కోసం అనేక సాహిత్యచరిత్రలు వచ్చాయి. ఈ చరిత్రల్లో భాగంగా సాధ్యమైనంతవరకు తెలంగాణ ఆధునిక సాహిత్య చరిత్రను సమాజం ముందు పెట్టడానికి ప్రయత్నించారు. ఈ పనిలో తనవంతు కృషిని ముదిగంటి సుజాతారెడ్డి నిర్వర్తించారు. ఈమె **'తెలంగాణ–తెలుగు సాహిత్య చరిత్ర'** పేరుతో తెలంగాణ ఏర్పడిన తర్వాత సాహిత్య చరిత్ర రాశారు. దీనిలో తెలంగాణ ప్రాంతంలో వచ్చిన వివిధ రకాల సాహిత్య ప్రక్రియల విశిష్టతను తెలియజేశారు.

## 5.10.1 శాసన చరిత్ర

విష్ణుకుండినులను ఓడించి పశ్చిమ చాళుక్యులు ఆంధ్రదేశాన్ని పరిపాలించారు. వీరిలో ఒక శాఖవారైన తూర్పు చాళుక్యుల అధీనంలో తీరాంధ్ర ప్రాంతం ఉంది. రెండో శాఖ వారైన బాదామి చాళుక్యులు తెలంగాణ, రాయలసీమ ప్రాంతాన్ని పాలించారు. వీరి తర్వాత రాష్ట్రకూటులు మరియు కళ్యాణి చాళుక్యులు తెలంగాణను పాలించారు. ఈ కాలంలో ఎక్కువగా పరిపాలించిన వేములవాడ, ముదిగొండ చాళుక్యులు పేరు మీద వచ్చిన ఈ

చాళుక్యయుగంలో వీరు కొన్ని శాసనాలు వేయించారు. తెలంగాణ తెలుగు సాహిత్యంలో తొలిసారిగా వచ్చిన సాహిత్య ప్రక్రియల క్రమవికాసాన్ని ఈ శాసనల ఆధారంగా అందించే ప్రయత్నం చేశారు. ఇందులో మొదటిది క్రీ.శ 935లో ముదిగొండ చాళుక్యరాజు నిరవద్యుడు వేయించిన  కొరవి శాసనం. ఈ శాసనం గద్యంలో కావ్యాతరికల్లో కనిపించే వచన రచన పద్ధతిలా ఉంది. ఈ శాసనం నన్నయ రాసిన మహాభారతం కన్న వంద సంవత్సరాల ముందు రాసినట్లు ముదిగంటివారు తెలియజేశారు. తెలంగాణాలో వేయబడిన రెండవ శాసనం క్రీ.శ 1000 ప్రాంతం నాటిదైన గూడూరు శాసనం. తెలుగులో మొదటిసారి వృత్తపద్యాలు కలిగి ఉన్న శాసనమిది. దీనిలో పదబందాలు, అలంకారాలతో కూడిన కావ్యశైలి అప్పటికే ఉన్నట్లు కనిపిస్తుందని శాసనంలో కొన్ని పద్యాలను ఉదాహరణగా ఇచ్చారు.

**చం. అనుపమ దుర్జయాన్వయ సుధాబ్ది ననేకులు రాజనందనుల్**

**సనినబొరంటి వెన్నడను సంభవుడయ్యె నతి ప్రసిద్ధుడై**

**వినుత విరోధి మండలికి వెన్నను వెన్నడు వోలె వానికిల్**

**ఘనుడగు నెఱ భూపతి జగద్వి దితుండుదయించే గీర్తితోన్...** (గూడూరు శాసనం)

ఈ శాసనంలో ఉన్న విషయాలను బట్టి మొత్తం మీద క్రీ.శ 1000 నాటికి అంటే నన్నయ మహాభారత రచనకు యాభై సంవత్సరాల ముందే తెలుగులో ఆలంకారిక శైలిగల పద్యరచన ఉన్నట్లు  తెలంగాణాలో దొరికిన ఈ శాసనాన్ని బట్టి  తెలుస్తుందని, ఇక మూడో శాసనమైన జినవల్లభుని  'కురిక్యాల' శాసనన్ని ఉదాహరణగా చూపిస్తూ, సంస్కృత కన్నడ పద్యాలతో పాటు తెలుగులో దొరికిన మొదటి కంద పద్యాలను ఆధారంగా ఇచ్చారు. క్రీ.శ 935లో దొరికిన శాసనం ఆధారంగా నన్నయకు వంద సంవత్సరాల ముందే తెలంగాణ ప్రాంతంలో చక్కని కావ్య రచన చేయగల రచనశైలి వికసించిందని అన్నారు. వేములవాడ చాళుక్యుల కాలంలో 'కవిజనాశ్రయం' వంటి ఛందస్సుతో కూడిన గ్రంథం వంటివి రచింపబడ్డాయి. తెలంగాణ ప్రాంతంలో దొరకిన ఈ శాసనాల బట్టి తెలంగాణాలో 8, 9 శతాబ్దాల నాటికే తెలుగులో కావ్య రచన జరిగిందని చెప్పవచ్చునని సాహిత్య చరిత్రలో భాగంగా ముదిగంటి సుజాతారెడ్డి అభిప్రాయపడ్డారు.

## 5.10.2 తెలంగాణ శతక సాహిత్యం

"**శతేన ప్రోక్తం శతకం**"–నూరు శ్లోకాలు లేదా పద్యాల సమాహారమే శతకం. శతకమంటే వంద అయినప్పటికీ రాసే కవి ప్రతిభను అనుసరించి అంతకంటే ఎక్కువ శ్లోకాలు లేదా పద్యాలు ఉండవచ్చు. పద్యగద్యాలతో పరిపుష్టమైన భారతీయ సాహిత్యంలో శతక సాహిత్య రచన సాధారణంగా పద్యభాగానికి చెందిన విశేష రచనా ప్రక్రియగా చెప్పవచ్చు. సంస్కృత సాహిత్యంలో దీనికి మూలాలున్నట్లు మనకు నిర్దిష్టమైన ఆధారాలున్నాయి. తెలుగు భాషలో భక్తి, నీతి,శృంగార, హాస్య, వైరాగ్య, కథాత్మక, అనువాద, చారిత్రక ప్రక్రియలో శతకాలు రచించబడ్డాయి. శతక రచనా విధానంలో కొన్ని ప్రత్యేకతలున్నాయి. ఛందో నియమయుక్తంగా వివిధ వృత్తాలలో రచించబడటం ముఖ్య లక్షణం.

శతకాలను "ముక్తక", "అముక్తక" శతకాలని రెండు రకాలుగా విభజించవచ్చు. విషయ ప్రాధాన్యాన్ని బట్టి రాసిన శ్లోకాలు గాని పద్యాలు గాని ఒకదానితో మరోకదానికి సంబంధం లేకుండా స్వతంత్ర భావాన్నిచ్చేవి "ముక్తకాలు" అంటారు. అలాకాక ధారావాహిక విషయ వివరణాత్మకమైనవి "అముక్తక" శతకాలు, అలాగే శతకాలను "ధార్మిక శతకాలు", "లౌకిక శతకాలు" అని మరో రెండు రకాలుగా విభజించవచ్చు.

శతక వాఙ్మయం తెలుగు భాషలో 12వ శతాబ్దంలో ప్రారంభమైనట్లు పరిశోధనలు తెలియజేస్తున్నాయి. ఇతర భాషలలో శతక రచనలు ఉన్నప్పటికీ ఛందోబద్ధమై, వృత్త ప్రాధాన్యం కలిగి, అలంకార యుక్తమై, మకుట నియమాన్ని మకుటాయమానంగా కలిగిన ప్రత్యేక రచనాశైలి తెలుగు శతక సాహిత్య రచన కలిగి ఉంది. తెలుగు సాహిత్యంలో నాటి నుండి నేటివరకు పదివేలకు పైగా శతకాలున్నాయని విమర్శకుల అంచనా. ప్రాచీన స్తుతి శతకాల నుండి ఆధునిక విషయ పరిజ్ఞాన బోధక శతకాల వరకు రచింపబడిన ఈ అనేకానేక శతక రచనల్లో తెలంగాణా ప్రాంత కవుల, పండితులు తోడ్పాటు ప్రశంసించే స్థాయిలో ఉంటుంది.

తెలుగు శతకాల్లో సుమతీ శతకం ప్రాముఖ్యమైనది. ఇదే తెలుగులో మొదటి శతకంగా చాలామంది సాహిత్యకారులు పరిగణిస్తారు. వేములవాడ చాళుక్యరాజు రెండో బద్దెన ఈ సుమతీ శతకాన్ని రచించాడు. ఈ బద్దెన **'నీతిశాస్త్ర ముక్తావళి'** అనే గ్రంథం కూడా రాసినట్లు చెప్తారు. ఈ విషయంపై అనేక భిన్నమైన వాదనలున్నాయి. జయంతి రామయ్యపంతులు బద్దెన క్రీ.శ1200 ప్రాంతానికి చెందినవాడంటారు.(నారాయణరెడ్డి, సుంకిరెడ్డి. తెలంగాణ సాహిత్య చరిత్ర,2012:14) సుమతీ అనే జైనముని సుమతీ శతకాన్ని రాసి ఉండవచ్చునని వంగూరి సుబ్బారావు తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. కానీ, సుమతీ శతకం బద్దెనే రాసినట్లుగా ఎక్కువమంది పరిగణించారు. కాబట్టి సుమతీ శతకాన్ని వేములవాడ చాళుక్యుల కాలంలోనే వచ్చినట్లు సుజాతారెడ్డి విశ్లేషించారు. సుమతీ శతకం సరళమైన సుందర శైలిలో ఉంది.

**తన కోపమె తన శత్రువు**
**తన శాంతమె తనకు రక్ష, దయ చుట్టంబౌ**
**తన సంతోషమె స్వర్గము**
**తన దు:ఖమె నరకమండ్రు తథ్యము సుమతీ!**

జీవితంలో అనుక్షణం మనలను జాగృతపరిచే విధంగా బద్దెన రాసిన సుమతీ మకుటంతో రాసిన ఈ పద్యాలు భావాన్ని సూటిగా చెప్పే విధంగా ఉన్నాయన్నారు సుజాతారెడ్డి.

ఇది మొదటి శతకం అయిన తర్వాత తెలుగులో వందల సంఖ్యలో వివిధ శతకాలు వచ్చాయి. ముఖ్యంగా తెలంగాణలో శరభాంకలింగ శతకం, నరసింహశతకం, శ్రీకృష్ణశతకం మొదలైనవి వచ్చినట్లు రెడ్డిగారు తన గ్రంథంలో తెలియజేశారు. వీటితోపాటు ఆధునిక కాలంలో తెలంగాణలో శతక సాహిత్యం భక్తి, జ్ఞాన, వైరాగ్య, నీతి బోధక మార్గోపదేశకంగా వెల్లివిరిసింది. వానమామలై వరదాచార్యులు రాసిన **"స్తవరాజ పంచశతి**", ఆచార్య కోవెల సంపత్కుమారాచార్యుల **"అంతర్మథనం"**, ఆచార్య కోవెల సుప్రసన్నాచార్యులు రాసిన **"శ్రీపాంచాల రాయశతకం**", హరిరాధా కృష్ణమూర్తి **"శ్రీ శ్రీనివాస శతకం"** డా.సి.వి.

జయరాజు **"చారుచర్య"** ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి **"శ్రీ కర్మన్‌ఘాట్ అంజనేయ స్వామి"** మొదలైనవి తెలంగాణా నుండి వెలువడ్డాయి.

## 5.10.3 జానుతెలుగు-ప్రజా చైతన్యం

తెలుగు భాష, సారస్వతాలు కాకతీయుల పాలనలో వివిధ ప్రక్రియలలో బహుముఖంగా విస్తరించాయి. కొన్ని సాహిత్య ప్రక్రియలకు తెలంగాణలో, ముఖ్యంగా కాకతీయుల పాలనా కాలంలోనే తెలుగు భాషాచరిత్రలో మొదటిసారి అంకురార్పణ జరిగింది. అప్పటివరకు సామంతులుగా ఉన్న కాకతీయులు, కాకతీయ మహాసామ్రాజ్యాన్ని ఓరుగల్లు రాజధానిగ అవతరింపజేయడం తెలంగాణ చరిత్రలో ఒక మహోజ్వల ఘట్టం. అచ్చమయిన తెలుగురాజ్యం, తెలంగాణ రాజ్యం కాకతీయ సామ్రాజ్యం. క్రీస్తుశకం ఆరంభానికి ముందే పదకొండవ శతాబ్ది ఆరంభంలో నన్నయ భారతం రచించడానికి ముందే తెలంగాణ ప్రాంతంలో పద్యకావ్య రచన ప్రారంభమయిందని తెలిపే శాసనాలు తదితర సాక్ష్యాధారాలు లభించాయి. అప్పటికే తెలంగాణ ప్రాంతంలో తెలుగు జానపద గీతాలు ప్రాచుర్యంలో ఉన్నాయని కూడా సురవరం ప్రతాపరెడ్డి వంటి పండితులు, పరిశోధకులు నిర్ధారించారు.

మొదటి ప్రోలరాజు తర్వాతనే కాకతీయులు తెలుగు భాషను ఆదరించినట్లు తెలుస్తుంది. అప్పటివరకు కన్నడం, సంస్కృతంలో ఉండే శాసనాలే కాకుండా కాకతీయ రాజు రెండవ బేతరాజు తెలుగులో శాసనాలు వేయించినట్లు కనిపిస్తుంది. ఈ కాలంలో కొంతమంది ప్రసిద్ధకవులు, శాసనకవులు ఉన్నారు. అచింతేంద్రయతి (క్రీ.శ1150-1195), వెల్లంకి గంగాధార మంత్రి (క్రీ.శ1150-1195), నాగదేవకవి (క్రీ.శ1150-1195), బ్రహ్మశివకవి 12వ శతాబ్దం, మల్లపురాజు (క్రీ.శ1181) 2వ ఈశ్వర భట్టోపాధ్యాయుడు(క్రీ.శ1262 ప్రాంతం) (నారాయణరెడ్డి, సుంకిరెడ్డి. తెలంగాణ సాహిత్య చరిత్ర,2012:26) వంటి శాసనకవులు కాకతీయుల యుగంలో ఉన్నట్లు సుంకిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. కానీ, కాకతీయుల కాలంలో కవులు ఇతివృత్తంలో ఛందస్సులో దేశీయతను ఆదరించారని, వీరు 'జానుతెనుగు' పేరుతో దేశి పదజాలంతో కూడిన తెలుగు భాషను అభిమానించారని ముదిగంటివారు

తెలియజేశారు. ఇది శివకవుల భాష ఉద్యమం చేత ప్రభావితమై దేశితనంతో కూడిన సంస్కృత మిళీతమైన తెలుగు భాష శైలి ఈ కాకతీయుల యుగంలో ఆవిర్భవించినట్లు సుజాతారెడ్డి తెలంగాణ సాహిత్య చరిత్రలో వివరించారు.

**''ఉరుతర గద్య పద్యోక్తులకంటె**

**కూర్చెద ద్విపదల కోర్కె దైవార**

**అరూఢగద్య పద్యాది ప్రబంధ**

**పూరిత సంస్కృత భూయిష్ఠ రచన**

**మానుగా సర్వ సామాన్యంబు గామి..''** అంటూ జాను తెనుగు విశిష్ఠతను తెలియజేసిన తెలంగాణ ప్రాంతానికి చెందిన పాల్కురికి సోమన తెలుగు సాహిత్యంలో ఆదికవిగా పేర్కొంటారు. కానీ, సోమనాథుడు ఆదికవిగా అలాగే, తెలంగాణ ప్రాంతానికి చెందివాడ? అనే దానిపై అనేక రకాల చర్చలు సాహిత్యంలో సాగాయి. అనేక దేశీయ రచనా రీతులకు ఒక అస్తిత్వాన్ని కల్పించిన వాడుగా పాల్కురికి సోమనాథున్ని గుర్తించవచ్చు. సోమనాథుడు శివకవుల్లో ప్రముఖుడిగా ప్రసిద్ధి చెందాడు. సోమన తెలుగులో బసవపురాణం, పండితారాధ్యచరిత్ర అనే ద్విపదకావ్యాలు, బసవోదాహరణం, అనుభవసారం, చతుర్వేద సార సూక్తులు, సోమనాథభాష్యం, రుద్రభాష్యం, బసవరగడ, గంగోత్పత్తి రగడ, శ్రీ బసవాద్య రగడ, సద్గురు రగడ వంటి రగడలు, చెన్నమల్లు సీసములు, శీల సంపాదన (కన్నడ), బెజ్జమహాదేవికథ వంటి తెలుగు సాహిత్యంలో మొట్టమొదటి దేశీ రచనలను చేయడమే గాకుండా దేశీయ సంప్రదాయాలను, భాషా, సాహిత్య, నాట్య, సంగీత, చారిత్రక, స్థానికాచార వ్యవహారాలు, జీవితాలను, సామాజిక పరిస్థితులను తన రచనల్లో పాల్కురికి ప్రతిఫలించేలా చేశాడు.

పాల్కురికి సోమనాథుడు కాలానికి గురించి అనేక రకాల భిన్నాభిప్రాయాలున్నాయి. కొందరు విమర్శకులు సోమన నన్నయ తిక్కన నడిమి కాలం వాడని బహుశా మొదటి ప్రతాపరుద్రుని క్రీస్తుశకం 1158-1195 మధ్యకాలం వాడని అంటారు. సోమన ప్రచారం చేసిన శివపారమ్యం వల్లనే శైవులకు వైష్ణవులకు మధ్య అసహనం ఏర్పడి

మతకల్లోలాలు బయలుదేరాలని ఆ పరిస్థితులను అణచి శాంతిని నెలకొల్పడానికి తిక్కన హరిహరాద్వైతాన్ని బోధించాడని వాళ్ళంటారు. మరికొందరు విమర్శకులు సోమన తిక్కన తరువాత వాడని అంటే రెండో ప్రతాపరుద్రుడు క్రీస్తుశకం 1289-1323 మధ్యకాలం వాడని అంటారు. మొదటివాదాన్ని అంగీకరించినట్లయితే సోమన్న దాదాపు బసవనకు సమకాలికుడు అవుతాడు. బసవన్నకేకాక పండితారాధ్యునికి కూడా సోమన సమకాలికుడు అవుతాడు. ఆ విధంగా సమకాలికులు చరిత్రలను పాల్కురికి రాసదనడం సహజంగా, అదే సమంజసంగా ఉంటుందని ముదిగంటి సుజాతారెడ్డి సోమనాథుని కాలాన్ని నిర్ధారించే ప్రయత్నం కూడా ఈ గ్రంథంలో చేశారు.

క్రీ.శ 13వ శతాబ్దంలో తిక్కన నిర్వచనోత్తర రామాయణం మహాభారత రచనల కన్నా పూర్వమే తెలుగులో రెండు రామాయణ కావ్యాలు వ్రాయబడినాయి. మొదటిది రంగనాథరామాయణం రెండవది భాస్కర రామాయణం. మహాభారత రచన కోస్తా ప్రాంతంలో జరుగగా రామాయణాలు, మహాభాగవతం వంటివి మాత్రం తెలంగాణ ప్రాంతంలోనే మొదటిసారిగా రాయబడినట్లు సుజాతారెడ్డి తెలియజేశారు. రంగనాథరామాయణ కర్త అయినా గోనబుద్ధారెడ్డి గురించి వివరిస్తూ, అప్పుడే ప్రవేశిస్తున్న వైష్ణవంమీద అభిమానంతో రామాయణ రచన చేసి, అందుకే దానికి రంగనాథరామాయణం అనే పేరు పెట్టి ఉంటాడన్నారు. అందుకే ద్విపదదేశి ఛందస్సులో బుద్ధారెడ్డి రాసిన రంగనాథ రామాయణం తెలుగులో మొదటి రామాయణంగా, తెలుగులో ఇదే మొదటి కావ్యంగా, తెలుగులో తోలి దేశికవిగా గోన బుద్ధారెడ్డిని గుర్తించారు.(తెలంగాణ తెలుగు సాహిత్య చరిత్ర, 2015:56) అలాగే, కాకతీయుల కాలంలో తెలంగాణ ప్రాంతంలో ఉన్న హుళక్కి భాస్కరుడు, కుమారరుద్రదేవుడు, మారన, కుప్పాంబిక, కొలని రుద్రదేవుడు, రావిపాటి త్రిపురాంతకుడు వంటి వివిధ కవులు, కవయిత్రుల గురించి కూడా వారి రచనలతో పాటు రెడ్డి ప్రస్తావించారు.

## 5.10.4 రాచకొండ పద్మనాయకుల యుగం

ఇక మల్లినాథసూరి, సాయణుడు, పోతన, గౌరన, మొల్ల, పిల్లలమర్రి పినవీరన, కొరవి గోపరాజు, మడికి సింగన వంటి ఎందరో కవులను కలిగిన పద్మనాయకుల యుగంలోని సాహిత్య, సామాజిక అంశాలను ఈ సాహిత్య చరిత్ర గ్రంథంలో ప్రస్తావించారు. ఈ యుగంలో ప్రధానంగా వుండే పోతన జన్మస్థల విషయంపై అనేక రకాల చర్చలు జరిగాయి. ఇందులో ప్రధానంగా వచ్చే కడప జిల్లా ఒంటిమిట్ట వాదాన్ని ఖండిస్తూ సుజాతారెడ్డి పోతన రచనలయిన భాగవతం, భోగినిదండకం, వీరభద్రవిజయంలోని అంశాల ఆధారంగా ముఖ్యంగా పోతన భాగవతంలో పేర్కొన్న ఏకాశిలానగరం, ఓరుగల్లె అని అదే నేటి 'వరంగల్' గా రూపాంతరం చెందినట్లు తన అభిప్రాయాన్ని తెలియజేశారు. ఇదే విషయాన్ని 'ముంగిలి'లో నిరూపిస్తూ వివిధ రకాల విమర్శకులు చేసిన అభిప్రాయాలను ఒక దగ్గర చర్చకు పెట్టి చివరికి బమ్మెర పోతన తెలంగాణ ప్రాంతానికి చెందివాడుగా సుంకిరెడ్డి నారాయణరెడ్డి నిర్ధారించారు.(ముంగిలి తెలంగాణ ప్రాచీన సాహిత్య చరిత్ర,2016:179)

పోతన '**పలికెడిది భాగవతమట, పలికించెడి వాడు రామభద్రుండట, ఇకనే పలికిన భవహర**' మగునని చెప్పినట్లుగా మొల్ల కూడా '**చెప్పమని రామచంద్రుడు సెప్పించిన పలుకుమీద చెప్పెద నేనెల్లప్పుడు నిహాపరసాధన మిప్పుణ్య చరిత్ర తప్పులెంచకుడు కవుల్**' అని చెప్పుకుని పోతన మార్గంలోనే మొల్ల కూడా రాజులను నిరసిస్తూ అదే మార్గంలోనే నడిచింది.

**సుడిగొని రామపాదములు సోకిన ధూళి వహించి రాయి యే**
**ర్పడనొక కంతయయ్యెనట పన్నుగ నీతని పాదరేణు ని**
**య్యెడ వడినోడ సోకనిది యేమగునోయని సంశయాత్ముడై**
**కడిగె గుహుండు రామపదకంజయుగంబు భయము పెంపునన్..**

అని చెప్పిన మొల్ల చంపూ కావ్యమార్గంలో రామాయణాన్ని రాసి, తన కావ్యంలో సహజ వర్ణనలతో అతిశయోక్తి లేకుండా చేసిందని ముదిగంటివారు విశ్లేషించారు. ఏకామ్రనాథుని ప్రతాపచరిత్రను బట్టి మొల్ల రెండో ప్రతాపరుద్రుని ఆస్థాన కవయిత్రిగా ఉండి ఉంటుందని తద్వారా మొల్లను తెలంగాణ కవయిత్రిగా సుజాతారెడ్డి అంచనా వేశారు

### 5.10.5 గోల్కొండ రాజ్యంలో తెలుగు సాహిత్యం

పదిహేనో శతాబ్దం చివరినాటికి క్షీణ దశకు చేరిన బహమనీ సామ్రాజ్యం అయిదు రాజ్యాలుగా చీలిపోయింది. అందులో గోల్కొండ కుతుబ్‌షాహీ రాజ్యం ఒకటి. ఈ రాజ్యస్థాపకుడు సుల్తాన్ కులీకుతుబ్‌షా. ఇతడు 1496 నుంచి 1518 వరకు సుబేదార్‌గా తెలంగాణ ప్రాంతాన్ని పాలించాడు. 1518లో స్వతంత్రం ప్రకటించుకున్నాడు. కుతుబ్‌షాహీలు తొలుత తెలంగాణను పాలించారు. 1565లో విజయనగర సామ్రాజ్య పతనం తర్వాత ఇతర తెలుగు ప్రాంతాలు కూడా వీరి ఆధీనంలోకి వచ్చాయి. తెలంగాణ అనే పదం వీరి కాలం నుంచే ప్రాచుర్యం పొందింది. కుతుబ్‌షాహీలు సుమారు రెండు శతాబ్దాల(1496-1687) పాటు తెలంగాణను పాలించారు. వీరు తెలుగు భాషా సాహిత్య సంస్కృతులను ఆదరించి తెలుగు ప్రజల అభిమానాన్ని చూరగొన్నారు.

ఇబ్రహీం కుతుబ్‌షా(1550-80) విజయనగర రాజుల దగ్గర ఏడేళ్లపాటు ఆశ్రయం పొందాడు. ఆ సమయంలోనే తెలుగు నేర్చుకున్నాడు. తెలుగు సాహిత్యంలో మల్కిభరాముడిగా ప్రసిద్ధి చెందాడు. ఇక్కడ ఉన్నప్పుడే ఇబ్రహీంకు భాషా సాహిత్యాలతో పరిచయమైంది. స్వయంగా ఉర్దూ భాషలో కవి అయిన ఇబ్రహీం తెలుగు నేర్చుకున్నాడు. తర్వాత తెలుగు కవులనాదరించాడు. ఇబ్రహీం కుతుబ్షా ఉర్దూ భాషకు ఒక రూపమిచ్చిన కవి అంటారు. ఉర్దూలో దాన్ని 'దక్కనీ బోలీ' అని పిలుస్తారు. ఉర్దూలో గజళ్ళు వ్రాసిన మొదటి కవి ఇబ్రహీం, ఉమర్ సిరాజ్ మీరా ఉమర్షి మహమ్మద్, అంజూ, మహమూద్ షిరాజి, కులీ మీర్జా వంటి ఉర్దూ కవులెందరో అతని ఆస్థానంలో ఉన్నారు. వీరితోపాటు అద్దంకి గంగాధరుడు, మరింగంటి సింగరాచార్యులు, కందుకూరి రుద్రకవి వంటి తెలుగు కవులను కూడా కుతుబ్ షాహి వశంస్తులు ఆదరించిన విషయాన్ని సుజాతారెడ్డి తెలంగాణ తెలుగు సాహిత్య చరిత్ర గ్రంథంలో తెలియపరిచారు. వారిలో కందుకూరి రుద్రకవి ఈ యుగంలోని అగ్రశ్రేణి కవుల్లో ఒకడు. ఇబ్రహీం కుతుబ్‌షా దేవరకొండ దుర్గపాలకుడిగా ఉన్నప్పుడే ఇతడికి కుతుబ్‌షాతో పరిచయం ఉంది. కుతుబ్‌షా రాజైన తర్వాత అతడి నుంచి రెంటచింతలను అగ్రహారంగా పొందాడు. ఇతడు నల్లగొండ జిల్లా దేవరకొండ సమీపంలోని కందుకూరుకు చెందినవాడని తెలుస్తోంది. ఇతడు సుగ్రీవ విజయంను రచించాడు. దీన్ని తొలియక్షగానంగా భావిస్తారు.

నిరంకుశోపాఖ్యానం, జనార్ధనాష్టకం, బలవదరీ శతకం, జనార్ధనాష్టక స్తోత్రం, గువ్వలచెన్నని శతకం తదితర గ్రంథాలను రుద్రకవి రచించాడు. ఇతడి రచనల్లో నిరంకుశోపాఖ్యానం ముఖ్యమైంది. ఇది శృంగార ప్రధాన సాంఘిక కావ్యం. ఇందులో నాటి సాంఘిక జీవనాన్ని చిత్రీకరించారు. ఈ యుగంలో కనిపించే తొలి కవి చరిగొండ ధర్మన. ఇతడు పెద్దన, సూరన, నందిఘంట కవుల కంటే ముందే రుతువర్ణన, నాయికా వర్ణన, వేటవర్ణన లాంటి అష్టాదశ వర్ణనలు చేశాడు. పోశెట్టి లింగ కవి నవచోళ చరిత్ర, మల్హణ చరిత్ర, శంకర దాసమయ్య చరిత్ర, వీర సంగమయ్య దేవ చరిత్ర, శిష్య ప్రబోధం అనే ద్విపద కావ్యాలను రాశాడు. మల్కిభరాముడి(ఇబ్రహీం కుతుబ్‌షా) మరో ఆస్థాన కవి అద్దంకి గంగాధరుడు(1525-80). ఇతడిని రామరాజభూషణుడితో పోల్చవచ్చు. ఇతడు తపతీ సంవరణోపాఖ్యానంను రచించి, ఇబ్రహీం కుతుబ్‌షాకు అంకితమిచ్చాడు. ఈ కావ్యంలో మల్కిభరాముడి ప్రేమ కథను వర్ణించాడు. ఈ శృంగార కావ్యంలో సమకాలీన సాంఘిక విశేషాలెన్నో కనిపిస్తాయి. తమ్మయ కులీ కుతుబ్‌షాకు ఆప్తుడు. గోల్కొండకు కరణీకం చేసేవాడు. అనేక కావ్యాలను రచించాడు. హరిభక్తి సుధోదయం అనే గ్రంథానికి తమ్మయ్య రాసిన వ్యాఖ్యానంలో భగీరథ పట్టణ ప్రస్తావన ఉంది. ఈ పట్టణమే భాగ్యనగరం(హైదరాబాద్). తమ్మయ్య ముఖ్య రచన వైజయంతీ విలాసం. సురభి మాధవరాయలు(1620-70) చంద్రికా పరిణయమనే ప్రౌఢ కావ్యాన్ని రచించాడు. సురభి మాధవరాయల ఆస్థానకవి ఎలకూచి బాలసరస్వతి (1570-1650). ఆంధ్రశబ్ద చింతామణి ద్వారా ఇతడి పేరు చర్చనీయాంశమైంది. సంస్కృతంలో రాసిన ఈ తొలి తెలుగు వ్యాకరణ గ్రంథం నన్నయ రచనా? కాదా? బాలసరస్వతే రాసి నన్నయ పేరు పెట్టాడా? అనే విషయాలు చర్చనీయమయ్యాయి.

మాధవరాయలతోపాటు ఇతడు కూడా చంద్రికా పరిణయం రాశాడు. కానీ, ఈ రెండింటిలో వేర్వేరు కథలున్నాయి. ఇతడు భర్తృహరి సంస్కృతంలో రాసిన శృంగార, నీతి, వైరాగ్య శతకాలను సుభాషిత రత్నావళి పేరుతో అనువదించాడు. అలాగే, దక్షిణాంధ్రయుగంలో తెలుగు సాహిత్యం అనేక-ప్రక్రియలతో వికసించినట్లుగానే కుతుబ్‌షాహీల పాలనలో తెలుగు సాహిత్యం సర్వతోముఖంగా అభివృద్ధి చెందిన విషయాలను అనేకం ఈ గ్రంథంలో ముదిగంటివారు ప్రస్తావించారు. అంతేకాకుండా కుతుబ్‌షాహీల

యుగం దక్షిణాంధ్రంలో తంజావూరు నాయకరాజుల మధుర నాయక రాజుల జింజి రాజుల కాలంలోని సాహిత్య వాతావరణాన్ని తలపింపజేస్తున్నది. రాజుల ఆదరణలో ఎందరో కవులు ఎన్నో రచనలు చేసి దక్షిణాంధ్రంలో వలెనే ప్రభువుల ఆదరణ పొందారు. తర్వాత ఇంగ్లీషు వాళ్ళు క్రమక్రమంగా భారతదేశాన్ని ఆక్రమించుకోవడంతో సాహిత్య వాతావరణం ఆధునికత ప్రవేశించి ప్రక్రియల్లో మార్పు రావడానికి గల కారణాన్ని వివరించారు. ఈ కాలానికి చెందిన కవులే వీరే కాకుండా కుతుబ్‌షాహీల కాలానికి చెందిన ఎంతో మంది కవులు తెలుగు సాహిత్యాభివృద్ధికి ముఖ్యంగా తెలంగాణ ప్రాంతీయ సాహిత్యానికి విశేషంగా కృషి చేశారు.

## 5.11 ఆంధ్రుల సంస్కృతి–సాహిత్య చరిత్ర

భారతదేశ చరిత్రలో ఆంధ్రులకు ఒక ప్రత్యేక స్థానం ఉంది. ముఖ్యంగా తెలుగు వారు దక్షిణభారత చరిత్రలో గాని, సాహిత్యంలో గాని, సంస్కృతిలో గాని విశేషమైన కృషి చేశారు. కానీ, తెలుగువారి చరిత్ర, సంస్కృతి, సాహిత్యం వీటన్నిటిని సమన్వయపరుస్తూ సాహిత్యచరిత్రలుగాని, ఇతర గ్రంథాలుగాని కొంత తక్కువగానే వచ్చాయి. ఈ ప్రయత్నంలో 1951లో ఖండవల్లి లక్ష్మీరంజనం రాసిన **'ఆంధ్రుల చరిత్ర–సంస్కృతి'** ఈ లోపాన్ని కొంత తీర్చడానికి ఆ దిశగా కొంత ప్రయత్నం చేసినట్లుగా కనిపిస్తుంది. కానీ, ఈ గ్రంథం సాహిత్య గ్రంథంకంటే ఒక సామాజిక గ్రంథంగా గుర్తింపు పొందింది. సాహిత్య లోకంలో ఉన్న ఈ లోపాన్ని కొంత తీర్చే ప్రయత్నంలో భాగంగా ముదిగంటి సుజాతారెడ్డి ఆంధ్రుల సాంఘిక, సాంస్కృతిక పరిస్థితులను సాహిత్యంలో ప్రతిఫలింపజేస్తూ **'ఆంధ్రుల సంస్కృతి–సాహిత్యచరిత్ర'** పేరుతో 1989లో డిగ్రీ, పి.జి స్థాయి విద్యార్థులకు కోసం సాహిత్య చరిత్ర గ్రంథాన్ని రూపొందించారు. ఈ గ్రంథాన్ని ఇంతవరకూ రాసిన సాహిత్య చరిత్ర గ్రంథాలలాగా కాకుండా సామాన్య పాఠకులకు ముఖ్యంగా అప్పుడప్పుడే సాహిత్యం పరిచయమవుతున్న సాహిత్య విద్యార్థులకు సులభంగా అవగాహన అయ్యే విధంగా చాలా సరళశైలిలో నన్నయ గురించి చెబుతూ "నానారుచిరార్థ సూక్తులంటే కొందరు అనేక విధాలైన అందమైన సూక్తి, సుభాషితాలకు నిలయమైనవాడు నన్నయ అని చెప్పారు. కాని దీనికన్నా నన్నయ వక్రోక్తి

భరితమైన కవిత్వం చెప్పగలవాడన్న అర్థమే సమంజసంగా వున్నది"(ఆంధ్రుల సంస్కృతి–సాహిత్యచరిత్ర,2007:8) వంటి తేలికైన వ్యాక్యనిర్మాణంలో, స్పష్టంగా ఇంత వరకు ఉన్న ఆంధ్రసాహిత్యాన్ని ఒక సింహవలోకనం చేసినట్లుగా సాహిత్య చరిత్ర గ్రంథాన్ని రాశారు ముదిగంటి సుజాతారెడ్డి.

దీనిలో ప్రాజ్ఞన్నయ యుగం, నన్నయ, శివకవి యుగం, తిక్కన, ఎర్రన, శ్రీనాథయుగమనే కవుల పేర్లతో ప్రబంధ యుగమని ప్రక్రియ పేరుతో, శతక సాహిత్యం, ఆధునికసాహిత్యం, ఆధునిక వచన ప్రక్రియలు, ఆంధ్రతెనుగు–తెలుగు పదాల చరిత్ర ప్రాచీనత అని ఆధునిక సాహిత్యాన్ని యుగ విభజన చేసి ఆ యుగంలో వచ్చిన వివిధ రకాల సాహిత్యాన్ని పరిచయం చేశారు.

ఇది ఒక పాఠ్య గ్రంథమే అయినా దీనిలో సాహిత్య చరిత్రకు ఉండాల్సిన అన్ని ముఖ్యంశాలన్నిటిని చేర్చి సంక్షిప్తంగా విద్యార్థులకు త్వరగా అవహగన అయ్యేలా రాసి, వారికి కొంత సులభంగా సాహిత్య చరిత్ర మీద అవగాహన కలిగేలా ఈ సాహిత్య చరిత్ర గ్రంథాన్ని రూపొందించారు. అంతేకాకుండా ఏవైతే కవులపేర్లతో యుగ విభజనచేసిన వాటిలో యుగకర్తగా భావించిన కవుల గురించి వారి కవిత రీతులను, రసపోషణ విధానాన్ని, వర్ణననైపుణ్యం వంటి అనేక రకాల విషయాల్ని వివరంగానే తెలియజేసే ప్రయత్నం సుజాతారెడ్డి చేశారు.

ఆంధ్రుల అతీ ప్రాచీనమైన జాతి. వారి భాష కూడా ప్రాచీనమైంది. దాదాపు వెయ్యేళ్ళ సాహిత్యం తెలుగు వారికి ఉంది. సంగీతం, చిత్రకళ, నాట్యం, శిల్పకళ వంటి వాటిల్లో ప్రత్యేకతను కలిగివున్న జాతి ఆంధ్రజాతి. తెలుగువారికి అనేక ఆచార వ్యవహారాలు, సంప్రదాయాలు, పండుగలు, నమ్మకాలు ఒక వారసత్వంగా లభించాయి. ఇటు ఉత్తర భారతదేశానికి అటు దక్షిణ భారతదేశానికి మధ్య ఒకవారధిలాగా పనిచేయడంవల్ల ఆంధ్రులకు ఒక విలక్షణమైన సంస్కృతి ఏర్పడింది. అందుకే ఆంధ్రభాష ద్రావిడ సంస్కృత భాషల మిశ్రమంగా కలిగిన సాహిత్య భాషగా వికాసం చెందిందని ఆంధ్రుల సంస్కృతి గురించి

తెలియజేస్తూ ముదిగంటి సుజాతారెడ్డి తెలుగు భాషకు సాహిత్యపరంగా ఉన్న ఒక ప్రత్యేకతను ఈ గ్రంథంలో విశ్లేషించారు.

పోతన "పలికెడిది భాగవతమట, పలికించెడివాడు రామభద్రుడట, యిక నేపలికిన భావహర" మగునని రాముని మీద భక్తిని తెలియజేసినట్లుగా "చెప్పుమని రామచంద్రుండు సెప్పించిన పలుకుమీద చెప్పెద నేనెల్లప్పుడు నిహపర సాధన మిప్పుణ్య చరిత్ర తప్పులెంచకుడు కవుల్" అని రామభక్తిని తన పద్యాల్లో తెలియజేసిన గొప్పకవయిత్రి మొల్ల. అటువంటి కొందరు ప్రసిద్ధాంధ్ర కవయిత్రులలో మొల్ల గురించి

**సుడుగొని రామపాదముల సోకిన ధూళి వహించి రాయియే**
**ర్పడనొక కాంతమయ్యెనట పన్నుగ నీతని పాదరేణుని**
**య్యెడ వడి నోడ సోకనిధి యేమగు నోయని సంశయాత్ముడై**
**కడిగె గుహుండు రామపద కంజయుగంబు భయము పెంపునన్**

(ఆంధ్రుల సంస్కృతి-సాహిత్యచరిత్ర, 2007:94)

మొల్ల చంపూపద్ధతిలో రాసిన రామయణంలోని పద్య సహాయంతో, ఇంకా తెలుగు సాహిత్యంలో రంగాజమ్మ, తరిగొండ వెంగమాంబ, తాళ్ళపాక తిమ్మక్క వంటి కవయిత్రులందర్నీ వారి రచనల్ని ఆంధ్రుల సంస్కృతి సాహిత్యచరిత్ర గ్రంథంలో రెడ్డి పేర్కొన్నారు.

## ముగింపు

తెలుగు సాహిత్య విమర్శలో సాహిత్య చరిత్రలు అధిక ప్రాధాన్యతను కలిగి ఉన్నాయి. కావ్య విమర్శలో సమకాలీన సాంఘీక పరిస్థితులకు, కవిజీవిత విశేషాలకు ప్రాముఖ్యత ఉంది. ముఖ్యంగా సాహిత్య చరిత్రలు కవి జీవితాన్ని, యుగ ప్రభావాన్ని, సాహిత్య క్రమ పరిణామాన్ని అనుశీలిస్తాయి. కావ్య విమర్శకు కవి చరిత్రలే ఆధారం. ఇటువంటి సాహిత్య చరిత్ర రచనలను ఒక భిన్న దృక్పథంతో చేసి విమర్శలో తనకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని పదిలపరుచుకున్నారు.

సాహిత్య చరిత్రలను అనుశీలించడంలో వాడిన ముదిగంటి సుజాతారెడ్డిగారి విమర్శ పద్ధతులను గురించి పరిశీలించడం జరిగింది. సుజాతారెడ్డి రాసిన వివిధ సాహిత్య చరిత్రలను **'చారిత్రక సామాజిక నేపథ్యంలో తెలుగు సాహిత్య చరిత్ర'** గ్రంథం తెలుగు సాహిత్యంలో ఒక స్త్రీ రచించిన మొట్టమొదటి సాహిత్య చరిత్ర. ఈ సాహిత్య చరిత్ర రచనలో వీరు భిన్నంగా తెలుగు సాహిత్య పరిణామ వికాసాలను చారిత్రక సామాజిక కోణంలో చర్చిస్తూ ఒక భిన్నమైన దృక్పథంతో సాహిత్య చరిత్ర సృష్టి చేశారు. ఇది తెలుగు సాహిత్య చరిత్ర రచనలో ఒక ప్రయత్నంగా గుర్తించవచ్చు. దీనితో పాటు సుజాతారెడ్డిగారు తమ భర్తగారైన ముదిగంటి గోపాల్ రెడ్డిగారితో కలిసి **'సంస్కృత సాహిత్య చరిత్ర'**ను తెలుగులో రాశారు. ఇది తెలుగు సాహిత్యంలో సంస్కృత సాహిత్యానికి సంబంధించిన మొదటి గ్రంథంగా ఎంతో ప్రాధాన్యతను సంతరించుకుంది. తర్వాతి కాలంలో **'ఆంధ్రుల సంస్కృతి సాహిత్య చరిత్ర'** పేరుతో ఒక సాహిత్య చరిత్ర గ్రంథాన్ని వెలువరించారు. దీనిలో కొన్ని మౌలికమైన మార్పులు చేస్తూ **'మన తెలుగు సాహిత్య చరిత్ర'** పేరుతో తీర్చిదిద్దారు. తెలంగాణ ప్రత్యేక అస్తిత్వంకోసం ప్రయత్నిస్తున్న క్రమంలో తెలంగాణ రచయితల్లోనూ ఆత్మ సంఘర్షణ మొదలైంది.దీనిలో భాగంగా అన్ని వైపుల నుండి తెలంగాణ అనే కోణంలో రచనలు వచ్చాయి. ఇదే క్రమంలో ముదిగంటి సుజాతారెడ్డి తెలంగాణ ప్రాంతీయ అస్తిత్వవాదం బలపడుతున్న రోజుల్లో సాహిత్య చరిత్రను పునర్మూల్యాంకనం చేస్తూ **'తెలంగాణ తెలుగు సాహిత్య చరిత్ర'** గ్రంథాన్ని రాసి తెలంగాణ ప్రాంతీయ వాదానికి ఒక బలమైన భూమికను అందించారు.

## ఐదవ అధ్యాయంలోని ప్రధానంశాలు

1. సుజాతారెడ్డి రాసిన 'చారిత్రక సామాజిక నేపథ్యంలో తెలుగు సాహిత్య చరిత్ర' గ్రంథం తెలుగు సాహిత్యంలో ఒక స్త్రీ రచించిన మొట్టమొదటి సాహిత్య చరిత్రగా గుర్తించవచ్చు.
2. కవి జీవితములు, కవిత్వ చరిత్రము, వాఙ్మయ చరిత్రలు, వాఙ్మయ చరిత్ర సంగ్రహము, సాహిత్య చరిత్రలు వంటి పేర్లతో, సమాజంలో వస్తున్న మార్పులకనుగుణంగా వచ్చిన సాహిత్యంలో భాగంగా ఏర్పడిన వివిధ ధోరణులు, అస్తిత్వ, ప్రాంతీయ ఉద్యమాల

వరకు ఎన్నో సాహిత్య చరిత్ర రచన ఒక పక్క బహుముఖంగా విస్తరిస్తూ మరోపక్క దానిని సమన్వయం చేసుకుంటూ తెలుగులో 'సమగ్ర సాహిత్య చరిత్ర' దిశగా అడుగులు వేస్తూ ఉంది.

3. సంస్కృత సాహిత్యానికి సంబంధించి తెలుగులో వచ్చిన అతి తక్కువ సాహిత్య చరిత్రల్లో ముదిగంటి సుజాతారెడ్డి రచించిన 'సంస్కృత సాహిత్య చరిత్ర' మంచి స్థానాన్ని కలిగి ఉంది.
4. ప్రాంతీయ అస్తిత్వ ఉద్యమ ప్రభావం వల్ల ఏర్పడిన పరిస్థితులు ప్రాంతీయ సాహిత్య చరిత్రలు రావడానికి గల బలమైన నేపథ్యాన్ని అందించాయి.
5. ఇప్పటివరకు వచ్చిన సాహిత్య చరిత్రలన్నీ కవుల చరిత్రలుగానో, సంగ్రహ చరిత్రలుగా, కవి జీవితాలుగానే వచ్చాయి. కానీ, సుజాతారెడ్డి రాసిన 'చారిత్రక సామాజిక నేపథ్యంలో సాహిత్య చరిత్ర' గ్రంథంలో సాహిత్యాన్ని దాన్ని ప్రతిబింబించే సమాజాన్ని రెండింటిని సమన్వయం చేస్తూ సమాజంలో జరిగే రాజకీయ, చారిత్రక, సామాజిక మార్పులకనుగుణంగా మొదటిసారిగా సాహిత్య చరిత్రను నిర్మించారు

# సింహావలోకనం

కథ, నవల, సాహిత్య చరిత్ర, పరిశోధన, విమర్శ, ఆత్మకథ, జీవిత చరిత్ర, యాత్రా రచన, పదకోశ నిర్మాణం, మోనోగ్రఫ్, సంపాదకత్వం వంటి అనేక సాహిత్య ప్రక్రియల్లో ప్రవేశమున్న ముదిగంటి సుజాతారెడ్డిగారు తనకంటూ ఇష్టమైన విమర్శ రంగంలో ఒక ప్రత్యేకమైన స్థానాన్ని నిలబెట్టుకున్నారు. నిశితంగా పరిశీలిస్తే ముదిగంటి సుజాతారెడ్డిగారి విమర్శ ధోరణిలో ఒక పరిణామ క్రమం కనిపిస్తుంది. తొలిదశలో వారు వచ్చిన నేపథ్యం అప్పటి కాలానికి అనుగుణంగా ప్రాచీన సాహిత్యంలో ఆలంకారిక దృష్టితో తమ విమర్శనా రచనలను ప్రారంభించారు. ఈ దశలో సుజాతారెడ్డిలో ఒక భారతీయ ద్రుక్పథం కనిపిస్తుంది. మధ్య దశలో వీరిలో కొంత నూతన సాహిత్య ప్రమాణాల్ని సాహిత్యానికి అందించాలనే తపన ప్రస్ఫుటమవుతుంది. ఈ దశలో కొంత ఆధునిక సాహిత్య ప్రక్రియలైన నవల, కథ విమర్శరంగంలో ఎక్కువగా శ్రద్ధ చూపారు. మలి దశలో ముదిగంటి సుజాతరెడ్డి పూర్తిగా ఆధునిక భావజాలన్ని అందుకొని ఆధునికానంతర వాదంలో భాగంగా అస్తిత్వ వేదనను తమ కేంద్ర భాగంగా తమ రచన వ్యాసంగాన్ని నిర్వర్తించారు. తెలంగాణ ప్రాంతీయవాదంతో వీరు చేసిన రచననలే ఇందుకు నిదర్శనం.

సుజాతారెడ్డిగారు మొదటిరోజుల్లో కొంత ఆలంకారిక సంబంధిత నేపథ్యంలో విమర్శ రాశారు. ప్రాచీన సాహిత్య విమర్శలో ముఖ్యంగా అలంకార శాస్త్రాలను ప్రమాణంగా తీసుకొని సాహిత్య విలువల నిర్ణయం జరిగింది. గుణ దోష ప్రకరణాదులుగా విభజించుకొని సాహిత్య ప్రమానాలను నిర్ణయించేదిగా కొనసాగింది. దానిలో కవుల అభిప్రాయాలు, ఆలంకారికుల ప్రమాణాలు సాహిత్య విలువల నిర్ణయంలో ప్రధానంగా ఉన్నాయి. సంప్రదాయవాదులు ప్రాచీన సాహిత్య మీద రాసే విమర్శ సాహిత్యపరంగానే ఉంటుంది. ఆధునికులు రాసేది సామాజిక స్వభావంతో ఉంటుంది. వీరి పరిశోధన గ్రంథమైన మను-వసు చరిత్రల తులనాత్మక పరిశీలన గ్రంథం సామాజిక దృక్పథంతో రాయబడిన విమర్శ. ఆమె వసుచరిత్రలోని కావ్య సౌందర్యాన్ని

కూడా కొంత సామాజిక దృష్టితోనే విమర్శించారు. సంప్రదాయ విమర్శకులు కొన్నిసార్లు సాధారణంగా రచనలోని ప్రధాన పాత్రల అధ్యయనం దగ్గర ఆగిపోతారు. కానీ, సుజాతారెడ్డిగారి విమర్శలో ఇది కొంత లోతుగా కనిపిస్తుంది. ఈ ఆలంకారిక సాహిత్య విమర్శ దృష్టి మరికొంతకాలం అలాగే, కొనసాగించి ఆలంకారిక శాస్త్రంపై సాధికారమైన పట్టుతో రాసిన **'మను వసుచరిత్రల తులనాత్మక పరిశీలన'**(1977), **'శ్రీనాథుని కవితా సౌందర్యం'**(1980), **'బాణుని కాదంబరి పరిశీలన'**(1980), **'వేమన నాథసంప్రదాయం'**(1993) నాలుగు గ్రంథాలను వాటిని శైలి, రూపం, రసం, అలంకారాలు మొదలైన దృష్టితో రాసి ఆలంకారిక విమర్శలో తనదైన గుర్తింపును పొందారు.

ప్రపంచవ్యాప్తంగా సంభవించిన మార్పుల నేపథ్యంలో 1980ల నుంచి ఆధునికానంతర వాద భావనలు తెలుగు సాహిత్య రంగంలో ప్రాముఖ్యతని సంతరించుకోవడం మొదలైంది. ఆధునికానంతర వాదం వెలుగులో దళిత, స్త్రీవాద ఉద్యమాల్నించి వచ్చిన విమర్శ మార్క్సిస్టు సిద్ధాంతాన్ని సంక్షోభంలో పడవేసింది. 1985ల తర్వాత దళిత, స్త్రీవాదాల సాహిత్యంలో విస్తృత అవగాహన, నిర్దిష్ట విశ్లేషణ కన్పిస్తాయి. తమ తాత్విక రాజకీయ అవగాహనలను, నూతనంగా రంగం మీదికి వచ్చిన సిద్ధాంతాల వెలుగులో పునర్ నిర్వచించుకుని, పునర్ వ్యాఖ్యానించుకుని ఒక కొత్త భావనాధారకు తెరవేశారు.ఈ నేపథ్యంలో ఒక వైపు ప్రాచీన సాహిత్యాన్ని పునర్ మూల్యాంకనం చేస్తూనే మరోవైపు కథా విమర్శలో భాగంగా **'తెలంగాణ తొలితరం కథలు'**, స్త్రీవాద దృక్పథంతో రాసిన **'ఆకాశంలో విభజనరేఖల్లేవు'** నవలతో ఏకకాలంలో విభిన్న విమర్శ ప్రక్రియల్లో వీరు కృషి చేశారు.

ఆధునిక తెలుగు సాహిత్య విమర్శ ఒకవైపు వర్తమాన సాహిత్యాన్ని ఎప్పటికప్పుడు మూల్యాంకనం చేస్తూనే, మరోవైపు సామాజిక సందర్భం మారినప్పుడల్లా, కొత్త భావజాలం అందుబాటులోకి వచ్చినప్పుడల్లా వాటి వెలుగులో పాత సాహిత్యాన్ని కొత్తగా విశ్లేషించడం పునర్మూల్యాంకనం. ఈ పునర్మూల్యాంకన దృక్పథాన్ని ముదిగంటి సుజాతారెడ్డిగారు అందిపుచ్చుకున్నారు. కట్టమంచి కవిత్వతత్త్వ విచారం కావ్యాన్ని అంచనా కట్టడానికి కొత్త

సాహిత్య ప్రమాణాల్ని ప్రతిపాదించిన తర్వాత ఆధునిక విమర్శ కొత్త పుంతలు తొక్కినా శ్రీశ్రీ తదితర అభ్యుదయ వాదులు ప్రస్తావించిన కన్యాశుల్కంలో రస చర్చ, నాయక వివాదం వంటి పరంపరలో ముదిగంటి సుజాతారెడ్డి **'రసచర్చ–ఆధునికత'** ద్వారా నవలల్లో రసం గురించి చేసిన ప్రతిపాదనలు తెలుగు సాహిత్య విమర్శలో కొంత చర్చకు దారి తీసాయి.

కవి, విమర్శకుడూ ఒక అవిచ్ఛిన్న సంప్రదాయ ధారలో ముందుకు సాగిపోతుంటారు. సంప్రదాయం ఒక స్థిరమైన జడ పదార్థంకాదు. గతి శీలం దాని లక్షణం. గతంలోని మంచి మారుతున్న వర్తమానంలోకి ప్రవహిస్తుంది. సంప్రదాయం వంశపారంపర్యంగా వచ్చే లక్షణం కాదు. ఎప్పటికప్పుడు పరిశ్రమతో సాధించి అలవరుచుకొనేది. సంప్రదాయావగాహనకు చారిత్రక పరిజ్ఞానం అవసరం. అయితే, ఆ పరిజ్ఞానం గతాన్ని త్రవ్వుకుంటూ కూర్చుండేది కాదు. పరంపరంగా వస్తున్న చరిత్ర ప్రవాహంలో వర్తమానంలోని క్రొత్తదనంతో గతంలోని విలువలను వివేచించి సమన్వయించుకొంటూ వర్తమానంలోని విలువలను సరిదిద్దుకుంటూ సాగిపోవడమనే నిజమైన జ్ఞానానికి నాందిగా నిలుస్తుంది. ఇదే దృక్పథం సుజాతారెడ్డిలో గోచరిస్తుంది. తెలుగు నవల పుట్టు పూర్వోత్తరాలను గుర్తించడంలో పాశ్చత్య నవలకు భారతీయ కథలే ఆధారం అని చెప్పడం ద్వారా కొన్ని విలువైన విషయాలను '**తెలుగు నవలానుశీలనం**' ద్వారా  తెలుగు సాహిత్యానికి అందించారు. ఇక '**అద్యతన దృష్టి**' పేరుతో వీరు రాసిన విమర్శ వ్యాసాలు భిన్న విషయాలపై కలగలపి వచ్చిన విమర్శనా వ్యాస సంకలనంగా గుర్తింపు పొందింది.

తెలంగాణ ప్రత్యేక అస్తిత్వంకోసం ప్రయత్నిస్తున్న క్రమంలో తెలంగాణ రచయితల్లోనూ ఆ ఆత్మ సంఘర్షణ మొదలైంది. ప్రాంతీయ స్పృహ, భాషా స్పృహ, జీవితమూలాల్ని వెదుక్కునే స్పృహ పెరిగింది. చివరికి సాహిత్య విమర్శకు తెలంగాణ అనే ప్రాంతీయతల మధ్య ఉన్న భేదాల్ని వివరిస్తూ, సాహిత్యంలో ప్రతిబింబిస్తున్న అంశాలను విశ్లేషిస్తూ రాసిన గ్రంథమే **'ముద్దెర'**. ముదిగంటి సుజాతారెడ్డి సంపాదకత్వంలో వెలువడిన ఈ **'ముద్దెర'** ద్వారా తెలంగాణ అస్తిత్వం, తెలంగాణ సాహిత్యం వంటి అంశాలను నిర్దేశించిన కొలమానాల

పరిమితుల్ని ప్రశ్నిస్తూ సరికొత్తగా అర్థం చేసుకోవాల్సి వుందని, ఆ భిన్నత్వమేమిటో చెబుతూ తెలంగాణ ప్రాంతీయ అస్తిత్వవాద సాహిత్య విమర్శకు ఈ సంకలనం ద్వారా ఒక భూమికను సుజాతారెడ్డిగారు అందించే ప్రయత్నం చేశారు.

"అస్తిత్వవాదం–ఒక ఉపోద్ఘాతం" అనే వ్యాసంలో తెలంగాణ ఉద్యమాన్ని ప్రాంతీయ అస్తిత్వ వాదంగా నిర్ధారించే పని సమర్థవంతంగా చేశారు. ముందు 'వాదం' అనే శబ్దాన్నికున్న విస్తృతమైన అర్థాల గురించి, పరిమితమైన గురించి చర్చించారు. తర్వాత ఒక క్రమంలో ఒకే పరిధులతో వ్యక్తమయ్యే నిర్దిష్ట భావజాలాన్ని కూడా వాదం అని పిలువవచ్చును. "ఆ నిర్దిష్ట పరిధులతో అధిక సంఖ్యలో సాహిత్య సృష్టి జరిగినప్పుడు సాహిత్య చరిత్రలో దాన్నొక వాదంగా చెప్పుకోవడంలో ఏం తప్పు లేదు" అని తెలంగాణ ఉద్యమ సాహిత్యాన్ని ఒక వాదనికి కావాల్సిన నేపథ్యాన్ని అందించి తర్వాత దీనికి తెలంగాణ అస్తిత్వ వేదనను జోడించి తెలంగాణ ఉద్యమ సాహిత్యాన్ని "ప్రాంతీయ అస్తిత్వ వాదం"గా నిర్ధారించారు.

తెలుగు సాహిత్య విమర్శలో సాహిత్య చరిత్రలు అధిక ప్రాధాన్యతను కలిగి ఉన్నాయి. కావ్య విమర్శలో సమకాలీన సాంఘీక పరిస్థితులకు, కవిజీవిత విశేషాలకు ప్రాముఖ్యత ఉంది. ముఖ్యంగా సాహిత్య చరిత్రలు కవి జీవితాన్ని, యుగ ప్రభావాన్ని, సాహిత్య క్రమ పరిణామాన్ని అనుశీలిస్తాయి. కావ్య విమర్శకు కవి చరిత్రలే ఆధారం. ఇటువంటి సాహిత్య చరిత్ర రచనలను ఒక భిన్న దృక్పథంతో చేసి విమర్శలో తనకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని పదిలపరుచుకున్నారు. సుజాతారెడ్డి రాసిన వివిధ సాహిత్య చరిత్రలలో '**చారిత్రక సామాజిక నేపథ్యంలో తెలుగు సాహిత్య చరిత్ర**' గ్రంథం తెలుగు సాహిత్యంలో ఒక స్త్రీ రచించిన మొట్టమొదటి సాహిత్య చరిత్ర. ఈ సాహిత్య చరిత్ర రచనలో వీరు భిన్నంగా తెలుగు సాహిత్య పరిణామ వికాసాలను చారిత్రక సామాజిక కోణంలో చర్చిస్తూ ఒక భిన్నమైన దృక్పథంతో సాహిత్య చరిత్ర సృష్టి చేశారు. ఇది తెలుగు సాహిత్య చరిత్ర రచనలో ఒక కొత్త ప్రయత్నంగా గుర్తించవచ్చు. దీనితో పాటు సుజాతగారు తమ భర్తగారైన ముదిగంటి గోపాల్ రెడ్డిగారితో కలిసి '**సంస్కృత సాహిత్య చరిత్ర**'ను తెలుగులో రాశారు. ఇది తెలుగు సాహిత్యంలో సంస్కృత సాహిత్యానికి

సంబంధించిన మొదటి గ్రంథంగా ఎంతో ప్రాధాన్యతను సంతరించుకుంది. తర్వాతి కాలంలో **'ఆంధ్రుల సంస్కృతి సాహిత్య చరిత్ర'** పేరుతో ఒక సాహిత్య చరిత్ర గ్రంథాన్ని వెలువరించారు. దీనిలో కొన్ని మౌలికమైన మార్పులు చేస్తూ **'మన తెలుగు సాహిత్య చరిత్ర'** పేరుతో తీర్చిదిద్దారు. తెలంగాణ ప్రత్యేక అస్తిత్వంకోసం ప్రయత్నిస్తున్న క్రమంలో తెలంగాణ రచయితల్లోనూ ఆత్మ సంఘర్షణ మొదలైంది. దీనిలో భాగంగా అన్ని వైపుల నుండి తెలంగాణ అనే కోణంలో రచనలు వచ్చాయి. ఇదే క్రమంలో ముదిగంటి సుజాతారెడ్డి తెలంగాణ ప్రాంతీయ అస్తిత్వవాదం బలపడుతున్న రోజుల్లో సాహిత్య చరిత్రను పునర్మూల్యాంకనం చేస్తూ **'తెలంగాణ తెలుగు సాహిత్య చరిత్ర'** గ్రంథాన్ని రాసి తెలంగాణ ప్రాంతీయ వాదానికి ఒక బలమైన భూమికను అందించారు.

## పరిశోధన అధ్యాయాల క్రోడీకరింపు

**'ముదిగంటి సుజాతారెడ్డి జీవితం పరిచయం'** పేరుతో రాసిన మొదటి అధ్యాయంలో ముదిగంటి సుజాతారెడ్డి గారి జీవితపు మొదటి దశలోని వారి పుట్టిన వివరాలు, విద్యాభ్యాసం, అవార్డులు మొదలైనవాటిని స్పర్శిస్తూ వారు ఇప్పటి వరకు రాసిన మొత్తం రచలన్నినింటిని వివిధ సాహిత్య ప్రక్రియల పరంగా పరిచయం చేయడమయింది.

**'ముదిగంటి సాహిత్య విమర్శ–పరిచయం'** అనే రెండవ అధ్యాయంలో తెలుగు సాహిత్యంలో విమర్శ స్థానాన్ని తెలియజేస్తూ తెలంగాణ ప్రాంతీయ సాహిత్య విమర్శ నేపథ్యాన్ని ప్రత్యేకంగా పేర్కొన్నాను. తర్వాత తెలుగు సాహిత్య విమర్శలో ముదిగంటి సుజాతారెడ్డిగారి విమర్శ కృషిని గుర్తిస్తూ వారి సాహిత్య విమర్శ గ్రంథాలను ఒక్కసారి రేఖ మాత్రంగా ఈ అధ్యాయంలో పరిచయం చేశాను.

**'ముదిగంటి సుజాతారెడ్డి–ఆలంకారిక విమర్శ పరిశీలన'** అనే మూడవ అధ్యాయంలో సుజాతారెడ్డి విమర్శ కోణాన్ని కొంత ఆలంకారిక సంబంధిత విమర్శ ధోరణుల నేపథ్యంలో పరిశీలించాను. దీనిలో భాగంగా వీరి పరిశోధన గ్రంథమైన మను వసు చరిత్రల తులనాత్మక

పరిశీలన గ్రంథంలో వీరు చెప్పిన విషయాలను పరిశీలిస్తూ సుజాతగారి సాహిత్య విమర్శ రాయడంలో గల మొదటి దశల్ని అనుశీలించడం జరిగింది. ఈ ఆలంకారిక సాహిత్య విమర్శ అధ్యాయంలో భాగంగా ముదిగంటి సుజాతారెడ్డి ఆలంకారిక శాస్త్రంపై సాధికారమైన పట్టుతో రాసిన **'మను-వసుచరిత్రల తులనాత్మక పరిశీలన'**(1977), **'శ్రీనాథుని కవితా సౌందర్యం'**(1980), **'బాణుని కాదంబరి పరిశీలన'**(1980), **'వేమన నాథసంప్రదాయం'**(1993) నాలుగు గ్రంథాలలోని ఆలంకారిక విషయాలను కలగలిపి ఈ గ్రంథాల ఆధారంగా ముదిగంటి సుజాతగారి విమర్శ తత్వాన్ని విశ్లేషణ చేశాను.

నాల్గవ అధ్యాయమైన **'ముదిగంటి సుజాతారెడ్డి ఆధునిక సాహిత్య విమర్శ'**లో సుజాతారెడ్డి విమర్శ కోణాన్ని ఆధునిక విమర్శ దృక్పథం నుండి పరిశీలించాను. 'ఆధునికత' అనేది సాహిత్య ప్రక్రియలను విస్తృత పరిచిన దృక్పథం. వీటిలో ఆధునిక సాహిత్య ప్రక్రియ అయిన నవల గురించి పరిశీలిస్తూ **'తెలుగు నవలానుశీలనం'** అనే నవల విమర్శ గ్రంథం ద్వారా తెలుగు నవల పుట్టు పూర్వోత్తరాలను అన్నిటిని చర్చించారు. నవలావిమర్శలో కొంత లోతుగా శోధిస్తూ నవలలో రసం ఉండవచ్చుననీ ఒక కొత్తరకమైన ప్రతిపాదనను తీసుకువచ్చి తెలుగు సాహిత్యంలో **'రసచర్చ-ఆధునికత'** ద్వారా ఒక చర్చకు పెట్టారు. నవల-వాస్తవికత అనే అంశాన్ని కూడా కొంత క్షుణ్ణంగానే పరిశీలించారు. నవల, కథ, ప్రాచీన సాహిత్య విమర్శ, యాత్ర చరిత్రలు వంటి అనేక సాహిత్య ప్రక్రియల్లో ఉన్న అనుభవంతో సుజాతారెడ్డి **'అద్యతన దృష్టి'** పేరుతో సాహిత్య విమర్శ సంపుటి ద్వారా విమర్శ వ్యాసాలు రాసి వ్యాసవిమర్శలో అడుగుపెట్టారు. తెలంగాణ ప్రాంతం ముందు నుంచి ఒక ప్రత్యేకమైన చారిత్రక, సామాజిక, ఆర్థిక, భౌగోళిక నేపథ్యాన్ని కలిగి ఉంది. ఇది తర్వాతి దశలో వివక్ష, అణచివేతలు. తమని తాము కోల్పోతున్నామన్న ఒక అస్తిత్వ భావన మొదలై అప్పటికి విస్తృతమైన అస్తిత్వ ఉద్యమాల ప్రభావంతో తెలంగాణ ప్రాంతీయ సాహిత్య విమర్శ ప్రారంభమైంది. ఈ నేపథ్యంలో తెలుగు సాహిత్యంలో వచ్చిన తెలంగాణ ప్రాంతీయ అస్తిత్వవాదాన్ని ముదిగంటి సుజాతారెడ్డి తన వ్యాసాలతో కలిపి వచ్చిన వ్యాస సంకలనం **'ముద్దెర'** పేరుతో వచ్చిన గ్రంథంలో అస్తిత్వవాద

విమర్శకు ఒక బలమైన భూమికను అందించారు. ఇలా ముదిగంటి సుజాతారెడ్డి ఆధునిక సాహిత్య విమర్శ రంగంలో తనవంతుగా చేసిన కృషిని వాటిని సంబంధించిన నేపథ్యాన్ని కొంత చర్చించి తర్వాత సుజాతగారి అనుశీలన ధోరణిని ఈ అధ్యాయంలో పరిశీలించాను.

**'సుజాతారెడ్డి సాహిత్య చరిత్రల్లో విమర్శానాంశాలు'** అయినా చివరి ఐదవ అధ్యాయంలో భాగంగా సాహిత్య చరిత్రలను అనుశీలించడంలో వాడిన ముదిగంటి సుజాతారెడ్డిగారి విమర్శ పద్ధతులను గురించి పరిశీలించాను. ఈ అధ్యాయంలో ముఖ్యంగా సుజాతగారు రాసిన వివిధ సాహిత్య చరిత్రలను **'చారిత్రక సామాజిక నేపథ్యంలో తెలుగు సాహిత్య చరిత్ర'** గ్రంథం తెలుగు సాహిత్యంలో ఒక స్త్రీ రచించిన మొట్టమొదటి సాహిత్య చరిత్ర. దీనిలో వీరు తెలుగు సాహిత్య పరిణామ వికాసాలను చారిత్రక సామాజిక కోణంలో చర్చిస్తూ ఒక భిన్నమైన దృక్పథంతో సాహిత్య చరిత్ర సృష్టి చేశారు. అలాగే, సుజాతగారు తమ భర్తగారైన ముదిగంటి గోపాల్ రెడ్డిగారితో కలిసి **'సంస్కృత సాహిత్య చరిత్ర'**ను తెలుగులో రాశారు. ఇది తెలుగు సాహిత్యంలో ఎంతో ప్రాధాన్యతను సంతరించుకుంది. తర్వాతి కాలంలో **'ఆంధ్రుల సంస్కృతి–సాహిత్య చరిత్ర'** పేరుతో ఒక సాహిత్య చరిత్ర గ్రంథాన్ని వెలువరించారు. దీనిలో కొన్ని మౌలికమైన మార్పులు చేస్తూ **'మన తెలుగు సాహిత్య చరిత్ర'** పేరుతో తీర్చిదిద్దారు. అంతే కాకుండా తెలంగాణ ప్రాంతీయ అస్తిత్వవాదం బలపడుతున్న రోజుల్లో సాహిత్య చరిత్రను పునర్మూల్యాంకనం చేస్తూ **'తెలంగాణ తెలుగు సాహిత్య చరిత్ర'** గ్రంథాన్ని రాసి తెలంగాణ ప్రాంతీయ వాదానికి ఒక బలమైన భూమికను అందించారు. వీటన్నింటిని క్రోడికరిస్తూ సాహిత్య చరిత్రల్లోని కొన్ని విమర్శానంశాలను ఈ అధ్యాయంలో భాగంగా వివరించాను.

# పరిశోధన ఫలితాలు

1. ముదిగంటి సుజాతారెడ్డిగారి విమర్శ రచనలో ఒక పరిణామక్రమం కనిపిస్తుంది. సంప్రదాయం నుండి ఆధునికం వైపు ఆధునికం నుండి–ప్రాంతీయ వాదం వైపు తమ దృష్టి కాలానుగుణంగా మారుతూ వచ్చింది.
2. ముదిగంటి సుజాతారెడ్డి ఒక స్త్రీ విమర్శకురాలిగా తనకంటూ ఒక ప్రత్యేకతను చాటుకున్నారు.
3. సామాజిక చారిత్రక నేపథ్యంలో సాహిత్య చరిత్ర రాసిన ఒక మొదటి స్త్రీగా అలాగే, తెలంగాణ అస్తిత్వ నేపథ్యంలో నవల రాసిన మొదటి స్త్రీ రచయితగా గుర్తింపు పొందారు.
4. ముదిగంటి సుజాతారెడ్డిగారు ప్రతిపాదించిన నూతన విషయాలపై తగినంత లోతుగా వాటిని అనుకరిస్తూ తర్వాత కాలంలో ఏటువంటి ఇతర కొనసాగింపు గ్రంథాలు రాకపోవడంతో వారు ప్రతిపాదించిన విషయాలు తెలుగుసాహిత్యంలో బలమైన ముద్రను వేయలేకపోయాయి.
5. ఇతర విమర్శకులతో పోల్చి చూసినప్పుడు ఒక స్త్రీగా ముదిగంటి సుజాతరెడ్డిగారు చేసిన విమర్శ కొంత భిన్నంగా ఉందని అర్థమవుతుంది.
6. తెలుగు సాహిత్యంలో వివిధ ప్రాంతాల సాహిత్యం అక్కడి సామాజిక, ఆర్థిక, రాజకీయ పరిస్థితులకు అనుగుణంగా, విభిన్నంగా ఉన్నట్లయితే, వాటి ప్రభావం విమర్శ మీద కూడా పడుతుందని ఈ పరిశోధన తెలియజేసింది.
7. కథ, నవల, సాహిత్య చరిత్ర, పరిశోధన, విమర్శ, ఆత్మకథ, జీవిత చరిత్ర, యాత్రా రచన, పదకోశ నిర్మాణం, మోనోగ్రఫ్, సంపాదకత్వం అనేక సాహిత్య ప్రక్రియల్లో ప్రవేశం ఉన్న ముదిగంటి సుజాతారెడ్డి విమర్శనా ప్రక్రియ ముఖ్యంగా సృజనాత్మక రచనల ప్రభావం విమర్శ రచనపై ఉన్నట్లు ఈ పరిశోధన ద్వారా తెలుస్తుంది.
8. తెలంగాణలో సాహిత్య విమర్శ మిగతా ప్రాంతాలతో పోలిస్తే దీనికి చారిత్రక, భౌగోళిక, సామాజిక నేపథ్యాలకు అనుగుణంగా దీని పరిణామక్రమం ఏర్పడింది. ప్రస్తుతం తెలంగాణ విమర్శ, నిర్మాణదశలో ఉన్నట్లు ఈ పరిశోధన ద్వారా అవగతమయింది.

9. తెలంగాణ ప్రాంత విమర్శకులు అందరిలో తనదైన శైలిలో ఒక వినూత్న దృక్పథంతో, మిగతా వారి కంటే భిన్నంగా విమర్శ చేయడంలో ముదిగంటి సుజాతారెడ్డి నిష్ణాతులు. సుజాత చేసే విమర్శ ఒకవైపు తెలంగాణ సాహిత్య విమర్శ ప్రత్యేకతను గుర్తిస్తూనే, మరోవైపు దానిలో ఉన్న విశిష్ట లక్షణాలను స్పృశించేలా ఉంటుంది. సాహిత్య, అలంకార, విమర్శ, సిద్ధాంత గ్రంథాలను గురించి తెలుపుతూ తెలంగాణ అస్తిత్వ ఉద్యమకాలంలో వచ్చిన సాహిత్య విమర్శలో కూడా వీరు కృషి చేశారు.
10. ముదిగంటి సుజాతారెడ్డిగారు 'ముద్దెర'లో రాసిన ఐదు విమర్శ వ్యాసాలలో తెలంగాణ ప్రాంతీయ అస్తిత్వవాద సాహిత్య విమర్శకు కావాల్సిన ఒక బలమైన పునాదిని అందించారు.

ముఖ్యంగా ఈ పరిశోధన సాహిత్య విమర్శపై విమర్శ(Meta criticism)కు సంబంధించింది. ఈ పరిశోధన విమర్శను పరిచయం చేయడం, వాటిలోని విమర్శ పద్ధతులను గుర్తించడం, విమర్శలో ప్రధానంశాలను కనుగొనడం అనే రీతిలో ఈ పరిశోధన కొనసాగించాను. ఇక్కడ కేవలం ముఖ్యంశాలే తప్ప సిద్ధాంత వాదోపవాదాలు లేవు. ఈ పరిశోధనలో నాకున్న అవగాహన మేరకు ముదిగంటి సుజాతారెడ్డిగారి విమర్శను అధ్యయనం చేశానని తెలియజేస్తున్నాను.

ముదిగంటి సుజాతారెడ్డి విమర్శ గ్రంథాలపై చేసిన ఈ పరిశోధనలో భాగంగా అనేక విషయాలు బహిర్గతం అయ్యాయి. అలాగే, ఈ పరిశోధన క్రమంలో ముదిగంటి సుజాతారెడ్డిగారి రచనల ఆధారంగా చేసుకుని ఇంకా కొన్ని అంశాలపై ప్రత్యేకమైన అధ్యయనం చేసే అవకాశం ఉందని భావిస్తూ వాటిలో కొన్ని అంశాలను క్రింద పొందుపరుస్తున్నాను. ముదిగంటి సాహిత్య చరిత్రలు–ప్రత్యేక అధ్యయనం, ముదిగంటి సుజాతారెడ్డి ఆలంకారిక విమర్శ–పరిశీలన, ముదిగంటి సుజాతారెడ్డి అస్తిత్వవాద విమర్శ–అనుశీలన, ముదిగంటి సుజాతారెడ్డి సృజనాత్మక సాహిత్యం పరిశీలన వంటి అంశాలపై ఇంకా కొంత పరిశోధన చేసే అవకాశాలున్నాయి.

# ఉపయుక్త గ్రంథ సూచిక

# (Bibliography)

## ప్రాథమిక ఆకరాలు (Primary Sources)

### ముదిగంటి సుజాతారెడ్డి విమర్శ గ్రంథాలు


1. సుజాతారెడ్డి, ముదిగంటి.&గోపాల్ రెడ్డి.(1986).***సంస్కృత సాహిత్య చరిత్ర.*** హైదరాబాద్: పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం.
2. సుజాతారెడ్డి, ముదిగంటి&ముదిగంటి గోపాలరెడ్డి.(1980).***బాణుని కాదంబరి పరిశీలనం***: హైదారాబాద్ రోహణం ప్రచురణలు,
3. సుజాతారెడ్డి, ముదిగంటి. (1980).***శ్రీనాథుని కవితా సౌందర్యం.*** హైదరాబాద్: శ్రీ విజయ ప్రింటర్స్.
4. సుజాతారెడ్డి, ముదిగంటి. (1993). ***వేమన నాథ సంప్రదాయం***.హైదరాబాద్: శ్రీశాంతా ఆర్ట్ ప్రింటర్స్.
5. సుజాతారెడ్డి, ముదిగంటి. (2005).***ముద్దెర***. హైదరాబాద్: రోహణమ్ పబ్లికేషన్స్.
6. సుజాతారెడ్డి, ముదిగంటి.(1981). ***మను–వసుచరిత్రల తులనాత్మక పరిశీలనం***.హైదరాబాద్: శ్రీ విజయ ప్రింటర్స్.
7. సుజాతారెడ్డి, ముదిగంటి.(1991). ***తెలుగు నవలానుశీలనం.*** హైదరాబాద్: రోహణం ప్రచురణలు.
8. సుజాతారెడ్డి, ముదిగంటి.(2010). ***రసచర్చ—ఆధునికత***. హైదరాబాద్: రోహణం ప్రచురణలు.
9. సుజాతారెడ్డి, ముదిగంటి.(2014). ***అద్యతన దృష్టి***. హైదరాబాద్: రోహణం ప్రచురణలు.
10. సుజాతారెడ్డి, ముదిగంటి. (1996). ***చారిత్రక సామాజిక నేపథ్యంలో తెలుగు సాహిత్య చరిత్ర.*** హైదరాబాద్: రోహణమ్ పబ్లికేషన్స్.

11. సుజాతారెడ్డి, ముదిగంటి.(2007).***ఆంధ్రుల సంస్కృతి సాహిత్య చరిత్ర***. హైదరాబాదు: తెలుగు అకాడమి.
12. సుజాతారెడ్డి, ముదిగంటి.(2018).***మన తెలుగు సాహిత్య చరిత్ర***. హైదరాబాద్: తెలుగు అకాడమి.
13. సుజాతారెడ్డి, ముదిగంటి.(2015).***తెలంగాణ తెలుగు సాహిత్య చరిత్ర.*** తెలంగాణ సారస్వత పరిషత్తు,

## ద్వితీయ ఆకారాలు (Secondary Sources)

1. అనంతకృష్ణశర్మ, రాళ్ళపల్లి.(1945).***వేమన***. వాల్తేరు: ఆంధ్ర విశ్వకళా పరిషత్.
2. ఆరుద్ర.(1985). ***మన వేమన,*** తిరుపతి: శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం.
3. గోపి, ఎన్.(1992). ***ప్రజాకవి వేమన.*** హైదరాబాద్: ఎన్ అరుణా పబ్లికేషన్స్.
4. చంద్రశేఖరరెడ్డి, రాచపాళెం.(2010).***విమర్శ–2009.*** విజయవాడ: చినుకు ప్రచురణలు.
5. చంద్రశేఖరరెడ్డి, రాచపాళెం.(2012). ***మరోచర్చ***. హైదరాబాద్: విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్.
6. చంద్రశేఖరరెడ్డి, రాచపాళెం.(2012). ***విమర్శ–2011.*** విజయవాడ: చినుకు ప్రచురణలు.
7. చక్రవర్తి, లక్షణ.(2014).***ప్రతిబింబం*** (అధివిమర్శ వ్యాసాలు). నిజామాబాద్: ఆముక్త ప్రచురణలు.
8. జయకృష్ణ బాపూజీ, జంధ్యాల.(1982). ***శ్రీనాథ భారతి***. గుంటూరు: శ్రీనాథ పీఠము.
9. తిరుమలరావు, సర్దేశాయి.(2002).***విమర్శ–ప్రతి విమర్శ.*** హైదరాబాద్: పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం.
10. ***తెలంగాణ ఆధునిక సాహిత్య చరిత్ర***. (2016). తెలుగు అకాడమి.హైదరాబాద్.
11. త్రివేణి,వి.(2008).***ముదిగంటి సుజాతారెడ్డి రచనలు–సమగ్ర పరిశీలన***. ఉస్మానియా విశ్వవిద్యాలయానికి సమర్పించిన సిద్ధాంత గ్రంథం (ముద్రితం).
12. ద్వా.నా.శాస్త్రి.(2016). ***తెలుగు సాహిత్య చరిత్ర.*** హైదరాబాద్: ప్రగతి పబ్లిషర్స్.

13. నాగయ్య, జి. (2009). ***తెలుగు సాహిత్య సమీక్ష*** (ప్రథమ, ద్వితీయ సంపుటాలు). తిరుపతి:నవ్య పరిశోధక ప్రచురణలు.

14. నారాయణరావు, వెల్చేరు.(2008). ***తెలుగులో కవితా విప్లవాల స్వరూపం***: తానా ప్రచురణలు.

15. నారాయణరెడ్డి, సి.(1967).***ఆధునికాంధ్ర కవిత్వము సంప్రదాయములు: ప్రయోగములు.*** హైదరాబాదు: విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్.

16. నారాయణరెడ్డి, సుంకిరెడ్డి.(2010). ***గనుమ*** (తెలంగాణ దళిత బహుజన ముస్లిం అస్తిత్వ సాహిత్య వ్యాసాలు). హైదరాబాద్: తెలంగాణ సాహితి పబ్లికేషన్స్.

17. నారాయణరెడ్డి, సుంకిరెడ్డి.(2012). ***తెలంగాణ సాహిత్య చరిత్ర***. హైదరాబాద్: తెలుగు అకాడమి.

18. నారాయణరెడ్డి, సుంకిరెడ్డి.(2016). ***ముంగిలి తెలంగాణ ప్రాచీన సాహిత్య చరిత్ర.*** హైదరాబాద్:తెలుగు అకాడమి.

19. నిత్యానందరావు, వెలుదండ.(2013) ***విశ్వవిద్యాలయాల్లో తెలుగు పరిశోధన.*** హైదరాబాద్: నవోదయ బుక్ హౌస్.

20. ప్రతాపరెడ్డి, కాసుల. (2017). ***తెలంగాణ నవలా వికాసం***. హైదరాబాద్: తెలంగాణ సాహిత్య అకాడమీ.

21. ప్రతాపరెడ్డి, కాసుల.(సంపా).(2001).***తెలంగాణ తోవలు***(సాంస్కృతిక సాహిత్య వ్యాసాలు). హైదరాబాద్: తెలంగాణ సాంస్కృతిక వేదిక.

22. ప్రభాకరశాస్త్రి, వేటూరి.(1985).***శృంగార శ్రీనాథము***. హైదరాబాద్: మణిమంజరీ ప్రచురణలు.

23. ప్రభాకర్.ఎ.కె.(సంపా).(2018).***బహుళ*** (సాహిత్య విమర్శ) సిద్ధాంతాలు. ప్రమేయాలు.పరికరాలు. హైదరాబాద్: పర్ స్పెక్టివ్స్.

24. బ్రహ్మయ్య, కాశీభట్ట(ర). ముదిగొండ వీరభద్రయ్య(సంపా) ***మనువసు ప్రకాశిక***(మొదటి భాగం) తెలుగు విశ్వవిద్యాలయం, హైదరాబాద్.

25. భూమయ్య, అనుమాండ్ల. (1992). ***ఆద్యుడు కట్టమంచి***. వరంగల్: వాగ్వాదినీ ప్రచురణలు.

26. మందేశ్వరరావు, వడలి. (1994).***పాశ్చాత్య సాహిత్య విమర్శ–చరిత్ర–సిద్ధాంతాలు.*** హైదరాబాదు: పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం,

27. మల్లారెడ్డి,తూర్పు.(సంపా).(2007).***తెలంగాణ సాహిత్యం–జీవిత చిత్రణం.*** హైదరాబాద్.

28. మురళీధరగౌడు, తాళ్ళపల్లి(సంపా).(2016). **సాహిత్య మథనం(ముదిగంటి సుజాతారెడ్డి సాహిత్య పరామర్శ)** హైదరాబాద్: రోహణం ప్రచురణలు,

29. యాకూబ్.(2018). ***ఆధునిక తెలుగు సాహిత్య విమర్శ.*** హైదరాబాద్:నవ తెలంగాణ పబ్లిషింగ్ హౌస్.

30. రామలింగారెడ్డి,కట్టమంచి.(1973). ***కవిత్వతత్త్వవిచారము.*** విశాఖపట్నం: ఆంధ్రవిశ్వకళాపరిషత్తు.

31. రామారావు, ఎస్వీ. (2017). ***తెలుగులో సాహిత్య విమర్శ.*** హైదరాబాద్: పసిడి ప్రచురణలు,

32. రాములు,బి. ఎస్.(2017).***ప్రాంతీయ అస్తిత్వం తెలంగాణ కథ నవల.*** హైదరాబాద్: విశాల సాహిత్య అకాడమి.

33. లక్ష్మణ చక్రవర్తి, సి హెచ్. పి వారిజారాణి, జి విజయ్ కుమార్(సంపా). (2008).***ఆధునిక సాహిత్య విమర్శకులు–ప్రస్థానాలు(సమకాలీకులు)***: ఆంధ్ర విద్యాలయ స్నాతకోత్తర తెలుగుశాఖ.

34. లక్ష్మణ చక్రవర్తి, సి.హెచ్, సంపత్కుమారాచార్య, కోవెల (సంపా). (2016).***తెలుగు సాహిత్య విమర్శదర్శనం*** (విజ్ఞాన సర్వస్వం సంపుటం:ii). హైదరాబాదు: కొమర్రాజు వేంకట లక్షణరావు విజ్ఞాన సర్వస్వ కేంద్రం పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం,

35. లక్ష్మణ చక్రవర్తి, సి.హెచ్.(2004). ***ఆధునిక సాహిత్య విమర్శ రీతులు.*** హైదరాబాద్: ఆంధ్ర విద్యాలయ ప్రచురణలు.

36. లక్ష్మణచక్రవర్తి సి హెచ్, పి వారిజారాణి, జి విజయ్ కుమార్(సంపా).(2008). ***ఆధునిక సాహిత్య విమర్శకులు–ప్రస్థానాలు (తొలి మలితరాలు)***: ఆంధ్ర విద్యాలయ స్నాతకోత్తర తెలుగుశాఖ.

37. లక్ష్మీకాంతం, పింగళి. (2005).***ఆంధ్ర సాహిత్య చరిత్ర***. హైదరాబాద్: విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్.
38. లక్ష్మీకాంతం, పింగళి.(1966). ***సాహిత్య శిల్ప సమీక్ష.*** హైదరాబాద్: విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్.
39. లక్ష్మీరంజనం, ఖండవల్లి.(1951).***ఆంధ్రుల చరిత్ర–సంస్కృతి***. హైదరాబాద్: ఠాగూర్ పబ్లికేషన్స్.
40. వెంకటేశ్వరరావు, దార్ల. (2009) ***వీచిక*** (సాహిత్య విమర్శ వ్యాసాలు). హైదరాబాదు: ప్రజాశక్తి డైలీ ప్రింటింగ్ ప్రెస్.
41. వేంకటావధాని, దివాకర్ల. (2013) ***సాహిత్య సోపానములు***.హైదరాబాద్:ఆంధ్ర సారస్వత పరిషత్తు ప్రచురణ.
42. ***వేమన*** (వేమనపై విమర్శ వ్యాసాలు). (2013) సి. పి. బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం. యోగి వేమన విశ్వవిద్యాలయం.
43. శోభారాణి, కందాళ.(2018).***తెలుగు సాహిత్య విమర్శ–స్త్రీల కృషి***. హైదరాబాద్:తెలుగు అకాడమి.
44. శ్రీరామమూర్తి, కొర్లపాటి. ***ఈశ్వరార్చనకళాశీలుడు:*** రమణి ప్రచురణ, విశాఖపట్టణం.
45. సంపత్కుమారాచార్య, కోవెల. (1981). ***ఆధునిక తెలుగు సాహిత్య విమర్శ–సంప్రదాయిక రీతి.*** హైదరాబాదు: దక్షిణ భారత ప్రెస్.
46. సుబ్రహ్మణ్యం, జి. వి. (1983). ***ఆంధ్ర సాహిత్య విమర్శ–ఆంగ్ల ప్రభావం.*** సికిందరాబాదు: యువభారతి.
47. సుబ్రహ్మణ్యం,జి.వి. (1991). ***తెలుగు సాహిత్య చరిత్రలో చర్చనీయాంశాలు***. హైదరాబాద్: తెలుగు అకాడమి.
48. సుమతి నరేంద్ర.పి(సంపా) (1985). ***శ్రీనాథ కవితా వైజయంతి***.హైదరాబాద్: బాలకృష్ణ భారతి.

49. సూర్యకుమారి,ఎస్.వి. (1989). ***తెలుగులో సాహిత్య చరిత్రలు***(అముద్రిత సిద్ధాంత గ్రంథం). హైదరాబాద్ విశ్వవిద్యాలయం.

## ఆంగ్ల గ్రంథాలు

1. Abrams M. H, Galt Harpham, Geoffrey. (2012).***A Glossary of Literary Terms.*** Delhi: Cengage Learning India printed, India.

2. ***Essay&Essayists–Eng. Britannica***. (1981). (VOL NO: 8, P: 716) Encyclopedia Britannica, Printed in U.S.A.

3. ***The Encyclopaedia Americana***. (1918). (VOL. NO. 10) Encyclopaedia Americana Corporation, Publisher: FB&C Ltd

**Web Sites**

http://www.andhrabharati.com/dictionary/

https://eemaata.com/

# అనుబంధం–1

## ముదిగంటి సుజాతారెడ్డిగారితో జరిపిన ముఖాముఖీ

### 1. మీరు ఈ మధ్య చదివిన పుస్తకాలు గాని చేసిన రచనలు ఏమైనా ఉన్నాయా?

నాకు చరిత్ర అంటే చాలా ఇష్టం. బీఎస్ఎల్ హనుమంతరావు ''ఆంధ్రుల చరిత్ర'', శేషాద్రిరమణ కవుల ''తెలంగాణ పరిశోధనా వ్యాసాలు'' చదివాను. ఇంత వరకు నేను కథలు, నవలలు, సాహిత్య వ్యాసాలు, విమర్శ రాశాను. కానీ, కవిత్వం ఎన్నడూ రాయలే. అలాంటిది కరోనా ఇతివృత్తంగా 'ఈ దాగుడుమూతలెన్నాళ్లు' కవిత రాశాను. తర్వాత కాళోజీ పురస్కార గ్రహీత కోట్ల వెంకటేశ్వరరెడ్డి ''అంతర్వాహిని'' కవితాసంపుటి చదివాను. అందులో కవితలన్నీ చాలా బాగా అనిపించాయి. దానిపై నాకు కలిగిన భావానుభూతులను వ్యక్తం చేస్తూ ఒక సమీక్ష రాశాను. గతంతో పోలిస్తే , ఈ మధ్య కొంత రాయడం తక్కువే అయింది. పీవీ పరబ్రహ్మశాస్త్రి **''కాకతీయ శాసనాలు''**, డీడీ కోశాంబి **''యాన్ ఇంట్రడక్షన్ టు ది స్టడీ ఆఫ్ ఇండియన్ హిస్టరీ''** తదితర పుస్తకాలు చదువుతున్నాను.

### 2. తెలంగాణ ఉద్యమంలో స్త్రీల పాత్ర ఏ విధంగా ఉందని మీరు భావిస్తున్నారు?

తెలంగాణా ఉద్యమాలలో ఎంతోమంది స్త్రీలు ఉన్నారు. వారి చరిత్రలు ఇప్పటికీ బయటికి రాలేదు, మనకి తెలియని మనచరిత్ర తప్ప. దరిశి అనసూయ, దేవులపల్లి వేంకటేశ్వరరావు భార్య ఇలా చాలామంది ఉన్నారు. ఉద్యమంలో మగవారికి ఇచ్చినంత ప్రాధాన్యత ఆడవారికి ఇవ్వలేదు. ఉద్యమం కాగానే ఎన్నికలు వచ్చాయి. ఎక్కడా వారికి గుర్తింపే లేదు.

### 3. మీకు సొంత ప్రచురణ ఉండటం వెనుక ఏదైనా నేపథ్యం ఉందా?

నేను పియుసిలోనే గోల్కొండ పత్రికకు చిన్న చిన్న వ్యాసాలు పంపేదాన్ని. పత్రికలకు ఎలా పంపాలో తెలియదు. అడ్రసు తెలియదు. ఇంట్లో సాహిత్య వాతావరణం లేకపోతే చాలా కష్టం. ఆడపిల్లలకు ఇంకా కష్టం నాకు అనుభవమే కదా! చిన్న చిన్నగా నా అభిరుచిని పెంచుకున్నాను. నేను 90నుండి వ్రాయడం మొదలుపెట్టాను. మలుపు తిరిగిన రథచక్రాలు వ్రాసినప్పుడు దాన్ని ఎవరైనా సీరియల్‌గా ప్రచురిస్తారా అని అడిగాను. ముఖ్యంగా ఆంధ్రప్రభ, చాలా పాప్యులర్ ఆ రోజుల్లో కానీ, ఎవరూ వేయలేదు. విశాలాంధ్ర ప్రసాదరావు గారికి చూపించాను. ఆయన చూసి దీన్ని దాశరథి రంగాచార్యగారికి చూపించమని చెప్పారు. రంగాచార్యగారు నా నవలని మెచ్చుకుని, తెలంగాణా సాహిత్యం ఎవరూ సీరియల్‌గా వేయరు, తెలంగాణా భాష ఉంటుంది కదా. మీకు మీరే ప్రచురించుకోవాలి అన్నారు. అప్పటినుంచి నా రచనలన్నీ నాకు నేను ప్రచురించుకుంటున్నాను.

### 4. ఒక స్త్రీగా మీరు మాత్రమే కొన్ని ప్రత్యేకమైన రచనలు చేశారు కదా వాటి గురించి చెప్పండి?

పోరాటాలు గురించి ఆడవాళ్ళెవరూ రచనలు చేయలేదు. తెలంగాణా సాయుధ పోరాటం ఇతివృత్తాన్ని తీసుకుని పది, పన్నెండు రచనలు వచ్చాయి. కానీ, అందులో నేను తప్ప ఇంక స్త్రీలెవరూ లేరు. అలాగే సంస్కృత సాహిత్య చరిత్రతో పాటు ఇతర సాహిత్య చరిత్రలు వ్రాసినవారిలో ఆడవారిలో నేనొక్కదాన్నే, మరెవ్వరూ స్త్రీలు లేరు.

## విమర్శారంగం

### 5. మీరు విమర్శారంగంలోకి ప్రవేశించిన నేపథ్యాన్ని గురించి కొంత చెప్పగలరు?

నేను ప్రయత్నపూర్వకంగానో లేదా ఒకరి ప్రేరణ ప్రభావాలతోనో సాహిత్య విమర్శనారంగంలోకి రాలేదు. నా సహజ ప్రవృత్తితోనే విమర్శనా రచనకు పూనుకున్నాను. ఎమ్.ఏ. చదివేప్పుడు కూడా కాలేజి మ్యాగజైన్ కు సాహిత్య విమర్శ వ్యాసాలు వ్రాసాను.

### 6. మీ పిహెచ్. డి పరిశోధన గ్రంథమైన "మను-వసుచరిత్రల తులనాత్మక పరిశీలన"లో మీరు కనుగోన్నదేమిటి?

మనుచరిత్ర కథను, పాత్ర చిత్రణను, వర్ణనల క్రమాన్ని వసుచరిత్రకారుడు అనుసరించాడు. సంస్కృత సాహిత్యంలో భారవి కిరాతార్జునీయ కావ్యంమీది స్పర్ధ మాఘుడు శిశుపాలవధ కావ్యం వ్రాసాడు. ఆ స్పర్ధ ఆరోగ్యకరమైన స్పర్ధ కాబట్టి మాఘుడు భారవిలాగానే సాహిత్యంలో తన మౌలికతతో, పాండిత్యంతో కూడిన అనుసరణలతో గొప్ప పేరును తనదైన స్థానాన్ని సంపాదించగలిగాడు. వసుచరిత్రకారుడు పెద్దనను అనుసరించిన పండిత కవి. రామరాజ భూషణుడు వసుచరిత్రలో తనదైన శ్లేషాది ప్రతిభలను చూపగలిగాడు. పెద్దనది వైదర్భీ రీతి అయితే రామరాజ భూషణునిది క్లిష్ట సుందర శైలి. పాఠకుని మెదడుకు పనిపెట్టే కవిత్వం.పెద్దనదది హృదయాన్ని కదిలించే శైలి. ఆహ్లాదమైన శైలి.

### 7. వేమన గురించి మీరు చేసిన పరిశోధనలో నూతన అంశాలు ఏమిటి?

వేమన నాథ సంప్రదాయానికి చెందినవాడని ఇంతకుముందెవరూ చెప్పలేదు. హిందీ సాహిత్య చరిత్రలో మనకు నాథ సంప్రదాయ చర్చచాలా కన్పిస్తుంది. రాహుల్ సాంకృత్యాయన్ వంటి వాళ్ళు ఆ సంప్రదాయాన్ని గురించి విశేష కృషి చేసారు. ఎందుకంటే జనసామాన్యంలో వ్యాపించివున్న నాథ సంప్రదాయం కబీరు, గురునానక్ వంటి వాళ్ళెందర్నో ప్రభావితం చేసింది. శ్రీశైల ప్రాంతంలో ఆరంభమైన నాథ సంప్రదాయం 'నవనాథులనే' తొమ్మిదిమంది గురువులచేత ప్రబోధింపబడింది. తెలుగులో 14వ శ.లో గౌరన ఈ నవనాథుల చరిత్రలను

"నవనాథ చరిత్ర" కావ్యంగా వ్రాశాడు. తెలుగులో ఆధునిక విమర్శకులు నవనాథులంటే శైవ గురువులనుకున్నారు. అదొక గొప్ప సంప్రదాయమని తెలియదు. కొర్లపాటి శ్రీరామమూర్తిగారు "నాథ సంప్రదాయం వేమన" అని పుస్తకం వ్రాసారు. కానీ, నేను ఈ విషయాన్ని గురించి ఆంధ్రసాహిత్య పరిషత్తు సభలో ఉపన్యసించటం పత్రిక (ఆంధ్రప్రభ దినపత్రిక)లో వ్యాసం వ్రాయటం అంతకుముందే జరిగింది. తర్వాత 1993లో "వేమన-నాథసంప్రదాయం" అని పుస్తకం ప్రచురించాను.

**8. మీరు గోపాలరెడ్డిగారితో కలిసి రాసిన 'సంస్కృత సాహిత్య చరిత్ర' కృషి గురించి చెప్పగలరా?**

"సంస్కృత సాహిత్య చరిత్ర" వ్రాయటానికి బీజాలు మేము జర్మనీలో వున్నప్పుడే పడ్డాయి. నేను టుబింగెన్ విశ్వవిద్యాలయంలో ఓరియంటల్ విభాగంలో పనిచేసేటప్పుడు ఎన్నో సంస్కృత మూలకావ్యాలు, గ్రంథాలు, విమర్శ గ్రంథాలు చదివే అవకాశం కలిగింది. ఆ విషయాలను తెలుగు పాఠకులకు చెప్పాలనే తపన నాలో పుట్టింది. మేము భారతదేశం వచ్చిన తర్వాత జర్మనీలో తయారు చేసుకున్న నోట్సు, ఇంకా ఇక్కడ సేకరించిన సమాచారం, గోపాలరెడ్డిగారికి వేద కావ్య నాటకాది సాహిత్యంతో వున్న పరిచయాలు, ఆయన గురుకులంలో చదువుకున్న సంస్కృత సాహిత్యంపై ఆయనకున్న వేదపాండిత్యం ఆధారంగా "సంస్కృత సాహిత్య చరిత్ర"ను రాయడం జరిగింది. కవి కాల నిర్ణయాదులు కవిత్వ మూల్యాంకనంలో ఎన్నో మౌలిక విషయాలు ఇంతకుముందు ఎవరూ చెప్పనివి ఇందులో వున్నాయి. నాకు చరిత్ర అంటే వున్న ఇష్టం కూడా దీని రచనకు తోడ్పడింది. ఈ పుస్తకాన్ని వ్రాసినంక తెలుగు విశ్వవిద్యాలయం వారు ప్రచురించటానికి అంగీకరించారు.

**9. మీరు చేసిన 'నవల- రససిద్ధాంతం' ప్రతిపాదనలపై అనేకమంది విమర్శకులు భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేశారు కదా వాటిపై మీ అభిప్రాయం చెప్పగలరా?**

మన భారతీయ సాహిత్యంలో 5000 సంవత్సరాలకు మించిన సాహిత్య విమర్శ సిద్ధాంతాలు లేదా 5000 సం॥ల నుంచి మనకు సాహిత్య విమర్శలున్నాయి. అటువంటప్పుడు

వాటిని తుంగలో తొక్కి విస్మరించి పాశ్చాత్య విమర్శకుల సిద్ధాంతాలను అనుకరించటం ఎంతవరకు సమర్ధనీయం. భారతీయుల ప్రతిభ ఆ విధంగా అనుకరణతో నశిస్తుంది. ప్రపంచ సాహిత్యంలో మనదైన గుర్తింపు ఈ అనుకరణతో రాదు. మన సాహిత్యానికీ గుర్తింపు మిగలదు. మనది మనకు కావాలె! అప్పుడు మన ప్రజ్ఞ అస్తిత్వం అస్మితలకు గౌరవం గుర్తింపులు వస్తాయి. ఎవరో కనుక్కున్న సిద్ధాంతాలను గుడ్డిగా అనుసరించటంతో కాలక్రమంగా మన ప్రతిభ నశిస్తుంది. కాబట్టి మన మూలాల నుంచి మన సామాజిక, ఆర్థిక పరివేశనంలో సృపింపబడిన సాహిత్యానికి అనుకూలమైన సాహిత్య విమర్శ సిద్ధాంతాలను మనమే ఏర్పరచుకోవాలని నా ఆశయం. మన మూలాల నుంచి కొత్తదనాన్ని సృజించటం అధోగమనం కానేకాదు. అది మన ప్రతిభకు, సృజనాత్మకతకు నిదర్శనం. ఇప్పటికి పాశ్చాత్యులు ప్లేటో, సోక్రటీసు, అరిస్టాటిల్లను మరవటం లేదు. వాళ్ళతోనే సాహిత్య విమర్శ ఆరంభమౌతుందని చెప్పుకుంటున్నారు. ఇప్పటికీ వాళ్ళు చెప్పిన సూత్రాల నుంచి ప్రేరణను పొందుతున్నారు. మనమెందుకు మన వారసత్వాన్ని ఈసడించుకుంటున్నాం. అదే పాశ్చాత్యులు మన సంస్కృత గ్రంథాలను చదివి నూతన భావజాల సృష్టికి పూనుకుంటున్నారు. మనం మన ప్రాచీన జ్ఞానాన్ని కులమత దృష్టితో నిరసిస్తూ ఆధునికత పేరుతో పాశ్చాత్యుల విజ్ఞానాన్ని అనుసరిస్తున్నాం. వాళ్ళ దారిలో నడుస్తున్నాం. ఆ దారిలో పురోగమనం వుండదు.

**10 "మరో మార్క్స్ పుట్టాలే" అని మీ కథల సంపుటికి పేరు పెట్టడంలో మీకు తెలియకుండానే మీ మీద మార్క్సిజం ప్రభావం ఉందని భావించవచ్చా?**

"మరో మార్క్స్ పుట్టాలె" అనే కథను వ్రాసాను. అదే పేరును కథాసంపుటికి పెట్టాను. సాఫ్ట్వేర్ ఉద్యోగాల్లో ఉద్యోగుల పనిగంటలు పెరగటం, వాళ్ళు రాత్రి పగలు అనకుండా శ్రమించటం, ఇల్లు కాపురం, భార్యాపిల్లల అనుబంధానికి సమయం లేకపోవటం, వ్యక్తుల్లో ఆదాయం పెరిగి వ్యక్తి స్వేచ్ఛ పెరగటంతో మానవ సంబంధాల్లో మునుపటి ప్రేమలు, అనుబంధాలు సున్నితమైన భావబంధాలు లేకపోవటంతో ఎన్నో పెళ్ళిళ్లు విచ్ఛిన్నమవుతున్నాయి. అందుకే ఒకప్పుడు కార్మికుల యోగక్షేమం కోసం పుట్టిన మార్క్స్ మళ్ళీ

పుట్టి చేతులతో కాక మెదడుతో పనిచేసే సాఫ్ట్వేర్ కార్మికుల పనిగంటలు, యోగక్షేమాల గురించి పోట్లాడాలనే ఉద్దేశంతో మరో మార్క్స్ పుట్టాలె అని వ్రాసాను. మార్క్స్ ఇప్పుడు లేడని ఆయన సిద్ధాంతాలు లేవనే ఉద్దేశంతో కాదు.

## 11. కథ– నవల–యాత్రచరిత్రలు–విమర్శ ఇందులో ఏ ప్రక్రియ మీద మీకు ఎక్కువ ఇష్టం?

నాకు అన్ని ప్రక్రియల్లో విమర్శ, కథ ప్రక్రియలు చాలా ఇష్టమైనవి.

## 12. మీరు ఎప్పుడైన కవిత్వం రాశారా?

కవిత్వం రాయలేదు. చిన్నప్పుడు ఏదో సరదాగా రాయడం తప్ప సీరియస్ గా ఏం రాయలేదు. నాటకం కూడా ఎప్పుడూ రాయలేదు. ఎప్పుడూ నా దృష్టి సాహిత్య విమర్శ సాహిత్య గ్రంథాలవైపే ఉండేది.

## 13. ప్రస్తుతం వస్తున్న సాహిత్యం–సాహిత్య ధోరణుల పట్ల మీ అభిప్రాయం?

ఇప్పుడు సాహిత్యంలో వస్తున్న ధోరణులలో వాదాలు రాజకీయ, సామాజిక, ఆర్థిక నేపథ్యంతో వస్తున్నాయి. అవే ధోరణులు వాదాలు మనకు మొత్తం భారతీయ భాషల సాహిత్యంలో కన్పిస్తున్నాయి.

# ప్రముఖ విమర్శకులు రాచపాళెం చంద్రశేఖరరెడ్డిగారితో జరిపిన ఇంటర్వ్యూ

## 1.ముదిగంటి సుజాతారెడ్డి గారి సాహిత్యం గురించి మీ అభిప్రాయం చెప్పండి?

ముదిగంటి సుజాతారెడ్డిగారి సాహిత్యం ఒక తీరుతెన్నులుగా లేదు. ఏది ముందుకు వస్తే దాని గురించి రాసే ప్రయత్నం చేసినట్లుగా కనిపిస్తుంది.

## 2. నవలల్లో రస–చర్చ గురించి మీ అభిప్రాయం తెలపండి?

నవల చర్చలో భాగంగా, రసాన్ని తీసుకుని నవలలో కలపడం అనేది it's a failure attempt. ఇది ఒక అసంబద్ధమైన విషయం. ఎందుకంటే శృంగార రసం అనేది చెప్పడానికి ఒక నాయకుడు నాయక అనేవారు ఉంటారు. అలాగే వీరరసానికి ఒక నాయకుడు నాయక ఉంటారు. నవలల్లో ఒక నాయిక నాయకుడు అనే సిద్ధాంతం అవుట్ డేటెడ్. నవలలో ఒక ప్రధాన పాత్ర (Protagonist character) మాత్రమే ఉంటుంది.

రస సిద్ధాంతం ప్రకారం కావ్యంలో నాయకులు దళిత నిమ్న వర్గాలకు చెందిన వారు ఉండరు. కేవలం బ్రాహ్మణులూ, క్షత్రియులు మాత్రమే ఉంటారు. ముఖ్యంగా క్షత్రియులు మాత్రమే ఉంటారు. అలాంటి రస సిద్ధాంతాన్ని తీసుకువచ్చి ప్రజా సాహిత్యమైన నవల వంటి వాటికి అన్వయించడం కుదరదు.

ఒక సందర్భంలో 'త్రిపురనేని మధుసూదనరావు' ప్రాచీన సంస్కృత సాహిత్య చరిత్ర కోసం రాసిన అలంకార శాస్త్రాన్ని ప్రాచీన తెలుగు సాహిత్యానికి కూడా అన్వయించకూడదని అంటారు. నన్నయ కాలానికి అలంకారశాస్త్రానికి సంబంధంలేదని ఉద్దేశ్యంతో ఈ విషయాన్ని చెబుతారు కానీ, అదే ప్రక్రియలో నన్నయ్య వచ్చాడు కాబట్టి కొంత అయినా పర్లేదు కాని ఆధునిక నవలల్లో రసం అనేది ఒక అసంబద్ధమైన చర్చ. ఇలా రస సిద్ధాంతాన్ని ఇష్టం వచ్చినట్లు మార్చడానికి ఎవరికి హక్కు లేదు.

**3. మీ దృష్టిలో ముదిగంటి సుజాతారెడ్డి భావ వాది? భౌతిక వాది? అని మీరు అనుకుంటున్నారు?**

ప్రతి రచయితకు తనకంటూ ఒక దృక్పథం ఉంటుంది. భావవాదం, భౌతికవాదం ఇలాంటివి ఏదైనా ఉండటం సహజం కానీ, ముదిగంటి సుజాతారెడ్డి గారు భావవాది మాత్రమే కాని భౌతికవాది కాదు.

**4. ఒక విమర్శకురాలిగా ముదిగంటి సుజాతారెడ్డి గారిపై మీ అభిప్రాయం?**

ఆమె ఒక గొప్ప సంప్రదాయ విద్వాంసురాలు. దీనిలో ఎటువంటి సందేహం లేదు. సంస్కృత సాహిత్య చరిత్ర, ప్రాచీన సాహిత్య చరిత్ర వంటివాటిని గొప్పగా చదువుకున్న ఆవిడ వచ్చి నవలలు, కథలు వంటివి రాయడం ఒక విశేషం.

**5. ఒక సమకాలీన విమర్శకులుగా ముదిగంటి సుజాతారెడ్డిగారిలో గమనించిన మార్పులు ఏమైనా ఉన్నాయా?**

మొదట్లో ఆమె ప్రాచీన సాహిత్యం, సంస్కృతి సాహిత్యం వంటివి రాయడం కాని తర్వాత కొన్ని మార్పులు రావడం అదే తరుణంలో నవలలు, కథలు అని కొన్ని సృజనాత్మక రచనలు చేసినట్లు తెలుస్తుంది. ఆమె భాష కూడా గ్రాంథికం నుండి వ్యవహారికం, తెలంగాణ ప్రాంతీయ అస్తిత్వ ఉద్యమ కాలంలో మాండలికంలో కూడా కొన్ని రచనలు చేసినట్లు తెలుస్తుంది.

**6. ప్రాంతీయ నేపథ్యం వల్ల విమర్శకులు వారు రాసే విమర్శలో ఏదైనా తేడాలు ఉంటాయా? ఉంటే అవి ఎలా ఉంటాయి?**

ఒక ప్రాంత ప్రభావం అనేది వారి రచనల్లో తప్పక ఉంటుంది. ఉదాహరణకు కొంత మంది తెలంగాణ అస్తిత్వ స్పృహతో రాస్తారు. మరికొంతమంది ఇది రాయలసీమ అస్తిత్వ స్పృహతో రాస్తారు.

**7. విమర్శకులుగా స్త్రీలు రాసిన విమర్శ గురించి మీ అభిప్రాయం తెలపండి? దీనిలో ఏదైనా విభిన్నత ఉందా?**

తప్పకుండా కొంత భిన్నంగానే ఉంటుంది. మొల్ల రామాయణం ఉందనుకోండి. దానిమీద కాత్యాయని విద్మహే రాసిన విమర్శ కొంత భిన్నంగా ఉన్నట్టు గమనించవచ్చు. ఇలా మహిళల కోణం కొంత భిన్నంగానే ఉంది.

**8. మీరు ఎప్పుడైనా ముదిగంటి సుజాతారెడ్డి గారి గురించి ఏవైనా వ్యాసాలు రాశార?**

లేదు, ఇప్పటివరకు ఎప్పుడూ రాయలేదు!

**9. ముదిగంటి సుజాతారెడ్డి గారి గురించి మీరు ప్రధానంగా చెప్పే విషయం?**

ఆమె ఎప్పుడూ ఒక రోల్ మోడల్ గా రాసినట్లు దానికి తగిన సైద్ధాంతిక, సూత్రీకరణ చేసినట్లు నాకు ఎప్పుడూ అనిపించలేదు. కాని ఆమె చేసిన రచనల మీద లోతుగా పరిశోధన చేయాల్సిన అవసరం ఉందని భావించాను.

**10. ప్రస్తుత తరంలో వస్తున్న 'విమర్శ' గురించి మీరేమనుకుంటున్నారు?**

విమర్శ ఇప్పుడు చాలా దండిగా వస్తుంది. ఒకప్పుడు రాయలసీమలో విమర్శకులు ఉండేవారు అని అంటున్నారు కానీ, ఇప్పుడు అంతగా లేరు. ప్రస్తుతం తెలంగాణలో చాలామంది ఉన్నారు. కాని ఈ ఐడియాలాజికల్ డివైడేన్స్(Ideological dividends) వచ్చిన తర్వాత చాలామంది విమర్శకుల్లో ఒక ఒక న్యారో మైండెడ్నెస్(Narrow mindedness) అనేది వచ్చేసింది. ఏదైనా ఒక దృక్పథం మాత్రమే గురించి ఆలోచించడం వల్ల తెలుగు సాహిత్య విమర్శ ఎదుగుదల అనేది ఆగిపోయే ప్రమాదం ఉంది. వచ్చేస్తుంది! ఏదైనా ఒక దృక్పథం గురించి రాయడం నేను సమర్థిస్తాను కానీ, ఆ దృక్పథంతో అయినా నా నిర్దిష్టంగా బలంగా రాస్తే సంతోషమే కానీ, ఇప్పుడు వచ్చే 90% విమర్శలు ఒక పరిచయం మాత్రంగానే

ఉంటున్నాయి. ఏదైనా పెద్ద కథను చిన్న కథగా, నవలను సారాంశంగా మాత్రమే రాస్తున్నారు. ఇప్పటి రచయితలు విశ్లేషణ స్థాయిని అందుకోలేక పోతున్నారు. విమర్శలో ప్రాథమిక దశ అయినా 'పరిచయం' దగ్గరే విమర్శ అంతా ఆగిపోతుంది. విశ్లేషణ లేదు దాని తర్వాత దశ సూత్రీకరణ దశకు అసలు చేరడం లేదు.

### 11. తెలుగు సాహిత్యంలో ప్రస్తుతం ఎటువంటి పరిశోధనలు వస్తున్నాయని మీరనుకుంటున్నారు?

తెలుగులో ప్రస్తుతం ఒక వ్యక్తికి సంబంధించిన లేదా ఒక రచనకు సంబంధించిన రచనలు మాత్రమే ఎక్కువగా ఉంటున్నాయి. సామూహిక దృష్టి తెలుగు సాహిత్యలో  ఇంకా బలపడలేదు. కనీసం తులనాత్మక దృష్టి కూడా కనిపించడం లేదు. దీనివల్ల  ఒక సంకుచితమైన అవగాహన మాత్రమే కనిపిస్తుంది.

# అనుబంధం–2

## రచయిత ముదిగంటి సుజాతారెడ్డిగారు ఇతర సాహిత్య విమర్శకులను కలిసినప్పటి ఛాయా చిత్రాలు



రచయిత విమర్శకులు ముదిగంటి సుజాతారెడ్డిగారితో పరిశోధకుడు



తెలుగు సాహిత్య విమర్శకులు ఆచార్య రాచపాళెం చంద్రశేఖరరెడ్డిగారితో

పరిశోధకుడు

# అనుబంధం–3

## ముదిగంటి సుజాతరెడ్డిగారు ప్రచురించిన గ్రంథాల జాబితా (2022)

### విమర్శ గ్రంథాలు

1. సుజాతారెడ్డి, ముదిగంటి &ముదిగంటి గోపాలరెడ్డి. **బాణుని కాదంబరి పరిశీలనం**. హైదారాబాద్: రోహణం ప్రచురణలు, 1980.
2. సుజాతారెడ్డి, ముదిగంటి. **శ్రీనాథుని కవితా సౌందర్యం.** హైదరాబాద్: శ్రీ విజయ ప్రింటర్స్, మార్చి 1980.
3. సుజాతారెడ్డి, ముదిగంటి. **మనువసుచరిత్రల తులనాత్మక పరిశీలనం**.హైదరాబాద్: శ్రీ విజయ ప్రింటర్స్, 1981.
4. సుజాతారెడ్డి, ముదిగంటి. **తెలుగు నవలానుశీలనం**. హైదరాబాద్: రోహణం ప్రచురణలు, 1991.
5. సుజాతారెడ్డి, ముదిగంటి. **వేమన నాథ సంప్రదాయం**.హైదరాబాద్: శ్రీశాంతా ఆర్ట్ ప్రింటర్స్, 1993.
6. సుజాతారెడ్డి, ముదిగంటి.**ముద్దెర**. హైదరాబాద్: రోహణమ్ పబ్లికేషన్స్. అక్టోబర్, 2005.
7. సుజాతారెడ్డి, ముదిగంటి. **రసచర్చ–ఆధునికత**. హైదరాబాద్: రోహణం ప్రచురణలు,2010.
8. సుజాతారెడ్డి, ముదిగంటి. **అద్యతన దృష్టి**. హైదరాబాద్: రోహణం ప్రచురణలు, 2014.

### సాహిత్య చరిత్రలు

1. సుజాతారెడ్డి, ముదిగంటి&గోపాల్ రెడ్డి. **సంస్కృత సాహిత్య చరిత్ర.** హైదరాబాద్: పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం. 1986.

2. సుజాతారెడ్డి, ముదిగంటి. **చారిత్రక సామాజిక నేపథ్యంలో తెలుగు సాహిత్య చరిత్ర.** హైదరాబాద్: రోహణమ్ పబ్లికేషన్స్ 1996.
3. సుజాతారెడ్డి, ముదిగంటి. **ఆంధ్రుల సంస్కృతి సాహిత్య చరిత్ర**. హైదరాబాదు: తెలుగు అకాడమి, 2007.
4. సుజాతారెడ్డి, ముదిగంటి. **తెలంగాణ తెలుగు సాహిత్య చరిత్ర.** హైదరాబాద్: తెలంగాణ సారస్వత పరిషత్తు, 2015.
5. సుజాతారెడ్డి, ముదిగంటి. **మన తెలుగు సాహిత్య చరిత్ర**. హైదరాబాదు: తెలుగు అకాడమి, 2018.

## నవలలు

1. సుజాతారెడ్డి, ముదిగంటి. **మలుపు తిరిగిన రథచక్రాలు.** హైదరాబాద్: రోహణమ్ పబ్లికేషన్స్ 1994.
2. సుజాతారెడ్డి, ముదిగంటి. **సంకెళ్లు తెగాయి**. హైదరాబాద్: రోహణమ్ పబ్లికేషన్స్, 1994.
3. సుజాతారెడ్డి, ముదిగంటి. **ఆకాశంలో విభజన రేఖల్లేవు**. హైదరాబాదు: రోహణం ప్రచురణలు,1995.

## కథా సంపుటాలు

1. సుజాతారెడ్డి, ముదిగంటి. **విసుర్రాయి**. కరీంనగర్: విశాల సాహిత్య అకాడమీ,1998.
2. సుజాతారెడ్డి, ముదిగంటి. **మింగుతున్న పట్నం**.హైదరాబాద్: రోహణమ్ పబ్లికేషన్స్, 2001.
3. సుజాతారెడ్డి, ముదిగంటి. **వ్యాపారం మృగం**.హైదరాబాద్: రోహణమ్ పబ్లికేషన్స్, 2005.
4. సుజాతారెడ్డి, ముదిగంటి. **మరో మార్క్స పుట్టాలె**. హైదరాబాద్: రోహణమ్ పబ్లికేషన్స్, 2010.
5. సుజాతారెడ్డి, ముదిగంటి. **నిత్యకల్లోలం**. హైదరాబాద్: రోహణమ్ పబ్లికేషన్స్, 2018.

## యాత్రాకథనాలు


1. సుజాతారెడ్డి, ముదిగంటి. **నైలునదీ నాగరికత**.(ఈజిప్ట్ యాత్రాకథనం) హైదరాబాద్: రోహణమ్ పబ్లికేషన్స్, 2006.
2. సుజాతారెడ్డి, ముదిగంటి. **అద్భుత చైనా యాత్ర**. హైదరాబాద్: రోహణమ్ పబ్లికేషన్స్, 2011.
3. సుజాతారెడ్డి, ముదిగంటి. **లద్దాఖ్ యాత్ర కథనం**. హైదరాబాద్: రోహణమ్ పబ్లికేషన్స్, 2015.


## సంపాదకత్వం


1. సుజాతారెడ్డి, ముదిగంటి. **తెలంగాణ తొలితరం కథలు**. హైదరాబాద్: రోహణమ్ పబ్లికేషన్స్, 2002
2. సుజాతారెడ్డి, ముదిగంటి.**తొలినాటి కథలు**(తెలంగాణ తొలితరం కథలు—రెండవ భాగం) హైదరాబాద్: నవోదయ బుక్ హౌస్, 2005.
3. సుజాతారెడ్డి, ముదిగంటి. **జైలులోపల**.(వట్టికోట ఆళ్వారుస్వామి కథలు) హైదరాబాద్: విశాలంధ్ర పబ్లిషింగ్ హౌస్, 2009
4. సుజాతారెడ్డి, ముదిగంటి. **నూరేండ్ల తెలుగు కథలు**. హైదరాబాద్: పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం 2010.
5. సుజాతారెడ్డి, ముదిగంటి. **ఇల్లిందల సరస్వతీదేవి ఉత్తమ కథలు**. న్యూ ఢిల్లీ :నేషనల్ బుక్ ట్రస్ట్ ఇండియా, 2016.
6. సుజాతారెడ్డి, ముదిగంటి. **శతాధిక రచనల సమాహారం ‘తెలంగాణ రచయిత్రుల కథలు**. హైదరాబాద్: నవచేతన పబ్లిషింగ్ హౌస్. 2017.
7. సుజాతారెడ్డి, ముదిగంటి. **తెలంగాణ వ్యవహార పదకోశం**. హైదరాబాద్: తెలుగు విశ్వవిద్యాలయం, 2018.

**ఆత్మకథ (**Auto–biography)

- సుజాతారెడ్డి, ముదిగంటి. **ముసురు అనుభవాలు–జ్ఞాపకాలు–ఆలోచనలు**. హైదరాబాదు: రోహిణం ప్రచురణలు, 2010.

**స్మృతికావ్యం**

- సుజాతారెడ్డి, ముదిగంటి. **ముదిగంటి గోపాల్ రెడ్డి**. (జీవితం–వ్యక్తిత్వం–పాండిత్యం). హైదరాబాదు: రోహిణం ప్రచురణలు, 2005.

మోనోగ్రాఫ్

- సుజాతారెడ్డి, ముదిగంటి. **భారతీయ సాహిత్య నిర్మాతలు–వాసిరెడ్డి సీతాదేవి**. కేంద్ర సాహిత్య అకాడమి, 2016.

**ఇతరాలు**

1. సుజాతారెడ్డి, ముదిగంటి. అనుబంధం **తెలుగు సాహిత్యం మానవ సంబంధాలు పౌరాణిక నేపథ్యం**.
2. సుజాతారెడ్డి, ముదిగంటి. **వ్యాపార సంస్కృతిలో స్త్రీ చైతన్యం**. హైదరాబాద్: రోహణమ్ పబ్లికేషన్స్, 2002.

**ముదిగంటి సుజాతారెడ్డిగారి మీద వచ్చిన ఇతర గ్రంథాలు**

1. త్రివేణి, వి. **ముదిగంటి సుజాతారెడ్డి రచనలు–సమగ్ర పరిశీలన**. ఉస్మానియా విశ్వవిద్యాలయానికి సమర్పించిన సిద్ధాంత గ్రంథం (ముద్రితం) 2008.
2. మురళీధరగౌడు, తాళ్ళపల్లి.(సంపా) **సాహిత్య మథనం**. ముదిగంటి సుజాతారెడ్డి సాహిత్య పరామర్శ. హైదరాబాద్: రోహణం ప్రచురణలు, 2016.
3. లక్ష్మణ చక్రవర్తి, సి హెచ్. **ముదిగంటి సుజాతారెడ్డి కథలు**. (కథా స్రవంతి) గుంటూరు: అభ్యుదయ రచయితల సంఘం, 2016.
4. దేవేంద్ర, ఎం. **సాహిత్య విదుషీమణి డా.ముదిగంటి సుజాతారెడ్డి**. (మోనోగ్రాఫ్) 2021.

# అనుబంధం–4

## మను వసు చరిత్రల పరిశోధనల పట్టిక

### ఇప్పటివరకు జరిగిన ఎంఫిల్ స్థాయి పరిశోధనలు

| పరిశోధన అంశం | పరిశోధకులు | పర్యవేక్షణ | విశ్వవిద్యాలయం | సంవత్సరం |
|---|---|---|---|---|
| 1. మను చరిత్ర: వ్యక్తిత్వవికాసం | గురజాడ గరికపాటి | పిల్లలమర్రి రాములు | హైదరాబాద్ విశ్వవిద్యాలయం | 2015 |
| 2. మనుచరిత్ర– రసచర్చ | సీతా కస్తూరి | కేవిఆర్ నరసింహం | ఆంధ్ర విశ్వవిద్యాలయం | 1968 |
| 3. మనుచరిత్రలో రస నిర్ణయాల అధ్యయనం | సారంగపాణి. పి | ముదిగొండ వీరభద్రయ్య | హైదరాబాద్ విశ్వవిద్యాలయం | 2001 |
| 4. మను–వసు చరిత్రల వర్ణనలు తులనాత్మక పరిశీలన | సాంబ శివరావు.జి | వేదుల సుబ్రహ్మణ్య శాస్త్రి | ఆంధ్ర విశ్వవిద్యాలయం | 1981 |
| 5. వసుచరిత్రలో సంగీతం | శారద. బి,వి | బొడ్డుపల్లి పురుషోత్తం | నాగార్జున విశ్వవిద్యాలయం | 1980 |

# ఇంతవరకు జరిగిన పిహెచ్.డి ఆ పై స్థాయి పరిశోధనలు

| పరిశోధన అంశం | పరిశోధకులు | పర్యవేక్షణ | విశ్వవిద్యాలయం | సంవత్సరం |
|---|---|---|---|---|
| 1. మనుచరిత్ర పారిజాతాపహరణము లో చిత్రించబడిన సమాజం | సురేంద్రనాథ రెడ్డి. పి | పి. నరసింహారెడ్డి | శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం | 2000 |
| 2. అల్లసానిపెద్దన మను చరిత్రలో సాహిత్య ప్రమేయములు | రాఘవాచార్య. కే.వి | పి. నరసింహారెడ్డి | శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం | 1992 |
| 3. ధ్వని–మనుచరిత్ర | రాజన్నశాస్త్రి.కె | బిరుదురాజు రామరాజు | ఉస్మానియా విశ్వవిద్యాలయం | 1980 |
| 4. మనుచరిత్ర ప్రామాణిక వివేచనం | ఆశాలత.కె | కుసుమాబాయి | ఉస్మానియా విశ్వవిద్యాలయం | 2004 |
| 5. మనుచరిత్ర వర్ణనాత్మక విశ్లేషణ | సత్యవాణి.జే.వి | ఎల్.బి శంకరరావు. | మద్రాసు విశ్వవిద్యాలయం | 1988 |
| 6. అల్లసాని పెద్దన ఉత్ప్రేక్షలు–ఒక పరిశీలన | సర్వమంగళ. ఎన్ | సి. తిరుపతిరావు | బెంగుళూరు విశ్వవిద్యాలయం | 1987 |
| 7. రామరాజభూషణుని కృతులు | సుప్రసన్నాచార్య .కే | బిరుదురాజు రామరాజు | ఉస్మానియా విశ్వవిద్యాలయం | 1962 |
| 8. వసు చరిత్ర–17,18వశాతబ్దల ప్రబంధాలపై దాని ప్రభావం | సురేంద్ర కుమార్.ఏ | సుప్రసన్నాచార్య. కే | ఉస్మానియా విశ్వవిద్యాలయం | 1976 |
| 9. మను–వసుచరిత్రల తులనాత్మక పరిశీలన | సుజాతారెడ్డి ముదిగంటి | పల్లా దుర్గయ్య | ఉస్మానియా విశ్వవిద్యాలయం | 1977 |

| | | | | |
|---|---|---|---|---|
| 10. వసుచరిత్ర–ధ్వని, శ్లేష పరిశీలన | జ్యోతిర్మయి.కే | గంధం అప్పారావు | మద్రాసు విశ్వవిద్యాలయం | 1978 |
| 11. వసుచరిత్ర–కవితా సౌందర్యం | సూర్య నారాయణ రాజు | కే. వెంకటరామరాజు | ఆంధ్ర విశ్వవిద్యాలయం | 1988 |
| 12. వసుచరిత్ర కాళిదాసు ప్రభావం | కళ్యాణి.ఎస్ | టి. నిర్మల | నాగార్జున విశ్వవిద్యాలయం | 1986 |
| 13. మను–వసుచరిత్రల తులనాత్మక పరిశీలన | వీరస్వామి.డి | ఎస్. రఘునాథశర్మ | శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం | 1984 |
| 14. పెద్దన కవిత్వం–నిర్వచనం–మనుచరిత్ర(ఎం.లిట్) | క్రిష్ణమూర్తి సాళ్వ | – | మద్రాస్ విశ్వవిద్యాలయం | 1975 |

# అనుబంధం–5

## పరిశోధన వ్యాసాలు మరియు సదస్సుల వివరాలు



# UNIVERSITY OF HYDERABAD

# DEPARTMENT OF TELUGU

## CERTIFICATE OF APPRECIATION

This is to Certify that **Sripathi Maruthi,Research Scholar, Dept of Telugu** of **University of Hyderabad** has presented a paper entitled **"Janapada Sahitya Vimarsha--Visleshana"** in the National Webinar on " *JANAPADA SAHITYA ADHYAYANAM – NADU NEDU*" Organized by the Department of Telugu, University of Hyderabad, Telangana on 24th & 25 th February 2022

Prof Darla Venkateswararao
Seminar Director

**HCU NW C 0046**

Dr Dasari Vijayakumari
Seminar Coordinator

RNI No. APTEL/2003/12253

# భావ వీణ

అంతర్జాతీయ తెలుగు సాహిత్య సాంస్కృతిక & భాషాధ్యయన మాసపత్రిక

# BHAVA VEENA

International Journal of Telugu Literary, Culture & Language Study

Vol : 15 Issue No. 10 Monthly October 2018 ISSN No. : 2456-4702

ज्ञान-विज्ञान विमुक्तये
UGC
University Grants Commission
UGC Approved Journal
No. 42500



ఆచార్య ఎస్వీ జోగారావు

మాతెలుగు తల్లికి మల్లెపూదండ - మాకన్న తల్లికి మంగళారతులు



# BHAVA VEENA (భావ వీణ)

**International Journal of Telugu Literary, Culture & Language Study**

(అంతర్జాతీయ తెలుగు సాహిత్య, సాంస్కృతిక, భాషాధ్యయన పత్రిక)

Editor : Kolla Sri Krishnarao

E-mail : parisodhanatelugu@gmail.com

7989781963,
☎ 9490847482
Rohini Towers,
2/11 Brodipet, GUNTUR-2.

**Vol. 15 - Issue. 10 - October 2018 - ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253**

**EDITORIAL BOARD**

*Chief Editor*
**PITTA SANTHI**
***M.A.(Tel), M.Sc(Psy).,M.Ed.,M.Phil(Edu),(Ph.D).,***
**C/o. Dr. Busi Venkataswamy**
Holy Homes Apartment
Postal colony ,4 Th Line,- 522 002, Guntur Dist., A.P.
Cell no : 7386529274, 7989781963.

**ADVISORY COMMITTEE**

1. **Prof. G. Yohan Babu,** M.A., PhD.
   Dept. of Telugu,
   Andhra University, Visakhapatnam.
2. **Prof. K. Madhu Jyothi,** M.A., PhD.
   Dept. of Telugu,
   Sri Padmavathi Mahila University, Tirupathi.
3. **Prof. C. Srirama Chandra Murthy,** M.A., PhD.
   Dept. of Telugu, Faculty of Arts,
   Benaras Hindu University, Varanasi, Utter Pradesh.
4. **Dr. Busi Venkataswamy,** M.A. (Tel)., M.A (San)., M.A (Ling)., PhD.
   HOD & Research Guide
   Dept. of Telugu
   PAS College, Pedanandipadu.

**ASSOCIATE EDITORS**

1. **Dr.N. R. SADASIVA REDDY,** M.A.,M.Phil.,PhD.
   Asst. Professor,
   Dept. of Telugu & Comparative Literature,
   Sri Krishna Deva Raya University,
   Ananthapuram, Andhra Pradesh.
2. **Dr.V.SANKARA RAO,** M.A.,M.A.,M.Phil.,PhD.
   Associate Professor, Dept. of Telugu, Madras University, CHENNAI, Tamilnadu.
3. **Dr. D. SESHUBABU,** M.A.,M.Phil.,PhD.
   Asst. Professor, Dept.of Hindi,
   Moulana Azad National Urdu University,
   HYDERABAD, Telangana.
4. **Dr. K. Lavanya,** M.A., M.Phil., PhD.
   Board of Studies Chairman, Telangana University,
   Dichpally, Nizamabad, Telangana.
5. **Dr. N.V. KRISHNA RAO,** M.A.,M.Phil.,PhD.
   Asst.Professor, Dept. of Telugu,
   Acharya Nagarjuna University,
   Nagarjuna Nagar, Guntur District.
6. **Dr. A. JYOTHI,** M.A.,M.Phil.,PhD.
   Associate Professor, Dept. of Telugu,
   Kakatiya University, Warangal District. Telangana.
7. **Dr. J. VENKATA RAMANA,** M.A.,M.Phil.,PhD.
   Asst.Professor, Dept.of Modern Indian Languages,
   Madhurai Kamaraj University, Madhurai, Tamilnadu.
8. **Dr. N. Eswar Reddy,** M.A., PhD.
   Asst. Professor, Dept. of Telugu,
   Yogi Vemana University, Kadapa.

# Contents (విషయ సూచిక)


| | | | |
|---|---|---|---|
| 1. | యజ్ఞం కథానిక - మార్క్సిస్టు తత్త్వం | - బిక్కి వెంకటరమణయ్య | 5 |
| 2. | పరిగె కథ - నామౌచిత్యం | - డా॥ దార సుమన్ | 8 |
| 3. | 19, 20 శతాబ్దాల - రాజశేఖర చరిత్ర | - డా॥ జి. వెంకటరమణ | 10 |
| 4. | కొమ్మవాపల్లి గణపతిరావు నవలల్లో- భార్యాభర్తల సంబంధాలు | - కాటేపోగు రాజన్న | 17 |
| 5. | పరిశోధకుడు, సాహిత్యవేత్త ఆచార్య వేటూరి ప్రభాకర శాస్త్రి | - కసప నరేంద్ర | 21 |
| 6. | విమర్శకురాలిగా ముదిగంటి సుజాతారెడ్డి | - శ్రీపతి మారుతి | 26 |
| 7. | మాలతీచందూర్ విషాదాంత నవలలు చిత్రణ | - డా॥ యస్. జ్యోత్స్నారాణి | 29 |
| 8. | 'పారిజాతాపహరణం' - ఆచార సంప్రదాయాలు | - పి. నాగసుబ్బయ్య | 33 |
| 9. | ప్రత్యేకత పింగళి సూరన రాఘవ పాండవీయం - పరిశీలన | - డా॥ పప్పుల వెంకటరమణ | 36 |
| 10. | శ్రీమదాంధ్రమహాభారతం - విజ్ఞాన శాస్త్రాంశాలు | - రాంభట్ల వేంకటరాయశర్మ | 41 |
| 11. | కె. వాసవదత్త రమణ కథలు - గ్రామీణ తత్త్వం | - సనకా ప్రవీణ | 44 |
| 12. | గీతకార్మికుల జీవితాన్ని ప్రతిబింబించిన 'బతుకుతాడు' | - ఎస్. శిల్పారాణి | 47 |
| 13. | తెలుగు కథ - పర్యావరణ స్పృహ | - టి. వనజ | 50 |
| 14. | అపూర్వ ప్రతిభా సంపత్తి ప్రకరణం - శూద్రకుని మృచ్ఛకటికం | - డా॥ వీపూరి వేంకటేశ్వర్లు | 54 |
| 15. | మట్టివాసన - మానవతా పరిమళం | - ఐ. సజని | 58 |
| 16. | ధర్మోపదేశ కావ్యం - "శ్రీ శివభారతం" | - కె.లలిత | 60 |
| 17. | గిరిజన కథలు- ఉపాధ్యాయ పాత్ర చిత్రణ | - డా॥ డి.మస్తానమ్మ | 63 |
| 18. | తెలుగులో హాస్యం | - డా॥ గుంటుపల్లి గౌరి | 66 |
| 19. | దళిత ఉద్యమ సాహిత్యం - వర్గీకరణ వాదం | - సిద్ధార్థ మద్దిరాల | 68 |
| 20. | డా॥ మాలతీ చందూర్ నవలల్లో - స్త్రీ | - ఆర్. సుజిత | 72 |
| 21. | తెలంగాణ తెలుగు కథా వికాసం | - పి. స్వప్న | 74 |
| 22. | సినారె సినిమా పాటల్లో బాలల ప్రశస్తి | - డా॥ పి.ఎస్. హరిశాంతి | 76 |
| 23. | అంతరించిపోతున్న గిరిజన భాషలు-సంస్కృతి, సంప్రదాయాలు | - దొడ్డి శ్రీదేవి | 81 |
| 24. | హాని కథలోని మానవతాలక్షణం | - నల్లమోతు సునీత | 83 |
| 25. | "దృశ్య మధ్యమ రంగభూమి రాతిపూలు నవల" | - ప్రొ॥ కె. శ్రీదేవి | 86 |
| 26. | కడప రైతుల జీవిత చిత్రణ - కడప కథ సంకలనం | - డా॥ బకెట్టి ఉపేంద్ర | 90 |
| 27. | సిద్ధలింగయ్య ఆత్మకథ 'ఊరు-వాడ' | - డా॥ రాజేశ్వరి దివాకర్ల | 92 |
| 28. | మనుగడ పోరాటంలో మైనార్టీలు | - జోగు సంతోష్ కుమార్ | 95 |
| 29. | తొగట సురేశ్ బాబు కథలు - ఆదర్శ సమాజ స్థాపన | - డా॥ పి. భారతి రమేష్ | 97 |
| 30. | వీరబ్రహ్మేంద్రస్వామి తాత్విక దృక్పథం | - డా॥ అప్పిరెడ్డి హరినాథరెడ్డి | 101 |

BHAVAVEENA
Vol. 15, Issue. 10, October - 2018.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC Approved Journal No. 42500

# విమర్శకురాలిగా ముదిగంటి సుజాతారెడ్డి

– శ్రీపతి మారుతి, పరిశోధక విద్యార్థి, తెలుగు శాఖ, హైదరాబాదు విశ్వవిద్యాలయం.

పరిచయం :

తెలుగు సాహిత్యంలో విమర్శ ప్రక్రియను తన రచనా వ్యాసంగంతో పరిపుష్టం చేసిన ఒక గొప్ప విదుషీమణి ముదిగంటి సుజాతారెడ్డి. ఈమె సాహిత్యంలోని విభిన్న ప్రక్రియల్లో రచనలు చేసిన ప్రత్యేకించి విమర్శనా రంగంలో తనదైన ముద్ర వేశారు. విమర్శకులకి కావలసిన, ఒక విషయం మీద అవగాహన, నిశిత పరిశీలనా దృష్టి దాని మీద మేధోగత విశ్లేషణ తన విమర్శనా రచనల్లో మనం గమనించవచ్చు. తెలంగాణలోని నల్గొండ జిల్లా, నకిరేకల్ మండలం ఆకారం గ్రామంలో 1942 మే 25న జన్మించిన ముదిగంటి సుజాతారెడ్డి, ప్రాచీన, ఆధునిక సాహిత్యం మీద సమానమైన అవగాహనతో సాహిత్య విమర్శను కొనసాగిస్తున్నారు. సుజాతారెడ్డి ఇటీవల ప్రాంతీయ అస్తిత్వవాద దృష్టితో సాహిత్య విమర్శ చేస్తూ, నవల, కథ వంటి ప్రక్రియల్లో తమదైన ముద్ర వేస్తున్నారు. ఈమె సాహిత్యంలో విమర్శతో తన ప్రస్థానాన్ని మొదలుపెట్టి తర్వాత సృజనాత్మక సాహిత్యం వైపు మరలిన రచయిత.

విమర్శ రచనలు :

ముదిగంటి సుజాతారెడ్డి తన సిద్ధాంత వ్యాసం అయిన "మను-వసు చరిత్రల తులనాత్మక పరిశీలన" (1976) అనే గ్రంథంతో విమర్శ రంగంలోకి అడుగుపెట్టారని చెప్పుకోవచ్చు. ఈ సిద్ధాంత గ్రంథంలో మనువసుచరిత్రకారులను ఇద్దరిని ఒకచోట చేర్చి వారి పద్య నిర్మాణ శిల్పం, కథ గమన పద్ధతి, అలంకారాలు, వర్ణనలు, రసం మొదలైన ఇతర అంశాలను దీనిలో సమగ్రంగా చర్చించారు. దీనిలో అల్లసాని పెద్దన మను చరిత్రను, రామరాజ భూషణుని వసు చరిత్రను అధ్యయనం చేసి, తెలుగు ప్రబంధ సాహిత్యంలో వసుచరిత్రనే శిఖర ప్రాయంగా నిలిచిందని ముదిగంటి సుజాతారెడ్డి సిద్ధాంతీకరించారు. వసుచరిత్రకే తన ప్రథమ స్థానాన్ని కల్పించారు. ఈ గ్రంథం ద్వారానే ఈమెలో విమర్శ రంగానికి కావలసిన బీజాలు పడినట్లుగా అర్థమవుతుంది.

ముదిగంటి ఇదే పరంపరలో 'శ్రీనాథుని కవితా సౌందర్యం' అనే మరో విమర్శగ్రంథాన్ని 1980లో రచించారు. దీనిలో 'శ్రీనాథుని జీవితం, రచనలు, వ్యక్తిత్వం, కవితారీతుల్ని విమర్శనా దృష్టితో తెలియజేశారు. శ్రీనాథుని కవిత్వాన్ని సరళంగా చాలా సులభమైన శైలిలో దీనిలో విశ్లేషించారు.

తర్వాత 1991లో 'తెలుగు నవలానుశీలనం' అనే గ్రంథాన్ని ముదిగంటి సుజాతారెడ్డి రచించగా, దీనిలో నవల పుట్టుపూర్వోత్తరాలను హేతుబద్ధంగా వివరించారు. ఇందులో కథ, నవల సాహిత్యానికంతటికీ ప్రాచీన భారతీయ సాహిత్యం మూలభూతమైనయనదని పేర్కొన్నారు. 'భారతీయ సాహిత్యం' ప్రాశ్చాత్య నవల అనే ప్రక్రియకు కారణం అయినట్లు ఈ గ్రంథంలో ఈమె విశ్లేషణ సాగుతుంది. ఈ గ్రంథంలో నవలలో ఉండే గుణాలను చెబుతూ, "నవల ఇతివృత్తంలో మూడు గుణాలు తప్పక వుండాలి. విశ్వజనీనత(University), చిత్తరంజకత, సంభావ్యత. నవలా రచయిత ఏదో ఒకప్రదేశంలో వుండి ఏదో ఒక జాతిని సంఘాన్ని, దేశాన్ని గురించి వ్రాసినా ప్రపంచంలో ఏ ప్రాంతంవారైనా, దేశం వారైనా చదివినప్పుడు దానిలోని సంఘటనలు, వ్యక్తులు తమవే అనిపించేటట్లు వుండాలి" (ముదిగంటి పుట: 126) అని చెబుతూ అందుకే టాల్‌స్టాయ్, మామ్, టాగోర్, ప్రేమచంద్ వంటి వారి నవలలు ప్రపంచ ప్రసిద్ధి చెందాయన్న విషయాన్ని తెలియజెప్పారు.

భిన్నమైన ప్రతిపాదనలు :

'రసచర్చ-ఆధునికత' (2009) ద్వారా తెలుగు సాహిత్యంలో తనదైన దృక్పథంతో ఒక నూతన ప్రతిపాదనచేసి సాహిత్యకారుల దృష్టిని ఒక మలుపు తిప్పారు. దీనిలో "రససిద్ధాంతం - నవల" అనే అంశం ద్వారా ప్రాచీన భారతీయ ఆలంకారికులు కేవలం దృశ్య కావ్యాలకు పరిమితం చేసి శ్రావ్య కావ్యాల కూడా రసపోషణకు ఒప్పుకోవడం జరిగింది. అలాంటి రస సిద్ధాంతాన్ని ముదిగంటి సుజాతారెడ్డి ఆధునిక రచనా ప్రక్రియ అయిన నవలకు దీన్ని అనువర్తింపచేశారు. అనుభూతి ప్రధానమైనది కవిత్వం, ఆలోచన ప్రధానమైనది కథానిక, జీవిత ప్రధానమైనది నవల. ఇలాంటి జీవిత అనుభవాన్ని అందించే నవలలో రసానుభూతి కలిగించే అంశాలున్నట్లు సుజాతరెడ్డి గుర్తించారు. రసాన్ని నవలకు అన్వయించే సందర్భంలో 'తాదాత్మ్యం' పొందడం ముఖ్యమని ముదిగంటి భావించారు. రస సిద్ధాంతాలను ప్రాచీన ప్రమాణాలతో కాకుండా, కొత్తగా వ్యాఖ్యానం చేయడం, కొత్త దృష్టితో చూడటం వల్ల నవలకు దీన్ని అనువర్తింప చేయవచ్చునంటారు సుజాతారెడ్డి. 'నవలల్లో వస్తుధ్వని' దాని స్వరూప స్వభావాలను తెలియజేస్తూ, ధ్వని సిద్ధాంతాన్ని తెలుగు నవలకు అన్వయించినట్లు తెలుస్తుంది. సుజాతారెడ్డి చేసిన ఈ ప్రతిపాదన పైన తెలుగు సాహిత్యంలో చాలా వాదోపవాదాలు జరిగాయి. దీని ద్వారా ఒక ఏదైనా విషయం చెప్పడమే కాకుండా కొత్త దృక్పథంతో చెప్పడం సాహిత్యంలో అవసరమని, ఇది సాహిత్యాభివృద్ధికి ఉపయోగపడుతుందని నిరూపించారు.

ఎప్పుడు ఒక కొత్త విషయాన్ని ప్రతిపాదించడంలో ముందుండాలనుకునే ముదిగంటి సుజాతారెడ్డి "వేమనవాద సంప్రదాయం" అనే విమర్శ గ్రంథం ద్వారా వేమన వాద సాంప్రదాయానికి చెందిన వాడుగా ఒక భిన్నమైన కోణంలో తనదైన రూపంలో చెప్పి దీన్ని 1993 సంవత్సరంలో ప్రచురించారు. వేమనపై ఎంతోమంది ఇప్పటివరకు పరిశోధనలు చేసి భిన్నమైన అభిప్రాయాలు తెలుపగా, ముదిగంటి సుజాతారెడ్డి కొత్త ఆధారాలతో వేమన వాద సాంప్రదాయాన్ని నవవాదులను, వాదసాంప్రదాయ సిద్ధాంతాలను, ఇతర విషయాలను విశ్లేషించి మరోసారి తన ప్రత్యేకతను సాహిత్య లోకానికి తెలియజేశారు. హేతువాదాన్ని ఆధారంగా చేసుకొని ఉండే వాద సంప్రదాయం, దీనిలోని సిద్ధాంతాలు, వివిధ పద్ధతులను వేమన చెప్పిన పద్యాల్లో ఉన్నట్లు విశ్లేషణ పూర్వకంగా నిరూపించే ప్రయత్నం చేశారు.

తర్వాత సుజాతారెడ్డి "అద్యతన దృష్టి"(2014)తో మనందరి ద ృష్టిని మరోసారి ఆకర్షించారు. ముదిగంటి ఈ గ్రంథం ద్వారా ముత్యాలవంటి 30 వ్యాసాలతో ఒక మాలను అల్లి విమర్శ లోకానికి తనదైన బహుమతి అందించారు. విమర్శనా ప్రక్రియ చేపట్టాలంటే నిశితమైన ప్రాపంచిక దృక్పథం, అలుపెరుగని నిరంతర అధ్యయనం, సాహిత్యంలో కళతాత్త్వికత తెలిసి ఉండడం, వంటి లక్షణాలు అన్నీ సంపాదించుకొని, వీటన్నింటిని మేళవిస్తే వచ్చిందే ఈ వ్యాసాల సంపుటి. "**ఈ సంపుటిలోని మొదటి నాలుగు వ్యాసాలు పాకిరిగాను, సుజాతారెడ్డి ద ృక్పథం- సాంప్రదాయిక భూమిలో వెళ్ళానుకొని ఊడలు దిగిన వటవ ృక్షమని తేలికగానే గుర్తించవచ్చు. కానీ వామపక్ష భావజాలం మీద వీరు విరుచుకుపడ్డ వైనం ఎక్కడా కనిపించదు. పైగా అందులోని మేలిమిని తలకెత్తుకున్న ధోరణి- ఈ సంపుటిలోనే కథల మీద నవలల మీద వీరు రాసిన వ్యాసాలలో చాలా స్పష్టంగా కనిపిస్తుంది**" (బేతవోలు రామబ్రహ్మం పుట: 4) అని దీనిలోని ప్రత్యేకతను వారు తెలియజేశారు. దీనిలో కొన్ని వ్యాసాలు తప్ప మిగతావన్నీ సమకాలీన సాహిత్యానికి సంబంధించినవే. మరికొన్ని వ్యాసాలు తెలంగాణ ప్రాంతాన్ని విశ్లేషించేవి. దీనిలో ఒక "300 సినిమా" అనే సినిమా విమర్శ వ్యాసం ఉండడం విశేషం.

ముదిగంటి సుజాతారెడ్డి "తెలంగాణ తొలితరం కథలు" (2002) పేరుతో రెండు సంకలనాలను ప్రచురించారు. ఇవి ప్రాంతీయ నేపథ్య దృక్పథంతో పరిశోధనాత్మకంగా వచ్చిన కథా సంపుటాలు. వీటిలో తెలంగాణ ప్రాంతంలో కథలు వెలుగులోకి రాకపోవడానికి చాలా మంది కవులు తమ రచనలను కథలను ముద్రించుకోకపోవడం, తద్వారా అవి పరిశోధకుల దృష్టికి రాకపోవడానికి కారణం అయినట్లు ఆమె తెలియజేశారు. కాని అప్పట్లో "**గోలకొండ, శోభ, ఆంధ్రకేసరి, కాకతీయ, సుజాత, తెలుగుతల్లి, తెలంగాణ, నీలగిరి, ఉదయగిరి, తెనుగు, ప్రత్యూష, ప్రవంతి, ప్రగతి, సారథి, తెలుగుదేశం, నవోదయ, స్వంతంత్ర, ఉషస్సు, మీజాన్, ప్రజాతంత్ర, రెడ్డి రాణి**" వంటి మొదలైన పత్రికల్లో తెలంగాణ రచయితల కథలు అచ్చయినట్లు తెలిపారు. మాడపాటి హనుమంతరావు ఏడు కథలు 1915లో "మల్లికా గుచ్ఛము" పేరుతో మచిలీపట్నంలోని సరస్వతీనికేతనంలో పుస్తకంగా ప్రచురించారు. ఇదే తెలంగాణ కథల మొదటి పుస్తకం" అని సుజాతారెడ్డి పరిశోధనాత్మకమైన ఈ గ్రంథ ముందుమాటలో తెల్పిచెప్పారు.

తెలంగాణలో అస్తిత్వవాదం బలపడటానికి కారణమైంది "ముద్దెర(2005)". ముదిగంటి సుజాతారెడ్డి సంపాదకత్వంలో వెలువడిన ఈ విమర్శనా గ్రంథంలో సుజాతారెడ్డి, కాసుల ప్రతాపరెడ్డి, జూలూరు గౌరీశంకర్, గుడిపాటి, నందిని సిధారెడ్డి వంటి రచయితల వ్యాసాలున్నాయి. ఇందులో కవులు తెలంగాణ సాహిత్యాన్ని సామాజిక, చారిత్రక, సైద్ధాంతిక కోణాల నుండి విమర్శించినట్లు తెలుస్తుంది. ఇది తెలంగాణలో అస్తిత్వవాదం అనేది బలపడటానికి కావలసిన నేపథ్యాన్ని అందించినట్లు అనిపిస్తుంది. ముద్దెర అస్తిత్వవాదంలోని భిన్నమైన పార్శ్వాలను పరిచయం చేసింది. ఇది తెలంగాణ సాహిత్య విమర్శ అవగాహనకు తోడ్పడే గ్రంథం.

గత కాలపు వాస్తవాలను సాక్ష్యాధారాలతో స్పష్టంగా ధ్రువీకరించి తెలుసుకోవాలనే పట్టుదలే చరిత్ర అని అధ్యయనం ఏర్పడడానికి పునాదిగా చెప్పవచ్చు. ఇలాంటి అధ్యయనం అనేది గత కాలం పట్ల గల కొత్త వాస్తవిక దృష్టిని మిగతా ప్రపంచానికి అందిస్తుంది. ఇదే విధానం సాహిత్య సాహిత్య చరిత్ర రచనలో కూడా కనిపిస్తుంది. ఇదే పరంపరలో ఈమె విమర్శనా దృష్టితో రాసిన "చారిత్రక సామాజిక నేపథ్యంలో తెలుగు సాహిత్య చరిత్ర" (1996) ను బట్టి ఈ విషయన్ని అర్థం చేసుకోవచ్చు. అలాగే తెలుగు సాహిత్యంలో ఒక స్త్రీగా రచించిన మొట్టమొదటి సాహిత్య చరిత్రగా పేరు పొందింది ఈ సాహిత్య చరిత్ర. ఈ రచనకు జీవియస్ సాహితీ పురస్కారాన్ని కూడా అందుకున్నారు. సాహిత్య చరిత్రను రాయడంలో కూడా తనదైన ఒక కొత్త దృక్పథాన్ని సృష్టించింది, వీరేశలింగం యుగం, కృష్ణశాస్త్రి యుగం వంటి మహాకవుల పేర్లతో యుగ విభజన చేయడం ద్వారా కొన్ని నూతన ప్రతిపాదనలు చేశారు. ముదిగంటి తర్వాత "ఆంధ్రుల-చరిత్ర- సంస్కృతి" అని 2015లో "తెలంగాణ తెలుగు సాహిత్య చరిత్ర" అనే మరో సాహిత్య చరిత్ర గ్రంథాన్ని కూడా రాసారు. తన భర్త సంస్కృతంలో పండితుడు అయిన ముదిగంటి గోపాలరెడ్డి గారి సాహచర్యంలో "బాణుని కాదంబరి పరిశీలన"(1980) అలాగే పేరుతో కూడా ఒక గ్రంథాన్ని ఈమె రచించారు. దీనిలో విమర్శనాత్మకంగా అనేక కొత్త విషయాలను దీనిలో పొందు

పరిచారు. తెలుగులో "సంస్కృత సాహిత్యచరిత్ర"(1986)ను కూడా రచించారు. దీనివల్ల సాహిత్య నిర్మాణంలో ఒక కొత్త దృష్టి మనకు కనిపిస్తుంది.

విశేషాంశాలు :

ముదిగంటి సుజాతారెడ్డి మనువసుచరిత్రలను తులనాత్మకంగా పరిశీలించి ప్రాచీన సిద్ధాంతాల మీద సాధికారతను సంపాదించిన విదుషీమణి. వేమన మీద నాథ సంప్రదాయ ప్రభావం ఉంది అని నిరూపిస్తూ 1993లో రాసిన గ్రంథం 'వేమన నాథ సంప్రదాయం' వీరి పరిశోధనను నిరూపిస్తుంది. దీనిలో వేమన గురించి, చలం ప్రతికల గురించి, నవల రససిద్ధాంతం మొదలైనవి కొన్ని ముఖ్యంగా చెప్పుకోవచ్చు. 1992లో ప్రచురించిన 'తెలుగు నవలానుశీలనం' అనే గ్రంథానికి తెలుగు విశ్వవిద్యాలయం ఉత్తమ విమర్శ గ్రంథ పురస్కారం లభించింది. చారిత్రక విమర్శ, నవల విమర్శ, కవి జీవిత విమర్శ, ప్రాంతీయ అస్తిత్వవాద విమర్శ వంటి వివిధ విమర్శ ధోరణులను ముదిగంటి విమర్శనా రచనలో గమనించవచ్చు.

ముదిగంటి సుజాతారెడ్డి ఒక ప్రత్యేక దృష్టి కోణం గల రచయితగా మనకు కనిపిస్తారు. ఈమె రచనలు తెలుగు సాహిత్యంలోని అన్ని ప్రక్రియల్లో ఉండి అవి తన నైపుణ్యాన్ని తెలియజేస్తున్నాయి. కథ, నవల, విమర్శ, యాత్రాచరిత్రలు, సాహిత్యచరిత్రలు, పరిశోధన, సంస్కృతంలో పాండిత్యం, వ్యాసాలు రాయడం అలాగే ప్రాచీన సాహిత్యంలో, ఆధునిక సాహిత్యంలో రచనలు చేయడం ఇలా బహుముఖ విషయాల్లో గొప్ప పట్టు ఉన్నవారు సుజాతారెడ్డి. దీన్నిబట్టి ప్రాచీన సాహిత్యంతో పరిచయం ఉన్నవారు చేసే విమర్శ ఎంత భిన్నంగా ఉంటుందో అది తెలుగు సాహిత్యానికి ఎంత అవసరమో చెప్పవచ్చు. ఈ విధంగా ముదిగంటి సుజాతారెడ్డి ఒక గొప్ప విమర్శకురాలిగా కృషిచేస్తూ తెలంగాణ సాహిత్య విమర్శను తద్వారా తెలుగు సాహిత్యాన్ని మరింత సుసంపన్నం చేస్తున్నారని చెప్పవచ్చు.

ముగింపు :

ముదిగంటి సుజాతారెడ్డి తన సమకాలీన విమర్శకులందరికీ భిన్నంగా అంతవరకు ఎందరో పండితుల చేత పరామర్శింపబడిన విషయాలను కొత్త కోణంతో పరిశీలిస్తూ, చాలా సులభమైన శైలిలో ఎటువంటి రాగద్వేషాలు లేకుండా చర్చించడం అనేది ఆమెలో ఉన్న ఒక విలక్షణమైన లక్షణం. ఈమె తాను సేకరించిన సమాచారంతో కొత్త విశ్లేషణచేసి ఇంతకముందు ఎవ్వరూ చేయని ప్రతిపాదనలు చేస్తుంటారు. విమర్శకులుగా రచనలు చేస్తున్న వారెందరో ఉన్నారు. కాని వారితో పాటు ఒక మూసధోరణిలో పోకుండా తనకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని సృష్టించుకొని, దానికి కావలసిన సామాజిక దృష్టికోణాన్ని ఏర్పర్చుకొని, వీటి ద్వారా తెలుగు సాహిత్యాన్ని పరిశీలించి తెలుగు సాహిత్యంలో ఒక ప్రత్యేకమైన వ్యక్తిగా నిలవడం అనేది ముదిగంటి సుజాతారెడ్డి గారికి మాత్రమే సాధ్యం అనిపిస్తుంది. ఈ విధంగా ముదిగంటి సుజాతారెడ్డి తెలుగు సాహిత్య విమర్శ రంగంలో ప్రవేశించిన కొద్ది మంది స్త్రీలలో తనకంటూ ఒక ప్రత్యేక స్థానం సంపాదించుకొని, తనదైన ఒక ప్రత్యేక దృక్పథంతో విమర్శరంగంలో ముందుకు సాగుతున్నారు.

ఉపయుక్త గ్రంథ సూచిక:

1. లక్ష్మణ చక్రవర్తి సి హెచ్, సి వారిజారాణి, జి విజయ్ కుమార్(సంపా). ఆధునిక సాహిత్య విమర్శకులు -ప్రస్థానాలు (సమకాలీకులు): ఆంధ్ర విద్యాలయ స్నాతకోత్తర తెలుగుశాఖ.2008.
2. లక్ష్మణ చక్రవర్తి, సి.హెచ్. ఆధునిక సాహిత్య విమర్శ రీతులు. హైదరాబాద్: ఆంధ్ర విద్యాలయ ప్రచురణలు.2004.
3. సుజాతారెడ్డి ముదిగంటి. అద్యతన దృష్టి(సాహిత్య విమర్శ వ్యాసాలు). హైదరాబాద్ : రోహిణమ్ ప్రచురణలు, 2014.
4. సుజాతారెడ్డి ముదిగంటి. తెలుగు నవలానుశీలనం. హైదరాబాద్: రోహిణం ప్రచురణలు, 1991.
5. సుజాతారెడ్డి ముదిగంటి. మనువసుచరిత్రల తులనాత్మక పరిశీలనం.హైదరాబాద్: శ్రీ విజయ ప్రింటర్స్, 1981.
6. సుజాతారెడ్డి ముదిగంటి. ముద్దెర. హైదరాబాద్: రోహిణమ్ పబ్లికేషన్స్ అక్టోబర్ 2005.
7. సుజాతారెడ్డి ముదిగంటి. వేమన నాథ సంప్రదాయం.హైదరాబాద్: శ్రీకాంతా ఆర్ట్ ప్రింటర్స్ 1993.
8. సుజాతారెడ్డి ముదిగంటి. శ్రీనాథుని కవితా సౌందర్యం. హైదరాబాద్: శ్రీ విజయ ప్రింటర్స్, మార్చి 1980.




Scanned with CamScanner

## విషయ సూచిక


01. నవలా సాహిత్యంలో కల్లుగీత కార్మిక వృత్తి చిత్రణ - **ప్రొఫెసర్ ననుమాస స్వామి** ......... 1

02. నా రెండు వృత్తి కళాకారుల నవలలు - **డా॥ వి.ఆర్. రాసాని** ......... 7

03. గంగిరెద్దుల వారి వృత్తి జీవితం - పరస - పెదపాటి ఎస్.వి.వి. శ్రీదేవి ......... 11

04. బోయ వీరుల కథ - **సుంకర గోపాలయ్య** ......... 17

05. "బతుకాట" నవల - వృత్తి జీవితం - **దారపురెడ్డి కనకమహాలక్ష్మి** ......... 21

06. అతడు అడవిని జయించాడు నవల - వృత్తిజీవన ప్రతిఫలనం - **డా॥ బిర్రు అశోక్** .... 24

07. ఎన్నెల నవ్వు - యానాదుల వృత్తి జీవితం - **డా. యు.ఝాన్సీ** ......... 29

08. సలీంగారి "గుర్రపుడెక్క" నవల-చెంచుల వృత్తి జీవనం - **డా.పి.భగ్గు నాయక్** ......... 33

09. పోరాట దృక్పథ స్త్రీ కి ప్రతీక - కాటీ చిలుక - **భమిడిపాటి గౌరీశంకర్** ......... 39

10. 'ఉతికేసిన బతుకులు' నవల - రజకవృత్తి చిత్రణ - **డా. జడా సుబ్బారావు** ......... 42

11. తెలుగు నవల చర్మకారుల వృత్తి జీవితం - **పొన్నాల ఉపేందర్** ......... 45

12. 'పొత్తి' నవల - వ్యావసాయిక వృత్తి చిత్రణం - **చల్లా నరేందర్** ......... 50

13. 'అంధకారంలో ' నవల - సమాజం, వేశ్యావృత్తి వేదనలు.! - **ప్రవీణ్ కుమార్ యజ్జల** .. 56

14. తెలుగు నవల గిరిజన (ఎరుకల) వృత్తి జీవితం - **రాజు దేవర** ......... 62

15. పోరంకి దక్షిణామూర్తి 'ముత్యాల పందిరి' నవల - నేతన్నల జీవన చిత్రణ - **డా.పి.వి.లక్ష్మణరావు** ...... 72

16. "ఋతుపవనాలు" నవల - రాయలసీమ రైతు జీవన విధానం - **గంటా శంకరరావు** ... 78

17. 'పచ్చగా నూరేళ్లు' నవల - వ్యవసాయ వృత్తి సమస్యల చిత్రణ - **అంకిరెడ్డి సునీల్ కుమార్ రెడ్డి** .. 81

18. సుషుప్తి నవలలో కుమ్మరి జీవిత చిత్రణ - **తంగి ఓగేశ్వరరావు** ......... 86

19. తోలు బొమ్మలాటలు నవల - విశ్లేషణ - **డా॥. బసెట్టి ఉపేంద్ర** ......... 89

20. బడుగు జీవుల కష్ట సుఖాల కలనేత చిలకలంచు జరీకోక- నవల - **ఆచార్య.జి.వి.ఆనంద కుమార్** .... 92

21. తెలుగు నవల - వెనుకబడిన కులాల వృత్తి జీవితం - **రుద్రరాజు రామకృష్ణం రాజు** .... 96

22. చివరి గుడిసె -యానాదుల సంచారజీవితం - **తోట రామకృష్ణ** ......... 101

23. సంకెళ్లు తెగాయి: వృత్తి జీవన చైతన్యం-విశ్లేషణ - **శ్రీపతి మారుతి** ......... 105

24. 'పంచమం' 'కొంగవాలు కత్తి' నవలల్లో వృత్తి జీవన ప్రతిఫలనం - **డా॥ ఈతకోట ఈశ్వరరావు** ...... 108

25. ముద్ర - మాతంగి జీవితాలు - **డా.చదలవాడ విజయ కుమార్** ......... 111

26. లంబాడీలు - జీవన రేఖ - **డా॥ ఎన్.హెచ్.పి. కిరణ్ కుమార్** ......... 115

27. గిరిజన నవలలు - యానాదుల వృత్తి జీవితం - **డా॥ శ్రీను కేతావత్** ......... 118

28. బొగ్గుగని కార్మికుల వ్యథల్ని ఆవిష్కరించిన నవల "సింగరేణి మండుకొండి..." - **రామారావు గంజికుంట్ల** ... 120




Scanned with CamScanner

# 23. సంకెళ్లు తెగాయి: వృత్తి జీవన చైతన్యం-విశ్లేషణ

**శ్రీపతి మారుతి**
పరిశోధక విద్యార్థి
తెలుగు శాఖ, హైదరాబాదు విశ్వవిద్యాలయం
చరవాణి: 9154238058

## పరిచయం

వృత్తి, జీవించడానికి చేసే ఏదైనా ఒక పని. మన సమాజం ఇలాంటిఅనేక వృత్తులతో కలిసి పోయి ఉంది. కానిభారతదేశంలో వృత్తులుగా వర్గీకరించబడిన సమాజంపై కులం ఆపాదించబడి,ఇదే తర్వాత కులవృత్తులుగా మారిపోయి, అనేక వివక్షలకు, అసమానతలకు కారణమయింది.ఇలాంటి అసమానతలను,వివక్షలను కలిగిన ఉత్పత్తి కులాల జీవన వృత్తులను తెలుగు సాహిత్యం ఎప్పటినుండో తన రచనల్లో ప్రతిబింబిస్తుంది.నవల సాహిత్యం విభిన్న వస్తూ వైవిధ్యాలను పట్టి ఉంచడంలోఉన్న సౌలభ్యం పరంగా, వృత్తి జీవితాన్ని చిత్రించడానికి ఇది ఒక మంచి వేదికయింది.ఇదే పరంపరలో ముదిగంటి సుజాతారెడ్డిగారు రాసిన 'సంకెళ్లు తెగాయి' నవల క్షౌరవృత్తి చైతన్యాన్ని చిత్రించింది. ఒక వ్యక్తి తన కులవృత్తి చేయడం వల్ల ఉండే అసమానతను, వివక్ష అవమానాలను కాదని చదువుకొని తన వ్యక్తిత్వ నిర్మాణం చేసుకుని ఏ విధంగా విజయాన్ని సాధించాడనే కోణంలో ఈ నవలను చిత్రించారు సుజాతరెడ్డి.ఈ నవలలో నారాయణ అనే యువకుడు ఎన్నో ఆటుపోట్ల మధ్యపడిన సంఘర్షణను సున్నితంగా నవలీకరించారు. నవలలోభాగంగా గ్రామీణ ప్రాంతంలో ఉండే ఇతర కులవృత్తులను వారి సమస్యలను కూడా రాశారు. వీటన్నింటిని విశ్లేషించడమే ఈ వ్యాసం ప్రధాన ఉద్దేశం.

## కథావస్తువు

'సంకెళ్లు తెగాయి'నవల నారాయణ అనే ఒక మంగలి కులానికి చెందిన యువకుడు కథానాయకుడిని ఆధారంగా చేసుకుని సాగుతుంది.నారాయణ తెలంగాణ ప్రాంతంలోని ఒక గ్రామంలో క్షౌరవృత్తిని ఆధారంగా చేసుకొని జీవిస్తున్న ఈరయ్య, రంగి లా కొడుకు. ఇతనికి ముగ్గురు చెల్లెళ్లు. వీరికి నాలుగు ఎకరాల వర్షాధారిత వ్యవసాయ భూమి కూడా ఉంటుంది. ఈరయ్య మంగలి పని చేసుకుంటూ, అలాగే ఊళ్ళోని దొర, వారి అగడాలకు గురవుతూ జీవిస్తూ ఉంటారు. ఊరిలో దొరల అధికారం దీనివల్ల కులవృత్తులపై ఆధారపడి జీవించే వారి వ్యధలతోకూడిన జీవన విధానం, వారిసమస్యలు చాలా దగ్గరి నుంచి చూస్తాడు నారాయణ. ఇలాంటి పరిస్థితుల్లోచిన్నప్పటినుండి తన కులవృత్తిపై ఆయనకు ఇష్టం ఉండదు. ఎన్నో కష్టాలు ఉన్నా చదువుకోవాలన్న ఆశతో వాటన్నింటిని అధిగమిస్తూ చదువుకుంటూ పట్నంలో ఉంటాడు. పై చదువులకు పట్నం వెళ్ళిన తన తల్లికి ఇదంతా ఇష్టం ఉండదు కానిఈరయ్య మాత్రం తన కొడుకు బాగా చదివి మంచి ఉద్యోగం సంపాదించుకుని, తల్లిదండ్రులను బాగా చూసుకుంటాడని ఆశతో ఉంటాడు. కాని ఊర్లో ఉండే దొర, తనతో సమానంగా చదివే దొరకొడుకు రామేశ్వరరావులునారాయణ మీద ద్వేషంతో, ఈర్ష్యతో ఉంటారు.పట్నంలో రామేశ్వరరావు కూడా నారాయణ మీద దొరతనం చేయడం, స్నేహితులతో కలిసి అతని హేళన చేస్తూ ఉంటాడు. వీటన్నింటినీ తట్టుకొని వేదప్రకాష్ అనే మాస్టారు, అలాగే కాలేజీలో తనతో చదివి ప్రగతిశీల భావాలు కలిగిన అనల అనే అమ్మాయి, వీరిద్దరి సహాయ సహకారాలతో ఎమ్మె హిస్టరి పూర్తి చేస్తాడు. అక్కడే యూజీసీ స్కాలర్షిప్ సహాయంతో రీసెర్చ్ కోసం పి హెచ్ డి ప్రోగ్రాంలో జాయిన్ అవుతాడు.

అనల వాళ్ళ నాన్న సలహాతో సివిల్స్ కిప్రిపేర్ అయి మొదటి ప్రయత్నంలోనే విజయం



Scanned with CamScanner

సాధించి ఐఏఎస్ అవుతాడు. ఇక్కడ గ్రామీణ ప్రాంతంలోని ఒక నిమ్నకులానికి చెందిన వాడిగా ఎన్నో సమస్యలను వివక్షను, అసమానతను ఎదుర్కొని ఆర్థిక సమస్యలన్నింటినీ దాటుకొని తనకు ఉన్న పరిస్థితులను, మంచి వారి సాన్నిహిత్యంతో ఉపయోగించుకొని తన జీవితంలో విజయం సాధించడమే ఈ నవల ఇతివృత్తం.నారాయణ ఈ సమాజం విధించిన అవమానం, అసమానతలు, హేళన, వివక్ష లాంటి సంకెళ్లను తెంపుకుని విజయం సాధించడం వల్లనే రచయిత ఈ నవలకు 'నారాయణ విజయం' అనే పేరు కూడా పెట్టారు. దీంతోపాటు ఈ నవలలో తెలంగాణ ప్రాంతంలోని గ్రామీణ జీవితం దొరల అజమాయిషీ, ఇతర కులవృత్తుల వారి జీవన విధానం, ఆర్థిక సమస్యలు, వెట్టిచాకిరి విధానం మొదలైన వాటిని కథలో భాగంగా రచయిత చిత్రించారు.

## నవలలో కుల వృత్తుల చిత్రణ విశ్లేషణ

సంకెళ్లు తెగాయి నవల ప్రధానంగా కథానాయకుడు అయిన నారాయణ వాళ్ళ మంగలి వృత్తిని కేంద్రంగా చేసుకొని నడుస్తుంది. నవల చిత్రణలో భాగంగా ఊర్లో ఉండే ఇతర కులవృత్తి అయిన కుమ్మరి, కమ్మరి, వడ్రంగం, కంసాలి, చాకలి, చేనేత వృత్తులను గురించి వారి జీవనవిధానం, స్థితిగతులను గురించి కూడా వివరించారు. ప్రపంచవ్యాప్తంగా వచ్చిన పారిశ్రామికీకరణ (Industria-ization), దీని తర్వాత వచ్చిన ప్రపంచీకరణ (Globalization) ఫలితంగా గ్రామీణ జీవనవిధానం విచ్ఛిన్నమైంది. వీటి ప్రభావం మొదట కులవృత్తులను నమ్ముకుని జీవిస్తున్న వారిపైన అధికంగానే పడింది. ముఖ్యంగా గ్రామీణ జీవనవ్యవస్థ పూర్తిగా మారిపోయి ప్రజల జీవితం కష్టంగా తయారై, వారు వలసలు పోయే స్థితికి దిగజారింది. ఈ నవలలో నారాయణ చిన్నప్పటినుండి తన కుటుంబం పడుతున్న కష్టాలను, వాళ్ళ కులవృత్తి అయిన మంగలి పని చేయడం వల్ల అనుభవిస్తున్న బాధలను చాలా దగ్గరి నుండి గమనిస్తూ ఉంటాడు. వీటన్నింటికి పరిష్కారంగానే నారాయణ వాళ్ళ నాన్నలాగా కులవృత్తిని నేర్చుకోకుండా చదువును నూతన మార్గంగా ఎంచుకుంటాడు. ఊళ్లో మంగలి పని చేయడం, దొరలాంటి వాళ్లకి ఉచితంగా చాకిరీ చేయడం చేస్తూ ఉంటారు ఊరయ్య. ఇప్పుడు వస్తున్న ఆధునిక మార్పులకనుగుణంగా బాలయ్య లాంటి వాళ్ల దగ్గరే అందరూ క్షవరం, కటింగ్ చేయించుకోవాలి అనుకుంటూ ఉంటారు. మరోపక్క వీటికి కొంత వ్యవసాయం ఉన్నా అది వర్షాధారితమే కావడంతో, నారాయణ తన జీవితంలో మరో ప్రత్యామ్నాయం వెతుక్కోవాల్సి వస్తుంది.

నేటి కాలంలో మారుతున్న ఆర్థిక, సామాజిక అంశాలు వాటివల్ల సంభవించే మార్పులు చాలా వేగంగా జరిగిపోతున్నాయి. అందుకే మొదట పారిశ్రామికీకరణ ప్రారంభమైనప్పుడు దాని ప్రభావాన్ని మొదట చవిచూసిన వారు చేనేత వృత్తివారు. ఇంగ్లాండ్ లో మొదట పారిశ్రామికీకరణప్రారంభమైంది. తర్వాత వారే భారతదేశాన్ని పాలించడంతో పాలన సౌలభ్యం కొరకు మనదేశంలో అనేక రకాల పెద్ద పెద్ద నూలు, కాటన్ పరిశ్రమలు నెలకొల్పారు. వీటి ప్రభావంతో గ్రామీణ ప్రాంతంలో తక్కువ ధరకే అందరికీ రకరకాల బట్టలు అందుబాటులోకి వచ్చాయి. తద్వారా కులవృత్తిని ఆధారంగా చేసుకొని బట్టలనేసే నేతపని వారికి సరైన గిరాకి లేకుండా పోయి, వారు అనేక దుర్భర పరిస్థితులు అనుభవించాల్సి వచ్చింది.నవలలో కూడా 'అసల' నారాయణ వాళ్ళ ఊరు చూడ్డానికి వచ్చినప్పుడు,ఒక కుటుంబం అందరు కలిసి నెల రోజులు నేసిన నాలుగు వేలు విలువగల చీరకు కనీసం వారికి నాలుగు వందలు మాత్రమే రావడాన్ని చూసి "ఆ నాలుగు గొందల కోసం భార్య తల్లి తండ్రి పిల్లలు అందరూ పని చేస్తారు. మరి నాలుగొందలువాళ్ళకు నెలరోజులు తిండికైనా సరిపోతాయా? అందుకే వాళ్లను చూడగానే దుర్భర దారిద్ర్యంలో ఉన్నట్టుగానే చెప్పకనే తెలుస్తున్నది"(112) అని రచయిత చెప్పడంతో వారి పరిస్థితిని అర్థం పడుతుంది.

ప్రపంచీకరణ ప్రభావంతో ప్రపంచమే ఒక కుగ్రామం అయిన వేళ గ్రామంలో ప్లాస్టిక్, స్టీలు,



Scanned with CamScanner

అల్యూమినియం పాత్రలు ప్రవేశించి కుమ్మరి కుండని మాయం చేసే విధానం ఈ నవలలో కనిపిస్తుంది. ఊళ్లో కుమ్మరి పనిచేస్తున్న మల్లయ్య లాంటివాళ్ళు వారి కులవృత్తిని నమ్ముకొని అంతకు ముందు ఎప్పుడూ ఆకలితో లేరు.కాని ఎప్పుడైతే గ్లోబల్ మార్కెట్, ఆర్థిక, సరళీకరణ విధానాలు మార్కెట్లోకి ప్రవేశించయో, ఒకవైపు వీటికి గిరాకీ లేక మరోవైపు ఇతర ఏ పని చేయలేక సతమతమవుతున్న జీవితాన్ని ఎంతోమంది వెళ్లదీస్తున్నారు.గ్రామాల్లో ఇలా ఎన్ని విభిన్న కులవృత్తులు ఉన్న, వీటన్నిటి మధ్య ఒక ఆర్థిక కోణమే కాకుండా, మానవీయ దృక్పథం ఎప్పుడూ ఉంటుంది.సమాజంలో ప్రతి మనిషి అవసరం అనివార్యమే అనే సూత్రాన్ని ఇవి తెలియజేస్తాయి. ఊళ్లో వడ్రంగం, కమ్మరి పని చేసేవాళ్ళు రైతులకు వారి వ్యవసాయానికి కావలసిన అన్ని రకాల పనులు చేస్తూ ఉంటారు. గ్రామంలో కంసాలి పనివారు ఊర్లో వారందరి కావాల్సిన బంగారం, వెండి నగలు చేయడం, చాకలి వారు అన్ని మిగతా కులాల వాళ్ళ బట్టలు ఉతకడం చేస్తారు. ఇలా గ్రామంలో ఒకరిమీద మరొకరు ఆధారపడిన సమిష్టి జీవనానికి కారణమైన కులవృత్తులు,ఇప్పుడు నాశనం అవ్వడం వల్ల దెబ్బతిన్న మానవ సంబంధాలు మనకు ఈ నవలలో ప్రతిబింబిస్తాయి.

ముదిగంటి సుజాతారెడ్డి ఈ నవలలో కులవృత్తులు వారి సమస్యలు కాకుండా వీటి వెనక ఉన్న ఇతర కోణాలను కూడా ఆవిష్కరించారు. నవలలో ఒకానొక సందర్భంలో నారాయణ వేదప్రకాష్ మాస్టర్ తో సంభాషిస్తూ"వృత్తి మారిన ఆ మనిషిని ఆ పాత కులం పేరుతో పిలవడం జరుగుతూనే వుందికదా సార్! అందుకనే వృత్తులతో కులాలు పోతాయని అనిపించడంలేదు"(75) అని అడగడంలో, కులం పేరుతో జరుగుతున్న అసమానతలకు పరిష్కారంగా పారిశ్రామీకరణ సాంకేతిక అభివృద్ధి జరగడంతోనే సామాన్య ప్రజలు ఆర్థికంగా నిలబడి వారి జీవన విధానంలో మార్పులు వచ్చి ఈ కుల పట్టింపులు ఉండవు అనే ఒక ఆశావాద దృక్పథాన్ని రచయిత దీనిలోతెలియజేశారు. కాని ఒకప్పటి భూస్వామ్య (Feudalism) పెత్తందారులు నేటి కార్పొరేట్ పెట్టుబడిదారులుగా (Capitalism) మారిన నేటి కాలంలో ఇది ఎంతవరకు సాధ్యమవుతుంది అనేది ఒక నిర్వివాదాంశం.

## ముగింపు

రోజు రోజుకి ఈ ప్రపంచం ఓ పోటీ మార్కెట్లా మారిపోతోంది. ఈ తరుణంలో గ్రామీణ జీవన విధానాన్ని అల్లుకొని ఉన్న జీవన సంస్కృతిని ధ్వంసం చేసే అనేక విధానాలు,వాటి వల్ల కలిగే మార్పులను ముందుగానే పసిగట్టి దానికి తగిన ప్రత్యామ్నాయ రంగాన్ని గురించి ఆలోచించాల్సిన అవసరం ఉంది. దీనిలో భాగంగానే ముదిగంటి సుజాతారెడ్డికులవృత్తి చేసుకోవాల్సిన నారాయణనువిద్యనుఒక మార్గంగా చూపించి ఐఏఎస్ అయ్యేలా చిత్రించి, విద్య అనేది ఒక ప్రత్యామ్నాయ మార్గంగా చూపించారు. కాని అన్ని సందర్భాల్లో ఈ సాధ్యం కాకపోవచ్చు కూడా!మనిషి తాను చేసే వృత్తి లేదా పనివల్ల సంతోషంగా ఉండి దాన్నుండి తమ జీవితానికి కావాల్సిన భద్రతను, విశ్వాసాన్ని పొందగలిగలాగాలి. అప్పుడే అది సమగ్రమైన సమాజ ఉన్నతికితోడ్పడుతుంది. ఈ దిశగా మనమందరం కులవృత్తుల గురించి వాటికి ఉండాల్సిన ప్రత్యామ్నాయ మార్గాల గురించి చర్చించాల్సిన అవసరాన్నిసంకెళ్లు తెగాయి' లాంటి నవల ద్వారా తెలుగుసాహిత్యం ఎప్పటికప్పుడు మనందరికీ తెలియజేస్తూనే ఉంది.

## ఉపయుక్త గ్రంథాలు


1. నాగభూషణశర్మ మొదలి. తెలుగు నవలా వికాసం. హైదరాబాద్: నాట్యకళా ప్రెస్ 1967.
2. వెంకటసుబ్బయ్య వల్లంపాటి. నవలా శిల్పం: విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్ హైదరాబాద్ 1989
3. సుజాతారెడ్డి ముదిగంటి. తెలుగు నవలానుశీలనం. హైదరాబాద్: ఎమెస్కో బుక్స్ ప్రై. లి. మే 2017.
4. సుజాతారెడ్డి ముదిగంటి. సంకెళ్లు తెగాయి. హైదరాబాద్: రోహిణం ప్రచురణలు1994.




Scanned with CamScanner

# AS PER THE UNIVERSITY POLICY, ANTI-PLAGIARISM SCREENING IS NOT REQUIRED FOR THE REGIONAL LANGUAGES

Librarian
Indira Gandhi Memorial Library
UNIVERSITY OF HYDERABAD
Central University P.O.
HYDERABAD-500 046.